మానవ హక్కులు : పి.జి. డిప్లొమా

భారతదేశంలో మానవ హక్కులు: రాజ్యాంగ, న్యాయ వ్యవస్థలు

BRAOU

డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500 033

2004

పాఠ్యనిర్మాతలు

115096
29-4-05

సంపాదకులు

ఆచార్య ఎన్. శేషయ్య

రచయితలు

ఆచార్య ఎన్. శేషయ్య

డా॥ కె. బాలగోపాల్

Dr. B.R.A.O.U. LIBRARY
Acc No. 115096
Date 29.4.2005
Call No

డా॥ చంద్రశేఖరరావు

ఎం. కోదండరామారెడ్డి

జి. కృష్ణారెడ్డి

పి. శ్రీలత

కార్యక్రమ సమన్వయకర్త

ఘంటా చక్రపాణి

అనువాదం

డా॥ గుంటి రవీందర్

డా॥ మాడభూషి శ్రీధర్

ముఖచిత్రం

చంద్ర

డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్, ప్రథమ ముద్రణ, 2001

BRAOU

© 2001, డా॥ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలో ఏ భాగాన్నయినా ఉపయోగించుకోదలచుకుంటే, విశ్వవిద్యాలయము అనుమతి పొందాలి. ఈ పాఠ్యాంశాలు సార్వత్రిక విశ్వవిద్యాలయము పాఠ్య ప్రణాళికలో ఒక భాగం.

ఇతర వివరాలకు :

డైరెక్టర్ (అకాడమిక్)

డా॥ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం

రోడ్ నెం. 46, ప్రొ. జి. రాంరెడ్డి మార్గ్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500 033.

పరిచయం

ఇది మానవ హక్కుల యుగం. ప్రపంచ వ్యాప్తంగా అన్నిదేశాల్లో, అన్ని సమాజాల్లో ఇప్పుడు మానవ హక్కులు ఒక ప్రధానమైన చర్చనీయాంశం. ఒక రకంగా చెప్పాలంటే గడిచిన సహస్రాబ్దిని మనం మానవ హక్కుల సహస్రాబ్దిగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే మానవ హక్కుల భావన వికసించింది, విస్తరించింది. ఈ సహస్రాబ్దిలోనే.

మానవ జాతి హక్కుల భావన తొలిసారిగా మొలకెత్తిన 13వ శతాబ్ది తొలిరోజుల నుంచి ఈనాటి 21వ శతాబ్ది ఆరంభందాకా "మానవ హక్కుల ఉద్యమం" అనేక పరిణామాలకు గురి అయ్యింది. అనేక సిద్ధాంతాలు, అనేక ధోరణులు, దృక్పథాలు చారిత్రక భావనలు మానవ హక్కుల భావనకు మరింత పదును పెట్టాయి. పరిపుష్టం చేశాయి. ఇప్పుడు మన దేశంలాంటి అనేక దేశాలు, ఆ దేశాల ప్రజల చేతుల్లో మానవ హక్కుల విద్యా కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఒక డిప్లామాను ప్రవేశపెట్టాలని విశ్వవిద్యాలయం నిర్ణయించింది. మానవ హక్కుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి విశ్వవిద్యాలయాలు ముందుకు రావాలన్న 'జాతీయ మానవ హక్కుల సంఘం (NHRC) పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా విద్యా కార్యక్రమంలో చేర్చడంతో పాటు, దేశంలోనే తొలిసారిగా ఒక పూర్తిస్థాయి డిప్లామాను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగులో మీ కందిస్తోంది.

ఐదు కోర్సులుగా వున్న డిప్లామా కార్యక్రమంలో "భారతదేశంలో మానవ హక్కులు: రాజ్యాంగ న్యాయ వ్యవస్థలు' చేర్చడం జరిగింది. ఈ సంపుటంలో అధ్యయనాంశాలను మొత్తం ఐదు ఖండాలుగా విభజించడం జరిగింది.

అవి : i) చారిత్రక వారసత్వం

ii) రాజ్యాంగ దృష్టి

iii) వేర విచారణ వ్యవస్థ

iv) మానవ హక్కులు : బలహీన వర్గాలు

v) మానవ హక్కుల పరిరక్షణ

ఈ ఐదు ఖండాల్లో మొత్తం 14 అధ్యయన భాగాలున్నాయి. వీటిని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సహకారంతో ఆయా రంగాల మేధావులు, మానవ హక్కుల ఉద్యమాలలో భాగస్వాములైన కార్యకర్తలు, ఇతర వృత్తి నిపుణులు, అధ్యాపకులతో రూపొందించడం జరిగింది. ఈ ప్రయత్నంలో మానవ హక్కులపై తొలిసారి ఒక డిప్లామాను రూపొందించిన సార్వత్రిక విశ్వవిద్యాలయంగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం చరిత్రలో నిలిచిపోనుంది. ఈ పాఠ్యాంశాలు కూడా తెలుగులో మొదటిసారిగా వెలువడుతున్న సమాచారం. ఈ పాఠ్యాంశాల అధ్యయనం ద్వారా మానవ హక్కుల పట్ల అవగాహనతో పాటు విద్యార్థులకు ఒక స్పష్టమైన దృక్పథం ఏర్పడే అవకాశం వుంది. అలాగే మానవ హక్కుల కార్యకర్తలకు, ఆ ఉద్యమంలో మమేకమైన వారికి ఈ కార్యక్రమం మార్గనిర్దేశం చేస్తుంది.

BRAOU

BRAOU

విషయసూచిక

పేజి నెం.

ఖండం – I : చారిత్రక వారసత్వాలు

భాగం :1 స్వాతంత్రోద్యమ పౌరహక్కుల ఉద్యమం

2. హక్కుల రూపకల్పన - రాజ్యాంగ మండలి

ఖండం – II : రాజ్యాంగ దృష్టి

3. ప్రాథమిక హక్కులు – ఆదేశిక సూత్రాలు

4. న్యాయవ్యవస్థ - మానవ హక్కులు

5. ధర్మాసన చైతన్యం – మానవ హక్కులు

ఖండం – III : నేరవిచారణ వ్యవస్థ

6. నేర విచారణ వ్యవస్థ – మానవ హక్కులు

7. నేరం, శిక్ష - మానవ హక్కులు

ఖండం – IV : మానవ హక్కులు - బలహీన వర్గాలు

8. షెడ్యూల్డు, కులాలు, తెగల పరిరక్షణ

9. జాతీయ మహిళా కమిషన్

10. మైనారిటీలు, వెనుకబడిన తరగతుల ప్రత్యేక కమిషన్లు

ఖండం – V : హక్కుల పరిరక్షణ

11. నిత్య జీవితంలో మానవ హక్కులు

12. భారతదేశంలో పౌరహక్కుల ఉద్యమం

13. నూతన సామాజిక ఉద్యమాలు

14. జాతీయ మానవహక్కుల కమీషన్

BRAOU

BRAOU

ఖండం : I

చారిత్రక వారసత్వాలు

హక్కులు, న్యాయ, రాజ్యాంగ వ్యవస్థల మధ్య విడదీయలేని బంధం ఉంది. హక్కులు వాటి పరిరక్షణలో తోడ్పడే వ్యవస్థలను సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే హక్కుల చారిత్రక మూలాలు పరిశీలించ వలసి వుంటుంది. అలాగే హక్కుల పరిరక్షణలో వ్యవస్థలు లేదా సంస్థల కృషిని వాటి వారసత్వాన్నీ అర్థం చేసుకోవలసి వుంటుంది. ఈ ఖండంలో అ ప్రయత్నం చేయడం జరిగింది. ఇందులో రెండు భాగాలున్నాయి. అవి :

- స్వాతంత్రోద్యమ కాలంలో పౌర హక్కుల ఉద్యమం
- హక్కుల రూపకల్పన : రాజ్యాంగ మండలి

BRAOU

BRAOU

1. స్వాతంత్రోద్యమ పౌరహక్కుల ఉద్యమం

విషయక్రమం

1.0 ఉద్దేశం

1.1 పరిచయం

1.2 జాతి సమానతకు ప్రతీకగా పౌరహక్కులు

1.3 భారత జాతీయ కాంగ్రెస్

1.3.1 వ్యవసాయిక సంబంధాలు

1.3.2 పారిశ్రామిక సంబంధాలు

1.3.3 రౌలత్ సత్యాగ్రహం

1.4 గాంధీ - పౌరహక్కులు

1.5 భారతపౌరహక్కుల సంఘం

1.5.1 పుట్టుక

1.5.2 సిద్ధాంతం

1.5.3 సమాచార సమీకరణ

1.6 ముగింపు

1.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

BRAOU

1.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకొంటారు:

- భారత జాతీయోద్యమ కాలంలో పౌర, రాజకీయ హక్కుల ఉద్యమాల వికాసం,
- పౌరహక్కుల పై గాంధీ భావాలు
- సమకాలీన పౌరహక్కుల ఉద్యమ స్థితి గతులు.

1.1 పరిచయం

భారతదేశంలో మానవహక్కుల స్థితిగతులకు సంబంధించి విస్తారమైన చరిత్ర ఉన్నది. మానవ మక్కులు, స్వేచ్ఛ, అనే అంశాల గురించిన మూలాలు, మహత్తర ఘటనలకు సంబంధించి అవగాహనల్లోకి వెళితే ఈ అంశాల గురించి సమగ్రమైన సమాచారాన్ని తెలుసుకోగలుగుతాం. స్వేచ్ఛ, ఆత్మగౌరవం, సమానత్వం నిలుపుకోవాలనే తపనతో భారతీయులు, ముఖ్యంగా అణచివేతకు గురవుతున్న ప్రజలు అనేక ఉద్యమాలు చేపట్టారు. భారతదేశ చరిత్రలో అణచివేతలు, సామ్రాజ్యవాద నేపధ్యంలో పౌరహక్కుల ఆచరణ, ఉల్లంఘన సంబంధిత అంశాల గురించిన అవగాహనను ఇనుమడింప జేసుకోవడానికి చట్టపరమైన, సంస్థాగతమైన లోతుపాతుల్లోకి వెళ్ళాల్సివస్తున్నది.

అందువల్ల స్వాతంత్ర్యోద్యమం గురించి, మానవహక్కుల ఉద్యమ వికాసం - పరిణామక్రమంలో ఆ ఉద్యమం నిర్వహించిన పాత్రలను గురించి చర్చించడం జరిగింది. భారత రాజకీయ వ్యవస్థ, భారతీయ సమాజం అనేక వత్తిడులు, సమస్యలు ఎదుర్కుంటూనే ప్రజాస్వామ్య చట్రాన్ని పరిరక్షించుకుంటున్నాయి. ఈ ప్రజాస్వామిక అనుభవం భారత దేశంలో మానవహక్కుల అవగాహన కలిగిన పౌరులందరితో బాటు అభివృద్ధి చెందుతున్న ప్రపంచ దేశాలందరికీ తెలుసు.

పందొమ్మిదవ శతాబ్ది చివరి దశలో భారతదేశంలో పౌరహక్కుల ఉద్యమ వికాసానికి అనేక అంశాలు ఉపకరించాయి. సాంఘిక సంస్కరణ ఉద్యమాలు, జాతీయతా ఉద్యమం ఇక్కడి పౌరహక్కుల ఉద్యమానికి ఒకింత అవకాశాన్నిచ్చాయి. సామాజిక సంస్కర్తలు, సంఘసేవాసంస్థలు అనంతరకాలంలో రాజకీయ పార్టీలు పౌరహక్కుల నిర్మాణానికి భారతదేశంలో గణనీయంగా సహకరించారు. పశ్చిమ దేశాల ఉదారవాద ధోరణులు, జాతిసమానత, వలసవాద ప్రభుత్వ అణచివేత ధోరణులు ఇక్కడి హక్కుల ఉద్యమ వికాసానికి ఎంతగానో ఉపకరించాయి. దీనికి తోడు సామాజికంగా తమకంటూ ప్రత్యేకతను కల్గివుండాలనే తపనతో ముందుకొస్తున్న మధ్యతరగతి, పాలకవర్గ ధోరణులు పౌరహక్కుల ఉద్భవానికి కారణభూత మయ్యాయి.

ఈతరుణంలోనే సమానత్వం - జాతి సమానత అనే సంకుచిత ధోరణిని సమాజంలో ముందుకొస్తున్న మధ్యతరగతి ధనికవర్గాలు బహిర్గతంచేసాయి. ఇరవయ్యవ శతాబ్ద ఆరంభంలో జాతి సమానత అనే వాదాన్ని కాంగ్రెస్ పార్టీ ఒక 'డిక్లరేషన్ ద్వారా విస్తరించింది, 1918 లో హక్కుల డిక్లరేషన్ పేరిట ముందుకు తీసుకొచ్చిన ఈ వాదాన్ని అనంతరకాలంలో ఎస్. సత్యమూర్తి 1918 లో రూపొందించిన పౌరహక్కులు, 1931,లో కరాచీ డిక్లరేషన్ ఆఫ్ రైట్స్‌లలో పరిధిపరంగా విస్తరించారు.

1919లో గాంధీ ప్రారంభించిన రౌలత్ సత్యాగ్రహం వలసవాద పాలకవర్గం అనుసరిస్తున్న అణచివేతధోరణులను వ్యతిరేకించే దిశగా పౌరులను సమాయత్తపరచడంలో సహకరించింది. రౌలత్ సత్యాగ్రహం చేసిన దిశానిర్దేశనం పౌరహక్కుల ఉద్యమానికి సైద్ధాంతికబలన్ని చేకూర్చింది. తదనంతరం 1836లో పౌరహక్కుల ఉద్యమం ఒక సంఘటిత ఉద్యమంగా రూపుసంతరించుకున్నది. ఈ తరుణంలోనే భారత పౌరహక్కుల సంఘం (ICLU) ను ఏర్పరచారు. భారతజాతీయ కాంగ్రెస్ నాయకునిగా జవహర్‌లాల్ నెహ్రూ పౌరహక్కుల ఉద్యమ పరిధిని మరింత విస్తరించే యత్నం చేస్తూ ప్రభుత్వాన్ని వ్యతిరేకించేందుకు పౌరుల హక్కు ఒక ప్రాధాన్యతగల హక్కుగా పేర్కొన్నారు.

1.2 పౌరహక్కులు - జాతి సమానతకు ప్రతీకగా పౌరహక్కులు

బ్రిటిష్ పరిపాలనలో అనుసరించిన వ్యవసాయ విధానాలు జమీందార్లు, భూస్వాములనే వర్గం రూపొందేందుకు కారణభూతమయ్యాయి. దీంతో గిరిజనులు, చిన్ననైతులు పరిమితమైపోయారు - చిన్ననైతులు, గిరిజనులు స్థానికంగా అణచివేతలను ఎదుర్కొనేందుకు స్థానిక తాబేదారులపైనా బ్రిటిష్ ప్రభుత్వం మీదా తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఈ తిరుగుబాటులో ప్రజల్లో పౌరహక్కుల అవగాహనను కలిగించడంలో కృతకృత్యం కాలేకపోయారు. దీనికి ప్రజానీకంలో తిరుగుబాటులో ప్రజల్లో పౌరహక్కుల అవగాహనను కలిగించడంలో కృతకృత్యం కాలేకపోయారు. దీనికి ప్రజానీకంలో తిరుగుబాటు పట్ల గల ఆకస్మిక శక్తి దాయక ప్రవృత్తి కారణభూతంగా నిలచింది.

పశ్చిమ దేశాల విద్యా విధానం, నూతన ఉపాధికల్పనా ప్రక్రియల ప్రవేశం పట్టణ మధ్యతరగతి వర్గాల ఆవిర్భావానికి కారణమైంది. అప్పటికే వేళ్ళూనుకొని వున్న కులస్వామ్యం, నూతన మధ్యతరగతి వర్గంతో కలిసి పందొమ్మిదవ శతాబ్దం మూడో దశకం చివర్లో రాజకీయవర్గాల రూపకల్పనకు దారులు వేస్తూ బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాటపంథాను ఎంచుకోలేదు. 1837లో ఆవిర్భవించిన జమీందార్ల సంఘటన ఇంగ్లండులో ఆంగ్లేయులు అనుభవిస్తున్న హక్కుల తరహాలోనే భారతదేశంలో పౌరులు అనుభవించాలనే వాదనను వెలుగులోకి తెచ్చింది. ప్రాథమికంగా ఈ సంఘటన కౌలు మినహాయింపు భూవిధానాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించాలనే ధ్యేయాన్ని కలిగివున్నది. 1843లో బెంగాలు బ్రిటిష్ ఇండియా సొసైటీ పేరిట ఆవిర్భవించిన మరో సంఘటన దేశంలో శాంతియుతంగా, రాజ్యాంగ పరిధిలో అన్ని వర్గాల ఉన్నతికి యత్నించాలనే ధ్యేయంతో ముందుకొచ్చింది. ఈ సంఘటన గూడా అనుకూల భూశాసనం రూపొందించాలనే ముఖ్యలక్ష్యాన్ని కలిగివున్నది. 1851లో రూపొందిన బ్రిటిష్, భారతదేశాల సాధారణ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటూ, ఇక్కడి పౌరుల స్థితిగతులను మెరుగుపర్చాలని యత్నించింది. ఈ మూడు సంఘాలు కూడా వర్గాల ప్రయోజనాలపట్ల ఆసక్తి కనబరచలేకపోయాయి.1857 తిరుగబాటును బ్రిటిష్

BRAOU

ఇండియన్ అసోసియేషన్ తీవ్రంగా గర్హించింది. అలాగే బెంగాల్ కౌలుదారీ బిల్లు 1882 ఊతంగా ప్రభుత్వం కౌలుదారీ హక్కులను విస్తరించేందుకు తీసుకున్న చర్యలను వ్యతిరేకించింది. ఈ రకంగా మూడు సంఘటన హక్కులను వివరించిన తీరు, వర్గం, కుల ప్రయోజనాలను దర్పణం పట్టాయి.

పశ్చిమ ఉదారవాద దృక్పథాన్ని పుణికి పుచ్చుకున్న ప్రముఖ సంఘ సంస్కర్త రాజారామ్ మోహన్ రాయ్ బ్రిటిష్ పాలనలో సంస్కరణవాదాన్ని ప్రోత్సహించాలనే వాదనను వెలుగులోకి తెస్తూ ఈ సంస్కరణలు వలసవాద పాలనానుభవిస్తున్న ప్రజలకు సమాన పౌరహక్కులను కల్పించేందుకు ఉపకరించాలని భావించారు. పత్రికాస్వాతంత్ర్యం, న్యాయసభలో విచారణ, హెబియస్ కార్పస్ చట్టం, కార్యనిర్వాహక, న్యాయాధికారాల విభజన తదితర అంశాలనుపై ఆయన ఉద్యమించారు. ఈ అంశాలకు వెనుక, జాతి, సమానత అనే సమస్య చోటు చేసుకుని వున్నది. ఈ సమస్యశ్వేతజాతి వలసవాదపాలకులకు సమానస్థాయిలో వలసపాలనను అనుభవిస్తున్న ప్రజలకు హక్కులను కల్పించాలనే వాదనతో ఉద్భవించింది. హక్కుల అంశంలో రాజారామ్ మోహన్ రాయ్ యత్నం భారతదేశంలో బ్రిటిష్‌పాలనను ప్రశ్నించిన నిర్ణయాత్మక అంశంగా పేర్కొంది.

స్థానిక పత్రికలు, దేశీయ పత్రికలపై సెన్సార్ షిప్ ప్రోత్సహిస్తూ, వెలుగు చూసిన దేశీయ పత్రికల చట్టానికి వ్యతిరేకంగా ఇండియన్ అసోసియేషన్, పూనా సార్వజనిక సభ ఉద్యమించాయి. ఈ సంఘటనలే భారతీయులు ఆయుధాలను కలిగివుండడాన్ని నిషేదిస్తూ తెచ్చిన ఆయుధ చట్టాన్ని వ్యతిరేకించాయి. 1881లో దేశీయ పత్రిక చట్టం దేశవ్యాప్తంగా వస్తున్న వ్యతిరేకత పర్యవసారంగా ఉపసంహరించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలో భారతీయులకు అర్హత వయస్సు పరిమితిని తగ్గించిన నేపధ్యంలో సురేంద్రనాద్ బెనర్జీ ఇండియన్ అసోసియేషన్ పక్షాన విస్తృతంగా పర్యటించి బహిరంగసభలు నిర్వహించి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉపన్యసించారు. 1883లో బెంగాల్ కౌలుదారు చట్టాన్ని సమర్థిస్తూ ఇండియన్ అసోసియేషన్ ఉద్యమించింది. అలాగే రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూ, రైతు ప్రదర్శనలను చేపట్టింది. దక్కన్ ప్రాంతంలో వ్యవసాయిక సమస్యలపై భూమి శిస్తుపై శాశ్వత పరిష్కారాలను కనుగొనేందుకు యత్నిస్తూ తద్వారా బొంబాయి, యూరోపియన్ తరహా ముందు చూపు కలిగిన అభివృద్ధికాముక భూస్వాములను కలిగివుండేందుకు ప్రోద్బావాన్నిచ్చింది. వీళ్లు వృత్తిరంగంనుండి, అగ్రవర్ణాల నుండి ఉద్భవించాలని ఈ ఉబలాటం.

జీవితంలోని అన్ని రంగాల్లో అన్ని జాతులూ సమానత్వాన్ని కలిగివుండేందుకు సామాజిక, రాజకీయ ఉద్యమాలు ప్రయత్నించాయి. 'స్వేచ్ఛ' అనే అంశాన్ని ఈ ఉద్యమం అంతగా పట్టించుకోలేదు. సాధారణ పౌరహక్కులపై ఈ ఉద్యమాలు దృష్టిని కేంద్రీకరించినా భారత దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో అవి భూస్వామ్య వర్గాలు, మధ్యతరగతి మేధావి వర్గాలకు ఉపకారులుగా నిలిచాయి. ఈ సంఘాలు ప్రతికా స్వాతంత్ర్యం తరహా అంశాలను గురించి ప్రత్యేక శ్రద్ధ కనబరిచినా అవి సాధారణ తరగతులకు అంతగా ప్రయోజనకారులుగా వుండలేదు. మరోవైపు ఈ ఉద్యమాలు కొన్ని ప్రత్యేక ప్రయోజనకారిత అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తూ ప్రజల ప్రజాస్వామిక హక్కులను గురించి ప్రయత్నించాయి.

1.3 భారత జాతీయ కాంగ్రెస్

స్వాతంత్రోద్యమ చరిత్రలో భారత జాతీయ కాంగ్రెస్ పౌరహక్కుల దృక్పథంపై విశేష ప్రభావాన్ని చూపింది. నాయకత్వాలు, విధానాలు, ఎత్తుగడలు, వ్యూహాలు, మారిన క్రమంలో ఈ దృక్పథం కొన్ని మార్పులను సంతరించుకున్నది.

పౌరహక్కుల అంశానికి వచ్చినప్పుడు భారత జాతీయ కాంగ్రెస్ అంతకు ముందు రాజకీయ శక్తులు రూపొందించి పాటించిన సాంప్రదాయాలనే పాటిస్తూ పని పరిధిని విస్తరించింది. రాజకీయ సంస్థ, అధికార స్వామ్యం, అర్బన్ మధ్యతరగతి మేధావి వర్గాల నుండి ఎదురవుతున్న సమస్యలను పరిగణనలోని తీసుకుంటూనే పౌర హక్కుల సంబంధిత అంశాలను జాతీయ కాంగ్రెస్ నిస్సందేహంగా మద్దతు ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ హక్కుల అంశంలో ప్రతినిధుల సంస్థల ఏర్పాటు న్యాయ సంస్థలచే విచారణ, కార్య నిర్వాహక, న్యాయ అధికారాల విభజనను వెంటనే

BRAOU

అమలుకు తేవాలని డిమాండ్ చేసింది. దీనికి తోడు క్రిమినల్, న్యాయాధికారాలు జిల్లా మెజిస్ట్రేట్ నుండి విడదీస్తూ క్రిమినల్ ప్రాసీజర్ కోడ్‌ను సవరించాలని జాతీయ కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

జాతీయ సమానత్వం, అణచివేత చట్టాల్లాంటి అంశాలపై జాతీయ కాంగ్రెస్ ప్రత్యేక దృష్టిని సారించింది. 1878 ఆయుధాల చట్టాన్ని జాతీయ కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ చట్టం భారతీయులు ఆయుధాలను కల్గివుండడాన్ని నిషేధించడాన్ని జాతీయ కాంగ్రెస్ దుయ్యబట్టింది. పత్రికలపై సెన్సార్ విధిస్తూ తీసుకువచ్చిన చట్టాన్ని కూడా కాంగ్రెస్ వ్యతిరేకించింది. రష్‌బెహారీ ఘోష్, జి.కె. గోఖలేలు 1870లో రూపొందించిన సమావేశ క్రమబద్ధీకరణ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ చట్టం రాజద్రోహాన్ని ప్రోత్సహించడాన్ని అజ్ఞాత అరాచక వాద సంస్థలను విస్తరించడాన్ని నిరోధిస్తూ రూపొందించారు.

యువతలో పెరుగుతున్న విప్లవ తీవ్రవాద ధోరణులు, బలసవాద రాజ్యం అనుసరిస్తున్న అణచివేత విధానాలు జాతీయ కాంగ్రెస్‌లో మితవాదులు పౌరహక్కులను గురించి ఒక అవగాహనను రూపొందించుకునే అవకాశాన్నిచ్చాయి. జాతీయ కాంగ్రెస్‌లో మితవాదులు పౌరహక్కులు, శాంతి భద్రత సమస్యల గురించి అవగాహనను చేసుకోవడంలో కొట్టుమిట్టాడారు.

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పత్రికలు, కరపత్రాలు, పుస్తకాలలో రాతలను ప్రోత్సహిస్తూ, రాజద్రోహానికి పాల్పడడాన్ని 1908లో ఒక చట్టంద్వారా నిషేదించారు. అలాగే 1910లో ఇండియన్ ప్రెస్ యాక్ట్ రూపంలో ప్రభుత్వ వ్యతిరేక వార్తలను ప్రచురించిన పత్రికలపై చర్య తీసుకునేందుకు అనుమతినిస్తూ ఓ చట్టం వచ్చింది. ఈ సందర్భాల్లో వార్తలలో రాజద్రోహానికి సంబందించిన అంశాలు ప్రచురితమైన పక్షంలో తమ నిరూపణ బాధ్యత నిందితుల భుజస్కందాలపైకి మళ్ళింది. ఈ రెండు సందర్భాల్లోనూ మితవాదులు, ప్రభుత్వం ఈ చట్టాలను శాంతి భద్రతల పరిరక్షణకు అమల్లోకి తెస్తున్నాయనే భావనతోనూ, విప్లవ తీవ్రవాద శక్తుల ఆగడాలను ఎదుర్కొనేందుకు రూపొందించాలనే భావంతోనూ మద్దతు ప్రకటించాయి. ఈ చట్టాలు తాత్కాలికమేనని వారు భావించారు. 1922లో ఈ చట్టాన్ని ఉపసంహరించుకునేలో గానే దేశవ్యాప్తంగా 350 ప్రచురణాలయాలు 300 వార్తాపత్రికలు, అపరాధరుసుం చెల్లించగా, 500 ప్రచురణలు నిషేధానికి గురయ్యాయి.

1.3.1 వ్యవసాయిక సంబంధాలు

భారత జాతీయ కాంగ్రెస్ ప్రజాస్వామిక హక్కుల అవగాహనకు కొన్ని పరిమితులు వున్నాయి. ఇవి సభ్యుల కుల, వర్గ గుర్తింపులకనుగుణంగా నిర్దేశించబడ్డాయి. జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవదశలో, ఆ పార్టీ పేదరికం నిర్మూలన, రైతాంగం ఉద్ధరణ అనే అంశాలపై దృష్టి కేంద్రీకరించింది. దేశీయ జమీందారీ విధానాన్ని ప్రోత్సహిస్తూ వాళ్ళకు అధికారం అప్పగించాలనే బ్రిటిష్ ప్రభుత్వ యత్నాలను కాంగ్రెస్ వ్యతిరేకించింది. నాగ్‌పూర్‌లో 1891లో జరిగిన సమావేశంలో బ్రిటిష్ ప్రభుత్వం అనుసరిస్తున్న భూ రెవెన్యూ విధానం పేదరికానికి ప్రధానకారణంగా జాతీయ కాంగ్రెస్ పేర్కొన్నది. అలాగే వ్యవసాయ రంగం వెనుకబాటుతనానికి, రైతాంగ నిరాశ్రయతకు ఈ విధనాలు కారణమని జాతీయ కాంగ్రెస్ విమర్శించింది.

కాంగ్రెస్ ఆరంభం నుండి భూ రెవెన్యూ విధానానికి శాశ్వత పరిష్కారమే మార్గమని పేర్కొన్నది. తాత్కాలిక పరిష్కారాలు భూరెవెన్యూ సమస్యలకు ఉపకరించవని అది అభిప్రాయపడింది. ప్రాథమికంగా ఇప్పుడున్న రెవెన్యూ విధానం రైతాంగాన్ని దోపిడికి గురిచేస్తూ వచ్చిందని కాంగ్రెస్ విమర్శించింది. అయితే జాతీయ కాంగ్రెస్ భూస్వామ్యవిధానాన్నిగానీ, భూస్వాముల దోపిడీని గానీ ప్రశ్నించలేదు.

కొన్ని సందర్భాల్లో పేదరైతాంగాన్ని ఉద్ధరించేందుకు రూపొదించిన శాసనాలను కాంగ్రెస్ వ్యతిరేకించింది. 1899లో పంజాబ్ భూ బదలాయింపు చట్టం అమల్లోకి వచ్చిన శాసనం వడ్డీ వ్యాపారస్తులు నగర వర్గాలు పేదరైతాంగం నుండి అప్పుల వసూళ్లు కోసం, రియల్ ఎస్టేట్ విస్తరణ నెపంగా భూములను దారాదత్తంచేసుకునే అవకాశాన్నివ్వడాన్ని నిరోధించింది. వాస్తవానికి గ్రామీణ ఆస్తుల విక్రయం, కొనుగోలు రంగాల్లో స్వేచ్ఛ కొలుదారులను విపరీతంగా

BRAOU

నష్టపరిచింది. 1899లో లక్నో కాంగ్రెస్‌లో ఈ అంశాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ కాంగ్రెస్ తీర్మాణం చేసింది.అమ్మకాలు నిరోధిస్తూ తీసుకున్న నిర్ణయం, ప్రతిక్రియావాదమని కాంగ్రెస్ అభిప్రాయపడింది. అలాగే 1906లో లాలా లజపత్ రాయ్ ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఒక నోరెవెన్యూ ఉద్యమాన్ని ఆరంభించాడు. ఈ బిల్లు కారణంగా నీటి వినియోగంలో కొన్ని పరిమితులను విధించడాన్ని అయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లు ధనిక రైతుల ప్రయోజనాలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఈ విధంగా కాంగ్రెస్ రైతాంగం స్థితిగతుల మెరుగుదలకు చాలా తక్కువ కృషిచేసింది. అయితే, ఈ పార్టీ వడ్డీ వ్యాపారులు ధనిక రైతుల ప్రయోజనాలను అత్యధిక సంఖ్యాక ప్రజానీకం హక్కులుగా చెప్పగలిగింది.

1.3.2 పారిశ్రామిక సంబంధాలు

కాంగ్రెస్ ప్రారంభదశలో ప్రజల ప్రజాస్వామిక హక్కుల అంశంలో ద్వంద్వ ప్రమాణాలను అనుసరించింది. 'ధనం, విధ్వల' ప్రయోజనాలు కాంగ్రెస్ అభిప్రాయాలను ప్రభావితం చేసాయి. కార్మిక వర్గ అనుకూల తీర్మాణాలను ప్రథమంగా ఈ పార్టీ అస్సాం టీ ప్లాంటేషన్‌లో కార్మికుల వేతనాలు, పని పరిస్థితుల పట్ల ఆందోళనను వ్యక్తం చేసిన సందర్భంలో ఆమోదించింది. అయితే గనులు, ఫ్యాక్టరీల్లో కార్మికుల స్థితిగతును గురించి కాంగ్రెస్ తద్విరుద్ధ భావాన్ని కలిగి వున్నది.

19వ శతాబ్ద చివరి దశాబ్దంలో పరిశ్రమల్లో కార్మికుల పని పరిస్థితుల భయానకంగా వుండి, కార్మికులు, రోజుకు 13నుండి 15 గంటల వరకు పని చేయాల్సిన దుస్థితి వుండేది. దీంతో సహజంగానే 1890 నుండి అన్ని పరిశ్రమల కేంద్రాలు సమ్మెలను చవిచూసాయి. కార్మికుల్లో పెల్లు బికుతున్న అసంతృప్తి, ఆందోళనలు, లోఖాండే లాంటి కార్మిక నాయకుల ప్రయత్నాలు బాల, మహిళా కార్మికుల పనిగంటలను తగ్గింగలిగే 1891 ఫ్యాక్టరీ చట్టం అమలులోకి తెచ్చేందుకు ఉపకరించాయి. ఈ చట్టం ఏడేళ్ల లోపు వయస్సు గలిగిన బాల కార్మికులు శ్రమించడాన్ని నిషేదిస్తూ 7నుండి 12 సంత్సరాల వయస్సు గలిగిన కార్మికుల పనిగంటలను రోజుకు 9 గంటలకు పరిమితం చేసింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఎలాంటి తీర్మాణాలు ఆమోదించనప్పటికీ, ప్రభుత్వం పారిశ్రామిక అంశాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటున్నాయని ఇది ఉత్పత్తి రంగాన్ని ప్రభావితం చేస్తుందని అభిప్రాయపడింది. భారతీయ గనుల బిల్లు పేరిట 1900లో అమల్లోకి వచ్చి బొగ్గు గనుల్లో మహిళలు, పిల్లల ఉపాధిని పరిమితం చేస్తూ తీసుకొచ్చిన ఇండియన్ మైన్స్ బిల్లును కూడా కాంగ్రెస్ వ్యతిరేకించింది. లాహోర్ కాంగ్రెస్ ఈ మేరకు ఒక తీర్మాణాన్ని ఆమోదిస్తూ ఉపాధి పరిమితులను సడలించాలని కోరింది.

ఈ భిన్న దృ క్పథాలు, కాంగ్రెస్‌లో వేళ్ళూనుకుపోయిన వ్యక్తి ప్రయాజనకారి అనుకూల వ్యూహాలను బహిర్గతం చేసాయి. దీనిలో భాగంగా కాంగ్రెస్ అనుసరించిన విధానాలను అవగతం చేసుకున్నపుడు భారత జాతీయ కాంగ్రెస్‌లో భాగస్వాములయిన భారత పారిశ్రామిక వేత్తల కొత్త ఫ్యాక్టరీల చట్టం గనుల బిల్లు పర్యవసానంగా ఎదుర్కోబోయే నష్టాలను పరిగణనలోకి తీసుకొని కాంగ్రెస్ దాన్ని ఖండించినట్లు అర్థమవుతున్నది. అలాగే కులాల పరిస్థితుల పట్ల ఏమాత్రం శ్రద్ధజూపని పార్టీ అస్సాం టీ ప్లాంటేషన్‌లపై యూరోపియన్‌ల ఆధిపత్యమున్నదిని మాత్రమే కూలీలపట్ల ఆందోలన వ్యక్తం చేసిందనే వాదన వున్నది.

1.3.3 రౌలత్ సత్యాగ్రహం

భారత పౌరహక్కుల ఉద్యమ చరిత్రలో 1919లో రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం ఒక మైలురాయిలాంటిది. మార్చి1919లో ఆమోదించిన, రౌలత్ చట్టం యొక్క ప్రధాన లక్ష్యం ' తీవ్రవాద కార్యకలాపాలలో నిందితులైన వ్యక్తులను శీఘ్రంగా శిక్షించే రీతిలో సాధారణ చట్టాన్ని సిద్ధం చేయడం. ఈ చట్టం పరిధిలో స్పెషల్ కోర్టులలో ఇచ్చిన తీర్పులకు అప్పీలు చేసుకునే అవకాశం లేకుండా అసాధారణ సాక్ష్యాలను అవకాశం కల్పిస్తూ ఇన్‌కెమెరా ట్రయల్ అవకాశానిస్తుంది. ప్రొవిన్షియల్ ప్రభుత్వానికి సోదా చేసేందుకు అసాధారణ అధికారాలను ఇస్తూ అరెస్టు చేసేందుకు సెక్యూరిటీని డిమాండ్ చేసే, అధికారాలను కల్పించారు.

BRAOU

1918 జూలైలో రౌలత్ నివేదికను ప్రచురించిన తర్వాత కాంగ్రెస్ తన ఢిల్లీ సమావేశంలోతీవ్ర ఆందోలనను వ్యక్తం చేస్తూ, చట్టం అమలు పర్యవసానంగా వచ్చే వైపరీత్యాలను గురించి చర్చించింది. 'భారత పౌరుల ప్రాధమిక హక్కుల లో జోక్యం చేసుకుంటుందని, ప్రజభిప్రాయసేకరణ ఆరోగ్యకర లక్షణానికి ఆటంకం కల్గిస్తుందని సమావేశం అభిప్రాయపడింది.

హోమ్ రూల్ లీగ్‌లోనాయకులతో చర్చలు జరిగిన మీదట, గాంధీ ఈ చట్టాన్ని ఉపసహరించే వరకూ సత్యాగ్రహ ఉద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. పౌరహక్కుల పరిరక్షణ కోసం రైలత్ సత్యాగ్రహం మొదటి ప్రభావకారి ఉద్యమంగా పేర్కొనవచ్చు. ఈ ఉద్యమ సందర్భములోనే నిరనన ప్రత్యక్ష రూపం దాల్చింది. ఈ ప్రచార కార్యక్రమంలో సమావేశాలు, ప్రదర్శనలు, సమ్మెలు దేశ వ్యాప్తంగా జరిగాయి. బ్రిటిష్ చిహ్నాలుగా పరిగణనలో వున్న న్యాయస్థానాల్లో, రైల్వే స్టేషన్లు, ప్రజల ఆగ్రహాన్ని చవి చూసాయి. అహ్మదాబాద్‌లో ఐదు రోజుల పాటు సాగిన ప్రజల తిరుగుబాటులో 28 మంది హతులయ్యారు. 123 మందికి గాయాలయ్యాయి. జలియన్ వాలిబాగ్ ఉదంతంగా పరిగణనలో వున్న అమృత్‌సర్ ఊచకోత వలసవాద అణచివేతకు పరాకాష్టగా నిలచింది. ఇందులో 1200 మంది మరణించారు, 3600 మందికి గాయాలయ్యాయి. పంజాబ్‌లోని ఐదు జిల్లాల్లో మార్షల్ లాను విధించారు. అనంతరం దేశ వ్యాప్త హర్తళ్‌ను గాంధీ తాత్కాలికంగా విరమించారు.

పౌరహక్కుల అంశానికొస్తే, సత్యాగ్రహం అణచివేత చట్టాలకు వ్యతిరేకంగా ఉద్భవించిన మొదటి ప్రజా ఉద్యమంగా పేరొందింది. ఇది అనంతరకాల ఉద్యమాలను విపరీతంగా ప్రభావితం చేసింది. ఈ క్రమంలోనే ప్రజానీకంలో పౌరహక్కుల సంబంధిత అవగాహన ఉద్భవించింది. తన అభిప్రాయాలను బలవంతంగా ప్రజానీకంపై రుద్దజూస్తున్న పాలక వర్గాలను వ్యతిరేకిస్తూ పుట్టిన ప్రత్యక్ష చర్యలను ఈ సత్యాగ్రహం ఒక ఊపునిచ్చింది. రౌలత్ బిల్లుల బహిర్గతమైన దశలో వెలుగుచూసిన 1918 బొంబాయి సెషన్‌లో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన డిక్లరేషన్‌లో సాధారణ పౌరహక్కులు వున్నాయి. వాక్స్వాతంత్ర్యం, చట్టం ముందు సమానత్వం, న్యాయ వ్యవస్త ద్వారా విచారణ, జాతి వివక్ష నుండి బయటపడే స్వేచ్ఛ వుండాలని ఈ డిక్లరేషన్ పేర్కొన్నది. డిక్లరేషన్ ఆఫ్ రైట్స్‌లో పేర్కొన్న అంశాలు పౌరుల హక్కుల పేరిట ఎన్. సత్యమూర్తి 1919లో రూపొందించిన పత్రంలో సైద్ధాంతీకరించబడ్డాయి. ప్రజా హక్కులపై జరుగుతున్న దాడులు ఆ సందర్భంలోనెలకొన్న పరిస్థితులు, రౌలత్ చట్టం కారణంగా నెలకొన్నస్థితి పౌర హక్కుల చైతన్యానికి కారణభూతమైంది.

1.4 గాంధీ - పౌరహక్కులు

పౌరహక్కుల విషయమై గాంధీ భావన 'విధి' అంశంలో గాంధీ భావంతో సంబంధాన్ని కల్గియున్నది. వాస్తవానికి గాంధీ హక్కులకన్నా విధుల విషయమై ఎక్కువగా దృష్టికేంద్రీకరించారు. మొదటగా నిర్వర్తించిన విధుల నుండి హక్కులు పుట్టుకొస్తాయని ఆయన వాదిస్తారు. గాంధీ భావనలో హక్కుల ప్రణాళిక కన్నా విధుల ప్రణాళికకు ప్రత్యేక స్థానం వుంటుంది. నిర్వర్తించిన విధికి ఫీటుగా హక్కువస్తుందని అతని భావన. పౌరహక్కులు, విధుల అంశంలో గాంధీ అవగాహన మతగ్రంథమైన భగవద్గీత ఆధారంగా రూపొందించినట్టనిపిస్తున్నది.

గాంధీ వివిధ సందర్భాల్లో పౌర హక్కుల దృక్పథాలను కలిగియున్నట్లు మనకు అవగతమవుతుంది. రౌలత్ బిల్లును తీవ్రంగా నిరసించిన ఆయన, అణచివేత ప్రోత్సహిస్తున్న పాలక వర్గాల సంగమం దేశానికి ప్రమాద కారిగా నిలుస్తుందని భావించారు. గాంధీ ప్రతి అంశాన్ని నైతికత కోణాలలో పరిశీలిస్తూ కొన్ని సందర్భాల్లో పౌరహక్కుల వ్యతిరేక దృక్పథాలను కూడ అనుసరించేవాడు. అహింసకు దూరంగా వుంటూ హింసను ప్రోత్సహించే అనైతిక అంశాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారు. ఉదాహరణకు రౌలత్ సత్యాగ్రహ సందర్భములో గుజరాత్‌లో సైన్యం దురాగతాలపై ఆయన నిశ్శబ్దంగా వున్నారు. ఈ అంశానికి కారణమైన ప్రజలను ఆయన నిందించేవారు.

గాంధీ అస్పృశ్యత సమస్యను నైతిక దృక్పథంతో పరిశీలించేవారు. అస్పృశ్యతను ఆయన ఒక దోషంగా, ఘోరమైన నేరంగా పరిగణించేవారు. ఆయన అస్పృశ్యతను సేవాతత్పరతతో కూడిన సమస్యగా భావిస్తూ పౌరహక్కుల సమస్యగా పరిగణించేవాడు కాదు.

BRAOU

1.5 భారత పౌరహక్కుల సంఘం

భారత జాతీయ కాంగ్రెస్‌పై ప్రయోగించిన తీవ్ర అణచివేత పర్యవసానంగా భారత పౌరహక్కుల సంఘం ఆవిర్భవించింది. మార్చి 1930లో కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించడంలో భాగంగా సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించింది. ఇది తీవ్రతరమై దేశంలో వివిధ ప్రాంతాలకు విస్తరించింది. ఈ ఉద్యమం జాతీయోద్యమం పై అణచివేత ప్రయోగానికి కారణభూతమైంది. వలసవాద పాలక వర్గం తీవ్రవాద, ఉగ్రవాద ఉద్యమాలను అరికట్టేందుకు రూపొందించిన అణచివేత చట్టాలను కాంగ్రెస్, ఇతర పార్టీలపై ప్రయోగించి సహాయనిరాకరణ ఉద్యమాన్ని అణచివేయ యత్నించింది. గాంధీతో సహా కాంగ్రెస్ నాయకులంతా అరెస్టయ్యారు. కాంగ్రెస్ పార్టీని నిషేధించారు. పత్రికలపై సెన్సార్‌షిప్ విధించారు. ఒక సాధారణ అధికారి అంచనా ప్రకారం 50వేల మంది సత్యాగ్రహాన్ని చేస్తున్న కార్యకర్తలు, అరెస్టవగా, 110 మంది పోలీసు కాల్పుల్లో మరిణించారు. మరికొందరు గాయపడ్డారు.

జాతీయోద్యమ చరిత్రలో అణచివేత తీవ్రతకు కాంగ్రెస్ ఎదుర్కొన్న అణచివేతను ఈ పరిస్థితులు అద్దం పడుతున్నాయి. పాలక వర్గ అణచివేత పరాకాష్టకు చేరుకున్న నేపథ్యంలో భారత పౌరహక్కుల సంఘం ఆవిర్భావం జరిగింది.

1.5.1 పుట్టుక

భారతదేశంలో వ్యవస్థీకృత పౌరహక్కుల ఉద్యమాలు ఉండాలనే భావనను జవహర్ లాల్ నెహ్రూ అమెరికా పౌరహక్కుల సంఘం (ACLU, USA) బ్రిటన్‌లోని జాతీయ పౌరహక్కుల కౌన్సిల్ కార్యకలాపాలను గురించి పరిశీలించిన తర్వాత ముందుకుతీసుకొచ్చారు. ఈ ఉద్యమం అన్నిరకాల అణచివేత ప్రక్రియల్లో, చట్టవ్యతిరేక కక్షసాధింపుధోరనులను బయటకు తీసురావలనే ఆలోచనను లక్ష్యంగా కలిగివుంది. దీనికి న్యాయస్థానాలు, శాసనసభలు, పత్రికలు, ఇతర వేదికలను ఉపయోగించుకొవాలనే ఆలోచనను లక్ష్యంగా కలిగివుంది. దీనికి న్యాయస్థానాలు, శాసనసభలు, పత్రికలు, ఇతర వేదికలను ఉపయోగించుకోవాలనే ఆలోచనను కలిగిన - కాంగ్రెస్‌లో అధిక సంఖ్యాకులు ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించగా ఉదారవాదులు మాత్రం దీన్ని వ్యతిరేకించారు. పశ్చిమ దేశాల్లో ఉదారవాదులతో పోలిస్తే భారతదేశంలోని ఉదారవాదులు పౌరహక్కుల అంశంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఎన్నడూ ఖండించలేదు. అదే సందర్భంలో వారు ప్రజల పౌరహక్కుల సంబంధిత అంశాలను బహిర్గతం చేసినపుడు మద్ధతు కూడా ప్రకటించలేదు. దీనికి కారణం బ్రిటీష్ పాలనలో స్వయంపాలన అనేవి వారి అంతిమలక్ష్యం.

అయినప్పటికీ 24 ఆగస్ట్ 1936న బొంబాయిలో భారతపౌరహక్కుల సంఘం లాంఛనంగా ప్రారంభమయింది. నెహ్రూ కోరిక మేరకు రవీంద్రనాథ్ ఠాగూర్ గౌరవ అధ్యక్షులు, సరోజిని నాయుడు అధ్యక్షులుగా ఈ సంస్థ ఆవిర్భవించింది. అనంతరం, మద్రాస్ ప్రెసిడెన్సీకి చెందిన కాంగ్రెస్ సోషలిస్టు సెమినార్ ఈ సంస్థలో ప్రధానకార్యదర్శి అయ్యర్‌ను తదనంతరకాలంలో బొంబాయిలో (CBCLU), మద్రాస్‌లో (MCLU), కలకత్తాలో (CCLU), పశ్చిమ పంజాబ్‌లో, పౌరహక్కుల సంఘం శాఖలు వెలిసాయి.

ముందే పేర్కొన్నట్లు రవీంద్రనాథ్ ఠాగూర్, సరోజనీ నాయుడు, బి.కె. మీనన్ CCLU కు నాయకత్వం వహించారు. కార్యనిర్వాహక మండలిలో మౌలానా అజాద్, సర్దార్ పటేల్, జయప్రకాశ్ నారాయన్, నారాయణ్, రాజేంద్ర ప్రసాద్ లాంటి ప్రముఖులువున్నారు. ప్రధాన కార్యదర్శిగా బి.కె. మీనన్, పౌరహక్కుల ఉల్లంఘనను ప్రశ్నించే దిశగా ఉద్యమాలను నిర్మించడంలోనూ ప్రముఖ స్థానంలో నిలిచాడు. వృద్ధుడిగా ఉన్నప్పుడే ఠాగూర్ బెంగాల్‌లో ఖైదీల ఆత్మహత్యల అంశంలో నిరసన ధ్వనిని వినిపించడంలో ముందుండేవాడు. సమావేశంలో ప్రముఖంగా ఈ అంశాలను ప్రస్తావిస్తూ ఆయన ప్రజా విచారణ జరపాలని డిమాండ్ చేసేవాడు. జూట్ కార్మికుల వేతనాలను పెంచాలని కోరుతూ ఉద్యమిచందాన్ని ఆయన సమర్థించారు.

1.5.2 సిద్ధాంతం

భారత పౌరహక్కుల సంఘం, సంబంధించిన లక్ష్య ప్రకటన లేదా మని ఫెస్టో లేదా డిక్లరేషన్ గాని ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవు. అందువల్ల మనం, నెహ్రూ రచనలపై ఆధారపడీ పౌరహక్కుల ఉద్యమ లక్ష్యాలను

BRAOU

తెలుసుకోవచ్చును. అతడి అభిప్రాయంలో, "పౌరహక్కుల సంబంధిత అంశాలు ప్రజానీకానికి గానీ, ప్రజానీకంలో ఒక వర్గానికి గానీ కార్య నిర్వహక పాకలకమండలితో విభేదాలు పొడసూపినప్పుడు ఉద్భవిస్తాయి. పౌరహక్కుల అణచివేత అన్నది కేవలం సమస్యలు ఉద్భవించి వీటి గురించి ప్రభుత్వం పై ప్రజలు తిరుగుబాటు చేసిన సందర్భాల్లో జరుగుతున్నది. అణచివేత కేవలం ప్రభుత్వ వ్యతిరేక ధోరణులు రూపు దిద్దుకున్నప్పుడే బహిర్గతమవుతున్నది. ప్రతీ ప్రభుత్వం విమర్శలను, వ్యతిరేకతలను ఎదుర్కొంటున్నది. ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయం ప్రభుత్వాన్ని ప్రశ్నించే రీతిలో ఉన్నపుడు మనగలుగుతుంది. ఈరకంగా ప్రజాస్వామ్యానికి సార్థకత ఉంటుంది. భారతదేశంలో ప్రజాస్వామ్య లేని తరుణంలో, ప్రభుత్వం నిరంకుశంగా మారింది. ఈ నేపథ్యంలో ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్న అణచివేత ధోరణులను ఎదుర్కొవాల్సిన అవసరముంది.

నెహ్రూ మాటల్లోనే పౌరహక్కుల సంఘం పరిధి స్పష్టమయింది. నెహ్రూ వాదంలో పౌరహక్కుల ఉద్యమం ప్రభుత్వ పనితీరు అణచివేత ధోరణులు, నిరంకుశ చర్యలను కేంద్రీకరిస్తుంది. ఈ ఉద్యమం ప్రభుత్వం ప్రజాస్వామికంగా ఏలా రూపు దిద్దుకోవాలో సూచిస్తుంది.

భారత పౌరహక్కుల సంఘం సైద్ధాంతిక వికాసాన్ని నిర్దేశించడంలో నెహ్రూ చరిస్మా, అతని నిబద్ధత కీలక పాత్రను పోషించాయి. అతడు పౌరహక్కుల ఉద్యమాన్ని ఒక స్పష్టమైన అవగాహనలో నిర్వచించారు. అతని మాటల్లో దేశ రాజకీయ, సాంప్రతిక, సామాజిక ఆర్థిక రంగాలలో వృద్ధికోసం పౌరహక్కుల ఆవశ్యకత ఎంతైనా వున్నది. ఆ పౌరహక్కులు అణచి వేతకు గురైతే ఈ కార్యకలాపలకు విఘాతం కలుగుతుంది. ప్రజాస్వామిక దేశాల్లో పౌరహక్కులకు విశేష ప్రాధాన్యత ఉన్నది. భిన్న దృక్కోణాలలో, పనిచేస్తున్న వర్గాలు పౌరహక్కులనే పునాదులను పరిరక్షించుకునేందుకు సమిష్టి యత్నాలు చేస్తుంటారు. స్వేచ్ఛకు ప్రతీకగా నిలచే హక్కుల కోసం ఉద్యమిస్తారు.

అయినప్పటికీ, కాంగ్రెస్‌కు పౌరహక్కుల సంఘానికి మధ్య విభేదాలు పొడసూపిన సందర్భాల్లో నెహ్రూ కాంగ్రెస్ అవసరాల దృష్ట్యా అటే మొగ్గుచూపేవాడు. ఉదాహరణకు ప్రావిన్షియల్ అటానమీ సందర్భంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న బొంబాయి ప్రభుత్వంపై పౌరహక్కుల సంఘం అనుసరించిన వైఖరి పట్ల నెహ్రూ అసంతృప్తి వ్యక్త పరిచారు. కొంతమంది కార్మిక నాయకులను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ (ICLU) తీర్మాణం చేయడాన్ని ఖండిస్తూ సరోజనీనాయుడు (ICLU) అధ్యక్ష పదవికి రాజినామా చేసారు. బికేమీనన్ రాసిన ఒక ప్రైవేట్ ఉత్తరంలో నెహ్రూ అతని కార్యకలాపాల్లో కాంగ్రెస్ వ్యతిరేకత కల్గివుండరాదని సూచించారు.

అలాగే స్వాతాంత్ర్యనంతరం, పౌరహక్కుల ఉద్యమం పట్ల తనకున్న వైఖరిని నెహ్రూ మార్చుకున్నారు. అతడు పౌరహక్కుల ఉల్లంఘన సంబంధిత అంశాలను సమకూర్చునేందుకు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాలను కలిగిన భారతదేశానికి, ఒక స్వతంత్ర సంస్థ అనవసరమని అభిప్రాయపడ్డాడు. అతడు (ICLU)లో తన పాత స్నేహితులతో సంఘాన్ని రద్దుచేయమని సూచించాడు.

1.5.3 సమాచార సమీకరణ

భారత పౌరహక్కుల సంఘం కర్తవ్యాలలో పౌరహక్కుల ఉల్లంఘన సంబంధిత సమాచార సేకరణ ప్రధానమైంది. ఇందులో జైళ్ళలో ఖైదీల స్థితి, నిషేధించబడిన సాహిత్యం, పోలీసు అరాచకత్వాలు, వివిధ ప్రాంతాల్లో భాషా పత్రికల్లో వచ్చిన వార్తల ద్వారా పత్రికలపై విధిస్తున్న పరిమితులు మొదలగు అంశాలు వున్నాయి. వీటికి తోడు స్థానిక పార్టీ పని ప్రక్రియను గురించి కూడా సంఘం పనిచేస్తుంది. ఈ అంశాలను ఆధారం చేసుకొని (ICLU) తయారు చేసి జాతీయ అంతర్జాతీయ పత్రికలకు, ప్రముఖులైన వ్యక్తులకు అభిప్రాయాలను సేకరించేందుకు అప్పీల్ పంపింది. (ICLU) తర్వాతి కాలంలో బహిరంగ సభలను ర్యాలీలను నిర్వహించనప్పటికీ అవి నామమాత్రంగానే పేర్కొనవచ్చు. కార్యక్రమాలను ప్రజీనీకాన్ని సమీకరించడంలో (ICLU) అంతగా సఫలీకృతం కాకపోయినప్పటికీ, దాని కార్యక్రమాల ప్రభావం విస్తారంగా వుంది. ఈ సంఘం అవిర్భావం మేధావులనేకులను హక్కుల సంబంధిత సమస్యల పట్ల చైతన్య వంతం చేసింది ICLU. స్మార్తితో రామ్ మనోహర్‌లోహియా ముప్పయ్ చివర్లో "పౌరహక్కుల కోసం పోరాటం" అనే గ్రంథం రాసారు.

BRAOU

ఈ గ్రంథం సార్వజనీనత ఎంతగా పెరిగిందంటే బ్రిటిష్ ప్రభుత్వం దీన్ని నిషేధించింది. సెటల్వాడ్ రాసిన "పౌరహక్కులు యుద్ధం, ముళ్ళపూడి వెంకట రంగయ్య రాసిన 'మానవుని ప్రాథమిక హక్కులు - న్యాయము', సురవరం ప్రతాప్ రెడ్డి రాసిన 'పౌరహక్కులు' (ప్రజాధికారములు) కూడా (ICLU) ప్రభావంతో రాసిన గ్రంథాల్లో కొన్ని - అయితే పౌరహక్కుల అంశం విద్యావంతులైన మధ్య తరగతికి మాత్రమే పరిమితమై వుండేదని ఇక్కడ గ్రహించాలి.

Government of India Act, 1935ను ప్రవేశపెట్టి తర్వాత కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొని, ఎనిమిది Province లలో ప్రభుత్వం స్థాపించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ మానిఫెస్టోలో పౌరహక్కుల పరిరక్షణ ప్రధాన హామీగా నిలిచింది. మొదట్లో ఈ హామీలు ఆచరణ రూపం దాల్చవచ్చనే భావన వున్నా. కొత్త ప్రభుత్వాల పాలన ఆరంభదశలో హక్కుల స్థితి ఎప్పటిలాగే వుండింది. దీనితో కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ ఎన్నికల ప్రణాళికలను అమలు పర్చాలని కోరుతూ హైకమాండ్ 1937లో తీర్మాణాలకు ఆమోదించింది.

ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజకీయ ఖైదీలను విడుదల చేసి, పుస్తకాలపై నిషేధాలు ఎత్తి వేస్తూ, పత్రికా స్వాతంత్ర్యాన్ని పరిరక్షించి, అణచివేత చట్టాలను ఉపసంహరించింది. ఈ ప్రక్రియలు నగర మధ్య తరగతి వర్గాలు, సాధారణ రాజకీయ పార్టీల కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ ప్రజాస్వామిక వాతావరణం నెలకొన్నదనే వాదనను రేకెత్తించినా, కార్మిక వర్గం, సాధారణ ప్రజానీకం హక్కులు ఆశించిన రీతిలో మెరుగుపడలేదు. 1937 చివర్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు కార్మికులు, ట్రేడ్ యూనియన్ ఉద్యమాలపై అనుసరిస్తున్న ధోరణులపై కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తీవ్రంగా స్పందించింది. మద్రాస్ ప్రావిన్స్‌లో సి. రాజగోపాలచారి పాలనలో, కాంగ్రెస్ గతంలో నిరసించిన ICID కార్యకలాపాలు పెచ్చరిల్లి, కార్మికవర్గాలలో సంఘీభావం ప్రకటిస్తున్న విడుదలైన రాజకీయ ఖైదీలపై కొత్త కేసులు నమోదయ్యాయి. ఈ రకంగా మానవ హక్కుల సంస్కృతిని ప్రోత్సహించాలనే ధోరణి మటుమాయమై పోయింది.

కాంగ్రెస్ పాలిత ప్రావిన్స్‌లలో ప్రభుత్వాలు పౌరహక్కుల వ్యతిరేక ధోరణులు అవలంబించాయి. కాంగ్రెస్ చట్ట పరిరక్షణపై, శాంతి, కాపాడడంపై దృష్టి సారించింది. బొంబాయి హోంమంత్రిగా ఉన్న కె.ఎ.కు మున్షీ మాటల్లో నయితే శాంతిని కొల్లగొడుతూ, విధ్వంసాన్ని ప్రేరేపిస్తున్న దశలో పౌరులకు హక్కుల ఉండాల్సిన అవసరం లేదనే వాదన వెలుగు చూసింది. మంత్రివర్గాల నిర్మాణంతో కాంగ్రెస్ వాదన పూర్తిగా మారిపోయింది. పౌరహక్కుల పరిరక్షనకు ఆ ప్రభుత్వాలు కొంత యత్నించినా వాటిని పూర్తి స్థాయిలో అమలు పరచలేదు. ఈ ప్రభుత్వాలు ప్రొవిన్షియల్ ప్రాంతాల్లో ICLU నిరసనలను ప్రోత్సహించలేదు. స్వాతంత్ర్యానంతర కాలంలో ఈ పరిస్థితి మరింత బలపడింది.

1.6 ముగింపు

పశ్చిమ దేశాలకు భారతదేశంలో పౌరహక్కుల అవగాహనకు చాలా తేడా వున్నది. పశ్చిమ దేశాల్లో 18వ శతాబ్దంలో రాజకీయ వైరుధ్యాలు ఏకస్వామ్య పాలన, రాచరికం, భూస్వామ్య కుల వర్గాలు, నగర శిష్ట వర్గాల పట్ల ప్రజలను చైతన్యవంతం చేసే దశలో పౌరహక్కుల స్వేచ్ఛా భావనలు వారికి సహకరించాయి. ఈ వైరుధ్యం పశ్చిమ దేశాల్లో పౌర సమాజాల్లో పాలకవర్గ చొరబాటు ధోరణులను నిరసించే దిశగా ఒక సంస్కృతిని ఆవిర్భవించింది. ఈ సంస్కృతి పౌర సమాజం పక్షిక స్వతంత్ర ప్రతిపత్తికి, పరిమిత ప్రభుత్వ నిర్మాణాలకు కారణ భూతమైంది.

అయితే భారతదేశంలో వేళ్ళూనుకున్న కులస్వామ్యం, ఇక్కడున్న మధ్య తరగతి, వివిధ రకాలైన రాయితీల కోసం, రాజకీయ సంస్కరణ నెపంతో వలస వాద ప్రభుత్వం వెంట వున్నాయి. అందువల్ల వాస్తవానికి , పాలక వర్గం అనుసరిస్తున్న అధికారంపై ఎలాంటి పరిమితులుండేవిగావు. ఈ వర్గాలు ఇక్కడ హక్కులను డిమాండ్ చేయడం కన్నా, పాలక వర్గాలతో విలీనమై పోవాలనే ఆకాంక్షతో ఉండేవారు. అందువల్ల పరిమిత ప్రభుత్వమనే ఉదారావాద భావన ఇక్కడ పాలకవర్గ విస్తృతికి కారణ హేతువయింది. తత్ఫలితంగా, స్వతంత్ర్యానంతరం సమాజం ప్రజాస్వమికీకరణ పట్ల ఎక్కువ దృష్టిని కేంద్రీకరించాల్సివచ్చింది. వలసవాద ఆరంభదశలో పౌరహక్కుల దృక్పథం వైకల్య శిశువుగా, వలస వాద ధోరణి సంకేతంగా ఉన్నదే గాని ప్రజా ఉద్యమాల ఫలితంగా ఉద్యమించలేదు. అయితే జాతీయ

BRAOU

ఉద్యమం స్ఫూర్తిగా ఉద్భవించిన, ఈ హక్కుల ఉద్యమం, ప్రజల ఇతర ఉద్యమాల ఊతంగా ముందకొచ్చిందనడంలో సందేహం లేదు.

1.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.

1. పందొమ్మిదవ శతాబ్దంలో భారతదేశంలో పౌరహక్కుల దృక్పథం ఏమిటి?
2. గాంధీకి పూర్వం పౌరహక్కుల ఉద్యమంలో భారత జాతీయ కాంగ్రెస్ పాత్ర ఏమిటి?

II. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి.

1. పౌరహక్కుల అవగాహనను వృద్ధి చేయడంలో సత్యాగ్రహం పాత్ర ఏమిటి?
2. భారత పౌరహక్కుల సంఘం సిద్ధాంత ఆచరణ గురించి వివరించుము.

BRAOU

2. హక్కుల రూపకల్పన – రాజ్యాంగ మండలి

విషయక్రమం

2.0 ఉద్దేశం

2.1 పరిచయం

2.2 హక్కుల స్వభావం – రకాలు

2.3. రాజ్యాంగ మండలి – స్వరూపం

2.3.1 రాజ్యాంగ మండలి నిర్మాణం

2.3.2 మండలి ప్రజాస్వామిక – ప్రాతినిధ్య స్వభావం

2.4 ప్రాథమిక హక్కుల వికాసం

2.4.1 భారత రాజ్యాంగ బిల్లు 1895–1925

2.4.2 అఖిల పక్ష కమిటీ 1928

2.4.3 భారత రౌండ్ టేబుల్ సమావేశం

2.4.4 కరాచీ కాంగ్రెస్ సమావేశం, 1931

2.4.5 సప్రూ నివేదిక, 1945

2.5 ప్రాథమిక హక్కుల పై చర్చలు

2.5.1 సమానత్వపు హక్కు

2.5.2 స్వేచ్ఛ హక్కు

2.5.3 దోపిడీ వ్యతిరేక హక్కు

2.5.4 మత స్వాతంత్ర్య హక్కు

2.5.5 ఆస్తి హక్కు

2.6 రాజ్య విధానంగా నిర్దేశిక సూత్రాలపై చర్చ

2.6.1 ఉమ్మడి పౌర చట్టం ఒక చర్చ

2.6.2 నిషేధంపై చట్టం

2.6.3 కార్య నిర్వాహక మండలి – న్యాయ వ్యవస్థల విభజనపై చర్చ.

2.7 ముగింపు

2.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

BRAOU

2.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు:

- రాజ్యాంగ మండలిలో వివిధ సందర్భాలలో హక్కులపై జరిగిన చర్చలు వాదనలు పర్యవసానంగా ఉద్భవించిన అభిప్రాయాలు,
- భారత రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలకు సంబంధించి సంపూర్ణ అవగాహన,
- భారత స్వాతంత్ర్య నేపథ్యంలో మానవ హక్కుల పరిస్థితులు, వికాసం.

2.1 పరిచయం

స్వతంత్ర పాలనలో మానవ హక్కుల వికాసం, మానవ హక్కుల ఉద్యమం గురించి పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా వున్నది. దీని కోసం రాజ్యాంగ మండలిలో జరిగిన చర్చలు వాదనలను పరిగణలోనికి తీసుకుని పరిశీలించాలి. రాజ్యాంగంలో హక్కుల చేర్పు వాటి రూపకల్పనకు పూర్వం ఆ కోణంలో జరిగిన అభివృద్ధిని గూడా ఇదే సందర్భంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నది. మానవ హక్కులను గురించి రాజ్యాంగ మండలి తన దృక్కోణంలో రూపొందించిన భావనను భారత రాజ్యాంగం హక్కుల రూపంలో చేర్చుకున్నది.

2.2 హక్కుల స్వభావం - రకాలు

ప్రజల ఆశయాలను ప్రతిబింబింపజేసే రీతిలో రూపొందించబడిన భారత రాజ్యాంగంలో వివిధ రాజ్యాంగంలలోని అధికరణల అవగాహనను భారతీయులు అవసరాలకనుగుణంగా రూపకల్పన చేశారు. నాలుగు వందల మిలియన్ల భారతీయుల అవసరాల కనుగుణంగా రాజ్యాంగాన్ని రూపొందించేందుకు ప్రత్యేకించబడిన రాజ్యాంగ మండలి ఆ లక్ష్యాన్ని ఆచరణ సాధ్యం చేయడానికి డిసెంబర్ 9, 1946 నుండి తన దిశలో ఉపక్రమించింది.

ఆరంభం నుండే భవిష్య భారతం సామాజిక ఆర్థిక సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందనే భావన ఉండి, ఈ సమస్యలతో సంబంధం లేకుండా రేపటి భారతానికి అనుగుణమైన రాజ్యాంగాన్ని రూపొందించలేమనే వాదన ఉండేది. అందువల్లనే ప్రజల ఆశయాలకనుగుణంగా ప్రజలనుండి రూపొందిన రాజ్యాంగ మండలి ఆ క్రమంలో సంక్రమించిన అధికారం ఊతంగా ప్రజల అవసరాలకనుగుణంగా ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగాన్ని రూపొందించింది. ఇందులో ఐరిష్ రాజ్యాంగం నుండి స్వీకరించిన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలను చేర్చారు.

రాజ్యాంగంలోని మూడవ భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులను - సమానత్వ హక్కు, స్వేచ్ఛ హక్కు, దోపిడి వ్యతిరేక హక్కు, మత స్వాతంత్ర్య హక్కు, విద్యా సాంస్కృతిక హక్కులు, ఆస్తి హక్కు (ఏడవ దశకంలో చట్టపరమైన హక్కుగా మారింది), రాజ్యాంగ పరిహారాత్మక హక్కుగా పేర్కొనబడ్డాయి.

రాజ్యాంగం నాల్గవ భాగంలో పరిష్కార యోగ్యం కాని హక్కులను చేర్చారు. ఇవి ప్రభుత్వ విధానంలో భాగమైన ఆదేశ సూత్రాలుగా పేర్కొనబడ్డాయి. రాజ్యయంత్రాంగంలో సకారాత్మక, నిరాకరణయుత అనివార్యాంశాలుగా పేర్కొనబడుతున్న హక్కులు సూత్రాలు జాతీయోద్యమ తరుణంలో సాధారణ డిమాండ్లుగా మారాయి. అయితే రాజ్యాంగ మండలి రూపకల్పన అనంతర కాలంలో అవి భిన్నాంశాలుగా మారాయి. ఈ రూపకల్పన నేపథ్యంలో ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు అనేక చర్చలు వాదనలకు కారణ హేతువులయ్యాయి.

రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు, హృదయమూ, సారంగ పేర్కొనబడ్డాయి. వీటని రాజ్యాంగానికి ప్రాణప్రదమైన అంశాలుగా పేర్కొన్నారు. Z.H.Lari పేర్కొన్నట్లు రూపకల్పన దశలో రాజ్యాంగం పేర్కొన్న అంశాలు ఎంత మేరకు మానవ హక్కులను వృద్ధి చేసుకున్నాయో గుర్తించవల్సిన అవసరం ఉన్నదనే అభిప్రాయం ఎంతైనా ఉన్నది. ఈ హక్కుల చేర్పులేనిదే మానవ జీవనం దుర్భరమని ఆయన అభిప్రాయం.

2.3 రాజ్యాంగ మండలి - స్వరూపం

భారతీయుల దీర్ఘకాలిక ఆశయంగా పేర్కొనబడుతూ ప్రజలచే, ప్రజల యొక్క, ప్రజల కొరకు ఆకాంక్షించబడ్డ దేశీయ రాజ్యాంగం రూపకల్పన రాజ్యాంగమండలి ఆవిర్భావంతో కార్యరూపం దాల్చేందుకు మార్గాలు సుగమయ్యాయి. దీనికోసం ఒక ఎన్నికైన మండలి ఏర్పడింది. ఈ మండలి స్వదేశీ రాజ్యాంగ రూపకల్పన ప్రధాన లక్ష్యంగా ముందు కొచ్చింది.

BRAOU

2.3.1 రాజ్యాంగ మండలి నిర్మాణం

అయితే రాజ్యాంగ మండలికి రూపకల్పన చేసిన ఎన్నికల ప్రక్రియను బ్రిటిష్ క్యాబినెట్ ప్రతిబంధక చిహ్నంగా భావించడంతో కాంగ్రెస్ నిర్ణయాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే నూతనంగా ఎన్నికైన ప్రావిన్షియల్ సభ్యుల నుండి మతపరంగా ప్రతినిధులను ఎంపిక చేసి ఒక మిలియన్ జనాభాకు ఒక ప్రతినిధి చొప్పున ఎంపిక చేసుకోవాలనే నిర్ణయం వెలుగు చూసింది. ఫలితంగా శాసన సభలో, ముస్లిం, సిక్కు, సాధారణ (హిందువులు, ఇతరులు) తదితర భిన్నమతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యులు జనాభా ప్రాతిపదికగా తమ సభ్యులను ఎన్నుకున్నాయి. ప్రిన్స్‌లీ రాష్ట్రాల్లో రాజ్యాంగ మండలికి 93 మంది ప్రతినిధులను ఎన్నుకున్నారు. దీంతో 212సాధారణ సీట్లకు గాను కాంగ్రెస్ 203 మంది సభ్యులను ఎంచుకోగలిగింది. అలానే నలుగురు ముస్లింలను, ఒక సిక్కు ప్రతినిధిని గూడా కాంగ్రెస్ ఎన్నుకున్నది. మొత్తం 296 సీట్లకు గాను కాంగ్రెస్ 203 మంది సభ్యులను ఎంచుకోగలిగింది. అలాగే నలుగురు ముస్లింలను, ఒక సిక్కు ప్రతినిధిని కూడా కాంగ్రెస్ ఎన్నుకున్నది. మొత్తం 296 సీట్లకు గాను ప్రాంతీయ సభల్లో 208 మంది ప్రతినిధులను మండలికి కాంగ్రెస్ పంపింది. కాంగ్రెస్ ఇంత పెద్ద సంఖ్యలో మండలికి తన సభ్యులను పంపడం వెనుక ఆ పార్టీ ప్రాంతీయ సభల్లో 1585 సీట్లకు గాను గెల్చుకున్న 925 సీట్లు ఉపకరించాయి.

"భారతీయులు వాళ్ల రాజ్యాంగాన్ని రూపొందించుకునేందుకు అవసరమైన యంత్రాంగాన్ని తయారు చేసుకునే రీతిలో క్యాబినెట్ మిషన్ ఈ యంత్రాంగాన్ని రాయ్‌కి సహాయకారిగా నిలిచే దిశగా రూపొందించాలనే లక్ష్యాన్ని దానిముందుంచింది. ఈలక్ష్యంతో బాటు రాజ్యాంగ రూపకల్పనలో కాంగ్రెస్ ముస్లింలీగ్‌లను ఒక సాధారణ ప్లాట్ ఫాంపైకి తీసుకురావాలని క్యాబినెట్ తన కర్తవ్యంగా భావించింది. అయితే ఈ యత్నం 'జిన్నా' సృష్టించిన ప్రతిబంధకాల పర్యవసానంగా కార్యరూపం దాల్చలేదు. ఈయన కాంగ్రెస్ పేర్కొంటున్న 'ఒకే దేశం - ఒకే రాజ్యాంగం' వాదనను వ్యతిరేకిస్తూ హిందుస్థాన్‌కు, పాకిస్తాన్‌కు వేర్వేరు రాజ్యాంగ మండలిలుండాలని అన్నారు. వీటిని అధికమించే రీతిలో కాంగ్రెస్, ముస్లింలీగ్‌లను సాధారణ ప్లాట్‌ఫాం పైకి తీసుకురావాలని క్యాబినెట్ సంకల్పించింది.

2.3.2. మండలి ప్రజాస్వామిక ప్రాతినిధ్య స్వభావం

రాజ్యాంగ మండలి సమావేశం ఆరంభమయిన తరుణంలో, జిన్నా, సమావేశాలను బహిష్కరించి మండలిలో నాలుగోవంతు ప్రాతినిధ్యాన్ని సమావేశాలకు దూరంగా వుంచారు. (వందమిలియన్ల భారత ముస్లింలు) మండలి సమావేశ బహిష్కరణ, తదనంతర విభజన మండలిని ఏక పార్టీ వ్యవస్థ మార్చివేసింది. కాంగ్రెస్ ప్రతినిధ్యం బహిష్కరణానంతరం 82 శాతంకు పెరిగి, కాంగ్రెస్ వైపుమొత్తం మండలి మళ్లింది. దీంతో మండలి ప్రాతినిధ్య స్వభావంపై ప్రశ్నలు తలెత్తాయి. ఈ ప్రశ్న అనివార్యంగా మండలి దేశం మొత్తానికి సంబంధించిన రాజ్యాంగ రూపకల్పన చేసేందుకు నైతికాధికారాన్ని కల్గివుంటుందా అనే అనుమానాన్ని రేకెత్తిందిది.

మండలి ప్రతినిధుల ఎన్నిక ప్రక్రియ ప్రజాస్వామికంగా, ప్రాతినిధ్యపరంగా మద్దతు తెలుపగలిగే అంశంగా కనిపించలేదు. అయితే ప్రతినిద్యం చివరికి ప్రజాస్వామిక రూపాన్ని సంతరించుకున్నది. కె. సంతానం మాటల్లో చెప్పాలంటే మండలిలో ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించకుండా ఉన్న అంశం లేదు. అలాగే మండలి ప్రాతినిధ్య స్వభావంపై కూడా ఎలాంటి అనుమానాలు లేకుండేందుకు కాంగ్రెస్‌లోని 'బిన్నత్వలోని ఏకత్వం' భావం ఉపకరించిది. 'సిద్ధాంతాలు - దృక్పథాల విషయంలో మండలిలో అత్యధిక ప్రాతినిధ్యాన్ని కలిగిన కాంగ్రెస్ సభ్యుల్లో వున్న వైరుధ్యాలు (నెహూ ఆలోచనలో) మండలి ప్రాతినిధ్య స్వభావాన్ని పటిష్టవంతం చేసాయి. ఈ విధంగా రూపొందిన మండలిలో ఆరుగురు ప్రస్తుత, మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు, పద్నాలుగుమంది ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోని 18 మంది సభ్యుల్లో 14 మంది సభ్యులుగా వున్నారు. వీరిలో నెహ్రూ, పటేల్, ఆజాద్, ప్రసాద్ లాంటి నులుగురు పార్టీ అధ్యక్షులున్నారు. ప్రత్యక్ష ఎన్నికలతో మండలి రూపొందించినప్పటికీ 1935చట్టంలోని ఆరవషెడ్యూలు ప్రకారం పరిమిత ఓటింగ్ అవకావం వుంది. 1946 ఆరంభంలో జరిగిన ప్రావిన్షియల్ అసెంబ్లీ ఎన్నికలతో పయోజన జనాభాలో కేవలం 28.5 శాతం మందికే ఓటు హక్కువుండేది. అందువల్ల మండలికి జరిగిన పరోక్ష ఎన్నికల పూతంగా భిన్నమతాలు, వర్గాల ప్రతినిధులను సమీకరించి ప్రతినిధులను ఎన్నుకొని ప్రాతినిధ్య స్వభావాన్ని విస్తరించుకోగలిగారు.

BRAOU

రాజ్యాంగ మండలిలో వున్న పదిహేను కమిటీలకుగాను ఎనిమిది ప్రధాన కమిటీలు వున్నాయి. ఇందులో నిబంధనల కమిటీ, స్టీరింగ్ కమిటీ, సలహా కమిటీ, రూపకల్పన, కేంద్ర అంశాల కమిటీ, కేంద్ర రాజ్యాంగ కమిటీ, ప్రాంతీయ రాష్ట్ర రాజ్యాంగ కమిటీలు వున్నాయి. సుమారు మూడు డజన్ల సభ్యులుగల ఈ కమిటీలకు నెహ్రూ, పటేల్‌లతో బాటు ఏదో ఒక కమిటీ అధక్షత వహించే ప్రసాద్ సభ్యులుగా వుండేవారు. రాజేంద్రప్రసాద్ ఈ మండలికి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.బి.ఆర్.అంబేద్కర్ రూపకల్పన కమిటీ చైర్మన్‌గా నియమించబడ్డారు.

2.4 ప్రాథమిక హక్కుల వికాసం

ప్రాథమిక హక్కులుండాలనే ఆకాంక్ష కేవలం రాజ్యాంగ మండలి యొక్క ఆశయం కాదు. ఈ ఆకాంక్ష వలసవాద పాలన సందర్భంగా అమల్లోకి వచ్చిన వివిధ కార్యకలాపాలు, బిల్లుల పర్యవసానంగా వృద్ధిచెందింది.

2.4.1 భారత రాజ్యాంగ బిల్లు 1895 - 1925

ప్రాథమిక హక్కుల పట్ల భారతీయుల్లో అవగాహనను ఇనుమడింపజేసిన అంశాల్లో 1895 సంవత్సరంలో వెలుగు చూసిన భారత రాజ్యాంగ బిల్లు, ఒకటి. ఇందులో ఉదహరించిన భావ ప్రకటన స్వేచ్ఛ, అధీకృత అధికారులచే నిర్భంద హక్కు, రాజ్యంచే అంగ్లేయులకు ఉచిత విద్య నిప్పించాలనే హక్కులు భారతీయుల్లో హక్కుల పరిజ్ఞానం వేళ్ళూనుకునేందుకు బీజం వేసాయి. ఈ బిల్లు పర్యవసానంగా అంగ్లేయపౌరులను ధీటుగా చట్టంముందు అందరూ సమానమనే అంశంతోబాటు, పత్రికాస్వేచ్ఛ, భావ ప్రకటనస్వేచ్ఛ స్వదేశీయులకు వుండాలనే అంశం వెలుగు చూసాయి. ఈ అంశాలను నొక్కిచెబుతూ కాంగ్రెస్ 1917లోనూ, 1919లోను తీర్మాణాలు ఆమోదించింది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఈ వాదన మరింత బలోపేతమైంది. ఈ దశలోనే దేశం స్వయంప్రతిపత్తి కోసం వుద్రో విల్సన్ సూత్రీకరించిన సిద్ధాంతం వెలుగు చూడడం, జాతీయ ఉద్యమ చరిత్రలో గాంధీ పాలు పంచుకోవడం సంభవించాయి. 1895 అనంతరం ప్రాథమిక హక్కుల కోసం రూపొందించిన బిల్లుల్లోకి 1925 నాటికి శ్రీమతి బీసెంట్ కామన్‌వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లు ప్రధానమైంది. ఈ బిల్లులోనే ప్రప్రథమంగా భారతీయులకు ప్రాథమిక హక్కులుండాలనే అంశం చోటుచేసుకుంది.

ఈ అధికరణలో ఏడు ప్రాథమిక హక్కులు చోటు చేసుకున్నాయి. అవి వ్యక్తి స్వాతంత్ర్యం, అంతఃకరణ స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ, సమావేశ స్వేచ్ఛ, చట్టం ముందు సమానత్వం ఉచిత ప్రాథమిక విద్య హక్కు, రహదారులు, కోర్టులు, వాణిజ్య ప్రదేశాలు, ప్రజాపయోగ ప్రదేశాలను వాడుకునే హక్కు - అదే విధంగా లింగ వివక్షను అమల్లో పెట్టరాదని ఇందులో పేర్కొనడం ఒక ప్రధానాంశంగా పేర్కొనవచ్చు.

2.4.2 అఖిల పక్ష కమిటీ 1928

బీసెంట్ బిల్లు 1927 లో బ్రిటిష్ అనౌన్స్‌మెంట్‌లో అనుకూల స్పందనను చవిచూసి సైమన్ కమీషన్ రాజ్యాంగ సంస్కరణలకు పూనుకుంటుందనే నిర్ణయం వెలుగు చూసింది. ఈ ప్రకటన పర్యవసానంగా కాంగ్రెస్ ఒక అఖిల పక్ష కమిటి రూపకల్పన చేసింది. దీనికి మోతీలాల్ నెహ్రూ అధ్యక్షుడిగా వున్నారు. ఈ కమిటీ భారత దేశానికి హక్కుల డిక్లరేషన్ పూతంగా స్వదేశీ రాజ్యాంగం రూపొందించాలనే ధ్యేయంతో ముందంజ వేసింది.

నెహ్రూ నివేదికగా అనంతరకాలంలో పేర్కొనబడ్డ ఈ కమిటీ నివేదిక బీసెంట్ బిల్లులోని అన్ని అంశాలను కల్గిండానికి తోడు నిర్భంద శ్రమను స్వీకరిస్తున్న సందర్భాల్లో కాంట్రాక్టులను రద్దు చేసుకోవడాన్ని క్రిమినల్ తప్పిదంగా పరిగణించాలని పేర్కొన్నది. స్వేచ్ఛాభారతం నెహ్రూ నివేదికలోని అనేకాంశాలను రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాల్లో చేర్చుకున్నది. రాజ్యాంగంలో ప్రప్రథమంగా వ్యక్తి హక్కులతోబాటు రాజకీయ ఆర్థిక సామాజిక హక్కులుండాలనేది ప్రధానాంశం. ఈ సందర్భంగా వెలుగు చూసింది. నెహ్రూ నివేదికలో అన్నిటికన్నా ప్రముఖంగా పేర్కొన దగ్గ అంశం మైనారిటీ సంబంధిత క్లాజు. ఈ అధికరణ అనంతర కాలంలో మతపర, సంస్కృతీపర విద్యాహక్కుగా రూపొందింది.

BRAOU

2.4.3 భారత రౌంట్ టేబుల్ సమావేశం

మూడు విడతలు జరిగిన భారత్ రౌండ్ టేబుల్ సమావేశాల్లో ప్రాథమిక హక్కులు ప్రధాన భూమికను పోషించాయి. వాస్తవానికి ఈ మూడు సమావేశాల్లోనూ హక్కులను గురించి, భారత ప్రతిపాదిత రాజ్యాంగంలో వాటి చోటు గురించి విస్తారమైన చర్చ జరిగింది. రాజకీయ హక్కులతో బాటు ఆర్థిక హక్కులు స్వతంత్రంగా వుండాలనే అంశాన్ని భారత్ శ్రామిక సంఘటన మొదటి సమావేశంలో వొక్కిచెప్పింది. శ్రామికులకు హక్కులుండాలనే వాదనను వొక్కిచెప్పిన వాళ్ళు, శ్రామికులకు స్థైర్యాన్ని కల్గించడంలో అవి ఉపయోగకారిగా నిలుస్తాయనుకున్నారు. భారత రాజ్యాంగ సంస్కరణలపై 1931లో జరిగిన సబ్ కమిటీ సమావేశాలు కూడా భారత ప్రతినిధులకు ప్రతిపాదనగా నిలిచిన ఆర్థిక హక్కులను ప్రధాన అంశంగా ఎంచుకోవాలనే అంశానికి సాక్షీభూతంగా నిలిచాయి. ఆర్థిక హక్కులు భారతీయులకు రాజకీయ హక్కుల కన్నా ప్రధానమైన హక్కులుగా ఈ కమిటీ పేర్కొంటూ రాజకీయ హక్కుల విషయమై రాజ్యం పేర్కొన్న అంశాలు అంతూ పొంతూ లేని అంశాలు పేర్కొన్నాయి.

2.4.4. కరాచీ కాంగ్రెస్ సమావేశం, 1931

1931లో కరాచీ కాంగ్రెస్ సమావేశంలో ప్రాథమిక హక్కులు, ఆర్థిక సామాజిక మార్పులకు సంబంధించి చేసిన తీర్మాణాలు అత్యంత ప్రముఖ అంశాలుగా పేర్కొనవచ్చు. ఈ ప్రతిపాదనలు సకారాత్మక అంశాలకు కొత్త పుంతలు వేస్తూ రాజ్యం విధానాల్లో ఆదేశిక సూత్రాలకు దిశానిర్దేశనం చేసాయి. నిజమైన ఆర్థిక స్వాతంత్ర్యంలో రాజకీయ స్వాతంత్ర్యం కలిసివుండాలనే వాస్తవాన్ని గుర్తించి కరాచీ కాంగ్రెస్ మానవీయ సామాజిక కోణాలను స్పృశించింది. ఈ తీర్మాణం అనేక కొత్త హక్కులను ప్రతిబింబించింది. ఇందులో రాజ్యం బిరుదులను ఇవ్వరాదనే అంశం, ఓటింగ్ కోసం సూత్ర నిర్దేశన, ప్రధాన శిక్ష అయిన మరణదండనను తీసివేయడం, పౌరులు దేశంలో ఏ ప్రాంతంలోనయినా స్వేచ్ఛగా తిరుగగలిగే అవకాశాన్ని కల్పించడం అనే హక్కులు మిలితమైనాయి. వీటికితోడు మోతీలాల్ నెహ్రూ నివేదిక పేర్కొన్న అంశాలు కూడా ఇందులో వున్నాయి.

2.4.5 సప్రూ నివేదిక, 1945

ధర్మసాధ్య హక్కులు, పరిష్కారయోగ్యం కాని హక్కుల మధ్యగల భేదం మొట్టమొదటిసారిగా 1945 చివర్లో బహిర్గతం చేసిన సప్రూ నివేదికలో చోటు చేసుకున్నది. స్వాతంత్ర్యం సమీపిస్తున్న క్రమంలో మైనారిటీలను సంతృప్తి పరిచేందుకు వీలుగా మైనారిటీ హక్కులను గురించి వాదాన్ని నెహ్రూ నివేదిక నేపథ్యంలో పొందుపరచారు. ప్రాథమిక హక్కుల నిర్మాణం అత్యావశ్యకమయిన అంశమని ఈ నివేదిక అభిప్రాయపడింది. ఈ హక్కులు, కేవలం పౌరులకు హామీ నిచ్చే అంశాలుగా గాకుండా. లెజిస్లేచర్, ప్రభుత్వం, కోర్టుల ప్రమాణాలను నిర్దేశించేలా వుండాలని అభిప్రాయపడింది. హక్కులను దర్మసాధన హక్కులు, పరిష్కరయోగ్యంకాని హక్కులుగా విభజించడంలో సాధ్యాసాధ్యాలను గురించి తెలిసిన సప్రూ కమిటీ, రాజ్యాంగ నిర్మాణ మండలి, ప్రాథమిక హక్కుల రూప కల్పన, విభజన, ఆచరణాంశాలను చేపట్టాలని' అభిప్రాయపడింది.

2.5 ప్రాథమిక హక్కులపై చర్చలు

ప్రాథమిక హక్కులు, తత్సంబంధిత అంశాలను గురించి చర్చించి ప్రతిపాదనలు చేసేందుకు జనవరి 14, 1947న సర్దార్ పటేల్ అధ్యక్షతన రాజ్యాంగమండలిలో ఒక సలహా మండలి రూపొందింది. ఒక ఉప కమిటీ ప్రాథమిక దశలో పది మంది సభ్యులతో ప్రాథమిక హక్కులను గురించి చర్చలు చేపట్టింది. ఆచార్యకృపలానీ ఉపకమిటీకి చైర్మన్ వుండగా, బి.ఆర్.అంబేద్కర్, కె.టి. మున్షీ, కె.టి.షా, మౌలానా అజాద్ ఇందులో సభ్యులుగా వున్నారు. ఈ కమిటీ ఒక త్రిముఖవ్యూహాన్ని కలిగి ప్రాథమిక హక్కులు నిర్వచనం, ప్రాథమిక హక్కుల జాబితా తయారీ, ధర్మసాధ్య హక్కులు, పరిష్కరయోగ్యంకాని హక్కులుగా హక్కులను విభజించడం, నిర్వచించిన హక్కులను ఆచరణ యోగ్యంచేయడం తదితర కార్యకలాపాలను చేపట్టింది. ఈ కమిటీ కార్యాచరణ వివిధ ప్రతిపాదనలు,

BRAOU

Dr. BRAOU LIBRARY Acc. No. 115096 Class No.

కరపత్రాలు, సూచనలు, సలహామండలి సభ్యులు, అసెంబ్లీ సభ్యులు, వ్యక్తులు ప్రభుత్వ సంస్థల సలహాల ఆధారంగా ముందుకెళ్ళింది. హక్కులు, ఆదేశసూత్రాలను పూర్తిస్థాయిలో అమలులోకి తెచ్చేలోగా అనేక మార్లు విస్తృతమైన చర్చలు జరగాయి.

రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు అంశం న్యాయబద్ధమైన అంశంగా చేర్చుకోవాలనే ప్రతిపాదన ఏకగ్రీవంగా ఆమోదించబడ్డది. అయితే ఈ చేర్పు అంశంపై ఏ హక్కులు న్యాయబద్ధమైన అంశాలుగా స్వీకరించాలి, వీటి పరిమితు లేమిటి అనే అంశాల్లో చర్చ విస్తృతంగా జరిగింది.

2.5.1 సమానత్వపు హక్కు

చట్టం ముందు సమానత్వం అనే అంశం సామాజిక సంస్కరణకు అవరోధంగా నిలవలేని అంశంగా వుంటూ వస్తున్నది. అయ్యర్ ఈ అంశంలో చాలా ఖచ్చితంగా వున్నారు. ఆయన మాటల్లో ఏ ఒక్క వ్యక్తీ చట్టం ముందు అసామానతలు చవిచూడడంగాని, చట్ట పరిరక్షణకు దూరంగా వుండరాదనే డిమాండ్ బహిర్గతమైంది. చట్టం పరిధిలో ఈ అంశం ఫ్యాక్టరీలోని కార్మికులకు ప్రత్యేక రక్షణ చట్టాలను కల్పిస్తూ క్రిమినల్ కేసుల్లో బాలనేరస్తులు, పెద్దలమధ్య విభజన రేఖను నిర్ణయిస్తుంది. ఈ అంశం రాజ్యాంగంలోని 14 అధికరణలో చోటు చేసుకున్నది.

16వ అధికరణంలో వెనుకబడిన తరగతులు, తదితర కుల సంబంధిత ప్రత్యేక రాయితీలు కల్పించినపుడు రాజ్య ప్రతిబంధకంగా నిలువరాదనే అంశం చోటు చేసుకున్నది. ఈ అధికరణలో చర్చలకు తావిచ్చిన రెండు ప్రధానాంశాలు : వెనుకబడిన తరగతులకు కులాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధికల్పిస్తూ రిజర్వేషన్లు ఇవ్వడాన్ని సమర్థిస్తూ, ఈ ప్రత్యేక అవకాశానికి కాలపరిమితి కల్పించడం అవసరమా అనే అంశాన్ని చర్చలోకి తెచ్చింది.

లోకనాథ్ మిశ్రా రిజర్వేషన్ల అంశమై పేర్కొన్న క్లాజును అనవసరాంశంగా భావించారు. రాజ్య ఉపాధి అవకాశాలు ప్రతిభ ఆధారంగానే నిర్ధారించబడాలని పేర్కొంటూ మిశ్రా పౌరులందరు ఉద్యోగహక్కులను, ఆహార, వస్త్ర, గూడు సంబంధిత హక్కులను కల్గి వుండాల్సిందేనని అభిప్రాయపడ్డారు. ఉపాధిసంబంధింత అంశం రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా పరిగణించబడితే అది ఉదారవాదంగా తోచినా ఉదారత్వం ఆ రాయితీ పొందిన పౌరులను ప్రమాణ రీత్యా తగ్గిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కారణంగా వెనుకబాటుతనం, అసమర్థత మరింత పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ వాదననే మద్దతు తెలిపిన దామోదర్ సేత్ ఆరంభంలో ఈ క్లాజ్ న్యాయపరమైనదిగా తోచినా, సూత్రబద్ధంగా ఇది ప్రభుత్వాల అసమర్థతను బహిర్గతం చేస్తుందని వాదించారు. దీనికి తోడు కులతత్వాన్ని, అశ్రితపక్షపాతాన్ని ఇది ప్రోత్సహిస్తుందని, ఇలాంటి సమానత్వం లౌకిక వాద ప్రభుత్వాల్లో అభిలషణీయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిభ, అర్హత ఆధారంగా రాయితీలను ఇచ్చేకన్నా విద్యాస్థాయిని వృద్ధిచేస్తూ వర్గాలను అభివృద్ధిపరచాలనే సాధారణాంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయిన సూచించారు.

రాజ్యాంగమనే బృహత్తర కార్యక్రమాన్ని రూపకల్పన చేస్తున్న సందర్భంలో అణగారిన కులాలకు చెంది సేవలను పొందకుండా వుంటూ వచ్చిన వర్గాలను ఆదుకోవాలని మునిస్వామి పిళ్ళై అభిప్రాయపడ్డారు. కొంతమంది గౌరవసభ్యులు రిజర్వేషన్లు అనవసరమనడాన్ని ఆయన సరియైన ఆలోచనగా పరిగణించలేదు. రాజ్యంలో కుల రక్కసి కొనసాగినంతకాలం రిజర్వేషన్లను అనుభవించేరీతిలో కులాలు పుట్టుకొస్తూనే వుంటాయి. అందువల్ల ఈ రిజర్వేషన్ల ప్రక్రియ వద్దనుకోవడం అభిలషణీయం కాదు అని అయిన అభిప్రాయపడ్డారు. షెడ్యూల్డు కులాలకు రిజర్వేషన్లు అంశంలో ఈ సిద్ధాంతం పనిచేయదు. ఎందుకంటే ఆ కులాలు దీర్ఘకాలంగా అణగారి వున్నాయి. అందువల్ల వాళ్లకు ఎప్పుడైనా న్యాయం జరగాల్సిందే అన్నారు. భారతదేశంలో కులరక్కసి ఎప్పుడూ వుండాలనేది హరిజన నాయకుడి ఉద్దేశ్యం కాదని అయితే సేవారంగంలో వాళ్ళు అణగారినన్నాళ్ళు వాళ్ళకు రక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. రూపకల్పన కమీటీ చైర్మన్‌గా అంబేద్కర్ వుండడాన్ని షెడ్యూల్డు కులాలు కలిగివున్న శక్తిగా ఆయిన అభివర్ణించారు.

BRAOU

కులతత్వాన్ని పకడ్బందీగా ఎదుర్కునేందుకు సేవలరంగంలోరిజర్వేషన్ల అవసరాన్ని మహ్మద్ ఇస్మాయిల్ నొక్కి చెబుతూ ఈ సదుపాయం ప్రజానీకంలో సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందింపజేస్తూ అణగారిన వర్గాలకు దేశపాలానాంగాల్లో అవసరమైన భాగస్వామ్యాన్ని కల్పిస్తుందన్నారు.

అణగారిన వర్గాలు, షెడ్యూల్డు తెగలకు లెజిస్లేచర్లలో రిజర్వేషన్ల అవశ్యకతను నొక్కి చెప్పారు. సేవారంగంలో కన్నా లెజిస్లేచర్లలో రిజర్వేషన్లు అమలుపరిస్తే ఆయా కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధులు సమయానుకూలంగా తమ వర్గాలకు న్యాయాన్ని కోరుతూ అన్యాయానికి గురవుతున్న సందర్భాల్లో ప్రశ్నిస్తారని అభిప్రాయపడ్డారు. సేవలరంగంలో నియామకాలలో అన్యాయాలను సరిదిద్దుకునేందుకు కూడా ఈ ప్రతిపాదన ఉపకరిస్తుందని, అయితే లెజిస్లేచర్లో ప్రాతినిధ్యం కల్పించకుండా వేరే రంగాల్లో రిజర్వేషన్ కల్పించినపుడు ఆశించిన రీతిలో సహకరించక పోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

చంద్రికారావ్ ఈ అంశంలో ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ వెనుకబడిన వర్గాలు, తరగతులకు సేవారంగం లెజిస్లేచర్లలో రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించి 10వ అధికరణలోని సమానావకాశాల ప్రతిపాదనను నిజం చేయాలని అభిప్రాయపడ్డారు.

వెనుకబాటుతనం అనే పదాన్నుపయోగించడాన్ని అంబేద్కర్ సమర్థించారు. ఈ అంశం పై ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ, సమానావకాశాల సూత్రాన్ని, కులాలు వర్గాలను సంతృప్తి కలుగజేసేరీతిలో వాళ్ళకు రాజ్య యంత్రాంగంలో అవకాశం కల్పించడానికి కృషి చేస్తూ ఆ అంశాలను పరిరక్షించాల్సిన బాధ్యత తమపై వుందన్నారుఅప్పుడు, వెనుకబాటుతనం', నిర్వచనం అంశంలో చర్చ ఉండకపోవడమేగాక రిజర్వేషన్లను కల్పించే అంశంలో గూడా పొరపొచ్చాలురావన్నారు.

రిజర్వేషన్లలో కాలపరిమితి అనే అంశాన్ని కుంజ్రు బయట పెట్టాడు. వెనుకబడిన వర్గాలకు కల్పిస్తున్న ప్రత్యేక రాయితీలను నిరవధికంగా కల్పించాలనే అశయం అభిలషనీయమా? అని ఆయన ప్రశ్నించారు. ఈ రాయితీని అమలులో పెట్టిన సందర్భంలో సమయానుకూలంగా దాన్ని సమీక్షించాలనుకోవడం అభిలషణీయమవుతుందని, తద్వారా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి రాజ్యం ఎంత మేర కృషిచేస్తున్నదో బేరీజు చేసేందుకు అవకాశం లభించి సమానత్వం కోసం చేస్తున్న ప్రయత్నాలు బహిర్గతమవుతాయని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలో వెనుకబాటుతనం అనే అంశాన్ని ఎక్కడా నిర్వచించలేదని ఆయన అన్నారు.

మునిస్వామి పిళ్ళై కూడా కాలపరిమితి అంశాన్ని సమర్థించారు. హరిజన నాయకుడి యొక్క ఆశయంలో అణగారిన వర్గాలు అభ్యున్నతి సాధించే వరకే ఈ రక్షణలు రాయితీలను ఆచరణలో పెట్టడమనే అంశం వుందని ఆయన గుర్తుచేసారు. హరిజనులకు రిజర్వేషన్లు కల్పించడం అభిలషణీయాంశంగా పేర్కొన్న ధర్మప్రకాశ్, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కలిగిన భారతదేశంలో అది అవసరం లేదేమో అని అభిప్రాయపడ్డారు. ఈ రాయితీలు అణగారిన వర్గాలు సమాజంలోని ఇతర వర్గాల స్థాయి సంస్కృతిని కలిగేవరకు కొనసాగిస్తూ అనంతరం ఉపసంహరించాలన్నారు. అస్పృశ్యత అనే దుష్ట సంప్రదాయాన్ని రద్దుచేయలని సభ్యులంతా అభిప్రాయపడ్డారు.

శ్రీమతి దాక్షాయని లాయుధన్ ఈ అంశంలో స్పందిస్తూరాజ్యాంగం ఆచరణరూపం దాలుస్తున్న క్రమంలో అందులో పొందుపరిచిన అంశాలకు భిన్నంగా వ్యవహరిస్తున్న వాళ్లను చట్టపరంగా శిక్షించాల్సిందేనని అభిప్రాయ పడ్డారు. అయితే ఇదే సందర్భంలో కేంద్ర, ప్రాంతీయ ప్రభుత్వాలు రాజ్యాంగాంశాలగురించి సరియైన ప్రచారమివ్వాలని అన్నారు. అప్పుడే మనం కోరుకున్న ఆశయం నెరవేరుతుందని అంటూ, దక్షిణఫ్రికాలో సైతం అస్పృశ్యత అంశంలో మనదేశంలో కొనసాగుతున్న దుష్ట సంప్రదాయాన్ని గురించి ఏవగించుకున్నారని అన్నారు. అసెంబ్లీలో ఈ అంశమే అడపాదడపా నిర్ణయాల గైకొంటే ప్రజలను ఆప్రకటనలు ప్రభావితం చేస్తాయని. రాజ్యాంగంలో ఈ అంశాన్ని చేర్చాల్సిన అవసరం అంతగా లేదని ఆమె మాన్ మోహన్ దాస్ అనే మరో సభ్యుడు 24 నవంబర్ 1948 అస్పృశ్యతకు మరవరాని రోజుగా అభివర్ణించారు.భారత జనాభాలో ఆరోవంతు జనాభాకు ప్రతిపాదన అనంతరం నిరాశ నిస్పృహలు అణిచివేతలు నుండి విముక్తి లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఈ రోజు భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడి, అయిదు కోట్ల భారతీయుల్లో నూతనాధ్యాయానికి నాంది పలుకుతుందని ' అయన అన్నారు.

BRAOU

'అస్పృశ్యత, నివారణ అనే అంశాలు రాజ్యాంగంలో చోటు చేసుకోవడం వల్ల అస్పృశ్యతగా ప్రపంచానికి కనిపిస్తూ దుర్భర జీవనాన్ని అనుభవిస్తున్న ప్రజానీకం రాజ్యాంగం ఆచరణరూపం దాలిస్తే న్యాయంపొందగలరన్న భావాన్ని కలుగజేస్తున్నదని మునిస్వామి పిళ్ళై అభిప్రాయ పడ్డారు. అస్పృశ్యత అనే ఆజాధ్యంతో దుర్భర జీవనాన్ని అనుభవిస్తున్న ప్రజానీకంలో మనస్థాపాన్ని నింపింది. ఈ దశలో మతాల నీడన వాళ్ళు రక్షణ తీసుకుంటూ కొత్త నమ్మకాలు ఏర్పరుచుకునేందుకు అవకాశమొచ్చింది. ప్రస్తుత ప్రతిపాదన వాళ్ళకు సమాజంలో ఉచ్ఛస్థితికి తీసుకెళ్తుందనే అంశాలను రేకిత్తించిందని ఆయన అన్నారు.

అంబేద్కర్ ప్రయత్నాన్ని ప్రశంసిస్తూ మాన్ మెహన్ దాస్ అస్పృశ్యత కారణంగా ఓ పాఠశాలనుండి ఓ పాఠశాలకు గెంటివేయబడి, ఓ తరగతి నుండి మరో తరగతికి నెట్టి వేయబడిన వ్యక్తి నేడు స్వేచ్ఛా భారత రాజ్యంగ రూప శిల్పికావడం, ఆ మాహా శిల్పి చేతుల్లోనే అస్పృశ్యత అనే దుష్ట సంప్రదాయాన్ని తిప్పికొట్టే ప్రతిపాదన రావడం. ప్రశంసనీయమైన చర్యగా పేర్కొన్నారు. యువత దశలో అస్పృశ్యతను చవి చూసిన అంబేద్కర్ ఈ సంప్రదాయాన్ని వ్యతిరేకించిన దిశలో తీసుకున్న చర్యను ధైర్యవంతమైన చర్యగా అభివర్ణించారు.

ఈ అంశంపై రాజ్యాంగ మండలి చర్చ ఏకపక్షంగా సాగింది. ఇదే దశలో శంతానుకుమార్ దాస్ వెల్లడించిన అభిప్రాయం ఇంతకాలం ఈ దుష్ట సాంప్రదాయాన్ని వ్యతిరేకిస్తున్న శక్తులు దీర్ఘ చర్చకు తావివ్వడమెందుకని ప్రశ్నలలోని ఈ అంశంలో రాజ్యాంగమండలి రూప శిల్పులుగా ఆచరణ సభ్యులనుండి ఆరంభమయినపుడు ఇతరులను ఈ చట్టం అమలుపరచేలా కృషిచేయవచ్చన్నారు.

2.5.2 స్వేచ్ఛ హక్కు

రాజ్యాంగమండలిలో స్వేచ్ఛా హక్కు (భావ ప్రకటనస్వేచ్ఛ, సమావేశస్వేచ్ఛ, సంఘస్వేచ్ఛ, ఉద్యమస్వేచ్ఛ) పై ఏకగ్రీవ అభిప్రాయం వ్యక్తమయింది. అయితే ఆయా హక్కుల హద్దులు నిర్ణయించే అంశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయ్యర్, మున్షీలు ఈ హక్కులకు ప్రజాహితం, నైతికత పరిమితులను కలిగివుండాలనే క్యాంప్‌కు నాయకత్వం వహించారు.

ఈ అంశంలో అర్హతాంశాలుగా సూచించబడిన విషయాలకై టి. షాలాంటి సభ్యులనుండి తీవ్ర స్థాయిలో విమర్శ వచ్చింది. ఆయన అభిప్రాయంలో ఈ పరిమితులు సకారాత్మక అంశాలుగా నిలువక మరీ సంకుచితం చేస్తున్నాయి. ఒక కుడి చేత్తో ఇస్తున్న హక్కులు నాలుగైదు చేతుల్తో తిరిగి తీసుకుంటున్నట్లున్నది అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అధికరణలు అనభిలషణీయ అంశాలను ప్రస్తుతిస్తున్నది అన్నారు. ఈ అధికరణ రూపకల్పనలో పేర్కొన్న అంశాలకు భిన్నార్థాన్నిచ్చేరీతిలో పరిమితులు వస్తున్నాయని వాస్తవానికి, ఈ స్వేచ్ఛలు అభయాన్నిచ్చేవిగా వున్నాయన్నారు. ఏ రకమైన పరిమితైనా రాజ్యాంగం అభిలషించిన రీతిలో విధంచబడాలని అలాగాకుంటే స్వేచ్ఛ నుండి మనల్ని వంచితుల్ని చేయడమే అవుతుందని ఆయన అన్నారు.

దామోదర్ స్వరూప్ సేథ్ పరిమితుల అంశంపై స్పందిస్తూ, అంబేద్కర్ పౌరహక్కులపై పరిమితులను వివరిస్తూ రాజ్యాంగ రూపకల్పన సమితి పౌరహక్కులను రూపొందించినపుడు సుప్రీంకోర్టు సహకారంతో పోలీసు అధికారులను పరిగనలో తీసుకుని రూపొందించిందని అలా పౌరహక్కులను ప్రత్యక్షంగా రాజ్య పరిమితం చేసిందని అన్నారు. సేథ్ అభిప్రాయంలో మనం రాజ్యాంగ డ్రాఫ్ట్ ద్వారా పొందుతున్న హక్కులకు మరిన్ని పరిమితులను విధించుకుంటూ పోతే ప్రాధమిక హక్కులను అనుభవించడం కష్టసాధ్యమై మనదేశ రాజ్యాంగ నిర్మాణం మనకు ఆశించిన సహకారం అందించక పోవచ్చన్నారు.

13వ అధికరణం గురించి మాట్లాడుతూ పండిట్ ఠాకుర్ దాస్ భార్గవ ఈ అధికరణం యొక్క సారం ఎక్కడుందని ఓసభ్యుడడిగితే ఆసారాన్ని నేను పక్కకు పెడుతూ సముచితమైన దిశలో అర్థంచేయించాలనుకొంటున్నాను. ఈ అధికరణ సముచితమేనా అనే అంశాన్ని పరిగణించినపుడు, అధికరణలోని అంశాలు ప్రజోపయోగ్యమేనానని కోర్టులు చూడాలి. అలాగే లేజిస్లేచర్ విధించిన పరిమితులు సముచితమానని కూడా చూడాలి. అందువల్ల సముచితమైన అనే అంశాన్ని నేను ఉపయోగిస్తున్నాను లేని పక్షంలో 13వ అధికరణం శూన్యమే అన్నారు.

BRAOU

సభ్యులు ఈ స్వేచ్ఛ పౌరులకు మాత్రమే పరిమిత మవ్వాలా ప్రజానీకానికి మొత్తం అమలులో పెట్టాలా అనే అంశమై విస్తృతంగా చర్చించారు. ఆరంభంలో సమావేశ స్వేచ్ఛ, అయుధాలను కల్గివుండే స్వేచ్ఛ, సమాచార నిక్షిప్తస్వేచ్ఛపౌరులకు పరిమితం చేయాలనే వాదన వచ్చినా అనంతరం అన్ని రకాల స్వేచ్ఛలు, జీవించే హక్కు, స్వేచ్ఛ హక్కునుమినాహాయిస్తు పౌరులకు కల్పించాలని వాదన వచ్చింది. జీవించే హక్కు, స్వేచ్ఛహక్కులను ప్రజానీకం మొత్తం అనుభవించాలని వాదించారు. అనంతర సమావేశాల్లో, నలహామండలి సమచార నిక్షిప్త స్వేచ్ఛ, సోదాలు, గాలింపుల పేరిట ఇస్తున్న స్వేచ్ఛలు పోలీసుల కోణంలో ఇచ్చిన స్వేచ్ఛలుగా భావిస్తూ ఆ క్లాజులను తొలగించారు. ఈ అంశంలో భారతదేశ వైసర్గిక స్వరూపాలకనుగుణంగా అయ్యర్ చేసిన వాదన ను పరిగణలోకి తీసుకోకుండా రెండు క్లాజులనూ తొలగించాయి.భారత పరిస్థితుల్లో మారుమూలప్రాంతాలకు రవాణాసౌకర్యాలు అంతంత మాత్రంగా వున్న క్రమంలో వారెంట్లు వెంటనే సమకూరని సమయంలో సోదాలు గాలింపులకు అవకాశం కల్పించాలని ఆయన వాదించారు. పటేల్ ఈ అంశంలో వాదిస్తూ అయ్యర్ ప్రతిపాదన న్యాయవాదులకు ఉపకరించే అంశంగా పేర్కొంటున్నారు. రాజ్యాంగ రూపకల్పన కమిటీ భావ ప్రకటన స్వేచ్ఛ, సమావేశ స్వేచ్ఛ, ఉద్యమ స్వేచ్ఛకు ఇచ్చిన రూపంలో ఈ హక్కులు ప్రజాహితం, నైతికత, ఆరోగ్యం, ప్రజల ఇష్టానికి లోబడి జరగాలని సూచన వచ్చింది. భావ ప్రకటన స్వేచ్ఛ అంశం మరింత వడపోయబడి రాజ్యం యొక్క యంత్రాంగాన్ని ఇబ్బంది పెట్టే భాషను ఉపయోగించరాదని సూచన వచ్చింది.

అత్యవసర పరిస్థితుల్లో ఈ స్వేచ్ఛల ఉపసంహరణాంశం ఓ సరికొత్త వివాదానికి తెరతీసింది. పౌరహక్కుల ఉపసంహరణ మార్షల్ లాకు దారితీస్తుందని, స్వరూప్‌సేథ్ అభిప్రాయపడ్డారు. అమెరికాలో ఈ పరిస్థితిని ఉదహరిస్తూ సేథ్ అక్కడ అత్యయిక స్థితిలో చొరబాటు, తిరుగుబాటు సందర్భాల్లో హెబియస్ కార్పస్ రిట్ ను మాత్రమే ఉపసంహరించనున్నారు.

వాస్తవానికి ప్రాథమిక హక్కులను లెజిస్లేచర్‌కు, కార్యనిర్వాహక వర్గానికి దూరంగా ఉంచాలనే సాధారణ అభిప్రాయం వెలుగుచూసింది. అత్యవసర పరిస్థితుల్లో హక్కుల ఉపసంహరణాంశంపై వచ్చిన విమర్శలనన్నీ పరిగణనలోకి తీసుకుంటునే రాజ్యాంగం ఆస్థితిలో రాష్ట్రపతి రాజ్యాంగ పరిహారత్మక హక్కును గూడా ఉపసంహరించవచ్చనే అవకాశాన్నిచ్చింది. ఇప్పటికే స్వేచ్ఛ హక్కులకు పరిమితులన్నాయనే విమర్శపై అంబేద్కర్ స్పందిస్తూ, ఈ అధికరణ రాజ్యాంగ చర్యలకు అవకాశమిచ్చిందేగాని, హక్కులను ఉపసంహరించలేదన్నారు.

BRAOU

2.5.3 దోపిడీ వ్యతిరేక హక్కు

మానవుల్లో నిర్బంధ శ్రమతో బాటు యాచకత్వం, బానిసల విక్రయాన్ని నిషేధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సభ్యులు ముక్త కంఠంతో సమర్థించారు.

బానిసత్వాన్ని ప్రోత్సాహించడాన్ని నిషేధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రశంసిస్తూ రేణుకారాయ్ ఈ అవకాశాలు ఇప్పుడు కొత్తవి కాకున్నా, అచరణలో లోపాలతో ఇది కొనసాగుతున్నదన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్నంత మాత్రాన ఈ నిషేధం అమల్లోకి రాదని మానవుల్లో ఈ మేరకు మార్పులు సంతరించుకొని, ఈ అధికరణాన్ని నైతికంగా అమల్లోకి తేవాలని ఆమె అభిప్రాయపడ్డారు.

2.5.4. మత స్వాతంత్ర్యం హక్కు

మత స్వాతంత్ర్యం హక్కు చాలా సుదీర్ఘ చరిత్ర కలగి నెహ్రూ నివేదికల కాలం నుండి కొద్ది పాటి విమర్శలతో ముందుకొస్తూనేవున్నది. మెజారిటీ వర్గానికి చెందిన కొంత మంది సభ్యుల నుండి ఎదురయిన విమర్శలు మినహా ఈ హక్కు ప్రతిపాదన ఆమోదించ బడ్డది.

ఈ హక్కు, వ్యక్తిగత సంబంధితాంశంగా పరిగణించబడాలని కె.టి.షా. అభిప్రాయం అయితే లోక్ నాథ్ మిశ్రా ఈ అంశంలో తన స్పందనను వ్యక్తం చేస్తూ రాజ్యాంగ రూపకల్పన లో 13 వ అధికరణం స్వేచ్ఛ సంబంధిత చార్టర్ గా పేరొందితే 19వ అధికరణ హిందూ బానిసత్వానికి ప్రతీకగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ఈ అధికరణం

రాజ్యాంగంలో అనభిలషణీయాంశంగా నల్ల చట్టంగా పేర్కొంటూ మన రాజ్యాన్ని లౌకిక రాజ్యాంగం ఎందుకు చేస్తారని ప్రశ్నించారు లౌకిక రాజ్యమంటే మతం అవసరంలేని అంశంగానూ, లేదా మతావసర రాజ్యంగా పరిగణించాలని అయితే భిన్న మతాల సంగమంగా మారి భారతదేశంలో భారతీయులు దేన్ని అంగీకరించాలో తేల్చుకోవాల్సిన అవసరం వుందన్నారు. మనం మతాన్ని అంగీకరిస్తే, హిందూవాదాన్ని అంగీకరించాలని దీనికి ఇక్కడ వున్న హిందూ జనాభా కారణమని ఆయన అన్నారు. మన రాజ్యానికి మతంతో సంబంధంలేదనుకొన్నప్పుడు అలాగే చెబుతూ మత సంబంధిత అంశాలను హక్కులలో చేర్చరాదని ఆయన కోరారు. ప్రపంచంలోని ఏ రాజ్యాంగంలోనూ మత ప్రచారం ఒక ప్రాథమిక హక్కుగా, ధర్మ సంబంధాంశంగా పరిగణించ బడలేదని ఆయన అభిప్రాయం.

ఈ అంశంలో భిన్నా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా మైనారిటీలకు హక్కులు సంక్రమించాలనే వాదన రాజ్యాంగ మండలిలో వ్యక్తమయింది. మత హక్కులో భాగంగా సాంస్కృతిక, హక్కులు కూడా చోటు చేసుకున్నాయి. హక్కుల ఉపకమీటీ మైనారిటీ వర్గాలకు చెందిన వివిధ నాయకులకు పంపిన ప్రశ్నావళి ఆధారంగా రూపొందించిన అంశాలచే ఈ హక్కులు రూపొందించబడ్డాయి.

2.5.5. ఆస్తి హక్కు

రుణ విధానంతో సంపదహరణం. నిర్బంధనిరోధం, పరహారాత్మక సంబంధిత హక్కులను గురించి రాజ్యాంగ మండలిలో సుమారు మూడేళ్ళ పాటు సుదీర్ఘ చర్చ జరిగింది. ఆస్తి హక్కు సంబంధించి జరిగిన చర్చలు కీలకమలుపుతిరిగాయి. ఫ్రంట్ అభిప్రాయంలో ప్రతినిధులను సంఘటిత అభిప్రాయాధారంగా ఈ హక్కుల నిర్ణయం జరగాలని, న్యాయ్యవ్యవస్థ ఇష్టా యిష్టాలతో ఈ అంశం ముడివడి వుండరాదని ఆయన వాదన నెహ్రూ ఈ క్యాంప్‌కు చెందిన వాడు. అయితే శాసన సంబంధ దురాచారాలను నియంత్రించాలని మున్షీ, అంబేద్కర్ సూచించారు. రాజ్యాంగ సలహాదారుగా బి.ఎన్. రావు రుణ విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తూ నిర్ణయం గైకొనాలని కోరారు. ఈ సంబంధంలో గత యాభై ఏళ్ళుగా వివిధ స్థాయిల్లో పేరుకుపోయిన వ్యాజ్యాలను గుర్తుచేస్తూ అమెరికా సుప్రీంకోర్టులో నలభైశాతం పేచీలు కోనసాగుతున్నాయిని పేర్కొన్నారు. అంతకుముందు ఆస్తి నిర్బంధ నిరోధాన్ని మత విధానం నుండి వేరుచేయాలనే ప్రతిపాదన వచ్చింది. జీవితం, స్వేచ్ఛ అనే అంశాలతో పోలిస్తే ఆస్తిని శాసనం ద్వారా రక్షించవచ్చనే అభిప్రాయం కలిగింది.

ఆస్తి అంశంపై జరిగిన చర్చ ప్రాథమికంగా రుణ విధానం, సంపదహరణ సందర్భాల్లో పరిహారం సాధించుకోవడం పై కేంద్రీకృత మయింది. ఈ అంశంలో ఏ ప్రైవేట్ ఆస్తిని గూడా ప్రజావసరాలకు సేకరించారాదని, ఒకవేళ సేకరించినా న్యాయంగా సేకరించిన ఆస్తులకు పరిహారం, చెల్లించిన సందార్భాల్లోనే వాటిని ఆచరణలో పెట్టాలనే వాదన వుండేది. దీన్ని ఎప్పుడు సమర్థిస్తూవచ్చారు. పరిహారాంశం ఎప్పుడు కోర్టుల్లో వుంటుంది కాబట్టి ఈ అంశం ప్రాకృతికంగానే చర్చలకు తావిస్తూ పరిహారం చర్చగా మారుతున్నది. దీని కోసం సరియైన సముచితమైన, గిట్టుబాటు తదితర అంశాలను పరీక్షించారు. బి.ఎన్.రావు ఈ అంశానికి స్వస్తి వాక్యం పలుకుతూ పరిహారం నామవాచకంగా పేర్కొని ఇంకా శోధన అనవసరమని, దీనికి సముచిత గిట్టుబాటు జోడించరాదన్నారు.

కోర్టులు సంపదహరణ సందర్భాల్లో పరిహారం నిర్ణయించడంలో పాలుపంచుకుంటాయా అనే అంశం కన్నా పరిహార నిర్ణయానికి అనుసరించాల్సిన విధానాలను ఈ సందర్భంగా దీర్ఘంగా చర్చించారు, పరిహారం ఆస్తుల వర్గాలను బట్టి వేరుగా వుండాలో వేర్వేరు అవసరాలకు సేకరించిన ఆస్తులు వేరువేరు ధరలు చేయాలా అనే అంశం కూడా పరిగణనలోకి వచ్చింది.

మాజీ విదేశీ రాచరిక వ్యవస్థలోని సభ్యులు, రాజరికం ఉచితంగా పొందిన భూములను సేకరించిన సందర్భాల్లో సంపద సంక్రమింపజేసుకున్న వారికి పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదనే సాధారణ డిమాండు వచ్చింది. జమీందారీ వ్యవస్థ కూడా సభ్యుల నుండి ఆగ్రహాన్ని చవిచూసింది. సభ్యులు వీరి విషయంలో నామమాత్ర పరిహారం మాత్రమే వాళ్ళ జీవనార్థం చెల్లించాలని ప్రతిపాదించారు. పరిహారం చెల్లించే తీరు విధానాలను శాసన మండలి నిర్ధారించాలని సూచించగా అయ్యర్ ఈ విషయాన్ని ప్రత్యుత్తరమిస్తే ప్రాథమిక హక్కులు కూడా వుండరాదని సూచించారు.

BRAOU

మున్షీ ఈ అంశంలో స్పందిస్తూ కోర్టుల బయట పరిహారం నిర్ణయించాల్సివస్తే ఇది వంద సంవత్సరాల సుదీర్ఘ కాలానికి పొడిగించబడి, శాసన మండలులు పరియైన రీతిలో పరిహారం ఇప్పించడంలో వైఫల్యం చెందవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ అధికరణం నుండి జమిందారులను మాత్రం బయటపడవేయవచ్చని ఆయన అన్నారు.

రెండు ఆస్తి సంబంధిత అంశాల్లో మొదటిదైన, ఆస్తుల సేకరణ, ఆస్తులు కలిగివుండడం, అమ్మడం అనే అంశాలు ను కలిగిన హక్కులను ఆరంభంలోనే సులభంగా ప్రతిపాదించారు. ఇంకో మూడు సంత్సారాల సుదీర్ఘ చర్చ అనంతరం నెహ్రూ, సంత్, మున్షీ, అయ్యర్, అయ్యంగార్‌లె తీసుకొచ్చిన సవరణతో ఆగిపోయింది. ఈ సవరణల పర్యవసానంగా ఆసుతలనుండి ఏ ఎక్కరు వంచితులు కారాదని దీన్ని చట్టం మాత్రం తన పరిధిలో తీసుకోవచ్చని అలాగే ఈ పర్యవసానంగా ఆస్తులనుండి ఏ ఒక్కరు వంచితులు కారాదని దీన్ని చట్టం మాత్రం తన పరిధిలో తీసుకోవచ్చని అలాగే ఈ చట్టం నిర్ధారించిన పరిహారం చెల్లించాల్సివుంటుందని సూచించింది. అదే విధంగా ఆస్తి సేకరణ బిల్లులు రాష్ట్రపతి ఆమోద ముద్ర పొందిన తర్వాతనే చట్ట రూపందలనే వాదన వుండింది. అందువల్ల శాసన మండలి నిర్దేశించిన పరిహారం వివిధ వర్గాల ఆస్తులకు, వివిధవస్తువులకు సేకరణ సందర్భంగా భిన్న రీతుల్లోవున్నా, కోర్టులు వాటిని శుద్ధత ఆధారంగా మార్చడానికి అవకాశం లేదు. పరిహారంలో పరివర్తన లేకున్నా మార్కెట్ కనుగుణంగా పరిహారం లభించకున్నా ఆస్తిహక్కు అనే ప్రాధమిక హక్కును ప్రభావితం చేయనంతవరకు ఎలాంటి అవరోధాలేర్పడవు.

2.6 రాజ్యవిధానంగా నిర్దేశిక సూత్రాలపై చర్చ

నిర్దేశిక సూత్రాలు అనే ప్రభుత్వ విదానం పై వాటి తీరు తెన్నుల అంశంలో సుదీర్ఘ చర్చలు జరిగాయి.

నిర్దేశిక సూత్రాలా? ప్రాధమిక సూత్రాలా?

నిర్దేశిక అనే పదాన్ని ఉపయోగించడం పట్ల ఆరంభంనుండి వివాదం తలెత్తింది. రాజ్యాంగ మండలి సభ్యులు ఈ పదాన్ని ప్రాధమిక సూత్రాలుగా మారుస్తూ, సర్దార్‌పటేల్ సూచించిన ప్రాధమిక సూత్రాలుగా పిలవాలనికోరారు. నజీరుద్దీన్ అహ్మద్, మహబూబ్ అలీ బేగ్ లాంటి సభ్యులు ఈ అధికరణాన్ని పూర్తిగా తొలగించాలని సూచించారు. రాజ్యాంగంలో సదాచార సంపన్న వాదనలకు చోటు వుండరాదని అవి పరిష్కార యోగ్యంకాని అంశాలు కావడం వలన రాజ్యాంగంలో వాటిని ప్రోత్సహించరాదని వారు సూచించారు.

అనంత శయనం అయ్యంగార్ మాత్రం నిర్దేశిత సూత్రాలను తప్పని సరిగా చేర్చాలని వీటిని నేర్దేశిత అంశాలుగానే పరిగణిస్తూ అధికారంలో వున్న ప్రభుత్వాలు వాటిని గమనంలోకి తీసుకోవాలని సూచించారు, నిర్దేశిక సూత్రాలను కోర్టులు కేటాయించవని, ఇవి ప్రజాభిప్రాయ ప్రతిబింబాలని ఆయన అభిప్రాయం. అంబేద్కర్ కూడా ఈ సూత్రాలు శాసన మండలికి నిర్దేశించాలని, కార్యనిర్వాహక వర్గం కూడా భవితలో వీటి ఆధారంగా పని చేస్తుందని అభిప్రాయపడ్డారు.

రాజ్యం వృద్ధికి కృషిచేస్తుందని నిర్దేశిక నియమాల్లో పేర్కొన్న అంశం తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నది. ఈ అధికరణాన్ని ప్రయత్నం అనే పడి కట్టుపదాలను తొలగించడం ద్వారా మరింత సార్వజనీనం చేయాలని విమర్శకుల వాదన రాజ్యం ప్రభుత్వం యొక్క ప్రధాన విధిగా ప్రజా సంక్షేమం వున్న దృష్ట్యా ఇది నిర్దేశిక నియమంగా కొనసాగేందుకు దానికి ప్రయత్నమనే పదం ఉపయెగించరాదని వాళ్ళు అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ మాత్రం ఈ పదాల ఉపయోగాన్ని సమర్థిస్తూ ప్రభుత్వం ఆర్థిక సమస్యలు, అనుకూల పరిస్థితులను చూపుతూ అభివృద్ధికి చర్యలు చేపట్టకుండా ఇది నిరోధిస్తుందన్నారు. ఈ పద ఉపయోగం ఫలితంగా రాజ్యం పరిస్థితులను చూపుతూ అభివృద్ధికి చర్యలు చేపట్టకుండా వుండకుండా ఇది నిరోధిస్తుందన్నారు. ఈ పద ఉపయోగం ఫలితంగా రాజ్యం పరిస్థితులెలా వున్నా అభివృద్ధికి కృషి చేస్తూనే వుండాలనే ఆకాంక్ష బహిర్గతమైందని ఆయన అభిప్రాయం.

2.6.1 ఉమ్మడి పౌర చట్టం ఒక చర్చ

ఉమ్మడి పౌర చట్టం అనే అధికరణ సుదీర్ఘ చర్చలకు తావిచ్చింది. ఈ చట్టం విషయమై ముస్లిం సభ్యులు తీవ్ర ఆక్షేపణలు వ్యక్తం చేసారు. ఈచట్టం ఆచరణ పర్యవసానంగా 19వ అధికరణం ద్వారా సంక్రమించిన స్వాతంత్ర్య

BRAOU

హక్కులకు విఘాతం కల్గుతుందని వాళ్ళ అభిప్రాయం జీవితం సంస్కృతిలో భాగంగా రూపొందించిన వ్యక్తిగత చట్టానికి ప్రభుత్వం మార్పులు తెచ్చిన క్రమంలో మతపరమైన జీవితాల్లో అది చొరబడుతుందని ఫలితంగా రాజ్యం యొక్క లౌకిక స్వభావం (రాజ్యాంగ మండలి నిర్మించతలపెట్టిన) ఆచరణ సాధ్యంకాదని వాళ్ళు వాదించారు. ప్రజలు వ్యక్తిగత చట్టాన్ని పౌర చట్టంనుండి వేరుగా చూడాలని ఆకాంక్షిస్తున్నారని మహ్మద్ ఇస్మాయిల్ అన్నారు, విభజన అసంతృప్తిని సృష్టించి, సామరస్యం నుండి ప్రజలను దూరం జేస్తుందని ఆయన హెచ్చరించారు. లౌకిక రాజ్యంలో ఉమ్మడి పౌర చట్టం వుండాలనే వాదన విచిత్రమైందని మహబూబ్ అలీ వాదించారు. ఈ దిశలో తీసుకొబోయే చర్య నిరంకుశమైందని ఇది ప్రజల ఆత్మ సహననానికి ఉపకరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. బ్రిటిష్‌వారు వంశపారంపర్య సంబంధిత చట్టాల్లో జోక్యం చేసుకోలేదు కాబట్టి రాజ్యానికి ఈ చట్ట ప్రయోగాపకాశ మివ్వరాదని నజీరుద్దీన్ అహ్మద్ అభిప్రాయపడ్డారు. 175 ఏళ్ళ బ్రిటిష్ పాలన గాని, 500 సంవత్సరాల ముస్లింపాలన గాని ఈ దిశలో యత్నించకముందు రాజ్యానికి అవకాశమివ్వరాదని ఆయన వాదించారు. తొందరపాటులో ఇలాంటి నిర్ణయాలు తీసుకునేకన్నా అనుభవాలు, పాలనాదక్షత, సానుభూతితో చర్యలు తీసుకొవాలని ఆయన సూచించారు.

ఈ అధికరణానికి మద్దతునిస్తూ మున్షీ మతంతో వాటికి సంబంధమెలావుంటుంది అని ప్రశ్నించారు. వ్యక్తిగతచట్టాలు, వంశపారంపర్య హక్కులు మతంలో భాగాలని వున్న నమ్మకం తప్పని ఆయన అభిప్రాయం. అలాగే వుంటే మహిళలకు ఎప్పుడూ సమానత్వం లభించదని ఆయన అన్నారు. మన ప్రధమ సమస్య జాతి సమైక్యత. దీన్ని దృష్ట్యా వ్యతిరేక దృక్పథం అభిలషణీయం కాదని ఆయన అన్నారు. బ్రిటిష్‌వారు వ్యక్తి గత చట్టం మతంలో భాగమనే వాదనను చొరబడేలా చేస్తున్నారని ఆరోపిస్తూ ఈ నమ్మకాలను మనం వమ్ము చేయాలని ఆయన సూచించారు.

ఈ అధికరణ ఐక్యత కోసం రూపొందించుకోవడం వల్లనూ, అదీ కేవలం సాధారణ స్టేట్ మెంట్ కావడం వల్లనూ అయ్యర్ దీనిపై వచ్చిన విమర్శలపట్ల ఆశ్చర్యం వ్యక్తం చేసారు. ఆయన ఈ అంశాన్ని బలపరుస్తూ వాస్తవానికి యూరోపియన్ దేశాల్లో ఉమ్మడి పౌరచట్టం ఉండాలనేది ఒక ఆదర్శమని పేర్కొన్నారు, అంబేద్కర్ ఈ అంశం పై తన అభిప్రాయం వ్యక్తపరుస్తూ పౌర చట్టం వివాహం, వంశానుగత అంశాల్లోకి వెళ్ళలేదని అందువల్ల ఈ అంశాల్లోను మార్పు తెచ్చేందుకు రాజ్యాంగంలో అధికరణ ద్వారా ప్రయత్నించ వచ్చని అన్నారు. ఈ అధికరణంలో రాజ్యం ప్రయత్నిస్తుందనే పదం వున్నదని, రాజ్యం ప్రయెగిస్తున్నదనే పదం లేక పోవడం వలన ఈ చట్టం పై అపోహలు వద్దని ఆయన సూచించారు.

BRAOU

2.6.2 నిషేధంపై చట్టం

మద్య నిషేధం అంశం నిర్దేశిక సూత్రాల్లో చోటు చేసుకొవడం పట్ల కొంత వ్యతిరేకత వచ్చింది. ఈ చట్టప్రయోగాన్ని వ్యతిరేకిస్తూ బిహెచ్ కర్టేకర్ అమెరికా అనుభవాలను ఉదహరించారు. జనాభాలో కేవలం పది శాతం మంది మద్య సేవిస్తే అందులోను ఒక శాతం తాగుబోతులు అయిన నేపధ్యంలో వారి కోసం నిషేధం ప్రయోగించి పెద్ద మొత్తం ఖర్చు చేయడం అనవసరమని ఆయన గణాంక వివరాల తో ఉదహరించారు. నిషేధం ప్రయోగించడంవల్ల తాగుబోతులు వేరే సేవానలకు బానిసలు అవుతారని అయన అభిప్రాయం. కొంత మంది నిషేధం వైపల్యాన్ని గిరిజనుల జీవన విధానంలోను సాంప్రదాయంలోను భాగం అని చెబుతూ వ్యతిరేకించారు. అమెరికాలో నిషేధం వైఫల్యాన్ని అక్కడి ప్రజలు పశ్చాత్తాపడ్డారని నిషేధాన్ని సమర్ధించిన బిజిఖర్ అన్నారు. అందువల్ల మద్యం అనే రక్కసి మరింత వేళ్ళూను కోకముందే మనం ఇప్పుడే అమెరికా, యూరోప్ దేశాల వైఫల్యాలను పరిగణలోకి తీసుకోకుండా నిషేధం విధించాల్సిందేనన్నారు. ఈ సంస్కరణను ప్రజానీకం అభివృద్ధి దృష్ట్యా అమల్లోకి తెచ్చి మానవాళిని సంస్కరించాలని సూచించారు.

అంబేద్కర్ భిన్న దోరణుల మధ్య ఏర్పడ్డ అపోహలకు తెరవేస్తూ ఇది నిర్దేశిత సూత్రం కావడం వల్ల నిధానంగా నిషేధం అమలులో పెట్టే బాధ్యత ఆయా రాష్ట్రాలు, ప్రజాభిప్రాయానికి వదిలి వేసున్నట్లు ప్రకటించారు.

గోవధనిషేధం పై నిర్దేశిక నియమం ఆర్థిక అవసరాల రీత్యా అంగీకరించారు. దీన్ని మత కోణంలో పరిశీలించలేదు.

2.6.3కార్య నిర్వాహక మండలి - న్యాయ వ్యవస్థల విభజన పై చర్చ

రాజ్యాంగం అమలులోకి వచ్చిన మూడు సంవత్సరాల వ్యవధిలో న్యాయవ్యవస్థకు కార్యనిర్వాహక మండలిని విభజించే యత్నాలు చేపట్టాలని వున్న అధికరణాలపట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కృష్ణస్వామి న్యాయ వ్యవస్థకు స్వతంత్ర్య ప్రతిపత్తినిస్తూ అధికారం ఇవ్వడం అభిలషణీయం కాదని అభిప్రాయపడ్డారు. విభజన ప్రభుత్వ పనితీరుకు అవరోధంగా నిలుస్తుందని అన్నారు. ఇందుకు భిన్నంగా అభిప్రాయం వ్యక్తపరుస్తూ నిష్పక్షపాతన్యాయానికి విభజన అవసరమన్నారు. విచరణాధికారిగా జిల్లా మెజిస్ట్రేట్ వ్యవహరిస్తూ, న్యాయఅధికారిగా పేరొందడం బాగుండదన్నారు.

నెహ్రూ ఈ అంశంపై సమయం పరిమితి ఎక్కువగావుందని అన్నారు. రాజ్యం ఈ నిర్దేశాన్ని కలిగి వుండాలని వుంది. దీనికోసం కాలపరిమితి నిర్ణయించడం రాజ్యవిధానాల వైశిష్ట్యాని తగ్గిస్తుంది తద్వారా అంశంగా మారి ఈ నిర్దేశిక నియమానికి అర్థం లేకుండా పోతుందన్నారు. అయితే అంబేద్కర్ ఈ అంశంలో చేసిన వాఖ్యాల్లో కాలపరిమితి ఆచరణను ఒక వైపు దేశంలోకి అనేక ప్రాంతాల్లో ఆలస్యం చేస్తూ, మరోవైపు ప్రాంతాల్లో ఈ నియమ ఆచరణను సాధ్యం చేయక పోవచ్చని వాదించడంతో నెహ్రూ దాన్ని అంగీకరించి ఈ నిర్దేశిక నియమం దేశ విష్టతను ఇనుమడింప జేసిందని వాదించారు. న్యాయ వ్యవస్థలో కార్యనిర్వాహక జోక్యం పెరుగుతున్న క్రమంలో విభజన ప్రతిపాదనకు టేక్ చంద్ మద్ధతు లభించింది.

అంతర్జాతీయ శాంతి, రక్షణాంశాలకు సంబంధించి రాజ్యం తనవంతుకర్తవ్యం నిర్వహించాలని వచ్చిన అధికరణ కొద్దిపాటి చర్చలలో ఆమోదం పొందింది. సుబ్బారాయన్ ఈ ప్రతిపాదనలోని నిలబెట్టుకోవడం అనే పదానికి బదులు పోషించడం పదాన్ని వినియోగించాలని సూచించారు. త్యాగి రాజ్యం సంబంధితాంశాలకు సరితూగని ధర్మయుత ఆకాంక్ష పదాన్ని వ్యతిరేకించారు. మన లక్ష్యం ఒక ప్రధాన అధికారంగా రూపొందాలని వుండాలి, తద్వారా ప్రజలు దేశాన్ని యుద్ధం లాంటి అనివార్యస్థితిలోకి నెట్టే విధంగా సతాయించరాదనే భావాన్ని కలిగివుంటారని ఆయన అభిప్రాయం.

BRAOU

2.7 ముగింపు

సామాజిక ఆర్థిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చేందుకు జరుగుతున్న యత్నంగా పరిగణించబడ్డ రాజ్యాంగ స్వీకరణ చివరికి నిజమైంది. డా. రాధాకృష్ణన్ మాటల్లో ఇది భారతీయులు సంకల్పించిన సామాజికార్థిక విప్లవ సంకేతం. అందువల్ల మనం దీన్ని అవసరాలకనుగుణంగా పునర్నిర్మించుకోవాల్సిన అవసరం వుంది. మనం ఈ నేపథ్యంలోనే మానవళి స్ఫూర్తికి చిహ్నమైన స్వేచ్ఛను పరిరక్షించుకోవాలి. స్వేచ్ఛను రాజ్యం యొక్క చెరబాటు నుండి రక్షించుకోవాలి. రాజ్యం ఆర్థిక పరిస్థితుల మెరుగుదలకు చర్యలు తీసుకొవాల్సిన అవసరం వున్నప్పటికీ మానవాళి స్ఫూర్తికి పణంగా ఈ యత్నాలు జరగకూడదు. మనం ఈ రోజు అమల్లోకి తెస్తున్న డిక్లరేషన్ మన ప్రజల అవసరాలకనుగుణంగా రూపొందించిన ప్రతిజ్ఞ లాంటిది. ఇది నాగరిక ప్రపంచంలో మన ఒప్పందం అన్నారు.

హక్కులు నియమాలు సుదీర్ఘ చర్చలు, వాదనల నేపథ్యంలో రాజ్యాంగ మండలి సభ్యుల సమక్షంలో రాజ్యాంగంలో చేర్చబడ్డాయి. ఈ సభ్యులు వివిధ ప్రాతినిధ్య వర్గాలనుండి చేసిన సూచనలు పరిగణలోకి తీసుకొని నిర్ణయించడం జరిగింది. భారత డ్యాకుమెంట్‌గా పేర్కొంటున్న ఈ డిక్లరేషన్ సమగ్రమైన జాబితాలో తయారైనా అందులో మహిళలు, పిల్లలు, సామాజికంగా విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు, షెడ్యుల్డ్ కులాలు, తెగలకు ప్రత్యేక రాయితీలతో రూపొందింది.ఈ దశలోనే ప్రజా జీవనం, నైతికత, రక్షణలకు భంగం వాటిల్లకుండేందుకు జాగ్రత్తలు కూడా తీసుకున్నారు.

2.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. **ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. రాజ్యాంగమండలి రూపకల్పనను పరీక్షిస్తూ రాజ్యాంగమండలి ప్రాతినిధ్య స్వభావం వివరించుము.
2. హక్కుల వికాసక్రమంలో ప్రధాన మైలురాళ్ళను గురించి చర్చించుము.
3. సమానత్వపు హక్కు, ఆస్తిహక్కుల చేర్పు సందర్భంగా జరిగిన చర్చలు విభేదాలను వివరించుము.

II. **ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి.**

1. స్వేచ్ఛ హక్కు ప్రాధాన్యతను చర్చించుము. స్వేచ్ఛపై పరిమితుల మీద మీ అభిప్రాయం.
2. రాజ్యవిధానంలో నిర్దేశక నియమాల చేర్పును ఏరకంగా సమర్థిస్తావు. గత అనుభవాల దృష్ట్యా రాజ్యాంగంలో ఈ భాగ సమర్థనపై అభిప్రాయం.
3. స్వేచ్ఛా భారత పౌరుల మానవ హక్కుల పై రాజ్యాంగమండలి దృక్పథంను వివరించుము.

BRAOU

ఖండం : II

రాజ్యాంగ దృష్టి

BRAOU

భారత దేశానికి సంబంధించినంతవరకు 'రాజ్యాంగాన్ని' పౌరుల పాలిటి హక్కుల పత్రంగా పేర్కొనవచ్చు వ్యక్తికి వుండాల్సిన స్వేచ్ఛాస్వాతంత్రాలు, వ్యక్తులపట్ల రాజ్యశాసనవ్యవస్థల బాధ్యతలు తదితర అంశాలన్ని ఇందులో చర్చించబడ్డాయి. రాజ్యంగ, న్యాయవ్యవస్థల్లో ఇమిడి వున్న అంశాలు ఇటీవలి ధోరణులను వివరించడం ఈ ఖండం లక్ష్యం. ఈ ఖండంలో మూడు భాగాలున్నాయి. అవి :

- ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు
- న్యాయ వ్యవస్థ : మానవ హక్కులు
- ధర్మాసన చైతన్యం : మానవహక్కులు

BRAOU

భాగం - 3 : ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు

విషయక్రమం

3.0 ఉద్దేశం

3.1 పరిచయం

3.2 ప్రాథమిక హక్కుల జాబితా

3.3 ప్రపంచ మానవ హక్కుల - ప్రకటనతో పోలిక

3.3.1 ఆర్టికల్ 14

3.3.2 వివక్ష నిషేధం

3.3.3 ప్రభుత్వ ఉద్యోగాలలో సమాన అవకాశాలు

3.3.4 వాక్ స్వాతంత్ర్యం, సంఘాలు ఏర్పాటు చేసే స్వేచ్ఛ

3.3.5 శిక్షకు గురయిన వారికి రక్షణలు

3.3.6 జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ

3.3.7 మనుషుల విక్రయం, బలవంతపు చాకిరీ నిషేధం

3.3.8 అల్పసంఖ్యాక వర్గ - ప్రయోజనాల రక్షణ

3.3.9 అల్పసంఖ్యాక వర్గాలు విద్యా సంస్థలు నెలకొల్పే హక్కు

3.3.10 రాజ్యాంగ పరిష్కారాలు కోరే హక్కు

3.4 ఆదేశిక సూత్రాలు

3.4.1 సమసమాజ నియమాలు (ఆర్టికల్ 39, 41, 43)

3.4.2 గాంధేయ నియమాలు

3.4.3 మేధోస్వేచ్ఛ నియమాలు

3.5 ముగింపు

3.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

3.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు:

- ప్రాథమిక హక్కులకు, మానవ హక్కులకు మధ్య సంబంధం;
- 1948లో ప్రపంచ మానవ హక్కుల ప్రకటనలో నిర్దేశించిన సూత్రాలను భారత రాజ్యాంగంలో ఎంతవరకు పొందుపరచారు.

3.1 పరిచయం

సాధారణ చట్టాలకన్న ఎక్కువ విలువ కలిగిన మౌలిక హక్కులనే ప్రాథమిక హక్కులు అంటారు. మామూలు శాసనాల ద్వారా మార్చడానికి వీల్లేకుండా, మౌలిక శాసనమయిన రాజ్యాంగానికి అనుగుణంగా ఉందో లేదో పోల్చి, చట్టాల రాజ్యాంగ బద్ధతను తేల్చడానికి అనువుగా ఉండే హక్కులు ఇవి. ప్రభుత్వం ప్రాథమిక

హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే, ఆ హక్కులను చట్టం ద్వారా కోర్టుల ద్వారా అమలు చేయడానికి రాజ్యాంగం తగిన అధికారాలు కల్పించిన హక్కులు ఇవి. పౌరుల హక్కులను ప్రభుత్వాలు ఉల్లంఘిస్తే - రాజ్యాంగ అధికారం, న్యాయసమీక్షాధికారం కోర్టులకు ఉండాలి.

ప్రాథమిక హక్కులే కాదు, ఆ హక్కుల సాధనకు సుప్రీంకోర్టును ఆర్థించే అధికారం కూడా ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం నిర్దేశించడం ఒక విశేషం (ఆర్టికల్ 32)

ప్రతివ్యక్తికి, ఈ మానవ సమాజంలో ఉండవలసిన కనీస హక్కులు ఈ ప్రాథమిక హక్కులు. ఇతర ఏ పరిస్థితులతో సంబంధం లేకుండా పౌరులకు ఈ హక్కులు లభించాలి. కొన్ని సహజమయిన మానవ హక్కులను లిఖిత రాజ్యాంగం గుర్తించినపుడు అవి 'ప్రాథమిక హక్కులు" అవుతాయి. రాజ్యాంగం ప్రాథమిక హక్కులను గుర్తించడం అంటే, ప్రభుత్వం తన చర్యల ద్వారా లేదా చట్టాల ద్వారా హక్కులను ఉల్లంఘిస్తే ఆ చర్యలను నియంత్రించే అవకాశం న్యాయస్థానాలకు కల్పించడం అని అర్థం. రాజ్యాంగం, ఒకదేశపు మౌలిక శాసనం కనుక ఆ నియమాలను ఉల్లంఘించే శాసనాలు ఏవీ చెల్లవు. ప్రభుత్వం ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడానికి వీల్లేదు.

మానవ హక్కుల రక్షణ చట్టం 1993 'మానవహక్కులు' ఏమిటో నిర్వచించింది. "వ్యక్తి స్వేచ్ఛ, సమానత, గౌరవాలకు సంబంధించిన హక్కులను భారత రాజ్యాంగం, అంతర్జాతీయ ఒప్పందాలు ఆమోదించిన పక్షంలో అవి మానవ హక్కులు. భారత ప్రజలకు ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు కలిపితే లభించేవి మానవ హక్కులు. ప్రాథమిక హక్కులు, ప్రస్తుతం పౌరులకు లభించే హక్కులకు ప్రాధాన్యం ఇస్తే, అందుకే మానవహక్కులు కల్పించే లక్ష్యం వైపు ఆదేశిక సూత్రాలు నడిపిస్తాయి.

1927లో భారత జాతీయ కాంగ్రెస్, ప్రపంచ మానవ హక్కుల ప్రకటనలో పేర్కొన్న హక్కులను భావి రాజ్యాంగంలో చేర్చాలని డిమాండ్ చేసింది. భారత రాజ్యాంగ స్వరూపాన్ని నిర్ధారించడానికి అఖిలపక్ష కమిటీ నియమించిన మోతీలాల్ నెహ్రూ కమిటీ, ఈ డిమాండ్‌కు ప్రతిస్పందిస్తూ, భారత ప్రజలు ప్రాథమిక హక్కుల్ని సాధిస్తారని చెప్పారు.

అంతర్జాతీయ శాంతి, మానవహక్కుల పట్ల గౌరవం వంటి సదాశయాలతో రాజ్యాంగ నిర్మాతలు స్ఫూర్తిని పొందారు. ఐక్యరాజ్య సమితి న్యాయ సమావేశం డిసెంబర్ 12, 1948న "ప్రపంచ మానవ హక్కుల ప్రకటన"ను ఆమోదించింది. అదేసమయంలో భారత రాజ్యాంగ సభ ఈ ప్రాథమిక హక్కుల విషయం చర్చిస్తూ ఉంది. ప్రపంచ ప్రకటనలో పేర్కొన్న మానవ హక్కులను, రాజ్యాంగం మూడోభాగంలో ప్రాథమిక హక్కుల జాబితాలో చేర్చారు. మూడో భాగంలోని ప్రాథమిక హక్కులే కాక, నాలుగో భాగంలోని ఆదేశిక సూత్రాలకు కూడా ఈ మానవ హక్కులే ప్రాతిపదిక. రాజ్యాంగ ముసాయిదాకు లేఖను సమర్పిస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ "ప్రాథమిక హక్కులు సంపూర్ణమయినవని, ఇతర హక్కులు అసంపూర్ణమయినవని భావించడం తప్పు" అని పేర్కొన్నారు. ఆర్టికల్ 13లో ప్రాథమిక హక్కులను వివరిస్తూనే, వాటి ప్రభావాన్ని పూర్తిగా తొలగించే విధంగా మినహాయింపులు చేర్చారనే విమర్శకు డాక్టర్ అంబేద్కర్ పై విధంగా జవాబిచ్చారు.

3.2 ప్రాథమిక హక్కుల జాబితా

భారత రాజ్యాంగం మూడో విభాగంలో ప్రాథమిక హక్కులను వివరించారు. వాటిలో ఈ హక్కులు ఉన్నాయి:

సమానతా హక్కు :

ఆర్టికల్ 14	-	చట్టం ముందు సమానత
ఆర్టికల్ 15	-	మతం, తెగ, కులం, లింగం, పుట్టిన చోట, ఆధారంగా వివక్ష చూపడాన్ని నిషేధించడం.
ఆర్టికల్ 16	-	ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో సమాన అవకాశాలు.

BRAOU

ఆర్టికల్ 17 - అస్పృశ్యత రద్దు.

ఆర్టికల్ 18 - బిరుదుల రద్దు.

స్వేచ్ఛా హక్కు :

ఆర్టికల్ 19 - వాక్ స్వాతంత్ర్యం వంటి కొన్ని స్వేచ్ఛలకు రక్షణ.

ఆర్టికల్ 20 - నేరాలకు శిక్షవిధించే ముందు కొన్ని జాగ్రత్తచర్యలు.

ఆర్టికల్ 21 - స్వేచ్ఛ, జీవించే హక్కుల రక్షణ.

ఆర్టికల్ 22 - కొన్ని నేరాలలో నిర్బంధాలనుంచి రక్షణ

దోపిడీనుంచి రక్షణ పొందె హక్కు:

ఆర్టికల్ 23 - మానవుల క్రయ విక్రయాలు, బలవంతపు చాకిరీ నిషేధం.

ఆర్టికల్ 24 - బాల కార్మికులను, ఫ్యాక్టరీలలో నియమించడం పై నిషేధం.

మతస్వేచ్ఛ హక్కు :

ఆర్టికల్ 25 - అంతర్జాతీయ స్వేచ్ఛ. ఏమతాన్నయినా అనుసరించి, అవలంబించి, ప్రచారం చేసే హక్కు.

ఆర్టికల్ 26 - తన మత వ్యవహారాలను తానే నిర్వహించే స్వేచ్ఛ.

ఆర్టికల్ 27 - ఒక మతం అభివృద్ధికి పన్నులు చెల్లించే హక్కు.

ఆర్టికల్ 28 - విద్య సంస్థలో మతబోధనలకు మత పూజలకు హాజరయ్యే హక్కు.

సాంస్కృతిక విద్యా హక్కులు :

ఆర్టికల్ 29 - అల్పసంఖ్యాక వర్గాల ప్రయోజనాల రక్షణ.

ఆర్టికల్ 30 - విద్యాసంస్థలను నిర్మించి, నిర్వహించుకునేందుకు అల్పసంఖ్యాక వర్గాల హక్కు.

రాజ్యాంగ పరిష్కారం కోరే హక్కు :

ఆర్టికల్ 32 - రాజ్యాంగంలో సూచించిన హక్కుల అమలు కోరడం - ప్రాథమిక హక్కు.

రాజ్యాంగంలో నిర్దేశించిన హక్కులన్నీ లభింపచేయడానికి 50 సంవత్సరాలలో ప్రభుత్వం ఎన్నో శాసనాలను రూపొందించవలసి వచ్చింది.

ఇంతేకాక సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా మానవ హక్కుల పరిధిని మరింత విస్తృతం చేసింది.

3.3 ప్రపంచ మానవ హక్కుల ప్రకటనతో పోలిక

ప్రపంచ మానవ హక్కుల ప్రకటన, రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను పోల్చిచూస్తే రెండింటిలోనూ ఒకే విధమైన స్ఫూర్తి కనిపిస్తుంది. ఈ రెంటిని ప్రక్క ప్రక్కన పేర్చి పోలికలను పరిశీలించవచ్చు.

3.3.1 ఆర్టికల్ 14 :

రాజ్యాంగం ఆర్టికల్ 14 ప్రకారం "భారత దేశంలో ప్రభుత్వం శాసనాల సమాన రక్షణనను, శాసనాల ముందు సమానతను ఏ పౌరుడికి నిరాకరించకూడదు" అని చెప్పున్నది.

ప్రపంచ మానవ హక్కుల ప్రకటన (1948) ఆర్టికల్ 7 ప్రకారం "శాసనం ముందు అందరూ సమానమే. అందరూ శాసనాల ద్వారా రక్షణను కూడా సమానంగా ఏ వివక్ష లేకుండా పొందడానికి అర్హులు. ఈ ప్రకటనను ఉల్లంఘనల నుంచి, లేదా ఈ హక్కులను భంగపరచాలనే ప్రేరణల నుంచి అందరికీ సమానమయిన రక్షణ లభిస్తుంది.

BRAOU

3.3.2 వివక్ష నిషేధం :

ఆర్టికల్ 15(1) ప్రకారం ఏ పౌరుడినీ ప్రభుత్వం జాతి, మతం, కులం, తెగ, లింగం, ప్రాంతం ఆధారంగా వివక్షకు గురి చేయకూడదు.

ఆర్టికల్ 2 – పేరా (1), మానవ హక్కుల ప్రకటన " ప్రకటనలోని మానవ హక్కులు, స్వేచ్ఛ, జాతి, మతం, లింగం, భాష, ప్రాంతం, దేశం, అభిప్రాయం, దేశీయత, సాంఘిక పుట్టుక, ఆస్తి, జన్మ, హోదా వంటి తేడా లేవీ లేకుండా అందరికీ ఈ ప్రకటనలోని హక్కులు, స్వేచ్ఛలు లభిస్తాయి.

3.3.3 ప్రభుత్వ ఉద్యోగాలలో సమానావకాశాలు :

ఆర్టికల్ 16 (1) భారతరాజ్యాంగం ప్రకారం "ప్రభుత్వ అధ్వర్యంలోని ఏ ఉద్యోగంలో నియమాకానికైనా అందరు పౌరులకు సమాన అవకాశాలు ఉండాలి.

ఆర్టికల్ 2(2) మానవహక్కుల ప్రకటనలో "తన దేశంలో ప్రభుత్వ జోక్యం పొందడానికి ప్రతివారికీ హక్కు ఉంది" అని చెప్పున్నది.

3.3.4 వాక్ స్వాతంత్ర్యం, సంఘాలు ఏర్పాటుచేసే స్వేచ్ఛ

ఆర్టికల్ 19(1) – భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కుల అధ్యాయం ఈ క్రింది హక్కుల గ్యారంటీ ఇస్తున్నది.

a) పౌరులందరికీ వాక్ స్వాతంత్ర్యం, అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛ.

b) శాంతియుతంగా నిరాయుధకంగా సమావేశాలు జరుపుకునే స్వేచ్ఛ.

c) యూనియన్లు, సంఘాలు పెట్టుకునే స్వేచ్ఛ.

d) భారతదేశంలో ఎవ్వరికైనా నివసించే హక్కు, స్థిరపడే హక్కు.

అయితే జాతి ప్రయోజనాలు, భద్రత, తదితర కారణాల ఆధారంగా ఈ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకై సమంజసమయిన పరిమితులు విధించే అధికారం ఉందని రాజ్యాంగం 19(2)లో స్పష్టం చేసింది.

మానవ హక్కుల ప్రకటన ఆర్టికల్ 19. అభిప్రాయం ఏర్పరచుకొని, వ్యక్తీకరించే హక్కు ప్రతి వ్యక్తీకీ ఉంది. – ఆర్టికల్ 20(1) : ప్రతి వ్యక్తికి శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, సంఘాలు ఏర్పరచుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 20(2) : ఎవరినీ ఒకానొక సంఘంలో చేరాలని వత్తిడి చేయకూడదు. ఆర్టికల్ 23(1) ప్రకారం "తన హక్కుల రక్షణ కోసం ప్రతి వ్యక్తి ట్రేడ్ యూనియన్‌లో చేరవచ్చు." ఆర్టికల్ 12(1) : తమ దేశ సరిహద్దులలో వ్యక్తిగత స్వేచ్ఛగా పర్యటించి, నివసించే హక్కు ప్రతి వ్యక్తికీ ఉంది."

3.3.5 శిక్షకు గురయిన వారికి రక్షణలు :

ఆర్టికల్ 20(1) (ప్రాథమిక హక్కులు) : అమలులో ఉన్నట్టి నిర్దేశించిన నేరం చేసినందుకు తప్ప ఏ వ్యక్తిని శిక్షించకూడదు. ఆ చట్టం కింద "నేరం" చేసినందుకు విధించవలసిన శిక్షకన్న ఎక్కువ శిక్ష విధించడానికి వీలులేదు.

ప్రపంచ మానవ హక్కుల ప్రకటన ఆర్టికల్ 11(2)లో దాదాపు ఇదే భాష ఉపయోగించును. జాతీయ, అంతర్జాతీయ చట్టాల ప్రకారం "నేరం"గా నిర్వహించబడని పనికి, నిష్క్రియకు పాల్పడినందుకు ఎవరినీ నేరస్తుడుగా నిర్ణయించి శిక్షించకూడదు. ఆ పని చేసిన సమయంలో అది నేరంగా నిర్వహింప బడకపోయినా శిక్షించ కూడదు. నేరం జరిగినపుడు చట్టం నిర్దేశించిన దానికన్న ఎక్కువ శిక్ష విధించకూడదు.

3.3.6 జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ

ఆర్టికల్ 21 భారత రాజ్యాంగం : "శాసనం ద్వారా నిర్దేశితమయిన విధానం ద్వారా తప్ప వ్యక్తి జీవన హక్కును, వ్యక్తిగత స్వేచ్ఛను హరించడానికి వీల్లేదు."

BRAOU

మానవ హక్కుల అమలును ఆర్టికల్స్ 3,9. ఈ హక్కులను ప్రస్తావిస్తున్నాయి. ఆర్టికల్ 3 : ప్రతివ్యక్తికీ జీవించే హక్కు, వ్యక్తిని రక్షించుకునే హక్కు ఉంది. ఆర్టికల్ 9 : ఏ వ్యక్తిని ఏకపక్షంగా అరెస్టు, నిర్భంధం, బహిష్కారానికి గురి చేయకూడదు.

3.3.7 మనుషుల విక్రయం, బలవంతపు చాకిరీ నిషేధం

ఆర్టికల్ 23(1) మనుషుల విక్రయం, వెట్టి చాకిరి వంటి బలవంతపు చాకిరీ చెల్లదు : ఈ నియమం ఉల్లంఘన చట్ట ప్రకారం శిక్షించ తగిన నేరం.

మానవ హక్కుల ప్రకటన ఆర్టికల్ 4 : "ఎవరినీ బానిసలుగా బంధించకూడదు. అన్నిరకాల బానిసత్వం, బానిసల వ్యాపారం నిషేధించాలి.

3.3.8 అల్ప సంఖ్యాక వర్గాల ప్రయోజనాల రక్షణ

ఆర్టికల్ 29(1) ప్రాథమిక హక్కుల : "దేశంలోని ఏ భాగంలోనైనా, ఒక వర్గం ప్రజలకు మరి సొంతమైన విభిన్న భాష, లిపి, సంస్కృతి ఉంటే, వాటిని రక్షించుకునే హక్కు ఉంది.

ఆర్టికల్ 22 మానవహక్కుల ప్రకటన : "సమాజంలో సభ్యుడైన ప్రతి వ్యక్తికి సాంఘిక భద్రతా హక్కు ఉంది. ప్రతి దేశంలోనూ లభించే వనరులద్వారా వ్యవస్థ ద్వారా జాతీయ ప్రయత్నాలు, అంతర్జాతీయ సహకారం ద్వారా ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కులను, వ్యక్తిత్వ వివిధ గౌరవాలకోసం ఆ హక్కులను రక్షించుకోవాలి."

3.3.9 అల్ప సంఖ్యాక వర్గాలు విద్యా సంస్థలు నెలకొల్పే హక్కు :

ఆర్టికల్ 30(1) భారత రాజ్యాంగం : "భాష లేదా మతపరమయిన అల్పసంఖ్యాకులు వారి ఇష్టం మేరకు విద్యాసంస్థలను నెలకొల్పే హక్కు ఉంది.

ఆర్టికల్ 26(3) : తమ పిల్లలకు ఏ విధమయిన విద్యకావాలో ఎంచుకునే స్వేచ్ఛ తల్లిదండ్రులకు ఉంది.

3.3.10 రాజ్యాంగ పరిష్కారాలు కోరే హక్కు :

ఆర్టికల్ 32(1) : "ప్రాథమిక హక్కుల విభాగం ద్వారా లభ్యమయిన హక్కులను తగిన ప్రొసీడింగ్స్ ద్వారా అమలు కావాలని సుప్రీంకోర్టును కోరే హక్కు గ్యారంటీగా ఉంది".

మానవ హక్కుల ప్రకటన : ఆర్టికల్ 8 : రాజ్యాంగం, శాసనం ఇచ్చిన హక్కులను భంగపరిచే చర్యలకు గురైన పరిష్కారాల కోసం సరైన జాతీయ ట్రిబ్యునల్స్ ద్వారా కోరే హక్కుల అందరికీ ఉంది.

3.4 ఆదేశిక సూత్రాలు

భారత రాజ్యాంగం నాలుగో భాగం (ఆర్టికల్స్ 36 నుంచి 51)లో ప్రభుత్వం విధానాలకు సంబంధించిన 'ఆదేశిక సూత్రాలు' ఉన్నాయి. ఆధునిక రాజ్యాంగ ప్రభుత్వ నిర్మాణపు విశిష్ట లక్షణం ఇది. ఐరిష్ రిపబ్లిక్ రాజ్యాంగం నుంచి మన రాజ్యాంగ నిర్మాతలు స్ఫూర్తి పొంది ఆదేశిక సూత్రాలను రూపొందించారు. ఈ అంశంపై వ్యాఖ్యానిస్తూ "డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1935 ప్రభుత్వం చట్టంలో పేర్కొన్న 'ఆదేశిక నియమాలు' (Instruments of Instruction) రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాలు ఒకటేనని వివరించారు. అయితే 1935 చట్టంలో ఉన్న నియమాలు శాసన, కార్యనిర్వహక వ్యవస్థలకు మాత్రమే ఉద్దేశించినవి. అధికారంలోకి వచ్చిన వారెవరయినా తమకు ఇష్టం వచ్చిన రీతిలో ఆ అధికారాన్ని మార్చడానికి వీలులేదు. ఆ అధికార వినియోగ సమయంలో ఆదేశిక సూత్రాలను గుర్తు పెట్టుకోవాలి. వాటిని నిర్లక్ష్యం చేయరాదు.

ఐక్యరాజ్యసమితి ఛార్టర్, ప్రపంచ మానవ హక్కుల ఛార్టర్ ఈ 'ఆదేశిక సూత్రాల' అధ్యయనానికి ప్రేరణ అనవచ్చు. అయితే చాల ఆదేశిక సూత్రాలు పూర్తిగా భారతీయమైనవి. స్వాతంత్ర్య సమరానికి కారణమైన అంశాలను ఆదేశిక సూత్రాలుగా మలిచారు. మద్యనిషేధం, గోవధ నిషేధం, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు,

BRAOU

ఇతర సాంఘిక, ఆర్థిక పరమయిన, వెనుకబడిన తరగతులకు ప్రత్యేక భద్రత, కుటీర పరిశ్రమలకు ప్రోత్సహం పూర్తిగా దేశీయమైన ఆదేశిక సూత్రాలు. ఇవి చాల వరకు మహాత్మాగాంధి సిద్ధాంతాలు.

దేశ పాలనలో నిమగ్నమయిన ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు ఈ ఆదేశిక నియమాలను ప్రాతిపదికగా పరిపాలన సాగించాలి. చట్టాలను రూపొందించే సమయంలో ఈ ఆదేశిక సూత్రాలను పాటించడం ప్రభుత్వ విద్యుక్త ధర్మం. రాజ్యాంగ అధ్యయనం నేటి విద్యార్థులకు ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాలకు మధ్య సాగే సంఘర్షణ ఆసక్తికరమైన విషయమే. ప్రాథమిక హక్కులను కోర్టుల ద్వారా రక్షించుకోవచ్చు. ఈ హక్కులకు భిన్నంగా రూపొందిన శాసనాలు చెల్లవని కోర్టులు ప్రకటించి తీరాలి. కాని ఆదేశిక సూత్రాలు అమలు చేయాలని కోరుతూ కోర్టులను ఆశ్రయించడానికి వీలులేదు. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య సంఘర్షణ ఏర్పడితే ప్రాథమిక హక్కులకే ప్రాధాన్యత లభిస్తుంది. కాని 425 రాజ్యాంగ సవరణ తర్వాత ఆదేశిక సూత్రాల అమలు విషయంలో ఆర్టికల్స్ 14, 19, 31 అడ్డురావడానికి వీలులేదు. ఆ మేరకు ఆదేశిక సూత్రాలకు ప్రాథమిక హక్కులకై ఆధిక్యత లభించింది. ఆదేశిక సూత్రాల అమలులో ప్రభుత్వాలకు ఎదురయ్యే ప్రతిబంధకాలను రాజ్యాంగ నిర్మాతలు ఊహించినట్లు లేదు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సంక్షేమ రాజ్య నిర్మాణ లక్ష్యాలను, సమున్నత ఆశయాలను అమలు చేయడానికిగాను ప్రధానపాత్ర పోషించాలని రాజ్యాంగం ఆకాంక్షిస్తున్నది.

రాజ్యాంగంలో 36 నుంచి 51వ అధికరణాలు ఆదేశిక సూత్రాలను వివరిస్తున్నాయి. కాని ఆర్టికల్ 39 నుంచి అసలైన ఆదేశిక సూత్రాలు ప్రారంభమైనాయి. ఆర్టికల్స్ 36, 37, 38, ప్రభుత్వం అంటే ఏమిటి? ప్రభుత్వ సూత్రాలు, లక్ష్యాలు ఏమిటి అనే అంశాలను వివరిస్తున్నాయి. ఆర్టికల్ 37 ఆదేశిక సూత్రాలను కోర్టుల ద్వారా అమలు చేయడం సత్యం కాదని చెప్పింది. అయినా "అవి రాజ్యపాలనలో మౌలిక సూత్రాలు". చట్టాలు చేసే దశలో ఈ సూత్రాలను పాటించడం ప్రభుత్వాల విధి. ఆ ఆర్టికల్ రెండు ప్రధాన కమిటి అంశాలను వివరించింది. ఒకటి – వీటికి అమలు చేయతగిన లక్షణం లేదు. రెండు – వీటిని శాసనాలు చేసే ప్రభుత్వాలు విస్మరించడానికి వీలులేదు. కనుక ఆర్టికల్ 37కు ఎంతో ప్రాధాన్య ఉంది. ఆర్టికల్ 38 ప్రకారం: "సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం వర్ధిల్లే సామాజిక విధానాన్ని సాధించి, రక్షించి ప్రజల సంక్షేమాన్ని రక్షించే ప్రయత్నాలను ప్రభుత్వాలు చేపట్టాలని 44వ రాజ్యాంగ సవరణ చట్టం ఆర్టికల్ 38లో మరో క్లాజ్‌ను చేర్చింది. ఈ క్లాజ్ ప్రకారం ప్రభుత్వం ఆదాయంలో అసమానతలను సాధ్యమైనంత తగ్గించి, హోదా, సౌకర్యాలూ, అవకాశాలను ప్రతి వ్యక్తికీ లేదా సుదూర ప్రాంతాల్లో విభిన్న వృత్తులు చేసుకునే వివిధ వర్గాలలో అందరికీ సమానంగా లభించే కృషి, అసమానతలు తొలగించే కృషి చేయాలి.

ఆదేశిక సూత్రాలను మూడు తరగతుల్లో విభజించవచ్చు. "1) సమసమాజ నియమాలు, 2) గాంధేయ నియమాలు, 3) మేధో – స్వేచ్ఛా నియమాలు.

3.4.1 సమసమాజ నియమాలు (ఆర్టికల్ 39,41,43)

ఆర్టికల్ 39 : పౌరులైన స్త్రీ పురుషులందరికీ కింది హక్కులు సాధించేందుకు ప్రభుత్వం తన విధానాలను రూపొందించాలి.

a) జీవనోపాధికి తగిన వనరులు పొందే సమాన హక్కు

b) సమానమయిన పనికి సమానమైన వేతనాలు

c) సమిష్టి శ్రేయస్సుకు వినియోగించే సంపద వనరులను నియంత్రించి, సమంజసంగా పంపిణీ చేయడం.

d) సంపదను, ఉత్పాదన వనరులను వికేంద్రీకరించడం.

e) కార్మికులు, స్త్రీ పురుషులు, పిల్లలును దుర్వినియోగం నుంచి రక్షించి, వారి ఆరోగ్యం, బలం అభివృద్ధి చేయడం.

f) దోపిడీకి గురికాకుండా, నిర్లక్ష్యంగా వదిలేయకుండా బాల్య, కౌమార దశలను కాపాడడం.

BRAOU

ఆర్టికల్స్ 41 : పరిమితమయిన ఆర్థిక స్తోమత, అభివృద్ధి వనరులకు లోబడి ప్రభుత్వం అందరికీ ఉపాధి హక్కు, విద్యాహక్కు, నిరుద్యోగులు వృద్ధులు, రోగులు, వికలాంగులైతే ప్రభుత్వ సహాయం పొందే హక్కు లభింప జేయడానికి కృషి చేయాలి. ఆర్టికల్ 43 : కార్మికులందరికీ తగిన శాసనాల ద్వారా లేదా ఆర్థిక వ్యవస్థీకరణ ద్వారా, పని, జీవనయోగ్యమయిన జీతం, సరైన పని వాతావరణం, గౌరవ ప్రదమయిన జీవన ప్రమాణాలు, విరామాలను, సాంఘిక సాంస్కృతిక అవకాశాలను పూర్తిగా వినియోగించే స్వేచ్ఛ కల్పించాలి. ఇవన్నీ ఆర్థిక న్యాయం అందించే సమసమాజ సిద్ధాంత లక్ష్యాలు.

3.4.2 గాంధేయ నియమాలు (ఆర్టికల్ 40,43,46,47, 48A, 49)

మహాత్మాగాంధీ కలలు, ఆశయాలు, అశలు నిజం చేసేందుకు కొన్ని ఆదేశిక సూత్రాలను రూపొందించారు. గ్రామ పంచాయతీల స్థాపన, కుటీర పరిశ్రమల అభివృద్ధి, బలహీన వర్గాల అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం, బలం పెంచే సూత్రాలు గాంధీ ఆశయాలకు సంబంధించినవి.

ఆర్టికల్ 40 ప్రకారం : గ్రామ పంచాయితీలు స్వయం పాలనా కేంద్రాలుగా స్థాపించడానికి ప్రభుత్వం కృషి చేయాలి. గ్రామపంచాయితీలకు స్వేచ్ఛ స్వయం పాలనాధికారాలు ఇవ్వాలని ఆ ఆర్టికల్ నిర్దేశిస్తున్నది. ఆర్టికల్ 43 గ్రామీణ ప్రాంతాలో వ్యక్తిగతం గానూ, సహకార ప్రాతిపదికపైన చిన్న తరహా పరిశ్రమలను, కుటీర పరిశ్రమలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని సూచిస్తున్నది. ఆర్టికల్ 46 ప్రజలలో బలహీన వర్గాల విద్యా, ఆర్థిక ప్రయోజనాలను ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి లేని వారికి సాంఘిక భద్రత కల్పించి, అన్ని రకాల దోపిడీలనుంచి రక్షణ ఏర్పాటుచేసే కృషి చేయాలని సూచిస్తున్నది. ఆర్టికల్ 47 పౌష్టికాహారం, లభించటానికి, ప్రజల జీవన ప్రమాణాలు, పెరగడానికి ప్రజారోగ్య అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని సూచిస్తున్నది. ఆరోగ్యానికి హానికరమయిన పదార్థాల సేవనాన్ని నిషేధించేందుకు (వైద్య అవసరాలకు తప్ప) ప్రభుత్వం కృషి చేయాలి. పశుపోషణ, వ్యవసాయ రంగాలను ఆధునికంగా, సశాస్త్రీయంగా వ్యవస్థీకరించే కృషి చేయాలని, ఆర్టికల్ 48 చెప్తున్నది. వివిన్న జాతుల పశువులను అభివృద్ధి చేయడం, గోవధ, దూడల వధ, ఇతర పాడి పశువుల వధలను నిషేధించడం ముఖ్యం. పర్యావరణాన్ని కాపాడి, అడవులను, జంతుజాలాన్ని రక్షించే బాధ్యత ఉందని ఆర్టికల్ 48A చెప్తున్నది – ప్రతి చారిత్రక చిహ్నాన్ని, స్థలాన్ని, వస్తువును, కట్టడాన్ని కళాత్మక, చారిత్రాత్మకమైనవిగా, జాతీయ ప్రాముఖ్యత గలవిగా పార్లమెంట్ ప్రకటించిన నిర్మాణాలను వినాశం కాకుండా, భ్రష్ట పట్టకుండా, తొలగించకుండా, ఎగుమతి చేయకుండా కాపాడాలని ఆర్టికల్ 49 వివరించింది.

3.4.3 మేధో స్వేచ్ఛా నియమాలు (ఆర్టికల్స్ 44, 45, 50, 51)

ప్రాథమిక విద్య, ఉమ్మడి సివిల్ చట్టం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత, అంతర్జాతీయ శాంతి వంటి లక్ష్యాల సాధనకు ఈ ఆర్టికల్స్‌ను రచించారు.

ఆర్టికల్స్ 44 అందరికీ ఒకే సివిల్ కోడ్ ఉండాలని సూచిస్తున్నది. రాజ్యాంగం ప్రారంభమయిన పదేళ్ళలోగా పధ్నాలుగేళ్ళు వచ్చేవరకు పిల్లలందరికీ నిర్బంధ ప్రాథమిక విద్య నేర్పేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఆర్టికల్స్ 45 సూచిస్తున్నది. ప్రభుత్వ సర్వీసు విషయంలో న్యాయ వ్యవస్థను కార్యనిర్వాహక వర్గం నుంచి వేరు చేయాలని ఆర్టికల్ 50 చెప్తున్నది.

ఆర్టికల్ 51 ప్రభుత్వం ముందు మరికొన్ని లక్ష్యాలను నిర్దేశించింది.

i) అంతర్జాతీయ శాంతి, రక్షణలను అభివృద్ధి చేయడం,

ii) వివిన్న దేశాలమధ్య సమంజసమయిన, సగౌరమైన సంబంధాల స్థాపన,

iii) అంతర్జాతీయ చట్టం, ఒప్పందాల విధులపట్ల గౌరవాన్ని పెంచడం,

iv) అంతర్జాతీయ వివాదాలను న్యాయ నిర్దేశితాల ద్వారా పరిష్కరించుకునే విధానాన్ని ప్రోత్సహించడం.

BRAOU

42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976 ద్వారా మరికొన్ని ఆదేశిక సూత్రాలను చేర్చారు :

i) నేరాలకు ఉచిత న్యాయ సహాయం ఇవ్వడం,

ii) ఫ్యాక్టరీల యాజమాన్యంలో, అంతర్జాతీయ పరిశ్రమల నిర్వహణలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించడం,

iii) సహజ సిద్ధ పర్యావరణాన్ని, పశు సంపదను, అడవులను రక్షించడం,

iv) బాలబాలికల అభివృద్ధి అవకాశాలు కల్పించడం.

v) ప్రజలకు ఉత్తమ జీవన అవకాశాలు కల్పించడం.

పర్యావరణ పరిరక్షణ నుంచి వన్య సంపదను నిలబెట్టుకోవడం, బాలబాలికల ప్రయోజనాలను కాపాడడం, వృద్ధ కార్మికులు శ్రేయస్సు రక్షణ వంటి అనేక సత్కార్యాలను ఆదేశిక సూత్రాలు సూచిస్తున్నాయి. సాంఘిక జీవనంలోని విభిన్న అంశాలయిన విద్య, ఉద్యోగం, వినోదం, ఆరోగ్యం, పారిశుధ్యం మొదలైన అనేక విషయాలకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించారు. అంతర్జాతీయ శాంతి స్నేహాలను గురించి కూడా ప్రస్తావించారు.

జస్టిక్ కానియా ఈ మార్గదర్శక సూత్రాల ప్రాధాన్యతను సరిగ్గా వివరించారు. "తాత్కాలికంగా ఆధిక్యంలో ఉన్న వారి అభిప్రాయాన్ని ఆదేశిక సూత్రాలు వెల్లడించడం లేదు. ఈ దేశ శాశ్వత శాసనాన్ని స్థాపించే దశలో జాతి వివేచనను వివేకాన్ని ఇది ప్రతిబింబిస్తున్నాయి."

3.5 ముగింపు

ప్రజలకు లభింపచేసే హక్కులను బట్టే ఏ రాజ్యాంగం గొప్పదనాన్నయినా వివరించవచ్చు. ప్రభుత్వం విధించుకున్న పరిమితులు హెచ్చినా కొద్దీ రాజ్యాంగంలోని ప్రజాస్వామిక స్ఫూర్తి ప్రస్ఫుటమవుతూ ఉంటుంది. ప్రభుత్వ ఆధిపత్యాన్ని అవిచ్ఛిన్నంగా రక్షిస్తూనే పాలితులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ దిశలో ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు కావలసిన భద్రతలు కల్పిస్తున్నాయి. ప్రజల అవసరాలన్నింటినీ తీర్చాలంటే ప్రభుత్వానికి ఎదురయ్యే ఇబ్బందులను పరిమితమయిన పదాలను రాజ్యాంగ నిర్మాతలు అర్థం చేసుకున్నారు. అయినా ప్రజలకు మరింత ఉత్తమ జీవనాన్ని కల్పించే బాధ్యతలను గుర్తచేయడానికి ఆదేశిక సూత్రాలను రూపొందించారు.

అనలు తెలుసుకోవలసిన ముఖ్యాంశం ఏమిటంటే ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాలు కేవలం గ్రంథంలోనే మిగిలిపోయే శుష్క క్రియాలు కాకూడదు. ప్రజల హక్కులను ఎట్టి పరిస్థితులలోనూ రక్షించే అవసరాన్ని రాజ్యాంగం గుర్తించిన విషయం రాజ్యాంగం సుస్పష్టం చేసింది. ప్రభుత్వాలు ప్రజలకు అనేక హక్కులను ఇచ్చినట్టు ప్రకటించినా అవి అమలై నేటికి ఫలితాలు అందినపుడే నిజమైన విజయం సాధించినట్టు భావించాలి. పౌరులకు హక్కుల సాధనకు పోరాడాలని రాజ్యాంగం ఆశిస్తూ అనేక జాగ్రత్తలు కల్పించింది. భారత ప్రజాస్వామ్యాన్ని స్ఫూర్తి మాత్రమే చైతన్యవంతం చేస్తుంది.

3.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

1. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.

1. భారత రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులను, ప్రపంచ మానవ హక్కుల ప్రకటనతో పోల్చండి.
2. భారత రాజ్యాంగంలోని వివిధ రకాల ఆదేశిక సూత్రాలను వివరించండి.

2. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి.

1. మేధోస్వేచ్ఛ నియమం గురించి వివరించండి.
2. గాంధేయ నియమాలను తెలుపండి.

BRAOU

4. న్యాయ వ్యవస్థ – మానవ హక్కులు

విషయక్రమం

4.0 ఉద్దేశం

4.1 పరిచయం

4.2 దేశీయ న్యాయస్థానాల్లో అంతర్జాతీయ ఒప్పందాల విలువ

4.3 అధికారాల మీద "హక్కులు" పరిమితులు

4.4 న్యాయ సమీక్షా నిర్ణయం

4.5 రిట్ ఉత్తర్వులు, మానవ హక్కుల అమలు

4.6 ముగింపు

4.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

4.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

- రాజ్యాంగ పరిధిలో న్యాయస్థానాల స్వభావం, లక్షణాలు, అధికారం, విధులు, విషయాలకు సంబంధించిన మౌలిక సిద్ధాంతాలు
- ప్రభుత్వ చర్యా సిద్ధాంతం, అధికారం పైన పరిమితులుగా హక్కులు, న్యాయసమీక్ష, రిట్ అధికారం.

4.1 పరిచయం

జాన్‌లాకే, జీన్ జాక్స్ రూసో, టోమాస్ పెయిన్ వంటి పాశ్చాత్య మేధావులు రచనల్లో, నిర్వచనాల్లో 20వ శతాబ్దపు మానవ హక్కులు రూపు దిద్దుకున్నాయి. 1689 ఇంగ్లీష్ బిల్ ఆఫ్ రైట్స్, 1789 ఫ్రెంచి డిక్లరేషన్ ఆఫ్ రైట్స్ ఆఫ్ మాక్ అండ్ పిటిషన్ అమెరికా బిల్ ఆఫ్ రైట్స్ 1791 లో ఈ హక్కులు మరింత విశ్వవ్యాప్త గుర్తింపును పొందాయి. యూరప్‌లో వ్యవస్థాపిత రాచరికాన్ని విజయవంతంగా సవాలు చేసిన నాటి ఆశలను, ఆకాంక్షలను ఈ హక్కుల ప్రకటనలను చిగురింప చేసాయి. వీటి ఆ భావమే 1948లో ఐక్యరాజ్యసమితి ప్రమాన మానవ హక్కుల ప్రకటనను ఆమోదించడం.

ఈ ప్రపంచ ప్రకటన సమున్న ఆశయాలను విశదం చేయడానికి ఉపయోగపడింది. శాసనపరంగా దేశాలను ఈ హక్కుల పాలనకు బద్దుల్ని చేసే శక్తి ఈ ఒప్పందానికి లేదు. ఈ హక్కులను అమలు చేసే యంత్రాంగం కూడా లేదు. ఈ లోపాన్ని పూరించడానికి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం డిసెంబర్ 1966న రెండు ఒప్పందాలను ఆమోదించింది. మానవ హక్కులు పాటించడం, అమలు చేయడం కోసం ఈ ఒప్పందాలు రూపొందించారు.

a) పౌర, రాజకీయ హక్కుల ఒప్పందం,

b) ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల ఒప్పందం.

మొదటిది, వ్యక్తులకు సంబంధించిన హక్కులను నిర్దేశిస్తున్నది. రెండో ఒప్పందం, ఆ హక్కులను సభ్య దేశాలు అమలు చేయాలని నిర్దేశిస్తున్నది.

1976 డిసెంబర్ నుంచి ఈ ఒప్పందాలు అమలులోకి వచ్చాయి. ఆ తర్వాత తగినంత సంఖ్యలో సభ్య దేశాలు ఈ ఒప్పందం పాటిస్తాయని సంతకాలు చేసాయి.

BRAOU

సభ్య దేశాల అంతర్జాతీయ వ్యవస్థ ప్రకారం ఆయా దేశాలు తమ జాతీయ చట్టాలు - రాజ్యాంగం ద్వారా ఈ మానవ హక్కులను అమలు చేయవలసి ఉంటుంది. వివిధ దేశాల ప్రభుత్వాలు హక్కులను గుర్తించి ఆమోందించేందుకు ప్రోత్సహించడమే అంతర్జాతీయ శాసన ధ్యేయం. ఆయాదేశాలు తమ రాజ్యాంగంలో ఈ హక్కులను చేర్చేందుకు ప్రోత్సహిస్తుంది. ఈ హక్కులను స్వేచ్ఛగా వినియోగించే వాతావరణం కల్పించి జాతి జీవన విధానంలో ఒక భాగంగా మలచుకోవాలి. మానవ హక్కులను, గుర్తించి గౌరవించలేని దేశాలు శాసనాలకు అతీతంగా అంతర్జాతీయ శాసనాన్ని అమల చేయరు. కాని ఆ దేశం తన యంత్రాంగం ద్వారా మానవ హక్కుల అమలు పరిస్థితులను అభివృద్ధి చేయడానికి ప్రోత్సహిస్తుంది. మరింత పటిష్టంగా హక్కులను అమలు చేయడానికి ప్రోత్సహిస్తుంది.

భారతదేశం ఈ విషయంలో అదర్శంగా నిలిచింది. రాజ్యాంగ నిర్మాణసభ చర్యలు సాగిస్తున్న సందర్భంలో ఐక్యరాజ్యసమితి ప్రపంచ మానవ హక్కుల ప్రకటనను అంగీకరించింది. ప్రపంచంలో ప్రజాస్వామ్యం పట్ల, మానవ హక్కుల పట్ల పెరుగుతున్న ఆసక్తిని రాజ్యాంగ నిర్మాతలు అర్థం చేసుకున్నారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమం ప్రజాస్వామ్య నిర్మాణాంశానికి, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల సాధనకై ప్రయత్నించింది. ఐక్యరాజ్య సమితి ఛార్టర్ 1945, మానవ హక్కుల ప్రకటన, 1948 నుంచి ప్రేరణను పొంది రాజ్యాంగం మూడో భాగంలో ప్రాథమిక హక్కులను రాజ్యాంగ నిర్మాతలు చేర్చారు. ఆర్టికల్ 51 (సి) లో ఆదేశిక సూత్రాల రూపంలో కొన్ని ప్రత్యే నియమాలను చేర్చారు. అంతర్జాతీయ శాసనాలను గౌరవించడం, ఒప్పందాలు విధించిన బాధ్యతలను పాటించడం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని ఈ ఆదేశిక సూత్రం నిర్దేశిస్తున్నది. వ్యవస్థీ కృతమైన నాగరిక దేశాలు పరస్పరం స్నేహంగా ఉండాలని 51 (సి) లక్ష్యం. పౌర, రాజకీయ హక్కుల ఒప్పందం, ఆర్థిక సామాజిక, సాంస్కృతిక హక్కుల బృందంలో పేర్కొన్న హక్కులను ఆదేశిక సూత్రాలలో పొందుపరచారు. రెండో ఒప్పందంపైన భారత్ 1979లో సంతకం చేసింది.

మానవ హక్కుల గురించి గంభీరంగా ప్రసంగాలు చేసి, పెద్ద పెద్ద నినాదాలు చేసి, హక్కులపట్ల అమితమయిన గౌరం ప్రకటించినంత మాత్రాన ప్రయోజనం లేదు. అసలు పరిష్కార మార్గం ఉన్నపుడు, హక్కు భంగపడగానే చర్య తీసుకునే మార్గం ఉన్నపుడే 'హక్కు' అనేది ఉన్నట్టు భావించాలి. 'పరిష్కారం లేకపోతే హక్కు ఉండదు' అనేది ఒక నానుడి. అసలు హక్కులు నిజంగా ఉన్నాయో లేదో కోర్టుల ద్వారా పరక్షించవలసిందే. స్వతంత్రమయిన పటిష్టమయిన, నిష్పాక్షిక మయిన, చురుకైన న్యాయ వ్యవస్థ లేకుండా మానవ హక్కులు బలవంతులు, రాజకీయ నాయకులు ఆడుకునే ఆట వస్తువులుగా మారిపోతాయి.

BRAOU

4.2 దేశీయ న్యాయస్థానాల్లో అంతర్జాతీయ ఒప్పందాల విలువ

ఒక దేశం అంతర్జాతీయ ఒప్పందంపై సంతకం చేసినా దానికి కట్టుబడి ఉండే చర్యలు తీసుకునే చట్టబద్ధత ఏర్పడదు. ఆ ఒప్పందంలోని అంశాలకు చట్టబద్ధత చేకూరాలంటే తమ రాజ్యాంగంలో వాటిని చేర్చడమో లేక శాసనాలు రూపొందించడమో ముఖ్యం. ఆమోదించిన శాసనాలను మాత్రమే న్యాయస్థానం అమలు చేస్తుంది. అందుకు కారణం జాతీయ సార్వభౌమ సిద్ధాంతమే. ఇతర దేశాల శాసనం అమలు చేయడమంటే సార్వభౌమాధికారాన్ని కోల్పోవడం అన్నట్టే. ఇంగ్లండులో కూడా, అంతర్జాతీయ ఒప్పందాలను వారి దేశీయ చట్టాలలో సమానమైన విలువ లేదు. కొన్ని రాజ్యాంగాలు మాత్రం అంతర్జాతీయ ఒప్పందాలను 'శాసనాలలో సమానమైన విలువ ఇస్తున్నాయి. ఉదాహరణకు అమెరికన్ రాజ్యాంగం అంతర్జాతీయ ఒప్పందాలకు స్వదేశీ శాసన హోదా కల్పిస్తున్నది. మానవ హక్కుల కేసును విచారించే దశలో అంతర్జాతీయ ఒప్పందాలను, దేశీయ శాసనాలకు తోడుగా అదనపు ఉపకరణాలుగా అమెరికన్ న్యాయస్థానాలు ఉపయోగిస్తాయి.

అంతర్జాతీయ ఒప్పందాలకు, బాధ్యతలను విలువనిచ్చి గౌరవించాలని భారత రాజ్యాంగం ఆదేశిక సూత్రాలలో నిర్దేశించింది. ఆదేశిక సూత్రాలను (నాలుగో భాగం) కోర్టుల ద్వారా అమలు చేయడానికి వీల్లేని అంశాలుగా ప్రకటించి,

రాజ్యాంగం మూడో భాగంలో న్యాయస్థానాల ద్వారా సాధించ తగిన ప్రాథమిక హక్కుల ప్రత్యేకతపై కొన్ని విమర్శలు వచ్చాయి. కాని రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితో వ్యవహరించారు. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ మహాసభ అంశాలకు ఆదేశిక సూత్రాల్లో విలువను కల్పించారు. ఈ తొలి దశలో వచ్చిన ఈ హక్కులు లేకపోతే మానవ హక్కుల కథ పూర్తికాదు. ఆదేశిక సూత్రాలే లేకపోతే ప్రాథమిక హక్కులకు రాజ్యాంగానికి ఇంత విలువ వచ్చి ఉండేది కాదు. మన దేశం 1993లో మానవ హక్కుల రక్షణ చట్టం చేసి, జాతీయ మానవ హక్కుల కమీషన్‌ను స్థాపించింది. మానవ హక్కుల స్థితిగతులను పరిశీలించి పర్యవేక్షించి, వాటి అమలుకు సిఫార్సు చేసే అధికారాలు ఈ కమీషన్‌కు ఉన్నాయి.

ఇటీవల సుప్రీంకోర్టు తీర్పులలో మానవ హక్కులను గురించి విస్తృతంగా ప్రస్తావించారు. మానవ హక్కుల న్యాయకోశానికి మన దేశంలో ప్రస్తుతం రాజ్యాంగ స్థాయి లభించిందని జస్టిక్ వి.ఆర్. కృష్ణ అయ్యర్ సునీల్ మిత్రా కేసు (II)లో చెప్పారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనలో ఆర్టికల్ 5లో పేర్కొన్న విధంగా ఎవ్వరినీ క్రూరంగా, అమానుషంగా హింసించడం గానీ, ఎవ్వరిపట్ల హీనంగా ప్రవర్తించడం గానీ, అమానుషంగా శిక్షించడం గానీ చేయకూడదన్న విషయం కోర్టులు గుర్తు పెట్టుకోవాలని న్యాయమూర్తులు సలహా ఇచ్చారు.

సమిష్టి కార్యచరణ, ప్రజా ప్రయోజన, ప్రాతినిధ్య విధానాలు, "ఆరసుల్ న్యాయ కోశం"లో చేరాయని భారతదేశ అత్యున్నత స్థానం వివరించింది. రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమిక హక్కులను ప్రజలకు అన్వయించడం ద్వారా సుప్రీకోర్టు మానవ హక్కులను రక్షించే కార్యక్రమం సాగిస్తున్నది.

అయితే న్యాయ వ్యవస్థ ఎందుకీ అధికారాలను స్వీకరిస్తున్నది. ఇతర ఆధీనమయిన ప్రభుత్వ వ్యవస్థలతో న్యాయ పయవస్థకున్న సంబంధాలేమిటి అనే ప్రశ్నలు తలెత్తుతాయ. ఈ ప్రశ్నలకు జవాబులు అన్వేషిస్తే మానవ హక్కుల రక్షణలో సుప్రీంకోర్టు పాత్ర మనకు అర్థమవుతుంది.

4.3 అధికారాల మీద "హక్కులు" పరిమితులు

'ప్రతి రాజ్యాంగానికి మౌలికంగా మూడు విధులు ఉంటాయి. ఒకటి రాజ్యాంగం - ప్రభుత్వానికి రూపురేఖలను నిర్మిస్తుంది. రెండు - కేంద్రానికి - రాష్ట్రాలకు మధ్య అధికారాలను విభజిస్తుంది. రాజ్యాంగం సృష్టించిన ఇతర సంస్థల అధికారాలను నియమిస్తుంది. మూడు - ప్రభుత్వం, దాని అనుబంధ సంస్థలు చెలాయించే అధికారాలను పరిమితం చేస్తుంది. ఆంక్షలు విధిస్తుంది. పౌరులకు ప్రాథమిక హక్కులను గ్యారంటీ చేయడమంటే ప్రభువుల అధికారాలపైన పరిమితులు విధించడమే. లిఖిత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను నేర్చడం ద్వారా ఇది 'పరిమిత ప్రభుత్వం' అనీ, ప్రభుత్వ విధానంలో ఒక్క వ్యవస్థ ఏరితిలో సంపూర్ణమయిన అధికారాలు లేవని స్పష్టం చేసినట్టయింది. 'పరిమిత ప్రభుత్వం' అంటే అమెరికన్ లా ప్రకారం "మనుషుల ఇష్ట ప్రకారం కాకుండా చట్టాలతో నడిచే ప్రభుత్వం" అని చెప్పుకోవచ్చు.

సంపూర్ణాధికారలతో చెలరేగే నియంతృత్వమైన ఎగ్జిక్యూటిక్ లేదా కార్యనిర్వాక వ్యవస్థ మీద నిరసన జ్వాలల ద్వారా ఇంగ్లాండ్‌లో ప్రజాస్వామ్యం ఆవిర్భవించింది. నియంతృత్వం ఏక పక్ష పాలనలకు సమాధానంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ సార్వభౌమత్వం ఇంగ్లీష్ ప్రజలు సంతృప్తి చెందారు. ఇంగ్లండ్‌లో పార్లమెంట్ అత్యున్నతమైన అధికారాలు కలిగిన వ్యవస్థ. పార్లమెంట్ సార్వజనిక అధికారాలపైన శాసనిక ప్రతిబంధకాలు లేనేలేవు. ప్రజల ప్రాథమిక హక్కులు భంగపరుస్తున్నాయన్న కారణంగా పార్లమెంట్ చేసిన చట్టాలను చెల్లవనే అధికారం ఎవరికీ లేదు అంతా ఇంగ్లాండ్ స్వాతంత్ర్యా సాధనకు పోరాడిన దేశం. ఆధునిక నాగరికతకు, శాసనిక విలువలో 'మీగెంత అన్నతులైన మీకన్న ఉన్నతమైంది న్యాయ సూత్రం" అనే నియమ పాలనలో బ్రిటిష్ అగ్రగామి రాజు కూడా చట్టానికి అతీతుడు కాదు. చట్టానికి విధేయుడు. వారి కోర్టులు కూడా పార్లమెంట్ సర్వాధికారాల ముందు మోకరిల్లి పార్లమెంట్ విశృంఖల శాసనాలకు బలి అయ్యే పౌరహక్కులను ఎవరు కాపాడతారు? దానికి జవాబు పార్లమెంట్

BRAOU

స్వయం సంయమనం. ఇంగ్లాండ్‌లో కోర్టుల అధికారాలు పరిమితమైనవి. న్యాయస్థానాల విచారణ పరిధిలోకి కార్యనిర్వాహక వర్గ ప్రభుత్వ పొరబాట్లు, పౌరహక్కుల ఉల్లంఘనలు వస్తాయి. అమెరికా, భారత దేశాల్లో వలె బ్రిటన్ రాజ్యాంగం లిఖిత మయినవి. కావు. కనుక అక్కడ ప్రాథమిక హక్కులు క్రోడీకరించిన రూపంలో లేవు. అంత మాత్రాన అక్కడ పౌరహక్కులకు గర్తింపు లేనేలేదని కాదు. తన హక్కులు భంగపడినాయని ఎవరయినా పౌరుడు ఫిర్యాదు వేయాలనే ఆ హక్కుపైన చట్టాల్లో ఏదయినా ప్రతి బంధకం విధించారో లేదో పరిశీలించాలి. ఇంగ్లాండ్‌లో వ్యక్తిస్వాతంత్రాలను రక్షించడానికి న్యాయస్థానాలు అవసరమయిన పరిష్కారాలను కల్పిస్తున్నాయి.

అన్నిదేశాల్లోవలెవే ఇంగ్లాండ్‌లో కూడా న్యాయవ్యవస్థ వ్యక్తి స్వాతంత్ర్యాల సంరక్షణ బాధ్యతను నిర్వహిస్తున్నది. అయినా కొంత తేడా ఉంది. కార్యనిర్వాహక వర్గం ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి గురయ్యే పౌరుడిని ఇంగ్లాండ్ కోర్టులు రక్షించినా, శాసనపరంగా పార్లమెంట్ హక్కులు హరించే శాసనాలు చేస్తే ప్రశ్నించే అధికారం వాటికి లేదు. లిఖిత రాజ్యాంగం గ్యారంటి వేసిన పౌరహక్కును భంగపరిచే శాసనాలను కొట్టివేసేందుకు అమెరికన్ కోర్టులకు ఉన్న అధికారం ఇంగ్లాండ్ కోర్టులకు లేదు. ఇగ్లాండ్, అమెరికాల మధ్య వ్యక్తి హక్కులకు సంబంధించి మౌలికమయిన కొన్ని తేడాలున్నాయి. ప్రభుత్వ (కార్యనిర్వాహక వర్గ) దురంతాలకు వ్యతిరేకంగా ఇంగ్లాండ్ కోర్టులు పౌరులకు రక్షణ కల్పిస్తే అమెరికలన్లు శాసన వ్యవస్థ దురంతాలను కూడా నిరోధించేందుకు సంకల్పించారు. తాత్కాలికంగా మెజారిటీ సాధించిన ఒక వర్గానికన్న అమెరికన్ రాజ్యాంగమే ఉన్నతమయిన శాసనమని స్వయంగా ప్రకటించుకుంది. అన్ని శాసనాలను విశ్లేషించి వర్తింపజేసే అధికారం కోర్టులకు ఇచ్చింది. రాజ్యాంగం సృష్టించిన విభిన్న వ్యవస్థలకు అధికారాలను విధించి పరిమితులను విధించింది. అధికార పరిధులను నిర్ణయించింది. ఏ వ్యవస్థయినా రాజ్యాంగం నిర్దేశించిన నియమాలను భంగపరిస్తే అటువంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యను, చట్టాన్ని కొట్టవేయవలసిన బాధ్యత, అధికారం కోర్టులకు ఉంది.

అమెరికాలో "దేశభద్రత" ఆధారంగా వ్యక్తి స్వాతంత్ర్యాలపైన పరిమితులు విధించవచ్చనే సూత్రాలు లేవు. దేశ భద్రత కోసం వ్యక్తి హక్కులను అతీతంగా శాసనం చేసే తుది అధికార శాసన వ్యవస్థకు లేవు. అయితే సాంఘిక జీవనానికి స్పష్టమయిన తక్షణ ప్రమంచం ఉన్న దశలో మాత్రం వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కుదించే అధికారం న్యాయస్థానాలకు ఉంది. పౌరుల ప్రాథమిక హక్కుల సంరక్షకుని హోదాలో న్యాయవ్యవస్థ ఎన్నికయిన ప్రజాప్రతినిధుల అభిప్రాయాలకు భిన్నంగా తీర్మానించవచ్చు. రాజ్యాంలోని అన్ని వ్యవస్థలు న్యాయస్థానాల సమీక్షకు విచారణాధికారానికి లోబడవలసిందే. ఎగ్జిక్యూటిక్ (కార్య నిర్వాహక వర్గం) శాసన వ్యవస్థ దురంతాలనుంచి నుంచి పౌరుల స్వాతంత్ర్యాలను కల్పించే విధానాన్ని భారతరాజ్యాంగం సంతరించుకున్నది. ఆర్టికల్ 12 చాలా కీలకమయిన నియమం. శాసన, కార్య నిర్వాహక, న్యాయవ్యవస్థలకు వ్యతిరేకంగా పౌరహక్కులను అమలు చేయగల అధికారానికి ఆర్టికల్ 12 ఒక మార్గం. పౌరహక్కులు భంగపడినాయని ఫిర్యాదు చేసే పౌరుడు అర్టికల్ 32 ద్వారా సుప్రీంకోర్టు తలుపు తట్టి అందుకు అవసరమయిన ఉత్తర్వులు, ఆదేశాలు జారీ చేయాలని కోరవచ్చు. కనుక ఆర్టికలల్ 32 మరో కీలకమయిన రాజ్యాంగ నియమం. శాసన వ్యవస్థకు సంబంధించినంత వరకు ఆర్టికల్ 13(2) కీలకమైంది. "పౌరుల హక్కులను నిర్మూలించే లేదా తగ్గించే శాసనాలను ప్రభుత్వం తేకూడదు. ఈ నియమాన్ని ఏ చట్టమయినా ఉల్లంఘిస్తే ఆ ఉల్లంఘన భావించినంత మేరకు ఆ చట్టం చెల్లదు" అని ఈ ఆర్టికల్ 13(2) చెప్తున్నది. ప్రజల హక్కులు - ప్రభుత్వం అధికారాలపై పరిమితులుగా పని చేస్తాయి కనుక, ప్రభుత్వానికి చెందిన మూడు ప్రధాన వ్యవస్థల చర్యలనుంచి ప్రాథమిక హక్కులలను కాపాడుకొనవలసిన, వాటిని అమలు చేయవలసిన బాధ్యత కోర్టులకు ఉంది. ఏ వ్యవస్థ అయినా ఈ హక్కులకు భంగం కలిగిస్తే, ఆ మేరకు ఆ చర్య చెల్లకుండా పోతుంది. ఆ చర్య చెల్లదంటూ ప్రకటించే బాధ్యత కోర్టులపైన ఉంది. ఈ చర్చ ద్వారా 'అధికారం' పౌరహక్కులను హరించే సాధనమని, 'హక్కు' - ఆ అధికారంపైన ప్రతిబంధనమని అర్థమవుతుంది.

BRAOU

4.4 న్యాయ సమీక్షా సిద్ధాంతం

ప్రభుత్వం ఆమోదించిన శాసనాల రాజ్యాంగ బద్ధతను పరిశీలించి నిర్ణయించే అంటారు. రాజ్యాంగ బద్ధమయిన శాసనాలను అమలు చేసి, రాజ్యాంగ వ్య చేయకుండా తిరస్కరించే అధికారం కూడా 'న్యాయ సమీక్ష'లో ఇమిడి ఉంది పాలనాధికారాలకు 'న్యాయసమీక్ష' ద్వారా న్యాయ వ్యవస్థ పగ్గాలు వేస శాసనం, అత్యున్నత శాసనం అనే రెండు శాసనాలు కూడా "న్ అత్యున్నత శాసనం అంటే రాజ్యాంగం ద్వారానే విభిన్న శాసనాలు కనుక అనలు మూలశాసనమయిన రాజ్యాంగ నియ అటువంటి రాజ్యాంగ వ్యతిరేక శాసనాలు ప్రజాస్వామిక నాగరిక దేశాల

BRAOU

ండా వదిలివేయజాలం. మాకు విచారణాధికరం లేని చోట లాక్కోలేం. అటువంటి
హం చేసినట్టే" అని ఛీఫ్ జస్టిస్ మార్షల్ వివరించారు.
టించి తీరుతామని న్యాయమూర్తులు ప్రమాణం చేస్తారు. అందుకు కట్టుబడి
జ్యాంగ పరిధి దాటిపోతే అది రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించే బాధ్యతను
తీర్పు ఇస్తే (a) కార్యనిర్వాహక వర్గం (ప్రభుత్వం) రాజకీయం చర్యలు
తేల్చడంవల్ల తీవ్రమయిన సాంఘిక ఆర్థిక పరిణామాలు సంభవిస్తాయని,
న్యాయ నిర్ణయ విధానం కష్టమవుతుందని, (d) రాజ్యాంగ
ాల ఆధారంగా భయపడి ఆ విధంగా తీర్పు ఇవ్వకుండా
ాలు అప్రమత్తంగా ఉండి,

BRAOU

4.4 న్యాయ సమీక్షా సిద్ధాంతం

ప్రభుత్వం ఆమోదించిన శాసనాల రాజ్యాంగ బద్ధతను పరిశీలించి నిర్ణయించే అధికారాన్ని 'న్యాయ సమీక్షాధికారం' అంటారు. రాజ్యాంగ బద్ధమయిన శాసనాలను అమలు చేసి, రాజ్యాంగ వ్యతిరేకమయిన శాసనాలను అమలు చేయకుండా తిరస్కరించే అధికారం కూడా 'నాయ్య సమీక్ష'లో ఇమిడి ఉంది. శాసన వ్యవస్థ అధికారాలకు, ప్రభుత్వ పాలనాధికారాలకు 'న్యాయసమీక్ష' ద్వారా న్యాయ వ్యవస్థ పగ్గాలు వేస్తుంది. పరిమిత ప్రభుత్వం సూత్రం, సాధారణ శాసనం, అత్యున్నత శాసనం అనే రెండు శాసనాలు కూడా "న్యాయసమీక్షాధికారం" అధార సూత్రాలు అనవచ్చు. అత్యున్నత శాసనం అంటే రాజ్యాంగం ద్వారానే విభిన్న శాసనాలు విధానాలను రూపొందించే అధికారాలు సంక్రమిస్తున్నాయి. కనుక అనలు మూలశాసనమయిన రాజ్యాంగ నియమాలను వ్యతిరేకించే ఏ సాధారణ శాసన మయినా చెల్లదు. అటువంటి రాజ్యాంగ వ్యతిరేక శాసనాలు చెల్లబోవని చెప్పే అధికారం ఏదో ఒక సంస్థకు / వ్యవస్థకు ఉండాలి. ప్రజాస్వామిక నాగరిక దేశాలలో న్యాయవ్యవస్థకు ఆ అధికారాలను ఇచ్చారు.

ప్రాథమిక హక్కులను భంగపరిచే శాసనాలను సమీక్షించి నిరోధించే అధికారానికి మూల సూత్రాలు కొన్ని ఉన్నాయి. (a) లిఖిత రాజ్యాంగం. ఒక శాసనిక పత్రం (b) శాసనిక పత్రాలు సాధనాలను వినియోగించి, అర్థం చెప్పే బాధ్యత న్యాయ వ్యవస్థపై ఉంటుంది. (c) ప్రభుత్వంలోని అన్ని వ్యవస్థల అధికారాలపైన రాజ్యాంగం పరిమితులు విధించింది. (d) రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులు ప్రభువుల అధికారాలకు పగ్గాలు వేస్తాయి. కనుక ప్రాథమిక హక్కులకు భిన్నంగా ఉన్న శాసనాలను అమలు చేయకుండా నిరోధించే హక్కు, అధికారం, బాధ్యత న్యాయస్థానాలపై ఉంది. ఈ మూల సూత్రాలు పనిచేసే ఏ నాగరిక ప్రజాస్వామిక దేశంలోనూ న్యాయవ్యవస్థ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు బాసటగా ఉండి తీరవలసిందే.

ప్రాథమిక హక్కులకు సంబంధించినంత వరకు భారతదేశపు అత్యున్నత న్యాయస్థానం తనకు హక్కుల సంరక్షణ ఆ బాధ్యత గురించి వివరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి భగవతి ఈ విధంగా అన్నారు. "రాజ్యంగం ఇచ్చిన అధికారాన్ని అయా సంస్థలు పరిమితులకు లోబడి చెలాయిస్తున్నాయా లేదా అని మందలించే అధికారం కోర్టులకు ఉంది. అది న్యాయస్థానాల రాజ్యాంగ పరమయిన బాధ్యత కూడా. రాజ్యాంగం అత్యున్నత మయిందనీ, దేశంలో కెల్లా గొప్పని, ప్రభుత్వంలోని ఏ విభాగం కూడా రాజ్యంగం కన్న ఎక్కువ కాదు. రాజ్యాంగాన్ని మించి వ్యవహరించరాదు. కార్యనిర్వాహక వర్గమైన శాసన వ్యవస్థ అయినా, న్యాయ వ్యవస్థ అయినా తమ అధికారాలను రాజ్యాంగం నుంచి గైకొంటాయి. ఆ అధికార పరిధులకు లోబడి మాత్రమే వ్యవహరించాలని అంటుంది.

ఎవరు ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా, వానికెంత గొప్ప అధికారం ఉందని చెప్పుకున్నా, తనే తన అధికారానికి నిర్ణేతనని వివరించినా, రాజ్యాంగం విధించిన పరిధుల లోపల మాత్రమే వారి అధికారాలను వినియోగించవలసి ఉంటుంది. రాజ్యాంగ అర్థవివరణాధికారం న్యాయస్థానాలకే ఉంది. విభిన్న ప్రభుత్వ విభాగాలకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాల పరిధులను నిర్ధారించే అధికారం, ఆ పరిమితులను వివరించి, అధికారం పరిమితులను దాటి పోయిందో లేదో నిశ్చయించే అధికారం కోర్టులకే ఉంది. వ్యవస్థాగత విలువలను బట్టి రాజ్యాంగ పరిధులను పరిమితులను అమలు చేసేవన్ని న్యాయస్థానాలదే".

మార్బరీ Vs మాడిగన్ (1803) కేసులో అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్ న్యాయసమీక్షా సిద్ధాంతాన్ని మొదట ప్రతిపాదించారు. "కోర్టులు ఏం చేయాలి? చట్టం ఏదో ఏమిటో తెలియజెప్పడం న్యాయ స్థానాల బాధ్యత.

"శాసన వ్యవస్థ ఒక చర్య తీసుకోకుండా తప్పుకోవచ్చు. కాని న్యాయవ్యవస్థ అల్లాకాదు. రాజ్యాంగం నిర్దేశిక పరిధిలో నిర్ణయించిన విధులు నిర్వర్తించక తప్పదు. సందేహాస్పందంగా ఉంది కనుక వదిలేయ జాలదు. ఎన్ని అనుమానాలున్నా , ఎన్ని కష్టాలున్నా మాముందుకు వచ్చిన కేసు వినక తప్పదు. నిర్ణయించక తప్పదు. మా

BRAOU

[redacted]ండా వదిలివేయజాలం. మాకు విచారణాధికారం లేని చోట లాక్కోలేం. అటువంటి విచారణాధికారాన్ని వినియోగించక[redacted]హం చేసినట్టే" అని చీఫ్ జస్టిస్ మార్షల్ వివరించారు. పని ఏదీ చేసినా రాజ్యాంగానికి [redacted]టించి తీరుతామని న్యాయమూర్తులు ప్రమాణం చేస్తారు. అందుకు కట్టుబడి

రాజ్యాంగ నియమాలు [redacted]జ్యాంగ పరిధి దాటిపోతే అది రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించే బాధ్యతను ఉంటారు. ఒక చట్టం ఏమయినా [redacted]తీర్పు ఇస్తే (a) కార్యనిర్వాహక వర్గం (ప్రభుత్వం) రాజకీయం చర్యలు వదిలి వేయకూడదు. కోర్టు ఆ విధంగా [redacted]తేల్చడంవల్ల తీవ్రమయిన సాంఘిక ఆర్థిక పరిణామాలు సంభవిస్తాయని, తీసుకుంటుందేమోనని, (b) రాజ్యాంగ వ్యతిరేకమని [redacted]న్యాయ నిర్ణయ విధానం కష్టమవుతుందని, (d) రాజ్యాంగ (c) పాలనా పరమయిన అసౌకర్యం ఏర్పడి నేర[redacted]ల ఆధారంగా భయపడి ఆ విధంగా తీర్పు ఇవ్వకుండా ఉల్లంఘన మరీ చిన్నదనీ, దాని ప్రభావం తక్కువ అనే కార[redacted] ఉండడానికి వీలులేదు.

కోర్టులను మానవ హక్కుల విషయంలో తీర్పు చెప్పమని అడిగితే న్యాయస్థా[redacted]లు అప్రమత్తంగా ఉండి, ప్రాథమిక హక్కుల స్వల్ప మాత్రంగా భంగపరిచినా, ప్రజల అధికారాలను, మినహాయింపులను, హక్కు[redacted]ను భిన్న స్థాయిలో దెబ్బతీసినా నిరోధించడం రాజ్యంగ పరమయిన బాధ్యత అని చీఫ్ జస్టిస్ మార్షల్ పేర్కొన్నారు.

మన దేశంలో కోర్టుల రాజ్యాంగ బాధ్యత మరింత సుస్పష్టమయింది. ప్రాథమిక హక్కుల అమలు కోసం సుప్రీం కోర్టుకు వెళ్ళడం కూడా ప్రాథమిక హక్కు రూపంలో ఆర్టికల్ 32 కింద హామీ ఇవ్వడం బాధ్యతను దృఢతరం చేసింది. శాసన వ్యవస్థ మితిమీరిన అధికారాలతో వ్యవహరించడం వల్ల సుప్రీంకోర్టు తన సమీక్షాధికారాన్ని వినియోగించడానికి మంచి ఉదాహరణగా ఇందిరాగాంధి Vs రోజ్‌నారాయణ్ (AIR 1975 sc 2299) కేసు నిలుస్తుంది. ఇందిరాగాంధీ పార్లమెంట్ ఎన్నిక కావడం చెల్లదని అలహాబాద్ హైకోర్టు నిర్ణయానికి తర్వాత, సుప్రీంకోర్టు ముందు ఆమె విచారణలో ఉండగానే 39వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 1975లో ఆర్టికల్ 329 A (4)ను చేర్చి ఆమె ఎన్నికను వెనుక తేదీనుంచి సక్రమం చేసారు. అంతకు ముందు కోర్టు ఉత్తర్వుతో సంబంధం లేకుండా ఆమె ఎన్నిక సక్రమంగా ఉంటుందని చెప్పూ, ఆలిన్వాడ్ చెల్లదన్న కోర్టు ఉత్తర్వు ఎవ్వరికీ చెల్లదని, ఆ ఉత్తర్వుకు ఏ పరిణామమూ ఉండబోదని కూడా ఈ సవరణ ప్రకటించింది. సుప్రీంకోర్టు మెజారిటీ న్యామూర్తులు ఈ సవరణకు, ఆర్టికల్ 329 - (4) కు రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించింది. ఇందిరాగాంధీ ఎన్నిక సక్రమమే అంటూ చెప్పడం కోసం రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా పార్లమెంట్ బాధ్యత రాహిత్యం, నియంత్రత విచక్షణ, రాజకీయ అవసరం" అని జస్టిస్ మాథూన్ అన్నారు. "ఇది హక్కులను హరించే ద్రోహకర చర్య" అని ఆయన వమర్శించారు. ఎందుకంటే ఇది "ఒకానొక ఎన్నిక వివాదాన్ని పరిష్కరించడానికి ఎన్నిక చేసిన తీర్పు. అందుకోసం రాజ్యాంగాన్ని సవరిస్తూ చట్టం చేసారు" అని వివరించారు.. ఈ చర్యను Bill of Altainder అని విమర్శించాడు. ఆర్టికల్ 14 ప్రతిపాదించిన మౌలిక రాజ్యంగ సూత్రాన్ని నిస్సిగ్గుగా భంగపరచిన చట్టం అని జస్టిస్ చంద్రచూడ్ తమ ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేసాడు..

ఎమర్జన్సీ (అత్యవసర పరిస్థితి)ని ప్రకటించడం, న్యాయవ్యవస్థ పట్ల రాజకీయ నాయకుల ద్వేషాన్ని సూచించింది. ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా రద్దు చేయడం నియంతృత్వ పాలనకు దారితీసింది. కాని న్యాయవ్యవస్థ క్రమంగా తన అధికారాలను వ్యక్తం చేస్తూ మౌలిక హక్కులను, ప్రజాస్వామిక విలువలను రక్షించడం మొదలు పెట్టింది. భారత రాజ్యాంగ మౌలిక స్వభావమయిన - ప్రజాస్వామ్యం, శాసనిక పాలన, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, సెక్యులరీజం లక్షణాలను ధ్వంసం చేసే అధికారం పార్లమెంట్‌కు లేదు. '80వ దశకంలో సుప్రీంకోర్టు అనేక తీర్పుల ద్వారా న్యాయ సమీక్ష కూడా రాజ్యంగ మౌలిక లక్షణమని వివరించింది.

న్యాయవ్యవస్థ కేవలం శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలకు అభిముఖంగా సంభ్రమించే ఉపగ్రహం కాదని, స్వయంగా నిలబడిన ఒక ప్రజాస్వామిక వ్యవస్థ అని సుప్రీంకోర్టు ఎమర్జన్సీ అనంతర కాలంలో నిర్ధారించింది.

BRAOU

పరిమిత న్యాయ సమీక్షాధికార సిద్ధాంతం వల్ల న్యాయ వ్యవస్థ చట్టాల్లో పోపాలను సవరించే కార్యానికి మాత్రమే పరిమితం కావలసి ఉంటుంది. కాని అరాచకాన్ని నిలదీసి, హింసకు, వేధింపులకు, అక్రమ నిర్బంధాలకు, నిర్బంధంలో మరణాలకు, న్యాయేతర మరణాలకు గురయిన బాధితులకు నష్టపరిహారాలను ఇచ్చింది. న్యాయవ్యవస్థ. అంతేకాదు మానవ హక్కుల పతాకను ధరించి ముందడుగు వేసింది. ప్రజ కోసం ప్రజల హక్కుల చైతన్య సాధన కోసం న్యాయస్థానాలున్నాయనే విశ్వాసం కల్పించింది.

అమెరికన్ సుప్రీంకోర్టు గతంలో ప్రతిపాదించిన ('Theory of Eanxation) అంటే రాజ్యాంగం గుర్తించి ప్రకటించబడిన హక్కులలో ఇమిడి ఉన్న హక్కుల్ని విశదీకరించి, ప్రస్తావం చేసే సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని భారత సుప్రీంకోర్టు తన అధికారాలను పటిష్టం చేసుకున్నది. ప్రాథమిక హక్కుల జాబితాలో లేని హక్కులను కూడా వేరున్న ఆ హక్కులలో ఇమిడి ఉన్నందున ప్రాథమిక హక్కులుగా ప్రకటించింది. గుర్తించిన హక్కు నుంచి ఉద్భవించిన హక్కు లేదా ప్రకటిత హక్కును మరింత అర్థవంతంగా అమలు చేసేందుకు కొత్త హక్కును గుర్తించడం అవసరం అని చెప్పింది. రాజ్యాంగం పేరు ఇచ్చిన కొన్ని హక్కులకు జన జీవాలను ఇచ్చేందుకు ఉద్భవించిన హక్కులు నిజానికి, ప్రకటిత ప్రాథమిక హక్కల నీడలే.

ఈ సిద్ధాంతాన్ని వినియోగించి సుప్రీంకోర్టు 14, 19, 21 ఆర్టికల్స్ నుంచి ఎన్నో ఆసంఖ్యాకమయిన మౌలిక హక్కులను ఉద్భవింపచేసినాయి. అవి :

1) వ్యక్తి రహస్య హక్కు (Privacy)
2) గౌరవ జీవన హక్కు (Human Dignity)
3) విదేశీ ప్రయాణపు హక్కు
4) చిత్రహింస, క్రూరత్వం, అసాధారణ శిక్ష, ఒంటరి శిక్ష వంటి అవమానకర శిక్షలకు వ్యతిరే హక్కు. చేతికి బేడీలు వేయకుండ ఉండే హక్కు
5) సత్వర విచారణ హక్కు
6) క్రిమినల్ కేసులో ఉచిత నాయ్య సహాయ హక్కు
7) శిక్ష అమలులో జాప్యానికి వ్యతిరేక హక్కు
8) నిర్బంధంలో హింసకు వ్యతిరేక హక్కు.
9) ఆవాన హక్కు, వైద్య సహాయ, ఆరోగ్య హక్కు.
10) కాలుష్య రహిత పర్యావరణ హక్కు
11) 14 సంవత్సరాల వయసు వచ్చే వరకు బాల బాలికలకు చదువుకునే హక్కు.
12) పత్రికా స్వేచ్ఛ.

న్యాయ వ్యవస్థ మానవ హక్కుల పతాకాన్ని మునుముందుకు తీసుకు వెళ్ళింది. ప్రజల హక్కులు రక్షిస్తు సమాజంలో ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది.

4.5 రిట్ ఉత్తర్వులు : మానవ హక్కుల అమలు

హక్కులు భంగపడకుండా అమలయ్యేట్లు చూసే సమర్థవంతమయిన యంత్రాంగం లేకుండా ఊరికే హక్కులను ప్రటించడం వల్ల ప్రయోజనం లేదు. పరిష్కారం ఉన్నపుడే హక్కును నిజంగా గుర్తించినట్లవుతుంది. పరిష్కారం లేకపోతే హక్కు కూడా లేరు. ప్రతి రాజ్యాంగం ప్రాథమిక హక్కుల అమలునుకు కావలసిన యంత్రాంగాన్ని కల్పించాలి. భారత రాజ్యాంగ నిర్మాతలు కూడా ఆర్టికల్ 32, 226 కింద ప్రాథమిక హక్కుల అమలు యంత్రాంగం, విధానాన్ని నిర్ణయించింది. ఆర్టికల్ 32 విశిష్టతను వివరిస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఈవిధంగా అన్నారు.

BRAOU

"రాజ్యాంగంలో అన్నింటికన్నా ప్రధానమయిన ఆర్టికల్ ఏది అని నన్నడిగితే, ఏ ఆర్టికల్ ఉండకపోతే రాజ్యాంగం మొత్తమే చెల్లకుండా పోతుందని అడిగితే, నేను దీన్ని తప్ప మరే ఆర్టికల్ పేరు కూడా చెప్పను. ఆర్టికల్ 32 రాజ్యాంగానికి గుండెకాయ, అంతరాత్మ" అన్నారు.

రాజ్యాంగం IIIవ విభాగంలో కేటాయించిన ప్రాథమిక హక్కులను అమలు చేయడానికి తగిన ప్రొసీడింగ్స్ ద్వారా సుప్రీంకోర్టుకు విశ్లేష హక్కును ఆర్టికల్ 32(1) ప్రకటించింది. ఆర్టికల్ 32 (2) సుప్రీంకోర్టుకు తగిన ఉత్తర్వులు, రిట్‌లు ఇతర ఆదేశాలు జారీచేసే అధికారాన్ని ఇచ్చింది. రిట్ హెబియస్ కార్టస్ (సజీవంగా జరుపకూడదు) మాండమస్ (అజ్ఞాతన) ప్రొహిబిషన్ (నిషేధం), కోవారంటో, సర్షియోరరీ వంటి రిట్లు జారీ చేయవచ్చు. ఆర్టికిల్ 32(3) ప్రకారం పార్లమెంట్ కొన్ని ఇతర కోర్టులకు తమ పరిధిలో 32(2) క్రింద సుప్రీంకోర్టు చలాయించగల అధికారాలలో కొన్నింటిని అప్పగిస్తూ చట్టం చేసే వీలు కల్పించారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధానం ద్వారా తప్ప మేరే విధంగానూ ఆర్టికల్ 32 కింద ఇచ్చిన "కోర్టుకు వెళ్ళే హక్కు" ను రద్దు చేయడానికి వీల్లేదని 32(4) చెప్తున్నది. ఆ విధంగా ఆర్టికల్ 32 పౌరుల ప్రాథమిక హక్కులను న్యాయవ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ భంగపరిచినపుడు సత్వర పరిష్కారాన్ని కల్పిస్తున్నది. ఇతర రాజ్యాంగాలతో పోలుస్తున్నప్పుడు ఈ అధికారం విస్తృతమైందని తెలుస్తుంది. ఆర్టికల్ 32(2) ఇస్తున్న అధికారాలనే ఆర్టికల్ 226 హైకోర్టులకు కల్పిస్తున్నది.

ప్రాథమిక హక్కులు భంగపడినపుడు వివిధ పరిస్థితులను అవసరాలను అనుసరించి, ఆర్టికల్ 32(2)తో పేర్కొన్న రిట్ అధికారాలను వినియోగించమని సుప్రీంకోర్టును కోరవచ్చు. ఈ వివిన్న రిట్‌ల లక్ష్యాలను కింద వివరించడం జరిగింది.

1) ఆర్టికల్ 21 కింద వ్యక్తి స్వాతంత్ర్యానికి సంబంధించిన ప్రాథమిక హక్కును ఉల్లంఘించి, ఆ వ్యక్తిని అరెస్టు చేసినా నిర్బంధించినా ఆ శాసనాల రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తూ నిర్బంధిత వ్యక్తిని కోర్టుముందు హాజరు పరచాలని అధికారులను ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టు లేదా హైకోర్టును బాధితుడైన వ్యక్తి ప్రార్థించవచ్చు.

2) కార్య నిర్వాహక వర్గం వ్యక్తి ప్రాథమిక హక్కును దెబ్బతీసే విధంగా ఒక శాసనాన్ని రూపొందించి అమలు చేయడానికి సిద్ధ పడినప్పుడు ఆ చర్యను నిరోధిస్తూ ప్రభుత్వాన్ని తదితర అధికారులను ఆదేశించాలని బాధితుడైన వ్యక్తి మాండమస్ రిట్ కోసం పిటిషన్ పెట్టుకోవచ్చు. మాండమస్ ద్వారా రాజ్యాంగ వ్యతిరేకమని తేలిన చట్టాన్ని అమలు చేయకుండా ప్రభుత్వాన్ని నిరోధించవచ్చు.

3) కింది కోర్టుగాని కోర్టు తరహా న్యాయ నిర్ణయం జరిపే ట్రిబ్యూనల్ గాని, రాజ్యాంగ వ్యతిరేకమని ఆరోపితమైన ఒక శాసనాన్ని అమలు చేయబోతూ ఉంటే దాన్ని నిరోధించడానికి బాధితుడు "ప్రొహిబిషన్ రిట్" జారీ చేయాలని పిటిషన్ పెట్టుకోవచ్చు. ఒకవేళ అప్పటికే క్రింది కోర్టుగాని, ట్రిబ్యునల్‌గాని ఉత్తర్వు జారీచేస్తే ఉత్తర్వును కొట్టి వేయాలని కోరుతూ "సర్షియోరలీ రిట్" జారీచేయాలని బాధితుడు కోరవచ్చు. కింది కోర్టులు తమ న్యాయ విచారణా పరిధిని అతిక్రమించ కుండా నిరోధించేందుకు "ప్రొహిబిషన్", "సర్షియోరరీ" రిట్‌లను జారీచేస్తారు. ఈ రెండు రిట్‌లు ఒకే రకమైనప్పటికి వీటి మధ్య ఒక తేడా ఉంది. తదుపరి చర్యలు తీసుకోకుండా "ప్రొహిబిషన్" నిరోధిస్తే కింది కోర్టు జారీచేసిన ఉత్తర్వును రద్దుచేయడానికి "సర్షియోరరీ రిట్" జారీ చేస్తారు.

4) "కోవారంటో" అంటే "నీకున్న అధికారం ఏమిటి?" అని అర్థం. ఒక అధికార స్థానంలో ఉన్న వ్యక్తిని ఆ పదవిలో కొనసాగడానికి అతనికున్న అధికారం ఏమిటని ప్రశ్నించే ఉత్తర్వు "కోవారంటో రిట్ ". ఒక వ్యక్తి చట్ట వ్యతిరేకంగా పదవిలో కొనసాగకుండా నిరోధించడానికి ఈ రిట్‌ను జారీ చేస్తారు.

మానవ హక్కులను భంగపడకుండా కాపాడడానికి అధికార దుర్వినియోగాన్ని నిరోధించడానికి "హెబియస్ కార్పస్" మాండమస్ రిట్"లను ఉత్తమమైన సాధనాలుగా వాడుతున్నారు. పౌరుల ప్రాథమిక హక్కులను, పాలకుల అధికారాలపై పరిమితులని పరిగణించే సిద్ధాంతానికి భారత రాజ్యాంగం మరో కొత్త కోణాన్ని సమకూర్చింది. ఆర్టికల్ 15(2), 17, 21, 23లను ఉల్లంఘించినపుడు ఒక సాధారణ వ్యక్తికి వ్యతిరేకంగా కూడా ఈ రిట్‌లను జారీచేయవచ్చు. అస్పృశ్యతా, సాంఘిక వివక్ష, వెట్టిచాకిరి వంటి దురన్యాయాలు జరిగినపుడు బాధితుడు కోర్టుకు వెళ్ళి తన హక్కులను రక్షించాలని కోరవచ్చు.

BRAOU

4.6 ముగింపు

ఇంతవరకు వివరించిన అంశాలను బట్టి మానవ హక్కులను అభ్యుదయకరంగా అమలులోకి తీసుకు వచ్చేందుకు వివిధ హక్కులను గుర్తించి విస్తరించి, వివరించే, అన్వయించే రాజ్యాంగ పరమైన బాధ్యత న్యాయ వ్యవస్థకు ఉందని విశదమైంది. న్యాయ స్థానాలు కూడా రాజ్యాంగాన్ని అతిక్రమించి వ్యవహరించడానికి వీల్లేదు. పాలనా వ్యవస్థలు మానవ హక్కులకు హాని చేయకుండా కోర్టులు నిరోధించ గలుగుతాయి. కనుక పాలకుల అధికారాలపై పౌర హక్కులు ఆంక్షలుగా పని చేస్తాయని అర్థమౌతుంది. ప్రభుత్వం నియంతగా మారకుండా న్యాయ సమీక్షాధికార సిద్ధాంతం నిరోధిస్తుంది. భారత సుప్రీకోర్టు అమెరికన్ సుప్రీంకోర్టు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ చర్యా సూత్రం, ఉన్న హక్కులనుంచి కొత్త హక్కులను సృష్టించే సిద్ధాంతం అమలు చేసి పౌరుల మౌలిక స్వేచ్ఛలను రక్షించి జీవన హక్కు వంటి హక్కులను విభిన్న కోణాలలో విస్తరింప చేసింది. ఈ సృజనాత్మకమైన అన్వయం ద్వారా మన సమాజం మానవ హక్కుల చైతన్యం మరింత విస్తరించింది.

4.7 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.

1) మానవ హక్కులకు సంబంధించి న్యాయ సమీక్ష ప్రాధాన్యతను వివరించండి.

2) ప్రాథమిక హక్కుల రక్షకులుగా న్యాయ స్థానాలు వ్యవహరిస్తున్నాయని ఏ విధంగా చెప్పగలరు?

II. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి.

1) భారత సుప్రీం కోర్టు హక్కుల అర్థాలు వివరించి కొత్త హక్కులను సృష్టించడానికి అనుసరించిన సిద్ధాంతాలు ఏమిటి?

2) న్యాయ సమీక్ష గురించి చర్చించండి.

BRAOU

5. ధర్మాసన చైతన్యం – మానవ హక్కులు

విషయక్రమం

5.0 ఉద్దేశ్యం

5.1 పరిచయం

5.2 ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు

5.3 ధర్మాసన చైతన్యం

5.4 ముగింపు

5.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

5.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

- ప్రజా ప్రయోజన వ్యాజ్యాల ద్వారా సుప్రీంకోర్టు చైతన్య వంతమైన న్యాయ నిర్ణయాలు చేసిన విధానం,
- మానవ హక్కుల విషయంలో ధర్మాసన చైతన్యం వల్ల కలిగిన మేలు,
- సామాజిక సంక్షేమకరమయిన హక్కుల రక్షణలో సుప్రీంకోర్టు తీర్పుల ప్రాధాన్యం

5.1 పరిచయం

1950 – 1970 దశకాల మధ్య భారతదేశపు అత్యున్నత న్యాయస్థానం అపూర్వమయిన చైతన్యంతో ప్రజల ఆస్తి హక్కులకు అండగా నిలబడింది. సమానతా హక్కు, తదితర ప్రాథమిక స్వేచ్ఛల ప్రతీకగా ఆస్తి హక్కులను పటిష్టంగా నిలబెట్టింది. ఎమర్జన్సీని పరోక్షంగా సమర్థించడం వల్ల సుప్రీంకోర్టు ప్రతిష్ట కొంత తగ్గింది. ఆ తర్వాత ప్రజాస్వామ్య రక్షణకు వెల్లువెత్తిన ప్రజా ఉద్యమం, ప్రభుత్వ సంస్థలను ప్రజాస్వామీకరించాలన్న నినాదం బలం పుంజు కోవడంతో అత్యున్నత న్యాయస్థానం రాజ్యాంగ బాధ్యతలు నిర్వర్తించడానికి అనువైన వాతావరణాన్ని అనవసరమయిన సాహసాన్ని సంతరించుకున్నది. 1980 నుంచి న్యాయవ్యవస్థ పేదల వైపు మొగ్గింది. ప్రజాప్రయోజనాలకోసం పిటిషన్లను ఆమోదించి మానవ హక్కుల న్యాయ సూత్రాల నవశకాన్ని ఆవిష్కరించింది. రాజ్యాంగ నియమాలను సృజనాత్మకంగా వివరించి మానవ హక్కులను నిలబెట్టడంలో సుప్రీంకోర్టు సరికొత్త విధానాలను కనిపెట్టింది.

5.2 ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు

ప్రజా ప్రయోజన వ్యాజ్యం (Public Interest Letigation - PIL) లేదా సామాజిక చైతన్య వ్యాజ్యం (Social Action Letigation - SAL) న్యాయ భాష్యాల విషయంలో జాతీయ రాజ్యాంగాలను ముందుకు నడిపించి, అధునాతన అధ్యాయం మానవ హక్కులను మరింత పటిష్టంగా, సమర్థవంతంగా రక్షించి అమలు చేయించేందుకు ఈ ధర్మాసన చైతన్యం మన దేశంలో సరైన పునాదులు వేసింది.

PIL విధానం అమెరికాలో పుట్టి, బ్రిటన్‌లో ఎదిగి, భారతదేశంలో వికసించింది. ప్రజల చైతన్యం, ప్రజల ప్రయోజనాల రక్షణకు సుప్రీంకోర్టును కదిలించిన చైతన్యం ధర్మాసన చైతన్యానికి అసలు సిసలు ప్రేరణ. ప్రభుత్వ చర్యలవల్ల దెబ్బతిన్న ప్రాథమిక హక్కులను సుప్రీంకోర్టు ద్వారా రక్షించుకోవాలంటే, కోర్టుకు పిటిషన్ పెట్టుకున్న వ్యక్తి తను వ్యక్తిగతంగా నష్టపోయానని, ప్రభుత్వ చర్యవల్ల దెబ్బతిన్నానని రుజువు చేసుకోవాల్సిన అవసరం ఉందని పాత అభిప్రాయం. దీన్ని 'Locus Stand' పేరుతో పిలిచారు. మానవ హక్కు భంగపడిందని కోర్టులో చెప్పే వ్యక్తి

BRAOU

తన 'అర్హత' గురించి చెప్పవలసి ఉంటుంది. ఈ సూత్రం సాధారణంగా అన్ని కేసులకూ వర్తిస్తుంది. అయితే ప్రజలను సామూహికంగా నష్టపరిచే చట్టాలను చేసినపుడు, బాధితులు కోర్టులకు వచ్చి తమ హక్కులను కోరుకునే దశలో లేనపుడు ఈ సూత్రానికి మినహాయింపు కనిపెట్టక తప్పలేదు.

ఈ మినహాయింపు వల్ల ఒక సంఘంగానీ, లేదా వ్యక్తిగానీ ప్రజల క్షేమంకోరి కోర్టుకు వచ్చి ప్రభుత్వం రూపొందించిన శాసనాలను, జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేసి వాటి రాజ్యాంగ బద్ధతను, నిలదీసే అవకాశం ఏర్పడింది. పిటిషనరు తానే స్వయంగా ప్రభుత్వ చర్యవల్ల దెబ్బతిన్నానని చూపనవసరం లేదు. అయితే ప్రజల హక్కును అమలు చేయాలని కోరే వ్యక్తి, లేదా సంస్థ తాను నిజంగా చిత్తశుద్ధితో వచ్చానని, భంగపడిన హక్కుల పట్ల తాను ఆందోళన చెందానని వివరించాలి.

హవుజ్ ఆఫ్ లార్డ్స్ (House of Lords) బ్రిటిష్ ఉన్నత న్యాయస్థానం PIL సూత్రాన్ని న్యాయ విధానంలో వచ్చిన గణనీయమైన మార్పు అని అభివర్ణించింది. "ఆమోదిత వ్యక్తి" లేదా "తగిన శ్రద్ధ" కలిగిన వ్యక్తి అనే మాటలను ప్రయోగించి ఈ మార్పును వివరించింది. అమెరికాలో రాజ్యాంగం తొలి సవరణ ద్వారా గ్యారంటీ చేసిన హక్కులను భంగపరిచే చట్టాలను ప్రభుత్వం రూపొందించినపుడు సమాజానికి ఆందోళన కలగడం సహజమే. అటువంటి సందర్భాల్లో హక్కులను రక్షించడం కోసం చట్టాన్ని సవాలు చేయవచ్చు. అటువంటి భంగకరమయిన చట్టం వల్ల నేరుగా బాధపడని వ్యక్తి కూడా ఆ చట్టాన్ని కోర్టులో సవాలు చేయవచ్చు.

భారత సుప్రీంకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యం ప్రాధాన్యాన్ని ఎస్.పి. గుప్తా V యూనియన్ ఆఫ్ ఇండియా (AIR, 1982 Sc. 17) కేసులో వివరించింది. "రాజ్యాంగం, లేదా శాసనం కల్పించిన హక్కు, లేదా బాధ్యతను ఉల్లంఘించడం వల్ల ఒక వ్యక్తిని గానీ, నిర్దిష్ట వర్గానికి గానీ హక్కుల భంగం కలిగితే, రాజ్యాంగ నియమాలు, శాసన నియమాలుగానీ ఉల్లంఘించినా, లేదా శాసన పరమయిన అధికారం లేకుండా వ్యవహరించినా ఆ వ్యక్తిగానీ, నిర్దిష్ట వర్గం గానీ, బీదరికం, నిస్సహాయత, అనర్హత, సాంఘికంగా, ఆర్థికంగా దెబ్బతిన్న స్థితి కారణంగా న్యాయ పరిష్కారం కోరుకోలేని దశలో ఉంటే, ప్రజలలో ఒకరు ఎవరయినా, లేదా స్వచ్ఛందసేవా సంఘం కోర్టును అవసరమయిన ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించవచ్చు. ఆర్టికల్ 226 కింద తగిన రిట్ జారీ చేయాలని అడగవచ్చు. ప్రాథమిక హక్కులు భంగపడిన సందర్భాల్లో ఈ కోర్టు (సుప్రీంకోర్టు)ను ఆర్టికల్ 32 కింద పరిష్కారాన్ని అడగవచ్చు.

లోకస్ స్టాండై సూత్రాన్ని సవరించడం వల్ల ఉన్నత న్యాయ స్థానాలు సామాన్యునికి అందుబాటులోనికి వచ్చాయి. దెబ్బతిన్న వర్గాల పక్షాన న్యాయం అడిగే అవకాశం వచ్చింది. ప్రజల అవసరాలు అర్థం చేసుకున్న వారూ, పౌరహక్కుల ఉద్యమ నాయకులూ, స్వచ్ఛంద సంస్థలు ఎన్నో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను వేసారు. మానవ హక్కుల్ని భంగపరిచే చర్యలవల్ల బాధలకు గురయిన నిస్సహాయులకు న్యాయం సాధించి పెట్టారు. తొలిదశలో కోర్టుకు అందిన ఉత్తరాలను కూడా రిట్ పిటిషన్లుగా భావించి, సాధారణ సివిల్ ప్రాసీజర్ నియమాలను పక్కకు పెట్టి, తగిన నిర్ణయాలను చేసింది. అఫిడవిట్ పిటిషన్ వంటి లాంఛనాలను పట్టించుకోలేదు. ఆర్టికల్స్ 32, 226 కింద విచారణ సాగించే కోర్టులు వివాదాస్పద అంశాలపై సాక్ష్యాలను విచారించబోదు. అఫిడవిట్లు ఆధారంగానే విచారణ సాగించడం సాక్ష్య నియమాలు. కాని ప్రజాప్రయోజన వ్యాజ్యాలలో కోర్టు కమిషన్‌ను నియమించి సాక్ష్యాలను సేకరించవచ్చు. పేదలు, అభీతులు తమకు జరిగిన అన్యాయాన్ని, అందుకు సంబంధించిన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేని దశలో న్యాయస్థానం ఈ పద్ధతిని అనుసరిస్తున్నది.

ఆర్టికల్ 32 ద్వారా సుప్రీంకోర్టు తన ప్రజల ప్రాథమిక హక్కులను రక్షించే గురుతరమయిన రాజ్యాంగ బాధ్యతను స్వీకరించింది. ఈ రాజ్యాంగ బాధ్యతల నిర్వహణకు గాను న్యాయస్థానం నూతనమయిన పద్ధతులను ప్రవేశ పెట్టింది. నిరుపేదలు, అభాగ్యులకు మౌలికమయిన హక్కులు తెలియవు. వారికి స్వేచ్ఛ స్వాతంత్ర్యాల అసలైన అర్థం ఎపుడూ అందుబాటులోకి రాలేదు. 'ప్రజాశ్రేయస్సు' సిద్ధాంతాన్ని కనిపెట్టి న్యాయస్థానాలు మానవ హక్కుల న్యాయ పరిధిని విస్తరించింది. పిటిషనర్ల విషయంలోనే కాదు, ప్రతివాదుల విషయంలోనూ మార్పులు

BRAOU

తెచ్చారు. "ప్రభుత్వ చర్య" సిద్ధాంతాన్ని విస్తరించి బాధ్యులందరిపైనా హక్కుల రక్షణ భారాన్ని మోపారు.

'ప్రభుత్వ చర్యల' సిద్ధాంత స్వరూపం ఏమిటంటే పాలక వర్గం తన బాధ్యతలను విధులను ప్రయివేట్ వ్యక్తులకు, వర్గాలకు బదిలీచేసి తమపైనున్న రాజ్యాంగ పరిమితులను, ఆంక్షలను వదిలించుకోవడానికి వీల్లేదు. రాజ్యాధికారం పక్షాన నిలిచి ఏజెంట్లుగా విధులు నిర్వహించేవారు, సంస్థలూ తమ అధికారంపైన ప్రజల ప్రాథమిక హక్కులు ఆంక్షలుగా ఉంటాయన్న విషయం గుర్తించాలి. ఆ అధికారం వినియోగించే దశలో ఆ వ్యక్తులూ, సంస్థలూ పౌరుల హక్కులను హరించే వీలులేదు. అధికారాన్ని సమంజసంగా, న్యాయబద్ధంగా, చట్టపరంగా, సహేతుకంగా వాడాలి. సుప్రీంకోర్టు 'సమంజస విధానం' (Due process) సిద్ధాంతాన్ని వర్తింపజేసి నేర విచారణలో న్యాయ సూత్రాలను విప్లవాత్మకంగా మార్పు చేసింది. శిక్షపడిన ముద్దాయిలు, కేసువిచారణలో ఉండగా బందితులైన ముద్దాయిలు మానవ హక్కులు, హింసకు గురికాకుండా ఉండే హక్కు, సొదా స్వాధీనాలకు గురికాని హక్కు, విచారణకు ముందు, తర్వాత నిందితుల హక్కులు వంటి అనేక హక్కులను సుప్రీంకోర్టు రక్షించింది, అమలు చేసింది. రాజ్యాంగం, మానవ హక్కుల సారాన్ని అర్థం చేసుకుని హక్కులను నిలబెట్టింది.

న్యాయస్థానాల ద్వారా అమలు చేయడం సాధ్యం కాని మానవ హక్కులను కూడా సుప్రంకోర్టు రక్షించే తీర్పులు ఇవ్వడం విశేషం. ఇటువంటి హక్కులకు సంబంధించిన 'అంశాలలో కూడా చైతన్యంతో వ్యవహరించి రాజ్యాంగం నాలుగో భాగంలోని ఆదేశిక సూత్రాలలో ఉన్న సాధనా తీతమయిన హక్కులను నేరుగా అమలు చేసే ప్రయత్నాలను సాగించింది. ఈ హక్కులను ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులు అని 1966 అంతర్జాతీయ ఒప్పందాలలో పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సాంఘిక హక్కులు అనే సిద్ధాంతాలకు అనుగుణంగా సుప్రీంకోర్టు ప్రతిస్పందించింది. ఎన్.పి. గుప్తా v యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని అనుసరించవలసిన అవసరాన్ని మానవ హక్కుల నేపథ్యంలో వివరించింది. "జాతీయ పునర్నిర్మాణ కృషి అభివృద్ధి కార్యక్రమాలను విపరీతంగా పెంచింది. చట్టాలను సాంఘిక, ఆర్థిక అభివృద్ధి సాధనాలుగా వినియోగించడం కూడా ఎక్కువైంది. ప్రజలకు కొత్త కొత్త తరహా హక్కులను సృష్టిస్తూ పోతున్నది. అదే ధోరణిలో ప్రభుత్వంపైన కొత్త బాధ్యతలను మోపవలసి వస్తున్నది. వీటి లక్ష్యం సామాన్యునికి సామాజిక న్యాయం కలిగించడమే. అంటే వ్యక్తిగతమయిన హక్కుల ప్రాధాన్యత తగ్గిందని అనుకోవడం కాదు. సామాజిక హక్కుల అవసరం పెరిగిన, ఈ కాలంలో అందరికీ హక్కులను అందుబాటులోకి తేవలసిన పరిస్థితిలో వ్యక్తి హక్కులు అర్థరహితమై పోతున్నాయి" అని సుప్రీంకోర్టు వివరించింది.

"ఆదేశిక సూత్రాలను అనుసరించి కొత్త సామాజిక, ఆర్థిక హక్కులను సృష్టించాలంటే ప్రభుత్వం జోక్యం తప్పని సరి. ఇటువంటి, సందర్భాల్లో ప్రభుత్వ చర్య వల్ల, విధుల ఉల్లంఘన వల్ల, భంగపడే హక్కు ఒక్కనిది కాదు. ఏదో ఒక వర్గం మాత్రమే దెబ్బతినదు. సాధారణ ప్రజానీకం మొత్తంగా తమ హక్కులను నష్టపోతారు. ప్రజల పట్ల అటువంటి విస్తృతమయిన బాధ్యతలను విస్మరించిన తర్వాత, బాధితులు నిర్దిష్టమైన వారు కారన్న నెపంతో పరిష్కారం లేకుండా పోతే ఇక ప్రభుత్వాల విశృంఖలతని ఆపగలిగే వారే ఉండరు. అంతే కాదు, అభాగ్యులైన నిస్సహాయ ప్రజానీకం కోసం సృష్టించినట్టు చెప్పుకుంటున్న సమిష్టి హక్కులు నిస్సారమై నిరుపయోగమై పోతాయి.

ఆ విధంగా, ఆదేశిక సూత్రాల్లో సాధించ వీలులేని మానవ హక్కులను సామాజిక న్యాయమనే కొత్త కోణాన్ని కలిపి సాధించతగిన హక్కులుగా సుప్రీంకోర్టు మార్చింది. ఎన్నో కేసుల్లో సంచలన తీర్పులు ఇచ్చి వెట్టి కార్మికులను ఆదుకొన్నది. మురికి వాడల బ్రతుకుల్లో వెలుగు నింపింది. చిన్నదుకాణదార్లు, ఫుట్‌పాత్ జీవులు, పర్యావరణ కాలుష్య బాధితులు, గ్యాస్‌లీక్ పీడితులు, ప్రమాదకర, భయంకర పరిశ్రమల కార్మికులు, పేదరికంతో గతి తప్పిన అభాగ్యులకు అండగా నిలబడింది. పేదరికం వ్యక్తి గౌరవానికి భంగకరమని, అన్ని మానవ హక్కులను దగ్గరకు రానీయదని, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానతలకు అదొక ప్రమాదమని సుప్రీంకోర్టు అర్థం చేసుకున్నది.

BRAOU

5.3 ధర్మాసన చైతన్యం

ప్రజాప్రయోజన వ్యాజ్యం ధర్మాసన చైతన్యానికి ప్రాతిపదికగా నిలబడిందని మనం తెలుసుకున్నాం. దెబ్బతిన్న అసహాయ ప్రజలు న్యాయం సాధించే గమ్యంగా కోర్టులను ఎంచుకుంటున్నారు. సుప్రీంకోర్టు పౌరుల పక్షాన నిలబడిందనే విశ్వాసం ఏర్పడింది. ప్రజాప్రయోజన వ్యాజ్యం ప్రారంభం కావడంతో ప్రభుత్వంలో జరిగే కుంభకోణాలనుంచి మురికివాడల అభివృద్ధి దాకా పరిష్కారానికి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. "డెన్మార్క్ రాజ్యంలో ఏదో గందరగోళం ముదురుతున్నది" అని సుప్రీంకోర్టు న్యాయమంత్రులు జస్టిస్ వర్మ, ఎస్.పి. బరూచా, ఎన్.సి. సేన్ హవాలా కేసులో దర్యాప్తు వేగవంతం చేయాలని అర్థిస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో వ్యాఖానించారు. హవాలా డైరీల దర్యాప్తులో కోర్టుకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాలని సి.బి.ఐ.ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాన మంత్రి అజమాయిషీలో పని చేయవలసిన సి.బి.ఐ. సుప్రీంకోర్టు ఆధ్వర్యం కిందికి వచ్చేసింది. ఈ అసాధరణ చర్యతో భారత రాజకీయ వ్యవస్థలో పేరుకుకోయిన కుళ్ళును ప్రక్షాళన చేసే బాధ్యత సుప్రీంకోర్టు స్వీకరించిందేమోనని కొందరు ఆందోళన చెందారు. ఇంతకు ముందు కూడా న్యాయ స్థానాలు మరింత కార్యశీలతను ప్రదర్శిస్తూ కార్యనిర్వాహక వర్గ విధులను కూడా స్వీకరించి ప్రభుత్వ అధికారుల వ్యవహారాలను నియంత్రించింది. అధికార పగ్గాలను న్యాయవ్యవస్థ స్వీకరించి దేశపాలనను కూడా చేపడ్తుందా ఏం? అని ఆందోళన చెందారు. న్యాయవ్యవస్థ ద్వారా దేశ పాలన సాగుతుందని అనుమానించారు. అయితే న్యాయ వ్యవస్థలో ఎదిగే నియంతృత్వ ధోరణులను, న్యాయ సామ్రాజ్య ధోరణులను ఆపే దెవరు. 'న్యాయ నియంతలను, న్యాయ 'ప్రభువులను' అడ్డుకునేదెవరు అని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు.

రాజ్యాంగం మౌలిక స్వభావ సిద్ధాంతాన్ని, ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని కనిపెట్టిన తర్వాత న్యాయ స్థానాల క్రియాశీలత పెరిగి ధర్మాసన చైతన్యం వర్ధిల్లిందన్న విషయం మరువరాదు. ప్రస్తుతం రాజ్యాంగ విలువలను ధార్మికతను రక్షించి భావితరాల పట్ల తమ బాధ్యతను నెరవేర్చవలసిన అవసరం ఉందని న్యాయ మూర్తులు గుర్తించడానికి ఈ రెండు మార్గాలు దోహదం చేసాయి. ప్రజాస్వామిక భారతంలో మానవ హక్కులకు ఎదురయ్యే సవాళ్ళ మధ్య న్యాయవ్యవస్థ కీలకపాత్రను ఒక రూపాన్ని సంతరించుకున్నది. సుప్రీంకోర్టుకు తనకు అందిన లేఖలకు ప్రతిస్పందించే కొత్త లేఖా విచారణాధికారం (Epistolare Jurisdiction) ద్వారా సుప్రీంకోర్టు తలుపులు తట్టి న్యాయం అడిగే ప్రక్రియ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. న్యాయపాలనా వ్యవస్థలో అన్యాయాలవైపు, ప్రజల హక్కుల రక్షణ వైపు న్యాయవ్యవస్థ దృష్టిని మళ్ళించే అవకాశం రావడం గణనీయమైన అభివృద్ధి. అందువల్ల నూతనమయిన మానవ హక్కులు ఎన్నో న్యాయస్థానాల తీర్పుల ద్వారా ఆవిర్భవించాయి. గౌరవంగా జీవించే హక్కు, వ్యక్తిగత రహస్య హక్కు, ఆవాసం, గృహం, ఆరోగ్యం, చదువు, పర్యావరణం వంటి కొత్త ప్రాథమిక హక్కులకు గుర్తింపు లభించింది. హక్కులు భంగపడినపుడు నష్టపరిహారం, డామేజిస్ పునరావాసం వంటి కొత్త పరిష్కారాలు కూడా లభించాయి. జైళ్ళు, బాలల జైళ్ళు, మహిళా రక్షణ గృహాలు, ఆశ్రమాలు, మానసిక చికిత్సా కేంద్రాలు, ఆస్పత్రుల వంటి ప్రభుత్వ సంస్థలపై న్యాయ వ్యవస్థల అజమాయిషీ పెరిగింది. రాజ్యాంగంలో రచించిన సంప్రదాయ సిద్ధమయిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను నిజమయిన ప్రజల హక్కులుగా మలచడంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు మౌలికంగా దోహదం చేశాయి. ధర్మాసన చైతన్యమే లేకపోతే రాజ్యాంగం ఒక నిర్జీవ పత్రంగా మిగిలిపోయి ఉండేది. శాసన వ్యవస్థ ఏకపక్ష విధానాలు, కార్యనిర్వాహక వ్యవస్థ అధికార దుర్వినియోగాలు, లేదా న్యాయ విధానాలలో అనవసర జోక్యంవల్ల న్యాయ వ్యవస్థకు మినహా రెండు వ్యవస్థలతో ఘర్షణ ఏర్పడినపుడు న్యాయ వ్యవస్థ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి న్యాయస్థానాల క్రియాశీలత ఉపకరించింది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పరిధిని స్వచ్ఛంగా కాపాడి, మౌలికమయిన శాసనిక పాలనా (Rule of Law) సిద్ధాంతానికి జనసత్వాలు కల్పించి, ప్రజాస్వామిక పరిపాలనా రంగంలో న్యాయవ్యవస్థకు ఒక కీలకమయిన పాత్రను కల్పించింది. ధర్మాసన చైతన్యం, "మీరెంత ఉన్నతులైన కానీ, మీకన్న ఉన్నతమైంది శాసనం" అనే నినాదానికి జీవం ఇచ్చింది ఈ ధర్మాసన చైతన్యం. ఈ రంగంలో న్యాయ వ్యవస్థ విఫలమైతే ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను రక్షించే వారే ఉండరు.

BRAOU

5.4 ముగింపు

మన దేశంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం పేదలకు, అణగారిన వర్గాలకు న్యాయస్థానాలను అందుబాటులోకి తెచ్చింది. సామాజిక న్యాయ సూత్రాన్ని అమలు చేసి, సాంఘికంగా సమిష్టి హక్కులను అభివృద్ధి చేసింది ధర్మాసన చైతన్యం. నిస్సారంగా కాగితాలమీద రాసి ఉన్న హక్కుల ప్రకటనకు సజీవ స్వరూపాన్నిచ్చింది. సామాజిక సేవకులకు కోర్టు ఒక సమర వేదిక మానవ హక్కుల పోరాట సమితి.

హక్కులు వ్యక్తులను సాధికారులను చేసే ఒక సాధనమని మనం గమనించాలి. రాజ్యాంగం మన హక్కులను గుర్తించడం ఒక అభ్యదయకరమయిన చర్య అనడంలో సందేహం లేదు. ఈ హక్కులను కోర్టులు సృజనాత్మకంగా వివరించి, వాటి అర్థాన్ని సమంజసంగా సమన్వయించి సామాజిక పరివర్తనకు దోహదం చేయడం మరొక విశేషం. న్యాయం కోసం పోరాడే ప్రజానీకానికి సంస్కరణలు నిరోధించడం అనివార్యమయిన బాధ్యత. అందుకు న్యాయస్థానాలు సహకరిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా విద్య పొందే హక్కు, ఆరోగ్య రక్షణ హక్కు, పోషకాహారం పొందే హక్కు సృష్టించింది. వెనువెంటనే ఈ హక్కులన్నీ అమలై ప్రజల అవసరాలు అన్నీ తీరుతాయని కాదు. కాని, సుప్రీంకోర్టు సృష్టించిన ఈ హక్కుల అమలు కోసం ప్రజా ఉద్యమాలు నిర్మితమవుతాయన్నదే ఆశాకిరణం. ప్రజాపోరాటాలకు ఈ హక్కులు కార్య ప్రణాళికలవుతాయన్నదే ఆకాంక్ష. హక్కులు అడుక్కుంటే ఇవ్వరు. పోరాడి సాధించుకోవలసిందే. అయితే ఈ హక్కులను జాతి జీవనంలో సువ్యవస్థితం చేయడం సృజనాత్మకమైన న్యాయవ్యవస్థ వల్లనే సాధ్యమైంది

5.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.

1. భారత రాజ్యాంగంలో న్యాయ వ్యవస్థ అధికారాలు, విధులు, పరిమితులు ఏమిటి?
2. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కులపై అంతర్జాతీయ ఒప్పందం విషమయై భారత న్యాయవ్యవస్థ పాత్రను అంచనా వేయండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి.

1. ప్రజా ప్రయోజన వ్యాజ్యం ప్రధాన లక్షణాలను, భారత దేశంలో మానవ హక్కుల అభివృద్ధికి ఉపయోగపడిన విధానాన్ని వివరించండి.
2. ధర్మాసన చైతన్యాన్ని చర్చించండి.

BRAOU

ఖండం : III

నేర విచారణ వ్యవస్థ

హక్కుల ఉల్లంఘన అనేది నేర విచారణ సందర్భంగా కూడా జరుగుతుంది. అందుకే నేరవిచారణ వ్యవస్థ పకడ్బందీగా వుండాలంటారు. అంటే దోషులు సాక్షాలు లేకుండా తప్పించుకున్నా ఫరవాలేదు గానీ నిర్దోషికి మాత్రం శిక్షపడకూడదన్నది నేర విచారణ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. ఈ ఖండం నేర విచారణ వ్యవస్థ స్వరూప స్వభావాలను వివరిస్తుంది. ఇందులో రెండు భాగాలున్నాయి. అవి

- నేర విచారణ వ్యవస్థ : మానవ హక్కులు
- నేరం, శిక్ష : మానవ హక్కులు.

BRAOU

BRAOU

6. నేర విచారణ వ్యవస్థ - మానవ హక్కులు

6.0 ఉద్దేశం.

6.1 పరిచయం

6.2 చట్టం ముందు సమానత్వం

6.3 చట్టం నిర్దేశించే పద్ధతి

6.4 సాక్ష్యాల చట్టం

6.5 కస్టడీలో ముద్దాయి హక్కులు

6.6 అరెస్టు చేసే పద్ధతి

6.7 నేర పరిశోధన - పద్ధతి

6.8 ముద్దాయి హక్కులు

6.9 ముగింపు

6.10 మాదిరి పరీక్ష ప్రశ్నలు

6.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తర్వాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

భారతదేశంలోని నేరవిచారణ వ్యవస్థ

- భారతశిక్షాస్మృతి (ఐ.పి.సి), నేరవిధానస్మృతి (సి.ఆర్.పి.సి),
- భారతసాక్ష్యాలచట్టం (ఎవిడెన్స్ ఆక్ట్) నిర్వచించే నేరవిచారవ్యవస్థ
- బాధితుల హక్కులను, ముద్దాయి హక్కుల రక్షణ.

BRAOU

6.1. పరిచయం

నేరాన్ని రుజువుచేసి, నేరస్తుడిని శిక్షించాలిగానీ, ముద్దాయి లేక అనుమానితునికి అనవసరమైన వేధింపు ఉండకూడదనే లక్ష్యంతో నేరవిచారణ పద్ధతి సాగుతుంది. నేరాన్ని పరిశోధించే క్రమంలోగానీ నేరతీవ్రతను మదింపువేసే క్రమంలోగానీ హక్కుల అతిక్రమణ, అవసరాన్ని మించి జరగకుండా ఉండేందుకు పోలీసుల అధికారాలనూ స్యాయస్థానాల అధికారాలనూ చట్టం ఏవిధంగా పరిమితంచేసిందో ఈపాఠం చెప్తుంది. విచారణ పద్ధతిలోని లోపాలవల్ల అమాయకులకు శిక్షపడకూడదనేని చట్టం లక్ష్యం. అందువల్ల నేరనిర్ధారణ చట్టం నిర్దేశించిన పద్ధతిలో జరగాలన్న నియమం మానవహక్కుల ఆచరణకు చాలా ముఖ్యమైనది.

6.2 చట్టం ముందు సమానత్వం :

భారతదేశంలోని నేరవిచారణవ్యవస్థ కొన్ని ప్రాధమిక సూత్రాల మీద ఆధాపడింది.

అందులో మొదటిది, చట్టం ముందు అందరూ సమానమనీ చట్టం అందరినీ సమానంగా కాపాడాలనీ చెప్పే ప్రాధమికహక్కు . (భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 14). దీనికి చాలా అర్థాలున్నాయి. ఒకటేమిటంటే, బలవంతులు చేసిన నేరాలనూ బలహీనులు చేసిన నేరాలనూ చట్టం ఒకే రకంగా చూడాలి. నేరం స్వభావాన్ని బట్టి తేడా చూడాలే తప్ప, నేరంచేసిన వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ హోదాను బట్టికాదు.

ఉదాహరణకు, నేరం తీవ్రమయినదయితే కోర్టు త్వరగా బెయిలు ఇవ్వకపోవచ్చు. సామాన్య నేరమయితే

బెయిలు మంజూరు చేయడానికి తటపటాయించకూడదు. అంతేతప్ప నేరం చేసిన వ్యక్తి సామాజిక హోదానుబట్టి పోకూడదు.

మరొక అర్థమేమిటంటే పేదల మీద బలహీనుల మీద జరిగిన నేరాలనూ ధనవంతులమీదా బలవంతులమీదా జరిగిన నేరాలను ఒకేరకంగా చూడాలి.

ఒకేరకంగా 'చూడాలి' అంటే అర్థం కోర్టులు ఒకేరకంగా చూడాలని మాత్రమేకాదు. నేరవిచారణలోనే కాక నేర పరిశోధనలో కూడ (అంటే న్యాయ స్థానాలలోనేకాక పోలీస్‌స్టేషన్‌లో కూడా) సమదృష్టి ఉండాలని అర్థం. అంటే ఒక భిక్షగాడిని హీత్యచేసినా దేశప్రధానిని హత్యచేసినా ఒకేరకంగా స్పందించాలని అర్థం.

సాధారణంగా జరిగేది ఇదికాదని మనకు తెలుసు. నేరస్మృతి భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ను అనుసరించి నిష్పాక్షికమైన నేరవిచారణ పద్ధతిని నిర్దేశించింది. అయితే ఆచరణ అందుకు భిన్నంగా ఉంది. చట్టాలు అమలయినప్పుడే ఆచరణలో వాటిని అనుభవించగలుగుతాము. చట్టంలోని హక్కులను సమగ్రంగా అమలు చేసినప్పుడే వాటిని పొందగలుగుతాము. భిక్షగాడి హత్య, ప్రధానమంత్రి హత్య అనే ఉదాహరణనే తీసుకోనక్కరలేదు. వాటి విషయంలో నేరవిచారణ వ్యవస్థ చూపించే వివిక్షను 'అర్థం' చేసుకోగలమనుకున్నా వాటిలాగా 'అర్థం' చేసుకోవడం సాధ్యపడని స్థాయిలో కూడ నేరాలను విచారించేటప్పుడు నేరవిచారణ వ్యవస్థ అనుసరించే వైఖరిలో గణనీయమైన తేడాలు కనిపిస్తాయి. అది ప్రధానంగా పోలీసు యంత్రాంగానికి వర్తిస్తుంది. కానీ న్యాయమూర్తులు సహితం ఈ విమర్శను తప్పించుకోజాలరు. మానవహక్కుల ఉద్యమం, మానవహక్కుల స్పృహ అవసరం. అని భావించడానికి గల కారణాలలో ఇదొక ముఖ్యకారణం. చట్టం ముందు అందరూ సమానమేనని చట్టం అందరికీ సమానరక్షణ ఇవ్వాలనీ చెప్పే ప్రాథమిక హక్కు ఉందని సంతృప్తి చెంది ఊరుకోలేము.

చట్టం ముందర సమానత్వం అనే హక్కుకు మరొక అర్థం ఉంది. నేరవిచారణలో చట్టం ముద్దాయికీ బాధితులకూ సమాన సంరక్షణ కల్పించాలన్న అర్థం కూడా ఉంది. బాధితుల సంరక్షణ అంటే అర్థం నేరాన్ని సమగ్రంగా పరిశోధించాలి, దోషులను తగినరీతిలో శిక్షించాలి. విచారణలో బాధితులు, సాక్ష్యులు నిర్భయంగా పాల్గొనగలగాలి. న్యాయం పొందే హక్కుకు, నేరస్తుడిని గుర్తించడంలో నేరవిచారణ వ్యవస్థకు తోడ్పడే హక్కుకు, రక్షణ ఉండాలి. ముద్దాయి సంరక్షణ అంటే అర్థం న్యాయమైన, నిష్పాక్షికమైన విచారణలేకుండ, తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవడానికి అన్ని అవకాశాలు ఇవ్వకుండ ముద్దాయిని నేరస్తుడిగా ప్రకటించడానికి వీలులేదు.

ముద్దాయికి చట్టం సంరక్షణ కల్పిస్తుందంటే అర్థం చట్టానికి నేరాలపట్ల, నేరస్తులపట్ల ఉదాసీనవైఖరి ఉందని కాదు. నేరం బాధితుల హక్కులను అతిక్రమిస్తుంది. కాబట్టి చట్టానికి నేరం పట్ల ఉదాసీన వైఖరి ఉండజాలదు. (అయితే నేరానికి గల సామాజిక కారణాల గురించి చట్టానికి స్పృహ ఉండవలసిన అవసరం ఉందన్న విషయం తరువాతి పాఠంలోచూద్దాం). అయినప్పటికీ నేరవిచారణలో ముద్దాయికి చట్టం సంరక్షణ కల్పించడానికి ఒకకారణం ఉంది. అది ఒక మౌలిక ప్రజాతంత్ర సూత్రం. అదేమిటంటే, నేరం చేసినవారిని శిక్షించవలసిందేకానీ నేరస్థులు కాని వారినెవ్వరినీ శిక్షించడానికి వీలులేదు. చట్టం ఈ సూత్రానికి భరోసా ఏవిధంగా ఇవ్వగలుగుతుంది? నూటికి నూరుశాతం భరోసా ఇవ్వలేదుకానీ, భారతదేశనేరస్మృతిలో ఈ సూత్రం అమలుకు అవసరమైన అంశాలు చాలా ఉన్నాయి.

6.3 చట్టం నిర్దేశించే పద్ధతి

వీటన్నిటిలోనికీ ప్రాథమికమైనది, భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కయిన ఆర్టికల్21. చట్టం నిర్దేశించే పద్ధతిలో తప్ప మరొకరకంగా ఎవరిప్రాణాన్ని గానీ స్వేచ్ఛనుగానీ తీసేయడానికి వీలులేదనేది ఈ ప్రాథమికహక్కు. నేరం చేసినట్టు రుజువు అయినట్టయితే ముద్దాయి తనస్వేచ్ఛను, లేక ప్రాణాన్ని కోల్పోవలసి ఉంటుంది కాబట్టి నేరాన్ని రుజువుచేసేపద్ధతి యావత్తు చట్టం ప్రకారం ఉండాలి. అంటే నేరవిచారణ పద్ధతిలోని ప్రతీఘట్టం చట్టం నిర్దేశించినట్టే ఉండాలని అర్థం. చట్టం ఆపద్ధతిని నిర్దేశించాలి, విచారణ దానిని పాటించాలి, చట్టం నిర్దేశించిన

BRAOU

పద్ధతికంటే భిన్నంగా, జరిగే నేరవిచారణ, వేసేశిక్ష, ఆర్టికల్21 లోని ప్రాథమిక హక్కుకు విరుద్ధం అవుతాయి. చట్టం నిర్దేశించే నేర విచారణ పద్ధతి నేరవిధానస్మృతి (సిఆర్‌పిసి) లోనూ భారత సాక్ష్యాల చట్టంలోనూ వివరించబడింది. ఈపద్ధతి ముద్దాయి హక్కులను కాపాడుతూ అదేసమయంలో నేరస్తుడిని గుర్తించడానికి ప్రాసిక్యూషన్‌కు సహేతుకమైన అవకాశాలు కల్పిస్తుంది.

ఆర్టికల్ 21 కల్పించే రక్షణ పైకి కల్పించేంత గంభీరమైనది కాదు. ముద్దాయి నేరస్తుడని రుజువు చేసే క్రమంలో ప్రతీఘట్టం ఏదో ఒకచట్టం నిర్దేశించినట్టు ఉండాలని మాత్రమే ఆర్టికల్ 21 ఉంటుంది. కానీ ఆచట్టమే అన్యాయంగా, అహేతుకంగా ఉంటే ఏం అవుతుంది? ఉదాహరణకు పోలీసులు అనుమానితుడిని హింసించి ఒప్పుకోలు సేకరించవచ్చుననీ ఆ ఒప్పుకోలు ఆధారంగా న్యాయస్థానం నేరనిర్ధారణ చేయవచ్చుననీ ఒకచట్టం. చేసారనుకోండి. అదొక అన్యాయమైన చట్టం ఆధారంగా రూపొందించిన చట్టబద్ధమైన పద్ధతి అవుతుంది. ఎందుకంటే పోలీసుకస్టడీలో చిత్రహింసలు పెట్టినట్టయితే ఎవరయినా సరే చావు తప్పించుకోవడానికి ఏనేరమయినా ఒప్పేసుకుంటారు.

అయితే అటువంటి చట్టం భారతరాజ్యాంగం ప్రకారం చెల్లుబాటుకాదు. ఎవరిచేతనూ బలవంతంగా నేరంఒప్పించ డానికి వీలులేదని భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 20 (3) అంటుంది. అదొక ప్రాథమికహక్కు. కాబట్టి, ముద్దాయిని హింసించి నేరం ఒప్పించి ఆఒప్పుకోలు ఆధారంగా నేరనిర్ధారణ చేసే నేర విచారణ పద్ధతి రాజ్యాంగ విరుద్ధం అవుతుంది.

అయితే నేరవిచారణలో మరీ అంత తీవ్రంగా అన్యాయమైన పద్ధతిని ప్రవేశపెట్టే ప్రయత్నాన్ని భారత రాజ్యాంగం ఆమోదించదుగానీ, కొంత తక్కువ మోతాదులో అన్యాయమైన పద్ధతులు, లేక పరోక్షంగా అన్యాయమైన పద్ధతులు చట్టబద్ధమైనవిగా చెల్లుబాటయ్యే అవకాశం లేకపోలేదు. మరి అటువంటప్పుడు, బాధితులకు చట్టం ఎంత రక్షణ కల్పిస్తుందో ముద్దాయికి కూడా అంత కల్పించాలన్న సూత్రాన్ని ఎట్లా సాధించాలి?

1978లో ఇచ్చిన ఒక తీర్పులో సుప్రీంకోర్టు నేరవిచారణలో ముద్దాయి హక్కులకు బలం చేకూర్చే వ్యాఖ్యానంచేసింది. ప్రాణాన్ని స్వేచ్ఛనూ తీసివేసే అవకాశం కల్పించే చట్టం ఎటువంటి చట్టమైనా కావాడానికి వీలులేదని, ఆచట్టం నిష్పాక్షికమైనది, న్యాయమైనది, సహేతుకమైనది అయిఉండాలని ఆ తీర్పులో సుప్రీంకోర్టు అనింది. అంటే, నేరవిచారణ పద్ధతి చట్టబద్ధమై ఉండటమేకాదు, దానిని నిర్వహించే పద్ధతి న్యాయంగా, నిష్పాక్షికంగా సహేతుకంగా ఉండాలి.

ఈతీర్పుఫలితంగా పరిస్థితి కొంతమెరుగయిందిగానీ సమస్య పూర్తిగా పరిష్కారం అయిందని ఇప్పటికీ చెప్పలేము. ఎందుకంటే ఒక పద్ధతి న్యాయం, నిష్పాక్షికం, సహేతుకం అవునా కాదా అనేది ఒకమేరకు మన అభిప్రాయాన్ని బట్టి ఉంటుంది. నిజమే ఈ విషయంలో సుప్రీంకోర్టు అభిప్రాయం శిరోధార్యమే, అయినప్పటికీ అది పారబాట్లకు అతీతం మాత్రం కాదు.

టెర్రరిస్టు విచ్ఛిన్నకర కార్యకలాపాల చట్టాన్ని (అంటే 'టాడా'ను) ఇక్కడ ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈ చట్టం టెర్రరిస్టు నేరాలు అనే కొత్త నేరాన్ని నిర్వచిస్తుంది. వాటిని విచారించడానికి మాములు నేర విచారణ పద్ధతిని సవరించిన కొత్త పద్ధతిని ప్రవేశపెడుతుంది. టెర్రరిస్టు నేరాల నిర్వచనము, వాటిని విచారించడం కోసం సవరించిన పద్ధతి న్యాయం, నిష్పాక్షికం, సహేతుకం' అనే ప్రమాణానికి నిలవజాలవని మానవహక్కుల కార్యకర్తలు, రాజ్యాంగనిపుణులు, మాజీ సుప్రీంకోర్టున్యాయ -మూర్తులు చాలామంది అభిప్రాయపడినప్పటికీ సుప్రీంకోర్టు మాత్రం ఆచట్టం 'న్యాయం, నిష్పాక్షికం, సహేతుకం' అనే ప్రమాణానికి నిలుస్తుందనే తీర్పుఇచ్చింది.

కాబట్టి, బాధితుల హక్కులు కాపాడాలన్న ఆత్రుతలో ముద్దాయి హక్కులను సంరక్షించే బాధ్యతను చట్టం విస్మరించకుండ ఉండాలంటే ఏంచేయాలన్నది ఇప్పటికీ సమస్యగానే ఉందని చెప్పాలి. నేరవిచారణలో ముద్దాయి హక్కులను సంరక్షించవలసిన ఆవశ్యకత ఏమిటో మరొకసారి ఇక్కడ నొక్కిచెప్పడం అవసరం. దానివెనక ఉన్న ఉద్దేశ్యం నేరాలను ప్రోత్సహించాలని కాదు, సమాజాన్ని నేరాలనుండి, నేరస్తులనుండి కాపాడాలన్న ఆరాటంలో

BRAOU

అమాయకులకు శిక్షవేయకుండ చూడాలన్నదే ఇక్కడి లక్ష్యం.

అయితే బెర్రరిస్టునేరాల వంటి అసాధారణ నేరాలను పక్కన పెట్టి సాధారణ నేరాలను తీసుకుంటే ఇప్పుడున్న నేరవిచారణ పద్ధతి మొత్తంమీద నిష్పాక్షికమైనదనే చెప్పాలి. సమస్యలు ఎక్కువగా వచ్చేది ఈ పద్ధతిని అతిక్రమించే చర్యలనుండి, లేక ఈ పద్ధతిలోని అస్పష్టమైన అంశాలను దుర్వినియోగం చేసే చర్యలనుండి. అందుకోసమే మానవహక్కుల చైతన్యం, నిఘాచాలా అవసరం.

6.4 సాక్ష్యాలచట్టం

ఈనేర విచారణ పద్ధతి నేర విధానస్మృతి (సిఆర్‌పిసి) లోనూ సాక్ష్యాలచట్టంలోనూ వివరించబడింది. ఇవి గత శతాబ్దంలో తయారుచేసిన చట్టాలు, అప్పటికి భారతదేశానికొక రాజ్యాంగం లేదు, భారతపౌరులకు ప్రాథమిక హక్కులు లేవు. అయినప్పటికీ మొత్తం మీద ఈ పద్ధతిలో రెండు ప్రాథమికలక్షణాలున్నాయి. ఒకటి, ఫానిక్యూషన్ నేరాన్ని రుజువు చేసేంతవరకు ముద్దాయిని నిర్దోషిగానే పరిగణించడం, రెండు సహేతుకమైన ఏసందేహానికీ తావులేనంత సంపూర్ణంగా రుజువయినప్పుడే నేరం రుజువైనట్టు భావించడం. ఇందులో మొదటి సూత్రం సాక్ష్యాలచట్టం సెక్షన్లు 101-104లో అంతర్లీనంగా ఉంది. రెండవది, ఇంగ్లీష్ చట్టాలను ఆధారంచేసుకొని కోర్టులు చేసిన వాఖ్యానాల ద్వారా స్థిరపడింది.

అందులో భాగంగా, సాక్ష్యాలచట్టంలోని సెక్షన్ 25 ఏమంటుందంటే, పోలీసులకు ఒక వ్యక్తి ఇచ్చే ఒప్పుకోలును అతనికి వ్యతిరేకంగా సాక్ష్యంగా వాడుకోవడానికి వీలులేదని. అంటే, ముద్దాయిని పోలీసుకస్టడీలో హింసించి నేరం ఒప్పించి ఆ ఒప్పుకోలును కోర్టులో సాక్ష్యంగా పెట్టడానికి వీలులేదని భారతరాజ్యాంగం ఉనికిలోనికి రాకముందే చట్టం ప్రకటించింది. (రాజ్యాంగం వచ్చిన తరువాత ఇది ఒక ప్రాథమిక హక్కు అయింది.)

అయినప్పటికీ మనదేశంలో పోలీసులు తరచుగా ముద్దాయిలను చిత్రహింసలకు గురిచేసి బలవంతంగా వారినుండి ఒప్పుకోలు తీసుకుంటారనేది అందరికీ తెలిసిన సంగతే. ఈ పని ఎందుకు చేస్తారంటే, పోలీసులకస్టడీలో ఇచ్చిన సమాచారాన్ని అనుసరించి ఏదైనా వస్తువును పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగితే, ఆవస్తువునూ ఆమేరకు ఇచ్చిన సామాచారాన్ని కోర్టులో సాక్ష్యంగా ప్రవేశపెట్టవచ్చునని సాక్ష్యాల చట్టంలోని సెక్షన్ 27 అంటుంది. అంటే, బలవంతపు ఒప్పుకోలును సాక్ష్యంగా ప్రవేశపెట్టి నేరాన్ని రుజువుచేసే అవకాశంలేదని సెక్షన్ 25 అంటుందిగా, బలవంతంగా చెప్పించిన సమాచారం ఆధారంగా స్వాధీనం చేసుకున్న వస్తువును, ఆమేరకు ఆసమాచారాన్ని సాక్ష్యంగా ప్రవేశపెట్టే అవకాశం సెక్షన్ 27 ఇస్తుంది. చట్టం కల్పించే ఈ అవకాశం ఫలితంగా పోలీసులు తమకస్టడీలో ఉన్నవారిపైన పెద్దఎత్తున హింసకు పాల్పడుతుంటారు. ఈ చిత్ర హింసల ఫలితంగా అంగవైకల్యం, మరణం తరచుగా సంభవిస్తుంటాయి. కాబట్టి ఈ విషయంలో మానవహక్కుల చైతన్యం ఆచరణ చాలా అవసరం.

దీనినిబట్టి, ఒప్పుకోలు కాక ఇతర సమాచారాన్ని రాబట్టడం కోసం చిత్రహింసలు పెట్టడాన్ని చట్టం ఆమోదిస్తుందనుకుంటే పొరబాటే. అది నిజంకాదు. అందుకు విరుద్ధంగా, సమాచారం సేకరించడానికి చిత్రహింసలు ప్రయోగించడం నేరమనీ ఆపనిచేసిన పోలీస్ అధికారికి (గాయతీవ్రతనుబట్టి) 10 సంత్సరాల దాకా జైలు శిక్ష వేయవచ్చుననీ భారతశిక్షాస్మృతిలోని సెక్షన్లు 330, 331 అంటాయి.

6.5 కస్టడీలో ముద్దాయి హక్కులు

అరెస్టు చేసిన వ్యక్తిని పోలీసుకస్టడీలో చిత్రహింసలు పెట్టకుండ నిరోధించడానికి ఉద్దేశించబడిన మరొకచట్టం నేరవిధానస్మృతిలోని సెక్షన్ 57. కస్టడీలోకి తీసుకున్న ఏవ్యక్తినయినా పోలీసులు 24 గంటలలోపల సమీప జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలని ఈసెక్షన్ అంటుంది.

సెక్షన్ 57 ఫలితంగా, అనుమానితుడిని ప్రశ్నించడానికి తగు సమయం తమకు దక్కడం లేదని పోలీసులు

BRAOU

తరచుగా ఫిర్యాదు చేస్తుంటారు. చట్టం బాధితులనూ ముద్దాయినీ సమానంగా సంరక్షించాలన్న విషయం జ్ఞాపకం పెట్టుకోవాలి. కాబట్టి నిర్దోషిని శిక్షించరాదనేది ఎంత ముఖ్యమైన నియమమో, నిజమైనదోషిని గుర్తించి శిక్షించాలనేది కూడ అంతే ముఖ్యం. కాబట్టి అరెస్టు చేసిన వ్యక్తిని ప్రశ్నించడానికి పోలీసులకు సహేతుకమైన అవకాశం ఉండాలి.

అదే సమయంలో, ప్రశ్నించడం పేరుమీద ముద్దాయిని కస్టడీలో హింసించకుండ చూడటం కూడ అవసరం. నేరాన్ని ప్రాసిక్యూషన్ రుజువు చేసేదాకా ముద్దాయిని నిర్దోషిగానే పరిగణించాలన్న సమదృష్టి సూత్రం దీనికి మూలం. కాబట్టి నేరపరిశోధన పేరిట ముద్దాయిని హింసించే అవకాశం లేకుండ చూసే బాధ్యత చట్టం మీద ఉంటుంది.

నేరవిచారణస్మృతి ఈ భిన్నమైన అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటిమధ్య సమతుల్యం సాధించే ప్రయత్నం చేస్తుంది. అరెస్టుచేసిన ముద్దాయిని కోర్టులో హాజరుపెట్టకుండ పోలీసుకస్టడీలో ఎక్కువసేపు ఉంచుకునే అవకాశం పోలీసులకు ఇవ్వదు. అయితే కోర్టులో హాజరుపెట్టిన తరువాత కోర్టు ముద్దాయిని తిరిగిపోలీసు కస్టడీకే, ప్రశ్నించడంకోసం సిఆర్‌పిసి సెక్షన్ 167(2) కింద అప్పగించవచ్చును. ఇది ముద్దాయికి మేజిస్ట్రేటు పర్యవేక్షణవల్ల వచ్చే సంరక్షణ కొంత కల్పిస్తుంది. ఉదాహరణకు ముద్దాయిని పోలీసు కస్టడీకి అప్పగించిన మేజిస్ట్రేటు, పోలీసులతనిని ప్రతిరోజూ ఒకసారి తన ఎదుట హాజరు పెట్టాలని ఆదేశించవచ్చు. లేదా ప్రతిరోజూ ఒక డాక్టరు అతనిని లాకప్పులో పరీక్షించాలని ఆదేశించవచ్చును.

అయినప్పటికీ పోలీసుకస్టడీలో చిత్రహింసలు ఒక తీవ్రమైన సమస్యగానే ఉంది. నేరవిచారణలో సహేతుకత, నిష్పాక్షికత అనే సూత్రాలనది అసహ్యం చేస్తుంది. అరెస్టు చేసినవ్యక్తిని 24 గంటలలోపల కోర్టుఎదుట హాజరుపెట్టాలన్న సిఆర్‌పిసి సెక్షన్ 57లోని నియమాన్ని పోలీసులు ఎప్పుడోతప్ప గౌరవించరనేది తెలిసిన విషయమే. కస్టడీలో చిత్రహింసలు పెట్టక పోతే నేరాలు రుజువు చేయడం సాధ్యం కాదని పోలీస్ అధికారులు అంటుంటారుకూడ. కస్టడీలో చిత్రహింసల పట్ల నిరసన తెలిపే వాళ్ళకు బాధితుల హక్కులకంటే నేరస్తుల హక్కులు ముఖ్యమన్న అపవాదు కూడ ఉంది. అయితే పోలీసు కస్టడీలో ఒక వ్యక్తిని హింసకు గురిచేసేటప్పుడు అతను దోషి అయిందీ నిర్దోషి అయిందీ ఆ పోలీసులకు తెలియదని జ్ఞాపకం పెట్టుకోవాలి. దోషులను పట్టుకోవడానికి నిర్దోషులకు హాని చేసినా తప్పులేదనే వైఖరి సరయినది కాదు. అంతేకాక, దోషికి కూడ న్యాయస్థానం నిర్ణయించే శిక్ష మాత్రమే వేయాలి. దానికి ముందు చట్టబద్ధమైన నేరవిచారన జరగాలి. సహేతుకమైన సందేహానికి అస్కారం లేనంత సంపూర్ణంగా నేరం. రుజువుకావాలి. ఎంత శిక్షవేయడం ఉచితంగా ఉంటుందన్న వివాదం జరగాలి. ఈ నిష్పాక్షికమైన, సహేతుకమైన నేరవిచారణ పద్ధతి కస్టడీలో చిత్రహింసలతో ప్రారంభం కావడానికి వీలులేదు. కాబట్టి, భారతరాజ్యాంగంలోనూ, సిఆర్‌పిసిలోనూ, సాక్ష్యాల చట్టంలోనూ చిత్రహింసలను చట్టవిరుద్ధమని ప్రకటించే అంశాలు ఎన్ని ఉన్నప్పటికీ, పోలీసుకస్టడీలో చిత్రహింసలను అరికట్టడానికి మానవహక్కుల చైతన్యం, నిఘా, ఆందోళన అవసరం.

B RAO U

6.6 అరెస్టు చేసే పద్ధతి

అయితే మానవహక్కుల సమస్యలు అరెస్టు చేసిన తరువాతకాదు, అరెస్టుచేసేసమయంలోనే మొదలవుతాయి. ఒక నేరంలో అనుమానితుడయిన వ్యక్తిని అరెస్టుచేసేటప్పుడు పోలీసులు ఎంతబలప్రయోగానికి పాల్పడవచ్చును? అతను అనుమానితుడయినంత మాత్రాన కస్టడీలోకి తీసుకునేటప్పుడు కొట్టడం, కాల్పులు జరపడం తగునా? కేవలం అనుమానించబడినంత మాత్రాన ఎప్పుడూ దోషి కాదన్న సూత్రం సిఆర్‌పిసిలో ఆద్యంతం ఉందన్న సంగతి మరొకసారి గుర్తు చేయాలి.

చట్టం నిర్దేశించే పద్ధతిలో నేరం రుజువయిన తరువాతనే అతను దోషి అవుతాడు. అయితే విచారించడం కోసం అతన్ని అరెస్టు చేసే అధికారం, ప్రశ్నించే అధికారం పోలీసులకు అవసరం. అయితే ఇది అతనిని చట్టానికి లోబరచడంకోసం కస్టడీలోకి తీసుకునే అధికారమే తప్ప అంతకంటే ఎక్కువగా అనుమానితుడి హక్కులను హరించే అధికారం కాదు.

కాబట్టి, అరెస్టు చేసే సమయంలో ముద్దాయి నుండి ఎదురయ్యే ప్రతిఘటనను అధిగమించడానికి అవసరమైన

దానికి మించి పోలీసులు బలప్రయోగానికి పాల్పడడానికి వీలులేదు. సిఆర్‌పిసిలోని సెక్షన్ 46 ఈమాటే అంటుంది. కానీ ఎంతబలప్రయోగం అవసరమో ఎట్లా తెలిస్తుంది? అనుమానితుడిని అరెస్టుచేసేక్రమంలో పోలీసులు అతనిపైన కాల్పులు జరపవచ్చునా? చంపవచ్చునా? అతనిని కొట్టి నేలమీద పడేసి కదలకుండ చేయవచ్చునా? వీలులేదు. అరెస్టు చేయదలచుకున్న వ్యక్తి మాటలకే లొంగినట్టయితే అతన్ని ముట్టుకునే అధికారం కూడ అరెస్టు చేస్తున్న పోలీస్ అధికారికి లేదు. మాటలకు లొంగకపోయి నట్టయితే భౌతికంగా అదుపులోకి తీసుకోవచ్చు. అరెస్టును ఆవ్యక్తి ప్రతిఘటిస్తే, అప్పుడు బలప్రయోగం చేయవచ్చు. అయితే ప్రతిఘటనను అధిగమించి అరెస్టుచేయడానికి అవసరమైన మేరకు బలప్రయోగం చేయవచ్చు. అంతేతప్ప పోలీస్ అధికారి తన అధికారాన్ని ప్రదర్శించడానికి ఎంతయినా బలప్రయోగం చేయడానికి వీలులేదు. ప్రతిఘటించే సూచనలు లేకున్నా బలప్రయోగం చేయడానికి వీలులేదు. కానీ సాధారణంగా జరిగేది అదే కాబట్టి, చాలా సందర్భాలలో అనుమానితులు అరెస్టు అయ్యే ఘడియలోనే తీవ్రంగా హింసకుగురి అవుతుంటారు. ఈహింస అనవసరమేకాక చట్ట ఏరుద్ధం కూడ. అతరువాత పోలీసుకస్టడీలో జరిగే హింస వేరే విషయం. అరెస్టు చేసేటప్పుడే పోలీసులు ఉపయోగించగల బలప్రయోగానికి చట్టం పెట్టే పరిమితులను తరచుగా అతిక్రమించే ఈ సంస్కృతినిఎదుర్కొనడానికి మానవహక్కుల చైతన్యం, చొరవ అవసరం.

6.7 నేరపరిశోధన పద్ధతి

నేర పరిశోధనలో అనుమానితుల అరెస్టు, ఇంటరాగేషన్ మాత్రమేకాక ఇళ్ళు, అంగళ్ళు సోదాచేయడం, మనుషులను సోదా చేయడం కూడా అవసరం అవుతుంది. నేరంతో సంబంధం ఉన్న వ్యక్తులను, ఇతరసాక్ష్యాలను వెతకడానికి, స్వాధీనం చేసుకోవడానికి చట్టం ఈ అధికారం పోలీసు యంత్రాంగానికి ఇచ్చింది. అయితే మనుషులనూ స్థలాలనూ సోదా చేసే క్రమంలో హక్కులకు భంగం కలగవచ్చు. అవమానపరచడం, గాయపరచడం, వస్తువులను ధ్వంసం చేయడం జరగవచ్చు. ఈ రకమైన హక్కుల అతిక్రమణ సమర్థనీయం కాదు.

అది సమర్థనీయం కాదని భావించడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి, ఒకవ్యక్తి మీద ఎంత సహేతుకమైన అనుమానం ఉన్నా, నేరం రుజువయ్యేదాకా ఆవ్యక్తి అనుమానితుడే తప్ప దోషికాడు. రెండు, నేరం రుజువయిన తరువాత కూడ శిక్షవేయవలసింది న్యాయస్థానమే తప్పపోలీసులు కాదు. నేరపరిశోధన చేసేక్రమంలోనే పోలీసులు అనుమానితులకు శిక్షవేయడానికి వీలులేదు. పోలీసులు చేసే నేరపరిశోధన, న్యాయస్థానానికి నేరనిర్ధారణ చేయడానికి అవసరమైన ఒక పరికరం మాత్రమే, అంతకు మించి వేరే ఏమీకాదు. అనుమానితులను దోషులుగా భావించి నేరపరిశోధన చేసేక్రమంలోనే వారిని శిక్షించడం పోలీసుయంత్రంగానికి అలవాటయిపోయింది. కాబట్టి ఈ విషయాలు చెప్పడం అవసరం. ఈ కారణంగానే, వ్యక్తులనూ స్థలాలనూ సోదా చేసేక్రమంలో తరచుగా వస్తువు విధ్వంసం, వ్యక్తులను అవమానపరచడం (ముఖ్యంగా స్త్రీలను) గాయపరచడం జరగుతుంటుంది.

ఈ రకమైన హక్కుల అతిక్రమణను నివారించడానికి నేరవిధానస్మృతి (సిఆర్‌పిసి)లో కొన్ని నియమాలున్నాయి. సెక్షన్ 51(1) ప్రకారం, అరెస్టుచేసిన వ్యక్తినుండి స్వాధీనం చేసుకున్న వస్తువులకు రసీదు తయారుచేసి ఆవ్యక్తికి ఇవ్వాలి. సెక్షన్ 51(2) ప్రకారం, స్త్రీని సోదాచేసేటప్పుడు మహిళా పోలీసులే చేయాలి. పోలీసులకు సోదాచేసే అధికారం ఉన్నా ఆప్రదేశంలో ఉన్నవారు పోలీసులను లోపలికి రానీయక పోయినట్టయితే పోలీసులు తలుపు లేక కిటికీ పగలగొట్టి లోపలికి ప్రవేశించవచ్చునని సెక్షన్ 47 అంటుంది. అయితే ఆవిధ్వంసం పోలీసులకు లోనికి ప్రవేశించడానికి అవకాశం కల్పించేమేరకు మాత్రమే ఉండాలి. అది కూడ ఆప్రదేశంలో ఉన్నవాళ్ళలోనికి రానీయనప్పుడు మాత్రమే. అంతే తప్ప పోలీసులు పోవడం పోవడమే తలుపులు, కిటికీలు పగలగొట్టకూడదు. లోపలికంటూ ప్రవేశించిన తరువాత కుర్చీలు బల్లలు వస్తువులు విరగ్గొట్టకూడదు. బలప్రయోగంతో లోనికి ప్రవేశించేటప్పుడు కూడ, లోపల ఒక స్త్రీ గనక ఉన్నట్టయితే (అనుమానితురాలు ఆమే అయితే తప్ప) తాములోనికి ప్రవేశించబోతున్న సంగతి చెప్పి ఆమెకు అక్కడినుండి వెళ్ళిపోయే అవకాశం, సమయం ఇవ్వాలి.

BRAOU

స్థలాలను సోదా చేసేటప్పుడు వస్తునష్టం జరగకుండా ఉండటం కోసం సిఆర్ఐపిలోని సెక్షన్ 100 కొన్ని నియమాలు పెట్టింది. ఒక ప్రదేశాన్ని సోదాచేయడానికి పోలీసులు పోయేటప్పుడు 'అప్రాంతంలో నివసించే స్వతంత్రులు, గౌరవనీయులు అయినసాక్షులు ఇద్దరినీగానీ అంత కంటే ఎక్కువగానీ, వెంటపెట్టుకొని పోవాలని ఆసెక్షన్ అంటుంది. సోదా వారి సమక్షంలో జరగాలి. సోదాచేసిన క్రమంలో స్వాధీనం చేసుకున్న వస్తువుల జాబితా పోలీసులు తయారుచేసి ఆసాక్షుల సంతకాలు తీసుకోవాలి. ఆప్రదేశంలో నివసించేవారు సోదా చేసే సమయంలో అక్కడ ఉండి సోదాను చూడదలచుకున్నట్టయితే పోలీసులు వారిని అనుమతించాలి. పోదా అయిపోయిన తరువాత, స్వాధీనం చేసుకున్నవస్తువుల జాబితాను ఆయిద్దరు సాక్షుల సంతకంతో సహావారికి ఇవ్వాలి.

అయితే వాస్తవంలో సోదాచేసే క్రమంలో పోలీసులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేయకుండ నిరోధించడంలో ఈ చట్టాలు విఫలం అయ్యాయి. ఒకవేళ పోలీసులు చేసిన సోదా ఈ చట్టాలను అతిక్రమించినా సోదా చేసి స్వాధీనం చేసుకున్న సాక్ష్యం చెల్లుబాటు అవుతుందని కోర్టుతీర్పులిచ్చాయి.

కాబట్టిసోదా చేసేక్రమంలోనూ, వస్తువులను స్వాధీనం చేసుకునే క్రమంలోనూ మానవహక్కుల అతిక్రమణ జరగకుండ చూడటానికి ప్రత్యేకమైన కృషి అవసరం.

6.8 ముద్దాయి హక్కులు

ఇకన్యాయస్థానంలో విచారణ జరిగేటప్పుడు ముద్దాయికి ఉండే హక్కులు చూద్దాం. అరెస్టుచేసిన తరువాత వీలయినంత త్వరగా ముద్దాయిని న్యాయమూర్తి ఎదుట హాజరుపెట్టాలనీ, ఎట్టిపరిస్థితిలోనూ 24 గంటలు దాటడానికి వీలులేదనీ (అరెస్టు చేసినస్థలం నుండి కోర్టుకు పోవడానికి పట్టేసమయాన్ని మినహాయించి) చట్టం చెపుతుంది అంతేకాదు అరెస్టయిన వ్యక్తికి కోర్టుకు పోయే దాకా తాను ఎందుకు అరెస్టయిందీ తెలియని పరిస్థితి ఉండడానికి వీలులేదు. అరెస్టుకు కారణం ఏమిటో పోలీసులు అరెస్టుచేసిన వ్యక్తికి వెంటనే చెప్పాలని సిఆర్పిసి సెక్షన్ 56 అంటుంది. భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 22 (1) ప్రకారం ఇదొక ప్రాథమికహక్కు. అంతేకాక, ముద్దాయికి తనకునచ్చిన న్యాయవాదిని కలుసుకునే ప్రాథమికహక్కుకూడ ఉంది. అరెస్టయిన క్షణం నుండి ఈ హక్కు ఉనికిలోకి వస్తుంది.

అరెస్టు చేసిన వ్యక్తిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పెట్టగానే మేజిస్ట్రేట్ ఆవ్యక్తిని తగిన కస్టడీకి పంపుతారు. సాధారణంగా స్వల్పకాలాని మాత్రమే ఇస్తారు. అది కూడ నేరపరిశోధనకొనసాగించడానికి పోలీసు కస్టడీకి ఇవ్వడం అవసరం అని కోర్టు భావిస్తేనే. అటువంటప్పుడు ముద్దాయిని ఫలాన గడువుకొకసారి కోర్టుకు తీసుకురావాలని గానీ, ముద్దాయిని బంధించిన స్థలంలో వైద్య పరీక్షలు అనుమతించాలనిగానీ మేజిస్ట్రేట్ ఆదేశించవచ్చు. చిత్రహింసల ప్రమాదాన్ని తగ్గించడానికిది ఉపయోగపడుతుంది. నిజానికి, మొట్టమొదటిసారి ముద్దాయిని పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరు పెట్టినప్పుడే, నిర్భంధంలో ఉన్న సమయంలో పోలీసులతనితో చట్టబద్ధంగా వ్యవహరించినదీ లేనిదీ మేజిస్ట్రేటువాకబు చేయాలి.లేదని ముద్దాయి చెప్తే ఆ వివరాలు మేజిస్రేటు నమోదు చేసి చట్టం ప్రకారం చర్యతీసుకోవాలి.

అయితే మాములుగా మేజిస్ట్రేట్‌లు తమముందు హాజరు పెట్టిన ముద్దాయిని జైలు కస్టడీకి పంపిస్తారు. దీనిని 'జ్యూడిషియల్ కస్టడీ' అంటారు. ఆమాట ప్రయోగించడంలో గలభావమేమిటంటే, జైలులో ఉన్నప్పటికీ ముద్దాయి న్యాయస్థానం కస్టడీలో ఉన్నదని.

నేరం ఇంకా రుజువు కాకపోయినప్పటికీ కోర్టు ముద్దాయిని జైలులో ఎందుకు నిర్భంధిస్తుంది? నేరం రుజువు అయ్యేంతవరకు ముద్దాయి నిర్దోషినన్నది భారత నేరస్మృతికి సంబంధించిన ఒక ప్రాథమిక సూత్రమని చెప్పాము. అటువంటిప్పుడు అనుమానితులను కోర్టుజైలుకు ఎట్లాపంపిస్తుంది?

దీనికి కారణమేమిటంటే న్యాయం జరగాలంటే అనుమానితులు నేరపరిశోధనకూ విచారణకూ అందుబాట్లో ఉండాలి. కేవలం అనుమానితుల యిన (ఇంకా దోషులుగా రుజువుకాని) వారిహక్కులను కాపాడడం చట్టానికి ఎంత ముఖ్యమో, దోషిని గుర్తించి శిక్షించడం కూడ అంతే ముఖ్యం. అందుకోసం ముద్దాయి నేర పరిశోధనకూ విచారణకూ

BRAOU

అందుబాట్లో ఉండాలి. అయితే ఆ అవసరానికి కావలసిన మోతాదును మించి ముద్దాయి స్వేచ్ఛపైన, హక్కులపైన పరిమితులు పెట్టకూడదు.

కాబట్టి నేరపరిశోధన, విచారణలకు అందుబాట్లో ఉండడం కోసం ముద్దాయిని జుడీషియల్ కస్టడీలో, అంటే జైలులో ఉంచడం జరుగుతుంది. అయితే ఇది ఖచ్చితంగా అవసరం అయినమేరకు మాత్రమే. అంతకు మించి అనుమానితుని హక్కులను అణచివేయడానికి వీలులేదు. నేరం తీవ్రమైనది కాని పక్షంలో ముద్దాయి నేరపరిశోధనకు ఆటంకం కలిగించడనీ నేరవిచారణను తప్పించుకోడన చట్టం భావిస్తే అటువంటి నేరాలను చట్టం 'బెయిలబుల్' నేరాలు అంటుంది. అంటే అరెస్టయిన వెంటనే ముద్దాయికి బెయిలుపొందే హక్కు ఉంటుందని అర్థం.

తక్కిన నేరాలను నాన్ -బెయిలబుల్ నేరాలు అంటారు. అంటే అర్థం ఆనేరాలను ముద్దాయికి బెయిల్‌దొరకదనీ, ఇవ్వకూడదనీకాదు. బెయిల్ ఇచ్చేదీ కోర్టు నిర్ణయిస్తుందని మాత్రమే అర్థం. బెయిల్ అసలే ఇవ్వని నేరం చట్టంలో ఏదీ లేదు. నాన్ - బెయిలబుల్ అని పిలవబడే నేరాలలో బెయిలు ఇచ్చేదీ లేనిదీ న్యాయస్థానాల నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. బెయిలబుల్ నేరాలలో అరెస్టు కాగానే బెయిలుపైన విడుదల కావడం ముద్దాయి హక్కు.

నాన్ - బెయిలబుల్ నేరాలలో సహితం, బెయిలు సాధారణ పరిస్థితులలో మొట్టమొదట అడిగినప్పుడే ఇవ్వాలనీ అసాధారణ పరిస్థితులలో మొట్టమొదట అడిగినప్పుడే ఇవ్వాలనీ అసాధారణ పరిస్థితులలో మాత్రమే తిరస్కరించాలనీ సుప్రీంకోర్టు అనింది. ముద్దాయిని విడుదల చేసినట్టయితే న్యాయప్రక్రియకు అడ్డం వస్తాడా లేదా అనేదొక్కటే బెయిలు ఇవ్వడానికీ నిరాకరించడానికీ ప్రమాణం కావాలి.

అయితే చట్టంలోనూ సుప్రీంకోర్టు తీర్పులోనూ ఉన్న ఈ ఉదారవైఖరి న్యాయస్థానాల వ్యవహారశైలిలో కనిపించదు. దొంగతనం వంటి నేరాలలో ఇరుక్కున్న పేదలు న్యాయస్థానాలలో తరచుగా వ్యతిరేకవైఖరిని ఎదుర్కొంటారు. సహేతుకమైన కారణమేదీ లేకుండా వారికి బెయిలు నిరాకరించబడుతుంది. బెయిలు నిరాకరించి, నేరవిచారణ పొడిగించడంవల్ల జైలులో ముద్దాయిలు ధీర్ఘకాలం ఉండిపోతారు. ఒక్కొకసారి వారిపైన ఉన్న అభియోగానికి చట్టం నిర్దేశించిన గరిష్టశిక్ష కంటె ఎక్కువకాలం ఉండిపోతారు.

న్యాయసహాయం పొందడానికి అయ్యేఖర్చు పేదలు, ముఖ్యంగా దళితకులాలకు చెందినవారు, ఎదుర్కొనే సమస్యలలో ఎకటి. చట్టం పౌరులందరికీ హామీ యిచ్చే సమానత్వ సంరక్షణ పేదలు పొందలేక పోవడానికిగల కారణాలలో ముఖ్యమైనది న్యాయవాదిని పెట్టుకోలేకపోవడం. ఈ దుర్భలత్వాన్ని సవరించలేకపోయినట్టయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లోని సమాన సంరక్షణ అనే ప్రాథమికహక్కు ఆచరణలో దక్కకుండానే ఉండిపోతుంది.

సుప్రీంకోర్టు ఈ విషయాన్ని గమనించి, ఉచితన్యాయ సహాయం పౌరుల ప్రాథమిక హక్కు అని తీర్పుఇచ్చింది. నేరవిచారణలో ముద్దాయిలు స్వంతఖర్చుతో న్యాయవాదిని నియమించుకోలేక పోయినట్టయితే వారికి న్యాయస్థానమే ప్రభుత్వం ఖర్చుతో న్యాయవ్యాదిని నియమిస్తుంది. దీనితో పూర్తిసమానత్వం రాదు. ఎందుకంటే ప్రభుత్వం ఈ న్యాయవాదులకిచ్చే ఫీజు 'మార్కెట్ రేటు' కంటే బాగా తక్కువ ఉంటుంది. అయినప్పటికీ ఈ సదుపాయం వల్ల ముద్దాయిలు నేర్పరులయిన న్యాయవాదుల సహాయం పొందగలుగుతారు.

నేరాన్ని విచారించేటప్పుడు న్యాయస్థానం సిఆర్‌పిసి లోని వివరమైన నేరవిచారణ పద్ధతిని అనుసరించాలి. ఈ విచారణపద్ధతి లక్ష్యాలు రెండు : ఒకటి, ముద్దాయికి నిష్పాక్షికమైన విచారణ అందియ్యడం, రెండు, దోషిని గుర్తించి శిక్షించడానికి అవసరమైన అధికారాన్ని న్యాయస్థానానికి ఇవ్వడం.

ఈ విచారణ పద్ధతిని వివరంగా చర్చించుకోవలసిన అవసరం లేదుగానీ కొన్ని విషయాలు చెప్పుకోవాలి. నేరంలో అనుమానితుని చేత బలవంతంగా నేరం ఒప్పించడానికి వీలులేదని చట్టం అంటుందని పరిశోధనకేకాక న్యాయస్థానంలో జరిగే నేరవిచారణలో కూడ ముద్దాయికి హక్కు ఉంటుంది. నేరవిచారణలో ముద్దాయిని సాక్షిబోనులో బలవంతంగా నిలబెట్టడానికి వీలులేదు. నేరాన్ని గురించి అతను ఏమీ చెప్పదలచుకోకపోతే కోర్టు అతనిచేత బలవంతంగా చెప్పించలేదు.

BRAOU

సాక్షిది వేరే సంగతి నేరవిచారణలో సాక్షి అయిన వ్యక్తి కోర్టు ఆదేశించినప్పుడు హాజరుకావలసిందే. సాక్ష్యం చెప్పవలసిందే. ముద్దాయి నేరం చేసాడని రుజువు చేయవలసిన భారం ప్రాసిక్యూషన్‌పైన ఉంటుంది. తన నిర్దోషిత్వం రుజువు చేసుకునే భారం ముద్దాయిపైనలేదు.

నిష్పాక్షికమైన నేరవిచారణలో ఒక ముఖ్య అంశం ప్రతిసాక్షినీ ఎదురు ప్రశ్నించడానికి (క్రాస్ - ఎగ్జామిన్ చేయడానికి) ముద్దాయికి ఉండేహక్కు. ఇది కేవలం ముద్దాయి హక్కు మాత్రమే కాదు. నేరవిచారణలో ఒకతప్పని సరిఘట్టం. క్రాస్ - ఎగ్జామినేషన్ జరగకుండా సాక్ష్యానికి 'సాక్ష్యం'గా విలువలేదు. ముద్దాయికి ఒకసాక్షిని ఎదురుప్రశ్నించే అవకాశం లభించిన తరువాతనే ఆసాక్షి ఇచ్చిన వాంగ్మూలం చట్టం కళ్లలో 'సాక్ష్యం' అవుతుంది. అప్పుడే కోర్టు ఆసాక్ష్యాన్ని పరిగణలోకి తీసుకోగలుగుతుంది. ఉదాహరణకు, ఒక సాక్షి తన వాంగ్మూలం మొత్తం ఇచ్చిన తరువాత ఎదురుప్రశ్న జరగకుండానే చనిపోయాడను కోండి. అతని సాక్ష్యానికి ఏమి విలువ ఉండదు. దానిని న్యాయస్థానం లెక్కలోకి తీసుకోజాలదు.

నేరవిచారణ పద్ధతిలో ఇన్ని జాగ్రత్తలు ఉన్నప్పటికీ న్యాయమూర్తి తప్పులే చేయరని చట్టం భావించదు. కాబట్టి పైకోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశం చట్టంలో ఉంది. రెండవ అప్పీల్‌కు కూడ అవకాశం కొంత ఉంది. మరణదండన విషయంలోనయితే అప్పీల్ కేవలం ముద్దాయి హక్కుకాదు. అది నేరవిచారణలో భాగమే, అంటే సెషన్స్‌కోర్టు విధించిన మరణదండనను హైకోర్టు ధృవీకరించినప్పుడే అది లెక్కలోకి వస్తుంది. ఆతరువాత సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందనుకోండి.

6.9 ముగింపు

కాబట్టి, నేరస్మృతి పోలీసులకూ న్యాయస్థానాలకూ దోమలను గుర్తించడానికీ శిక్షించడానికీ అవసరమైన అధికారాలు ఇస్తూ, అదే సమయంలో అమాయకులకు శిక్షపడకుండ ఉండేందుకు, ఎంత ఉచితమో అంతకు మించిన శిక్షపడకుండా ఉండేందుకు తగిన రక్షణకూడ కల్పిస్తుందని అర్థం అవుతుంది. ఈ రక్షణకోసం అనేక హక్కులు కల్పించబడ్డాయి.

పౌరులు ఈ హక్కులను అనుభవించేటట్టు చూడడం మనబాధ్యత, మనకర్తవ్యం. ఈ హక్కులలోనే కొన్ని లోపాలున్నాయి, పరిమితులున్నాయి. వాటిని గుర్తించాలి, తొలగించాలి. దీనికంతటికీ మానవహక్కుల చైతన్యం ఆచరణ అవసరం. అది లేకుండ హక్కులు పొందలేము. అనుభవించలేము.

6.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి!

1. చట్టంముందు సమానత్వం అర్థాన్ని పరిశీలించండి.
2. ముద్దాయి హక్కులను చర్చించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి.

1. సాక్ష్యాల చట్టాన్ని చర్చించండి.
2. నేర పరిశోధన పద్ధతి వివరించండి.

BRAOU

7. నేరం, శిక్ష, మానవ హక్కులు

విషయక్రమం

7.0 ఉద్దేశం

7.1 పరిచయం

7.2 నిందితుల హక్కులు

7.3 నేరానికి ఉండే సామాజిక మూలం

7.4 సామాజిక భద్రత : మానవ హక్కులు

7.5 నేరం : సామాజిక, ఆర్థిక నేపథ్యం

7.6 నేరాలు : పోలీసుల పాత్ర

7.7 శిక్షకు సంబంధించిన సిద్ధాంత దృక్పథం

7.8 ముగింపు

7.9 మాదిరి పరీక్ష ప్రశ్నలు

7.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలు తెలుసుకుంటారు:

- నిందితులకుగల హక్కులు,
- నేరాల అదుపులో పోలీసుల పాత్ర,
- శిక్షకు సంబంధించిన భావనలు.

BRAOU

7.1 పరిచయం

పోలీసు స్టేషన్లలోనూ, న్యాయ స్థానాలలోనూ అనుమానితులతో వ్యవహరించే తీరు తరచుగా మానవ హక్కుల ఆందోళనకు, దారి తీస్తుంది. ఇది ఎంతగా జరుగుతుందంటే, మానవ హక్కుల వాదులపైన "నేరస్తులను సమర్థిస్తున్నారు" అనీ "చట్టబద్ధంగా బతికే పౌరులకంటే నేరస్తుల మీదే మీకు ఎక్కువ సానుభూతి" అనీ అభియోగాలు వేయడం జరుగుతుంటుంది. ఇదొక తప్పుడు అభిప్రాయం. మానవ హక్కులంటే అర్థం, నేరం వల్ల బాధితులకు కలిగిన నష్టం కంటే నేరానికి పాల్పడిన వారి హక్కులకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం అని కాదు. నేరాలకు గురయిన బాధితుల కష్టాలు తప్పనిసరిగా పట్టించుకోవలసిన విషయాలే. నేరస్తుల నుండి పౌరులను కాపాడటం అవసరం. అందులో భాగంగా నేరస్తులను శిక్షించడం అవసరం. లేకపోతే బలహీనులయిన వారికి బలవంతులనుండి, చాతుర్యం గల వారినుండి రక్షణ ఉండదు.

7.2 నిందితుల హక్కులు

అయితే ఇక్కడ కొన్ని సమస్యలు ఉన్నాయి. నేరస్తులను శిక్షించాలన్న న్యాయమైన ఆతృతను శాంతి భద్రతలు, యంత్రాంగం కేవలం అనుమానితులు మాత్రమే అయినవారి హక్కులను అతిక్రమించ వచ్చును. నేరాన్ని రుజువు చేయడంలోనూ, నేరస్తులను పట్టుకోవడంలోనో అన్యాయమైన పద్ధతులు వినియోగించవచ్చునా? వినియోగించినట్టయితే నిర్దోషులు శిక్షకు గురయ్యే ప్రమాదం లేదా? దోషులను సక్రమంగానే గుర్తించామని అనుకున్నా, చేసిన నేరానికి తగిన శిక్ష కంటె ఎక్కువ శిక్ష వేయవచ్చునా? అసలు నేరస్తులను శిక్షించడంలో గల ఉద్దేశ్యం ఏమిటి? ఏ నేరానికి

ఎటువంటి శిక్ష వేయడం ఉచితంగా ఉంటుంది? అంతేకాక, నేరస్తులను శిక్షించడం అవసరం అన్న ఆతృతలో బలవంతులకు వ్యతిరేకంగా బలహీనులు వ్యక్తం చేసే నిరసనను - ఉదాహరణకు కార్మికుల సమ్మెను - సమాజం నేరంగా పరిగణించడం తగునా? ఇటువంటి ప్రశ్నలకు నేర నిరోధక యంత్రాంగంలోనూ, దాని అంతర్గత నియమాలలోనూ సమగ్రమైన స్థానం లేదు. కాబట్టి వీటిని గురించి మాట్లాడుకోవడం అవసరం. మాట్లాడుకోవడమేకాక ఈ ప్రశ్నలకు సంబంధించిన అవగాహనను, తగిన సంస్థాగత నిర్మాణాలనూ రూపొందించడం కూడ అవసరం.

నేరం అంటే అర్థమేమిటి? దాని నిర్వచనం ఏమిటి? నేరాలలో అనుమానితులయిన వారి హక్కు లేమిటి? శిక్షకుడైన వారికి సహితం ఉండే హక్కు ఏమిటి? అవే ప్రశ్నలను చర్చించేటప్పుడు మనం చేసేది ఇదే.

ఈ ప్రశ్నల గురించి ఆందోళన చెందవలసిన అవసరం ఏమిటి? అన్ని మానవహక్కుల ప్రకటనలు, ఒడంబడికలలోను (1948నాటి అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన, 1966 నాటి అంతర్జాతీయ పౌర రాజకీయ హక్కుల ఒడంబడిక, 1985 నాటి ఐక్యరాజ్యసమితి చిత్రహింసల వ్యతిరేక ఒడంబడిక మొదలయినవి) నేరాలలో అనుమానితులయిన వారికి చిత్రహింసల నుండి, బలవంతపు ఒప్పుకోలు నుండి, అన్యాయమైన నేర విచారణ పద్ధతుల నుండి రక్షణ కల్పించే సూత్రాలున్నాయి. నేరం రుజువయిన దోషులను కూడ క్రూరమైన అనుమానపరమైన శిక్షలనుండి ఈ సూత్రాలు కాపాడబడతాయి. ఒక నేరం చేసి తద్వారా మరొకరి హక్కులకు భంగం కలిగించిన (లేక కలిగించినట్టు అనుమానించబడే) వ్యక్తుల హక్కుల గురించి మనకింత బాధ ఎందుకు? ఒక దొంగ మరొకరి కష్టార్జితాన్ని దొంగిలిస్తాడు. హంతకుడు మరొకరి ప్రాణాన్ని తీసేస్తాడు. ఉరీ, నేరమూ ఎవరో ఒకరికి హానీ కలిగిస్తుంది. తద్వారా హక్కులను అతిక్రమిస్తుంది.

అటువంటప్పుడు, నేరం చేసినట్టు అనుమానించబడే వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు ఉపయోగించే పద్ధతుల గురించి మనం ఆందోళన చెందడం ఎందుకు? నేరం రుజువయిన వ్యక్తులకు వేసే శిక్షలకు సంబంధించిన ప్రమాణాల గురించి ఆందోళన చెందడం ఎందుకు?

బహుశా ఆందోళన వెనుక ఒక విధ్వంసక ఆకాంక్ష దాగి ఉందేమో? సామాజిక వ్యవస్థను ధ్వంసం చేసి అరాచకత్వాన్ని పెంపొందించాలన్న కాంక్ష దాగి ఉందేమో? మానవ హక్కుల గురించి మాట్లాడినప్పటిల్లా ఇటువంటి సందేహాలు ముందుకొస్తాయి.

ఈ సందేహం న్యాయమైనది కాదు. మానవ హక్కుల ఆందోళన లక్ష్యం మానవ నాగరికత సారాన్ని పెంపొందించడమే తప్ప దానిని ధ్వంసం చేయడం కాదు. ఆ లక్ష్యంలో భాగంగానే నేరాలలో అనుమానితులయిన వారి న్యాయమైన హక్కుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తాము. నేరాన్ని సక్రమంగా, హేతుబద్ధంగా నిర్వచించాలనీ శిక్షకు న్యాయమైన ప్రమాణాలు అందాలనీ ఆందోళన చేయడం కూడా అందుకే.

దీనికి కారణం ఏమిటి? చాలా కారణాలున్నాయి. వాటిలో ఒక్కొక్కటీ తెలుసుకుంటే మానవ హక్కుల ఆందోళనకు సంబంధించిన ఈ కోణాన్ని అర్థం చేసుకోగలుగుతాము.

అన్నిటికంటే సాధారణమైన కారణమేమిటంటే నేరం రుజువయ్యేంత వరకు ఎవ్వరూ దోషి కారు. అంతవరకు ఎవరైనా కేవలం అనుమానితుడే కాబట్టి అమాయకులను శిక్షించడం ఎంత తప్పో, వట్టి అనుమానితులను శిక్షించడమూ అంతే తప్పు. నేరాలను నిరోధించడం, నేరస్తులను శిక్షించడం అవసరమయినట్లే నిర్దోషులను, అమాయకులను శిక్షించకుండ ఉండడమూ అవసరమే. పోలీసు నిర్బంధంలో ఒక వ్యక్తిని హింసించడం, లేదా కాల్చి చంపడం నేరం, రుజువు కాకముందే శిక్షించడం అవుతుంది. అదే విధంగా, నేరవిచారణ న్యాయంగా లేకపోవడం అంటే ముద్దాయికి, తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకొనడానికి సహేతుకమైన అవకాశం ఇవ్వకుండ శిక్షించడం అవుతుంది.

దీనికి మానవ నాగరికతను కాపాడడం లేక మెరుగు పరచడానికీ ఉన్న సంబంధం ఏమిటి? నేరం పూర్తిగా రుజువయ్యేంత వరకు అనుమానితులను నేరస్తులుగా చూడకూడదనేది ఒక నాగరికతా నియమం. నేరాన్ని రుజువు

BRAOU

చేయడానికి ఉపయోగించే నేర విచారణ పద్ధతి ముద్దాయికి తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకునేందుకు సహేతుకమైన అవకాశం కల్పించాలన్న నియమంకూడ అంతే. నియమరహితమైన నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో ఈ విలువలను గెలుచుకోవడం, నిలబెట్టుకోవడం జరిగింది. అటువంది పాలనలో మనిషిని శిక్షించడానికి కేవలం అనుమానిస్తే చాలుననే పరిస్థితి ఉంది. అటువంటి పాలనా వ్యవస్థల నేర విచారణ పద్ధతులు పేదలకు, మైనారిటీ మతస్థులకు, జాతులకు సాంఘికంగా అణగారికి వారికి చాలా అన్యాయం చేసాయి. కాబట్టి చిత్ర హింసలనూ అన్యాయమైన నేర విచారణ పద్ధతులను అన్యాయమైన నేరవిచారణ పద్ధతులను వ్యతిరేకించేటప్పుడు మనం నాగరికతను ధ్వంసం చేయడం లేదు. కాపాడుతున్నాం. నియమరహిత నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా నాగరికత సాధించిన విజయాలను కాపాడుతున్నాం.

రెండవది, నేరం వ్యక్తులు చేస్తారే గానీ, శిక్ష సమాజం వేస్తుంది. ఒక్కొక్కసారి నేరస్తులొక గుంపుగా నేరం చేస్తారు. కానీ అదొక వ్యక్తుల గుంపే. శిక్ష వేసేది మాత్రం ఎప్పుడూ సమాజమే. నేరాన్ని పరిశోధించే పోలీసు యంత్రాంగం. విచారించే న్యాయ మూర్తులు. జైల్లో నిర్బంధించే జైలు అధికారులు కాదు, నేరస్తులకు శిక్షించేది. ఈ అధికారులు కేవలం సమాజం ప్రయోగించే పరికరాలు. నేరాలను పరిశోధించేది. విచారించేది. శిక్షించేది. సమాజమే. జరిగిన నేరానికి ప్రతీకారంగా కాక న్యాయం చేయడం కోసం సమాజం ఈ పని చేస్తుంది. నేరాలు కేవలం బాధితుల పైన నేరాలని ఆధునిక నేరచట్టం భావించదు. నేరాలను ప్రధానంగా సమాజంపైన నేరాలుగా భావిస్తుంది. అదే సమయంలో శిక్షకు గల లక్ష్యాన్ని ప్రతీకారం నుండి న్యాయానికి మరలిస్తుంది. దీని వెనుక ఉన్న ఆలోచన ఏమిటంటే నేరం అనేది సామాజిక వ్యవస్థ మూల సూత్రాలకు, అంటే సామాజిక నాగరికత ప్రమాణాలకు, హాని కలిగిస్తుంది. సమాజం కేవలం బాధితులను కలిగిన నష్టాన్ని కాక ఈ నష్టాన్ని సవరించాలని చూస్తుంది. ఆ లక్ష్యంతోనే నేరస్తుడిని శిక్షిస్తుంది. ఆ లక్ష్యంతోనే నేరస్తుడిని శిక్షిస్తుంది. ముద్దాయి హక్కుల గురించి నేరం రుజువయిన దోషుల హక్కుల గురించి, ఎందుకు మాట్లాడాలన్న ప్రశ్న వేసుకున్నప్పుడు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి.

మూడవది ఒక వ్యక్తి 'నేరస్తుడు' కాబట్టి మానవ హక్కుల పేరిట సానుభూతి పొందడానికి అతనికి యోగ్యత లేదని భావించడంలో, నేరం అనే భావన శాశ్వతమైనదని అందులో మార్పు లేదనీ ఒక అవగాహన ఉంది. ఆమోద నీయమైన ప్రవర్తనకూ నేరానికి మధ్య ఖచ్చితమైన, స్థిరమైన విభజనరేఖ ఉందనే అవగాహన ఉంది. కానీ నిజానికి నేరం అనే భావన స్థలకాలాలకు అతీతమైనది కాదు. అది మార్పుకులోనయ్యే సామాజిక విషయం. సమాజం మారినప్పుడు నేరానికుండే నిర్వచనం కూడ మారుతుంది. ఒకే సమాజంలో కూడ ఒకరికి నేరమయింది. మరొకరికి నేరం కాదు. ఒక సందర్భంలో నేరమయింది. మరొక సందర్భంలో కాదు. కాలం మారితే సైతము ఇవ్వాళ నేరమయింది రేపు కాకపోవచ్చు.

అంటారానితనం ఈ రోజొక నేరం. రెండు వందల ఏళ్ళ కింద, అందుకు విరుద్ధంగా, అంటరాని తనాన్ని ఆమోందించక పోవడం నేరం. నేరస్తులను ఎప్పుడూ ద్వేషించవలసిందే. మానవతకూ సానుభూతికీ దూరం ఉంచవలసిందే ననుకుంటే రెండు వందల ఏళ్ళ కింద అంటరానితనానికి వ్యతిరేకంగా తిరగబడిన దళితుడు సమాజం ద్వేషానికి గురయి ఉండేవాడు. ఈ రోజు అంటరానితనం పాటించే సవర్ణులు గురికావలసి ఉంటుంది.

సంప్రదాయంగా, భర్తకు భౌతికంగా లోబడి ఉండని స్త్రీ - అతను కొట్టే దెబ్బలు మౌనంగా స్వీకరించని స్త్రీ నేరం చేసినట్టే ఇప్పుడది పాక్షికంగా మారింది. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 498-A ప్రకారం భర్త భార్యను భౌతిక హింసకే కాదు, మానసిక హింసకు గురిచేసినా అది నేరమే.

కాబట్టి నేరం అనేదానికి స్థిరమైన అర్థంలేదు. నాగరికత మారేకొద్దీ అది మారుతుంది. 'నేరస్తులకు సానుభూతి చూపించడమేమిటి?' అనిగానీ 'నేరస్తుల మానవ హక్కుల గురించి మాట్లాడవద్దు' అనిగానీ అన్నప్పుడు మనం నేరం అనే భావనకొక స్థిరత్వాన్ని ఇస్తున్నాము. అటువంటి స్థిరత్వం చరిత్రలో లేదు.

BRAOU

అంటరాని తనం, భార్యను హింసించడం అనేవి ఈ వాదనకు అనుకూలంగా ఎంచుకున్న ఉదాహరణలని అభ్యంతరం చెప్పొచ్చు. ఇవి మినహాయింపులనీ, దొంగతనం, హత్య, మోసం, రేప్ మొదలయిన అనేక ఇతర నేరాలకు స్థిరమైన అర్థం ఉందనీ అనొచ్చు. మానవ నాగరికత (అత్యంత ప్రాథమిక దశల్లో తప్ప) వీటిని ఎప్పుడు నేరాలు గానే భావించిందనీ కాబట్టి ఇటువంటి నేరాలను బాధ్యులయిన వ్యక్తులకు మానవ హక్కులు ఉండవనడంలో తప్పేమీ లేదనీ అనొచ్చు.

ఇవి నిజమేననిపిస్తుంది గానీ, వాస్తవంగా నిజమేనా? సమాజంలో మొత్తం మీద హత్యను నేరంగా భావించాడనేది సత్యమే. కానీ అన్ని సమాజంలో దానికి మినహాయింపు పెట్టాయి. అనేక ఆదివాసీ తెగలతో, తమ తెగకు చెందిన వ్యక్తిని చంపడం నేరమేగానీ ఇతర తెగలకు చెందిన వారిని చంపడం నేరం కాక పోవచ్చు. ఒక్కొక్కసారి అటువంటి హత్యలను వీరోచితమైన చర్యలుగా కూడ భావించడం జరుగుతుంది. మధ్యయుగాల హైందవ సమాజంలో, హత్యను మామూలుగా నేరంగా భావించారు గానీ, క్షత్రియుడు తన కుల ధర్మ నిర్వహణలో భాగంగా చేసిన హత్యలను నేరంగా భావించలేదు. ఆ హత్యలు సరయినవే, న్యాయమైనవే, క్షేత్ర ధర్మానికి అనుగుణ్యమైనవే (భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడితో చెప్పినట్టు) అదే విధంగా వర్ణాశ్రమ ధర్మానికి వ్యతిరేకంగా తిరగబడ్డ శూద్రుడిని చంపడం కూడ నేరంగా భావించబడలేదు. దానినొక న్యాయమైన చర్యగానే భావించారు. ఆధునిక కాలంలో ఎవరు ఎవరిని చంపినా అది నేరమే. విదేశీయుడిని చంపినా అది నేరమే. ఆ విదేశీయుడు శత్రు సైనికుడయితే తప్ప. అప్పుడతనిని చంపడం నేరం కాకపోగా భారత సైనికుడి కర్తవ్యం అవుతుంది. శత్రుసైనికులను చంపడంలో కూడా భారత సైనికుడు ఎంత ఉత్సాహం చూపిస్తే అంతగా అతని దేశభక్తిని దేశం గుర్తిస్తుంది. కానీ మరుసటి దినం అదే శత్రు సైనికుడు టూరిస్టుగా భారత దేశాని కొస్తే అతనిని చంపడం మళ్ళీ నేరం అవుతుంది.

గ్రామస్థులు గుంపయి బంది పోట్లను పట్టుకొని కొట్టి చంపిన ఘటనలు మనకు తెలిసినవే. చట్టం కళ్ళలో ఇవి హత్యలే అయినప్పటికీ వాటిని వీరోచితమైన కృత్యాలుగా మనం అభినందిస్తుంటాం. పూర్తిగా చట్టానికి విరుద్ధంగా, బందిపోట్లను చంపమని చంపితే కేసులుండవనీ ప్రజలను రెచ్చగొట్టిన పోలీస్ అధికారులు ఉన్నారు.

మోసాన్ని మరొక ఉదాహరణగా తీసుకోవచ్చు. మరొకరిని మోసం చేసి వారిని నష్టపరచి తాము ప్రయోజనం పొందాలని చూడడం భారత శిక్షాస్మృతి ప్రకారం నేరం. అయితే అతి తెల్లటి పళ్ళ గురించి అత్యంత శుభ్రమైన ఉతుకు గురించి కంపెనీలు చేసే అడ్వర్టైజ్‌మెంట్‌లకు ఇది వర్తించదు. ఆ ప్రచారం కూడ మోసమేనని మనకు తెలుసుగానీ ఈ చట్టం వర్తించదు. దానిని పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధించిన సాధారణవ్యాపార నీతిగానే పరిగణించడం జరుగుతుంది. పైగా దానికోసం చాలా నేర్పరితనం, కళాత్మకత వెచ్చించబడుతుంటాయి కూడ. అడ్వర్టైజు మెంట్ వట్టి మోసమేనని అందరికీ తెలిసినప్పటికీ చట్టంగానీ మనంగానీ దానిని శిక్షార్హమైన నేరంగా భావించము.

కల్తీ సరుకు అమ్మడం ద్వారా వినియోగదారున్ని మోసం చేయడాన్ని కూడ వ్యాపార నీతిగానే చాలా కాలం భావించడం జరిగింది. దానిని గౌరవించక పోవచ్చుగానీ సహించేవారు. అది 'మోసం' అనే నేరం కిందికి వచ్చేది కాదు. చట్టం నుండి వినియోగదారుడు సహాయం కోరుకున్నట్టయితే సంక్లిష్టమైన సివిల్ కేసులు చేపట్టవలసి వచ్చేది. వినియోగదారుల ఉద్యమం ముందుకొచ్చి వినియోగదారుల రక్షణకోసం చట్టాలు చేసిన తరువాతే ఈరకమైన మోసానికి నేరంగా కచ్చితమైన గుర్తింపు వచ్చింది. మరొక రకంగా చెప్పాలంటే, వినియోగదారుల ఉద్యమం అభివృద్ధి చెందిన గ్రామంలో ఈ రకమైన మోసానికి ఉండే సామాజిక అర్థం మారిపోయింది. ఇష్టంగాను అయిష్టంగాను అందరూ సహించిన వ్యాపార నీతిగా ఉన్నది, కొత్తగా దాని కోసమే రూపొందించిన చట్టాల కింద నేరంగా గుర్తింపు పొందింది.

ఇది దొంగతనానికి కూడ వర్తిస్తుంది. ఇంటికి కన్నం వేసే వాళ్లు జేబుకు కన్నం వేసే వాళ్లు చేసే నేరాన్ని మాత్రమే దొంగతనం అంటాము. పరిపాలనా వ్యవహారల నిర్వహణ క్రమంలోనూ, వ్యాపార క్రమంలోనూ జరిగే

BRAOU

దానిని దొంగతనం అనరు. అంతకంటె మర్యాద పూర్వకమైన మాటలు ప్రయోగిస్తారు. దానిని దుర్వినియోగం అంటారు. సాధారణంగా దొంగతనాలకు సంబంధించిన చట్టాన్ని ఈ నేరానికి వర్తింపజేయరు. అంతకంటె సున్నితమైన పద్ధతులలో దానితో వ్యవహరించడం జరుగుతుంది. సాధారణంగా దానిని విస్మరించి ఊరుకోవడం జరుగుతుంది.

లైంగిక అత్యాచారాన్ని ఇంకొక ఉదాహరణంగా తీసుకోవచ్చు. ఒక స్త్రీతో ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక చర్య జరపడాన్ని అన్ని సమాజాలూ వ్యతిరేకించాయి గానీ, ఎప్పుడూ కొన్ని మినహాయింపులు ఇవ్వడం జరిగింది. అగ్రవర్ణ భూస్వామ్య కుటుంబాలకు చెందిన మగవాళ్లు, పూజారులు, కింది కులాల స్త్రీలను లేక జోగినులను లేక దేవదాసీలను బలాత్కరం చేయడం ఒక హక్కుగా భావించిన రోజులు ఉండేవి. ఆధునిక చట్టం ఈ రకమైన వికృతమైన హక్కులను గుర్తించదు గానీ మనబోటి కొన్ని దేశాలకు భార్య ఇష్టానికి వ్యతిరేకంగా ఆమెతో సంభోగించడం భర్తకుండే చట్టపరమైన హక్కుగా భావించబడుతుంది. రేప్ నేరాన్ని నిర్వహించి భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 376 భర్త భార్యపైన చేసే అత్యాచారానికి మినహాయింపు ఇస్తుంది. సామాజికంగా కూడ ఆ భర్త తన 'హక్కు' తీసుకుంటున్నాడని భావించడం జరుగుతుందే తప్ప, అతను నేరం చేసాడని ఎవరో అనుకోరు. అతనిని నేరస్తుడిగా చూడడం జరగదు. అయితే కొన్ని పాశ్చాత్య దేశాలలో ఈ 'హక్కు'కు గుర్తింపు లేదు. భార్య ఇష్టానికి వ్యతిరేకంగా ఆమెతో సంభోగించాలని ప్రయత్నం చేసే భర్తను రేపిస్ట్‌గా అక్కడ చట్టం భావిస్తుంది. భారత నేరస్మృతిలో కూడా అటువంటి మార్పు తీసుకు రావాలని మహిళా ఉద్యమం ప్రయత్నిస్తున్నది.

7.3 నేరానికి ఉండే సామాజిక మూలం

నేరానికి అర్థం సామాజికం అని ఈ పాటికి స్పష్టం అయి ఉంటుంది. కాబట్టి 'నేరస్తుల పట్ల' మానవతతో స్పందించనక్కర లేదు' అనీ ప్రకటించేటప్పుడు మనం ప్రయోగించే విశ్వజనీన నైతిక ప్రమాణం పైకి కనిపించినంత న్యాయమైనది కాదు.

నాలుగవది, నేరానికి ఉండే అర్థమే కాదు, దానికారణం లేక మూలం కూడ కనీసం కొంతమేరకు సామాజికమే. యువతను పేదరికమే నుర ప్రపంచంలోకి నెడుతుందన్ని ఆలోచన సినిమాల ద్వారా సుపరిచితం అయింది. తరచుగా దీనిని చాలా నాటికీయంగా వ్యక్తం చేయడం జరుగుతుంది. ఉదాహరణకు చావు బతుకులలో ఉన్న తల్లికి మందులు కొని ఇవ్వడం కోసం డబ్బులు లేక దొంగతనానికి పాల్పడ్డ యువకుడు ఆ తరువాత నేరస్తుడిగా కొనసాగినట్టు చూపిస్తారు. నిజజీవితం మరీ అంత నాటకీయం కాదు. నేరం చేయాలన్న నిర్ణయం ఎల్లప్పుడూ సంపూర్ణంగా సమాజం వ్యక్తిమీద రుద్దేదే కాదు. ఎదో ఒక మేరకు ఆ వ్యక్తి సంకల్పపూర్వకంగా తీసుకున్న నిర్ణయం కూడ అందులో ఉంటుంది.

అయితే చాలా సందర్భాలలో వ్యక్తిని నేరం వైపు పురిగొల్పే సామాజిక పరిస్థితుల పాత్ర కూడ గణనీయంగా ఉంటుంది. వీటిలో కొన్ని పరిస్థితులు - ఉదాహరణకు లైంగిక సంబంధమైన అసూయలన్ని సామాజిక వ్యవస్థలలోనూ అన్ని సామాజిక వర్గాలలోనూ సామాన్యంగా ఉండేవే కాబట్టి వాటిని సామాజిక కారణాలు అనికాక మానవమనుగడలో సార్వజనీనమైన కారణాలు అనవచ్చును. అయితే కొన్ని కారణాలు ప్రత్యక్షంగా సామాజికమైనవి. ఉదాహరణకు పేదరికం, లేమి, సామాజిక అణచివేత మొదలయినవి. మన సమాజంలో జరిగే నేరాలలో ఈ రకమైన సామాజిక పరిస్థితుల నుండి ఉత్పన్నమయ్యేవి చాలా ఉన్నాయి. అంటే అర్థం, ఈ పరిస్థితులు పోతే నేరాలన్నీ పోతాయని కాదు. నేరాలు పూర్తిగా అదృశ్యం కాకపోవచ్చు ఎందుకంటే మానసిక మూలంగల వ్యక్తిగత కారణాలవల్ల జరిగే నేరాలు కొనసాగవచ్చు. అంతేకాక కొత్త సామాజిక పరిస్థితుల నుండి కొత్త నేరాలు పుట్టగలవు. అవి లేమి నుండి కాక కలిమి నుండి పుట్టే నేరాలు కావచ్చు. అయితే సామాజిక సంపదతో పాటు సామాజిక సంక్షేమం కూడ బాగా అభివృద్ధి చెందిన స్కాండినేవియన్ దేశాల అనుభవాన్ని బట్టి అటువంటి స్థితిలో నేరాలు మొత్తం మీద తక్కువగా ఉంటాయని చెప్పవచ్చు.

BRAOU

కాబట్టి నేరం కొంతమేరకు 'పరిస్థితుల సృష్టి' అని చెప్పవచ్చు. నేరగాళ్ల హక్కుల గురించి, ముద్దాయిల హక్కుల గురించి మాట్లాడడం సబబు అన్న ప్రశ్నను చర్చించేటప్పుడు దీనినొక ముఖ్య విషయంగా గుర్తుంచుకోవాలి. నేరస్తుల హక్కుల గురించి మాట్లాడడం పట్ల మనం అభ్యంతరం చెప్తున్నామంటే అర్థం మనం నేరానికి గల బాధ్యతను మొత్తంగా వ్యక్తిమీద పెట్టి సమాజం పాత్రను, సామాజిక పరిస్థితుల పాత్రను ఉపేక్షిస్తున్నామని, నేరస్థుడు నేరానికి నూరు శాతం తానే బాధ్యుడనుకోవడం వల్లనే మనం మానవతను మరిచిపోగలుగుతున్నాం. నేరస్థుడు తనకు మానవ హక్కులు ఉన్నాయన్న విషయం మరచిపోగలుగుతున్నాడు.

నేరం వెనుక ఉన్న సామాజిక పరిస్థితులూ కారణాలూ వ్యక్తి అదుపులో ఉండవు. కాబట్టి ఆ మేరకు నేరానికి బాధ్యత వ్యక్తిది కాదు. అయితే సామాజిక పరిస్థితులు వ్యక్తి అదుపులో ఉండవంటే అర్థం ఆ పరిస్థితులకు వ్యక్తిపైన ఉండే ప్రభావం కూడ వ్యక్తి అదుపులో ఉండదని కాదు. పేదరికం అనేవి పేద వ్యక్తులు అదుపులో లేని ఒక సామాజిక పరిస్థితి అయితే పేదరికం కారణంగా దొంగతనం చేయాలన్న తలపురావడం పూర్తిగా వ్యక్తి అదుపులోలేని విషయం కాదు. అయితే ఆ ప్రోద్బలాన్ని అర్థం చేసుకోగలము. అది చట్టం దృష్టిలో నేరం. కానీ మానవతా దృక్పథంతో దానిని అర్థం చేసుకోగలము. కాబట్టి ఆ ప్రోద్బలానికి లోనయిన వ్యక్తిని పూర్తిగా సానుభూతికి అతీతునిగా భావించనక్కర లేదు.

వ్యక్తి అదుపులో లేని పరిస్థితుల ప్రోద్బలం వల్ల ఆ వ్యక్తి చేసే పనులకు అతన్నే పూర్తిగా బాధ్యుడిని చేయకూడదన్న ఆలోచన చట్టంలో సహితం లేకపోలేదు. ఇప్పడున్న చట్టం కూడ అటువంటి కొన్ని పరిస్థితులను గుర్తిస్తుంది. వాటికి తక్కువ శిక్ష నిర్దేశిస్తుంది. అయితే చట్టం గుర్తించే ఆ పరిస్థితులు సామాజికం కాదు. ఉదాహరణకు, ఎదుటివారు అకస్మాత్తుగా రెచ్చగొట్టడం వల్ల కోపాద్రిక్తులయి చేసిన నేరానికి చట్టం తక్కువ శిక్షవేస్తుంది. ఎందుకంటే ఆ చర్య ఆ వ్యక్తి అదుపులో లేనిది కాబట్టి. ఒక్కొక్క సారి అటువంటి నేరాలను చట్టం పూర్తిగా క్షమిస్తుంది కూడ. చట్టం గుర్తించే ఈ కారణాలకు సామాజిక ఆర్థిక కారణాలను కూడ చేర్చాలని మానవ హక్కుల దృక్పథం భావిస్తుంది.

నేరానికిగల అర్థం సామాజికమనీ నేరానికి సామాజిక నేపథ్యం ఉందనీ అనడం, మానవ హక్కుల పేరిట నేరాలను సమర్థించడమేనని అనిపించవచ్చు. అంటే హింసనూ అభద్రతనూ కల్పించే చర్యలను సమర్థిస్తున్నామనుకోవచ్చు. మానవ హక్కుల అనేదొక సంఘవ్యతిరేక భావన అనే అనుమానం ఇక్కడ మళ్లీ ధ్వనిస్తుంది. కానీ ఇది నిజం కాదు. సామాజిక భద్రతను కాపాడడం అవసరమే. కాబట్టి నేరాలను నిరోధించడములో నేరస్తులను శిక్షించడమూ అవసరమే.

7.4 సామాజిక భద్రత : మానవహక్కులు

మనం సామాజిక భద్రతను ఎందుకు కోరుకుంటాం? భద్రత భద్రత కోసమేనా? అదే జీవిత లక్ష్యమా? కాదనేది స్పష్టమే. భద్రత ఎందుకు కోరుకుంటామంటే అదే లేకపోతే బలహీనులు, అమాయకులు ధనవంతుల, బలవంతుల దాడులకూ తెలివైన వాళ్ల మోసాలకూ దోపిడీకీ గురి అవుతారు కాబట్టి, భద్రత లేకపోతే భయం, అస్థిరత, జీవితాన్ని ఆక్రమించుకుంటాయి. ముఖ్యంగా పేదల, బలహీనుల అమాయకుల జీవితాలను అప్పుడు మానవ హక్కులనేవే ఉండవు. అవసరమైన పరిమాణంలో సామాజిక భద్రత లేకపోతే మానవ హక్కులను మనుగడ ఉండదు. శాంతి భద్రతల యంత్రాంగం అందుకోసమే ఉంది. తమ సామాజిక ఆర్థిక పరిస్థితులు అనుమతించే మేరకు ప్రజలు జీవితాన్ని స్వేచ్ఛను అనుభవించేందుకు, బలహీనులూ పేదలూ బలవంతుల నుండి రక్షణ పొందేందుకు, ఈ యంత్రాంగం అవసరం.

అయితే మానవ హక్కులను అనుభవించగల పరిస్థితిని కల్పిస్తుందన్న కారణంగానే భద్రతను కాంక్షిస్తామన్న విషయాన్ని ఎప్పుడయితే గుర్తిస్తామో, అప్పుడు సామాజిక భద్రతను కాపాడే పనికూడ మానవ హక్కులను గౌరవించే పద్ధతిలో జరగాలని కూడ గుర్తించ గలుగుతాము. లేకపోతే లక్ష్యాన్ని సాధనం ధ్వంసం చేస్తుంది. ప్రజలు శాంతిగా

BRAOU

బతకగలగాలనీ, మానవ హక్కులకు భంగకరమైన అస్థిర, భయం నిండిన జీవితం నుండి స్వేచ్ఛ లభించాలనీ మనం సామాజిక భద్రతను కోరుకునేట్టయితే, మరి అభద్రతను నిరోధించే కర్తవ్యం, శిక్షించే కర్తవ్యం కూడ మానవ హక్కులను కాపాడే పద్ధతిలోనూ పెంపొందించే పద్ధతిలోనూ జరగాలి. అంతేగానీ మానవ హక్కులను ధ్వంసం చేసే పద్ధతిలో కాదు. లేకపోతే వైద్యం రోగాన్ని నయం చేసే బదులు రోగిని అంతం చేస్తుంది.

తమకు ఉన్న సామాజిక ఆర్థిక అవకాశాలు మానవ హక్కులను అనుభవించడానికి ఏ మేరకు అవకాశం కల్పిస్తాయో ఆ మేరకు వాటిని ప్రశాంతంగా మనుషులు అనుభవించడానికి సామాజిక భద్రత అవసరం అని చూసాము. అయితే ప్రజలలో కొంత మందికి సామాజిక ఆర్థిక అవకాశాలు అతి తక్కువగా ఉండవచ్చు. అవి కల్పించే మానవ హక్కులు అతి స్వల్పం కావచ్చు. వేరే మాటలలో చెప్పాలంటే, సామాజిక భద్రతను ఒక సామాజిక ఆర్థిక నేపథ్యం ఉంటుంది. ఒక్కొక్క సామాజిక వ్యవస్థలో కొంత మంది చాలా ధనవంతులు, మరికొంతమంది చాలా ధనవంతులు, మరికొందరు అత్యంత దరిద్రులు, మానవ హక్కులు అతితక్కువగల వారు ఉండవచ్చును. ఒక్కొక్క సామాజిక వ్యవస్థలో ఆర్థిక అసమానతలు మరీ అంత కొట్టొచ్చినట్టు ఉండకపోవచ్చును. కొన్ని సామాజిక వ్యవస్థలలో ప్రజలలో కొందరు సామాజికంగా బలహీనులు కావచ్చు. ఉదాహరణకు భారతదేశంలో దళితుల స్త్రీల లాగ, అందరు భిన్నంగా, సామాజిక దౌర్బల్యం గానీ విపక్షంగానీ మరీ అంత తీవ్రంగా లేని సామాజిక వ్యవస్థలు ఉండవచ్చు.

7.5 నేరం : సామాజిక, ఆర్థిక నేపథ్యం

అటువంటి విపక్ష అనుభవించే వారు. అంతకంటే భిన్నమైన సామాజిక వ్యవస్థ కావాలని న్యాయంగా కోరుకోవచ్చు. తాము మరింతగా మానవ హక్కులు అనుభవించగల సామాజిక పరిస్థితల కోసం వారు సంఘటితంగా పోరాటం చేయవచ్చు. బంద్‌లు, రాస్తారోకోలు నిర్వహించవచ్చు. ఊరేగింపులు తీయవచ్చు. ధర్నాలు చేయవచ్చు.

అటువంటి పోరాటాలు చేసే వారిని తరచుగా భద్రతకు శత్రువులుగా భావించడం జరుగుతుంది. కానీ వారు భద్రతకు శత్రువులు కారు. అప్పటి సామాజిక వ్యవస్థకు శత్రువులు. జీవితం, స్వేచ్ఛ, మానవ హక్కులు, అనుభవించడానికి అందరికీ భద్రత కావాలి కాబట్టి భద్రతకు శత్రువులయిన మనుషులెవరూ ఉండరు. అయితే ఒక సామాజిక వ్యవస్థలో మానవ హక్కులు కరువైన వారు ఆ సామాజిక వ్యవస్థకు శత్రువులు కాగలరు. వారికి కూడ భద్రమైన జీవితం కావాలి. కానీ తమకు మరింత నిండుగా మానవ హక్కులు కల్పించే భిన్నమైన సామాజిక ఆర్థిక వ్యవస్థను వారు కోరుకుంటారు. ఆ కోరిక అటువంటి పోరాటాలు చారిత్రక ప్రగతికోసం అవసరం. అయితే అటువంటి పోరాటంలో ప్రస్తుత సమాజంలో భద్రతకు భంగకరం కాగలవు. వాటివల్ల అభద్రత, హింసాత్మక నేరాలు జరిగితే సమాజం వాటిని మొత్తంగా ఉపేక్షించజాలదు. అయితే ఆకారణంగానే, భద్రతనను కాపాడే వ్యవస్థలు మానవ హక్కులను గౌరవించాలి. అభద్రతకు ఉండే సామాజిక మూలాలను సానుభూతితో అర్థం చేసుకోవాలి. నిరసననూ పోరాటాలనూ నిర్దాక్షిణ్యంగా ఖండించేవైఖరి వాటికి పాల్పడే వారి పట్ల మానవత ప్రదర్శించనక్కర లేదనీ వారికి మానవ హక్కులు ఉండపనీ అనుకునే వైఖరి, ప్రగతికి హానికరం.

నేరాలలో ముద్దాయిలయినవారి హక్కుల గురించి, నేరానికిచ్చే నిర్వచనాన్ని గురించి, శిక్షా ప్రమాణాల గురించి ఆలోచించాలనీ సున్నితంగా వ్యవహరించాలనీ భావించడానికి ఇవన్నీ కూడ కారణాలే. నేరానికి శిక్షకూ ఇన్ని కోణాలున్నాయని ఎప్పుడయితే అర్థం చేసుకుంటామో, అప్పుడు ఈ క్రింది ప్రశ్నలు వేసుకోవలసి ఉంటుంది. నేరాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఏవిధంగా నిర్వచించాలి? నేరాన్ని నిరోధించడానికి ఏ రకమైన పద్ధతులు ఉపయోగించ వచ్చును? నేర పరిశోధన ఏ విధంగా చేయవచ్చు, నేరాలను ఏ విధంగా విచారించడం సబబుగా ఉంటుంది? చివరిగా, ఏ విధంగా శిక్షించడం సరయినది? నిజానికి ఇవన్నీ ఏ విధంగా ఉండాలి అనే దానికన్న ఏ విధంగా ఉండకూడదు అనే దాని మీద మన దృష్టి ఎక్కువ ఉంటుంది. వేరొక భాషలో చెప్పాలంటే ఈ కర్తవ్యాలను మానవ హక్కుల స్పృహ ఏ విధంగా కలిగించాలన్నది మన సమస్య.

BRAOU

నేరానికి ఇచ్చే నిర్వచనం సామాజిక ఆర్థిక పరిస్థితుల పట్ల స్పృహ కలిగి ఉండాలన్నాము. ప్రస్తుతం భారతదేశంలో ఉన్న చట్టాలలో కొన్నిటికి మాత్రమే ఈ లక్షణం ఉంది. ఉదాహరణకు వరకట్న నిషేధ చట్టం, అంటరానితనాన్ని నిషేధించే చట్టం. సాధారణంగా మాత్రం చట్టం ముందు అందరూ సమానమే అని చట్టం అంటుంది. అంటే నేరాలను నిర్వచించేటప్పుడు శిక్షలు నిర్దేశంచేటప్పుడు, నేరస్తులు, సామాజిక ఆర్థిక పూర్వరంగాన్ని చట్టం పట్టించుకోదు. ఇది ఒక కోణంలో మంచిదే. ఎందుకంటే చట్టానికి ఉండే ఈ వైఖరి ఫలితంగా ధన వంతులకు, బలవంతులకు చట్టంలో ప్రత్యేక ప్రతిపత్తి ఏదీ ఉండదు. వాళ్ళ పట్ల చట్టం ఉదారంగ ఉండడానికి వీలుండదు. అయితే వేరొక కోణంలో ఇది చెడ్డది పేదలకూ సాంఘికంగా బలహీనులయిన వారికీ చట్టం చూపించవలసిన ఔదార్యం చూపించదు. లేమినుండి, అణచి వేతనుండి పుట్టే ఒత్తిడులను చట్టం తగినంగా లెక్కలోనికి తీసుకోదు. మానవ హక్కుల దృక్కోణం నుండి చూసినప్పుడు ఇది చట్టంలోని ఒక లోపం.

నేరనిరోధం మాటకొస్తే, అది పూర్తిగా పోలీసుల బాధ్యత కాకూడదు. అది ప్రధానంగా సమాజం బాధ్యత. నేరానికి ప్రోద్బలం కల్పించే పరిస్థితులను తొలగించాలి. లేదా బాగా తగ్గించాలి. పేదరికం, లేమి, నిరుద్యోగం ఉన్న సమాజాలు నేరానికి నిలయాలయి ఉంటాయి. సమాజంలో అన్ని స్థాయిలలోనూ వస్తు దాహాన్నీ దయాదాక్షిణ్యాలు లేని పోటీనీ ప్రోత్సహించే పెట్టుబడి దారీ వ్యవస్థ కూడ నేరానికి నిలయమయి ఉంటుంది. ఈ పరిస్థితిని తొలగించడం, లేదా అదుపు చేయడం నేరాలను తగ్గించడానికి చాలా దోహదం చేయగలదు. దురదృష్ట వశాత్తు నేరానికీ సమాజానికి మధ్యనున్న ఈ సంబంధం తరచుగా కనుమరుగవుతున్నది. నేరాలను అదుపు చేయడం కేవలం పోలీసుల కర్తవ్యమయినట్టు భావించడం జరుగుతున్నది.

7.6 నేరాలు : పోలీసుల పాత్ర

నేరాలను అదుపు చేయడానికి పోలీసులకు తెలిసిన ఒకే ఒక మార్గం సులభ ప్రయోగమార్గం. హింస జరిగే అవకాశ ముందనుకొన్నప్పుడు, లేదా నేరాల సంఖ్య పెరిగినప్పుడు, పోలీసులు సంఘ వ్యతిరేక శక్తులను' అదుపులోకి తీసుకుంటున్నదన్న వార్తలు పత్రికలలో చదువుతుంటాం. వాళ్ళను అదుపులోకి తీసుకునేది నేరం చేసినందుకు కాదు, నేరం చేయకుండ ఉండేందుకు. ఈ అదుపులోకి తీసుకోవడం అనేది ఏ చట్ట బద్ధతా లేకుండ జరగవచ్చు లేదా నేర విచారణ, స్మృతి (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్) లోని సెక్షన్లు 107-100ల క్రిందనయినా జరగవచ్చు. ఎవరినయినా 'ముందు జాగ్రత్త'గా ప్రభుత్వమే బంధించదలచుకుంటే జాతీయ భద్రతా చట్టం (నాసా) వంటి చట్టాలను ప్రయోగిస్తుంది.

మానవ హక్కుల సూత్రాలు ఈ 'ముందు జాగ్రత్త' నిర్బంధాన్ని సహేతుకమైన సందేహంతో చూస్తాయి. ఆ నిర్బంధం ఫలితంగా కనీసం ఏదో ఒక నేరంలో ముద్దాయి కూడా కాని వ్యక్తి స్వేచ్ఛను హరించడం జరుగుతుంది. ఇది సూత్రరీత్యా అభ్యంతరకరమే. తరచుగా దుర్వినియోగానికి గురి అవుతుంటుంది కూడ. పాలకుల రాజకీయ ప్రత్యర్థులు, కార్మిక సంఘాల నిర్వాహకులు మొదలయిన వారిని కేవలం అధికారంలో ఉన్న వ్యక్తుల ప్రయోజనాలను, పార్టీల ప్రయోజనాలను కాపాడడం కోసం 'ముందు జాగ్రత్త'గా నిర్బంధించవచ్చు.

అభద్రతను అదుపు చేయడానికి పోలీసులకు తెలిసిన మరొక మార్గం భౌతిక బలప్రయోగం. పూర్తిగా శాంతి యుతంగా నడిచే ధర్నాలను, ఊరేగింపులను ప్రదర్శనలను సహితం చెదరగొట్టడానికి ఈ పద్ధతిని తరచుగా వినియోగించడం జరుగుతుంది.

కాబట్టి, నేరాలను అరికట్టే క్రమంలో అనేక హక్కుల అతిక్రమణ తరచుగా జరుగుతుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21లలోని వ్యక్తిగత స్వేచ్ఛ, సమావేశ స్వేచ్ఛ, భావప్రకటన హక్కు మొదలయినవన్నీ అతిక్రమణకు గురవుతుంటాయి.

అందువల్ల, నేరనిరోధన క్రియ మానవ హక్కుల ప్రమాణాలకు లోబడి ఉండేటట్టు చూడడానికి చాలా మానవ హక్కుల స్పృహ కావాలి.

BRAOU

ఇంక నేరపరిశోధనలోనూ నేర విచారణలోనూ ఉండవలసిన మానవ హక్కుల సూత్రాలను చూద్దాం. నేరం రుజువు అయ్యేంత వరకు ముద్దాయి నిర్దోషి అనేదీ; నేరం రుజువు చేసే బాధ్యత ప్రాసిక్యూషన్ మీద ఉంటుందనేదీ; నేరం ఒప్పుకోవలాంటూ ముద్దాయిపైన ఏ రూపంలోనూ ఒత్తిడి పెట్టడానికి వీలు లేదనేదీ; ముద్దాయి మీద పెట్టిన అభియోగం సంపూర్ణంగా రుజువు చేయాలనేదీ; ఈ మొత్తం విచారణ క్రమం బహిరంగంగా, న్యాయంగా నిష్పాక్షింగా ఉండాలనేదీ నేరవిచారణకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలు.

భారతదేశ నేరస్మృతిని ఈ కోణం నుండి చూసినప్పుడు పెద్దగా లోపాలు కనిపించవు. అయితే నేర విచారణ వ్యవస్థ రోజువారి వ్యవహారాలలో ఈ నేరస్మృతిని అతిక్రమించడం తరచుగా జరుగుతూ ఉంటుంది. దీని పూర్తి వివరాలలోకి ఇక్కడ పోలేము. ఎందుకంటే దీనికి వేరే ఒక పాఠం కేటాయించబడింది. (నేర విచారణ వ్యవస్థ – మానవ హక్కులు)

7.7 శిక్షకు సంబంధించిన సిద్ధాంత దృక్పథం

ఇంక శిక్ష గురించి, దానికి అన్వయించే మానవ హక్కుల సూత్రాల గురించి చూద్దాం. సామాజిక భద్రతకు కాపాడాలంటే నేరాలను విచారించి నేరస్తులను శిక్షించాలని చూసాం. అయితే సామాజిక భద్రత దానంతటదే ఒక లక్ష్యం కాదనీ, జీవితాన్నీ స్వేచ్ఛనూ మానవ హక్కులనూ అనుభవించడానికి కావలసిన ప్రశాంతిని అందిచ్చే ఒక సాధనం మాత్రమేనని గుర్తుంచుకుంటు, సామాజిక భద్రతను కాపాడే ప్రక్రియ మానవ హక్కులను, ముఖ్యంగా జీవితాన్నీ స్వేచ్ఛనూ గౌరవించేదిగా ఉండాలనీ గ్రహించగలుగుతాం. ఆ ప్రక్రియ అశాంతికి ఉండే సామాజిక మూలాన్ని గురించి స్పృహ కలిగి ఉండాలి. అశాంతిని ఎందుకు శిక్షించాలి. ఏ విధంగా శిక్షించాలి అనే విషయంలో మానవ హక్కుల దృక్పథం కలిగి ఉండాలి. ఆప్రక్రియ ఇంతకంటే ఎక్కువ స్వేచ్ఛ, ఎక్కువ మానవ హక్కులు, మరింత నిండైన జీవితం కల్పించే సామాజిక ఆర్థిక వ్యవస్థను సాధించే దిశగా వచ్చే సామాజిక మార్పులకు అవకాశమే లేకుండ చేసే విధంగా ఉండకూడదు.

శిక్షను గురించి కూడ ఈ వెలుగులోనే చూడాలి. శిక్ష రూపాలు కాలక్రమంలో ప్రజాస్వామిక దిశలో మారాయి. కొరడా దెబ్బలు, కాళ్లు చేతులు నరికి వేత, కాలిన ఇనుముతో వాతలు పెట్టడం మొదలయిన శిక్షలు తరతమ భేదాలతో అన్ని దేశాలలోనూ ఒకప్పుడు అమలులో ఉండేవి. ఈ రోజు, సౌదీ అరేబియావంటి కొన్ని దేశాలను మినహాయించి, వేరే ఏదేశంలోనయినా ఖైదులో నిర్బంధం లేక జుర్మానాను మాత్రమే చట్టం ఆమోదించే శిక్షలు. భౌతిక దండన చట్టం నుండి దాదాపు చెరిగిపోయింది. మరణ దండన ఒక్కటే దీనికి మినహాయింపు. చాలా దేశాలు మరణ దండనను రద్దు చేసాయి గానీ అనేక ఇతర దేశాలు (భారతదేశం వాటిలో ఒకటి) దానిని కొనసాగిస్తున్నాయి. మానవ హక్కుల ఉద్యమం మరణ దండనను సంపూర్ణంగా రద్దు చేయాలని కోరుకోవడానికి గల కారణాలను ఒకటే మిటంటే అది వాతలు పెట్టి ఒళ్లు కాల్చడం, చేతులు నరకడం వంటి భౌతిక దండనలలో ఒకటి. అన్నిటినీ రద్దు చేసినాక ఈ ఒక్క దండనను మిగల్చడానికి సహేతుకమైన కారణమేదీ లేదు.

శిక్ష ఏ రూపంలో ఉండాలన్న ప్రశ్నే కాకుండ, అసలు శిక్ష ఎందుకు వేయాలన్న ప్రశ్న కూడ వేసుకోవాలి. సామాజిక భద్రతను కాపాడడంలో శిక్షాస్మృతికి ఉండే స్థానం ఏమిటి? శిక్షల స్వభావాన్ని గురించి, తీవ్రత గురించి మనకుండే అవగాహన ఈ ప్రశ్నకు మనం చెప్పుకునే జవాబు మీద ఆధారపడి ఉంటుంది. న్యాయమూర్తులూ శాసన కర్తలూ దీనికి చెప్పే జవాబు ఏమిటంటే ఒకరికి హాని చేసినవారు శిక్ష అనుభవించకపోతే సమాజ నైతికత దెబ్బతింటుంది. కాబట్టి సామాజిక నైతిక స్పృహకు జవాబు చెప్పడానికి నేరస్తులను శిక్షించడం అవసరం. ఇది శిక్ష వేయవలసిన ఆవశ్యకతను వివరిస్తుందే తప్ప ఒక నేరం చేసిన వారికి ఎంత శిక్ష వేయాలని చెప్పదు.

ప్రతీకార శిక్షా సిద్ధాంతం పై ప్రశ్నకు ఒక తీవ్ర స్వభావంగల సమాధానం చెప్తుంది. నేరానికి పరిహారం శిక్ష అని ఈ సిద్ధాంతం చెప్తుంది. అంటే నేరస్తుడు బాధితునికి హాని కలిగించాడు. కాబట్టి తాను కూడ బాధ అనుభవించవలసిందేనని

BRAOU

అర్థం. ఇది సమాజం విధించే శిక్ష రూపంలో సాక్షాత్కరించే బాధితుని ప్రతీకారవాంఛ తప్ప వేరే ఏమీకాదు. అయితే ప్రతీకారం అనాగరిక మనీ, న్యాయం దానిని ప్రాతిపదిక చేసుకోవడానికి వీలులేదనీ భావించినప్పుడు అదే ప్రతీకారం సమాజం విధించే ఆలోచనాత్మకమైన రూపంలో పునర్దర్శనం ఇచ్చే ఈ ప్రతీకార శిక్షా సిద్ధాంతాన్ని ఆమోదించడానికి వీలులేదు. సమాజం నేరస్తుడిని శిక్షించేది ప్రతీకారం తీర్చుకోవడానికి కాదు. తను చేసిన అన్యాయాన్ని సవరించడానికి, శిక్షకు ప్రమాణం న్యాయం అయివుండాలి గాని, ప్రతీకారం (లేక పరిహారం) కాదు. శిక్ష పరిమాణాన్ని నిర్ణయించడంలో న్యాయం అనేది పరిహారం అంత స్పష్టమైన ప్రమాణం కాక పోవచ్చు. అయినప్పటికీ జీవితాన్ని స్వేచ్ఛనూ అదే తగిన ప్రమాణం.

ఉదాహరణకు పరిహార సిద్ధాంతం ఏమంటుందంటే నువ్వు చంపావు కాబట్టి నువ్వు చావవలసిందేనంటుంది. న్యాయం అనే భావన నిర్ధారించే శిక్ష ఆయాపరిస్థితులను బట్టి అంత కంటే చాలా ఉదారంగా ఉండగలదు. ఆ అన్యాయాన్ని సవరించడానికి ఒక సంవత్సరం జైలు శిక్షచాలునని భావించవచ్చునుకూడ. కొన్ని సంవత్సరాల క్రితం ఇంగ్లండ్‌లో జరిగిన ఒక ఘటనను ఇక్కడ ఉదాహరణగా తీసుకోవచ్చు. తన భర్తను చంపిన ఒక స్త్రీని ఒక కోర్టు విచారించింది. ఆమె భర్త ఆమెను చాలా ఏళ్ళుగా అతిక్రూరంగా హింసిస్తుంటే ఆమె భరించలేక అతనిని చంపింది. ఆమె నేరం రుజువయింది. అయితే ఆ నేరం జరిగిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న న్యాయస్థానం అరెస్టు రూపంలోనూ నేరవిచారణ రూపంలోనూ ఇప్పటికే ఆమె అనుభవించిన శిక్ష చాలునని నిర్ణయించి ఆమెను విడుదల చేసింది. పరిహార సిద్ధాంతం బోధించే వైఖరికంటె ఇది చాలా భిన్నమైనది. శిక్ష పరిమాణాన్ని నిర్ణయించడానికి న్యాయం అనే భావన మనకిచ్చే ప్రమాణం అనేక సందర్భాలలో అస్పష్టమయినదయితే కావచ్చును గాక, అదే సరయినది.

శిక్షకు సంబంధించిన మరొక సిద్ధాంతం నేర నిరోధన సిద్ధాంతం అంటే ఒక నేరస్తుడికి ఎంత శిక్షవేయాలంటే రేపు నేరాలు చేయబోయే వారిని చేయకుండ నిరోధించేటంత వేయాలి. ఇది పైకి సహేతుకంగానే కనిపించవచ్చు. కానీ ఈ అవగాహనలో, ఒక నేరానికి ఎంత శిక్ష ఉచితంగా ఉంటుందనేది ఆ ఘటనలో జరిగిన అన్యాయాన్ని సవరించడానికి ఎంత శిక్ష అవసరం అన్న దాన్ని బట్టి కాక భవిష్యత్ నేరాలను నిరోధించడానికి ఎంత శిక్ష అవసరం అనేదాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. కాబట్టి రాము అనే వ్యక్తి పేదరికం వల్ల దొంగతనం చేస్తే అతనికి తక్కువ శిక్ష వేస్తే సరిపోతుందనవచ్చు. రేపు ఇంకొక సోము లేక దాము పేదరికాన్ని కారణంగా చూపించి దొంగతనాలు చేయకుండ ఉండాలంటే ఎంత శిక్ష వేయాలో అంతవేయాలని న్యాయమూర్తికి చెప్పుంది ఈ సిద్ధాంతం. కాబట్టి రాముకు అతని నేరానికి ఉచితమైన దానికంటె ఎక్కువ శిక్ష ఉండవచ్చు.

శిక్షకు సంబంధించిన మూడవ సిద్ధాంతం సంస్కరణ సిద్ధాంతం ఈ సిద్ధాంతం సంస్కరణ సిద్ధాంతం ఈ సిద్ధాంతం ప్రకారం, నేరస్తుడు తాను చేసిన దానికి పశ్చాత్తాపం చెంది ఇంకెప్పుడూ అటువంటి పని చేయనన్న సంకల్పం పొందే పాటి శిక్ష వేస్తే సరిపోతుంది. ఉదాహరణకు ఆ వ్యక్తిని కుటుంబంనుండి బంధు మిత్రులనుండి దూరంగా కొంత కాలం ఖైదులో ఉంచితే అటువంటి సంకల్పం నెలకొనడానికి సరిపోవచ్చు. పైరెండు ప్రమాణాలకంటే ఇది సహేతుకమైనది. కానీ దీనితో ఒకటి రెండు సమస్యలున్నాయి. పేదరికపు ఒత్తిడి వల్ల నేరానికి పాల్పడిన వ్యక్తి నిజంగానే పశ్చాత్తాపం చెందవచ్చును. కానీ ఖైదు నుండి బయటికి పోయిన తరువాత అవే పరిస్థితులు ఎదురయినట్టయితే తిరిగి అదే నేరం చేయవచ్చు. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఖైదిని సంస్కరించడంతో పాటు అతని పరిస్థితులను సంస్కరించే ప్రయత్నం కూడ – ఉదాహరణకు ఖైదు నుండి బయటకు పోయిన తరువాత అతనికొక ఉద్యోగం చూపించడం అవసరం కావచ్చు.

ఇవి శిక్షకు సంబంధించిన సైద్ధాంతిక ప్రతిపాదనలు. మరి మన దేశంలో శిక్షాస్మృతి వెనుకనున్న తాత్విక ధోరణి ఏమిటి? దురదృష్టవశాత్తు అది న్యాయ మూర్తుల వైఖరిమీద, జైలు అధికార్ల వైఖరి మీద ఆధారపడింది. నేరస్మృతిలో ఎక్కడ శిక్షకు సంబంధించిన సైద్ధాంతిక ప్రమాణాలు చర్చించబడలేదు. శిక్ష వేయడంలో గల లక్ష్యం

BRAOU

ఇదనిగానీ, అదనీగానీ భారత శిక్షాస్మృతి చెప్పదు. జుర్మానా, ఖైదు అనే రెండు రూపాల శిక్షను శిక్షాస్మృతి గుర్తిస్తుంది. (మరణ దండన శిక్షాస్మృతి గుర్తించే మరొక శిక్ష). ఒక్కొక్క నేరానికి, కోర్టు విధించగల గరిష్ఠ శిక్షను మాత్రమే శిక్షాస్మృతి నిర్దేశిస్తుంది. ఆ గరిష్ఠ పరిమాణానికి లోబడి ఎంత శిక్ష వేసేదీ నిర్ణయించే విచక్షణ కోర్టుకే వదిలి పెడుతుంది. (కొన్ని నేరాలకు గరిష్ఠ శిక్ష కూడ నిర్దేశించబడింది గానీ అది అరుదు). ఈ విచక్షణ మంచిదే, ఎందుకంటే తద్వారా ఆ కేసుకు సంబంధించిన సామాజిక, నైతిక అంశాలను లెక్కలోకి తీసుకొని ఏ పాటి శిక్ష వేస్తే ఉచితంగా ఉంటుందో నిర్ణయించే అవకాశం న్యాయస్థానానికి సాధ్యం అవుతుంది. కేసును పూర్తిగా విచారించి, నేరాన్ని నిర్ధారించిన తరువాత శిక్ష ఎంత వేయాలన్న విషయంలో ముద్దాయిని న్యాయమూర్తి విచారించాలన్న నియమం కూడా నేర విచారణ స్మృతి పెట్టింది. ఆ సమయంలో ఆ నేరం వెనుక ఉన్న సామాజిక, మానసిక, నైతిక భూమికను మొత్తంగా లెక్కలోకి తీసుకునే అవకాశం న్యాయస్థానానికి ఉంటుంది. అయితే న్యాయమూర్తులకు సామాజిక, నైతిక విషయాల గురించి ఉండే అవగాహనలో మానవ హక్కుల స్పృహ తగినంతగా ఉండక పోవచ్చును. కాబట్టి మానవ హక్కుల చైతన్యాన్ని పెంచడం అవసరం. అప్పుడు చట్టం కల్పించే విచక్షణ మానవ హక్కుల పెంపుదలకు ఉపయోగపడుతుంది.

7.8 ముగింపు

అయితే న్యాయమూర్తులలో అధిక భాగం శిక్షలు వేసేటప్పుడు నేర నిరోధనను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంటారని చెప్పవచ్చు. ఇంక కోర్టులు విధించే శిక్షను అమలు చేసే జైలు అధికారుల మాటకొస్తే, వాళ్ళ దృష్టిలో ఒకసారి ఖైదుకు పోయిన తరువాత నేరస్తుడు అనుభవించేది జైలు అధికారులు కోరుకునే శిక్ష. శిక్ష విధించిన న్యాయమూర్తి ఉద్దేశించిన శిక్ష కాదు. శిక్ష పరిమాణం విషయం మాత్రమే న్యాయమూర్తి నిర్ణయిస్తారు. జైలు అధికార్లలో అధిక భాగం ఖైదిని అమానవీయమైన స్థితిలో ఉంచి అవమాన పరుస్తుంటేనే శిక్ష ఫలితాన్ని ఇస్తుందని నమ్ముతారు. ఇతర చట్టాలలో అధికార్లకు ఎవ్వరికీ లేని విచక్షణ జైలు చట్టాలు జైలు అధికార్లకు ఇస్తాయి. జైళ్లు సమాజం కళ్ళకు కనిపించవు. అవి జైలు అధికార్ల జాగీర్లు.

1978 తరువాత భారత సుప్రీంకోర్టు అనేక తీర్పులలో ఖైదీల హక్కుల గురించి చెప్పింది కేవలం జైలులో పెట్టడం వల్ల కోల్పోయే హక్కులను మినహాయించి మిగిలిన అన్ని ప్రాథమిక హక్కులూ ఖైదీలకు ఉంటాయని చెప్పింది. అయితే ఈ హక్కుల స్పృహ ఇంకా జైలు అధికారుల దాకా చేరలేదు. జైళ్ళ సంస్కరణ గురించి మాట్లాడేటప్పుడు వీటిని పరిగణలోకి తీసుకోవాలి.

7.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

1. నిందితులకు గల హక్కులను చర్చించండి.
2. శిక్షకు సంబంధించిన సైద్ధాంతిక దృక్పథం చర్చించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి.

1. నేరానికిగల సామాజిక, ఆర్థిక నేపథ్యాన్ని వివరించండి.
2. నేరాల అదుపులో పోలీసుల పాత్ర ఎటువంటిది?

BRAOU

ఖండం : IV

మానవ హక్కులు : బలహీన వర్గాలు

భారతీయ సమాజంలో అనేక అసమానతలున్నాయి. ముఖ్యంగా సమాజంలోని వివిధ వర్గాల మధ్య సాంఘిక ఆర్థిక అసమానతలు నానాటికీ బలపడుతున్నాయి. మరోవైపు ప్రభుత్వాలు ఈ అసమానతలను తొలగించే ప్రయత్నాలు కూడా చేస్తున్నాయి. సమాజంలోని అణగారిన వర్గాల హక్కులు వాటి పరిరక్షణకు చేపట్టిన చర్యలను వివరించడం ఈ కూండా ప్రధాన ఉద్దేశ్యం. ఇందులో మూడు భాగాలు పొందుపరిచాం అవి :

- షెడ్యూల్డుకులాలు, తెగల పరిరక్షణ కమీషన్
- జాతీయ మహిళా కమిషన్
- మైనారిటీలు, వెనుకబడిన తరగతుల కమిషన్

BRAOU

BRAOU

8. షెడ్యూల్డు కులాలు, తెగల పరిరక్షణ

విషయక్రమం

8.0 ఉద్దేశం

8.1 పరిచయం

8.2 సమానత్వం, అర్థవివరణ

8.3 కులం, అసమానతల సామాజిక వ్యవస్థ

8.4 రాజ్యంగ రక్షణలు, వివక్షను నిరోధించడం

8.5 వివక్ష నుండి రక్షణ

8.6 పౌర హక్కుల రక్షణ చట్టం 1955

8.7 షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (అత్యాచార నిరోధక) చట్టం 1989

8.8 ముగింపు

8.9 మాదిరి పరీక్ష ప్రశ్నలు

8.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

- భారత రాజ్యంగంలో సమానత్వం ప్రాధాన్యత, మానవ హక్కుల విధానంలో దాని ప్రాముఖ్యత
- ప్రాథమిక హక్కులలో షెడ్యూల్డు కులాలు తెగల పరిరక్షణ
- పౌర హక్కుల చట్టం - వివక్ష నుంచి రక్షణ, అత్యాచారాల నిరోధక చట్టం.

8.1 పరిచయం

మానవ హక్కుల్లో సమానత్వం ప్రధానాంశం. ఐక్యరాజ్యసమితి యొక్క ప్రధాన సమావేశాలన్ని సమానత్వం అనే అంశాన్ని తమ దృక్పథంగా ప్రకటించుకున్నాయి. జాతి, రంగు, లింగం, భాష, మత వివక్షలు, భారత దేశం లాంటి దేశాల్లో కుల వివక్ష తదితర అంశాలను ఎప్పటికప్పుడూ నిరోధిస్తూనే వస్తున్నాయి. అయితే నిషేధం అనే పదాల ప్రయోగం ప్రయోజనకారిగా నిలువడం లేదు. దీనికోసం సంబంధిత ప్రభుత్వాలు సమానత్వ హక్కును ప్రధానం చేసుకొని రక్షిత చట్టాలు నిరోధక చట్టాల ద్వారా కార్యరూపం దాల్చేలా చేస్తే తప్ప అవి ప్రయోజన కారిగా నిలవవూ. మానవ హక్కుల సంబంధిత సార్వజనీన డిక్లరేషన్, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కుల గురించి అంతర్జాతీయ చట్ట సంబంధిత ఒడంబడిక సమానత్వపు దిశగా, అవకాశాల కోణంలో కొంత ప్రగతి సాధించేందుకు కారణ భూతమైంది. పౌర, రాజకీయ, హక్కులతో పాటు అంతర్జాతీయ ఒడంబడిక, వివిధ రకాలైన హక్కులను పొందు పరుచుకున్నది. అందులో ఆహారపు హక్కు, వస్త్రాలు, గృహ, విద్య సంబంధిత హక్కు, భౌతిక, మానసిక ఆరోగ్య హక్కు కుంటుంబ రక్షిత, మాతాశిశు సంరక్షణ హక్కులు, సాంస్కృతిక జీవనంలో పాల్గొనే హక్కు ఇందులో చోటు చేసుకున్నాయి. సమానత్వాన్ని పెంపొందించేందుకు హక్కులు తప్పని సరి.

భారత రాజ్యాంగ నిర్మాతలు దేశంలోని కుల వ్యవస్థ పర్యవసానంగా సమానత్వం హక్కు ఎదుర్కోబోయే పరిణామాలను గురించి ముందే ఊహించారు. వాళ్లు రంగు, మతం, లింగం కుల పరంగా వివక్షకు అవకాశమున్నదనే

BRAOU

అంశంపై పూర్తిగా సంతృప్తి చెందలేదు. దీని కోసం సమానత్వభావనను. పెంపొందించేందుకు రాజ్యం ఒక కీలక పాత్ర పోషించాలని వారు భావించారు. అందువల్ల భారత రాజ్యాంగం విద్య, ఉద్యోగం, ఆర్థిక సంబంధిత అంశాల్లో వివక్షను రూపుమాపేందుకు కొన్ని రక్షిత అంశాలకు చోటు నిచ్చింది. రాజ్యం బలహీన వర్గాలు షెడ్యూల్డ్ కులాలు, తెగల అవసరాల నిమిత్తం ఈ కారణంగా అనుకూల రక్షిత కార్యక్రమాలు చేపట్టడం తప్పని సరయింది. అంటరానితనం నిర్మూలించేదుకు అలాగే షెడ్యూళ్ల కులాలు, తెగల పౌరులపై అత్యాచారాల నిరోధానికి ఒక ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. ఈ కారణంగా కొన్ని అనుకూల రక్షిత కార్యక్రమాలు చేపట్టడం తప్పనిసరయింది. అంటరాని తనం నిర్మూలించేందుకు అలాగే షెడ్యూల్డ్ కులాలు, తెగల పౌరులపై అత్యాచారాల నిరోధానికి ఒక ప్రత్యేక చట్టాన్ని రాజ్యం రూపొందించింది. ఈ నేపథ్యంలోనే బలహీనవర్గాలకు సంబంధించి మానవహక్కులను, గూర్చి రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు రూపొందించిన చట్టాల గురించి అవగాహన అవసరం.

8.2 సమానత్వం, అర్థ వివరణ

మానవ హక్కుల ఉద్యమంలో సమానత్వం అనే అంశం ప్రాధాన్యతను సంతరించుకున్నందున మానవ హక్కుల సంబంధిత అంశాలను విశ్లేషించినపుడు సమానత్వం గురించి అవగాహన అత్యావశ్యకమైనది. సమానత్వ అంశం అంటు పూర్తిగా భౌతికపరంగా సమానత్వం అని అర్థం కాదు. పూర్తిస్థాయి సమానత్వం భౌతికంగా సాధ్యం కాదనేది నిర్వివాదాంశం. పుట్టుకతో వచ్చిన ప్రత్యేక అవకాశాల లేమి నుంచి రక్షణ కల్పించే దిశగా ఈవిధానం ఉపకరిస్తుంది. అనగా ప్రతి మానవుడు చట్టాతీతుడు కాదని, అతని హోదా, స్థితిగతులు ఎలా ఉన్నా కోర్టు పరిధిలో అంతా సమానులేనని ఈసూత్రం అభిప్రాయం. ఈ రకంగా పౌరులంతా ఉద్దేశ్య పూర్వకంగా సమానులు. అయితే వారి హోదా, స్థలం, సమాజంలో వారి తీరు తెన్నుల పరంగా లభించే గౌరవం, హోదా, అంశంలో సమానత్వం ఉండదు. అప్పుడు సమానత్వాన్ని ఎలా సాధించాలి?

మానవ హక్కుల పరిధిలో సమానత్వ సాధనను భిన్న కోణాల్లో పరిశీలించ వచ్చు. అయితే ఈ అంశాన్ని ఎలా అనుసరణీయం చేయాలనేది ఆచరణలో ఎదురవుతున్న సమస్యలను బట్టితేల్చవచ్చు. వనరుల కేటాయింపు ప్రధానంగా వున్న సాధారణ హక్కుల సమానతను ఆధారంగా చేసుకుని రూపొందించిన సమానత్వం ఇందులో ఒకటి. ఈ అంశం వ్యక్తి గత స్వయం ప్రతిపత్తి గుర్తింపు ప్రధానంగా గల అంశాలతో ముడివడి వుంటుంది. ఈ సాధారణ స్వతంత్రాలు వాక్ స్వాతంత్యం, స్వేచ్ఛ, మతం సమానత్వం , సమన్యాయం. తదితర అంశాలలో వుంటాయి. వ్యక్తి గత స్వయం ప్రతిపత్తిలో ముడివడి వున్న ఈ హక్కులు ప్రభుత్వానికి సమానత్వం అంశంలో కొంత అవరోధంలా నిలుస్తూ ప్రతికూల దృక్పథాన్ని కలిగివుంటాయి.

సమానత్వం ఇంకో కోణంలో అవకాశాల ఆధారంగా రూపొందుతుంది. అవకాశం విపక్షలేని అంశంగా పేర్కొన బడుతూ న్యాయ ధర్మ సూత్రాల్లో క్రోడికరించబడుతుంది. అంతర్జాతీయ మానవ హక్కుల ఒడంబడికలు, అనేక ఇతర రాజ్యాంగాలు మానవుడు ఒక ప్రత్యేక లింగ, జాతి, మతం, జాతీయత కలిగి వున్నాడని చెప్పి సమానత్వం అంశంలో వివక్ష కనబర్చాలని పేర్కొనలేదు. ముఖ్యంగా భారత రాజ్యాంగం కుల పరంగా వస్తున్న వివక్షను నిరోధించేందుకు తగు అంశాలను చేర్చింది. వివక్షను నిరోధించడం అభిలషణీయమైన అంశం, అయితే హక్కులు అనుభవించడంలో పౌరులు అవకాశాలు కలిగివుండక పోవచ్చు. అందువల్ల అవకాశాల్లో సమానత్వాన్ని కల్పించడానికి అసమానతల మూలాల్లో మార్పులు తెచ్చేరీతిలో చర్యలు తీసుకోవాల్సి వుంది. ఇదే దశలో ఇతరుల అవకాశాలు కూడా రక్షించబడాలి. అవకాశాల్లో సమానత్వ సాధనకు గాను వివక్షా నిరోధం, వివక్ష నుంచి రక్షణ ఖచ్చితమైన కార్యాచరణ లేదా రిజర్వేషన్ల అమలును ఆచరణాత్మకం చేయాలనే సూచన వచ్చింది.

సమానత్వంలో మూడో అంశం ఆర్థిక లబ్ధి అంశాలతో సంబంధం కలిగి వుంటుంది. ఈసమానత్వం అన్ని రకాల లబ్ధి అంశాలు సమానత్వం దిశగా పంపిణీ అయ్యే రీతిలో వుండాలని భావిస్తుంది. ఈ అంశాలకి విశాల ఆర్థిక

BRAOU

పునర్‌పంపిణీతో లంకెవేసి వున్నందున ఇది సమస్యాత్మకంగా పరిణమిస్తున్నది. ఈ అంశాలను మూలాల్లోంచి పరిష్కరించే దిశగా తీసుకోవాల్సిన చర్యలను గురించి ఒక ఏకాభిప్రాయాన్ని సాధించడం కూడా కష్ట సాధ్యమవుతున్నది. దీనికి ప్రాథమికంగా ఆర్థిక అసమానతలకు కారణాంశాలేమిటో తెలుసుకోవడం ఒక ప్రధాన కారణంగా నిలుస్తుండగా పరిష్కారం ఎక్కడ వెదకాలి అనే అంశం కూడా ప్రధాన సమస్యగానే పరిణమిస్తున్నది. ఈ రకంగా హక్కులు, అవసరాలు, డిమాండ్లుగా పరిగణించబడ్డాయి. వివిధ రకాలైన సమానత్వాలను సాధించేందుకు సమాజంలో వివిధ రకాలైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఏ సమానత్వ సాధన సులభం? ఏది కష్ట తరం?

8.3 కులం - అసమానతల సామాజిక వ్యవస్థ.

సాంప్రదాయ హిందూ వ్యవస్థ అసమానతలతో కూడుకున్న అనుపమాన వ్యవస్థగా పేరొందింది. ఇందులో మత పరమైన చాందసవాద అంశాలు, కలుషిత పవిత్రాంశాలు నిండుకున్నాయి. సమాజంలో వ్యక్తి కున్న కుల సంబంధ హోదా ఆధారంగా సామాజిక పొరలు రూపొందించ బడ్డాయి. కుల వ్యవస్థ రూపొందించిన సోపాన పరంపరలో వ్యక్తి యొక్క వ్యక్తి గత హోదా, అతని సంపూర్ణ జీవితం అతని వృత్తి, విద్య సాంఘిక ఆర్థిక సంబంధాలు ఇతర హక్కులతో ముడివడి వున్నాయి. ఈరకమైన సమాజంలో అసమానత ఒక ప్రాథమిక విలువగా పరిగణించబడింది. హిందూ ధర్మశాస్త్రాల్లో కులం యొక్క ప్రాధాన్యత ఆధారంగా వ్యక్తియొక్క సాంఘిక ఆర్థిక హోదా అతని కులం పరస్పరం పెన వేసుకుని పోయాయి. హిందూ ధర్మశాస్త్రంలో కుల వ్యవస్థ పర్యవసానంగా వెలుగు చూసిన అత్యున్నత అత్యల్ప, అస్పృశ్య భావ జాలాలు ఈరకంగా చోటు చేసుకున్నాయి. శూద్ర వర్ణంలో అస్పృశ్యులు అత్యల్ప హోదాను కల్గి వుంటారు. అత్యున్నత, అత్యల్ప భావనలు అత్యధిక సంఖ్యాకుల్లో ఏళ్ళ తరబడి జీర్ణించుకుపోయి, తక్కువ కులాల వారిని చీదరించుకునే రీతిలో చూడడం వారిని తీవ్రంగా శిక్షించడం, వారిపై పన్నులు ప్రయోగించడం ప్రైవేటు ఆస్తి, మానవ గౌరవం వారికి లేకుండా చేయడం జరుగుతున్నది. శతాబ్దాలుగా ఈ వర్గాలు అవమానాల భారాన పడి, అగౌరవానికి గురై సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక పరిస్థితులు మరీ క్షీణించుకు పోయాయి.

కుల సిద్ధాంతం బ్రాహ్మణుడు తనమేధస్సుతో వృద్ధిచెందుతూ శ్రమకు దూరంగా వుండాలని, శ్రామికులశ్రమను పర్యవేక్షించాలని సూచిస్తున్నదని, అంబేద్కర్ అభిప్రాయ పడ్డారు. శ్రమతో సంబంధమున్న శూద్రుడు తన మేధో రంగాన్ని అభివృద్ధిపరుచుకోరాదని ఈ సిద్ధాంతం సూచించిందన్నారు. కుల వ్యవస్థ మనిషి ప్రగతికి విపత్కర పరిణామంగా అవరోధంగా నిలుస్తుందన్న ఆర్.పి.దత్ అభిప్రాయాన్ని అంబేద్కర్ అంగీకరించారు. కులం మనిషిని పూర్తిగా నిర్వీర్యున్ని చేస్తుంది. ఈ క్రమం స్టెరిలైజేషన్ తరహాలో వుంటుంది.

వ్యక్తి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించు కోవాలంటే విద్య, ధనం శ్రమ అన్నీ అవసరమే, అయితే అస్పృశ్యులు, ఇతర షెడ్యూల్డు కులాల వారు ఇతరులకోసం శ్రమ చేయడానికే ప్రత్యేకించ బడ్డారు. కులాల శ్రేణుల నిర్ణయం సాంఘిక ఆచారాంశాలతో ముడివడి వుండడమే కాకుండా ఉత్పత్తులు వనరులపై వాళ్ళ అజమాయిషీ ఆధారంగా నిర్ధారింపబడ్డాయి. కులం అసమానతల కలయికగానూ, పూర్తిస్థాయిలో నిరోధిత వ్యవస్థకు సంకేతంగానూ నిలుస్తున్నది. శ్రేణులను స్థానిక స్థాయిలో నిర్ధారించే క్రమంలోకూడా ఆస్తులపై ప్రత్యేక ఆజామాయిషీతో బాటు ఆచార వ్యావహారాల్లో కూడా ఆకులం అధికారం కూడా పరిగణనలోకి తీసుకొనబడుతుంది. కులం సమాజంలో వ్యక్తుల హోదాను, విలువను ప్రతిబింబింపజేస్తున్నది. ఈక్రమం వ్యక్తి మెళుకువలు ఉత్పత్తి రంగంలో అతని ఆచరణలను పరిగణనలోకి తీసుకోకుండా నిరోధిస్తున్నది. కులం సాంఘిక వివక్ష భ్రష్టత్వాన్ని మరింత పెంపొందింప జేస్తున్నది. మానవ విలువలను నశింపజేయడాన్ని .ఈ అంశం పూర్తిస్థాయిలో సహకరిస్తున్నది. అందువల్ల అసమానతల వ్యవస్థకు సంకేతంగా వుంటూ చట్టం ముందు సమానత్వాన్ని నిరోధించే అంశంగా పరిగణించబడుతున్నది. రక్షితచట్టాలు అమలు అంశంలో కూడా ఇది ఒక అవరోధంగా నిలుస్తున్నది. వ్యవస్థలో కులం ఒక అప్రతిహత అంశంగా పరిగణించబడుతున్న దృష్ట్యా హింసకు ఇది ఒక కారణ హేతువుగానూ, మానవహక్కుల ఉల్లంఘనకు దోహదకారిగా నిలుస్తున్నది. ముఖ్యంగా ఈ అంశం బలహీన వర్గాలు, షెడ్యూల్డు కులాలు, తెగల విషయంలో ప్రత్యేకించి పేర్కొనాల్సిన అంశంగా నిలుస్తున్నది.

BRAOU

8.4 రాజ్యం రక్షణలు - వివక్షను నిరోధించడం

భారతదేశంలో కులవ్యవస్థ వర్ణవ్యవస్థ పర్యవసానంగా వెలుగుచూస్తున్న అసమానతలు కుల వ్యవస్థతో ముందు కొచ్చిన అనేకాంశాలు ఇక్కడ రాజ్యాంగ పరంగా రక్షిత చట్టాలను, రూపొందించాల్సిసన అవశ్యకతను చాటి చెప్పాయి. ముఖ్యంగా సమానత్వాన్ని ఆచరణ రూపంలో పెట్టడంలోనూ, సాధారణ హక్కులను అనుభవించడంలోనూ షెడ్యూల్డు కులాలు, తెగలు, ఇతర బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న అవరోధాలను అధిగమించడం కోసం భారత రాజ్యాగంలో రక్షిత చట్టాలను రూపొందించారు.

రాజ్యాంగ నిర్మాతలు కులవ్యవస్థ పర్యవసానాలను దూర దృష్టితో పరికించారు. ముఖ్యంగా కుల వ్యవస్థ కారణంగా షెడ్యూల్డు కులాలు, తెగలు, ఇతర బలహీన వర్గాలు,చవిచూస్తున్న పర్యవసానాలను పూర్తిస్థాయిలో అవలోకించారు. ఈ రకంగా వారు సమానత్వ సంబంధిత ప్రాథమిక హక్కులను జాగరూకతతో రాజ్యాంగంలో చేర్చి రాజ్యానికి బలహీన వర్గాల స్థితిని మెరుగు పరిచేరీతిలో అనుకూల, రక్షిత చర్యలను తీసుకునే అధికారాలనిచ్చారు.

రాజ్యాంగంలోని 14వ అధికరణ చట్టం ముందు సమానత్వాన్ని సమాన చట్ట రక్షణకు అవకాశాలనిస్తుంది. 15వ అధికరణ సాంఘిక వివక్షను నిరోధిస్తుంది. ఈ అధికరణ పౌరున్ని మతం, జాతి, కులం, లింగం, జన్మస్థలం పరంగా వివక్షకు గురిచేయడాన్ని రాజ్యం నిరోధించాలని సూచిస్తుంది. ఈ అధికరణ ఒక విశిష్టతను కలిగి వున్నది. ఇందులో భాగంగా పౌరులను, రాజ్యాన్ని వాణిజ్య సంబంధితాంశాలయిన వ్యాపార సంస్థలు, హోటళ్ళు తదితర సంస్థలలో వివక్షకు పాల్పడడాన్ని, అదే విధంగా ప్రజా సంబంధిత ప్రజా విజ్ఞాన, వినోద ప్రదేశాలు, బావులు, చెరువులు, ఇతర ప్రజోపయోగ సంస్థల వినియోగంలో వివక్షకు పాల్పడడాన్ని నిరోధిస్తుంది. అగ్రవర్ణాలు, అస్పృశ్యతతో బాటు వివిధ రకాలయిన వివక్షా పూరిత అంశాలను పాటి స్థాయనేది నిర్వివాదాంశం. అయితే రాజ్యాంగం రాజ్యానికి అస్పృశ్యత నివారణ అధికారాన్నిస్తూ ప్రజలందరికీ ప్రజోపయోగ ప్రదేశాలకు వెళ్ళ గలిగే అవకాశాన్నిస్తుంది. ఈ రకంగా నిమ్న వర్గాలకు చెందిన షెడ్యూల్డు కులాల ప్రజానీకం, పౌర జీవనం వెళ్ళ బుచ్చేందుకు అవకాశం లభిస్తున్నది. 15(2) ఆర్టికల్ ప్రకారం లభిస్తున్న హక్కు రాజ్యంతో పాటు ప్రైవేటు వ్యక్తుల సంబధింతాంశాల్లో ఉల్లంఘనలకు పాల్పడడాన్ని నిరోధిస్తున్నది. 15(2) ఆర్టికల్ యొక్క లక్ష్యం హిందూ సాంఘిక వ్యవస్థలో నిమ్నకులాలు వివక్ష కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను నివారించడానికి ఉపకరిస్తుంది. భారతీయ సమాజంలో శతాబ్దాల తరబడి ఆచరణలో వున్న వివక్షాపూరిత విధానాలను వ్యతిరేకిస్తూ ఈ అధికరణ రూపొందించ బడింది.

ఉదాహరణకు పౌరవైకల్యాల నిరోధ చట్టం, మద్రాస్ - సాంఘికవైకల్యాలపై శిక్షను విధిస్తుంది. ప్రజాసంబంధిత ప్రదేశాల్లో ఏచట్టం కూడా హరిజనులు ఇతర నిమ్నజాతి అణిచివేతకు గురైన వర్గాలను ప్రవేశించడాన్ని నిరోధించవు. బ్రిటిష్ కాలంలో మద్రాస్‌లో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం పర్యవసానంగా బ్రిటిష్ ప్రభుత్వం ఇదే రకమైన రక్షిత చట్టాలను రూపొందించింది.

నిమ్నజాతి, అణచివేతకు గురైన వర్గాల ప్రజలు ప్రజోపయోగ ప్రవేశార్హత కలిగి, పౌర జీవనంలో సంబంధం కలిగి వుండడం వల్ల మాత్రమే వారి సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అనుకోరాదు. అందువల్ల రాజ్యాంగంలోని 16వ అధికరణం సమాన అవకాశాలు, ఉపాధి అవకాశాలకు చేరువలో అందరూ అనే హక్కును కల్పిస్తున్నది. 16 వ అధికరణం ఒకటవ, రెండవ క్లాజులు ఉపాధి అంశంలోనూ, నియామక సందర్భాల్లోనూ పౌరులందరికీ సమానావకాశాలను కల్పిస్తున్నాయి.

ఈ క్లాజుల ఊతంగా ఏ పౌరుడు కూడా ఉపాధి అంశంలోనూ ఆఫీసుల్లో నియామక సందర్భాల్లోనూ మతం, జాతి, కులం, లింగం, జన్మస్థలం ప్రదేశాల పరంగా వివక్షకు గురికారాదు. నిమ్న జాతులను, అస్పృశ్యులను అత్యున్నత స్థానాల్లో అధికారయంత్రాగంలోని ఇతర పోస్టులు, నిర్ణయాత్మక స్థానాల్లో వుండకుండా చేయడానికి విరుద్ధంగానే ఈక్లాజు రూపొందించబడింది. ఈక్లాజు లక్ష్యం కూడా అదే.

BRAOU

ముందే చెప్పినట్లు అస్పృశ్యత అంశం ఒక సామాజిక రుగ్మత కావడం వల్ల రాజ్యాంగం ఈ అంశాన్ని ప్రత్యేకించి పరిగణలోకి తీసుకుంటూ, ఒక తప్పిదంగా ప్రకటిస్తున్నది. అందువల్ల 17వ అధికరణం అస్పృశ్యతను నిషేధిస్తూ, ఈ రుగ్మతను ఏ రూపంలోనూ ఆచరణలో పెట్టకుండా కృషిచేస్తుంది. అస్పృశ్యతను ఏకోణంలోనైనా అమలులోకి పెడుతూ నిమ్న వర్గాలను మానసిక క్షోభకు గురిచేయడం చట్ట ప్రకారం శిక్షార్హమైన నేరంగా పరిగణించ బడుతున్నది. అస్పృశ్యత అనేది సామాజిక వివక్ష సంబంధిత ఆచరణగా పరిగణించ బడరాదు. ఇది ఒక అణచివేత రూపంగా వుంటున్నది. ఈవర్గంలోని అనేకులు శ్రమ దోపిడికి గురవుతూ వ్యవసాయ కార్మికులు గానూ ఇతరత్రా శ్రమ సంబంధిత అంశాల్లోనూ భాగస్వాములవుతూ వున్నందున వారు అణచివేతకు గురవుతున్నారు. అస్పృశ్యులుగా వున్నవారు పెట్టి కార్మికులుగా మిగులుతున్నారు. 23వ అధికరణం ఈ కోణంలో అణిచివేతను నిరోధించేందుకు ఉపకరించే అంశంగా నిలుస్తున్నది. ఇది వెట్టి కార్మికుల పునరావాసం తరహాలో వుంటుంది. ఈ అవకాశం భారత దేశంలో అనేక మంది అస్పృశ్యులను వెట్టి నుండి విముక్తి చేసేందుకు ఉపకరిస్తుంది.

భారత రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలు, విధానాలను రూపకల్పన చేసిన సందర్భాల్లో దిశా నిర్దేశనం చేస్తుంటాయి. ఈ సూత్రాలు భారత దేశంలో నెల కొన్ని వున్న పరిస్థితులకునుగుణంగా సామాజిక, ఆర్థిక రాజకీయ సిద్ధాంతాలను రూపొందిస్తాయి. నూతన ప్రజాస్వామిక భారతానికి ఈసూత్రాలు ఒక సమగ్ర రాజకీయ , సామాజిక, ఆర్థిక విధానాన్ని రూపొందిస్తాయి. షెడ్యూల్డ్ కులాలు, తెగలు నిమ్నజాతుల విద్య, ఆర్థిక అవసరాల మెరుగుదలకు రాజ్యాంగంలోని 46వ అధికరణం ఒక సూచనను చేస్తున్నది. దీని ప్రకారం బలహీన వర్గాలకు చెందిన, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వ్యక్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రాజ్యం వారి విద్య ఆర్థిక అవసరాల మెరుగుదలకు కృషిచేయాల్సిన అవశ్యకత వున్నది. సామాజిక అన్యాయం అన్ని రకాల అణచివేతల నుండి రాజ్యం రక్షణ కల్పించాలని ఈ అధికరణ సూచిస్తుంది. ఆదేశికసూత్రాలు రాజ్య యంత్రాంగంలో ప్రాథమికాంశాలు కావడం వలన, రాజ్యం ఈసూత్రాలు చట్టాలను రూపకల్పనకు వినియోగించుకోవాల్సిన అవసరమేర్పడుతున్నది. ప్రతిరక్షిత చట్టం లేదా సాంఘిక సంక్షేమ చట్టం రూపకల్పన వెనుక ఆదేశిక సూత్రాల స్ఫూర్తి వుంటుంది. 46వ అధికరణం 1955 అస్పృశ్యతా నేర చట్టంకు స్ఫూర్తిగా నున్నది. వివక్ష నుండి రక్షణను కల్పించడం ప్రధాన ధ్యేయంగా వున్న అధికరణం విద్యారంగం, ఉద్యోగాల్లో, రిజర్వేషన్లు కల్పించే దిశగా ఉపకరించింది.

అలాగే ఈ అధికరణం 1989 అత్యాచార నిరోధ చట్టానికి స్ఫూర్తి ప్రధాతగా నిలుస్తున్నది. రక్షిత చట్టాలు ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు తెగలకు సంబంధించినవి ప్రధానంగా వివరణాత్మకంగా రూపొందించబడ్డాయి. అందులో షెడ్యూల్డ్ కులాలు తెగల హక్కుల రక్షణ గురించి వివరించాల్సి వున్నది.

8.5 వివక్ష నుండి రక్షణ

భారత రాజ్యాంగంలోని 14వ అధికరణ నుండి 18వ అధికరణం వరకు సమానత్వం అనే అంశం గురించే వివరణాత్మకంగా తెలియ పరుచ బడింది. 14వ అధికరణంలో "భారత రాజ్యం దేశంలోని ఏ ప్రాంతంలోని వ్యక్తులెవరైనా చట్టం ముందు సమానత్వాన్ని కలిగి వుండడాన్ని వ్యతిరేకించడమైనా, న్యాయ రక్షణనుండి వారిని వంచితుల్ని చేయడమైనా జరగదని" సాధారణాంశంగా పేర్కొనబడింది.

ఈ అధికరణంలో రాజ్యానికి అనుకూలమైన, ప్రతికూలమైన బాధ్యతలతో కూడిన రెండు భిన్నాంశాలు పొందుపరుచబడినాయి. చట్టం ముందు సమానత్వం అంటే రాజ్యం ఎవరి పట్లనూ వివక్షాపూరితంగా వ్యవహరించరాదని, మతం, జాతి,కులం, బాష, జన్మస్థలం తదితర అంశాల ఆధారంగా సమానత్వం నుండి వారిని వంచితులను చేయరాదని సూచిస్తూ చట్టం ముందు అందరూ సమానులే అనే అంశాన్ని ప్రతిబింబింపజేస్తున్నది. రెండో అంశమైన, న్యాయాంశాలను 'సమాన రక్షణ - రాజ్యం' అనుకూలమైన దృష్టిలో సమానత్వ హక్కు నుండి వంచితలపుతున్నవర్గాలకు న్యాయపరమైన రక్షణ కల్పించాలనే అంశాన్ని గుర్తుచేస్తున్నది. ఈ అంశంలో రక్షణ నుండి వంచితులవుతూ, సమానత్వహక్కుకు దూరంగా వున్న వ్యక్తులకు న్యాయపరమైన రక్షణ కల్పించడం బాధ్యతగా వుంటుంది.

BRAOU

అలాగే చట్టాలను పరిరక్షిస్తున్న క్రమంలో వ్యక్తులను, వర్గాలను విభజించి చూడాలి. సమాన చట్టం పరిరక్షణాంశం వ్యక్తుల హోదాలు, బేధాలు ఎలా వున్నా సమానత్వంతో చూడాలి. భిన్న కోణాల్లోని వ్యక్తుల అవసరాల కనుగుణంగా ప్రత్యేకతరహాలో వారికి సహకారం లభించాలి. నిజానికి ఈ సహకారం సమ పరిమాణాల్లో జరిగితే అ అసమాన సమాజంలో అసమానతలకు దారి తీస్తుంది. అందువల్ల సమానత్వాన్ని ఆచరణలో పెట్టే క్రమంలో ఖచ్చితమైన విభజన రేఖ అవసరమని చెప్పక తప్పదు.

ఈ రకమైన విభజన లేదా వర్గీకరణ లేదా ప్రాధాన్యతతో గూడిన సహకారం వివక్ష నుండి రక్షణగా పరిగణించ బడుతుంది. దీన్ని వివక్ష పరిహారాత్మక లేదా అనుకూల కార్యాచరణగా కూడా పరిగణిస్తారు. సార్వజనీనంలో ఈ అంశం రిజర్వేషన్లుగా పరిగణించబడి, విద్య, ఉపాధిరంగాల్లో ప్రాధాన్యత గల సహకారం అందించే విధానంగా బలహీన వర్గాలకు ఉపకరిస్తుంది. భారత రాజ్యాంగం వివక్ష నుండి రక్షణ కల్పిస్తున్న క్రమంలో సమానత్వానికి ఈ అంశం వాళ్ళకు అసాధారణ సహకారిగా గాకుండా సమానత్వ హక్కును అనుభవించడంలో భాగంగానే వాళ్ళకు ఉపకరించేందుకు రూపొందింపబడింది.

అందువల్ల 15 (4) అధికరణంలోను 16(4) అధికరణంలోను సమాజంలోని బలహీనవర్గాలయిన వెనుకబడిన తరగతులు, షెడ్యూలు కులాలు,షెడ్యూల్డు తెగలు, మహిళలకు వారి పరిస్థితులు మెరుగు పడేరీతిలో రిజర్వేషన్‌లు కల్పించబడ్డాయి. వీటితో బాటు షెడ్యూల్డు కులాలు తెగల వారికి శాసన సభల్లో రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. వీటితో బాటు షెడ్యూల్డు కులాలు తెగల వారికి శాసన సభల్లో రిజర్వేషన్లు కల్పించారు. ఈనిర్ణయానికి ప్రాధమికంగా రాజ్యాంగంలోని 46వ అధికరణం స్ఫూర్తిగా నిలుస్తున్నది. ఈ అధికరణ రాజ్యం బలహీన వర్గాలను చెందిన పౌరుల విద్య, ఆర్థిక అవసరాలమెరుగుదలకు ప్రత్యేక శ్రద్ధకన బర్చాలని చెబుతున్నది. వారికి రక్షణ కల్పించాలని ఈ అధికరణ చెబుతున్నది. అందువల్ల రాజ్యాంగం మూడు విభిన్నక్షేత్రాల్లో రిజర్వేషన్ల సదుపాయం కల్పించింది.

1) విద్యా సంస్థల్లో ప్రవేశం కల్పించడం.

2) ప్రభుత్వ సంస్థల్లో నియామకాల ప్రక్రియల్లో

3) శాసన సభలు, పంచాయితీలు, మున్సిపాలిటీ లాంటి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఈ రకంగా లభించాయి.

"మద్రాస్ రాష్ట్రం - చంపకం దొరై రాజం" మధ్య జరిగిన వివాదం ఫలితంగా 15వ అధికరణాన్ని రాజ్యాంగ మొదటి సవరణ సందర్భంలో 1951 చట్టం రూపంలో సవరించారు. చంపకం దొరై రాజం కేసులలో మద్రాసు ప్రభుత్వం రాష్ట్రంలోనూ, మెడికల్ కలాశాలలోనూ వివిధ వర్గాలకు మతం, జాతి, కులం ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తూ సీటు కేటాయించింది. అయితే సుప్రీం కోర్టు ప్రభుత్వ నిర్ణయం సమానత్వానికి వ్యతిరేకంగా నిలుస్తున్నదని చెబుతూ ఆ నిర్ణయాన్ని కొట్టి వేసింది. దీనికి వివరణనిస్తూ కులాన్ని, మతాన్ని విద్యాసంస్థల్లో ప్రవేశ సందర్భాల్లోనూ పరిగణనలోకి తీసుకుని 15వ అధికరణాన్ని రాజ్యంగం మొదటి సవరణ రూపంలో 1951వ చట్టం ద్వారా సవరిస్తూ 15వ అధికరణానికి 4వ క్లాజును అనుసంధించారు.

ఈ క్లాజు ప్రకారం రాజ్యం సాంఘికంగా, విద్యా విషయకంగా వెనుకబడిన వున్న పౌరులకు, షెడ్యూల్డు కులాలు, తెగల వారికి ఈ రంగాల్లో అవకాశాల మెరుగుదలకు ప్రత్యేక అవకావాలు కల్పించాలని అధికారాన్ని రూపొందించింది. 15వ అధికరణలోకి 4వ క్లాజు అంశంలో ఒక అధికార మిచ్చే చట్టంగా మాత్రమే ఉపకరిస్తుంది కానీ రాజ్యానికి ఈ అంశంలో ప్రత్యేక కార్యాచరణకు అవకాశాన్ని కల్పించదు. ఈ అధికరణం అవసరరీత్యా ప్రత్యేకంగా అవకాశాలనిచ్చే అధికారాన్ని కల్పిస్తున్నది.

అలాగే 16వ అధికరణంలోని 4వ క్లాజు ప్రకారం కేంద్ర రాష్ట్ర సర్వీసుల నియామకాలల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నది. బలహీనవర్గాల పౌరులకు, వెనుకబడిన తరగతులు వారికి రాజ్యం సేవారంగంలో చాలినంతగా అవకాశాలు లభించడంలేదని భావిస్తున్న దృష్ట్యా ప్రత్యేక అవకాశాలను కల్పిస్తూ రిజర్వేషన్ల ద్వారా నియామకం జరిపేందుకు ఈ అధికరణంలో అవకాశం వున్నది.

BRAOU

16(4) అధికరణం 335వ అధికరణం వెలుగులో పరిశీలించాలి. ఈ అధికరణం షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అవకాశాలను పరిగణించాలని చెబుతున్నది. వెనుకబడిన తరగతుల పౌరులు మిగతా అన్ని వర్గాల కన్నా సాంఘికంగా, విద్యా విషయకంగా వెనుకబడిన వర్గాలని ఈ అధికరణం చెబుతున్నది.

330వ అధికరణం, 332వ అధికరణం లోక్ సభలోనూ రాష్ట్రాల శాసన సభల్లోనూ షెడ్యూల్డు కులాలు, తెగలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నది. జనాభాలో ఈ కులాలు, తెగల సాంద్రత ఆధారంగా రాష్ట్రాలలోనూ కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ సీట్ల రిజర్వేషన్లను నిర్ధారిస్తారు.

రాజ్యాంగం షెడ్యూల్డ్ కులాలు, తెగల పౌరుల అంశాన్ని నిర్వచించలేదు. 341,342 అధికరణాలు భారత రాష్ట్రపతికి కులాలు, తెగల లిస్టుల తయారీ అధికారాన్ని కల్పించాయి. పబ్లిక్ నోటిఫికేషన్ ఆధారంగా షెడ్యూల్డు కులాలు, తెగలలోని కులాలను రాష్ట్రపతి నిర్ధారిస్తారు. ఇది ఒక ప్రత్యేక రాష్ట్రానికి సంబంధించినదైనప్పుడు ఆ రాష్ట్ర గవర్నర్ సూచనమేరకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. రాష్ట్రపతి నోటిఫికేషన్‌కు అదనంగా కులాలను, జాతులను, తెగలను చేర్చడం లేదా తొలగించడం చేయాల్సి వచ్చినపుడు పార్లమెంట్ చట్టం రూపంలో చేయాల్సి వుంటుంది.

రాజ్యాంగంలోని 338వ అధికరణం ప్రకారం జాతీయ షెడ్యూల్డు కులాలు, తెగల కమిషన్‌ను ఏర్పాటుచేసారు. ఈ కమిషన్ కార్య కలాపాలు ఇలావున్నాయి.

1) రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్డు కులాలు, తెగలకు లభించిన హక్కులను పరిరక్షిస్తూ ఆయా కులాలు తెగలకు సంబందించిన అంశాలను పరిగణలోకి తీసుకోవడం అలాగే ప్రభుత్వ ఆదేశాలు, చట్టాలేవైనా ఇలాంటి, సదుపాయాలు కల్పించినపుడు అవి జరిగేలా చూడడం.

2) షెడ్యూల్డు కులాలు, తెగల హక్కుల ఉల్లంఘన సంబంధిత అంశాల్లో వచ్చిన ప్రత్యేక ఆరోపణలను విచారించడం, షెడ్యూల్డు కులాలు, తెగల రక్షణకు ఈచర్యలు చేపట్టడం, షెడ్యూల్డు కులాలు, తెగల సాంఘికార్థికాభివృద్ధికోసం ప్రణాళికల తయారీలోనూ, అమలులోనూ భాగస్వామ్యం వహిస్తూ దేశంలోనూ, రాష్ట్రాల్లోనూ ప్రగతి పరిస్థితులను సమీక్షించడం.

3) రాష్ట్రపతికి ఆయా అంశాల్లో షెడ్యూల్డు కులాల తెగలు హక్కుల రక్షణవిషయమై వార్షిక నివేదికలు సమర్పించడం, ఇతర సందర్భాలలో కూడా కమిషన్ అవసరమని భావిస్తే నివేదికలు సమర్పించడం.

4) షెడ్యూల్డు కులాలు, తెగల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సాంఘికార్థికాభివృద్ధికోసం అవసరమైన సూచనలు చేస్తూ వాటి అమలుకు యత్నించడం.

5) రాష్ట్రపతి ఈ కులాల అభ్యున్నతికి కమిషన్ అప్పగించిన కార్యక్రమాలను ఆచరణ రూపంలో పెట్టడం.

వీటికి తోడు షెడ్యూల్డు తెగలు అదనంగా కొన్ని సాదుపాయాలను కలిగి వున్నాయి. రాజ్యంగంలోని 164వ అధికరణం ప్రకారం గిరిజన సంక్షేమ విధులను నిర్వర్తించేందుకు రాజ్యాంగం ఒక మంత్రిని నియమించుకునే అవకాశం కల్పిస్తున్నది. 275వ అధికరణ షెడ్యూల్డు తెగల సంక్షేమం కోసం రాజ్యం ప్రత్యేక నిధులను కేటాయించవచ్చని సూచిస్తున్నది. రాజ్యాంగంలోని 6వ షెడ్యూళ్ళు షెడ్యూల్డు ఏరియా గిరిజన ప్రాంతాల పాలన కోసం ప్రత్యేకాధికారాలు కల్పిస్తున్నాయి.

రాజ్యాంగం చట్టం కల్పిస్తున్న వివిధ రకాలయిన రక్షణలు అవకాశాలు అసమానత, సోపాన పరంపరగా సామాజికంగా వెనకబడివున్న షెడ్యూల్డు కులాలు, తెగలు, ఇతర బలహీన వర్గాల ప్రజలు సమానత్వం సాధించేందుకు నిర్దేశించబడ్డాయి. ఈ తరగతులకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, లబ్ధి, జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాధాన్యత కల్పించకుంటే వారు మానవ హక్కులు అనుభవించడం ఆచరణాత్మకం కాక పోవచ్చు.

B RAO U

8.6 పౌర హక్కుల రక్షణ చట్టం 1955

35వ అధికరణం కల్పించిన అధికారాలను అమలుచేస్తున్న క్రమంలో, రాజ్యాంగంలోని 46వ అధికరణం నిర్దేశించిన ప్రకారం పార్లమెంటు అస్పృశ్యత (నేర) నవరణ చట్టం 1976 రూపంలో నవరించబడింది. 1976 చట్టం ప్రకారం సమాజంలో అస్పృశ్యతను తొలగించేందుకు చట్టాన్ని మరింత బలోపేతం చేసారు. తదనంతరం ఈచట్టం పౌర హక్కుల రక్షణ చట్టం 1955 గా రూపాంతరం చెందింది.

"పౌర హక్కు" అనే పదం అస్పృశ్యత నివారణ ద్వారా పౌరునికి లభిస్తున్న హక్కుగా రాజ్యాంగంలోని 17వ అధికరణం చెబుతున్నది. అయితే అస్పృశ్యతను రాజ్యాంగంలో గాని చట్టంలో గాని నిర్వచించ లేదు. అయితే కోర్టులు ఈ అంశంలో వివరణ హిందూ కుల వ్యవస్థలో భాగమైన ఈ ప్రక్రియను అర్థం చేసుకోవచ్చని దీన్ని వివరించడం, నిర్వచించడం సాధ్యపడక పోవచ్చని అభిప్రాయ పడ్డారు. ఈ వివరణ ప్రకారం హిందూ కుల వ్యవస్థలో ఒక వర్గాన్ని ఇతర వర్గాలు అస్పృశ్యులుగా చూసేవారని పేర్కొనబడింది.

అస్పృశ్యత అనేది ఉదాహరణకు కొందరు వ్యక్తులు తాత్కాలికంగానో, ఇతరత్రాంగానో అస్పృశ్యులుగా చూపబడడం అన్న మాట. ఇందులో వ్యాధిగ్రస్తులైన వ్యక్తులను అస్పృశ్యులుగా చూడడం. సాంఘికంగా వారి జన్మను బట్టి అస్పృశ్యులు చూడడం, కుల కక్షలు, పంచాయితీల పర్యవసానంగా, సాంఘిక బహిష్కరణకు గురవడం అస్పృశ్యతకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ఈ తరుణంలో అస్పృశ్యతను అనుభవిస్తున్న వ్యక్తులు రాజ్యాంగంలోని 17 అధికరణంలో పేర్కొన్న విధంగా లేదా పౌర హక్కుల చట్టం ద్వారానో రక్షణ పొందవచ్చు.

నవరించిన చట్టం ప్రకారం అస్పృశ్యత కారణంగా వివక్షతో చూడడం ఒక నేరంగా పరిగణించబడుతుంది. ఈ నేరాలను పరిశోధించడం అనే బాధ్యతను ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త చట్టం సంక్రమింపజేస్తున్నది. ఈరకమైన నేరాలను పరిశోధించడం అంశంలో అశ్రద్ధ కనబరచడం కూడా శిక్షార్హమైన నేరంగా చూడడమే గాక, ఆ నేరాలను ప్రోత్సహించినట్లుగా భావిస్తున్న వ్యక్తులు కూడా శిక్షార్హులయిన వ్యక్తులుగా చూపడం ఒక ప్రత్యేక అంశంగా ఈ చట్టంలో పేర్కొనబడింది.

ఈ చట్టం అస్పృశ్యత కారణంగా నదులు, కాలువలు, చెరువులు, బావులు ఇతరత్రా నీటి వనరులు స్నానఘట్టాలు ఉపయోగించుకోవడాన్ని నిరోధించడాన్ని ప్రశ్నిస్తుంది. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ప్రార్థనా స్థలాలు, ఇతర ప్రార్థనా మందిరాలు, ప్రజా ప్రార్థనా స్థలాల వలనే అన్ని వర్గాలు ఆరాధించే వీలుగా ఈ చట్టం పరిధిలోకి తీసుకు వచ్చారు. అస్పృశ్యతా (నేర) చట్టంతో చూస్తే కొత్త చట్టం ఉపాధి ఉద్యోగాల్లో వివక్ష సాంస్కృతిక మతపరమైన, సాంఘిక వివక్షలను, ఇతర రకాల వివక్షలను నిరోధించడాన్ని తన పరిధిలోకి తీసుకున్నది. హాస్టళ్ళు, ఇళ్ళలో వివక్షలను కూడా ఇది నిరోధిస్తున్నది. అస్పృశ్యతను ప్రత్యక్షంగా, పరోక్షంగా సమర్థించడాన్ని చారిత్రకంగా మతపరంగా సైద్ధాంతికంగా దీన్ని ఉపయోగింపబూనడాన్ని తప్పిదంగా, నేరంగా కొత్త చట్టం పరిగణిస్తుంది. వ్యక్తులను పాకీ పనితరహా పనులకు గురిచేయడం. పశువుల కాపలాకు ఉపయోగించడం కూడా శిక్షార్హమైన అంశంగానే పరిగణించబడుతున్నది.

పౌరహక్కుల చట్టం అస్పృశ్యతా నివారణకు ప్రయత్నాలను చట్టబద్ధం చేసి కట్టుదిట్టం చేసింది. అన్ని రకాల అస్పృశ్యతా నేరాలు, అధికారికంగా నేరాలుగా గుర్తించబడి, శిక్షార్హమైన నేరాలుగా పరిగణించబడ్డాయి. 3 నెలల కన్నా ఎక్కువ శిక్ష పడని కొన్ని సందర్భాల్లో, తిరిగి కేసును పరిశీలించే అవకాశమేర్పడుతున్నది. అస్పృశ్యతాధికారాల్లో శిక్షాకాలాన్ని పెంచుతూ, శిక్షను జరిమానా రూపంలోనూ ఖైదు రూపంలోనూ విధించే అవకాశం ఏర్పడింది. అస్పృశ్యతా సంబంధిత నేరాలను ప్రోత్సహిస్తూ, చట్టధిక్కారానికి కారణభూతులవుతున్న వ్యక్తులు, సమాజాలపై చర్య తీసుకునే అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలకు చట్టం కల్పించింది. ఈ రకమైన నేరాలను పరిశోధన చేయడంలో నిర్లక్ష్యాన్ని కనబరిచిన ఉద్యోగులను నేరాన్ని ప్రోత్సహించినట్లుగా కొత్త చట్టం పరిగణిస్తుంది. కొత్త చట్టం ప్రకారం అస్పృశ్యతకు సంబంధించిన నేరాలకు పాల్పడడం ప్రోత్సహించడం ఆరు నెలల జైలు శిక్షతోబాటు 500 రూపాయలు జరిమానాకు అర్హమైన నేరాలుగా చట్టం పేర్కొన్నది. అస్పృశ్యత నేరంలో ఈ రెండు రకాలైన శిక్షలను కూడా విధించవచ్చు.

BRAOU

ఈ చట్టం వివక్ష చూపుతున్న ప్రాంతాలలో పరిశోధనలను, సర్వేలను నిర్వహిస్తూ చట్టంలోని అంశాలను ఆచరణ రూపంలో పెట్టేందుకు కమిటీల నియామకాలను సూచిస్తున్నది. అస్పృశ్యత ప్రభావంతో వైకల్యానికి గురవుతున్న వ్యక్తులకు సరియైన సదుపాయాలు కల్పించే అవకాశం ఈ చట్టం కల్పిస్తుంది. వీటన్నిటికీమించి అస్పృశ్యతకు గురైన వ్యక్తులకు చట్టంలో కల్పించబడిన సదుపాయాలను వారికి చేరేలా చూడాల్సిన బాధ్యతను పౌరచట్టం ప్రభుత్వాలపై వుంచుతున్నది. వీటిలో న్యాయ సలహా కల్పించడం, నేరాన్ని ప్రాసిక్యూట్‌చేసే అవకాశం ఇచ్చే రీతిలో అధికారులను నియమించడం. స్పెషల్ కోర్టులను ఏర్పరచడం, కమిటీలను ఏర్పరిచి అస్పృశ్యతా నివారణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో సహాయ కారులుగా నిలువడం వున్నాయి. ఈ చట్టం మొట్టమొదటి సారిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కోణంలోనే చేపడుతున్న చర్యలను పార్లమెంటు ముందు ప్రతీ సంవత్సరం నివేదికలు ఉంచే బాధ్యతను కల్పించింది.

ప్రస్తుత సవరణ చట్టం, షెడ్యూల్డు కులాల పౌర హక్కుల రక్షణలో ఒకడుగు ముందు వేసే పౌరహక్కుల చట్టంగా వుంటూ సామాజిక రుగ్మతలయిన అస్పృశ్యతను కుల వ్యవస్థ పర్యవసానంగా వేళ్లునుకున్న సాంఘిక వివక్ష నుండి వారికి రక్షణ కల్పించే అవకాశాన్నిస్తుంది.

8.7 షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (అత్యాచార నిరోధక) చట్టం 1989

1990 మార్చి 30 నుండి షెడ్యూల్డు కులాలు, తెగల (అత్యాచార నిరోధక) చట్టం 1989 అమలులోకి వచ్చింది. గతంలోని చట్టాలతో పోల్చుకుంటే ఇది ఒక సమగ్ర చట్టం. దీని ద్వారా కులం, ఇతర అంశాల కారణంగా వెలుగు చూస్తున్న అన్ని రకాల అయోగ్య అంశాలను అడ్డుకునే అవకాశమున్నది. షెడ్యూల్డు తెగలపై జరుగుతున్న హింసను నిరోధించడంలో పౌరహక్కుల చట్టం వైఫల్యం చెందింది. షెడ్యూల్డు కులాలు, తెగల కమీషన్ నివేదికల ప్రకారం ప్రతి సంవత్సరం నిమ్న వర్గాలపై నేరాల సంఖ్య గతంతో పోలిస్తే పెరుగుతూనే వున్నాయి. హత్యలు, సామూహిక మానభంగాలు ఆస్తుల విధ్వంసం షెడ్యూల్డు కులాల మహిళలపై అత్యాచారాల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూ హింసాత్మక రూపాన్ని దాలుస్తున్నాయి. ఈ రకమైన అత్యాచారాల తీవ్రతను పరిగణలోనికితీసికొని పునరావాసం కల్పించే సదుపాయం కలుగుతున్నది.

BRAOU

1989 చట్టంలోని ప్రధాన లక్ష్యాలు:

1) షెడ్యూల్డు కులాలు, తెగల పౌరులపై నేరాలతో కూడిన అత్యాచారాలను నిరోధించడం.

2) ఈ రకమైన నేరాలను ప్రత్యేక కోర్టుల్లో విచారణకు అవకాశం కల్పించడం.

3) అత్యాచారాలకు గురైన బాధితులకు పునరావాసం, పరిహారం కల్పించడం.

'అత్యాచారం' నేరాన్ని ఈ చట్టంలో నిర్వచించ కున్నప్పటికీ చట్టంలోని 3వ సెక్షనులో దీన్ని వివరించారు. అత్యాచారం ఒక నేరంగా గుర్తించబడినపుడు దాన్ని వాస్తవానికి ఖచ్చితంగా నిర్వచించాలి

అత్యాచారాల తీవ్రత కారణంగా దీన్ని పూర్తిస్థాయిలో నిర్వచించడం కష్టతరమవుతున్నది. చట్టంలోని 3వ సెక్షను షెడ్యూల్డు కులాలు, తెగలపై జరుగుతున్న అన్ని రకాల అత్యాచారాలను వివరించినప్పటికీ అందులో పేర్కొన్న లిస్టు పూర్తిస్థాయిలో లేదు. 3వ సెక్షన్ ప్రకారం షెడ్యూల్డు కులాలు తెగలకు సంబంధించని వ్యక్తి ఎవరైనా చట్టంలో పేర్కొన్న నేరంలో భాగస్వామి అయితే ఈ చట్టం ప్రకారం శిక్షార్హులు. 3వ సెక్షన్‌లో పేర్కొన్న అత్యాచారాలు ఈ క్రింది విధంగా వున్నాయి:

1) షెడ్యూల్డు కులాలు తెగలకు చెందిన వ్యక్తిని తినగూడని లేదా అసహ్యకర పదార్థాన్ని తినేలా బలవంత పెట్టడం.

2) ఉద్దేశ్య పూర్వకంగా షెడ్యూల్డు కులాలు, తెగల వారు నివసిస్తు ప్రాంతాల్లోనో, చుట్టు ప్రక్కలనో అపరిశుభ్ర పదార్థాలను వేయడం, తద్వారా అవమాన పరచడం.

Dr. BRAOU LIBRARY 115096 Class No. 323.4 BHA

3) షెడ్యూల్డ్ కులాలు లేదా తెగలకు సంబంధించిన వ్యక్తుల బట్టలను బలవంతంగా తొలగించడం లేదా అవమానపరిచే ఉద్దేశ్యంతో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వ్యక్తులను వివస్త్రలను చేసి ముఖాలకు రంగువేసి శరీరంపై రంగువేసి పూరేగించడం.

4) షెడ్యూల్డ్ కులాలు, తెగలకు కేటాయించిన భూములను దురాక్రమణ చేయడం, అతని హక్కులను అనుభవించడాన్ని అడ్డుకోవడం.

5) షడ్యూల్డ్ కులాలు, తెగల వారిని వెట్టి చాకిరీకి గురిచేసి, పరాధీనుడిగా మార్చేందుకు కారణ భూతులవడం.

6) ఒక ప్రత్యేక అభ్యర్థికి ఓటే వేయమనో, వేయరాదనో బెదిరించడం.

7) షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వ్యక్తులపై, ఉద్దేశ్య పూర్వక తప్పుడు అభియోగం మోపడం.

8) షెడ్యూల్డ్ కులాలు, తెగల మహిళలను అగౌరవపరిచే రీతిలో ప్రవర్తించడం, బలవంతంగా వివస్త్రలను చేయడం.

9) మహిళల ఇష్ట యిష్టాలను పరిగణనలోకి తీసుకోకుండా అధికారం ఊతంగా కామవాంఛలు తీర్చుకోవడం.

10) షెడ్యూల్డ్ కులాలు, తెగల వారు వినియోగిస్తున్న మంచి నీటి చెరువులను, బావులను కలుషితం చేయడం.

11) ప్రజా బహిరంగ సంబంధిత ప్రదేశాల్లో షెడ్యూల్డ్ కులాల ప్రవేశాన్ని నిరోధించి ప్రజలతో సంబంధాలు కలిగివుండని రీతిలో అవాంతరాలను సృష్టించడం.

12) షెడ్యూల్డ్ కులాలు, తెగల వ్యక్తులు ఇల్లు, గ్రామాలు వదిలి వెళ్లేలా బలవంత పెట్టి బహిష్కరణకు గురిచేయడం.

చట్టంలోని 3వ సెక్షనులో పేర్కొన్న అంశాలు షెడ్యూల్డ్ కులాలు, తెగల అత్యాచార నిరోధానికి ఉపకరించడమే గాక పౌర హక్కులను అనుభవించే అవకాశం కల్పిస్తూ గౌరవంగా జీవించే అవకాశం కల్పిస్తున్నది. 3(2) విభాగంలో ఇంతకన్నా తీవ్రమైన అంశాలు చోటు చేసుకున్నాయి. షెడ్యూల్డ్ కులాలు, తెగల వ్యక్తులకు వ్యతిరేకంగా తప్పుడు,ఉద్దేశ్య పూర్వకంగా సాక్షాలు ఇచ్చాన వ్యక్తులకు మరణదండన విధించే అధికారాన్ని ఆ విభాగం కల్పిస్తున్నది. ఈ చట్టం క్రింద ఇలాంటి వ్యక్తులకు మరణదండన విధిస్తారు. సాక్ష్యాధారాలను తొక్కి పెడుతూ షెడ్యూల్డ్ కులాల, తెగలకు చెందిన వ్యక్తులపై అత్యాచారాలకు పూనుకునే నిందితుల ఆస్తులను జప్తుచేయడం ముందస్తు బెయిల్ లేకుండా చేయడం తదితర ఖచ్చితమైన చర్యలను ఈ చట్టం ద్వారా పొందవచ్చు. అత్యాచారనిరోధక చట్టం అమలును శీఘ్రతరం చేయడానికి జిల్లా స్థాయిలో, రాష్ట్ర, హైకోర్టు ఛీప్ జస్టిస్ యొక్క అనుమతితో కోర్టులను ఏర్పాటు చేయవచ్చు. ప్రతీ ప్రత్యేక కోర్టులో ప్రభుత్వం ఒక స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమిస్తూ విచారణను శీఘ్రతరం చేయవచ్చు.

ఒక ప్రాంతంలో అస్పృశ్యత ను ప్రోత్సహించే వ్యక్తులపై జరిమానా విధించే అవకాశాన్ని ఈ చట్టం కల్పిస్తుంది. జిల్లా మెజిస్ట్రేట్, సబ్ డివిజన్ మిజిస్ట్రేట్, డి.ఎస్.పి. స్థాయికి తగ్గని పోలీసు అధికారులు ఈ చట్టం అమలుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకునే అధికారం కలిగివుంటారు. ఈ చట్టం అమలు కోసం వీటికి తోడుగా ప్రభుత్వం కూడా కొన్ని చర్యలు తీసుకుంటుంది అవి:

1) అత్యాచారానికి గురైన వ్యక్తులకు న్యాయ సహాయం అందించడం.

2) సాక్షులకు, బాధితులకు విచారణ సందర్భంలో ప్రయాణ ఖర్చులు, ఇతరత్రాఖర్చులు భరించడం.

3) ప్రాసిక్యూటర్ విధులను పర్యవేక్షించేందుకు అధికారులను నియమించడం.

4) అత్యాచార బాధితులకు ఆర్థిక సాంఘిక పునరావాసం కల్పించడం.

BRAOU

1955 అత్యాచార నేరచట్టం, 1976 లో సవరణతో వచ్చిన పౌర హక్కుల చట్టంతో పోలిస్తే 1989 షెడ్యూల్డ్ కులాల, తెగల (అత్యాచార నిరోధక) చట్టం సమగ్రమైనది. ఇది సాంఘిక వ్యత్యాసాలను వివక్షతను నిరోధిస్తుంది.

8.8 ముగింపు

కుల వ్యవస్థ కారణంగా సమాజం విభాజిత సోపాన పరంపర వ్యవస్థగానున్నది. కుల వ్యవస్థ అణచివేతను అధికార ప్రయోగాన్ని ప్రోత్సహిస్తుంది. కులం సాంఘిక వ్యవస్థలో ప్రధానాంశంగా వున్నందున మానవ హక్కుల ఉల్లంఘనకు కారణ భూతమవుతున్నది. కులం సమానత్వానికి శత్రువు. ఇది స్వేచ్ఛకు సౌభ్రాతృత్వానికి వ్యతిరేకమైనది. అందువల్లనే భారత రాజ్యాంగము, ఇతర చట్టాలు సాంఘిక వివక్షను నిరోధిస్తూ, విద్యా, ఉపాధిరంగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ నిమ్న వర్గాల అభ్యున్నతికి ఇతర కులాలకు ధీటుగా ఎదగడానికి అవకాశం కల్పిస్తున్నది. రక్షిత చట్టాలు ముఖ్యంగా అస్పృశ్యతా నేరచట్టం, పౌర హక్కుల చట్టం, వీటిన్నింటికీ మించి షెడ్యూల్డ్ కులాలు, తెగల (అత్యాచార నిరోధక) చట్టం నిమ్న కులాల ప్రజలు పౌర సాంఘిక హక్కులను అనుభవిస్తూ రక్షణ పొందే అవకాశం కల్పిస్తున్నాయి. అత్యాచారాల నుంచి వారికి రక్షణ కల్పిస్తూ స్వేచ్ఛ నిస్తున్నాయి. ఇది వాళ్ళు దీర్ఘ కాలికంగా ఉద్యమించి వాళ్ళ హక్కులను సాధించుకునే అవకాశం ఇస్తుంది. ఈ చట్టాల అమలు ఎంత పకడ్బందీగా సాగితే మానవ హక్కులను అంత ప్రగతి దిశలో అనుభవిస్తాము, ముఖ్యంగా సమానత్వ హక్కు, బలహీన వర్గాలు, అణచివేయ బడుతున్న వర్గాలు, పేదల గౌరవ జీవనానికి ఇది ఉపకరిస్తుంది.

8.9 మాదిరి పరీక్ష ప్రశ్నాలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి

1) సమాత్వం యొక్క భిన్న అర్థాలు వివరిస్తూ భారత దేశంలో షెడ్యూల్డ్ కులాలు, తెగల రక్షణలో ఏది ఏమేరకు ప్రభావం చూపుతుందో తెలుపండి.

2) భారత దేశంలో కుల వ్యవస్థ సమానత్వానికి ఎందువల్ల ప్రతికూలమైందో చెబుతూ, మానవ హక్కుల ఉల్లంఘనకు అది ఎలా కారణమవుతుందో వివరించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి.

1) వివక్ష నుండి రక్షణ (Protective Discrimination) అనే సిద్ధాంతాన్ని వివరిస్తూ సమానత్వ సాధనలో ఆ సిద్ధాంత ప్రాధాన్యతను విశ్లేషించండి.

2) పౌర హక్కుల ఆచరణకు షెడ్యూల్డ్ కులాలు, తెగల (అత్యాచార నిరోధక) చట్టంలో పేర్కొన్న చర్యలు వివరించండి.

BRAOU

9. జాతీయ మహిళా కమిషన్

విషయక్రమం

9.0 ఉద్దేశం

9.1 పరిచయం

9.2 జాతీయ మహిళాకమిషన్

9.3 మహిళా కమిషన్ పనితీరుపై సమీక్ష

9.4 ముగింపు

9.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

9.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తర్వాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు :

- మహిళలకోసం, పిల్లలకోసం ఏర్పాటయిన చట్టాలను గురించి, కమీషన్ల ఏర్పాటు, నిర్మాణం, పని తీరు
- మానవ హక్కుల అమలులో కమీషన్ పాత్ర, మొదలగు విషయాలను తెలుసుకుంటారు.

9.1 పరిచయం

మానవ హక్కులకు, మహిళల అభివృద్ధికి అవినాభావ సంబంధం ఉంది. బానిస యుగం నుంచి ఇప్పటి ప్రజాస్వామ్య యుగం దాకా మానవ సమాజం సాధించిన పరిణామాలు, వికసించిన నాగరికత, మానవ హక్కుల సూత్రాలపైన ఆధారపడ్డాయి. ఆయా కాలపు సమాజాల్లో మహిళలు, పిల్లల ఉనికి, హక్కులు, అభివృద్ధి, ఇతర సమాజంతో వారి సంబంధాలు వారి మానవ హక్కుల పరిధిని నిర్దేశిస్తాయి.

మన రాజ్యాంగం మూడో విభాగంలో ప్రాథమిక హక్కులను నిర్దేశించాను. ఈ హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాల ద్వారా వాటికి పరిష్కారం పొంది, ఆ హక్కులను అమలు చేయించే అవకాశాలు ఉన్నాయి. మహిళలకు ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేయడం కూడా మహిళల హక్కులను, అధికారాలను సాధించడానికే ప్రత్యేక చట్టం ద్వారా జాతీయమహిళా కమీషన్ ఏర్పాటయింది.

9.2 జాతీయ మహిళాకమిషన్

జాతీయ మహిళాకమీషన్ చట్టం 1990 కింద నిర్దేశించిన అధికారాలు, విధులు నిర్వహణ కోసం జాతీయ మహిళా కమీషన్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

మహిళల అభివృద్ధిని చిత్త శుద్ధితో కాంక్షించే శ్రేయోభిలాషులను నిబద్ధత కలిగిన వారి అధ్యక్ష పదవిలో నియమించాలి. న్యాయ రంగం, కార్మిక నాయకత్వం మహిళల ఉద్యోగావకాశాలు పెంచే పారిశ్రామిక యాజమాన్యం నుంచి, మహిళల స్వచ్ఛంద సంస్థలు, మహిళా స్వేచ్ఛ ఉద్యమ నాయకులు, పాలన, ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, సాంఘిక సంక్షేమం, మొదలయిన రంగాలలో విశేషానుభవం గురించిన అయిదుగురిని ఈ కమీషన్ సభ్యులుగా నియమించాలి.

షెడ్యూల్డ్ కులాల, తెగలకు చెందిన కనీసం ఒకొక్కరిని సభ్యులుగా నియమించాలి. యాజమాన్య, వ్యవస్థ నిర్మాణం, సాంఘిక ఉద్యమంలో అనుభవం ఉన్న వ్యక్తిని లేదా కేంద్ర సివిల్ సర్వీసులో ఉన్న వ్యక్తిని, లేదా అల్ ఇండియా సర్వీస్ వ్యక్తి, కేంద్రంలో సివిల్ హోదా అధికారిగా తగిన అనుభవం గడించిన వ్యక్తిని మెంబర్ సెక్రెటరీగా నియమించాలి.

BRAOU

జాతీయ మైనారిటీ కమీషన్ చైర్‌పర్సన్‌కు, సభ్యుల పదవీకాలం, పని నియమాలు మహిళా కమీషన్ చైర్‌పర్సన్, సభ్యులకు వర్తిస్తాయి. కమీషన్ క్రమబద్ధీకరించే విధానాలు కూడా మైనారిటీ కమీషన్ విధానాలే.

కమీషన్ చేపట్టిన అనేక విషయాల అధ్యయనానికి అవసరమయిన కమిటీలు నియమించవచ్చు. కమీషన్ సభ్యులుగాని వారిని సభ్యులుగా కో-ఆప్ట్ చేసుకునే అధికారం కమిషన్‌కు ఉంది. కోఆప్ట్ చేయబడిన సభ్యులు కమిటీ సమావేశాలకు హాజరై ప్రొసీడింగ్స్‌లో పాలు పంచుకోవచ్చు. కాని వీరికి వోటు హక్కు ఉండదు.

కమీషన్ కింది విధులన్నీ లేదా కొన్ని విధులను నిర్వహించాలి:

1) రాజ్యాంగంలోనూ, ఇతర శాసనాల్లోను కల్పించిన మహిళల శిక్షణ నియమాలకు సంబంధించిన అన్ని వ్యవహారాలను దర్యాప్తు జరపాలి.

2) మహిళలకుభద్రతా నియమాల పనితీరుపై వార్షిక నివేదికలను, లేదా అవసరమనుకున్న సమయాల్లో ప్రత్యేక నివేదికలను కమీషన్ కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలి.

3) కేంద్రం, రాష్ట్రాలు మహిళల జీవన స్థాయి పెంచేందుకు, రాజ్యాంగ భద్రతా నియమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఆ నివేదికల ద్వారా అవసరమయిన సిఫార్సులు చేయాలి.

4) రాజ్యాంగ నియమాలు, ఇతర శాసనాల్లో మహిళల ప్రయోజనాల రక్షణకు రూపొందించిన నియమాల అమలు తీరును ఎప్పటికప్పుడు సమీక్షించి, పరిష్కారాలను, సవరణలను సూచించి ఆ శాసనాలలో లోపాలను పూరించాలి.

5) రాజ్యాంగం, ఇతర శాసనాల నియమాలను ఉల్లంఘించి కేసులను విచారించి సంబంధించిన అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారం కోసం ప్రయత్నించాలి.

ఈ కింది సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించాలి లేదా తనకు తానే పరిశీలించాలి.

(i) మహిళల హక్కుల భంగం

(ii) మహిళల రక్షణ, సమానత, అభివృద్ధికి సంబంధించిన నియమాలు అమలు చేయకపోవడం.

(iii) మహిళల కష్టాలు సమస్యలు పరిష్కరించే అదేశాలు, మార్గదర్శక సూత్రాలు, విధాన నిర్ణయాలను అమలు చేయకపోవడం.

ఈ విషయాలకు సంబంధించిన ఇతర అంశాలను సంబంధిత అధికారులకు తెలియ జేయాలి.

6) మహిళపై అత్యాచారం, విపక్ష వంటి సమస్యలు తలెత్తిన ప్రత్యేక పరిస్థితులలో అందుకు కారణాలను గుర్తించి, సరైనా పరిష్కారాలను సూచించడానికి ప్రత్యేక అధ్యయనాలు పరిశీలనలు, పరిశోధనలు జరిపించాలి.

7) అన్నిరంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి విద్యాపరమయిన, అభివృద్ధి పరమయిన పరిశోధనలు దర్యాప్తులు జరిపించాలి. వారి ప్రగతిని నిరోధించే కారణాలను గుర్తించాలి. గృహనిర్మాణం, తదితర సకాలిక అవసరాలు విధించలేక పోవడం, సహకరించే సేవలు సరిపోకపోవడం, తక్కువ ప్రతిఫలానికి ఎక్కువ సేవ చేయించే దురాచారాన్ని తగ్గించడం. వృత్తి ఉద్యోగాలలో ఆరోగ్య హానికర పరిస్థితులు, వారిలో ఉత్పాదక నైపుణ్యం చేయడం వంటి సమస్యలను గుర్తించాలి.

8) మహిళల సాంఘిక ఆర్థిక ప్రగతి ప్రణాళికల రూపకల్పనలో పాల్గొనాలి. సరైన సలహాలు ఇవ్వాలి.

9) కేంద్రం, రాష్ట్రాలలో మహిళల అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును అంచనా వేయాలి.

10) మహిళలను నిర్బంధించే జైళ్ళు, రిమాండ్ కోసం, ఇతర సంస్థలను తనిఖీ చేయడం, చేయించడం అవసరమైతే పరిష్కారాల కోసం సంబంధిత అధికారులతో సంప్రదించడం.

11) మహిళా సమాజాన్ని ప్రభావితం చేసే న్యాయ లీడ్యులను కొడడానికి ప్రయత్నించడం

BRAOU

ఈ విధులు నిర్వహించే సమయాలలో మహిళా కమిషన్‌కు సివిల్ కోర్టుకు ఉండే అధికారాలన్నీ ఉంటాయి. జాతీయ ఎస్.సి., ఎస్.టి కమీషన్‌కు చట్టంలో పేర్కొన్న అధికారాలు, నివేదికలను పంపే విధానాలు, మహిళలాకమీషన్ విషయంలోనూ వర్తిస్తాయి. అనే విధానాలు ఇక్కడకూడా అనుసరించవలసి ఉంటుంది.

9.3 మహిళాకమీషన్ పని తీరుపై సమీక్ష

మనదేశంలో మహిళ హోదాకు సంబంధించిన అన్ని విషయాలను, వారి హక్కులను రక్షించే బాధ్యతలను జాతీయ మహిళా కమీషన్‌కు అప్పగించారు. కమీషన్‌కు విస్తృతమైన అధికారాలు ఇచ్చారు. అన్నింటికన్న ఎక్కువ ప్రధానమయిన విషయం మహిళలకు, వాటితోపాటు ముఖ్యంగా పురుషులకు కూడా వారి స్త్రీలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కుల గురించి తెలియపరచడం స్త్రీలకున్న హక్కుల గురించి పురుషులు కూడా తెలుసుకోవాలన్నదే ముఖ్యోద్దేశం. హక్కులు భంగపడినపుడు, అత్యాచారాలు జరిగినపుడు ఎవరికి ఫిర్యాదు చేయాలి, పరిష్కారం సాధించే మార్గమేది? అనే విషాయలు తెలియ జేయాలి. టి.వి., రేడియో, పత్రికలు, వ్రాత పుస్తకాలు ద్వారా ఈ విషయాలు తెలియచేసే కార్యక్రమం చేపట్టడం.

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మహిళల స్థితిగతుల అభివృద్ధి గురించి అంచనావేయడం మరో ముఖ్య బాధ్యత. మహిళలకు సత్వర న్యాయం అందించేందుకు 'పరివారిక్ మహిళాలోక్ అదాలత్' నిర్వహించారు. మహిళలకు న్యాయ విద్యాబోధన శిక్షణ, వ్యభిచార వృత్తినుంచి తప్పించి పునరావాసం కల్పించడం, ముఖ్యంగా బ్యాలంలోనే అవృత్తిలోకి తోయబడిన వారికి విముక్తి కలిగించడం, వితంతువు పునరావాసం, సారా వ్యతిరేకోద్యమం, నిర్భంధంలో ఉన్న స్త్రీలకు న్యాయం, లింగభేదంలేని సమానత, కొన్ని వర్గాల మహిళలకు సామాజిక న్యాయం కల్గించే కృషి జరిపించింది.

వివిధ రాష్ట్రాలలో మహిళల హోదా, స్థితిగతుల పరిశీలనకు మహిళాకమీషన్ రాష్ట్ర పర్యటనలు చేసింది. రాష్ట్ర మహిళాకమీషన్లతో అనుబంధం పెట్టుకొని, మహిళలను విద్యావంతులను చేయడం, సెమినార్లు, చర్చగోష్ఠులు నిర్వహించాలి.

BRAOU

9.4 ముగింపు

లింగ వివక్షకు గురై సమానత హక్కులకు దూరమయిన మహిళల అభివృద్ధికి, వారి సాంఘిక సంక్షేమానికి సంబంధించి ఎంతో కృషి చేయవలసిన అవసరం ఉందని జాతీయ మహిళా కమీషన్ అధ్యయనాలను, పరిశీలనల్లో తేలింది. ఆస్తి హక్కు, విద్యావకాశాలు, రాజకీయరంగం - మొదలయిన కీలకమయిన అంశాలలో మహిళలకు సమాన ప్రాతినిథ్యం సంపాదించడం, మహిళల హక్కుల గురించి వారికి తెలియ జేయడం నిరంతరం కొనసాగవలసిందే.

మహిళలపై జరుగుతున్న సెక్స్ నేరాలు, వైవాహిక నేరాలను నిరోధించి, నేరస్తులను శిక్షించడానికి అవరసమయిన శాసన సంస్కరణలను కమీషన్ ఎప్పటికప్పుడు సూచిస్తున్నది. ఇంకా నిర్దిష్టమయిన సూచనలు చేయవలసిన అవసరం ఆ సూచలన మేరకు శాసనాలు మార్చవలసిన అవసరం ఉంది.

9.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.

1. జాతీయ మహిళా కమీషన్ ఏర్పాటు చేయవలసిన అవశ్యకత ఏమిటి?
2. మహిళాకమీషన్ ఏర్పాటు వల్ల లక్ష్యం నెరవేరిందా?

II. ఈ కింది ప్రశ్నకు 20 పంక్తులలో జవాబు రాయండి.

1. మహిళల అభ్యుదయానికి సంబంధించిన ఇంకా ఏ మార్పులు చేస్తే బాగుంటుందో సూచించండి.

10. మైనారిటీలు, వెనుకబడిన తరగతులు ప్రత్యేక కమిషన్లు

విషయక్రమం

10.0 ఉద్దేశం

10.1 పరిచయం

10.2 జాతీయ మైనారిటి కమీషన్

10.3 వెనుకబడిన తరగతుల కమీషన్

10.4 ప్రత్యేక కమీషన్ల పనితీరు - సమీక్ష

10.5 ముగింపు

10.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

10.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ క్రింది అంశాలను తెలుసుకుంటారు:

- జాతీయమైనారిటి కమీషన్ గూర్చి వివరించగలుతారు,
- వెనుకబడిన తరగతుల కమీషన్ గూర్చి తెలుసుకుంటారు,
- ప్రత్యేక కమీషన్ల పనితీరు సమీక్షిస్తారు.

10.1 పరిచయం

బానిస యుగంనుంచి ప్రస్తుత ప్రజాస్వామిక యుగం వరకు మానవ సమాజం సాగిన విభిన్న పరిణామ దశలకు, మానవహక్కుల సూత్రం, అభివృద్ధి సాధించడానికి సంబంధం ఉంది. ఆయా సమయాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థ నిర్దేశించిన మానవ సంబంధాలను విడివిడిగా మానవహక్కుల రూపురేఖలను, పరిధిని పరిగణించడానికి వీలులేదు.

మానవ హక్కులను క్రమబద్ధం చేసేది మానవ సంబంధాలే. ఈ మానవ హక్కులను రక్షించి అమలుచేసే మార్గాలను పద్ధతులను రాజ్యం నిర్ణయించింది.

పౌరులకు ప్రాథమిక హక్కులను రాజ్యాంగం మూడో భాగంలో పొందుపరిచారు. ఈ హక్కులను రక్షించేందుకు భారతరాజ్యంగం నూతన న్యాయవ్యవస్థను కల్పించింది. అందరు పౌరుల హక్కులను రక్షించే బాధ్యత సుప్రీంకోర్టు నిర్వహించినప్పటికి కొందరు బలహీనవర్గాల రక్షణకు అవసరాలకు ఈ నియమాలు సరిపోకపోవచ్చు. కనుక భారత ప్రభుత్వం విభిన్న సమయాల్లో సమాజంలో బలహీన వర్గాలకోసం కొన్ని ప్రత్యేక కమీషన్లను ఏర్పాటు చేసింది. ప్రత్యేక రక్షణ అవసరమయిన బడుగు వర్గాలలో షెడ్యూల్లు కులాలు, షెడ్యూల్లు తెగలతో పాటు అల్పసంఖ్యాక వర్గాలు, వెనుకబడిన తరగతుల వారు కూడా ఉన్నారు. వీరికోసం విభిన్న చట్టాల ద్వారా ప్రత్యేక కమీషన్లు నియమించారు.

10.2 జాతీయ మైనారిటీ కమీషన్

1992లో పార్లమెంట్ రూపొందించిన జాతీయ మైనారిటీ (అల్పసంఖ్యాక వర్గాల) కమీషన్ చట్టం కింద నిర్ణయించిన అధికారాలతో, విధులను నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమానికి ఒక జాతీయ కమీషన్ ఏర్పాటు చేయాలి.

BRAOU

ఈ కమీషన్‌కు అధ్యక్షుడిని (చైర్‌పర్సన్), ఆరుగురు సభ్యులను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. సమర్థత, సమగ్రత, శక్తి కలిగిన వారిని ఎంపిక చేసి, ఈ హోదాల్లో నియమించాలి. చైర్ పర్సన్‌తో సహా అయిదుగురు అల్పసంఖ్యాక వర్గాల వారై ఉండాలి. పదవి స్వీకరించిన నాటినుంచి మూడేళ్ళ పాటు వీరు ఈ హోదాల్లో కొనసాగుతారు. ఎప్పుడైనా వారు రాజీనామా చేయవచ్చు. దుష్ప్రవర్తన, మతి స్థిమితం లేకపోవడం, దివాళా తీయడం, జైలు శిక్షకు గురికావడం, ఈ విషయంల్లో తన వాదం వినిపించేందుకు సమంజసమయిన అవకాశం వారికి లభించిన తర్వాత అవి రుజువైన పక్షంలో కేంద్రప్రభుత్వం వారిని తొలగించవచ్చు.

ఈ చట్టం కింద కమీషన్ తన విధులను సమర్థమంతంగా నిర్వహించడానికి సెక్రెటరినీ ఇతర అధికారులను ఉద్యోగులను నియమించవలసి ఉంటుంది. కేంద్రం కమీషన్‌కు కేటాయించిన నిధులనుంచి చైర్ పర్సన్, సభ్యులు, అధికారులు, ఇతర ఉద్యోగులకు జీత భత్యాలు ఇవ్వాలి.

కమీషన్ ఈ కింది విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

a) కేంద్రం, రాష్ట్రాల అధ్వర్యంలో అల్పసంఖ్యాక వర్గాల అభివృద్ధిని అంచనా వేయాలి.

b) రాజ్యాంగంలో, పార్లమెంట్‌లో, రాష్ట్ర శాసనభ్యులు చేసే శాసనాలలో నిర్ణయించిన ప్రత్యేక భద్రతల అమలును పర్యవేక్షించాలి.

c) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనారిటీల ప్రయోజనాల రక్షణకు రూపొందించిన నియమాలను పటిష్టంగా అమలు చేయించి తగిన సూచనలు చేయాలి.

d) మైనారిటీల హక్కులను, వారికి కల్పించిన ప్రత్యేక రక్షణ నియమాలను ఉల్లంఘించారన్న ఫిర్యాదులను విచారించి సంబంధిత అధికారులకు ఆ విషయాలు అప్పగించాలి.

e) మైనారిటీలు వివక్షకు గురయిన సందర్భాల్లో తలెత్తిన సమస్యలను వివరంగా అధ్యయనం చేసి ఆ వివక్ష తొలగించేందుకు తగిన సూచనలు చేయాలి.

f) మైనారిటీల సాంఘిక, ఆర్థిక, విద్యావసరమయిన అభివృద్ధికి సంబంధించిన అధ్యయనాలు, పరిశోధనలు విశ్లేషణలు నిర్వహించాలి.

h) కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు మైనారిటీల విషయమై తీసుకోవలసిన చర్యలు ఏమిటో సూచించాలి.

i) మైనారిటీలకు సంబంధించిన విషయాలపైనా, ముఖ్యంగా వారు ఎదుర్కొనే సమస్యలపైన ఈ నివేదికలను, ప్రత్యేక నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలి.

j) కేంద్ర పరిశీలనకు పంపే ఇతర వ్యవహారాలను చేపట్టాలి.

జాతీయ ఎస్.సి., ఎస్.టి కమీషన్‌కు ఉన్న విధంగానే సివిల్ కోర్టు కేసుల విచారణలో కలిగి ఉండే అన్ని అధికారాలు కమీషన్‌కు ఉంటాయి. ఎస్.సి., ఎస్.టి. కమీషన్ రిపోర్టులు పంపే విషయంలో అనుసరించే పద్ధతులు మైనారిటీల కమీషన్‌కూడా వర్తిస్తాయి.

10.3 వెనుకబడిన తరగతుల కమీషన్

వెనుకబడిన తరగతుల బాధలు తీర్చి, అభివృద్ధి చెందడానికి రాజ్యాంగంలో కొన్ని ప్రత్యేక నియమాలను పొందుపర్చారు. రాజ్యాంగం ఆర్టికల్ వెనుకబడిన తరగతుల పరిస్థితులను అధ్యయనం చేయడానిక ఒక కమీషన్‌ను నియమించాలని నిర్దేశిస్తున్నది. మన దేశంలో వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేయగల సమర్థులతో కమీషన్‌ను రాష్ట్రపతి ఏర్పాటు చేయాలి. రాష్ట్రపతి జారీచేసే ఉత్తర్వులో కమిషన్ అనుసరించాల్సిన ప్రక్రియ విధానాన్ని కూడా వివరించాలి.

BRAOU

దేశంలోని ఒక వర్గం ప్రజలు 'వెనుకబడి' ఉన్నారో లేదో కమీషన్ పరీక్షించి నిర్ణయించాలి. తర్వాత దేశంలో వెనకబడి ఉన్న వర్గాల జాబితాను రూపొందించాలి. జాబితాలో ఉన్న వర్గాల ఇబ్బందులను తొలగించి వారి జీవన పరిస్థితులను మెరుగు పరచేందుకు తగిన సిఫార్సులు చేయాలి. కేంద్రం, రాష్ట్రాలు ఇవ్వవలసిన గ్రాంట్స్ గురించి, గ్రాంట్స్‌తో పాటు విధించవలసిన షరతుల గురించి కమీషన్ సిఫార్సులు చేయాలి.

కమీషన్ పరిశీలనకు పంపిన వివిధ వ్యవహారాలను దర్యాప్తు చేసి, కనుగొన్న అంశాలను వివరిస్తూ రాష్ట్రపతికి నివేదిక ఇవ్వాలి. అందులో అవసరమయిన సిఫార్సులు ఇవ్వాలి. ఈ నివేదికలను, ఇందులో కూర్చొన్న సిఫార్సులపై తీసుకున్న చర్యలను వివరించే నివేదికతో సహా పార్లమెంట్‌లో ఉభయ సభలకు సమర్పించాలి.

10.4 ప్రత్యేక కమీషన్ల పనితీరు : ఒక సమీక్ష

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్, ట్రైబర్ సబ్‌ప్లాన్‌ల కింద ప్రయోజనాలు ఏ విధంగా అందుతున్నాయో ఎన్.సి., ఎన్.టి. కమీషన్ పర్యవేక్షిస్తూ ఉన్నది. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఇంటి వసతి అడవుల పెంపకం, భూమి అభివృద్ధి కార్యక్రమాలు అమలు తీరును ఏప్పటికప్పుడు సమీక్షిస్తున్నది. అస్పృశ్యత, షెడ్యూల్డ్ తెగల, కులాల వారిపై అత్యాచారాలు, నేరాలు, మొదలైన తీవ్ర అంశాలపైన ఫిర్యాదులను విచారిస్తున్నది. ఈ కేసులలో ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం, ఇతర చట్టాల ప్రకారం పరిష్కారాలు వెతికే మార్గాలు, బాధితులకు ఉపశమనం కలిగించడం వంటి కార్యక్రమాలు కూడా చేపడ్తున్నది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సర్వీసు ఉద్యోగాలలో రిజర్వేషన్లకు సంబంధించి సర్వేలు నిర్వహించి ప్రభుత్వాలకు రిపోర్టు చేసాయి. ఎన్.సి., ఎన్.టిల సంక్షేమం గురించి రాష్ట్ర ప్రభుత్వాలకు, ఇతర నోడల్ ఏజెన్సీలకు ప్రశ్నపత్రాలు పంపి సమాచారం సేకరిస్తుంది.

మైనారిటీ కమీషన్ 13 వార్షిక నివేదికలను ప్రభుత్వానికి సమర్పించింది. వాటిలో 10 ఉభయ సభలలో ప్రవేశ పెట్టారు. కమీషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం 1993లో కొన్ని నోటిఫికేషన్లు జారీ చేసింది. ముస్లింలు క్రైస్తవులు, సిఖ్ఖులు, బౌద్దులు, జొరస్ట్రియన్లను నోటిపై చేసాయి. నియామకాలు, విద్య, ఆర్థిక అభివృద్ధి, ప్రార్థనా స్థలాలు ఆస్తుల రక్షణ, మత కలహాలు వంటి మైనారిటీ సంబంధిత అంశాలను కమీషన్ నిరంతరం పరిశీలించవలసిన అవసరం ఉంది. ఈ దిశలో కమీషన్ ప్రశంసనీయమైన పని చేసింది. మైనారిటీ కమీషన్ సిఫార్సుల వల్ల అనేక ప్రయోజనకరమయిన మార్పులు జరిగాయి.

- ప్రభుత్వం కేంద్ర మైనారిటీ అభివృద్ధి ఫైనాన్స్ కార్పొరేషన్‌ను 500 కోట్ల రూపాయల పెట్టుబడి వాటా ఏర్పాటు చేసింది. ఇందువల్ల సంస్థాగతమయిన ఆర్థిక సాయం అందించే వీలు కలిగింది. సాంకేతిక వృత్తి రంగాలలో చేయూత నిల్చింది.
- మైనారిటీల జీవన ప్రమాణాలు పెంచేందుకు అప్పులు లభించాయి. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణ వితరణను పర్యవేక్షించే ప్రత్యేక విధానాన్ని రూపొందించింది. 1993 సంవత్సరంలో మొత్తం 346 లక్షల మందిలో 58 లక్షల మందికి ప్రయోజనం కలిగింది. అంటే 16.61 శాతం మందికి ఆర్థికసాయం అందింది. అన్ని జిల్లాల్లో మొత్తం 47,600 కోట్ల రూపాయల్లో రూ. 5,700 కోట్లు అంటే 11.99 శాతం అప్పు అన్ని జిల్లాల్లో రుణాలుగా ఇచ్చారు. కమీషన్ ఈ విధానాన్ని పర్యవేక్షిస్తున్నది. అప్పులు మంజూరు చేయడంలో ఆలస్యాలు వేధింపులను కమీషన్ విచారించి చర్యలు తీసుకుంటున్నది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రభుత్వరంగ పరిశ్రమలల్లో మైనారిటీల నియామకం శాతం పెరిగింది. సెలక్షన్ / ప్రమోషన్ కమిటీలో మైనారిటీ సభ్యుడికి స్థానం కల్పించారు.
- మెజారిటీ, మైనారిటీ మతాల మధ్య సయోధ్య సమన్వయం సాధించడానికి కమీషన్ కృషి చేసింది. ఇరుమతాల మధ్య అవగాహనకు అవకాశం కల్పించింది.

మొదట జాతీయ వెనుకబడిన వర్గాల కమీషన్ 1953లో కాకసాహెబ్ కాలేకర్ కమీషన్ కాల్‌కర్ అధ్యక్షతన ఏర్పడింది. 1955లో కమీషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కాని కమీషన్ వెనుకబడిన వర్గాలు ఎవరో

BRAOU

నిర్ణయించే పద్ధతి అస్పష్టంగా ఉండడంతో రాష్ట్రాలు ఆ సిఫార్సులను ఆచరణలో పెట్టలేక పోయాయి. కనుక అలా ప్రభుత్వాలు తయారు చేసిన జాబితాల ప్రకారమే సహాయం నిర్వహించే కృషి చేయాలని కమీషన్ అధికారం ఇచ్చింది.

ఆయా రాష్ట్రాలలో సాంఘికంగా ఆర్థికంగా వెనుకబడిన తరగతులను గుర్తించే ప్రాథమిక బాధ్యత రాష్ట్ర వెనుకబడిన వర్గాల కమీషన్‌లకు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్‌లో కమీషన్ 93 కులాలను వెనుబడిన తరగతులుగా గుర్తించింది. వీరిలో 53 కులాలు వృత్తి పనులలో ఉన్నారు. రజకులు, నాయీ బ్రాహ్మలు, వడ్డెర, మత్స్యకారులు, గొర్రెల పెంపకందారులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, మేదరి, కుమ్మరి, విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక సహాయాలు కల్పించారు. విద్య, ఆర్థిక అభివృద్ధికి స్కాలర్‌షిప్‌లు ఇచ్చారు. మెట్రిక్ తర్వాత స్కాలర్‌షిప్‌లలో మూడోవంతు మహిళలకు వచ్చారు. పరీక్ష ఫీజుల నుంచి మినహాయించారు. బి.సి.కి చెందిన చిన్నకారు, సన్నకారు రైతుల కోసం 10వేల సేద్యపు నీటి బోరు బావులు తవ్వారు.

వెనుకబడిన తరగతుల జాతీయ కమీషన్ ఈ అభివృద్ధి పనులను సమీక్షిస్తుంది. రాష్ట్ర బి.సి. కమీషన్లు బిసి సంక్షేమానికి అనుసరించవలసిన మార్గదర్శక సూత్రాలను జారీ చేస్తుంది.

అయితే అన్నీ జాతీయ కమీషన్లు చేసే సిఫార్సులకు సలహా విలువ మాత్రమే ఉంది. తమ సిఫార్సులను అమలు చేయించే శక్తి కమీషన్లకు లేదు. బడుగు వర్గాలు బాగుపడడానికి ప్రభుత్వాలకు సరైన సూచనలు చేయడం వరకే కమీషన్ల పని. ఈ కమీషన్లకు సొంతంగా దర్యాప్తు జరిపే యంత్రాంగం లేదు. వారు కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వాలపైన ఆధారపడవలసిందే. ఈ కమీషన్లకు, ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఇటువంటి పనులు నిర్వహించే విభాగాల అధికారాలకు, విధులకు మధ్య స్పష్టమైన విభజన లేదు. కమీషన్ చేసే విధులే ప్రభుత్వ శాఖలు కూడా నిర్వహించడం వల్ల రెంటికీ ఒకే విధమైన విధులు ఇచ్చిన సంస్థలు ఉన్నాయి.

రాష్ట్ర, కేంద్ర, కమీషన్ల మధ్య సమన్వయం లేదు. రాష్ట్ర, కమీషన్‌లు, బోర్డులు, జాతీయ కమీషన్ల మధ్య సయోధ్య ఉండాలి. వివిధ వర్గాల సంక్షేమం కోసం, వేగంగా అభివృద్ధి పథకాలు అమలు చేయడం కోసం కేంద్ర రాష్ట్ర కమీషన్లు ప్రణాళికలు రూపొందించాలి. రాష్ట్ర కమీషన్లకు కూడా చట్టపరమైన హోదా కల్పించాలి.

10.5 ముగింపు

ప్రజాస్వామ్యంలో శాసన, కార్య నిర్వాహక న్యాయ వ్యవస్థల వంటి ప్రధానమయిన అధికార కేంద్రాలు, అందరు ప్రజల హక్కులను రక్షించవలసి ఉంది. అయితే కొందరు అట్టడుగు వర్గాలు బలహీన వర్గాల వారికి ప్రత్యేక చర్యలు అవసరం. వారి హక్కుల రక్షణకు విభిన్న చర్యలు తీసుకోవాలి. అన్ని వర్గాలకు సమమయిన అభివృద్ధి, సాంఘిక న్యాయం కల్పించాలని రాజ్యాంగ లక్ష్యం. ఆ లక్ష్య సాధనకే ప్రభుత్వం అనేక కమీషన్లు ఏర్పాటు చేసింది.

ఈ ప్రత్యేక కమీషన్లు ప్రత్యేక అధ్యయనాలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు ఇచ్చి హక్కులను రక్షించడమే గాక, సాంఘిక న్యాయం కల్పించడానికి, సామాజిక అభివృద్ధి సాధించడానికి కృషి చేసాయి.

10.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

1. ప్రత్యేక కమీషన్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఏమిటి?
2. ప్రత్యేక కమీషన్లు తమ ధ్యేయం ఎంతవరకు నెరవేర్చగలిగాయి?

II. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి.

1) జాతీయ అల్ప సంఖ్యాక వర్గాల కమీషన్
2) వెనుకబడిన వర్గాల కమీషన్

BRAOU

ఖండం : V

హక్కుల పరిరక్షణ

ఏమనిషికైనా హక్కులు ఉండడం ఎంత ముఖ్యమో వాటిని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. హక్కుల పరిరక్షణ కోసం వ్యక్తులు, సంస్థలు, సంఘాలు ఇలా అనేక రూపాల్లో కృషి జరుగుతున్నది. హక్కుల కొసం సాగుతున్న పోరాటాల ఫలితంగా ఏర్పడిన సంస్థలు వ్యవస్థల విశ్లేషణ ఈ ఖండం ప్రధాన లక్ష్యం. ఈ ఖండంలో నాలుగు భాగాలున్నాయి. అవి :

- నిత్యజీవితంలో మానవ హక్కులు
- భారతదేశంలోపౌరహక్కుల ఉద్యమం
- నూతన సామాజిక ఉద్యమాలు
- జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC)

BRAOU

BRAOU

భాగం - 11 నిత్య జీవితంలో మానవహక్కులు

విషయక్రమం

11.0 ఉద్దేశం

11.1 పరిచయం

11.2 హక్కులకు భంగం కలిగించటం

11.3 అధికారం చలాయించే పద్ధతి

11.4 మానవహక్కుల పరిరక్షణ కోసం కృషి

11.5 ముగింపు

11.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

11.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తర్వాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసు కుంటారు.

- దైనందిన జీవితంలో ఇతరుల హక్కులకు భంగం కలిగించే పరిస్థితుల అవగాహన
- దైనందిన జీవితంలో కొరవడిన మానవహక్కులను
- మానవహక్కుల పరిరక్షణ కోసం జరగాల్సిన కృషి

11.1 పరిచయం

'దైనందిన జీవితంలో మానవ హక్కులు' అనే విషయానికి మూడు కోణాలు ఉన్నాయి.

1. మనదైనందిన జీవిత ప్రవర్తన వల్ల ఇతరుల హక్కులకు భంగం కలిగించడం.
2. మనం ఇతరుల హక్కులను శాసించే స్థితిలో ఉన్నప్పుడు ఆ అధికారం లేక పెత్తనం చలాయించే పద్ధతి.
3. మానవహక్కుల పరిరక్షణ కోసం మనం దైనందిన జీవితంలో చేసే కృషి. వీటిని అదే క్రమంలో చర్చించుకుందాం.

11.2 హక్కులకు భంగం కలిగించటం

క్యూలో నిలబడి ఒక టికెట్‌గానీ వేరే ఏదైనా వస్తువుగానీ కొనుగోలు చేసేచోట ఏదో ఒకరకంగా క్యూలో నిలబడే అవసరాన్ని తప్పించుకోవడం కోసం అడ్డదారులు వెతుక్కుంటాం. దీనివల్ల మనకంటే ముందునుండి కాచుకొన్నవాళ్లకు దొరకకుండా మనమే ఆ వస్తువును పొందవచ్చు. ఇది వాళ్ల హక్కుకు భంగకరమని తెలిసికూడ 'మనం చేయకపోతే ఇంకొకరు చేస్తారు' అనే వాదనతో మన ప్రవర్తనను సమర్థించుకుంటాము.

పదిమంది ఉమ్మడిగా ఉపయోగించుకునే వస్తువును ఉదాహరణకు లైబ్రరీపుస్తకం, పబ్లిక్ టెలిఫోన్, పరిమితంగా నీళ్లొచ్చే వీధికొళాయి, ఒక ప్రభుత్వ అధికారి సమయం, వగైరా ఆ పదిమందిలో ఒకరుగా మనవంతు వచ్చినప్పుడు అవసరం మేరకు వాడుకొని ఇతరులకు విడిచిపెట్టకుండ మన అవసరమే ప్రధానమైనట్టు వీలయినంత ఎక్కువగా వాడుకోవాలని చూస్తాం.

సామాజిక జీవితంలో మన వృత్తి లేక ఉద్యోగం సక్రమంగా నిర్వర్తించకోవడం వల్ల ఇతరులనేకులు తమ హక్కులు కోల్పోతారని గుర్తించకుండ వీలయినంత తక్కువ పనిచేసి ఎక్కువ ప్రతిఫలం పొందాలని చూస్తాం.

ఈ రకమైన ప్రవర్తన సమాజంలో తరచుగా ఎదురవుతుంది. ఇతరత్రా హక్కుల గురించి మాట్లాడే వాళ్ళు

BRAOU

సహితం తమ స్వంత ప్రయోజనాలకోసం పైరీతులలో ప్రవర్తించడం కద్దు.

'ఎదుటివాళ్ళు నీతో ఏవిధంగా ప్రవర్తించాలని నువ్వు కోరుకుంటావో నువ్వు ఎదుటివారితో ఆవిధంగా ప్రవర్తించు' అన్ననూక్తి ఎరుగుదుము. దీనిని నిర్దిష్టంగా హక్కులకు అన్వయించి, 'ఎదుటివారు నీ హక్కులను ఏరకంగా గౌరవించాలని ఆశిస్తావో ఆరకంగా వారి హక్కులను నువ్వు గౌరవించు' అని చెప్పుకోవచ్చు.

దీనిని ఇంగ్లీష్‌లో సివిక్‌సెన్స్ అంటారు. పౌరచైతన్యం లేక పౌరస్పృహ అని తెలుగులో అనవచ్చును. ఈ చైతన్యం, లేక స్పృహ సమాజంలో తగు మోతాదులో ఉండే బలహీనులు, మొహమాటస్తులు అడ్డదారులు తొక్కే అవకాశం లేనివారు నిత్యజీవితంలో తమ హక్కులు కోల్పోయే పరిస్థితి ఉంటుందనడంలో సందేహం అక్కరలేదు.

ఒక సూత్రాన్ని సత్యంగా గుర్తించిన వెంటనే అది ఏపరిధిలో సత్యమో నిర్ధారించి ఆపరిధి వెలుపల అది ఏవిధంగా సవరనకు గురికావలసి ఉంటుందో నిర్ణయించడం అవసరం.

దైనందిన జీవితంలో హక్కులు అనుభవించేటప్పుడు అందరితో సమానంగా వాటిని అనుభవించే నడవడిక హక్కుల చైతన్యంలో భాగం కావలసిందేగానీ అది అన్ని సందర్భాలలో అందరికీ సాధ్యం కాకపోవచ్చు. వారి అవసరాన్ని గుర్తించి ఇతరులు దారి ఇవ్వడం కూడ హక్కులను పెంపొందించే నడవడిలో భాగమే. అంగవైకల్యం ఉన్నవాళ్లు, వయసుమళ్లిన వాళ్లు, చంటిపిల్లలను ఎత్తుకున్న వాళ్లు, రైలు టికెట్ కోసం అందరితో సమానంగా లైన్‌లో నిలబడలేక పోవచ్చు. వారిని ముందు తీసుకొనిచ్చి తమహక్కును ఆమేరకు కోల్పోవడానికి ఇతరులు సిద్ధపడటం కూడ పౌరజీవితానికి అవసరమైన స్పృహే.

ఈ స్పృహకు సమాజంలో నైతిక విలువ ఉందని గుర్తించి దానికి అనర్హులమైనా మన ప్రయోజనాలకోసం వాడుకోవాలని చూడకుండ ఉండడమూ అవసరమే.

నీళ్లు పరిమితంగా వచ్చే వీధి కొళాయివద్ద ఇంటికి బంధువులొస్తున్నవారు రెండు బిందెలు ఎక్కువ తీసుకోవడాన్ని ఇతరులు అర్థంచేసుకొని అనుమతించడం ఎంత అవసరమో, రాని బంధువులను చూపించి రెండు బిందెలు ఎక్కువ తీసుకుపోయే దురాలోచనకు ఇవ్వరూ లోనుకాకుండ ఉండటమూ అంతే అవసరం.

వీధికొళాయిని ఉదాహరణగా తీసుకుంటే బహుశా ఎక్కువ మందికి ఇబ్బంది కలగక పోవచ్చునుగానీ ఇతర జీవితరంగాలకూ సందర్భాలకూ కూడ దీనిని వర్తింప చేసుకున్నట్టయితే మనమందరమూ చాలా తరచుగా ఈరకమైన దుష్ప్రవర్తనకు లోనవుతుంటామని సులభంగానే గుర్తించవచ్చు.

ఎదుటివాడు మన హక్కులను ఏవిధంగా గౌరవించాలని చూస్తామో మనం ఎదుటివారి మక్కులను ఆవిధంగానే గౌరవించాలనే సూత్రం వెనుక అందరి పరిస్థితి ఒకటేనన్న భావనవుంది. నూటికి నూరుశాతం ఒకటేకాకున్నా, మొత్తం మీద పరిస్థితులలో సామ్యం ఉన్నమేరకు ఈ సూత్రాన్ని అందరూ పాటించడం హక్కులకు సంబంధించిన సామాజిక స్పృహలో భాగమే.

పరిస్థితులు అందరికీ ఒకటే కాకపోవడానికి అంగవైకల్యం, ముసలితనంవంటి భౌతిక కారణాలేకాక సామాజిక ఆర్థిక కారణాలు కూడ ఉంటాయి. ఉదాహరణకు 'చంటిపిల్లలను ఎత్తుకొని ఉండడం' అనేది భౌతిక కారణంగా కనిపించవచ్చును. కానీ ఎక్కువగా స్త్రీలే ఎత్తుకొని ఉంటారు. కాబట్టి ఇది భౌతిక కారణంగా కనిపించే సామాజిక కారణం.

వేరే ఉదాహరణలు చూడవచ్చు. పారిశ్రామిక, విలువలలో సమ్మెచేసే హక్కును, లాకౌట్ ప్రకటించే హక్కునూ చట్టం దాదాపు ఒకటిగా చూస్తుంది. రెండింటికీ ఒకేరకమైన అవకాశాన్ని ఇస్తుంది. ఒకేరకమైన పరిమితులు పెడుతుంది. కార్మికులు తమ అవసరాల సాధనకోసం ఒత్తిడి పెట్టడానికి పనిచేయడం మానుకోవడం సమ్మె. యాజమాన్యం తన ప్రయోజనాల రక్షణకోసం ఒత్తిడి పెట్టడానికి పని ఇవ్వడం మానుకోవడం లాకౌట్. చట్టం ఈరెండింటినీ ఒకే రకంగా చూస్తుంది.

అంతమాత్రం చేత, సమ్మెచేయడానికి తమకుండే హక్కును యాజమాన్యం గౌరవించాలని తాము కోరుకున్నట్టే లాకౌట్ చేయడానికి యాజమాన్యానికి ఉండే హక్కును కూడ కార్మికులు గౌరవించాలనడం అసమంజసం. సమ్మెవల్ల

BRAOU

యజమానులకు నష్టాలు వచ్చేమాటవాస్తవమేగానీ వారిజీవనం దెబ్బతినదు. లాకౌట్ కార్మికుల జీవనాన్నే దెబ్బతీస్తుంది.

ఈరకమైన ఉదాహరణలు ఇతర జీవితరంగాల లోనూ చూడవచ్చును. 'ఇతరులు మన హక్కులను గౌరవించాలని కాంక్షించినట్టు మనం వారి హక్కులను గౌరవించాలి' అనే సాధారణ సూత్రానికి సామాజిక ఆర్థిక అసమానతల పరిధిని నిర్ణయిస్తాయి.

మరయితే అసమానతలు ఉన్నచోట ఎదుటివారి హక్కులను అసలే గుర్తించనక్కరలేదని అనుకోవాలా? ఇది మానవ హక్కుల అవగాహనకు సంబంధించిన ఒక క్లిష్టమైన ప్రశ్న. ఈ ప్రశ్నను చర్చించడానికిది సందర్భం కాదుకానీ ఇటువంటి ప్రశ్న ఒకటి ఉందనీ హక్కుల రంగంలో జరిగే సంవాదంలో దీనిగురించి చాలా చర్చ జరిగిందనీ తెలుసుకోవడం అవసరం ఈ ప్రశ్నకు పూర్తిగా అవుననిగానీ పూర్తిగా కాదని గానీ జవాబు ఇవ్వలేమని ప్రస్తుతానికి చెప్పుకుంటే సరిపోతుంది.

అయితే సామాజిక ఆర్థిక రంగాలలో మనం ఆధిక్యతాస్థానంలో గనక ఉంటే, మనదైనందిన జీవిత ఆచరణను మానవ హక్కుల స్ఫూర్తితో ఏవిధంగా మలచుకోవాలన్న విషయాన్ని చర్చించడం మాత్రం ప్రస్తుత పాఠ్యాంశానికి అవసరం. ఇదిపైన చెప్పిన మూడు కోణాలలో రెండవది-

11.3 హక్కులను శాసించే స్థితిలో అధికారం చలాయించే పద్ధతి

ఆధిపత్యం, పెత్తనం అనేవి ఎక్కడో సమాజంపై భాగంలో మాత్రమే ఉండవు. అన్ని స్థాయిలలోనూ ఉంటాయి. మనమందరమూ ఏదో ఒక స్థాయిలో అధికారాన్నీ పెత్తనాన్నీ అనుభవిస్తుంటాము. మగవాళ్ళయి పుట్టినవాళ్లు తమకుటుంబాలలోనూ బయట ఉండే స్త్రీలపైన, అగ్రకులాలలో పుట్టిన వాళ్ళు తమ గ్రామంలోనే కాక మొత్తంగా సమాజంలోఉన్న దళిత బహుజన కులాల మీద, పట్టణాలలో నివసించేవాళ్లు పల్లెప్రజల మీద, అభివృద్ధి చెందిన ప్రాంతాలలో బతికేవాళ్లు అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాల మీద. ఆధిక్యత చలాయిస్తుంటారు. ఇతరులను కార్మికులుగానూ, ఉద్యోగులుగానో నియమించి వారిచేత పనిచేయించుకొని ఆ ఉత్పత్తిని వ్యాపారం చేసేవారు ఆసిబ్బంది పైన పెత్తనం చేస్తుంటారు.

మనం ఉద్యోగస్తులమయితే, చేసే ఉద్యోగాన్ని బట్టి ఏదో ఒకరకమైన ఆధిక్యత అనుభవిస్తుంటాము. పోలీసు ఉద్యోగమైతే ప్రజలమీద చాలాపెత్తనం అనుభవిస్తాము. కానీ ఏ ప్రభుత్వ ఉద్యోగమూ ఇందుకు పూర్తిగా మినహాయింపు కాదు. అధ్యాపకులు పిల్లలమీద, విద్యుత్ శాఖ ఉద్యోగులు రైతుల మీద, సివిల్ సప్లైస్ ఉద్యోగాలు రేషన్ కార్డులకోసం వచ్చే పేదల మీద, ప్రభుత్వ డాక్టర్లు ఆస్పత్రికొచ్చే రోగుల మీద పెత్తనం, ఆధిపత్యం లేక అధికారం కలిగి ఉంటారు.

ఈవివిధ రూపాల ఆధిక్యత చలాయించడంలో మానవ హక్కుల స్పృహ ఏమేరకు సమాజంలో నెలకొని ఉందనే విషయంపైన దైనందిన జీవితంలో మానవహక్కుల సమస్యల తీవ్రత ఆధారపడి ఉంటుంది. ఆధిక్యతనూ పెత్తనాన్నీ ప్రయత్నపూర్వకంగా తగ్గించుకోవడం, అధిపత్యానికి గురయ్యేవారి ఆకాంక్షలను గౌరవించడం, అధికారం చలాయించేటప్పుడు నియమబద్ధంగా, ప్రజాస్వామికంగా వ్యవహరించడం, ఈవిషయంలో మానవ హక్కుల స్పృహకు ప్రమాణాలు.ఈ ఆధిపత్యాలన్నీ పూర్తిగా పోవాలని సూత్రప్రాయంగా విశ్వసించేవారు సహితం తమ దైనందిన జీవితంలో వీటిని తగ్గించడానికి ప్రయత్నించక పోవడం తరచుగా జరుగుతుంటుంది. దైనందిన జీవితంలో మానవ హక్కులు అనేవిషయానికి ఈవైరుద్యం కూడా ఒకకోణమే.

మనమొక ప్రాజెక్టునిర్మాణం వల్ల ప్రయోజనం పొందే స్థితిలో ఉన్నామనుకోండి. ఆ ప్రాజెక్టువల్ల మనపాలాలకువచ్చే నీటిని దృష్టిలో ఉంచుకొని దానికోసం ఆందోళన చేస్తాం అయితే ఆ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేట్టయితే మనకంటె ఇంకా నికృష్టంగా బతుకుతున్న బడుగు ప్రజల ఆవాసాలు, పొలాలు ముంపుకు గురి అయ్యే ప్రమాదముందనుకుందాం. ఆ ముంపును కనీస పరిమాణానికి తగ్గించాలంటే ప్రాజెక్టు ఎత్తు తగ్గించవలసి ఉంటుందనుకుందాం. లేదా ఒకపెద్ద ప్రాజెక్టు స్థానంలో మూడునాలుగు చిన్న ప్రాజెక్టులు కట్టే ప్రత్యామ్నాయాన్ని అమలు చేయవలసి ఉంటుందనుకుందాం.

BRAOU

మనకంటె వెనుకబడి వున్న ఆప్రజల యోగక్షేమాలను దృష్టిలో ఉంచుకొని ఆప్రత్యామ్నాయంవల్ల మన ప్రయోజనం కొంత దెబ్బతిన్నప్పటికీ దానిని ఆయోదించగలిగి నట్టయితే అభివృద్ధి విషయంలో మనం మానవ హక్కుల స్పృహతో వ్యవహరించినట్టవుతుంది.

నదీజలాల ప్రాజెక్టుల విషయంలో ఈ సమస్యదాదాపు అనివార్యంగా తలెత్తుతుంది. ప్రాజెక్టులుకట్టేది సాధారణంగా నదిపై భాగాన ఉన్న అడవులు, కొండల ప్రాంతాలలో, ప్రాజెక్టువల్ల నీళ్లు పొందేది. సాధారణంగా దిగువన ఉన్న మైదాన ప్రాంతాలు. అక్కడిప్రజలు, అడవివాసులకంటె ఎక్కువ రాజకీయప్రాబల్యం కలిగే ఉంటారు. ఎక్కువ సాంఘిక ఆర్థిక అభివృద్ధి కలిగి ఉంటారు. అందువల్లనే రాజకీయంగా ఆందోళనచేసి, ఒత్తిడిపెట్టి ప్రాజెక్టుమంజూరు చేయించుకోగలుగుతారు. చాలా కాలంపాటు ఈ విషయంలో వారి హక్కులే తప్ప ఇతరుల హక్కుల సమస్య ఇమిడి ఉందన్న ఆలోచన ఎవరికీలేదు. ఈమధ్యకాలంలో ముంపు ప్రాంత ప్రజలు ఆందోలన చేయడం మొదలుపెట్టిన తరువాతే ఇక్కడ లబ్ధిదారుల ప్రయోజనాలకూ ముంపుప్రాంతాల ప్రజల కష్టాలకూ మధ్యనొక వైరుధ్యం ఉందని అర్థమయింది. మనం ప్రాజుక్టుల వల్ల ప్రయెజనం పొందే లబ్ధిదారుల మయినట్టయితే ఈ విషయంలో ముంపు ప్రాంతాల వారి ప్రయోజనాలకు కూడ మన ప్రయోజనాలతో పాలు సమాన ప్రాముఖ్యం ఇచ్చే మానవహక్కుల స్పృహ మనం పొందడం ఈవైరుధ్యం పరిష్కారానికి చాలా అవసరం.

పట్టణాలలో నివసించే ధనిక, మధ్యతరగతి ప్రజలు తమవాహనాలు వేగంగా కదలడానికి విశాలమైన రోడ్లు, ఫ్లైఓవర్లు కావాలని కోరుకుంటారు. వారి రాజకీయ ప్రాబల్యం వల్ల, వారి ఆర్థిక అవసరాలకు పెట్టుబడిదారీ మార్కెట్‌లో లభించే స్పందన వల్ల, వారికోరిక సాధించుకోగలుగుతారు. కానీవారికి అత్యవసరంగానూ అనివర్యంగానూ కనిపించే ఈ 'అభివృద్ధి' సైకిళ్లపైన కాలినడకన ప్రయాణం చేయకతప్పని పేదల అసౌకర్యాన్ని బాగా పెంచుతుంది. మనదేశంలో వేగంగా పెరుగుతున్న ఏనగరాన్ని చూసినా ఈవిషయం అర్థం అవుతుంది. మనం ధనిక, మధ్యతరగతి పట్టణవాసులమైతే, మన ప్రయోజనాలకూ పేదల అవసరాలకూ మధ్యతరగతి పట్టణవాసులమైతే, మన ప్రయోజనాలకూ పేదల అవసరాలకూ మధ్యనున్న ఈ వైరుధ్యాన్ని లెక్కలోకి తీసుకునే విధంగా పట్టణ అభివృద్ధిని గురించి ఆలోచించే మానవహక్కుల స్పృహ మనం అలవరచుకోకపోతే ఈవికృతమైన నగరాభివృద్ధి సాగుతూనే ఉంటుంది.

విద్యుత్తు, సాగునీటివంటి అవసరాల విషయంలో పట్టణప్రాంత ప్రయోజనాలకిచ్చే ప్రాముఖ్యం పల్లెలకు చాలానష్టం చేసింది, చేస్తున్నది. మనం పట్టణవాసులమయినట్టయితే పట్టణాభివృద్ధి మనకెంత అవసరమనిపించినా పల్లెల సమాన అభివృద్ధిని కాంక్షించే మానవ హక్కుల స్పృహతో దానిని కొంతవదులుకొని పల్లెలకు వనరులు మరింత ఎక్కువగా ఇవ్వాలనే ఆకాంక్షతో గొంతు కలపపలసి ఉంటుంది.

మన దృష్టికి చాలా న్యాయంగా తోచే ప్రయోజనాలకూ మానవ హక్కుల దృష్టికీ మధ్య నుండగల వైవిధ్యాన్ని ఈ మధ్యకాలంలో విద్యా ఉద్యోగం రాజకీయ రంగాల రిజర్వేషన్ల చర్చబలీయంగా బయటపెట్టింది. మనం మగవాళ్లమయితే స్త్రీల సమాన ప్రతిపత్తికి దోహదపడే రిజర్వేషన్లను వ్యతిరేకించడానికి ఏవో సాకులు వెతుకుతాం. మనం అగ్రకులాలకు చెందిన వారమయితే ఎస్.సి,ఎస్.టి, బిసి కులాలకు కల్పించిన రిజర్వేషన్లను కుదించి వేయడానికి, తగ్గించివేయడానికి, అమలు కాకుండ చూడడానికి అనేక ప్రయత్నాలుచేస్తాం. మనం ఏజెన్సీలోగానీ ఏజెన్సీప్రాంతానికి సమీపంలోగానీ నివసించే ఆదివాసీయేతరులమయితే ఆదివాసీలకు ఏజెన్సీలో ప్రత్యేక హక్కులు కల్పించే చట్టాలను నీరుగార్చడానికి మన రాజకీయ ప్రాబల్యమంతా ఉపయోగించి వృషిచేస్తాం.

మన నిత్యజీవిత ప్రయోజనాల కోసం, అవసరాలకోసం మనకందరికీ శాంతిభద్రతల సంరక్షణ కావాలి. కానీ తమ మనుగడకోసమే శాంతిభద్రతలకు భంగం కలిగించకతప్పని పరిస్థితి సమాజంలో ఎవరోఒకరికి ఎప్పుడూ ఉంటుంది. ఆది మామూలు నేరకాండరూపంలో ఉండవచ్చును, రాజకీయపోరాటం రూపంలో ఉండవచ్చును, ఈరెండురకాల మనుషుల మధ్య నుండేది ఆధిపత్య సంబంధమే కానక్కరలేదు. అయినప్పటికీ ఈ రెండు ప్రయోజనాల మధ్య వైరుధ్యం ఉంది. అశాంతిపట్ల, అభద్రతపట్ల, వాటికి కారకులయినవారిపట్ల ఒక మానవహక్కుల స్పృహకలిగి ఉండడం

BRAOU

దైనందిన జీవితంలో మానవహక్కుకు సంబంధించిన ఒక ముఖ్య అంశం.

దొంగతనం వంటినేరాలతో ముద్దాయిలయిన వారి హక్కుల గురించి మాట్లాడితే 'మీ యింట్లో దొంగతనం జరిగినప్పుడు మీరిట్లాగే మాట్లాడుతారేమో చూద్దాం' అని ఎద్దేవాచేసే పోలీస్ అధికారులు ఉన్నారు. దైనందిన జీవిత విషయాలలో మానవహక్కుల స్పృహలోపించడాన్ని తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నమే ఈ వెక్కిరింత.

మనఇంట్లో దొంగతనం జరిగినప్పుడు పోలీసులు అనుమానితులను కొట్టి, తన్ని దొంగిలించిన వస్తువులను వెనక్కి ఇప్పించాలని మనం కోరుకున్నట్టయితే నేరస్మృతిలో మానవహక్కుల గురించి సూత్రప్రాయంగా ఎన్ని మాటలు మాట్లాడినా ప్రయోజనం లేనట్టే - ఈదైనందిన మానవహక్కుల స్పృహ ఏమేరకు మనలో లోపిస్తుందో ఆమేరకు పోలీసు వ్యవస్థ మానవ హక్కుల అతిక్రమణ యదేచ్ఛగా కొనసాగించగలుగుతుంది.

ఉద్యోగం రీత్యా ఇతురుల పైన పెత్తనం లేక అధికారం చలాయించే స్థితిలో ఉండేవాళ్ల దైనందిన ప్రవర్తనలో మానవహక్కుల స్పృహ ఉండడం సమాజంలో మానవహక్కులు కొంతమేరకయినా బాగుండడానికి చాలా అవసరం.

మనం ప్రభుత్వ ఉద్యోగులమైతే ప్రజలను ఈసడించుకుంటూ ఒక 'న్యూసెన్స్' గా భావిస్తున్నామా? మనం ఆధ్యాపకులమైతే పిల్లల వక్తిత్వాన్ని స్వేచ్ఛనూ గౌరవించలేకుండ వున్నామా? మనం ఆఫీసర్లమైతే మనకింది ఉద్యోగులతో సగౌరవంగా వ్యవహరించ లేకుండ వున్నామా?

బహుశా అన్నిటికంటె ముఖ్యంగా మనంచేసే ఉద్యోగానికి వర్తించే చట్టాలనూ నియమాలనూ గౌరవించలేకుండ ఉన్నామా? వాటినొక అవరోధంగా భావిస్తున్నామా?

ఇవి మన సమాజంలో తరచుగా దర్శనమిచ్చే అవలక్షణాలు. దైనందిన జీవంతో మానవహక్కుల స్పృహలేమిని ఇవి సూచిస్తాయి.

11.4 మానవహక్కుల పరిరక్షణ కోసం కృషి.

మనదైనందిన జీవితంలో మానవహక్కుల స్పృహతో ప్రవర్తించడమే కాక మొత్తంగా సమాజంలో మానవ హక్కుల పురోభివృద్ధికోసం దైనందిన కృషిచేయడం కూడ చాలా అవసరం. ఎందుకంటే మనపాటికి మనం వీలయినంతగా మానవహక్కుల స్ఫూర్తితో ప్రవర్తించడం నైతికంగానే కాక సామాజికంగా కూడ చాలా అవసరమయినప్పటికీ దానివల్ల మొత్తంగా సమాజంలో మానవహక్కుల పరిస్థితిలో మార్పు వచ్చేయదు. ఆమార్పుకు మార్గాలను అన్వేషించి ఆవిధంగా దైనందిన కృషి చేయడం చాలా అవసరం. ఈ మార్పుకోసం ఎవరో 'ఉద్యమకారులు' లేక 'పోరాటకారులు'కృషి చేస్తారనీ మిగిలిన వాళ్లము ప్రేక్షకులు గానో లేక వారు సాధించిపెట్టే హక్కుల గ్రహీతలు గానో ఉంటామనీ అనుకోవడం పొరపాటు. మనమందరం మానవులం, అందరమూ మానవహక్కుల సాధనకు సంబంధించిన కృషిలోదైనందిన జీవితంలో భాగం కావాలి.

కొన్ని మార్పులు చట్టాలకు సంబంధించినవి ఈరోజు చట్టంలోలేని ఒక హక్కును కల్పించడానికి ఒక కొత్త చట్టంగానీ ఇప్పటికే ఉన్న ఒక చట్టానికి సవరణగానీ అవసరం అవుతుంది. అప్పుడు చట్టాలు చేసే చట్టసభలకు ఈ సంకల్పం కలిగించడం కోసం మనం కృషి చేయవలసి ఉంటుంది. చట్టసభలలో స్థానాలకోసం పోటీపడేది రాజకీయపార్టీలు కాబట్టి రాజకీయ పార్టీలకు ఈ సంకల్పం కలిగించడం కోసం కృషి చేయవలసి ఉంటుంది.

ఇప్పటివరకుచరిత్ర చెప్పేదేమిటంటే ఏ హక్కయినా ఉనికిలోకి రావాలంటే అది ఏప్రజలకు అవసరమో వారు సంఘటితపడి దానికోసం కృషి చేయాలి. ఆసంఘటన రూపొందడానికి, నిలబడడానికి, విజయవంతం కావడానికి జరగవలసిన కృషిచాలా ఉంటుంది. ఈవిధంగా సంఘటిత పడి తమ అవసరాన్ని ఒక హక్కుగా డిమాండ్ చేయడం ఆప్రజలు అలవరచుకున్న తరువాత ఆడిమాండ్‌కు రాజకీయపార్టీలూ చట్టసభలూ స్పందించేటట్టూ చేయడం దానికి అనుబంధంగా జరగవలిసిప కృషి.

BRAOU

హక్కు అవసరమైన ప్రజలు దానికోసం సంఘటితంగా డిమాండ్ చేయడం ఎంత ముఖ్యమో, తక్కిన సమాజం వారికోరికను ఆమోదించడం అంతే ముఖ్యం. వారు ఆహక్కును పొందడం వల్ల కొంతపెత్తనం, ఆధిక్యత కోల్పోయే వారుంటారు. వీరేకాక తాము ఏ పెత్తనమూ కోల్పోకపోయినా కొత్తను ఆహ్వానించడానికి సులభంగా సిద్ధపడని వారు ఉంటారు. అంతేకాకుండా 'ఈరోజు వీళ్లని అడిగితే రేపు ఇంకా ఎవరెవరు ఏమేం అడుగుతారో' అని వెనకాడేవారుంటారు.

హక్కులు అవసరమైన ప్రజలను సంఘటిత పరచడంలో ప్రతి ఒక్కరికీ పాత్ర ఉండకపోవచ్చునుగానీ సమజంలోని ఈ ప్రతిఘటనను అధిగమించడంలో ప్రతీ ఒక్కరికీ పాత్ర ఉంటుంది. కొత్తను ఆహ్వానించడానికి సమాజాన్ని మానసికంగా తయారు చేసేపాత్ర. ఇది ఎక్కువగా చర్చద్వారా. సంవాదం ద్వారా సాధ్యం కావాలి. మనం ఇప్పటికీ దీనికి కావలసిన అవకాశాలు పొందిన వారమయితే ఆ అవకాశాన్ని ఇందుకోసం ఉపయోగించడం మనం చేయగలమేలు వేరే ఉండదు.

అయితే చట్టంలో కొత్త హక్కులకు గుర్తింపు కల్పించడమేకాక ఇప్పటికీ గుర్తింపుపొందిన వాటిని అమలు చేయించడం కూడ ఒక మానవహక్కుల కృషే.

ఒక్కోసారి ఒకతరంలో సమాజంలో ఆమోదం పొందినచట్టాల రూపం తీసుకున్న హక్కుల విషయంలో తరువాతి తరంలో వ్యతిరేకత, నిరసన తలెత్తుతాయి. అప్పటికి ఆహక్కుచట్టంలో లేక రాజ్యాంగంలో ఆమోదం పొంది ఉంటుంది. కానీ అమలు కావడం కష్టమయిపోతుంది అప్పుడు వానికి అనుకూలమైన సామాజిక ఆమోదాన్ని సజీవంగా ఉంచడం, తిరోగమనాన్ని ప్రతిఘటించడం అవసరం అవుతుంది.

ప్రపంచంలో చాలా దేశాలలో మతసామరస్యం, లౌకికవాదం, మైనారిటీల హక్కులు మొదలైన విషయాలకు ఈగతేపడుతున్న దాఖలాలు ఉన్నాయి. ఒకతరంలో హక్కులుగా గుర్తింపు పొంది రాజ్యాంగ చట్టంలో భాగమైన ఈవిషయాల పట్ల వ్యతిరేకత చాలాదేశాలలో బలపడింది. అదేశాలలో రాజ్యాంగంలోనూ చట్టాలలోనూ ఈ అంశాలు ఏమార్పూలేకుండ కొనసాగుతున్నప్పటికీ నిత్యజీవితంలో అవి కరువయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో మానవ హక్కుల స్పృహ గలవాళ్లు నిర్వహించవలసిన కర్తవ్యం స్పష్టమే. మత సామరస్యాన్నీ లౌకికవాదాన్నీ మైనారిటీల హక్కులపట్ల గౌరవాన్నీ సజీవంగా ఉంచడం కోసం అన్ని సామాజిక జీవితరంగాలలోనూ కృషిచేయవలసి ఉంటుంది.

ఒక్కొక్కసారి సామాజిక ఆలోచనారీతులలో పెద్దగా మార్పురాకముందే చట్టాలు వచ్చేస్తాయి. దానికి కారణమేదైనా, అచట్టాలు కల్పించే హక్కులకు అనుకూలమైన అలోచనారీతిని సమాజంలో పెంపొందించుకోకపోతే ఆచట్టాలు నిరర్థకంగా ఉండిపోతాయి. ఇదిదైనందిన జీవితంలో విస్తృతంగా జరగవలసిన కృషి.

మనదేశంలో అంటరానితనాన్ని నిషేదించే చట్టాలు వచ్చేనాటికి అంటరానితనం తప్పన్న బలమైనప్రజాభిప్రాయమేదీ లేదు. ఒక చారిత్రక క్రమంలో అచట్టాలు వచ్చేసాయే తప్పప్రజలలో ఏకాభిప్రాయం ఉండడం వల్ల కాదు. అందువల్లనే అవి గట్టిగా అమలు కాకుండ ఉండిపోయాయి. కాబట్టి ఆచట్టాలకు అనుగుణ్యమైన సామాజిక చైతన్యాన్ని పెంపొందించే కృషి కొనసాగుతూనే ఉంది. కాబట్టి ఇందులో మానవ హక్కుల పురోగమనాన్ని కాంక్షించే వారందరూ నిత్యం భాగం కావలసి ఉంటుంది.

కుటుంబంలోపల స్త్రీలు అనుభవించే హింసను నేరుగా గుర్తించే చట్టాలు కూడా అంతే. భర్త భార్యను కొట్టినా మానసికంగా హింసించినా అది నేరమని చెప్పే సవరణ నేరస్మృతిలో 1983లో వచ్చింది. కానీ సామాజిక ఆలోచనా రీతులలో ఆసవరణ ఇంకా రాలేదు. అదిరానిదే స్త్రీలు పొందిన ఈ హక్కునిజంగా వారికి దక్కదు. ఇదిప్రతీ కుటుంబంలోనూ ఉండే సమస్యేకాబట్టి ఈహక్కుకు అనుకూలమైన ఆలోచనారీతులను పెంపొందించే కృషినిస్సందేహంగా దైనందిన కృషే.

అయితే మానవహక్కుల కృషిలో చట్టాల రూపకల్పన, వాటి అమలు అనేవేకాక చట్టాలతో సంబందంలేని సామాజిక, సాంస్కృతిక, దార్శనిక కృషిచాలా ఉంటుంది. ఇది చర్చ, సంవాదం, ప్రచారాలరూపంలో జరిగే కృషి కాబట్టి ఇది దైనందిన జీవితంలో భాగం కాక తప్పదు. అంటరానితనాన్ని గురించి కుటుంబ హింప గురించి పైన ఇచ్చిన ఉదాహరణలలో కూడ నిజానికి చట్టానికి ఉండే పాత్ర స్వల్పమే. ఇక్కడ ప్రధానంగా సామాజికప్రవర్తనా

BRAOU

రీతులలో, సంస్కృతిలో, ఆచారాలలో. మార్పురావాలి.

11.5 ముగింపు

ఈరోజు ఒక ముఖ్య సంవాదంగా ముందుకొస్తున్న ఒక ఉదాహరణ చూసి ఈ పాఠాన్ని ముగిద్దాం. ఇది 'అభివృద్ధి' నమూనాకు సంబంధించినది. దేశ కాలాలతో సంబంధంలేని ఏకైక అభివృద్ధి నమూనా ఉందంటూ దానిని ప్రపంచంలోని అన్ని దేశాలపైన రుద్దే ప్రయత్నమొకటి ఇప్పుడు జరుగుతున్నది. ఈ నమూనా నిజానికి ఏదేశానికైనా చాలా హాని చేయగలదు.

అభివృద్ధిని మానవ హక్కుల కోణం నుండి చూసినప్పుడు, లేమినీ వెనుకబాటుతనాన్నీ అణచి వేతనూ నిర్దిష్టంగా గుర్తించి వాటిని తొలగించే లక్ష్యాన్ని కేంద్రం చేసుకుని ఆచట్రంలోపల ఆర్థిక పెరుగుదలను అర్థంచేసుకునే నమూనా సరయినది. దీనివల్ల విపరీతమైన పెరుగుదల రేటు లభించకపోవచ్చును. కానీ కొంతయినా సమత, సమతుల్యం ఉంటాయి. అందుకు భిన్నంగా సమత, సమతుల్యం వంటి లక్ష్యాలతో ఏమీ సంబంధంలేని వేగవంతమైన పెరుగుదలనూ అధునీకరణనూ లక్ష్యంగా పెట్టుకున్న అభివృద్ధి నమూనాను అన్ని ప్రపంచదేశాలపైన రుద్దడం, ఈదేశాల పాలకులు స్వీకరించడం జరుగుతున్నది.

ఈ నమూనాలో కొంత ఆకర్షణ లేకపోలేదు ఉంది. ఆ ఆకర్షణను ఎదుర్కొని సమతనూ మానవహక్కులనూ నిలబెట్టే కృషి ఈనాటి ముఖ్యమైన మానవహక్కుల కర్తవ్యాలలో ఒకటి. ఆ ఆకర్షణ మనచుట్టూ ఉంది. మనందరి మెదళ్లపైనా ప్రభావం వేస్తుంది. కాబట్టి ఇదొక నిత్యజీవిత కృషి. కొంత మందికి తళుకు బెళుకుల కొత్తదనం కల్పిస్తూ అధికభాగం ప్రజలకు అస్థిరత, పేదరికం పంచిపెట్టే అభివృద్ధి నమూనా మానవహక్కులకు శత్రువని సమాజం చేత ఒప్పించే కృషి ఎక్కడో ఎవరో చేపట్టే రాజకీయ పోరాటం మాత్రమేకాదు. దాని దుష్పలితాలను అను నిత్యం ఎదుర్కొంటూ ఎండగడుతూ ముందుకు సాగాలి.

11.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈక్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.

1. దైనందిన జీవితంలోని మానవహక్కులపై ఒక వ్యాసం రాయండి!
2. హక్కులను శాసించే స్థితిలో అధికారం చెలాయించే పద్ధతిని వివరించండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి.

1. దైనందిన జీవితంలో పౌరహక్కులకు భంగం కలిగించే పరిస్థితులు చర్చించండి.
2. మానవ హక్కుల పరిరక్షణకోసం దైనందిన జీవితంలో చేసే కృషిని వివరించండి.

BRAOU

భాగం : 12 భారతదేశంలో పౌరహక్కుల ఉద్యమం

విషయ క్రమం :

12.0 ఉద్దేశం

12.1 పరిచయం

12.2 పౌరహక్కుల ఉద్యమ మౌలిక స్వభావం

12.3 స్వాంత్ర్యానికి పూర్వం పౌరహక్కుల ఉద్యమాలు

12.4 స్వాతంత్ర్యానంతరం వచ్చిన పౌరహక్కుల ఉద్యమాలు

12.5 పౌరహక్కుల ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళు

12.6 ముగింపు

12.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

12.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు :

- భారతదేశంలోని పౌరహక్కుల ఉద్యమ మౌలిక స్వభావం
- స్వాతంత్ర్యానంతరం వచ్చిన పౌరహక్కుల ఉద్యమాలు
- పౌరహక్కుల ఉద్యమాలు ఎదుర్కొంటున్న సవాళ్ళు

BRAOU

12.1 పరిచయం

భారతదేశంలో పౌరహక్కులు, వలస రాజ్య నిరంకుశత్వాన్ని రూపుమాపడానికి ఉనికిలోకి వచ్చి క్రమంగా సమాజంలోని అణచివేతను, ఆధిపత్యాన్ని, అసమానతలను నిర్మూలించడానికి పెంపొందాయి. అధికారానికి సంబంధించిన అప్రజాస్వామిక కార్యాచరణను ఎదిరించడానికి హక్కులను ఒక సాధనంగా ప్రతిష్ఠింప చేసిందిపౌరహక్కుల ఉద్యమమే పౌరహక్కుల ఉద్యమం హక్కులను భారత పరిస్థితులకు తగినట్టుగా అన్వయించింది. కాబట్టి హక్కుల ఉద్యమం నుంచి విడదీసి హక్కులను అధ్యయనం చేయలేము.

భారతదేశంలో పౌరహక్కుల ఉద్యమానికి సుదీర్ఘమైన చరిత్ర ఉన్నా ఇటీవల కాలంలోనే పౌరహక్కుల ఉద్యమాలగురించి తెలుసుకోవాలన్న ఆసక్తి బాగా పెరిగింది. పౌరహక్కుల ఉద్యమానికి సంబంధించిన పరిశీలన ఇటీవలే మొదలైంది. కాబట్టి పౌరహక్కుల ఉద్యమానికి సంబంధించిన వివరాలు ఎక్కువగా అందుబాటులో లేవు. ఉన్న సమాచారం ఆధారంగానే ఈ పాఠ్యభాగం రూపొందించబడింది.

12.2 పౌరహక్కుల ఉద్యమ మౌలిక స్వభావం

ప్రఖ్యాత న్యాయశాస్త్ర వేత్త ఉపేంద్ర బక్షి అన్నట్టు భారత దేశంలో "There is no nation wide human rights movement in India; there are only human rights movements" మానవ హక్కుల ఉద్యమంలోని అయా పాయల ఆవిర్భావానికి దారి తీసిన పరిస్థితులు ఒకే రకంగా లేవు. వాటి నాయకత్వ సరళిలో తేడాలున్నాయి. ఒక్కొక్క పౌరహక్కుల ఉద్యమం ఒక్కొక్క మార్గాన్ని అనుసరించింది. అయితే భారత దేశంలో వచ్చిన పౌరహక్కుల ఉద్యమాలను సౌలభ్యం కొరకు రెండు గ్రూపులుగా విభజించవచ్చు. కొన్నింటిని పౌరహక్కుల ఉద్యమాలుగాను మిగతా వాటిని ప్రజాస్వామిక హక్కుల ఉద్యమాలుగా వర్గీకరించచ్చును.

ఓటింగ్ హక్కు స్వాతంత్రపు హక్కు, సమానత్వపు హక్కు, మతస్వేచ్ఛలను పౌరహక్కులంటారు. పౌరహక్కులు రాజ్యయంత్రాంగం నుండి వ్యక్తి స్వేచ్ఛను ప్రసాదిస్తాయి. రాజ్యాధికారాన్ని పరిమితం చేయడానికే పౌరహక్కులు తోడ్పడతాయి. ఈ పౌరహక్కులకు ప్రాధాన్యత నిచ్చి వాటిని పరిరక్షించడానికి సాగే ఉద్యమాలనే పౌరహక్కుల ఉద్యమాలంటారు.

వ్యక్తి వికాసానికి కావలసిన వసతులను కల్పించే హక్కులనే ప్రజాస్వామిక హక్కులంటారు. మానవ చరిత్ర క్రమంలో పౌరహక్కులే ముందుగా ఉద్భవించాయి. మధ్య యుగాలనాటి ఫ్యూడల్ నిరంకుశ పాలనను అంతం చేయడానికి పౌరహక్కులు తోడ్పడ్డాయి. అయితే పౌరహక్కులు అమలులోకి వచ్చి రాజ్యాధికారాన్ని పరిమితం చేసి వ్యక్తికి స్వేచ్ఛను కల్పించినా సమాజంలోని అసమానతల వలన, నిరుద్యోగం వలన, నిరక్షరాస్యత వలన, అనారోగ్యం వలన పౌరులు స్వేచ్ఛను అనుభవించలేకపోయారు. వ్యక్తికి స్వేచ్ఛకు రాజ్యనిరంకుశత్వం అక్కటే కాక ఇతర అటంకాలు కూడా ఉన్నాయన్న మాట. సామాజిక ఆర్థిక పరిస్థితులు కూడా వ్యక్తి స్వేచ్ఛకు అటంకంగా పరిణమించగలవు. కనుక ఏ సామాజిక - ఆర్థిక పరిస్థితిలో పౌరులు స్వేచ్ఛను అనుభవించగలరో, నిండైన జీవితాన్ని, పొందగలరో ఆ పరిస్థితులను కల్పించడానికి రాజ్యం తగు చర్యలు తీసుకోవాలి. వ్యక్తి స్వేచ్ఛను అనుభవించడానికి దోహదపడే కనీస సదుపాయాలను - విద్య, వైద్యం, ఉపాధి, గృహవసతి వంటివి - హక్కులుగానే గుర్తించాలి. పౌరహక్కులు రాజ్యం ఏం చేయకూడదో చెప్తాయి. ప్రజాస్వామిక హక్కులు అందుకు భిన్నంగా వ్యక్తి సంక్షేమానికై రాజ్యం చేపట్టవలసిన కనీస కర్తవ్యాలను తెలియ జేస్తాయి.

అయితే పౌర ప్రజాస్వామిక హక్కుల ఉద్యమాల మధ్య విభజన రేఖ క్రమంగా స్పష్టమైంది. ఈ తేడాలు హక్కుల ఉద్యమం ఎదిగే క్రమంలోనే బహిర్గతమయ్యాయి. అందుకే ముందుగా హక్కుల ఉద్యమ క్రమాన్ని పరిశీలిద్దాం.

BRAOU

12.3 స్వాతంత్రానికి పూర్వం పౌరహక్కుల ఉద్యమం

మనదేశ స్వాతంత్రోద్యమమే పౌరహక్కుల ఉద్యమంతో మొదలైంది. 19వ శతాబ్దంలో బ్రిటన్, అమెరికాల నుంచి వచ్చిన జె.ఎస్.మిల్. హామ్‌పెయిన్ పుస్తకాల ప్రభావంతోనే మధ్యతరగతి వర్గంలో హక్కుల చైతన్యం అంకురించింది. హామ్ పెయిన్ రాసిన "Rights of Mankind" పుస్తకాన్ని భారతదేశంలోకి స్మగ్లింగ్ చేసి బ్లాక్ మార్కెట్‌లో కొని చదివారంటే ఆపుస్తకం మధ్యతరగతిని ఎంతగా ప్రభావితం చేసిందో ఊహించవచ్చు.

ఈ హక్కుల చైతన్యంతోనే భారతీయులు తెల్ల వాళ్ళతో సమానంగా ఉద్యోగావకాశాలను డిమాండ్ చేశారు. సమానావకాశాలను కల్పించడానికే చివరికి బ్రిటిష్ పాలకులు ఇల్బర్టు బిల్లును తెచ్చారు. బిల్లు ఉద్యోగాల విషయంలోనే కాదు, భారతీయులను జడ్జీలుగా నియమించడానికి కూడా అవకాశం కల్పించింది. తెల్లవాళ్ళపై నమోదైన కేసులను కూడా విచారించే అవకాశాన్ని భారతీయులకు కల్పించడం మింగుడుపడని బ్రిటిష్ వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు ఈ బిల్లును వ్యతిరేకించారు. బిల్లును ఏ సవరణలు లేకుండా ఆమోదించాలని భారతీయులు డిమాండ్ చేశారు. అయినా వారి ఆశయం నెరవేరలేదు. బిల్లు బుట్టుదాఖలైంది. ఈ సంఘటనతో మధ్య తరగతి వర్గం జాతి వివక్షతలకు వ్యతిరేకంగా సమానత్వపు హక్కు కొరకు కలిసి కట్టుగా నిలబడాలనుకొన్నారు. అ భావనే కాంగ్రెసు పార్టీ అవిర్భావానికి దారితీసింది.

కాంగ్రెసు పార్టీయే, 1930లల్లో పౌరహక్కుల సంఘం ఏర్పాటయ్యే దాకా పౌరహక్కుల కొరకు ఉద్యమించింది. అయితే కాంగ్రెస్ తొలి రోజుల్లో పత్రికా స్వేచ్ఛకు ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చింది. ఎందుకంటే ఆ రోజుల్లో పత్రికే ప్రజల్లో జాతీయతా భావాలను పెంపొందించే పాత్రను నిర్వహించాయి. ప్రజలను మేల్కొలిపాయి. అందుకే బ్రిటిష్ పాలకులు పత్రికలపై తీవ్రమైన ఆంక్షలు విధించారు. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు ప్రాధాన్యత నిచ్చింది.

కాంగ్రెసు పార్టీ తన రాజకీయ అనుభవంలో ముఖ్యమని భావించిన హక్కులన్నింటిని కూర్చి 1918లో ముంబాయిలో జరిగిన ప్రత్యేక సమావేశంలో హక్కుల ప్రకటనను తయారు చేసింది. ఈ ప్రకటనను చట్టబద్ధం చేయమని కాంగ్రెసు పార్టీ బ్రిటిష్ పాలకులకు విజ్ఞప్తి చేసింది. 1918లో రూపొందిన ప్రకటన ప్రకారం భావ ప్రకటనా స్వేచ్ఛ, సమావేశపు హక్కు, వర్ణ విచక్షణ నుండి పరిరక్షణ వంటి హక్కులున్నాయి.

కాంగ్రెసు పార్టీ పుటుకకు పౌరహక్కుల చైతన్యం కారణమైనట్లే, పౌరహక్కుల ఉద్యమమే జాతీయోద్యమాన్ని ఉధృతమైన ప్రజా ఉద్యమంగా మార్చింది. మొదటి ప్రపంచ యుద్ధం ముగియగానే జాతీయోద్యమాన్ని అణచడానికి బ్రిటిష్ ప్రభుత్వం తయారు చేసిన లౌకిక చట్టానికి వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమమే జాతీయోద్యమానికి ఊపు నిచ్చింది. రౌలట్ చట్టం ప్రకారం విచారణ రహస్యంగా జరుగుతుంది. ముద్దాయికి న్యాయ సలహా, సహాయం నిషిద్ధం. ముద్దాయిని విచారణలో ఏ దశలోనైనా ప్రవేశపెట్టవచ్చు. ఏ విషయాలపై ఆధారపడి అతనిని దోషిగా పరిగణిస్తున్నారో చెప్పరు. అతనికి సాక్షులను పరిశీలించే హక్కు కూడా లేదు. ఈ చట్టాన్ని "చట్టబద్ధ పాలన మీద దాడిగా" మోతీలాల్ నెహ్రూ వర్ణించారు. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగానే కాంగ్రెసు పార్టీ మొట్టమొదటిసారి కాంగ్రెసు పార్టీ సత్యాగ్రహ ఉద్యమాన్ని నడిపింది. బ్రిటిష్ పాలకులు రౌలెట్ చట్టానికి వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమాన్ని దౌర్జన్య పూరితంగా అణిచి వేయడానికి ప్రయత్నించారు. ఈ అణచివేత పర్వంలో భాగమే జలియన్ వాలా బాగ్ ఉదంతం. కాంగ్రెసు పార్టీ అణచివేత చర్యలకు వ్యతిరేకంగా సహాయనిరాకరణోద్యమాన్ని చేపట్టింది. ఆ విధంగా జాతీయోద్యమం పౌరహక్కుల సృహను కలిగించింది.

పై చరిత్రను పరిశీలిస్తే న్యాయశాఖలోను సివిల్ సర్వీస్‌లోను భారతీయుల ప్రవేశానికి తోడ్పడే సమానత్వపు హక్కు కోసం, రాజకీయ ప్రచారానికి ఉపకరించే భావ ప్రకటనా స్వేచ్ఛకోసం, రాజకీయ కార్యక్రమాలను కొనసాగించడానికి కావలసిన సంస్థలను ఏర్పర్చుకొనే హక్కు, సమావేశాలు జరుపుకొనే హక్కుల కోసం మాత్రమే కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని గమనించవచ్చు. కాంగ్రెసు పార్టీ డిమాండ్ చేసిన ఈ హక్కులు విద్యావంతులకు మాత్రమే ఉపయోగ పడతాయి. అయితే విద్యావంతులే కాక భారతదేశంలో రైతులు, అదివాసులు, అంటరాని కులాలు, పారిశ్రామిక కార్మికులు కూడా ఉన్నారు. గొంతెత్త గల విద్యావంతులు హక్కుల గురించి పట్టించుకున్నంతగా కాంగ్రెసు పార్టీ అధిక సంఖ్యాకులైన ప్రజల హక్కుల పరిరక్షణ కర్తవ్యాన్ని చేపట్టడంలో విఫలమైంది. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టం చేయాలి. సంస్థలను ఏర్పర్చుకొనే హక్కు, సమావేశాలు జరుపుకొనే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ వంటి పౌర, రాజకీయ హక్కులు కూడా విశిష్టమైనవే. ఈ హక్కులు లేకుండా ఏ హక్కుల పత్రం కూడా వ్యక్తికి సమగ్రమైన స్వేచ్ఛను కల్పించలేదు. అణగారిన ప్రజల వికాసానికి కూడా అవితోడ్పడతాయి. కాకపోతే అణగారిన ప్రజలు తమకు తోచిన జీవితాన్ని ఎంచుకోవాలన్నా, పై స్వేచ్ఛలను అనుభవించ గలగాలన్నా ముందుగా ఆధిపత్యం నుంచి విముక్తిని పొందాలి. అణగారిన ప్రజలు స్వేచ్ఛగా బతకాలంటే ఆధిపత్యం నుంచి విముక్తిని కలిగించే హక్కులు ప్రాథమికం అవుతాయి. ఆధిపత్యం నుండి స్వేచ్ఛను పొందాలంటే అంటరాని తన నిర్మూలన, కనీస వేతనాలు వెట్టి నిర్మూలన వంటి హక్కులు అమలులోకి రావాలి. ఈహక్కులు లేని ఏ హక్కుల పత్రమైనా అణగారిన ప్రజల దృష్టినుంచి చూసినప్పుడు నిరర్థకమే.

1920 నాటికి కాంగ్రెసు పార్టీ రూపొందించిన హక్కుల అవగాహన ఆ తర్వాత వచ్చిన ప్రజా ఉద్యమాల ఫలితంగా పరిపుష్టి చెందింది. 1920లలో వచ్చిన ప్రజా ఉద్యమాలు రైతాంగ, కార్మిక, కుల వ్యతిరేక ఉద్యమాలు, ఆదిమవాసుల తిరుగుబాట్లు దేశంలో అంతర్గతంగా నెలకొన్న అసమానతలను కూడా రూపుమాపకపోతే స్వాతంత్రం వలన ప్రయోజనముండదని ఈ ఉద్యమాలు పేర్కొన్నాయి. వర్ణ విచక్షణను వలస పాలకుల నిరంకుశత్వాన్ని హక్కులకు ప్రధాన అవరోధంగా చూసిన కాంగ్రెసు నాయకులకు ప్రజా ఉద్యమాలు కనువిప్పు కలిగించాయి. ప్రజా ఉద్యమాల ప్రభావంతో కాంగ్రెస్ పార్టీ 1930 కల్లా తన ఆలోచనలను మార్చుకొన్నది. 1931లో కరాచీలో జరిగిన సదస్సులో ఆమోదించిన ప్రాథమిక హక్కులు మరియు జాతీయ ఆర్థిక విధానాలపై ఆమోదించిన తీర్మానంలో

BRAOU

(Resolution on Fundamental Rights and National Economic Programme) "ప్రజలపై సాగుతున్న దోపిడి అంతం కావాలంటే రాజకీయ స్వాతంత్ర్యంతో పాటు పేద ప్రజానీకానికి ఆర్థిక స్వాతంత్రం కూడా రావాలని" అంగీకరించింది. ప్రజా ఉద్యమాల ఫలితంగా కాంగ్రెసు దృక్పథంలో వచ్చిన ఈ మార్పు ప్రభావం పౌరహక్కుల రూపకల్పనపై కూడా ఉన్నది

1920 దాకా కేవలం పౌరహక్కులను మాత్రమే కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. 1920లల్లో ఉద్యమాల ఫలితంగా హక్కుల జాబితాలో కొత్త హక్కులు వచ్చి చేరాయి. 1925లో రాజ్యాంగ సంస్కరణలపై మోతీలాల్ రూపొందించిన నివేదికలో అంతవరకు గుర్తించిన పౌర, రాజకీయ హక్కులతో పాటు మతస్వాతంత్రాన్ని, విద్యా హక్కును, స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని కూడా పొందు పర్చారు. కరాచీ తీర్మానం హక్కుల పరిధిని మరింత విస్తృత పర్చింది. ఈ తీర్మానం కనీస వేతనాలను, పరిమితమైన పని గంటలను, కార్మికులకు సంఘం పెట్టుకొనే హక్కును కూడా హక్కుల జాబితాలో చేర్చింది. కేవలం పౌరహక్కులనే కాక ప్రజాస్వామిక హక్కులను 1920ల చివరి నుండి స్వాతంత్రోద్యమం గుర్తించింది. ఈ హక్కులను వెలుగులోకి తెచ్చింది. వాటి ఆవశ్యకతను ఎత్తి చూపింది. కాంగ్రెసు వెలుపల సాగినవి ప్రజా ఉద్యమాలేనని గమనించాలి.

ఈ విధంగా హక్కుల చైతన్యం పెంపొందడానికి స్వాతంత్రోద్యమమే కృషి చేసింది. భారత దేశంలో హక్కులు పెంపొందడానికి వలస పాలకులు ప్రయత్నించక పోగా ఎప్పటికప్పుడు హక్కులను నిరాకరిస్తూ వచ్చారు. భారతదేశంలో హక్కుల చైతన్యాన్ని పెంపొందించి దాని వెలుగులో మానవ హక్కుల ప్రకటనను రూపొందించడమే కాక ఆ హక్కులను సొకర్యం చేసుకోడానికి కృషి చేసింది. స్వాతంత్రోద్యమమే. ఆ విధంగా హక్కుల ఉద్యమం స్వాతంత్రోద్యమంలో భాగంగా కొనసాగింది.

పాశ్చాత్య దేశాలలో హక్కుల సంఘాల పాత్ర భిన్నమైంది. అవి కేవలం చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణకు మాత్రమే కృషి చేసాయి. మన దేశంలో పౌరహక్కుల ఉద్యమం హక్కులను చట్ట బద్ధం చేయ వలసిన పనిని కూడా చేపట్టింది.

మన దేశంలో పౌరహక్కుల పరిరక్షణకు 1936 దాకా ప్రత్యకమైన సంఘాలేవీ ఏర్పడలేదు. 1936 వరకు కాంగ్రెసు పార్టీ మరియు ఇతర పార్టీలే హక్కుల పరిరక్షణకు కృషి చేసాయి. పౌరహక్కుల చైతన్యం పెరిగి, హక్కుల ప్రకటన ఆవిర్భవించాక వలస పాలకుల అణచివేత చర్యలను వెలుగులోకి తేవడానికి పౌరహక్కులను రక్షించడానికి ప్రత్యేక సంస్థ ఏర్పాటైంది.

పౌర హక్కుల సంఘం ఏర్పాటుకు ఆనాటి నాయకుల్లో జవహర్‌లాల్ నెహ్రూ ఎక్కువగా కృషి చేసారు. సహాయ నిరాకరణోద్యమాన్ని రూపుమాపటానికి బ్రిటిష్ ప్రభుత్వం అమలు చేసిన తీవ్ర నిర్బంధం వలన నెహ్రూ ప్రయత్నాలకు మద్దతు లభించింది. 1930లల్లో స్వాతంత్రోద్యమాన్ని నిర్వీర్యం చేయడానికి పౌరులను అనుమానం మీద అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో తీవ్ర చిత్రహింసల పాల్జేసారు. కోర్టులో నిర్దోషులని తీర్పుచెప్పి వదిలేసి మళ్ళీ అరెస్టు చేశారు. ఆనాటి పరిస్థితులను వివరిస్తూ ప్రఖ్యాత సోషలిస్టు నాయకుడు రామ్‌మనోహర్ లోహియా ఇలా అన్నాడు. "India lives today under the shadow of tyranny and fear of tyranny - All manner of work, political and social, thought and art wastes and withers away."

ఈ పరిస్థితిలో నెహ్రూ కృషి ఫలితంగా మొట్టమొదటి సారి 1936లో ఏ పార్టీతో సంబంధాలు లేని, విశాల ప్రాతిపదికకు భారతీయ పౌరహక్కుల యూనియన్ (Indian Civil Liberties Union - ICLU) ఏర్పడింది. ఈ సంస్థ ఆవశ్యకతను వివరిస్తూ , 1936లోనే లోహియా "The Struggle for Civil Liberties' అనే పుస్తకాన్ని రాసాడు. ఈ చిన్న పుస్తకంలో పౌరహక్కుల అణచివేతకు గల కారణాలను పౌరహక్కుల పరిరక్షణ అవసరాన్ని పౌరహక్కుల రక్షణకు చేయవలసిన పనులను తెలియజేసారు.

BRAOU

వలస దేశాల్లోకాని, సామ్రాజ్య వాద దేశాల్లో కాని ప్రస్తుత రాజకీయ, ఆర్థిక వ్యవస్థను మార్చి ప్రత్యామ్నాయ వ్యవస్థలను సృష్టించడం కోసం సాగుతున్న పోరాటాలను రూపుమాపి ఉన్న వ్యవస్థలను పదిలంగా కాపాడటానికే ఉండే యథాతథ స్థితిని కాపాడటానికే రాజ్యంగ యంత్రాంగం అణచివేతను ప్రయోగిస్తున్నదని లోహియా అన్నారు. నిర్బంధం వలన ఉద్యమాలలో అగ్రగామిగా ఉన్న స్వాతంత్రోద్యమ నాయకులు, సోషలిస్టులు, కమ్యూనిస్టు ఎక్కువగా నిర్బంధాన్ని చవి చూసారు. కాగా పెట్టుబడిదారీ శక్తులకు, భూస్వామ్య కులీనులకు మాత్రమే లాభం జరుగుతున్నదని లోహియా పేర్కొన్నారు.

పౌరహక్కుల పరిరక్షణ వలన 3 ప్రయోజనాలున్నాయని లోహియా వివరించారు. అవి ఇలా ఉన్నాయి.

పౌరహక్కుల ఉనికిలో ఉన్నప్పుడు సామాజిక ప్రగతికి కృషిచేయడానికి అవకాశం కలుగుతుంది. సమాజంలో ఎప్పుడూ పురోగామి శక్తులకు, తిరోగామి శక్తులకు మధ్యన సంఘర్షణ కొనసాగుతుంటుంది. ఈ సంఘర్షణలో తిరోగామి శక్తులు రాజ్య యంత్రాంగాన్ని సాధనంగా వాడుకొని తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. ఒక్కొక్కసారి తిరుగుబాటుదారులు కూడా రాజ్యాధికారాన్ని కైవసం చేసుకొని ఆ అధికారాన్ని ప్రగతికి సాధనంగా వాడుకోవచ్చును. కానీ తిరుగుబాటుదారులు కూడా మార్పుపై ఆసక్తిని కోల్పోతారు. రాజ్యయంత్రాంగాన్ని తమ అధికారాన్ని కాపాడుకొనే సాధనంగా ఉపయోగిస్తారు. ఈ పరిస్థితిని రూపుమాపాలంటే రాజ్యాధికారాన్ని పరిమితం చేయాలి. పౌరహక్కులు మాత్రమే రాజ్యాధికారాన్ని పరిమితం చేసి ప్రగతికి, మార్పుకు అవకాశాన్ని కల్పిస్తాయి. కనుక సమాజం మారాలని, పురోభివృద్ధి చెందాలని కోరుకునే వారంతా పౌరహక్కుల పరిరక్షణకు కృషి చేయాలని లోహియా అంటారు.

పౌరహక్కులు వాటంత అవే సామాజిక మార్పును తేలేవు. కాకపోతే రాజ్యయంత్రాంగాన్ని పరిమితం చేయడం ద్వారా పౌరహక్కులు మార్పుకు అవకాశాన్ని కల్పిస్తాయి. ఆవిధంగా ప్రజలకు చేయూత నిస్తాయి. నిరసన తత్వం కొనసాగుతుంది.

పౌరహకుకల పరిరక్షణోద్యమం నిర్బంధానికి మూలాధారమైన సామాజిక దురాచారాలను రాజకీయాధికార దుర్వినియోగాన్ని వెలుగులోకి తెస్తుంది. పౌరహక్కుల అణచివేతకు సంబంధించిన ఘటనలను పరిశీలించేటప్పుడు ఏ దురాగతాలను ఎదిరించడం వీలని వ్యక్తులు నిర్బంధానికి లోనయ్యారో అవన్నీ వెలుగులోకి వస్తాయి.

భారతీయ పౌరహక్కుల యూనియన్ బ్రిటిష్ ఏలుబడిలోని ప్రాంతాల్లోనేకాక సంస్థానాలలో కూడా అక్రమ అరెస్టులను, వేదింపులను, పోలీసు కస్టడీలో చిత్రహింసలు జరిగిన సంఘటనలను సభలు సమావేశాలపై నిషేదాజ్ఞలను వెలుగులోకి తెచ్చింది.

అయితే భారత పౌరహక్కుల యూనియన్ ఎక్కువ కాలం కొనసాగలేదు. 1937లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రాల్లో కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరహక్కుల యూనియన్‌కు సమస్యలు ఎదురయ్యాయి. తమ పార్టీ అధికారంలోనున్న రాష్ట్రాల్లో పౌరహక్కులకు కట్టుబడి పని చేయాలని నిర్ణయించుకొన్నది. కాని ఆ పార్టీ పాలనలోనున్న కొన్ని రాష్ట్రాల్లో కూడా పౌరహక్కుల ఉల్లంఘన జరిగింది. అప్పటివరకు పౌరహక్కుల యూనియన్ కేవలం వలసపాలకులను మాత్రమే వ్యతిరేకించింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు పాలకుల పట్ల అనుసరించ వలసిన వైఖరిలో పౌరహక్కుల యూనియన్ ఏకాభిప్రాయానికి రాలేక పోయింది. అధికారంలో నున్న వారెవరైనా, హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే, వ్యతిరేకించ వలసిందేనని కొందరన్నారు. అంటే కాంగ్రెసు ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో హక్కుల ఉల్లంఘన జరిగినా ఖండించ వలసిందెనన్న అభిప్రాయమొకటి పౌరహక్కుల యూనియన్‌లో ఉన్నదన్నమాట. కాంగ్రెసు పాలనలోనున్న రాష్ట్రాల్లో సంభవించిన హక్కుల ఉల్లంఘన ఘటనల విషయంలో కన్ను వేయాలని మరికొందరన్నారు. ఈ విభేదాలతో విసిగిన చాలామంది కార్యకర్తలు సంస్థ నుండి వైదొలగారు. దాంతో పౌరహక్కుల యూనియన్ నిర్వీర్యమైంది.

BRAOU

పౌరహక్కుల యూనియన్ స్వాతంత్రోద్యమ కాలంలో కాంగ్రెసు కార్యకర్తలపై సాగుతున్న అణచివేతను ఎదుర్కొనడానికి ఏర్పడిందని, ఆ పార్టీ ఏలుబడిలోని రాష్ట్రాల్లో హక్కుల ఉల్లంఘన ఘటనల విషయంలో నిష్పాక్షికంగా వ్యవహరించ లేకపోవడంలో బలహీనమై పోయిందని పై వివరాలను పరిశీలిస్తే గమనించవచ్చు. పౌరహక్కుల యూనియన్ ప్రధానంగా రాజ్యయంత్రాగం అణచివేత చర్యలను ఎదిరించడం లక్ష్యంగా పెట్టకొని ఆధిపత్య సంబంధాల కారణంగా సమాజంలో జరిగే హక్కుల అణచివేతను విస్మరించింది. పౌరహక్కుల యూనియన్‌కు పరిమితులెన్ని ఉన్నప్పటికి ఆ సంస్థకు 1980ల దాకా దేశంలో ఏర్పడిన హక్కుల సంఘాలు నమూనాగా ఎంచుకొన్నాయి.

కాంగ్రెసుపార్టీ ఏర్పడిన నాటినుండి స్వాతంత్రోద్యమంలో అంతర్భాగంగా సాగిన పౌరహక్కుల ఉద్యమం తీసుకొచ్చిన హక్కుల చైతన్యమే భారతరాజ్యాంగ సభలో హక్కులకై చర్చలకు, ప్రాథమికహక్కుల అధ్యాయ రూపకల్పనకు కారణభూతమైంది. ప్రాథమిక హక్కుల అధ్యాయం వెనుక సుదీర్ఘమైన హక్కుల ఉద్యమ చరిత్ర ఉందన్నమాట. ఆ చరిత్ర వలన ప్రాథమిక హక్కుల అధ్యాయం దేశీయ పరిస్థితుల కనుగుణంగా పెంపొందింది. అందుకనే మనదేశ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల అధ్యాయానికి విశిష్టత ఉన్నది. ప్రపంచంలోని ఏ రాజ్యాంగమైనా రాజ్యాధికారాన్ని పరిమితం చేసి వ్యక్తుల స్వేచ్ఛను పరిరక్షిస్తుంది. కాని మన రాజ్యాంగం రాజ్యయంత్రాగం నుండే కాక సమాజంలోని అధిపత్యశక్తుల నుండి కూడా స్వేచ్ఛను కల్పిస్తున్నది. ఆర్టికల్ 15 (సమానత్వపు హక్కు) ఆర్టికల్ 19 (స్వాతంత్రపుహక్కు), ఆర్టికల్ 21 (జీవించేహక్కు) రాజ్యాధికారాన్ని పరిమితం చేస్తున్నాయి. కాగా ఆర్టికల్ 17 (అంటరాని తనాన్ని నిషేధించే ప్రకరణ), ఆర్టికల్ 23 (వెట్టినిర్మూలన) సమాజంలోని ఆధిపత్య శక్తులనుండి విముక్తిని ప్రసాదిస్తున్నాయి. మన రాజ్యాంగంలోని ప్రాథమికహక్కుల అధ్యాయానికి మరొక విశిష్టత కూడా ఉన్నది. ప్రపంచంలోని ఏదేశమైనా వ్యక్తులకు హక్కులను కల్పిస్తుంది. మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 17, ఆర్టికల్23, ఆర్టికల్ 25,26,27,28లు (మత స్వాతంత్ర్యం), ఆర్టికల్ 29, 30 (సాంస్కృతిక హక్కులు) వ్యక్తులకు కాక సమూహంకు చెందుతాయి. ఉదాహరణకు స్వాతంత్ర్యపు హక్కు వ్యక్తులకు స్వేచ్ఛను కల్పిస్తుంది. కానీ ఆర్టికల్ 17 దళితులందరికి అంటరానితనం నుండి విముక్తిని కల్పించడానికి ఉద్దేశించబడింది. ఆర్టికల్ 17 వలన దళితులు ఒక సమూహంగా స్వేచ్ఛను పొందుతున్నారు.

రాజ్యాంగం ఆధిపత్యం నుండి స్వేచ్ఛను కల్పించడమే కాక సమాజంలోని అసమానతలను రూపుమాపే బాధ్యతను ప్రభుత్వం మీద ఉంచింది. ఆర్టికల్ 17 ప్రకారం అంటరానితనం నేరం. ఆ నేరానికి పాల్పడిన వారిని శిక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉన్నది. పై విషయాలను పరిశీలిస్తే పౌరహక్కుల ఉద్యమాల కృషి వల్లనే మనదేశ పరిస్థితులకు తగినట్టు హక్కులు రూపొందాయని గమనించవచ్చు. హక్కులను మనదేశ పరిస్థితులకు అన్వయించి చట్టబద్ధం చేయడంలో పౌరహక్కుల ఉద్యమ కృషి గణనీయమైనది.

12.4. స్వాతంత్ర్యానంతరం వచ్చిన పౌరహక్కుల ఉద్యమాలు

స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వాన్ని ఎదిరించే హక్కు కొరకు పోరాడిన వాళ్ళే అధికారంలోకి వచ్చారు. అయినా హక్కులకు రక్షణ లభించలేదు. ఎందుకంటే వారంతా ప్రజలకు కనీస వసతులను కల్పించాలంటే కొత్తగా ఏర్పర్చిన రాజ్యాన్ని పరిరక్షించాలన్నారు. అందుకై హక్కులను పరిమితం చేయడానికి కూడా వెనుకాడలేదు. నిజానికి రాజ్యాంగం ద్వారానే దేశ సమగ్రత, దేశ భద్రతకై హక్కులపై పరిమితులను విధించే అధికారాలను ప్రభుత్వానికి కల్పించారు. అనుమానం మీద వ్యక్తులను అరెస్టు చేయవచ్చు. ఎమర్జన్సీ విధించినపప్పుడు హక్కులను పూర్తిగానే సస్పెండ్ చేయవచ్చు.

దేశ సమగ్రత ప్రజాసంక్షేమం కొరకు అవసరమైన హక్కులను కూడా పరిమితం చేయాలన్న ఆలోచనే ఉద్యమాలను శాంతి - భద్రతల సమస్యగా చూసే దృక్పథానికి దారి తీసింది. ఈ దృక్పథంతోనే ప్రభుత్వం కొన్ని ఉద్యమాల పట్ల కఠినంగా వ్యవహరించింది. ప్రభుత్వం అనుసరించిన విధానాలకు వ్యతిరేకంగా మళ్ళి 1947 తర్వాత పౌరహక్కుల ఉద్యమాలు తలెత్తాయి. 1949లో పౌరహక్కుల అణచివేతకు నిరసనగా సమావేశం జరిగింది. బెంగాల్ లోనైతే హక్కుల కమిటీ కూడా ఏర్పడింది. అయితే ఇవి ఎక్కువ కాలం నిలబడలేదు. కేవలం రాజకీయ కార్యకర్తలను

BRAOU

విడిపించాలన్న పరిమిత లక్షంతో ఏర్పడిన ఈ కమిటీలు ఆ అవసరం తీరగానే పూర్తిగా మరుగున పడ్డాయి.

నిజానికి మనదేశంలో ఎప్పుడైనా ప్రజా ఉద్యమాలను వెన్నంటే పౌరహక్కుల సంఘాలు ఏర్పడ్డాయి. ఎందుకంటే పౌరహక్కుల సంఘాలు మనగలిగే సామాజిక వాతావరణం మనదేశంలో లేదు. సామాజిక అసమానతల కారణంగా పౌరహక్కుల చైతన్యం విస్తరించలేదు.

మనుషులందరూ సమానులేనన్న భావనే పౌరహక్కులకు ప్రాతిపదిక. మంచి చెడులను గుర్తించగల విచక్షణా జ్ఞానం, తమకు నచ్చిన జీవితాన్ని ఎంచుకొని, కొనసాగించగల వివేచనా శక్తి మనుషులందరికీ సమానంగా ఉంటాయని గుర్తించినప్పుడే పౌరహక్కులు ఎదుగుతాయి. మనుషుల మధ్య అసమానతలను సహజమైన విషయంగా పరిగణించే సమాజంలో హక్కులు ఆచరణలోనికి రావు. మనదేశంలో ఈ అసమానతలను ఎదిరించే క్రమంలోనే హక్కులు గుర్తింపు పొందాయి. అందుకే హక్కులకు సంబంధించిన స్పృహ అసమానతలను ప్రశ్నించిన ఉద్యమాలతోపాటే తలెత్తింది.

పై కారణాలవలన మనదేశంలో 1950 తర్వాత చెప్పుకోతగిన ప్రజా ఉద్యమాలేనీ లేకపోవడం వలన పౌరహక్కుల ఉద్యమం అంతరించి పోయింది. అసమానతలను ఎదిరిస్తూ 1970లలో వచ్చిన ఈ ఉద్యమాలే నక్సల్బరీ ఉద్యమం, నవనిర్మాణ సమితి ఆందోళన, నేపద్యంలోనే భారతదేశంలో మళ్ళీ పౌరహక్కుల సంఘాలు ఏర్పడ్డాయి. ఈ కాలంలో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (Andhra Pradesh Civil Liberties Committee - APCLC) ప్రజా స్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ (Organisation for the protection Democratic Rights - OPDR) ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ అసోసియేషన్ (Association for the protection of Democratic Rights) సిటిజన్ ఫర్ డెమోక్రసీ (CFD) అనే సంస్థలు ఏర్పడ్డాయి. ఈ సంఘాలు కూడా కేవలం ఉద్యమకారులపై సాగుతున్న అణచివేతను రూపుమాపే పరిమిత లక్ష్యం కొరకే ఏర్పడ్డాయి. వీటికి నిర్మాణం కూడా లేదు. సభ్యత్వమూ లేదు. కొద్ది మంది వ్యక్తులు ఒక కమిటీగా రూపొంది కేవలం ప్రచార కార్యక్రమాలకే పరిమితమయ్యారు. మధ్యతరగతి ప్రవేశంతోనే పౌరహక్కుల ఉద్యమ స్వభావం మారిపోయింది. ఎమర్జన్సీ కాలంలో నిర్బంధాన్ని అనుభవించిన మధ్యతరగతి వర్గం, నిరంతర జాగరూకత వల్లనే హక్కులు రక్షింపబడతాయన్న విషయాన్ని గ్రహించి, పౌరహక్కుల ఉద్యమంలో భాగమైంది. అప్పటి నుండి స్పష్టమైన మానిఫెస్టోలతో, నిర్మాణంతో ఈ సంస్థలు పెంపొందాయి. నిర్మాణ పూర్వ స్థితి నుండి పౌరహక్కుల ఉద్యమం ఎమర్జన్సీ తరువాత నిర్మాణ దశను చేరుకొన్నది. కొన్ని రాష్ట్రాలలో ఎమర్జన్సీ తరువాతనే మొట్టమొదటి సారిగా పౌరహక్కుల సంఘాలు ఏర్పడ్డాయి. దిగువ పట్టికలో ఆయా పౌరహక్కుల సంఘాల పేర్లు, అవి ఏర్పడిన సంవత్సరం, అవి పని చేస్తున్న ప్రాంతాల వివరాలు పొందుపర్చాము.

Peoples Union For Civil Liberties (PUCL) అఖిల భారత సంస్థ - 1976
Peoples Union for Democratic Rights (PUDR) ఢిల్లీ
Andhra Pradesh Civil Libertives Committe (APCLC) ఆంధ్రప్రదేశ్ - 1974
Association for Protection of Democratic Rights (APDR) పశ్చిమ బెంగాల్ - 1972
Organisation for protection of Democratic Rights (OPDR) ఆంధ్రప్రదేశ్ - 1974
Committee for Protection of Democratic Rights (CPDR) మహారాష్ట్ర - 1977
Naga People's Movement for Human Rights (NPMHR) ఈశాన్య రాష్ట్రాలు
Manav Adhikar Sangam Samiti (MASS) అస్సాం

పై సంఘాలలో PUCL-DR తర్వాత విడిపోయింది. ఇందులో కొందరు PUCL లో చేరిపోగా మిగిలిన వారు PUDR అనే సంస్థగా రూపొందారు. వారు PUCL-DR లోని రెండు గ్రూపుల మధ్య సాగిన చర్చ ఎమర్జన్సీ తరువాత పౌరహక్కుల ఉద్యమంలోని రెండు పాయల మధ్య నున్న తేడాలను స్పష్టంగా వ్యక్తం చేసింది. PUCL కేవలం రాజ్యాంగంలోని హక్కుల పరిరక్షణా లక్ష్యానికి మాత్రమే పరిమితమైంది.

మిగతా సంఘాల ఆలోచనలు భిన్నంగా ఉన్నాయి. ఈ సంఘాలను ప్రజాస్వామిక హక్కుల సంఘాలంటారు.

BRAOU

హక్కులు ప్రజా ఉద్యమాల ఫలితంగా రూపొందుతాయి. రాజ్యాంగంలోని పౌరహక్కుల జాబితా కూడా ఈ విధంగానే ఉద్భవించింది. ఆ ఉద్యమాల క్రమంలోనే హక్కుల చైతన్యం పెంపొందుతుంది. అందుకే ఉద్యమాల క్రమలో ఉనికిలోకి వచ్చిన హక్కులను, చట్టంలో లేకున్నా గర్తిస్తున్నాయి. ఉదాహరణగా సమాచారం పొందే హక్కు, ఉపాధి హక్కును పేర్కొనవచ్చును.

అంతేకాదు ఈ రెండవ రకమైన పౌరహక్కుల సంఘాలు సాంఘిక - ఆర్థిక హక్కులకు ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నాయి. విద్యాహక్కు, ఉపాధిహక్కు వంటివి అమలైనప్పుడే పౌర రాజకీయ హక్కులను అనుభవించడానికి వీలవుతుందని భావిస్తున్నాయి.

నిర్మాణ దశను దేరుకొన్న తర్వాత క్రమంగా హక్కుల సంఘాల కార్యక్రమాలు విస్తృతమయ్యాయి. అంతవరకు కేవలం రాజకీయ కార్యకర్తల హక్కుల కోసం మాత్రమే పోరాడిన హక్కుల సంఘాలు సాధారణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పని చేయడం ప్రారంభించాయి. ముఖ్యంగా నేర పరిశోధన పేర లాకప్పులో చిత్రహింసలు పెట్టే సంస్కృతిని వ్యతిరేకించాయి.

1980ల చివరి వరకు ప్రజాస్వామిక హక్కుల ఉద్యమాలు గానీ, పౌరహక్కుల ఉద్యమాలు కానీ కేవలం రాజ్యం వల్ల మాత్రమే పౌరహక్కులకు విఘాతం కలుగుతుందని భావించేవి. అందుకని రాజ్య యంత్రాంగం నుండి మాత్రమే పౌరహక్కులను పరిరక్షించే పనిని నిర్వర్తించాయి. అయితే క్రమంగా రాజ్యయంత్రాంగం నుండే కాక సమాజంలోని ఆధిపత్య వర్గాల నుండికూడా ప్రజల ముఖ్యంగా స్త్రీల, దళితుల పేదప్రజల హక్కులకు విఘాతం కలుగుతుందని గుర్తించి తమ కార్యరంగాన్ని విస్తరించుకున్నాయి. పురుషాధిక్య సమాజంలో స్త్రీ తనకు నచ్చిన జీవితాన్ని ఎంచుకొని స్వేచ్ఛగా బతకడానికి ఇంటా బయటా సాగుతున్న మగ పెత్తనం ఒక కారణమని, అందుకని స్త్రీ స్వేచ్ఛగా బతకడానికి రాజ్య యంత్రాంగం నుండే కాక మగపెత్తనం నుండి కూడా స్వేచ్ఛ లభించాలి. అదేవిధంగా దళితుల విషయంలో నిండైన జీవితాన్ని పొందడానికి కుల వ్యవస్థ ఒక ఆటంకం. అందుకే రాజ్యయంత్రాంగం నుండీ కాక ఆధిపత్య సంబంధాల వలన వ్యక్తి స్వేచ్ఛ అణచివేయబడుతున్నది కాబట్టి భారతదేశంలో రాజ్యం నుండి మరియు సమాజం నుండి కూడా వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించాలని పౌరహక్కుల సంఘాలు గుర్తించాయి. ఆ విధంగా వాటి కార్యరంగం మరోసారి విస్తరించింది.

ఎమర్జన్సీ తర్వాత ఉనికిలోకి వచ్చిన పౌరహక్కుల ఉద్యమానికి ఒక విశిష్టత ఉన్నది. పౌరహక్కుల సంఘాల అవగాహనలో ఎమర్జన్సీ తర్వాత వచ్చిన మార్పులతో పౌరహక్కుల ఉద్యమం విస్తృత ప్రాతిపదికను సంతరించుకొన్నది. అంతేకాక అంతకు ముందున్న సంఘాలవలె కాకుండా ఎమర్జన్సీ తర్వాత ఏర్పడిన పౌరహక్కుల సంఘాలు స్థిరంగా కొనసాగాయి. భారతీయ పౌరహక్కుల యూనియన్‌తో పాటు ఎమర్జన్సీకి ముందు ఏర్పడిన అన్ని పౌరహక్కుల సంఘాలు ఒకటి రెండు సంవత్సరాల కంటే ఎక్కువ మనుగడ సాగించలేకపోయాయి. ఎమర్జన్సీ తర్వాత వచ్చిన సంఘాలే అట్లా అంతరించిపోలేదు.

12.5. పౌరహక్కుల ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళు

అయితే ఇప్పటి హక్కుల సంఘాలు రెండు రకాల సవాళ్ళు ఎదుర్కొంటున్నాయి. అవి : 1) ప్రజాస్వామిక హక్కుల ఉద్యమాలు ఆయా ఉద్యమాల క్రమంలోనే ప్రజాతంత్ర విలువలు, ప్రజాస్వామిక హక్కులు వెలుగులోకి వస్తాయి. హక్కులు సంఘాలు భావిస్తున్నట్టుగా పైన చెప్పుకున్నాం. ఈ దృక్పథంలో లోపమేమీలేదు. ఎందుకంటే మనదేశంలో స్వాతంత్ర్యోద్యమ క్రమంలోనే పౌరహక్కులు ఉద్భవించి క్రమంగా ఇతర ఉద్యమాల వలన పెంపొందాయి. అయితే ఈ దృక్పథం వలన ప్రజాస్వామిక హక్కుల ఉద్యమాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి. అందులో మొదటిదేమిటంటే ఆయా ప్రజా ఉద్యమాలకు హక్కుల ఉద్యమాలకు తేడా కనిపించదు. రెండూ ఒక్కటే నన్న అభిప్రాయం కలుగుతుంది. ఆయా ప్రజా సంఘాలు సక్రమంగా నడుచుకున్నప్పుడు సమస్యలేవీ రావు. కానీ ఆ

BRAOU

సంఘాలు ప్రజలకు నష్టం కలిగించే పనులు చేసినప్పుడు హక్కుల సంఘాలు బాధ్యత వహించవలసి వస్తున్నది. ఉదాహరణకు పీపుల్స్ వార్ గ్రూపు చర్యలకు, ప్రభుత్వం, పార్టీలు, పత్రికలు మనరాష్ట్రంలోని హక్కుల సంఘాలను నిలదీస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఉత్తర భారత దేశంలో టెర్రరిస్టుల చర్యలకు పౌరహక్కుల సంఘాలను బాధ్యులనుచేసి విమర్శించడం జరుగుతున్నది. మరి ఈ సమస్యనుండి బయట పడాలంటే పౌరహక్కుల సంఘాలు ప్రజా సంఘాలు పార్టీలు చేసే తప్పిదాల విషయంలో అనుసరించ వలసిన వైఖరిని, అదీ పౌరహక్కుల చట్టానికి లోబడి రూపొందించుకోవాలి. ఇప్పటికీ పౌరహక్కుల సంఘాలు సరైన దృక్పథాన్ని పెంపొందించుకోలేదు. పౌరహక్కుల సంఘాలు ప్రజా సంఘాలు, పార్టీలు జేబు సంస్థలేనన్న విమర్శకు జవాబుగా అయితే అయా సంఘాలు చేసే చర్యలతో సంబంధం లేదనైనా తప్పుకుంటున్నాయి. లేకపోతే ఆ చర్యలను సమర్థించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ రెండు రకాల సమాధానాలు కూడా లోపభూయిష్టమైనవే. కేవలం రాజ్యాంగాన్ని మాత్రమే పౌరహక్కులకు ఆధారంగా పరిగణించినప్పుడు మొదటి సమాధానానికి అంగీకారం లభిస్తుంది. కానీ పౌరహక్కుల సంఘాలు ప్రజా ఉద్యమాల నుండే పౌరహక్కులు ఉద్భవిస్తున్నాయని చెప్తున్నాయి. కాబట్టి ప్రజా ఉద్యమాలతో సంబంధం లేదన్న వాదనకు సాధికారత లభించదు. ఇకపోతే రెండవ రకమైన సమాధానం పౌరహక్కుల పరిధిలో సాధ్యం కాదు. పౌరహక్కుల చట్రాన్ని దాటి రాజకీయ అవగాహనను అలవర్చుకున్నప్పుడు ఈ వాదనకు బలం చేకూరుతుంది. కానీ అందువలన పౌరహక్కుల ఉద్యమం తన అస్థిత్వాన్నే కోల్పోయే ప్రమాదం ఉన్నది. పౌరహక్కుల సంఘాలు, ప్రజా ఉద్యమాలు ప్రజలకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడినప్పుడు అనుసరించవలసిన వైఖరిని రూపొందించుకోలేక పోయాయన్నది స్పష్టమవుతున్నది. అ లోపం వలన పౌరహక్కుల విశ్వసనీయత సన్నగిల్లే ప్రమాదమున్నది.

2. ప్రజా ఉద్యమాల తప్పిదాల విషయంలో స్పష్టమైన వైఖరి లేనట్లే రాజ్య యంత్రాంగం పట్ల కూడా స్పష్టమైన అవగాహన లేదు. పౌరహక్కుల సంఘాలు ఒక వేపు రాజ్య యంత్రాంగాన్ని అణచి వేతకు మూలాధారంగా చూపిస్తూనే మరోవైపు సామాజిక, ఆర్థిక హక్కుల అమలుకు రాజ్యయంత్రాంగంపై ఆధారపడుతుంటాయి. రాజ్య యంత్రాంగం పట్ల ఉన్న దృక్పథంలో ఉన్న వైరుధ్యాన్ని పరిష్కరించుకోవాలి. లేకపోతే పౌరహక్కుల సంఘాలు ఏదో ఒకవైపు కొట్టుకొని పోయే ప్రమాదమున్నది. రాజ్యయంత్రాంగం పైనే అధారపడితే ఆ యంత్రాంగం వలన తలెత్తే అణచి వేతను ప్రశ్నించ లేవు. మరోవైపు రాజ్యయంత్రాంగాన్ని కేవలం ఒక అణచి వేత సాధనంగా మాత్రమే పరిగణించి నప్పుడు అయా ఉద్యమాల వలన వ్యవస్థితమైన హక్కులను, హక్కుల పరిరక్షణా పద్ధతులను ఉపయోగించడంలో విఫలం చెందుతాయి.

12.6. ముగింపు

పౌరహక్కుల ఉద్యమ సవాళ్ళను ఈ నాడు పౌరహక్కుల సంఘాలు గుర్తించాయి. వాటిని పరిష్కరించుకొనే దిశగా ప్రయాణిస్తున్నాయి. ఈ లోపాలు ఉన్నా ఇప్పటికే పౌరహక్కుల ఉద్యమాల కృషి వలన పౌరహక్కుల చైతన్యం బాగా పాతుకొని పోయింది. ఫలితంగా పలు డిమాండ్లను పౌరహక్కుల పరిభాషలో వ్యక్తం చేసే ఆచరణ మన రాజకీయ, సామాజిక జీవితంలో స్థిరపడిపోయింది.

12.7. మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి :

1. స్వాతంత్రానికి పూర్వం భారతదేశంలో వచ్చిన పౌరహక్కుల ఉద్యమాలను విశ్లేషించండి?
2. స్వాతంత్ర భారతదేశంలో వచ్చిన పౌరహక్కుల ఉద్యమాలను చర్చించండి?

II. ఈక్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబు రాయండి.

1. భారతదేశంలో పౌరహక్కుల ఉద్యమ మౌలిక స్వభావం చర్చించండి.
2. పౌరహక్కుల ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళను పేర్కొనండి.

BRAOU

13. నూతన సామాజిక ఉద్యమాలు : మానవ హక్కులు

విషయక్రమం

13.0 ఉద్దేశం

13.1 పరిచయం

13.2 అర్థం - నిర్వచనం - స్వభావం

13.3 మార్క్సిస్టు దృక్పథం

13.4 నిర్మితి - విధుల దృక్పథం

13.5 సామాజిక ఉద్యమాలు : సాంప్రదాయిక అవగాహన

13.5.1 వనరుల సమీకరణ సిద్ధాంతం

13.6 నూతన సామాజిక ఉద్యమాలు : అవగాహన

13.7 నూతన సామాజిక ఉద్యమాలు : ముఖ్య లక్షణాలు

13.8 మానవ హక్కులు

13.9 ముగింపు

13.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

13.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలు తెలుసుకుంటారు:

- నూతన సామాజిక ఉద్యమాలని వేటిని అంటున్నాం?
- వాటి లక్షణాలు దృక్పథాలేమిటి
- వాటిలో ఉన్న మావన హక్కుల అంశాలేమిటి?

BRAOU

13.1 పరిచయం

గత రెండు దశాబ్దాలుగా పాశ్చాత్య మరియు మూడవ ప్రపంచ దేశాల్లో వస్తున్న ఉద్యమాలను పరిశీలించినట్లయితే వాటిలో వస్తున్న కొన్ని మౌళిక మార్పులను గమనించవచ్చు. ఈ మార్పుల పంథాను అవి అవలంభించిన పద్ధతులను, వ్యూహాలను, వాటిలో పాత్రవహించిన శక్తులను, వాటి వెనక వున్న స్పృహను బట్టి ఈ ఉద్యమాలను నూతన సామాజిక ఉద్యమాలుగా నిర్వచించడం జరిగింది. ఈ ఉద్యమాలు, ఇంతకు పూర్వము ఉద్యమాలకు భిన్నంగా అంటే వర్గం కేంద్రంగా కాకుండా, ఉనికి అస్థిత్వం కేంద్రంగా వచ్చినటువంటివి. ప్రధానంగా పాశ్చాత్యదేశాల్లో వచ్చిన స్త్రీ ఉద్యమాలు, పర్యావరణ ఉద్యమాలు, బ్లాక్ మూవ్‌మెంట్ (Black Movement) అణు వ్యతిరేక (anti - nuclear agitations) ఉద్యమాలను నూతన సామాజిక ఉద్యమాలుగా పేర్కొనడం జరిగింది. భారతదేశంలో ఇటీవలికాలంలో వచ్చిన దళిత, స్త్రీ, ఆదివాసి ఉద్యమాలను కూడ నూతన సామాజిక ఉద్యమాలుగా గుర్తించవచ్చు.

నూతన సామాజిక ఉద్యమాల్లోని 'నూతన' అనేది కేవలం కాలానికి సంబంధించినది కాదు. అంటే ఈ ఉద్యమాలు కొత్తగా ఈ మధ్య కాలంలో వచ్చాయి. కాబట్టి వీటిని 'నూతన' అనడం లేదు. ఇంతవరకు అవలంభించిన తాత్వికదృక్పథాన్ని విడనాడి కొత్త తాత్విక, రాజకీయ, చారిత్రక అవగాహనను అనుసరించడం వల్లనే ఈ ఉద్యమాలకు నూతన సామాజిక ఉద్యమాలన్న పేరు వచ్చింది. వీటి స్వభావం, రాజకీయ తాత్విక అంశాలను చర్చించే ముందు చారిత్రక నేపథ్యం తెలుసుకోవడం అవసరం. అరవై దశకంలో ఫ్రాన్స్, అమెరికా, జర్మనీ ఇతర పాశ్చాత్యదేశాల్లో

వచ్చిన విద్యార్థి ఉద్యమాలు, దానికి అనుబంధంగా వచ్చిన ఇతర ఉద్యమాలు తర్వాతి కాలంలో వచ్చిన నూతన సామాజిక ఉద్యమాలకు ఊపిరి పోసాయి. ఈ ఉద్యమాలు సాంప్రదాయ మార్క్సిస్టు ఉద్యమ స్వరూపాలకు ఒక సవాలుగా నిలిచాయి. మార్క్సిస్టు ఆలోచన, ఆచరణ పంథాకు రెండు విషయాల్లో తీవ్ర అభ్యంతరం తెలిపాయి. (1) క్యాపిటలిస్టు వ్యవస్థలో వర్గదోపిడినే ప్రధాన సమస్యగా చేస్తు, ఇతర ప్రశ్నలను అంటే అదే వ్యవస్థలో దోపిడికి ఉన్న ఇతర సాంస్కృతిక రూపాలను పక్కకు నెట్టివేసే ధోరణులు (2) ఉద్యమాలను నడపడంలో కమ్యూనిస్టు పార్టీ గుత్తాధిపత్యం. స్టాలినిజం కేంద్రీకృత నిరంకుశ ధోరణులు, వాటిపై తీవ్ర విమర్శ రూపంలో వచ్చిన క్రిటికల్ థియరీ (Frankfurt School) మరియు జాన్‌పాల్‌సార్త్రె, కాము, రచించిన అస్థిత్వ వాదం (Existentialism) ఈ ఉద్యమాలకు ప్రేరేపితాలుగా పనిచేసాయి. అయితే ఈ ఉద్యమాల ఫలితంగా వచ్చిన న్యూలెఫ్ట్ ఉద్యమానికి ఇటీపల వచ్చిన నూతన సామాజిక ఉద్యమాలకు మధ్య ఉన్న తేడాలను గుర్తించవలసి ఉంది. న్యూలెఫ్ట్ ఆలోచన విధానం సాంప్రదాయ మార్క్సిజాన్ని వ్యతిరేకించినను అవి మౌళికంగా మార్క్సిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నాయి. నూతన సామాజిక ఉద్యమాలు ఒకవైపు మార్క్సిస్టు మరొకవైపు ఉదారవాద (ప్రధానంగా ప్రకార్యవాద) దృక్పథాలకు భిన్నంగా కనపడుతుంది. అవి ఎంతమేరకు భిన్నమైనవో తరువాతి భాగంలో పరిశీలించవచ్చు.

నూతన సామాజిక ఉద్యమాలను చర్చించే ముందు, అసలు సామాజిక ఉద్యమాలు అంటే ఏమిటి? వాటికి, రాజకీయ ఉద్యమాలకు మధ్య సిద్ధాంతపరంగా వున్నతేడా ఏమిటి? సామాజిక ఉద్యమాలపైన వున్న దృక్పథాలు, అవగాహనలు, అపోహలు చర్చించవలసిన అవసరం వుంది.

13.2 అర్థం - నిర్వచనం, స్వభావం

సామాజిక ఉద్యమాలకు ఒక నిర్దిష్టమైన, ఆమోదయోగ్యమైన నిర్వచనం ఇవ్వడం కష్టం. ఆయా దృక్పథాలను బట్టి వాటి నిర్వచనం మారుతువుంటుంది. అయితే ఈదృక్పథాలు ఏ సూచికల ఆధారంగా సామాజిక ఉద్యమాలను అవగాహన చేసుకుంటాయి అన్నది ప్రశ్న. కనుక ఈ దృక్పథాలను చర్చిస్తూ వాటి నిర్వచనాలను పరిశీలిద్దాం.

13.3 మార్క్సిస్టు దృక్పథం

మార్క్సిజం ఆర్థిక రంగంలోని వైరుధ్యాల ఆధారంగా సామాజిక ఉద్యమాలను అవగాహన చేసుకుంటుంది. బూర్జువా సమాజంలో శ్రమ - పెట్టుబడి మధ్య వున్న వైరుధ్యం ప్రధానమైనది. ఈ వైరుధ్యం పరంగానే శ్రామిక, పెట్టుబడిదారి మరియు ఇతర వర్గాలు ఏర్పడతాయి. శ్రామిక వర్గ నాయకత్వంలో పెట్టుబడి దారి వ్యవస్థలోని దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటాలను వర్గపోరాటం అంటారు. వర్గ పోరాట క్రమంలో వర్గచైతన్యం, శ్రామిక / కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కింద పోరాటాలు సాగించడం ప్రధాన అంశాలుగా మార్క్సిజం గుర్తిస్తుంది. అయితే మార్క్సిజం అన్ని సామాజిక ఉద్యమాలను ఇంచుమించుగా వర్గపోరాట దిశగా జరిగే పోరాటాలుగా గ్రహిస్తుంది. అంటే, సామాజిక ఉద్యమాలు అంతిమంగా వర్గలక్షణాలను కలిగివుంటాయి. సామాజిక ఉద్యమాలను సామాజిక ఘర్షణల ఫలితంగా గుర్తిస్తూనే వాటిని ఆర్థికరంగంలోని వైరుధ్యాలకు కుదించడం సాంప్రదాయ మార్క్సిస్టు దృక్పథంలో ప్రధాన అంశం.

20వ శతాబ్దపు మార్క్సిజం పరిణామ క్రమంలో న్యూలెఫ్ట్ భావాలు సామాజిక ఉద్యమాలపైన అవగాహనను పెద్ద ఎత్తున ప్రభావితం చేయడం 60, 70 దశకాల్లో చూస్తాం. స్టాలినిస్టు మార్క్సిజం నియంతృత్వ ధోరణులపై విమర్శ ఒక పక్క మారుతున్న పెట్టుబడిదారి వ్యవస్థ స్వభావంపై విశ్లేషణ మరోపక్క క్రిటికిల్ థియరీ ప్రధానంశంగా న్యూలెఫ్ట్ అవగాహనను ప్రభావితం చేసింది. (క్రిటికల్ థియరీ, అనే సిద్ధాంత రచనలు రెండు ప్రపంచ దేశ యుద్ధాల మధ్యకాలంలో, ఆ తర్వాతి కాలంలో జర్మనీలోని ఫ్రాంక్ ఫర్ట్ యూనివర్సిటీ కేంద్రంగా జరిగాయి. అందులో హోర్క్‌హైమర్, మార్క్యుజె, అడర్నో, బెంజమిన్ ప్రధాన పాత్ర వహించారు. వారి పరిశోధనల్లో ప్రధానంశం పెట్టుబడిదారి వ్యవస్థలోని దోపిడి రూపాలు ముఖ్యంగా అనేకరకాలైన పరాయికరణ ఆధారంగా ఉంటాయి. వారి రచనల్లో

BRAOU

పెట్టుబడిదారి వ్యవస్థ స్వభావం, భావజాలం పరాయికరణ ప్రధానాంశాలు.)

న్యూలెఫ్ట్ ఆలోచన పంథాలో సామాజిక ఘర్షణలు ఎల్లప్పుడు ఆర్థికపరమైన అంశాలపైననే ఆధారపడి వుండవు. ఇవరయ్యో శతాబ్దంలో పెట్టుబడి దారి వ్యవస్థ అనేక మార్పులకు లోనయింది. అందులో ముఖ్యంగా ఉత్పత్తి, పద్ధతుల్లో అంటే అంతకు పూర్వము ఉన్న కేంద్రీకృత ఉత్పత్తి పద్ధతులు (దాన్ని ఫ్యాక్టరిసిస్టమ్ అని, ఫోడిజం అని అంటారు.) మెల్లిగా క్షీణిస్తున్నాయి. కనీసం అవి క్యాపిటలిస్టు వ్యవస్థలో మునపటి స్థానంను కోల్పోయాయి. ఇప్పుడు వస్తున్న క్యాపిటలిస్టు వ్యవస్థను వారు పోస్ట్ ఫోర్డిజంగా క్యాపిటలిస్టు చరమదశగా (Late - capitalism), పోస్ట్ ఇండ్రస్టియల్ సొసైటీగా అభివర్ణిస్తారు. దీనిలో ముఖ్యంగా మూడు అంశాలను చూస్తాము. 1) ఉత్పత్తి పద్ధతుల వికేంద్రీకరణ (Assembly - line production) చెందటం 2) ఇన్ఫర్‌మేషన్ సొసైటి ఆవిర్భావం, 3) కాపిటల్ జాతీయ సరిహద్దులను దాటి, అంతర్జాతీయతను సంతరించుకోవడం. తద్వార అతను పూర్వము ఉన్న శ్రమ - కాపిటల్ (Labour - Capital - Contradiction) వైరుద్యం ప్రాధాన్యత కోల్పోవడం.

ఈ కారణంగానే పెట్టుబడిదారి వ్యవస్థలోని దోపిడి రూపాలు కూడా మార్పుకు గురవుతాయి. కాపిటలిజం పునాదులని కేవలం ఆర్థికపరంగానే కాకుండా సాంస్కృతిక, భావజాలపరంగా కూడ అర్థం చేసుకోవలసి వుంటుంది. న్యూలెఫ్ట్ సిద్ధాంతాల కృషి మార్క్సిస్టు దృక్పథంలో కొన్ని మౌళిక మార్పులను ప్రవేశపెట్టింది. 1) కాపిటలిస్టు వ్యవస్థలో దోపిడి ఆర్థిక సాంస్కృతిక, రాజకీయ రూపాలు కలిగి వుంటుంది. ఆర్థికాంశాలు, ఇతర దోపిడీలకు పునాది కానక్కరలేదు. సాంస్కృతిక రంగం ప్రస్తుత కాపిటలిస్టు వ్యవస్థ స్వభావరీత్యా స్వయం ప్రతిపత్తి (Autonomous) కలిగి వుంటుంది.

2) సామాజిక ఘర్షణలను వివిధ దోపిడి రూపాల కనుగుణంగానే అర్థంచేసుకోదలచి వుంటుంది. అంటే స్త్రీ వివక్ష, జాతి వివక్ష, కులవివక్ష పర్యావరణ సమస్యలు బూర్జువా వ్యవస్థలో భాగంగా గుర్తిస్తూనే, వాటిని అర్థంచేసుకోవడంలో ఆర్థికపరమైన నిర్మాణాత్మక సంబంధాలని బట్టికాకుండ, ఆయా స్థానాల్లోని దృక్కోణాలని ప్రధానం చేస్తుంది. 3) సామాజిక ఉద్యమాలను, వర్గపోరాటాలుగా గుర్తించకుండ, సాంస్కృతిక రంగంలోని సంఘర్షణల ఫలితంగా భావిస్తోంది. అంటే సామాజిక ఉద్యమాలను పౌర సమాజంలోని వివక్షలకు వ్యతిరేకంగా పోరాటాలుగా గుర్తిస్తోంది. ఎర్నెస్టోలాక్ల ఫ్రెడరిక్ జేమ్‌సన్, శాంతల్ మౌఫ్ న్యూలెఫ్ట్ భావాలు ప్రతిపాదించిన వారిలో ముఖ్యులు.

13.4 నిర్మితి - విధుల దృక్పథం (స్ట్రక్చరల్ - ఫంక్షనలిస్టు దృక్పథం):

ఉదారవాద దృక్పథంలో భాగంగా స్ట్రక్చరల్ ఫంక్షనలిజం సమాజాన్ని రాజకీయాలను విశ్లేషిస్తాయి. సమాజనిర్మాణం వ్యక్తుల హేతువు. ఆధారంగా జరుగుతుంది. నిర్దష్టమైన రాజకీయ నిర్మాణంలో వ్యక్తుల హేతుబద్ధమైన పోటి ద్వార సామాజిక,చ ఆర్థిక వనరుల పంపకం జరుగుతుంది. అయితే ఈ పోటీలో వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య ఘర్షణ అనేది సహజం. సామాజిక ఘర్షణలు వనరుల పంపకాలకు సంబంధించినటువంటిది. అయితే ఘర్షణలను తీర్చేప్రక్రియ అంతిమంగా వ్యవస్థలోని ప్రభుత్వ యంత్రాంగంతో ముడిబడి వుంటుంది. వ్యవస్థ స్థిరత్వం లక్ష్యంగా, సమాజంలోని అన్ని అంశాలను పరిశీలిస్తుంది. తార్కికంగా చూసినట్లయితే ఈ దృక్పథం ఉద్యమాలపై ఆదిలోనే ఒక పరిమితి విధిస్తుంది. ఈ దృక్పథం సామాజిక ఉద్యమాలను అర్థం చేసుకోవడంలో సామాజిక ఘర్షణలను ఒక ముఖ్యాంశంగా గమనిస్తూనే, ఈ ఉద్యమాలను వ్యవస్థ స్థిరత్వమునకు అవాంతరంగా పరిగణిస్తుంది. ఎప్పటివరకైతే ఈ ఉద్యమాలు వ్యవస్థలో సమూలమైనటువంటి మార్పులు కోరకుండ, వ్యవస్థ సంస్కరణలకోసం పోరాటాలు సాగిస్తాయో వాటిని హేతుబద్ధమైనవిగా గుర్తిస్తాయి. ఈ దృక్పథం సామాజిక ఉద్యమాల అవగాహనలో ముఖ్యంగా మూడు అంశాలను పేర్కొంటాయి. 1) అన్నిసామాజిక ఉద్యమాలు సామాజిక ఘర్షణల్లోంచి ఉత్పన్నమవుతాయి. ఇవి వ్యక్తుల హేతువుకు లోబడి పనిచేస్తాయి. 2) అన్ని ఉద్యమాలు సామాజిక మార్పుదిశగా పనిచేస్తాయి. అయితే మార్పు అనేది రాజకీయ వ్యవస్థ స్థిరత్వం అనే చట్రంలోనే కదులుతుంది. 3) అన్ని సామాజిక ఉద్యమాలు ఒక సమిష్టి చర్యగా గుర్తిస్తాయి. సమిష్టిచర్య రెండురకాలుగా ఉంటుంది. వ్యవస్థీకృత సమిష్టి చర్య హేతుబద్ధమైనదిగాను, అవ్యవస్థీకృత సమిష్టిచర్యను ఒక గుంపులక్షణంగాను, అహేతుకమైనదిగాను గుర్తిస్తుంది. దీనిని ప్రతిపాదించిన వారిలో స్మెల్సర్ ముఖ్యుడు.

BRAOU

13.5 సాంప్రదాయిక అవగాహన

సామాజిక ఉద్యమాలను సాధారణంగా సమాజంలోని అనేకరకాలైన అణచివేతకు వ్యతిరేకంగా సాగించే ప్రజాపోరాటాలుగా అర్థం చేసుకొంటారు. అణచివేత రూపాలను బట్టి ఉద్యమాలను వర్గీకరిస్తారు. అంటే వాటిని వర్గపోరాటాలు, కుల ఉద్యమాలు, స్త్రీ ఉద్యమాలు, పర్యావరణ ఉద్యమాలు మొదలగునవిగా పేర్కొంటారు. అదేవిధంగా వాటి నేపధ్యాల రీత్యా రాజకీయ ఉద్యమాలు, సామాజిక ఉద్యమాలుగా వర్గీకరిస్తారు. అయితే సామాజిక ఉద్యమాలను సమాజశాస్త్ర అధ్యయనంలో కాని, రాజకీయ శాస్త్ర అధ్యయనంలోకాని ఒక ప్రత్యేక పరిశోధనాంశంగా గుర్తించక పోవటం వల్ల వాటిని అర్థంచేసుకోవడంలో సైద్ధాంతిక అగాహనలోపం కనపడుతుంది. ఆకారణంగానే రాజకీయ ఉద్యమాలను కొన్నిసార్లు పేర్కొంటారు. ఏదైనను సాంప్రదాయ అవగాహన రాజకీయ ఉద్యమాలను సామాజిక ఉద్యమాలతో అంతర్భాగంగానే చూస్తుంది. అంటే ప్రతిసామాజిక ఉద్యమం సామాజిక సమస్యతో మొదలయి రాజకీయ ఉద్యమంగా రూపాంతరం చెందుతుంది. అంటే సమస్యను రాజ్యం పరిధిలో సాధించడానికి ప్రయత్నిస్తుంది. సాప్రదాయ అవగాహనలో రాజ్యం సామాజిక మార్పునకు అతి ప్రధానం ఉద్యమాలు పార్టీ నాయకత్వంలో జరగాలి అనే లెనినిస్టు భావాలు భారతదేశంలోని కమ్యూనిస్టుపార్టీల్లో కనపడుతుంది.

సామాజిక ఉద్యమాలు ముఖ్యంగా సమాజంలోని అనేక రకాలైన సమస్యల నుండి ఉత్పన్నమవుతున్నాయి. వీటిలో ప్రధానాంశాలు: ఆయా సమస్యలకు సంబంధించిన ఘర్షణలు, ఆయాశక్తులు సమస్యలపై పోరాడే క్రమంలో రూపొందించుకునే సమిష్టిచర్య. నిర్దిష్టమైన సామాజికశక్తులు (determinate Social agents) ఉద్యమాన్ని నడపడానికి అవసరమయ్యే సంస్థ మరియు సమస్యకు సంబంధించిన స్పృహ, ఉద్యమలక్ష్యాలు మరియు కార్యాచరణ ప్రణాళికలు. పైనపేర్కొన్న అంశాలకు తోడు నాయకత్వం మరియు ఉద్యమాన్ని నిర్దేశిస్తున్న సామాజిక మార్పు దిశగా కదులుతున్నప్పుడు దాని లక్ష్యాలు తాత్కలికమైనవా లేక శాశ్వత/సంపూర్ణమైనవా అనే చర్చ ప్రధానమైనది. మొదటి విషయంలో ఉద్యమ లక్ష్యాలు పరిమితమైనవిగాను అంటే వారి కోర్కెలు తీరగానే ఆ ఉద్యమం ఆగిపోతుంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవలి కాలంలో వచ్చిన సారావ్యతిరేక ఉద్యమం, లేక విద్యార్థి కోర్కెల ఆధారంగా వచ్చిన అనేక విద్యార్థి ఉద్యమాలు .అయితే ఈ ఉద్యమాలు ఆయా తార్కిక సంబంధాలను బట్టి సంపూర్ణ మార్పుకోరే ఉద్యమాలకు ప్రేరకాలుగా పనిచేస్తాయి. సారావ్యతిరేక ఉద్యమం సారానిషేదం తర్వాత అంతరించిన మాట నిజమే అయిన, ఇది ఇతర స్త్రీ ఉద్యమ పురోగతిలో ముఖ్యమైన దశగా భావించబడుతుంది. ఎందుకంటే సారావ్యతిరేక వుద్యమంలో ప్రధానపాత్ర వహించిన స్త్రీలు, స్త్రీ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చారు. సమాజంలో సంపూర్ణ మార్పు కోరే ఉద్యమాలు దీర్ఘకాలికంగాను, అన్ని చారిత్రక దశల్లోను వర్గదోపిడికి వ్యతిరేకంగా ఉద్యమిస్తాయి. వాటి అంతిమలక్ష్యం వర్గరహిత సమాజం. ఈ లక్ష్యాన్ని సాదించేవరకు ఈ ఉద్యమాలు కొనసాగుతాయి. కులవ్యతిరేక పోరాటాలు (Anti-caste movement) కూడా ఒక విధంగా సంపూర్ణకుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడే ఉద్యమాలుగా వ్యాఖ్యానిస్తారు.

అయితే సామాజిక ఉద్యమాల ఎదుగుదలను పరిశీలించినపుడు వాటిలో హెచ్చుతగ్గులు, ఒకదశకు చేరుకుని ఆగిపోయి మళ్ళీకొనసాగడం కనపడుతుంది. ఉదాహరణకు భారతదేశంలో రైతు ఉద్యమాలను అవగాహన చేసుకోవాలంటే వివిధ దశల్లో అంటే స్వాతంత్ర్యానికి పూర్వం మరియు తరువాత కాలంలో అని లేవనెత్తిన ప్రశ్నలు, సమస్యలను గమనించాలి. స్వాతంత్రానికి పూర్వం రైతులు జాతీయోద్యమంలో అంతర్భాగంగాను మరియు ఆవల భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగాను సాగించిన పోరాటాలు చంపారన్, తేభాగ, మొపిల్లారైతు ఉద్యమాల్లో చూస్తాము. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భూసంస్కరణల కోసం భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా వచ్చిన రైతు ఉద్యమాలు ఒకపక్క. సబ్సిడీల కోసం, గిట్టబాటు ధరలకోసం, మార్కెటు సౌలభ్యాలకోసం చేసిన పోరాటాలు ఇంకొక పక్క ఇక్కడ ఉదహరించవచ్చు. అయితే ఆయాదశల్లో వాటి ఎదుగుదలను బట్టి ఉద్యమాలు వేసే ప్రశ్నల్లో మార్పు వస్తుంది. అదేవిధంగా వాటినిర్మాణంలో, వాటి సిద్ధాంతాల్లో మారుతున్న సామాజిక, ఆర్థిక రాజకీయ నేపధ్యాల రీత్యా మార్పువస్తుంగి.

సామాజిక ఉద్యమాల ఇంకొక ముఖ్యలక్షణం ఏమిటంటే ఒక ఉద్యమంలోని చైతన్యం ఇంకొక ఉద్యమానికి

BRAOU

స్ఫూర్తినిస్తాయి. రైతు ఉద్యమంలోని చైతన్యం వలన దళిత ఉద్యమాలు, వెనుకబడ్డకులాల ఉద్యమాలు ప్రభావితంచెందాయి. అదే విధంగా కులపోరాటాలు స్త్రీ ఉద్యమంలో కొన్ని కులపరమైన మౌళిక ప్రశ్నలు లేవనెత్తాయి. పార్లమెంటు, అసెంబ్లీ మరియు ఇతర స్త్రీ రిజర్వేషన్లకోసం జరిగే పోరాటాల్లో స్త్రీలలో కుల ప్రాతిపదికగా రిజర్వేషన్ల అమలుకోసం లేవనెత్తిన ప్రశ్న మనకు కనబడుతుంది.

సామాజిక ఉద్యమరూపాలు రెండు విధాలుగా వుంటాయి: 1) ప్రత్యక్షచర్య (Direct - action) దీనిలో ఆందోళనలు, ఊరేగింపులు, హర్తాళ్ళు, బంద్‌లు మొదలగునవాటిని పేర్కొంటారు. 2) ఉద్యమాలు ప్రభుత్వాలపై, సమాజ నిర్మాణాలపై, విలువలపై పరోక్షంగా అప్పీళ్ళరూపేణ, చర్చల రూపేణ వత్తిడిలు తీసుకొచ్చి సమాజ మార్పుకు దోహదం చేస్తాయి. దీనిని సాధారణంగా అహింసాత్మకమైనదిగా పేర్కొంటారు.

చార్లెస్ టిల్లి మాటల్లో చెప్పాలంటె సామాజిక ఉద్యమాలంటే - ఒక సామాజిక అంశంపై జనసమీకరణ నుండి విప్లవం వరకు జరిగే ప్రక్రియ. అంటే సమాజంలోని అణచివేతకు, ఆధిపత్యానికి వ్యతిరేకంగా వచ్చే ప్రజాపోరాటాలు మొదటగా జనసమీకరణలో మొదలయి ఒక సమిష్టిచర్యగా రూపుదిద్దుకుంటుంది. ఈ ప్రక్రియలో నాయకత్వము, సంస్థలు (Organisation) సమస్యపట్ల చైతన్యము, ఒక నిర్దిష్టమైన కార్యాచరణ, ప్రణాళిక, పోరాట పద్ధతులు, ఆఖరున విప్లవంతో ఉద్యమంలో అంతిమ దశను చేరుకుంటుంది.

చివరగా సాంప్రదాయ అవగాహనలో సామాజిక ఉద్యమాలన్ని ఒక ఏకీకృతఘర్షణనే మూలంగా కలిగివుంటాయి. సామాజిక ఉద్యమాలు ఒక్కోదశలో ఒక్కో రూపాన్ని కలిగివున్న సమాజనిర్మాణాన్ని బట్టి. ఈ ఘర్షణలన్ని సార్వజనీన సూత్రాల ప్రాతిపదికగ ఒకదానిలో ఒకటి ముడిపడి వుంటాయి. ఉదాహరణకు, ఆధునికత, హేతువు సూత్రాల ఆధారంగా ఉద్యమాలు సాగుతాయి. ఇంకొకమాటలో చెప్పాలంటే, సామాజిక మార్పుకై చేసే పోరాటాలన్ని సాంప్రదాయ వ్యవస్థలని రుగ్మతలను పారద్రోలే ప్రయత్నాలుగా గుర్తిస్తోంది. దానిలో హేతువు ఆధారంగా ఆధునికత దిశగా మార్పుచెందుతుంది.

13.5.1 వనరుల సమీకరణ సిద్ధాంతం :

ఈ సిద్ధాంతము వుదారవాద దృక్పథంలో కొన్ని మౌళిక మార్పులను తెస్తుంది. సమిష్టి చర్య హేతువు ఆధారంగా సామాజిక మార్పుకు దోహదపడుతుంది. ఉదారవాదం చెప్పినట్లు ఉద్యమం అనేది అహేతుకం కాదు. అన్ని ఉద్యమాలు కూడ అయా ప్రాతిపదికలుగ తమవనరులను సమకూర్చుకుంటాయి. ఒక క్రమ బద్ధమైన, హేతుబద్ధమైన ప్రణాళికతో ఉద్యమాలు ముందుకు పోతాయి. వనరులను సమాకూర్చుకొను క్రమంలో సమిష్టిచర్య తమ సమస్యలపట్ల సమగ్రమైన అవగాహనలో, చైతన్యంతో ఉద్యమాలను నడుపుతుంది. క్లుప్తంగా, అన్ని ఉద్యమాలు తమ సమస్యల పట్ల చైతన్యం లో ఏర్పడిన సమిష్టిచర్యగా మరియు హేతువు ప్రాతిపదికగా ఉద్యమాలు వనరులను సమకూర్చుకుంటాయని ఈ సిద్ధాంతం పేర్కొంటుంది. ఈ సిద్ధాంత రచనల్లో మెక్‌తడమ్, మెక్‌కార్తి. జేల్డ్ రచనలు ముఖ్యమైనవి.

13.6 నూతన సామాజిక ఉద్యమాలు - అవగాహన:

నూతన సామాజిక ఉద్యమాలు మొదట చెప్పినట్టు వీటిలోని నూతనత్వం వాటి నేపథ్యంలోను, తాత్విక విచారంలోను, పద్ధతులలోను, లక్ష్యాలలోను ఉంటుంది. అయితే, సాంప్రదాయ సామాజిక ఉద్యమాలైనా మౌళికంగా సామాజిక మార్పుకై మరియు అణచివేతకు వ్యతిరేకంగా పోరాటాలు సాగిస్తాయి. సైద్ధాంతికంగా చూసినట్లయితే వాటి స్వభావరీత్యా ఉండేతేడాలు స్పష్టమవుతాయి.

నూతన సామాజిక ఉద్యమాలను పరిశీలిస్తే రెండు దోరణులు ప్రధానంగా కనబడతాయి సమాజంలోని అనేకరకాలైన ఆధిపత్యరూపాలను (సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ) ఎదుర్కొనే క్రమంలో రాజ్యాధికారం కేంద్రంగా కాకుండ, ఫొర సమాజంలోని సంబంధాలపై ఈ ఉద్యమాలు దృష్టిసారిస్తాయి. అంతేకాకుండ ఈ ఉద్యమాలు

BRAOU

రాజ్యముకున్న కేంద్రీకృత లక్షణాన్ని మరియు పౌరసమాజంలో తన జోక్యాన్ని నిరసిస్తాయి. 1) తమ ఉనికిని నిర్వచించుకొనే క్రమంలో తమ హక్కులకై, వనరులసాధనకై పోరాడుతాయి. హక్కులు, వనరుల పంపకం తమ ఉనికి నిర్వచనం పైన ఆధారపడతాయి. అంటే వీటిని ఒక విధంగా గుర్తింపు ఉద్యమాలుగా (Identify movements) పేర్కొనవచ్చు. ఈ రెండుదోరణులు ఈ ఉద్యమాలలో ఏకకాలంలో కనిపిస్తాయి. నర్మదబచావో అందోళన్ (NBA) లాంటి పర్యావరణ ఉద్యమం నర్మదా డ్యాం నిర్మాణంను ఆపుచేసే ప్రయత్నాలలో మనకు కొన్ని విషయాలు విదితమపుతాయి. ● తమ ఉనికిని నిర్వచించుకొనే క్రమంలో ఆదివాసిల జీవన విధానాల్లోని ప్రత్యేకత - సాంస్కృతిక విలువలు, రాజకీయ ఆర్థిక పద్ధతులు. ● తమ ప్రాంతంలో తాము నివసించే హక్కు. ● తమ వనరులపై (అడవికి సంబందించిన వనరులు) తామే హక్కు, అధికారం కలిగి వుండటం. ● ఇవన్నీ కలిపి ఉద్యమ రూపంలో ప్రభుత్వం మరియు ఇతర సంస్థలపై వత్తిడి తేవటం. ● రాజ్యం యొక్క అభివృద్ధి విధానం (Development model) పై మరియు దాని పరిణామాలపైన చర్చను ఎంజెడా (Agenda) పైకి తీసుకురావటం.. ● నర్మద ఆందోళన ఒకవైపు పర్యావరణ ఉద్యమం, ఇంకొకవైపు ఆదివాసిల ఉద్యమ రూపాలను కలిగి ఉంటుంది. ● నర్మద రాజకీయ వ్యవస్థలో అంతకుముందే పనిచేస్తున్న వ్యవస్థల ద్వార అంటే రాజకీయ పార్టీల ద్వారా కాకుండ తమకు తామే ఏర్పరుచుకున్న సంస్థ ద్వార ఉద్యమాన్ని సాగించడం.

నూతన సామాజిక ఉద్యమాలు కొత్త సమస్యలకు స్పందిస్తు వచ్చిన ఉద్యమాలుగా పేర్కొంటారు. కాపిటలిజంలో దోపిడీ, అణచివేత రూపాలు మారుతున్న కారణంగా ఉద్యమపద్ధతుల్లో, అవగాహనలో కూడ మార్పులు అవసరం. ఉదాహరణకు భారతదేశంలోరైతు ఉద్యమాలు ఇప్పుడు ముఖ్యంగా మార్కెట్ మార్పులపైన దృష్టి సారిస్తున్నాయి. భూసంస్కరణలు లాంటి ప్రశ్నలు కాకుండ, గిట్టుబాటుధరలు, మార్కెట్ పైన రైతుల కంట్రోలు మొదలైనవి మహారాష్ట్రలోని షెట్‌కార్ సంఘటనకాని, కర్నాటక రైతు సంఘంకాని, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని మహేంద్ర తికాయత్ రైతు ఉద్యమం కాని ఈ ప్రశ్నల్ని ఇటీవలి కాలంలో పెద్దఎత్తున లేవనెత్తి జనసమీకరణ చేసాయి. అదేవిధంగా ఈ ఉద్యమాలన్నీ గ్లోబలైజేషన్ ప్రక్రియపైన వాటి పరిణామాలపైన మంచి చైతన్యం కలిగి వుంటాయి. అయితే భారతదేశం లాంటి మూడవ ప్రపంచ దేశాల్లో ఉన్న పరిస్థితులరిత్యా అంటే ఎక్కడయితే భూసంస్కరణలు అమలుకాలేదో, భూమి కొందరి చేతుల్లోనే కేంద్రీకృతం అయ్యిందో (Concentration of land holdings) భూసంస్కరణలు, వ్యవసాయ కూలీల వేతనాలు ముఖ్యప్రశ్నలుగా మిగిలి ఉంటాయి. అందువలననే నూతన సామాజిక ఉద్యమంగా పేర్కొనే ఈ రైతు ఉద్యమాలు కేవలం ధనికరైతు ఉద్యమంగా తేల్చిచెప్పే విమర్శ కూడ ఉంది.

నూతన సామాజిక ఉద్యమాలు ముఖ్యంగా పాశ్చాత్యదేశాల్లో వనరుల పంపకమే ప్రధానంగా కాకుండ. జీవన ప్రమాణాలు, పనిచేసే పరిస్థితులలోని పరాయికరణకు వ్యతిరేకత మరియు ఆరోగ్యం, నీరు, విద్యలాంటి జీవనావసరాలు కొరకై, వాటినే ప్రధాన ప్రశ్నలుగా పోరాటాలు సాగిస్తున్నాయి.

వీటి అవగాహనలో సాంప్రదాయ ఉద్యమాలు కొన్ని అణగారిన సామాజిక సమూహాలను (Social sections) పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, వాటికి ఇవ్వాల్సిన స్థానం ఇవ్వలేదు. ఈ అణచివేరయబద్ధశక్తులు పోరాటాల్లో పాల్గొన్నప్పటికి, అవి చారిత్రక నిర్లక్ష్యానికి గురి అయ్యాయి. అందుచేతనే వీటికి సంబంధించిన ప్రశ్నలు, ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. ఈ తప్పిదం వర్గప్రధానంగా జరిగే మార్క్సిస్టు పోరాటాల్లో ప్రధానంగా ఉంటుందని నూతన సామాజిక ఉద్యమాలు పేర్కొంటాయి. ఆకారణంచేతే వర్గప్రధానమైనటువంటి ఉద్యమాల్లో దళితుల, స్త్రీల, రైతుల, ఆదివాసిల ప్రత్యేక సమస్యలను పట్టించుకోకపోవడమే కాకుండ, ఆసమస్యలకున్న ప్రత్యేకతను కూడ హరించివేసాయి. ఆకారణంగానే స్త్రీ, దళిత ఆదివాసి, పర్యావరణ, బ్లాక్ మూవ్‌మెంట్స్ లాంటి ఉద్యమాలు పాశ్చాత్య మరియు మూడవ ప్రపంచదేశాల్లో నూతన సామాజిక ఉద్యమాలుగా తమ ఉనికిని ప్రత్యేకతను పరిరక్షించుకుంటు తమ సమస్యలను తామే సాదించుకునేందుకు ముందుకు వచ్చాయి. ఈ ఉద్యమాలు ఒక్కమాటలో చెప్పాలంటే వర్గవిశ్లేషణకు మార్క్సిస్టు తరహా వ్యతిరేకి. ఆయారంగాల్లో అణచివేత రూపాన్ని బట్టి, ఆయా సమస్యలకు ప్రత్యేకత వుంటుంది. సమాజంలో ఉండే స్థానాలను బట్టి ఆ

BRAOU

ఉద్యమాలకు స్వయం ప్రతిపత్తి ఉంటుంది. అంటే తమరంగాల్లో ఉన్న అణచివేత స్వభావంపై అవగాహన, సిద్ధాంతీకరణ తామే రూపొందించుకోవడం. ఈ ఉద్యమాలు 'తమ' 'పర' భేధాలపై స్పష్టమైన అవగాహనతో ఒక గుర్తింపును కలిగివుంటాయి. ఈ గుర్తింపు ప్రాతిపదికగా తమ మక్కులకై పోరాడుతాయి.

సాంప్రదాయ ఉద్యమాలకు, నూతన సామాజిక ఉద్యమాలకు సిద్ధాంత పరంగా వున్న తేడాను పరిశీలించవలసి వుంది. సాంప్రదాయ ఉద్యమాలు సామాజిక మార్పులలో రాజ్యం కీలకపాత్ర వహిస్తుంది అనే అవగాహన కలిగి వుంటుంది. అందుకే ఈ ఉద్యమాల్లో రాజ్యాధికారం ప్రధానాంశం అవుతుంది. ఈ ఉద్యమాలు సామాజిక అంశాలతో మొదలైనప్పటికి తార్కికంగా చూసినట్లయితే అవి రాజకీయ ఉద్యమాలుగా రూపుదిద్దుకోవడం ఖాయం. ఆ కారణం చేతనే రాజకీయ పార్టీలు ఈ ఉద్యమాలను నడపడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

ఇకపోతే నూతన సామాజిక ఉద్యమాలు పౌరసమాజం మరియు రాజ్యము మధ్య విభజన రేఖను గీస్తూ, స్పష్టమైన తేడాను గ్రహిస్తాయి. రాజ్యమును ఒక ముఖ్యాంశంగా పేర్కొంటూనే, తమ ఉద్యమాలను పౌరసమాజంలోని సంబంధాలను కేంద్రంగా చేసుకొని నడిపిస్తాయి. అంటే రాజ్యం బోక్యం ద్వార సామాజిక మార్పుకొరకుకాకుండా, తామే స్వయంగా పౌరసమాజంలోని అణచివేత సంబంధాలలో మార్పు తీసుకురావడానికి కృషిచేస్తాయి. రాజకీయ వ్యవస్థ ఆవల రాజకీయ పార్టీల కతీతంగా ఉద్యమాలను నడుపుతాయి. తమకు తాము ఏర్పరచుకున్న సంస్థలు, సంఘాల ద్వారా సమిష్టి ఏర్పాటు ఉద్యమాల్ని నడపడం చేస్తాయి. ఒక్కోసారి ఈ ఉద్యమాలలోని శక్తులు ఎన్నికలలో పాల్గొన్నప్పటికి, అవి రాజకీయ పార్టీల ద్వారా కాకుండ తమ సంస్థల ద్వారానే పోటీ చేస్తాయి. అంటే తమ ఉద్యమాల ఉనికి, గుర్తింపుకు ఒక ప్రతిపత్తి ఉందటం ప్రధానాంశంగా గుర్తిస్తాయి. క్లుప్తంగా చెప్పాలంటే రాజకీయ పోరాటాలు ఈ ఉద్యమాల్లో ప్రధానం కాదు. అందుచేతనే కొంతమంది పరిశీలకులు ఈ ఉద్యమాలను రాజకీయ అతీత (Apolitcal) ఉద్యమాలుగాను కొందరు "పార్టీయేతర రాజకీయ ప్రక్రియ" (Non-party Political Process) గా వ్యాఖ్యానిస్తారు.

13.7 నూతన సామాజిక ఉద్యమాల ముఖ్య లక్షణాలు

పౌర సమాజం మరియు రాజ్యము మధ్య సిద్ధాంత పరంగా విభజన రేఖను గీస్తూ, పౌరసమాజంలో తమ ఉనికికి ప్రత్యేక ప్రతిపత్తి కోరుకుంటాయి. ఈ క్రమంలో దళిత ఉద్యమాలు, స్త్రీ ఉద్యమాలు మొదలగునవి. ఒక ప్రత్యేకమైన 'గుర్తింపు' (Identify) గా ఏర్పడి తమ సమస్యలను తామే వ్యక్త పరుస్తు పోరాటాలు సాగిస్తాయి. వీటిలో రాజ్యాధికారం కంటే పౌర సమాజంలో తమకు ప్రత్యేక గుర్తింపు సాధించటం, దాని ఆధారంగా తమ హక్కులను పొందటం ప్రత్యేక గుర్తింపు సాధించటం, దాని ఆధారంగా తమ హక్కులను పొందటం ముఖ్యమవుతుంది.

నూతన సామాజిక ఉద్యమాలు వర్గేతర లక్షణం ప్రముఖంగా కలిగి ఉంటుంది. అంటే ఈ ఉద్యమాల అవతరణలో, నడిపే విధానంలో సమస్యల అవగాహనలో ఆర్థికపరమైన అంశాలు కేంద్రంగా కాకుండా, సాంస్కృతికపరమైన దృక్పథం ఉంటుంది. ఈ ఉద్యమాలను వర్గపోరాటంలో భాగంగా గుర్తించి, వాటి ప్రత్యేకతను నిర్లక్ష్యం చేసే మార్క్సిస్టు ధోరణిని నిరసిస్తాయి.

ఈ ఉద్యమాల రచనలో అంతర్గత శక్తులు (Organic Forces) ప్రముఖ పాత్ర వహిస్తాయి. అంటే తమ ఉద్యమాలలోనుంచి ఉద్భవించి, ఆ ఉద్యమాలను నడిపేశక్తులు, i.e. అందులోనుంచివచ్చిన మేధావులు, నాయకత్వం (Organic Intellectuals, and Organic Leadership) తమ ప్రత్యేకతను కాపాడుకునే క్రమంలో బాహ్యశక్తుల జోక్యాన్ని అడ్డుకొంటాయి. తమ గుర్తింపున్ను కాపాడుకోవడంకోసం అంతర్గత మరియు బాహ్యశక్తుల మధ్య స్పష్టమైన విభజనరేఖను ఏర్పరచుకుంటాయి.

ఈ ఉద్యమాలు రాజకీయ పార్టీల కతీతంగా వాటి ప్రమేయం లేకుండ పనిచేస్తాయి. ఇక్కడ మనం గ్రహించాల్సిందేమంటే వాటి చారిత్రానుభవాల రీత్యా రాజకీయ పార్టీలలాంటి సాంప్రదాయ వ్యవస్థలన్ని వీరి సమస్యలకోసం పోరాడటంలో

BRAOU

విఫలం అవటం. అందుకే దళిత స్త్రీ, పర్యావరణ ఉద్యమాలు, ప్రాంతీయ ఉద్యమాలు మనదేశంలోని రాజకీయాలలో ఈ మధ్యకాలంలో గననీయమైన మార్పును తీసుకొచ్చాయి. ముఖ్యంగా ఎన్నికల రాజకీయాలలో పార్టీలు మునపటిలా ఈ సామాజిక శక్తులను కేవలం 'ఓట్ బ్యాంకు' లాగ కాకుండ, చైతన్యపూరిత శక్తులలాగ గుర్తించవలసి వచ్చింది. ఈ పరిణామం మనకు ఇటీవల వచ్చినిలచిన సంకీర్ణ రాజకీయాలలో, ప్రభుత్వాలలో స్పష్టంగా కనపడుతుంది. ఈ ఉద్యమాలలో ఆవలిశక్తులు అంటే రాజకీయపార్టీలు తమను విలీనం చేసుకోవడాన్ని అడ్డుకునే ధోరణి స్పష్టంగా ఉంటుంది.

ఈ ఉద్యమాలు సాధారణంగా ఒక స్పష్టమైన పరిధిని కలిగి వుండి, ఆపరిమితిలోనే పనిచేస్తాయి. వాటి సమస్య ప్రధానంగా పోరాటాలు చేస్తాయి. దళిత ఉద్యమాలు దళితుల సమస్యను అంటే కులవ్యవస్థ, అస్పృశ్యత, దళితుల ఆత్మగౌరవం, వారిసామాజిక స్థానం లాంటి సమస్యలు ప్రధానంగా ఉంటాయి. అయితే అప్పుడుప్పుడు ఈ ఉద్యమాలు ఇతర గుర్తింపు ఉద్యమాలతో కూటమిగా ఏర్పడి ఆయా ఉద్యమాలు తమ ప్రతిపత్తి కోల్పోకుండ ఉండటానికి ప్రయత్నిస్తాయి. క్లుప్తంగా ఈ ఉద్యమాలన్ని తమ అవగాహన రిత్యా స్థానిక తత్వాన్ని (Localism) కలిగి ఉంటాయి.

ఈ ఉద్యమ పద్ధతులలో కొన్ని సార్లు స్పష్టమైన ప్రణాళిక వ్యూహంతో కాకుండ, అప్పటి కప్పుడు తెలెత్తే (Spantaneous) పోరాటాలుగా కనిపిస్తాయి. అంటే ఉద్యమాలను నిర్వచించే క్రమంలో సాధారణంగా ఉపమోగించే అంశాలు - నిర్దిష్ట అవగాహన, చైతన్యం, ఉద్యమాన్ని నడిపే నిర్దిష్టనాయకత్వం, సంస్థలు - ఇవేవి లేకుండ వచ్చే ఉద్యమాలను స్పాంటేనియస్ ఉద్యమాలని అంటారు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల వచ్చిన సారావ్యతిరేక పోరాటం మొదట్లో ఎటువంటి నాయకత్వం, నిర్మాణం లేకుండానే వచ్చింది. స్త్రీలు స్వచ్ఛందంగా ఎక్కువసంఖ్యలో పాల్గొన్నారు. తర్వాతి కాలంలో ఇది రాష్ట్రవ్యాప్తంగా విస్తృతమయ్యే క్రమంలో పార్టీలు. ఇతర సంస్థలు పాల్గొన్నాయి.

ఈ ఉద్యమాలు సాధారణంగా 'ఆధునికత' కున్న సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ రూపాలను వ్యతిరేకిస్తాయి. వీటి చారిత్రక అవగాహన ప్రకారం సమాజంలోని వివిధ సమూహాల మధ్య ఆధిపత్య సంబంధాలు ఆధునికతనుండే ఉద్భవిస్తాయి. వీటి ఉద్దేశంలో ఆధునికత తన అంత్యదశకు చేరుకున్నది. ఇప్పటి సామాజిక పరిస్థితి ఆధునికానంతర (Post-modernity) ని సృష్టపరుస్తుంది. అయితే ఈ ధోరణి ఎక్కువగా పాశ్చాత్య దేశాల్లో కనబడుతుంది.

BRAOU

13.8 నూతన సామాజిక ఉద్యమాలు - మానవహక్కులు

నూతన సామాజిక ఉద్యమాలు మానవహక్కుల పోరాటాల్లో అవగాహనలో కీలకమైన మార్పులు తీసుకువచ్చాయి. మానవహక్కుల పోరాటాల్లో ఇది ఒక నూతన అధ్యాయంగా పేర్కొనవచ్చు. ఈ మార్పులను పరిశీలించాలంటే, వాటిమధ్యవున్న సంబంధాల్ని గమనించాలి. మానవహక్కులను వ్యక్తులు తమస్వేచ్ఛకై చేసే వ్యక్తీకరణగా చెప్పవచ్చు. ఈ ఉద్యమాలను - మానవహక్కుల వ్యక్తీకరణ కోణంలోచూసినప్పుడు రెండు అంశాలు కనిపిస్తాయి. అవి ఒకటి సాంఘిక అణచివేత నుంచి విముక్తి కాగా రెండోది రాజ్య అణచివేత నుంచి విముక్తి.

సమాజంలోని అనేక అణచివేతలనుండి విముక్తికోసం పోరాడే క్రమంలో వ్యక్తులు హక్కులను ఒకసాధనంగా చేసుకుంటాడు. అయితే మానవహక్కులను కేవలం ఒక సాధనంగా మాత్రమే చూడడానికి వీల్లేదు. ఆధునిక యుగంలో హక్కులను 'సాధనంగా' చూసే దశనుండి అవే 'లక్ష్యం' గా సాధించేదిశగా ఉద్యమాలను చూస్తాము. అంటే మానవహక్కుల సాధన అనేది స్వేచ్ఛాయుతమైన పరిస్థితుల సాధన అని అర్థము.

నూతన సామాజిక ఉద్యమాలు, మానవహక్కులు ఒకే నాణేనికి రెండువైపుల వంటివి. ఉద్యమాలు, హక్కులద్వారా తమ కోర్కెలను వ్యక్తం చేస్తూ సంబంధిత వనరులకై పోరాడుతాయి.

ఉదాహరణకు స్త్రీ ఉద్యమం సమాజంలో, రాజ్యంలో హక్కుల ద్వారా తమ న్యాయమైన స్థానం కోసం పోరాడుతాయి. అదేవిధంగా హక్కుల యొక్క అర్థం, నేపథ్యం ఉద్యమాలద్వారా మారుతూ వస్తుంది.

నూతన సామాజిక ఉద్యమాలు, మానవహక్కుల మధ్య సంబంధాలను మూడు విధాలుగా అర్థం చేసుకోవచ్చు. అవి :

1. నూతన సామాజిక ఉద్యమాలు మానవ హక్కుల దృక్పథంలో మౌళికమైన మార్పులు తీసుకొచ్చాయి. ఆధునిక యుగారంభంలో హక్కులను వ్యక్తిపరంగా రక్షణ కల్పించే సాధనంగా మాత్రమే చూసారు. అంటే సమాజం వ్యక్తుల సమూహంగా చూసే క్రమంలో వ్యక్తికి సమాజంలోని ఇతర వ్యక్తుల నుండి, రాజ్యం నుండి వచ్చే ప్రమాదాలనుండి రక్షణ కల్పించే కవచంగా చూసారు. అందుకే Classical liberalismలో హక్కులను వ్యక్తిపునాదిగా అర్థం చేసుకోంటారు. 19వ శతాబ్దంలో ప్రజా స్వామీకరణ క్రమంలో వచ్చిన హక్కుల పోరాటాలన్ని రాజకీయ, ఆర్థిక సామాజిక - కూడ వ్యక్తి కేంద్రంగా జరిగినవే. ఉదాహరణకు ప్రయివేటు ఆస్థిహక్కు, ఓటుహక్కు మొదలైనవి.

20వ శతాబ్దపు ఆఖరులో నూతన సామాజిక ఉద్యమాలు వ్యక్తి పునాదిగా వున్న హక్కులను సాముదాయిక హక్కులుగా మార్చి వేసాయి. ఈ మార్పు రెండవ దిశల్లో ఉంటుంది.

1) సామాజిక, ఆర్థిక, రాజకీయ వనరుల పంపకం వ్యక్తి పునాదిగా జన సమూహం ఆధారంగా జరగాలి. అంటే వ్యక్తిపరమైన హక్కుల (Individualist Rights) స్థానంలో సాముదాయిక హక్కుల భావనని ప్రవేశపెట్టాయి.
2) సమాజం వ్యక్తుల సమూహంగా కాకుండా సముదాయుల మధ్య ఉండే సంబంధాలుగా గుర్తించాయి. అంటే సమాజంలోని పొర సంబంధాలు సముదాయం ఆధారంగా ప్రజాస్వామీకరణ చెందటం. వీటికి స్త్రీవాద ఉద్యమాలు, దళిత ఉద్యమాలు మొదలైనవాటిని ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. సమాజంలోని అనేక వివక్షలను ఎత్తిచూపుతూ, తాము ఒక గుర్తింపు (Identify) గా, లేదా ఒక ప్రత్యేక సమూహంగా ఏర్పడుతూ, ఆయా నేపథ్యాల్లో సమాజ సంబంధాలను ప్రజాస్వామీకరించడం. అంటే స్త్రీ వివక్ష నేపథ్యంగా, కుల వివక్ష నేపథ్యంగా ప్రజాసంబంధాల్ని మల్చడం.

2. నూతన సామాజిక ఉద్యమాలు మానవ హక్కులను కేవలం సాధనాలుగా కాకుండా ఒక లక్ష్యంగా గుర్తించాయి. ఆయా మానవ హక్కులను సాధించడమే తమ పోరాటాల గమ్యాలుగా గుర్తించాయి. మానవహక్కులే లక్ష్యంగా పోరాడే ఉద్యమాల్లో మూడు విషయాలు గోచరిస్తాయి. 1) మానవ హక్కులు కలిగి ఉండటం అంటే మనిషి ఆస్థిత్వ లక్షణమైన ఆత్మగౌరవంతో జీవించడం. అందుకే ఉద్యమాల్లో ఆత్మగౌరవం ఆధారంగా తాము ఒక సామాజిక గుర్తింపు పొందడం ప్రధానమవుతుంది. ఇది ముఖ్యంగా సాంస్కృతికపరంగా బహిర్గతమవుతుంది. తమ వనరుల సాధన, సాధికారిక డిమాండ్లు (Legitimate demands) క్లుప్తంగా 'గౌరవ ప్రదమైన జీవనాన్ని ఆశించడం మానవ హక్కుల్ని కలిగి వుండటం అవుతుంది. అందుకే దళిత, స్త్రీ, నల్లజాతి మొదలైన ఉద్యమాలను సాధారణంగా 'ఆత్మగౌరవ' ఉద్యమాలుగా కూడా పేర్కొంటారు. 2) మానవ హక్కులను లక్ష్యంగా గుర్తించే ఉద్యమాలలో మానవ హక్కులను తమ వెనుక బాటుతనానికి గురిచేసిన పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యాలుగా గుర్తిస్తారు. అమర్త్యసేన్ దృష్టిలో మానవ హక్కులు వ్యవస్థలోని అనేక అణచివేతల నుండి వెలికితీసే సామర్థ్యాలు .

3. మానవ హక్కులను empowerment గా కూడా వ్యవహరిస్తారు. నూతన సామాజిక ఉద్యమాలలో వివిధ శక్తులు identifies గా ఏర్పడుతున్న, క్రమంలో సమాజంలోని అధికారిక సంబంధాలను (Domirent relation) ప్రశ్నిస్తాయి. ఈ క్రమంలో మానవ హక్కుల ప్రాతిపదికగా ఉద్యమాలు నడుస్తాయి. ఈ ప్రక్రియకే ఆయా శక్తులను బలోపేతం చేయడంగా మరియు ఆయా సామాజిక సంబంధాల ప్రజాస్వామీకరించడంగా పేర్కొంటారు. దళిత, స్త్రీ ఆదివాసి మొదలైన ఉద్యమాలు తమ వనరుల సాధనలో, అధికారిక సంబంధాల విముక్తిలో మానవ హక్కులను పునాదిగా గ్రహిస్తాయి.

అయితే మానవ హక్కులను సాధనంగా కాకుండా లక్ష్యంగా గ్రహించే అవగాహనలో హక్కులను వ్యక్తి పరమైనవిగా కాకుండా సామూహిక హక్కులుగా గుర్తిస్తారు. పొర సమాజ సంబంధాల ప్రజాస్వామికీకరణ దిశగా ఈ

BRAOU

హక్కులు ఉంటాయి. అందుకే వీటిని ప్రజాస్వామ్య హక్కులు (Democratic Rights) అంటారు. వీటికి రాజ్య అణచివేత కాకుండా పౌరసమాజంలోని అసమానతలు, వివక్షలు ప్రధాన సమస్యలు అవుతాయి.

4. నూతన సామాజిక ఉద్యమాల ఆర్థిక అంశాలను గమనిస్తే ఆధునికీకరణ, పారిశ్రామికీకరణ నేపథ్యంలో కులవృత్తులు మొదలైన సాంప్రదాయిక ఆర్థిక శక్తులు ఏవిధమైన అణచివేతకు, పరాయికరణకు గురయ్యాయో అర్థమవుతుంది. ఆధునీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించే క్రమంలో గొర్ల పెంపకందారులు, నేతకారులు, గీత కారులు, మత్స్య కారులు మొదలైన సాంప్రదాయ కులవృత్తుల ఆధారంగా community rights ప్రశ్నలు లేవనెత్తారు.

13.9 ముగింపు

నూతన సామాజిక ఉద్యమాలు మానవ హక్కుల దృక్పథంలో గణనీయమైన మార్పు తెచ్చాయి. మానవ హక్కులను కేవలం వ్యక్తి యొక్క రక్షణ కవచంగా చూసే దశనుండి మానవ హక్కులను సాధించే లక్ష్యంగా ఉద్యమాలు వస్తున్నాయి. ముఖ్యంగా మానవ హక్కుల పరిధిని పెంచడంలో నూతన సామాజిక ఉద్యమాలు తోడ్పడ్డాయి. సమాజంలోని ఆధిపత్య సంబంధాలను మార్చే క్రమంలో భాగంగా హక్కులను గుర్తిస్తారు. హక్కులు రాజ్యం కేంద్రంగా కాకుండ, పౌరసమాజం కేంద్రంగా నిర్వచిస్తారు. వీటి దృష్ట్యా సమాజంలోని సంబంధాలు ప్రజాస్వామికీకరణ చెందకుండా, మనిషి నిజమైన స్వేచ్ఛ అనేది సాధ్యం కాదు. తద్వార హక్కులు చట్టపరిధినుండి సామాజిక పరిధికి వ్యాపించాయి. అంటే రాజ్యం రాజ్యాంగము గుర్తించే హక్కులు ప్రధానంగా కాకుండా, సమాజంలో హక్కులను వాస్తవంగా అనుభవించడం ప్రధానంగా ఈ ఉద్యమాలు ముందుకు వచ్చాయి. హక్కులను రాజ్యం గుర్తించడం కంటే హక్కలను అనుభవించడం ప్రధానమౌతుంది. ఇది పౌర హక్కులనుండి మానవ హక్కులకు రూపాంతరం చెందే క్రమాన్ని తెలియజేస్తుంది.

13.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. నూతన సామాజిక ఉద్యమాలను నిర్వచించి అటువంటిది ఏదైనా ఒక ఉద్యమాన్ని గురించి వివరించండి.
2. నూతన సామాజిక ఉద్యమాల లక్షణాలను పేర్కొనండి.

II. ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో జవాబులు రాయండి.

1. నూతన సామాజిక ఉద్యమాలు - మార్క్సిస్టు దృక్పథం
2. నూతన సామాజిక ఉద్యమాల స్వభావమును చర్చించుము.

BRAOU

14. జాతీయ మానవహక్కుల కమిషన్ (NHRC)

విషయక్రమం

14.0 ఉద్దేశం

14.1 పరిచయం

14.2 జతీయ మానవహక్కుల కమిషన్

14.2.1 కమిషన్ సభ్యులు

14.2.2 నియామకం, తొలగింపు, బాధ్యతలు

14.2.3 విధులు, అధికారాలు

14.2.4 ఫిర్యాదులు విచారించే ప్రక్రియ

14.2.5 పనితీరు - సమీక్ష

14.3 రాష్ట్ర మానవహక్కుల కమిషన్లు

14.4 మానవహక్కుల న్యాయస్థానాలు

14.5 ముగింపు

14.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

14.0 ఉద్దేశం

ఈ పాఠం చదివిన తర్వాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు:

- మానవ హక్కుల రక్షణ కోసం రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి, మానవహక్కుల కమిషన్లు, మానవహక్కుల కోర్టు గురించి,
- ఈ సంస్థల నిర్మాణం, అధికారాలు, విధులు, విధానాలు వాటికి సంబంధించిన న్యాయ నియమాలు,
- మానవహక్కుల, అమలుకు ప్రభుత్వం రూపొందించిన యంత్రాంగం.

14.1 పరిచయం

మానవహక్కుల విధానాలు, తదితర సంఘాలకు సంబంధించిన అస్పష్టత ఏదీ లేదు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆ హక్కులను భంగపరచడం కూడా నిర్వివాదాంశం. న్యాయ విధానం ద్వారా ప్రాథమిక హక్కుల రక్షణకు అవకాశాలు ఉన్నపటికీ, అంతర్జాతీయ సమాజ ధోరణిని అనుసరించి మానవ హక్కులను మరింత సమర్థంగా రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ మానవ హక్కుల కమీషన్ (NHRC) ఏర్పాటు చేసింది.

ఉగ్రవాద, హింస పెరిగిపోయి, కేంద్ర ప్రభుత్వం టెర్రరిజాన్ని అణచి వేయడానికి తన బాధ్యత నిర్వహణలో భాగంగా చర్యలు తీసుకుంటున్న తరుణంలో కమీషన్ అవసరం. ఏమిటో తెలిసింది. మానవ హక్కుల ఉద్యమ కారులు, మన దేశంలోనూ విదేశాల్లోనూ, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ 50 సంస్థలు మానవ హక్కుల అణచివేత చర్యలను నివసించారు. అటువంటి సంఘటనలకు హక్కులు భంగపడకుండా రక్షించడం కోసం మానవ హక్కుల కమీషన్ ఏర్పాటయింది. ఈ లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా రాష్ట్ర స్థాయి కమీషన్లను ఏర్పాటు చేసే అధికారం ఇచ్చారు. మానవ హక్కుల భంగపడిన కేసుల సత్వర విచారణకు కేంద్ర ప్రభుత్వం మానవ హక్కుల కోసం ప్రత్యేక కోర్టులను కూడా ఏర్పాటు చేసింది.

BRAOU

14.2 జాతీయ మానవ హక్కుల కమీషన్

మానవ హక్కుల రక్షణ చట్టం, 1993 ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల కమీషన్‌ను ఏర్పాటు చేసే అధికారం లభించింది. 1993 అక్టోబర్‌లో కమీషన్ అమలులోకి వచ్చింది. ఈ చట్టంలో 'లక్ష్యాలు ఉద్దేశాలు' ప్రకటనలో కమీషన్ ఏర్పాటుకు కారణాలను ఈ క్రింది విధంగా వివరించారు:

1. భారతదేశం అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒప్పందం పైన, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కు అంతర్జాతీయ ఒప్పందం పైన సంతకం చేసింది. ఈ రెండు ఒప్పందాలలోని హక్కులకు మన రాజ్యాంగం ఇది వరకే హామీ ఇచ్చింది.
2. అయినా, మానవ హక్కులు భంగపడుతున్నాయని మన దేశంలో, విదేశాల్లో ఆందోళన వ్యక్తమైంది. మారనున్న సామాజిక హత్యలను, నేరాలు, హింసాకాండకు సంబంధించి పుట్టుకొస్తున్న కొత్త ధోరణలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఉన్న శాసనాలను, విధానాలను, ప్రక్రియలను, న్యాయ పాలనా వ్యవస్థను పునఃపరిశీలించి, పాలనలో పారదర్శికతను , మరింత బాధ్యతను కల్పించేందుకు సమర్థవంతమయిన కొత్త విధానాలను కనిపెడుతున్నది.

14.2.1 కమీషన్ సభ్యులు :

ఈ చట్టం ప్రకారం కమీషన్‌లో ఈ కింది వ్యక్తులు ఉంటారు.

a) సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిగా ఉన్న వ్యక్తి చైర్ పర్సన్‌గా ఉంటారు.

b) సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సభ్యుడు

c) హైకోర్టు ప్రధాన్యాయమూర్తిగా ఉన్న ఒక సభ్యుడు.

d) మానవ హక్కుల గురించి తెలిసిన, ఆచరణాత్మక అనుభవం ఉన్న ఇద్దరు వ్యక్తులు ఇద్దరు సభ్యులుగా ఉంటారు. వీరుగాక ముగ్గురు వ్యక్తి అఫిసియో సభ్యులు జాతీయా మైనారిటీ కమిషన్ చైర్‌పర్సన్, షెడ్యూల్డుకులాలు, షెడ్యూల్డుతెగల జాతీయ కమిషన్, జాతీయమహిళా కమిషన్ చైర్‌పర్సన్లు సభ్యులుగా ఉంటారు. వీరంతా జాతీయ మానవహక్కుల కమిషన్ బాధ్యతలను నిర్వహిస్తారు. బాధితుడుగాని, అతని పక్షానగానీ మానవహక్కుల భంగం గురించి ఫిర్యాదు చేసినా, హక్కులు భంగపరచడానికి ఎవరైనా ప్రోత్సహించారని గానీ లేదా హక్కు భంగపరచకుంటే నిర్లక్ష్యంలో నిర్భంధించారని గానీ ఫిర్యాదు చేసినా లేదా తనంతట తానుగా గానీ విచారణ జరిపే అధికారం మాత్రం సభ్యులకు ఉంది.

కేంద్రంలో సెక్రెటరీ హోదాలో ఉన్న అధికారి ఈ కమిషన్ సెక్రెటరి జనరల్‌గా వ్యవహరిస్తారు. కమిషన్ ఇచ్చిన అధికారాలను, విధులను సెక్రెటరీ జనరల్ నిర్వహిస్తారు.

ఈ కమిషన్ ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది. కేంద్ర ప్రభుత్వం అనుమతితో దేశంలోని ఇతర స్థాయిల్లో కూడా కార్యాలయాలను స్థాపించవచ్చు.

భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంగనాథ్ మిశ్రాను మొదట చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం మాజీచీఫ్ జస్టిస్ వెంకటాచలయ్య అధ్యక్షులుగా ఉన్నారు.

14.2.2 నియామకం, తొలగింపు, బాధ్యతలు :

రాష్ట్రపతి స్వయంగా, తన 'సీల్'తో చైర్‌పర్సన్‌ను, ఇతర సభ్యులను నియమిస్తారు. ఈ క్రింది వ్యక్తులతో కలసిన కమిటీ చేసిన సిఫార్సులను అనుసరించి ఈ నియామకాలు జరుపుతారు.

1. ప్రధానమంత్రి (చైర్ పర్సన్)
2. లోకసభ స్పీకర్ - సభ్యులు
3. కేంద్రంలో హోం శాఖమంత్రి - సభ్యులు

BRAOU

4. లోకసభలో ప్రతిపక్ష నాయకులు - సభ్యులు

5. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు - సభ్యులు

6. రాజ్యసభ డిప్యూటీ చైర్ పర్సన్ - సభ్యులు

పదవిలో ఉన్న సుప్రీంకోర్టు జడ్జి లేదా హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను సభ్యుడిగా నియమించదలుచుకుంటే కమీషన్, భారత జాతీయ న్యాయమూర్తిని సంప్రదించాలి.

చైర్ పర్సన్ గానీ (అధ్యక్షుడు) గానీ, అసమర్థులనీ, లేదా దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని రుజువైతే రాష్ట్రపతి ఒక ఉత్తర్వు ద్వారా మాత్రమే తొలగించవచ్చు. అంతకు ముందు ఈ ఆరోపణలను రాష్ట్రపతి సుప్రీంకోర్టు నివారణకు పంపవలసి ఉంటుంది. సుప్రీంకోర్టు తన విధానాల ప్రకారం విచారణ జరిపి, ఆయా ఆరోపణలు రుజువైన కారణంగా తొలగించవచ్చునని నివేదిక ఇవ్వాలి. ఈ నిబంధనలో ప్రమేయం లేకుండా కింద వివరించిన కారణాల ఆధారంలో కూడా రాష్ట్రపతి కమీషన్ అధ్యక్షుడినీ లేదా సభ్యుడినీ పదవి నుంచి తొలగించవచ్చు.

a) అతను దివాళ అని నిర్ధారించడం,

b) తన అధికార విధులలో ఉండగానే, వేతనంతో కూడిన మరో ఉద్యోగం చేయడం,

c) మానసిక, శారీరక అంగవైకల్పం వల్ల విధులు నిర్వహించ సమర్థత లేక పోవడం,

d) తగిన కోర్టు ద్వారా అతను మతిస్థిమితం లేని వ్యక్తి అని నిర్ధారించినపుడు,

e) నీతి బాహ్యమయిన పనికి పాల్పడ్డారని రాష్ట్రపతి భావించి తగిన నేరం చేసిన శిక్షకు గురికావడం.

అధ్యక్షుల నియమాల, పదవీ కాలాన్ని చట్టం నిర్ధారించింది. అధ్యక్షుడు నియమించిన తేదీలలో అయిదేళ్ళ వరకూ లేదా 70 ఏళ్ళ వయసు వచ్చేవరకు (రెంటిలో ఏది ముందు జరిగితే అది) పదవీ కాలం అని నిర్ణయించారు. అతనినే మళ్లీ అధ్యక్ష పదవిలో నియమించవచ్చు. అయితే 70 ఏళ్ళలోపు వ్యక్తి అయిఉండాలి. ఈ కమీషన్‌లో అధ్యక్షుడుగా లేదా సభ్యుణిగా పనిచేసి పదవీ విరమణ చేసిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో ఏ పదవికీ అర్హులు కాబోరు.

మరణం, రాజీనామా, తదితర కారణాలల్లో అధ్యక్ష స్థానం హఠాత్తుగా ఖాళీ అయితే రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారా సభ్యులలో ఒకరిని కొత్త అధ్యక్షుడి నియామకం జరిగే వరకు అధ్యక్షుడిగా వ్యవహరించాలని ఉత్తర్వు జారీచేయవచ్చు. నియామకం జరిగిన తర్వాత సభ్యుల సర్వీసు నిబంధనల ప్రకారం వారికి ఇచ్చే వేతనాలను, ఖాతాలను, నష్టకరంగా మార్చకూడదు. కమిషన్ స్వతంత్రునిగా వ్యవహరించాలన్న లక్ష్యంతో ఈ నిబంధనను చేర్చారు.

14.2.3 కమీషన్ విధులు, అధికారాలు

మానవహక్కుల రక్షణ చట్టం 1993 లక్ష్యాలను సాధించడం కోసం ఈ క్రింది విధులు నిర్వహించవలసి ఉంటుంది.

a) బాధితుడు, అతని తరపు వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదునైన గానీ, లేదా తనంత తానుగానీ విచారణ సాగించవచ్చు. (i) మానవ హక్కుల భంగపరచడం లేదా అందుకు ప్రోత్సహించడం, లేదా (ii) ప్రభుత్వ అధికారి నిర్లక్ష్యంలో మానవ హక్కుల ఉల్లంఘనను నిరోధించక పోవడంపై ఫిర్యాదులు విచారించవచ్చు.

b) కోర్టు ముందు విచారణలో ఉన్న కేసుల్లో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందన్న అరోపణ అంటే ఆ కోర్టు అనుమతిలో కమీషన్ జోక్యం చేసుకోవచ్చు.

c) రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసే కమీషన్ ఏ సంస్థ నయిన, జైలునయిన, సందర్శించవచ్చు. సంస్కరణ, రక్షణ, కోసం నిర్భంధితులైన శిక్షకు గురైన వారి జీవన పరిస్థితులను పరిశీలించి సిఫార్సులు చేయడం.

B.R.A.O.U

d) అమలులో ఉన్న చట్టాలను పరిశీలించి, సమీక్షించి మానవ హక్కుల రక్షణకు అవసరమైన చర్యలను సూచించడం.

e) టెర్రరిస్టు చర్యలతో సహా, మానవ హక్కులను దెబ్బతీసే చర్యలను, కారణాలను సమీక్షించి, తగిన సూచనలు చేయడం.

f) అంతర్జాతీయ ఒప్పందాలలో ఉన్న మానవ హక్కులు వ్యవహారాలను అధ్యయనం చేసి, వాటి అమలుకు తగిన సూచనలు చేయడం.

g) మానవ హక్కుల పరిధిలో పరిశోధనను ప్రోత్సహించడం, నిర్వహించడం.

h) మానవ హక్కుల సమాచారాన్ని అన్ని వర్గాల ప్రజలకు తెలియజేయడం, అవసరాలు, - సరస్సులు, తదితర మాన్యాల ద్వారా ప్రజలు మానవ హక్కులను రక్షించుకునే అవసరాలను తెలియ జేయడం.

i) ఈ మానవ హక్కులు రంగంలో కృషి చేస్తున్న ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించడం.

j) మానవ హక్కుల అభివృద్ధికి అవసరం అనుకున్న ఇతర విధులను నిర్వహించడం.

పై విధులను నిర్వహించబడి, మానవ హక్కులను రక్షించడానికి గాను, కమీషన్‌కు న్యాయ స్థానానికి ఉన్న అధికారాలను ఇవ్వవలసి ఉంటుంది.

సెక్షన్ 13 ఈ విషయం నేర్పింది. ఫిర్యాదులను విచారించే దశలో కమీషన్‌ను సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలన్నీ ఉంటాయని సివిల్ ప్రాసీజర్ కోడ్ పరిధిలో ఈ కింద వివరించిన అంశాల గురించి కోర్టు అధికారాలన్నీ ఉంటాయని సెక్షన్ 3 స్పష్టం నేర్పింది. ఆ అంశాలు ఇవి:

a) సాక్షులకు సమీక్షలు పంపి, పిలిపించి, హాజరు కావాలని ఆదేశించి, ప్రమాణం చేయించి, ప్రశ్నించడం.

b) డాక్యుమెంట్‌లను కనిపెట్టి కోర్టు మందుంచడం,

c) అఫిడవిట్ల ద్వారా సాక్షులను స్వీకరించడం,

d) కోర్టునుంచి లేదా అధికార కార్యాలయం నుంచి పబ్లిక్ రికార్డును, లేదా దాని ప్రతిని తెప్పించుకోవడం,

e) సాక్షులను, ధ్రువ పత్ర సాక్ష్యాలను పరీక్షించడానికి కమీషన్లు నియమించడం.

f) నిర్ణయించిన మరే ఇతర అంశాన్నయినా చేపట్టవచ్చు.

కమీషన్‌కు తన బాధ్యతలను మరింత పటిష్ఠంగా నిర్వహించడం కోసం మరొక కీలకమయిన అధికారాన్ని కూడా ఇచ్చారు. అది దర్యాప్తు చేసే అధికారం సెక్షన్ 14 ప్రకారం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఏజన్సీని గానీ, అధికారిని గానీ దర్యాప్తు చేయాలని, వాని సేవలను వినియోగించవచ్చు. అందుకు ఆయా ప్రభుత్వాల అనుమతి తీసుకోవాలి. కమీషన్ గానీ, కమీషన్ పక్షాన వ్యవహరించే ఏజెన్సీ, అధికారి, దర్యాప్తు జరిపేందుకు గాను కింది అధికారాలను ఇచ్చారు.

(a) ఎవరినైనా సమన్ల ద్వారా పిలిపించి, పరీక్షించడం,

(b) డాక్యుమెంట్‌ను కనిపెట్టి, కోర్టులో సమర్పించాలని కోరడం,

(c) ఏ కార్యాలయం నుంచైనా, ప్రభుత్వ పత్రాలను తెమ్మని కోరడం,

కమీషన్ ఫిర్యాదులు దర్యాప్తు చేయడానికి ఆఫీసు, లేదా ఏజెన్సీ సేవలు వినియోగించుకున్నపుడు ఆ ఆఫీసుగానీ, ఏజెన్సీగానీ ఒక నివేదికను నిర్ణీత వ్యవధిలోగా సమర్పించాలి.

14.2.4 ఫిర్యాదులను విచారించే ప్రక్రియ

ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను, వారి బాధలను విచారించి చర్యలు తీసుకోవడమే కమీషన్ మౌలిక బాధ్యత. ఫిర్యాదులను ఇచ్చే పద్ధతి, వారిని పరిశీలించి, విచారణకు తీసుకువెళ్ళే పద్ధతి ముఖ్యమయింది. ఈ పద్ధతి మీద ఆధారపడి సంస్థ సమర్థత ఆధారపడి ఉంటుంది.

BRAOU

నెలలో మొదటి వారం, మూడో వారం రోజుల పాటు కమీషన్ కొలువుదీరి విచారణ సాగిస్తుంది. చైర్మన్ గానీ, ఒకరు లేదా ఎక్కువ సభ్యులు గానీ ప్రత్యేకంగా కోర్టు సమావేశ పరిచి విచారణ జరపవచ్చు. హక్కుల భంగకరమయిన అంశం మరీ అత్యవసరంగా తెల్పవలసినదయితే ప్రత్యేకంగా సమావేశమై విచారణ జరపాలి. ఏరూపములోనైనా ఫిర్యాదు అందగానే దానికి ఒక నెంబరు ఇచ్చి, రిజిస్టర్ చేసుకోవాలి. ఇద్దరు సభ్యుల బెంచ్ ముందుకు ఫిర్యాదును పంపాలి. ఈ ఫిర్యాదు అందిన రెండు వారాలలోగా ఫిర్యాదు స్వీకరణ కోసం బెంచ్ పరిశీలించాలి. ఫిర్యాదుల స్వీకరణకు ఫీజు వసూలు చేయ కూడదు. ఫిర్యాదును విచారణకు స్వీకరించిన తర్వాత కమీషన్ మరికొంత దర్యాప్తు జరపాలని ఆదేశించవచ్చు. తర్వాత సెక్రెటేరియట్ సంబంధిత ప్రభుత్వం, అధికారుల నుంచి సమంజసమయిన గడువులోగా రిపోర్ట్‌ను, అభిప్రాయాలను సేకరించవలసి ఉంటుంది. నిర్ణీత గడువులో రిపోర్ట్ అందకపోతే కమీషన్ స్వయంగా దర్యాప్తు జరపవచ్చు. ఒకవేళ అటువంటి రిపోర్ట్ అందితే కేసు పూర్వాపరాల గురించి ఒక వివరమయిన నివేదికను తయారుచేసి కమీషన్ సమర్పించాలి. ఫిర్యాదుపైన (ఇంకా దర్యాప్తు చేయనవసరం లేదని) అనుకుంటే, కమీషన్ చర్య తీసుకుని ఆ చర్య గురించి సంబంధిత ప్రభుత్వానికి లేదా అధికారికి తెలపాలి. ఇంకా దర్యాప్తు అవసరమనుకుంటే దర్యాప్తు జరపాలని ఆదేశించవచ్చు. దర్యాప్తు పూర్తి అయిన తర్వాత కమీషన్ క్రింద పేర్కొన్న చర్యలు తీసుకోవచ్చు.

1) మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందనీ, లేదా నిర్యక్ష్యంగా వ్యవహరించి, ప్రభుత్వ అధికారి మానవ హక్కులు భంగ పరచకుండా నిరోధించే ప్రయత్నం చేయలేరని దర్యాప్తులో తేలితే సంబంధిత ప్రభుత్వాన్ని లేదా అధికారిని, తప్పు చేసిన వ్యక్తిపైన ప్రాసిక్యూషన్ ఆరంభించాలని ఆదేశించవచ్చు.

2) సుప్రీంకోర్టు, హైకోర్టు ద్వారా అటువంటి ఉత్తర్వులను, అదేశాలను, రిట్‌లను జారీ చేయాలని కమీషన్ పిటిషన్ వేయవచ్చు.

3) సంబంధిత ప్రభుత్వం, అధికారిని బాధితుడికి లేదా బాధితుడి కుటుంబానికి వెంటనే తాత్కాలిక సహాయం అందించాలని కమీషన్ ఆదేశించవచ్చు.

4) కమిషన్ దర్యాప్తు జరిపించిన అంశాలపైన నివేదికను తయారు చేసి, సంబంధిత ప్రభుత్వానికి అధికారికి వారం రోజులలోగా పంపాలి. ఆ రిపోర్టుపైన ఆ ప్రభుత్వం/అధికారి తను అభిప్రాయాలను, తీసుకున్న చర్యలను లేదా తీసుకోవలసిన చర్యలను గురించి కమీషన్‌కు తెలియపరచాలి.

5) ఫిర్యాదికి లేదా అతని ప్రతినిధికి విచార వేదిక ప్రతిని ఇవ్వాలి.

6) కమీషన్, విచారణ నివేదికను, దానిపై ప్రభుత్వం వ్యాఖ్యానాలను, చర్య తీసుకున్న తీసుకోదలచిన చర్యలను ఒక వారం రోజులలోగా ప్రచురించాలి.

సాయుధ దళాల సభ్యులు మానవహక్కుల భంగానికి పాల్పడిన ఫిర్యాదులు వచ్చినపుడు కమీషన్ భిన్నమయిన పద్ధతిని అవలంబిస్తుంది. సైనిక దళాలపై ఫిర్యాదులను విచారించే విధానం ఇది.

ఫిర్యాదు అందించిన వెంటనే లేదా స్వయంగా కమీషన్ కేంద్ర ప్రభుత్వం ఒక నివేదిక పంపాలని కోరుతుంది. ప్రభుత్వ నివేదిక సంతృప్తికరంగా ఉంటే ఫిర్యాదుపై తదుపరి చర్యలు ఉండవు. కమీషన్‌కు ఆ నివేదిక సంతృప్తికరంగా లేకపోతే, ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేస్తుంది. ఆ సిఫార్సులపై కేంద్రం తీసుకున్న చర్యలను మూడు నెలలోగా తెలపాలి. ఆ తర్వాత కమీషన్ ఆ నివేదికను, కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సులకు, తీసుకున్న చర్యలను ఒక వారంలోగా ప్రచురించాలి. కమీషనర్‌కు లేదా అతని ప్రతినిధికి రిపోర్టు ప్రతినిధి కమీషన్ ఇవ్వాలి.

కమీషన్ కేంద్ర ప్రభుత్వానికి వార్షిక నివేదికను సమర్పించాలి. అత్యవరమయిన ప్రధానమయిన సంఘటనలపై కమీషన్ ప్రత్యేక నివేదికలను సమర్పించవచ్చు. వార్షిక నివేదిక ఇచ్చేలాగా ఆగడానికి వీల్లేని సంఘటనలపై సత్వర ప్రత్యేక నివేదికలు ఇవ్వవచ్చు.

BRAOU

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంబంధిత వార్షిక నివేదికలను, ప్రత్యేక నివేదికలను 6 నెలల్లో, పార్లమెంట్ ఉభయ సభలలో, తీసుకున్న చర్యల నివేదితో సహా సమర్పించాలి. తీసుకోబోతున్న చర్యలు వివరించాలి. కమీషన్ నివేదికలో సాఫల్యాలను ఆమోదించకపోతే, అందుకు కారణాలు వివరించాలి.

14.2.5 కమీషన్ పనితీరు, సమీక్ష

కమీషన్, భారత్‌లో మానవ హక్కులకు సంబంధించిన తీవ్రమయిన సమస్యలను ఆదిలోనే ఎదుర్కొన్నది. మొదటి మూడేళ్ళలోనే అనేక సవాళ్ళను, ఎదుర్కొన్నది. సామాన్యులకు సంబంధించిన పౌరహక్కులను భంగపరచడం, మహిళల వంటి బలహీన వర్గాలు, షెడ్యూల్డుకులాలు, తెగలు, మైనారిటీలు, వికలాంగుల హక్కులను ఉల్లంఘించిన అనేక ఉదంతాలపైన కమీషన్ చర్యలను ప్రారంభించింది.

పౌరహక్కులలో ముఖ్యంగా జీవన హక్కు, జుడిషియల్ కస్టడీ లేదా పోలీసు లాకప్‌లో ఉండగా పోలీసులు తమపట్ల సమంజసంగా ప్రవర్తించే హక్కు, రక్షణకు మానవ హక్కుల కమీషన్ అనేక తరహాలలో చొరవ తీసుకున్నది. జైళ్లను సందర్శించి బందీల రద్దీ తగ్గించాలని ఆహార, వైద్య ప్రమాణాలు మెరుగుపరచాలని స్పష్టంగా ఆదేశించింది. 1894 నాటి కాలం కల్గిన జైళ్ళ చట్టం స్థానంలో కొత్త నమూనా జైళ్ళ బిల్లును కమీషన్ ఆయా రాష్ట్రాల జైళ్ళ ఇన్స్‌పెక్టర్, జనరల్స్, హోం కార్యదర్శుల సహాయంతో రూపొందించే ప్రయత్నాలు జరిపింది. క్రిమినల్ ప్రొసీజర్‌లో అంతర్జాతీయ హింసా వ్యతిరేక ఒప్పందం అంశాలను చేర్చాలని కూడా కమీషన్ సిఫార్సు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నది.

మానవ హక్కులను రక్షించుకునే సంస్కృతిని పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలను సమన్వయం చేస్తూ కమిషన్ ఎన్నో చర్యలను ప్రారంభించింది. కళాశాలలు, పాఠశాలల్లో మానవ హక్కులను బోధనాంశాలుగా నేర్పాలని కమీషన్ కోరడం విశేషం.

అయితే మానవ హక్కుల కమీషన్‌కు తన తీర్పులను అమలు చేసే స్వతంత్ర యంత్రాంగం లేదని గమనించాలి. సంబంధిత అధికారికిగానీ, ప్రభుత్వానికిగానీ చర్య తీసుకోవాలని కమీషన్ కేవలం సిఫారసు మాత్రమే చేస్తుంది. కమీషన్ సూచించిన సిఫారసులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువ శాతం అంగీకరిస్తూనే ఉంటాయి. లేకపోతే చట్ట సభలలో ప్రభుత్వాల అసలు స్వరూపం అందరికీ తెలిసిపోతుంది.

కొన్ని సందర్భాలలో మానవ హక్కులు ఉల్లంఘించారన్న ఆరోపణతో కూడుకున్న కోర్టు విచారణలో కూడా కమీషన్ జోక్యం చేసుకోవచ్చు. అయితే అందుకు ఆ కోర్టు అనుమతి పొందాల్సి ఉంటుంది. విచారణ ముగిసిన తరువాత కమీషన్ సుప్రీంకోర్టుకు గానీ, హైకోర్టుకుగానీ వెళ్ళి అయా కేసుల్లో, అవసరమైన ఉత్తర్వులు, రిట్‌లు జారీచేయాలని కోరవచ్చు.

టెర్రరిజం పత్తిళ్ళకు లోనైన రాష్ట్రాల్లో సాయుధ దళాలు పోలీసు దళాలు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన కేసులను ఈ కమీషన్ ఎక్కువగా పరిశీలించవలసి వచ్చింది. ఇవి ప్రభుత్వ సాయుధ దళాలు వీరిపై ఫిర్యాదులను వినడానికి సెక్షన్ 19 కింద ప్రత్యేకమైన విధానాన్ని అనుసరించ వలసి వస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందో లేదో తెలుసుకోవడానికి ప్రభుత్వం మీదనే ఆధారపడి చివరకు ఆ ప్రభుత్వం నుంచే నివేదికలను పొంది కమీషన్ ఆ ప్రభుత్వానికే సిఫారస్ చేయాల్సి ఉంటుంది. కమీషన్ ఆధ్వర్యంలో స్వతంత్రంగా దర్యాప్తు జరిపే యంత్రాంగం ఉంటే నిజమైన న్యాయం జరిగే అవకాశం ఉంది.

జాతీయ మానవ హక్కుల కమీషన్ ప్రభావం వల్ల ఎన్నో ప్రాంతాలలో నుంచి ఫలితాలు కనపడుతున్నాయి. ఎన్నో కేసులను విచారించి మానవ హక్కుల రక్షణకు అనేక విలువైన సూచనలు చేసింది. నెలనెలా వార్తా లేఖలను, వార్షిక నివేదికలను దేశంలోని అనేక ప్రధానమైన సంస్థలకు వరుసగా పంపుతున్నది తద్వారా మానవ హక్కుల సంస్కృతిని చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందిస్తున్నారు. కమీషన్‌కు తోడుగా మానవ హక్కుల కేసులపై ఇచ్చిన తీర్పులను అమలు చేసేందుకు విడిగ ఒక యంత్రాంగం కూడా ఏర్పాటు చేస్తే మరింత సమర్థవంతంగా పనిచేయడానికి వీలుంటుంది. కమీషన్ స్థాపన లక్ష్యాలను కూడా అమలు చేసేందుకు వీలుంటుంది.

BRAOU

4.3 రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌లు

1993 మానవ హక్కుల రక్షణ చట్టం ప్రకారం ఆయా రాష్ట్రాలలో రాష్ట్ర ప్రభుత్వాలకు మానవ హక్కుల మీషన్లను ఏర్పాటు చేసే అధికారం ఉంది. ఈ కమీషన్‌లు మానవ హక్కుల ఉల్లంఘన కేసులను విచారిస్తాయి. ని రాజ్యాంగం ఏడవ ఎడ్యూల్‌లోని ఉమ్మడి జబితా (మూడవ జాబితా), రాష్ట్ర జాబితా (రెండవ జాబితా)లో క్కొన్న అంశాలకు సబంధించిన ఉల్లంఘనలను మాత్రమే ఈ కమిషన్‌లు విచారించ గలుగుతాయి.

రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌లో ఈ క్రింది వారు సభ్యులుగా ఉంటారు.

ప్రస్తుత లేదా మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చైర్ పర్సన్‌గా ఉంటారు.

2) హైకోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి - ఒక సభ్యుడు.

3) ఆ రాష్ట్రంలో ప్రస్తుత లేదా మాజీ జిల్లాజడ్జి - ఒక సభ్యుడు.

మానవ హక్కులకు సంబంధించిన విజ్ఞానం గానీ వ్యవహార జ్ఞానం గానీ ఉన్న వారు - ఇద్దరు సభ్యులు.

ఈ కమీషన్‌కు సెక్రెటరీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా ఉంటారు. అతనికి అప్పగించిన మేరకు విధులను కారాలను నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించిన చోట రాష్ట్ర కమిషన్ ప్రధాన కార్యాలయం టుంది.

చైర్ పర్సన్, సభ్యులను గవర్నర్ ఒక వారంట్ ద్వారా నియమిస్తారు. అయితే ఈ క్రింది సభ్యులలో కూడిన మిటి చేసిన సిఫారసు ఆధారంగానే ప్రతినియామకాన్ని చేయవలసి ఉంటుంది.

ముఖ్యమంత్రి ఈ కమిటీకి చైర్ పర్సన్‌గా వ్యవహరిస్తారు.

) శాసనభ స్పీకరు.

) ఆ రాష్ట్రంలో హోంశాఖ మంత్రి

) శాసన సభలో ప్రతిపక్ష నాయకులు.

విధానమండలికూడా ఉన్న రాష్ట్రాలలో విధానమండలి అధ్యక్షుడు అక్కడ ప్రతి పక్ష నాయకుడు కూడా టి సభ్యులుగా ఉంటారు. ప్రస్తుత హైకోర్టు న్యామూర్తిని గాని, జిల్లా జడ్జిని గాని సభ్యుడుగా నియమించాలంటే ర్టు ప్రధానన్యాయమూర్తిని సప్రదించవలసి ఉంటుంది.

అధ్యక్షుని పదవీకాలం ఐదేళ్ళు వరకు లేదా అతనికి డెబ్భై ఏళ్ళ వయసు వచ్చే వరకు (ఏది ముందు జరిగితే ఉంటుంది. ఇతర సభ్యుల పదవీ కాలం పదేళ్ళు. మరో ఐదేళ్ళు (కాలానికి కూడా). వారినే మళ్ళీ నియమించవచ్చు. ఏ సభ్యుడూ 70 ఏళ్ళు వయస్సు మించి ఆ హోదాలో కొనసాగడానికి వీల్లేదు. జాతీయ కమీషన్ అధ్యక్షుడు, లను ఏ కారణాలపై తమ హోదాలనుంచి తొలగించవచ్చో అదే కారణాలపై రాష్ట్ర కమీషన్ అధ్యక్షుడిని లను తొలగించే అవకాశం ఉంది.

రాష్ట్ర కమీషన్ ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి ఒక వార్షిక నివేదికను సమర్పిస్తుంది. ఈ నివేదికతో పాటు ప్రభుత్వం న్న చర్య నివేదికను, తీసకోబోతున్న చర్యల వివరాలను ఒక వేళ ఏవైనా సిఫారసులను ఆమోదించకపోతే కు గల కారణాలను శాసనసభ ముందు ఉంచాలి.

రాష్ట్ర కమీషన్ అధికారాలు, విధులు విచారణ పద్ధతి జాతీయ కమిషన్ తరహాలోనే ఉంటాయి.

చాలా రాష్ట్రాలు రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌లను ఏర్పాటు చేయనే లేదు. కనుక ఆయా రాష్ట్రాల్లో న ఫిర్యాదులను జాతీయ కమిషన్‌లకే పంపుతున్నారు. భారత్ వంటి పెద్ద దేశంలో నలుమూలలనుంచి వచ్చే నవ హక్కుల ఉల్లంఘన కేసులను ఒకే ఒక్క జాతీయ కమిషన్ మాత్రమే విచారించాలంటే కష్టమే ముఖ్యంగా

BRAOU

మానవ హక్కుల ఉల్లంఘన పెరిగిపోతున్న నేపథ్యంలో జాతీయ కమిషన్‌కు అందుతున్న ఫిర్యాదులు కూడా పెరిగిపోతూ ఉన్నాయి. కనుక కమీషన్ పని భారం విపరీతంగా పెరిగిపోయింది. అందువల్ల ప్రతి రాష్ట్రంలోనూ ఒక మా హక్కుల కమిషన్‌ను ఏర్పాటుచేసి హక్కులను భంగపడకుండా కాపాడి సత్వర న్యాయం అందించడానికి ప్రయత్నాల జరపాలి.

14.4 . మానవ హక్కుల న్యాయ స్థానాలు

మానవ హక్కుల ఉల్లంఘన ద్వారా జరిగిన నేరాలను సత్వరమే విచారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ హక్కుల న్యాయస్థానాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంగీకా రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ప్రతి జిల్లాలో ఒక సెషన్స్ కోర్టును మానవ హక్కుల కేసులను విచారించి కోర్టుగా ఏర్పాటు చేయవచ్చు.

(i) ఇది వరకే ఒక సెషన్స్ కోర్టును ప్రత్యేక కోర్టుగా కేటాయించినప్పుడు, (ii) ప్రత్యేక కోర్టును ఇదివరకే ఏర్పా చేసినపుడు ఇది వర్తించదు.

ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయడం ప్రభుత్వ విచక్షణాధికారానికి వదిలి పెట్టారు. అంటే తప్పని స ఏర్పాటు చేయాలని ఆదేశం లేదు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు కాని చోట్ల సెషన్స్ కోర్టులు మానవహక్కుల ఉల్లంఘ కేసులను విచారిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వాలు మానవ హక్కుల న్యాయస్థానాలను ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం మానవ హక్కుల ఉల్లంఘన కేసులను జాతీయ కమీషన్ ఒక్కటే విచారిస్తున్నది.

14.5 ముగింపు

జాతీయ మానవ హక్కుల కమీషన్, రాష్ట్ర మానవ హక్కుల కమీషన్, మానవ హక్కుల న్యాయ స్థానాలు ఏర్పాటు చేసే పద్ధతులను వాటి అధికారాలను తెలుసుకున్నాము. మానవ హక్కులు భంగపడినపుడు పౌరు పరిష్కారంకోసం ఈ సంస్థలను ఆశ్రయించవచ్చు.

14.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి

1. జాతీయ మానవ హక్కుల కమీషన్ విధులు ఏమిటి?
2. జాతీయ మానవ హక్కుల కమీషన్ పనిచేస్తున్న విధానాన్ని తెలుపండి.

II ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి.

1) మానవ హక్కుల రక్షణ లక్ష్యాన్ని కమీషన్ ఎంతవరకు సాధించింది?
2) మానవ హక్కుల న్యాయస్థానాలు అంటే ఏమిటి?

BRAOU

s –

పే

1)

4)

అ

ఉ

A)

B)

C)

D)

క

హై

అది)

అయి

స

స

తీ


అం

త

మ

BRAOU

అందరికీ అందుబాటులో ఉన్నత విద్య



ERAO

డా. బి.ఆర్. అంబేద్కర్
సార్వత్రిక
విశ్వవిద్యాలయం

రోడ్డు నెం: 46,
జుబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500 033

DHR - (T) 05

భారత దేశంలో మానవ హక్కులు : సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యం

''మనం నాగరికత సమకూర్చిన వస్తుగత ప్రయోజనాలైనా వదులుకోవచ్చునేమో గానీ, సర్వోత్కృష్టమైన విద్య అందించే ఫలాలను సంపూర్ణంగా అనుభవించే అవకాశాలను, హక్కును మాత్రం కోల్పోకూడదు''

— డా. బి.ఆర్. అంబేద్కర్

BRAOU

భారతదేశంలో మానవ హక్కులు

సామాజిక ఆర్థిక, రాజకీయ నేపథ్యం

BRAOU

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్ - 500 033

2001

పాఠ్య నిర్మాతలు

సంపాదకులు	కార్యక్రమ సమన్వయ కర్త
ఆచార్య డి. నరసింహా రెడ్డి	డా. ఘంటా చక్రపాణి
రచయితలు	**అనువాదం**
ఆచార్య వి.రామకృష్ణ	పూలపల్లి వెంకట రమణ
ఎన్.కె.మీరా	ఐ.వి.వి. నాగసుందరి
ఆర్.రాధారాణి	చంద్రశేఖర్ దేవ
డా. కె.సుధాకర్ రెడ్డి	అల్లం నారాయణ
డా.ఎస్.గాలబ్	తడ్క యాదగిరి
సురేందర్ ఎస్.జోడ్కా	పుల్లూరి సంపత్ రావు
బుర్రా శ్రీనివాస్	డా. ఘంటా చక్రపాణి
జె.ఇందిర	
కె.వై.రత్నం	**ముఖచిత్రం**
బి.జనార్దన్ రావు	చంద్ర
కె.వేణుగోపాల రావు	
ఆచార్య జి.హరగోపాల్	
కె.మురళి	
ఎ.ఎస్.ఆర్.వి.సునీత	
కె.బాలగోపాల్	

BRAOU

ప్రథమ ముద్రణ 2001

© 2001, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం, హైదరాబాద్

అన్ని హక్కులు విశ్వ విద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగాన్నయినా ఉపయోగించదలుచుకుంటే, విశ్వ విద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠ్యాంశాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం.

ఇతర వివరాలకు: డైరెక్టర్ (అకడమిక్), డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
ప్రొ.జి.రాంరెడ్డి మార్గ్, రోడ్ నెం. 46, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033.

Lr. No. 384/DMP/Dr. BRAOU/PTG/71/JO. 301/2001-2002/Date 10/1/2002 No. of Copies 500

Printed at : Joy 'N' Joy Printers, 3-2-6/5, Beside Badruka College, Kachiguda, Hyderabad.27. Phone : 6583424

పరిచయం

ఇది మానవ హక్కుల యుగం. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో, అన్ని సమాజాల్లో ఇప్పుడు మానవ హక్కులు ఒక ప్రధానమైన చర్చనీయాంశం. ఒక రకంగా చెప్పాలంటే గడచిన సహస్రాబ్దిని మనం మానవ హక్కుల సహస్రాబ్దిగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే మానవ హక్కుల భావన వికసించింది, విస్తరించింది ఈ సహస్రాబ్దిలోనే.

మానవ జాతిలో హక్కుల భావన తొలిసారిగా మొలకెత్తిన 13వ శతాబ్ది తొలి రోజుల నుంచి ఈనాటి 21వ శతాబ్ది ఆరంభం దాకా ''మానవ హక్కుల ఉద్యమం' అనేక పరిణామాలకు గురి అయ్యింది. అనేక సిద్ధాంతాలు, అనేక ధోరణులు, దృక్పథాలు చారిత్రక అనుభవాలు మానవ హక్కుల భావనకు మరింత పదును పెట్టాయి. పరిపుష్టం చేశాయి. ఇప్పుడు మన దేశంలాంటి అనేక దేశాలు, ఆ దేశాల ప్రజల చేతుల్లో మానవ హక్కుల ఉద్యమం ఒక వజ్రాయుధం అయింది. ఆంధ్రప్రదేశ్ ఈ ఉద్యమంలో అగ్రభాగాన వుంది.

ఈ నేపథ్యంలో మానవ హక్కుల భావనను జన బాహుళ్యానికి తెలియపర్చడం బాధ్యతగా భావించి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మానవ హక్కుల విద్యా కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఒక డిప్లొమాను ప్రవేశపెట్టాలని విశ్వ విద్యాలయం నిర్ణయించింది. జాతీయ మానవ హక్కుల సంఘం (NHRC) పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా విద్యా కార్యక్రమంలో చేర్చడంతో పాటు, దేశంలోనే తొలిసారిగా ఒక పూర్తిస్థాయి డిప్లొమాను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగులో మీకు అందిస్తోంది.

BRAOU

ఐదు కోర్సులుగా వున్న డిప్లొమా కార్యక్రమంలో ''భారత దేశంలో మానవ హక్కులు - సామాజిక ఆర్థిక సందర్భం'' ఒక కోర్సుగా చేర్చడం జరిగింది. ఈ కోర్సును ఒక సంపుటంగా మీకు అందిస్తున్నాం. ఇందులోని అధ్యయనాంశాలను మొత్తం నాలుగు ఖండాలుగా విభజించడం జరిగింది.

అవి: 1. చారిత్రక నేపథ్యం

2. సామాజిక ఆర్థిక నేపథ్యం
3. మానవ హక్కులు - ఉపేక్షిత వర్గాలు
4. రాజ్యం - మానవ హక్కులు

ఈ నాలుగు ఖండాల్లో మొత్తం 18 అధ్యయన భాగాలు (యూనిట్లు) వున్నాయి. వీటిని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సహకారంతో ఆయా రంగాల మేధావులు, మానవ హక్కుల ఉద్యమాలలో భాగస్వాములైన కార్యకర్తలు ఇతర వృత్తి నిపుణులు, అధ్యాపకులతో రూపొందించడం జరిగింది. ఈ ప్రయత్నంలో మానవ హక్కులపై తొలిసారి ఒక డిప్లొమాను రూపొందించిన సార్వత్రిక విశ్వవిద్యాలయంగా డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం చరిత్రలో నిలిచిపోనుంది. ఈ పాఠ్యాంశాలు తెలుగులో మొదటిసారిగా వెలువడుతున్న సమాచారం. ఈ పాఠ్యాంశాల అధ్యయనం ద్వారా మానవ హక్కుల పట్ల అవగాహనతో పాటు విద్యార్థులకు ఒక స్పష్టమైన దృక్పథం ఏర్పడే అవకాశం వుంది. అలాగే మానవ హక్కుల కార్యకర్తలకు, ఆ ఉద్యమంలో మమేకమైన వారికి ఈ కార్యక్రమం మార్గనిర్దేశం చేస్తుంది.

BRAOU

విషయసూచిక

పేజి నెం.

ఖండం I: చారిత్రక నేపథ్యం

భాగం-1:	సాంఘిక ఉద్యమాలు-బ్రిటిషు ఇండియాలో మానవ హక్కులు	3
భాగం-2:	బ్రిటీష్ పాలనలో జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు	11

ఖండం-II: సామాజిక ఆర్థిక నేపథ్యం

భాగం-3:	గ్రామీణ పేదరికం-మానవాభివృద్ధి	21
భాగం-4:	కనీస అవసరాలు-అభివృద్ధి	31
భాగం-5:	సుస్థిరమైన అభివృద్ధి-మానవ హక్కులు	43
భాగం-6:	సంస్థాగత సర్దుబాటు కార్యక్రమం- మానవ హక్కులు	49

ఖండం-III: మానవ హక్కులు – ఉపేక్షిత వర్గాలు

భాగం-7:	భూమి సమస్య - మానవ హక్కులు	57
భాగం-8:	వ్యవసాయ కార్మికులు-మానవ హక్కులు	63
భాగం-9:	పారిశ్రామిక కార్మికులు-మానవ హక్కులు	71
భాగం-10:	మహిళలు-మానవ హక్కులు	85
భాగం-11:	దళితులు-మానవ హక్కులు	93
భాగం-12:	గిరిజనులు - మానవ హక్కులు	101
భాగం-13:	బాలలు-మానవ హక్కులు	109

ఖండం-IV రాజ్యం – మానవ హక్కులు

భాగం-14:	భారత రాజ్యం-మానవ హక్కులు	121
భాగం-15:	ఉద్యోగ బృందం-మానవ హక్కులు	129
భాగం-16:	పోలీసులు-మానవ హక్కులు	137
భాగం-17:	ఆంధ్రప్రదేశ్‌లో మానవ హక్కుల పరిస్థితి	143
భాగం-18:	పౌర సమాజం-మానవ హక్కులు	159

BRAOU

BRAOU

ఖండం - I

చారిత్రక నేపథ్యం

ఆధునిక సాంఘిక జీవనంలో మానవ హక్కుల ప్రాధాన్యత పెరిగింది. సామాజిక ఆర్థిక రాజకీయ హక్కుల గురించిన అవగాహన పెంపొందినప్పుడే మానవ హక్కుల ఆవశ్యకత గ్రహించగలుగుతాము. భారతదేశంలోని మానవ హక్కుల స్థితిగతులను అంచనా వేయాలంటే ముందుగా బ్రిటీషు వలస పాలనా కాలంలోని చట్టాల స్వభావాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం వుంది. ఇందుకు సంబంధించి చారిత్రక దృక్పథం అనేమొదటి ఖండంలో చర్చించాం. ఈ ఖండంలో రెండు భాగాలున్నాయి. అవి :

భాగం : 1. సాంఘిక ఉద్యమాలు-బ్రిటిషు ఇండియాలో మానవ హక్కులు

భాగం : 2. బ్రిటీష్ పాలనలో జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కు

BRAOU

BRAOU

భాగం 1 : సాంఘిక ఉద్యమాలు – బ్రిటీషు ఇండియాలో మానవ హక్కులు

విషయక్రమం

1.0 ఉద్దేశం

1:1 పరిచయం

1.2 చారిత్రక నేపధ్యం

1.3 సమాజ నిర్మాణం - ఉద్యమాలు

1.4 స్వాతంత్ర్యానంతర దశ

1.5 ముగింపు

1.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

1.0 ఉద్దేశం

ఈ భాగం చదివినతరువాత మీరు:

★ భారతదేశంలోని సాంఘిక ఉద్యమాల చరిత్రను తెలుసుకుంటారు.

★ స్వాతంత్ర్యానంతరం మానవ హక్కుల పరిణామక్రమాన్ని విశ్లేషిస్తారు.

BRAOU

1.1 పరిచయం

మానవ హక్కులను మౌలికంగా వ్యక్త హక్కులుగా, ప్రతి వ్యక్తీ కోరుకునే స్వేచ్ఛలుగా, వ్యక్తి (పురుషుడు లేదా స్త్రీ) వీటిని సహజంగా పొందినవిగానే కాక రాజ్యం ఆమోదించిన అధికారాలుగా నిర్వచించవచ్చు. మానవులంతా స్వేచ్ఛతో జన్మించి, వారి వ్యక్తిగత హక్కులను అనుభవించే క్రమంలో సమానులేననే భావనను ఇవి ప్రతిబింబిస్తాయి. యుగయుగాలుగా మానవుడు రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక అణచివేతకు, అన్యాయాలు- అసమానత్వాలకు వ్యతిరేకంగా తద్వారా హక్కుల సాధనకు జరిపిన పోరాటాలు మానవ హక్కుల చరిత్రలో అంతర్భాగం.

సమకాలీన మానవ హక్కుల భావన మూలాలను ఐరోపా ఖండంలో వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవన యుగం నుంచి అన్వేషించవచ్చు. మొదటగా ఈ అధ్యాయంలో భారత స్వాతంత్ర్య పోరాటంలో మానవ హక్కుల పాత్ర, 19వ శతాబ్దంలో వచ్చిన మత సాంఘిక ఉద్యమాల ప్రభావం తదితర అంశాలను సంక్షిప్తంగా చర్చిస్తాం. ఈనాటి మానవ హక్కుల ప్రస్తానాన్ని 19వ శతాబ్దంలోని మత సాంఘిక ఉద్యమాలు తెచ్చిన చైతన్యం నుంచి గుర్తించవచ్చు. చివరలో ఈ అధ్యాయం ప్రపంచ వ్యాప్తంగా సమాజాల్లో శాంతి, న్యాయం, స్వేచ్ఛల అభివృద్ధికి, దాని కోసం యువతరాన్ని మానవ హక్కుల విషయంలో విద్యావంతుల్ని చేయడానికి ఐక్యరాజ్య సమితి చేస్తున్న కృషిని విశ్లేషిస్తుంది.

1.2 చారిత్రక నేపధ్యం

యూరోపు ఖండంలో నూతన జాతి రాజ్యాలు అవతరించడంతో పాటుగా సుదూర ప్రాంతాల్లో కనుగొన్న

భూభాగాల్లో వలసల ఏర్పాటు ప్రక్రియ కూడా జరిగిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ వలసవాదం ప్రధాన లక్షణాల్లో విదేశీ భూభాగాలను ఆక్రమణలతో కలుపు కోవడం, స్వదేశీయులపై రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా విదేశీ ప్రభుత్వం ఆధిపత్యం చెలాయించడం, స్వదేశీయుల ఆర్థిక వనరులను తమ ప్రయోజనాల కోసం వలసవాద రాజ్యాలు దోపిడీ చేయడం ముఖ్యమైనవి. యూరోప్‌లో వచ్చిన పునరుజ్జీవనం ప్రత్యక్ష-పరోక్ష పరిణామాలుగా జాతీయవాదం- వలసవాదం ఒక దానితో ఒకటి పరస్పరం ఆవిర్భవించాయి. పందొమ్మిదో శతాబ్దపు ద్వితీయార్ధం కల్లా వ్యక్తిశ్రేయోవాదం ఆధారంగా ఏర్పడిన స్వేచ్ఛా విధాన రాజ్యం (లెస్సాఫైర్ రాజ్యం) భావన, ఐరోపా పారిశ్రామిక సమాజాల్లో మారుతున్న సాంఘిక ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా లేక అసంపూర్తిగా, నిష్ప్రయోజనంగా వున్నట్లు రుజువైంది. ఈ నేపథ్యంలో రాజకీయ సిద్ధాంతాలైన సామ్యవాదం, సమిష్టివాదం, శ్రామిక సంఘవాదం, ఫేబియనిజం మొదలైనవి సంక్షేమ అంశాల ఆధారంగా రాజ్యం విధులు మారాలని ఉద్ఘాటించాయి.

భారత దేశంలో బ్రిటీషు ఆధిపత్యపు పునాదిని, దాని ఉపరితల నిర్మాణాన్ని పెంచి పెద్ద చేసిన ఘనత 17,18,19వ శతాబ్దాల్లో పాలించిన తూర్పు ఇండియా కంపెనీ సామ్రాజ్యవాదులకు, పరంపరగా అడుగిడిన వర్తక సాహసీకులకు చెందుతుంది. 19వ శతాబ్దానికల్లా బ్రిటీషు వారు తమ పాలనను భారత దేశంలో అనేక ప్రాంతాలకు విస్తరించడంతో ఎన్నో భయంకరమైన నిర్మాణపర మార్పులు చోటు చేసుకోవటం మొదలైంది. మొదటగా వారికి అత్యావశ్యకమైనది భూమిశిస్తు. ఈ విషయంలో తమకు ముందు పాలించిన వారు విధించిన అధిక శిస్తు రేట్లు వారికి ప్రయోజనకరంగా మారాయి. అయితే ఈ భూమిశిస్తులను ఎవరు వసూలు చేయాలనేది వారు ఎదుర్కొన్న సమస్య. భూమిశిస్తును రైతుల నుంచి ప్రత్యక్షంగా వసూలు చేయాలా! లేక పరోక్షంగా రైతుల సమూహాల నుంచి మరొకరి ద్వారా వసూలు చేయాలా! అలా అయితే ఈ సమూహాలకు ఎవరు ప్రాతినిధ్యం వహించాలి! అనేవి వారి సమస్యలు. 19వ శతాబ్దపు మధ్య భాగానికల్లా వివిధ రెవెన్యూ పాలన వ్యవస్థల్లో ప్రాంతీయంగా శిస్తురేట్లలోని అసమానతలు, భూమి కౌలు పద్ధతుల్లోని లోపాలు కొట్ట్చొచ్చినట్లు కన్పించాయి. అప్పటికే బ్రిటీషు వారు కూడా స్వదేశీయుల సున్నిత సమస్యల పట్ల నిరాదరణ కలిగి వుండడం మొదలైంది.

BRAOU

1.3 సాంఘిక నిర్మాణం: ఉద్యమాలు

అదే సమయంలో, ఏక కాలంలో భారత దేశపు సాంఘిక నిర్మాణం కూడా పునర్జీవన ప్రక్రియకు లోనయింది. భారతదేశం ఈ సాధారణ సామాజిక ధోరణిలో వున్న ఆచారాలు- విలువలు కొన్ని మార్పులకు లోనై, ఆధునిక భావాల విస్తరణకు ఈ ప్రక్రియ శ్రీకారం చుట్టింది. 19వ శతాబ్దపు భారత సామాజిక నిర్మాణంలో హిందూ సమాజం కుల వ్యవస్థ అనే ఇనుప చట్రంలో కూరుకుపోయి, ఆచరణలో సమాజం వివిధ ఉపకులాలుగా ముక్కలుగా విభజితమై ప్రజల సాంఘిక గతిశీలతను నిరోధించింది. దీనికి తోడు స్థానికుల, ప్రభుత్వ ఆదరణ మృగ్యమైన విద్యా వ్యవస్థతో పరిస్థితి మరింత క్షీణించింది. అంధ విశ్వాసాలు, పైశాచిక సాంఘిక ఆచారాలు సర్వవ్యాప్తమయ్యాయి. సమాజంలో స్త్రీలు దయనీయమైన పరిస్థితిని ఎదుర్కొనేవారు. హిందూ సమాజ పతనానికి ఉదాహరణలుగా అమానుష సాంఘిక ఆచారాలైన సతీసహగమనం, కన్యాశుల్కం, భ్రూణ హత్యలను పేర్కొనవచ్చు.

19వ శతాబ్దపు తొలి అర్ధభాగం ఒక నూతన శకానికి నాంది పలికింది. దీని ఆవిష్కర్తగా బెంగాల్‌కు చెందిన రాజారామ్మోహన్ రాయ్‌ని పేర్కొనవచ్చు. ఈ కాలంలో బెంగాల్ ప్రాధాన్యాన్ని వివిధ రీతులుగా అర్థం చేసుకోవచ్చు. బెంగాల్‌లో బ్రిటీషు పాలన మొదటగా స్థాపితమైంది. అక్కడే పాశ్చాత్య విద్యను ప్రవేశపెట్టారు. అదే బెంగాల్‌లో నూతన ఆర్థిక పునాది ఏర్పడి, అది మధ్య తరగతి మేధో వర్గాల పుట్టుకకు దారి తీసింది. రాజా రామ్మోహన్ రాయ్ ఒక తాత్వికునిగా, సంఘ సంస్కర్తగా పాశ్చాత్య ఉపయోగితావాదులు- రాడికల్స్ అయిన బెంథాం, రాస్‌కోయ్‌ల ప్రభావంతో బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు. ఈ విధంగా భారత దేశంలో ఆధునిక యుగం ప్రారంభం కావడం, బ్రిటీషు వారు

దేశంలో సుస్థిరం కావడం ఒకేసారి జరిగింది. విస్తారమైన వలసవాద రాజ్య ఆర్థిక వ్యవస్థ అవసరాల కోసం భారత దేశంలోని బ్రిటీషు వారు భారత సమాజాన్ని ఇంకా విషమ పరిస్థితిలోకి నెట్టారు.

ఇదే దశలో భారత దేశంలో ఆధునిక విద్యకు రాజా రామ్మోహన్ రాయ్ పద నిర్దేశకుడుగా వుండి ఆంగ్లో హిందూ స్కూలు స్థాపించాడు. ఆ స్కూలు సిలబస్‌లో ఖగోళ శాస్త్రం, యంత్ర శాస్త్రాలతో పాటు వోల్టయిర్, యూక్లిడ్‌ల తత్వాలు కూడా వున్నాయి. రామ్మోహన్ కేవలం తత్వవేత్తగానే కాక సమాజంలో పాతుకుపోయిన దురాచారాలపై పోరాడే యోధుడుగా కూడా నిలిచాడు. ఒక్క ఆచరణ వాదిగా సతీ సహగమనమనేది మత పరమైన దురాచారమే కాక అమానుషమైనదని కూడా పేర్కొంటూ మత స్వేచ్ఛకు, మానవతా వాదానికి సంఘర్షణ వుండదని రుజువు చేశాడు. రాజా రామ్మోహన్ రాయ్, అతని అనుచరుల క్రియాశీల కార్యాచరణతో సమాజంలోని సాంఘిక-శాసన అసమానత్వాలకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభమై కుల సంస్కరణలు, స్త్రీలకు సమాన హక్కులు, వితంతు పునర్వివాహాలు మొదలైన వాటి కోసం డిమాండ్ చేసింది. మతాచార్యులను తీవ్రంగా విమర్శిస్తూ అర్చకత్వం మతాలలో అంధ విశ్వాసాలను, ప్రజలలో విగ్రహారాధనను ప్రోత్సహిస్తుందని తెలిపాడు. ధర్మ శాస్త్రాలను ప్రాంతీయ భాషల్లోకి అనువదించడాన్ని ప్రోత్సహించాడు.

రాజా రామ్మోహన్ రాయ్ తన మొదటి గ్రంధాన్ని పర్షియన్ భాషలో ''తుహఫత్ ఉల్ మువాహిదీన్'' అనే పేరుతో రచించాడు. దీన్నే ఆంగ్లంలో 'ఏ గిఫ్ట్ టు మోనోథీయిస్ట్స్)' (A Gift to Monotheists)గా పేర్కొంటాడు. ఈ గ్రంధం అన్ని వ్యవస్థీకృత మతాల్లోని అంధ విశ్వాసాలు, విగ్రహారాధనలకు వ్యతిరేకంగా చేసిన సాహసోపేత నిరసన. కలకత్తాలో 1815లో ''ఆత్మీయసభ''ను ఏర్పాటు చేయడం ద్వారా నగరంలోని విద్యావంతులు, పుర ప్రముఖులను సమీకృతం చేసి ఎనలేని సేవ చేశాడు. బ్రహ్మ సమాజం పేరుతో ఏర్పాటైన ఈ దైవ ప్రస్థానం ఆదర్శమైనది. ఆ ఆదర్శం కోసం ఆయన జీవితాంతం పాటుబడ్డాడు. అతని సంస్కరణల్లో మత సంస్కరణ ప్రధానమైనప్పటికీ, ఇతర రంగాల్లో సంస్కరణలపై కూడా కఠోరంగా జరిపిన ఎడతెగని పోరాటం తక్కువ కాదు.

అప్పట్లో బెంగాల్లో సతీసహగమన ఆచారం విస్తారంగా అమల్లో వుండేది. అధికార అంచనాల ప్రకారం 1815-1828ల మధ్య కాలంలోనే దాదాపు 8 వేల సంఘటనలు జరిగాయి. ఒక్క కలకత్తా పరిసర ప్రాంతాల్లోనే 1828లో 309 మంది స్త్రీలు తమ విగత జీవులైన భర్తలతో పాటు సజీవంగా అగ్నికి ఆహుతయ్యారు. స్త్రీలు ఎదుర్కొనే ఈ క్లేశం, భ్రష్టత రామ్మోహన రాయ్ హృదయంలో సానుభూతి ప్రకంపనలను కలిగించింది. అందువల్లనే స్త్రీలకు విద్యాహక్కు వుండాలని ఉద్ఘాటించి, ఈ అమానుష ఆచారం నుంచి వారిని కాపాడడానికి విశ్వ ప్రయత్నం చేశాడు. 1829లో లార్డ్ విలియం బెంటింగ్ ఈ సతీ దురాచారాన్ని నిషేధించి, దాన్ని ఆచరించడం చట్ట విరుద్ధంగా, క్రిమినల్ నేరంగా గుర్తించి శిక్షార్హం చేశాడు.

రాజా రామ్మోహన్ రాయ్ మరణానంతరం కేశబ్ చంద్రసేన్ ఈ ఉద్యమాన్ని భారత దేశంలోని అన్ని ప్రాంతాల్లో క్రియాశీలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాడు. అఖిల భారత స్థాయిలో సాంఘిక సంస్కరణ సంస్థ ఆవశ్యకతను గుర్తించిన మొదటి భారత సంస్కర్తగా ఈయనను పేర్కొనవచ్చు. ముఖ్యంగా బాల్య వివాహాలను, బహు భార్యత్వాన్నీ రద్దు చేయాలని ఉద్యమించాడు. 1827లో బ్రహ్మ వివాహ చట్టం వచ్చింది. ఈ చట్టం బాల్య వివాహాలను నిషేధించింది. బహు భార్యత్వాన్ని, శిక్షార్హం చేసింది. వితంతు పునర్వివాహాలను, కులాంతర వివాహాలను అనుమతించింది. అయితే ఈ చట్టం బ్రహ్మసమాజ సభ్యులకు మాత్రమే వర్తించేలా నిర్మితమైంది.

ముగింపుగా బ్రహ్మ సమాజం విగ్రహారాధనపై సమర శంఖం పూరించి తరతరాలుగా వస్తున్న మతతత్వ భూస్వామ్య మూలాలను దెబ్బ తీసింది. మతాచార్యుల దాస్యం నుంచి ప్రజలకు మేథోపర విముక్తినిని ప్రసాదించింది. ఆధునిక భారత దేశపు స్త్రీ పురుషుల హక్కులను బోధించి, వాటి కోసం పోరాడిన మొదటి ఉద్యమంగా బ్రహ్మసమాజ ఉద్యమాన్ని పేర్కొనవచ్చు. ఈ ఉద్యమ నిరంతర కృషి ఫలితంగా అమానుషమైన సతీసహగమన ఆచారం రద్దైందని పేర్కొవచ్చు. ఈ విధంగా మానవుల నుంచి విడదీయరాని హక్కులైన జీవించే హక్కు, స్వేచ్ఛ హక్కులను సుస్థిరం చేయగలిగింది.

BRAOU

మొట్ట మొదటిసారిగా అఖిల భారత సాంఘిక సంస్కరణోద్యమ తరహాలో రనడే నాయకత్వంలో (తన ప్రార్థనా సమాజ్ సంస్థ ద్వారా) ఏర్పరచిన నేషనల్ సోషల్ కాన్ఫరెన్స్ 1887 నుంచి ప్రతి సంవత్సరం భారత జాతీయ కాంగ్రెస్ సభాస్థలిలో సమావేశమయ్యేది. ఆ తర్వాత బాల గంగాధర తిలక్ ఇదే సాంఘిక సంస్కరణ ఆశయాన్ని చేపట్టి 1895లో పూనాలో సమర్థవంతంగా దీని అవశ్యకతను ఘోషించాడు. బెహ్రాంజీ మలబరీ బాల్య వివాహాలపై, నిర్బంధ వితంతు వ్యవస్థపై 1884లో తయారు చేసిన నోట్సు దేశ వ్యాప్తమై మేధావులలో చర్చకు శ్రీకారం చుట్టింది. అతని నిరంతర ప్రచారాల ప్రభావం, ఒత్తిడితో ప్రభుత్వం 1856 సంవత్సరపు వితంతు పునర్వివాహ చట్టం, ఆ తర్వాత అంతే ప్రాధాన్యత కలిగిన 1891 సంవత్సరపు ఏజ్ ఆఫ్ కన్సెంట్ యాక్ట్ (Age of consent Act) అనే మరో సాంఘిక చట్టాన్ని వెలువరించింది.

ఇదే క్రమంలో 1880, 1890 దశకాల్లో అద్భుతంగా సాగిన సంస్కరణ ఉద్యమంగా కథియావర్ సన్యాసి, ఆర్య సమాజ్ స్థాపకుడు అయిన దయానంద సరస్వతి (1824-83) ఉద్యమాన్ని పేర్కొనవచ్చు. అతని సందేశం విజయవంతం కావడానికి అప్పట్లో వాడుకలో ఉన్న హిందూ ఆచారాలైన విగ్రహారాధన, బహు దేవతావాదం, బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాలపై నిషేధాలు, విదేశీయానాలపై నిషేధాలు, బ్రాహ్మణ ఆధిక్యత, జన్మ ఆధారంగా మాత్రమే జనించిన బహు కుల వ్యవస్థలపై అతని పదునైన విమర్శలు ఒకవైపు, మరో వైపు అమోఘమైన వేదాల పునాదిగా గల పవిత్ర హిందూ ధర్మాన్ని చాటి చెప్పే అతని నిశ్చిత బోధనల పరంపరలతో సమ్మిళితం చేసి ప్రబోధించడమే.

ఈ విధంగా వ్యవస్థీకృతమైన సాంఘిక సంస్కరణోద్యమం బెంగాల్‌కు బయట విస్తరించడానికి చాలా వరకు బ్రహ్మ సమాజ సభ్యులైన దేబేంద్ర నాథ్ ఠాగోర్, కేశబ్ చంద్రసేన్ వంటి ధర్మ ప్రచారకుల కార్యకలాపాలే కారణంగా పేర్కొనవచ్చు. బాల గంగాధర్ శాస్త్రి జంభేకర్ అనే ఎలిఫిన్ స్టోన్ సంస్థలో ఉన్న మొదటి భారతీయ ప్రొఫెసర్ అప్పటి యువతరానికి స్ఫూర్తిదాయకునిగా, 19వ శతాబ్దపు బొంబాయి యువకులకు మేధో ప్రోత్సాహం అందించే వ్యక్తిగా గుర్తింపు పొందాడు.

వితంతువుల తరపున గట్టిగా వారి అన్యాయాలను విజ్ఞాపన చేస్తూ, కుల వ్యవస్థ నిబంధనలను సరళీకరించాలని కోరాడు. సాంఘిక సంస్కరణల ఆశయాలతో ప్రజలను మౌలిక హక్కుల దిశగా సమాయత్తం చేయడానికి పశ్చిమ భారతంలో 'దర్పణ' అనే మొట్ట మొదటి వారపత్రికను ప్రారంభించాడు. అలాగే లోఖిత్ వాడి అనే సంస్కర్త (అసలు పేరు గోపాల్ హరిదేశ్ ముఖ్) 19వ శతాబ్దపు తొలి భాగంలో పశ్చిమ భారతపు సాంఘిక ఆర్థిక పరిస్థితులను విశ్లేషించిన వారిలో ఒకరు. భారతీయ సమాజంలో వున్న సాంప్రదాయికతలు, అణచివేతలకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. ఉదాహరణకు కుల వ్యవస్థ, బాల్య వివాహాలు, వితంతువుల దురవస్థ మొ.నవి అతని ప్రత్యేక లక్ష్యాలు. ఈ దురాచారాలు సమాజంలోని ''దిగువ కులాలుగా'' పిలువబడే వారి హక్కులను, సమాజంలో అతి ముఖ్యమైన స్త్రీల మౌలిక హక్కులను తిరస్కరించాయని భావించాడు.

ఇదే కాలంలో పశ్చిమ భారత దేశపు సంఘ సంస్కర్త, కుల వ్యవస్థను తీవ్రంగా ఆక్షేపించిన వారు జ్యోతిబా ఫూలే. సత్యశోధక్ సమాజ్ పేరుతో దిగువ స్థాయి కులాల మౌలిక హక్కులను పునరుద్ధరించాలనే ఆశయంతో కృషి చేశాడు. ఇలాంటి సంస్కరణల బృందం ఒకటి దక్షిణాదిన తెలుగు భాషా ప్రాంతంలో కందుకూరి వీరేశలింగం పిశ్టు నాయకత్వంలో ఏర్పడింది. అలా అని వీరేశలింగం కంటే ముందు దక్షిణాది ప్రజల మనస్సులో సంస్కరణల భావాలు లేవని కాదు. నిజానికి పాశ్చాత్యతత్త్వం ద్వారా, బెంగాల్ సంస్కరణోద్యమం ద్వారా సామాజిక దురాచారాలపై అప్పటికే ప్రజలకు అవగాహన ఏర్పడింది. సంఘ సంస్కర్తలైన ఏనుగుల వీరస్వామయ్య (1780-1836), వెన్నెల కంటి సుబ్బారావు (1784-1839) మానవ నిర్మితమైన కుల వ్యవస్థను, దాని విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. మద్రాస్‌లో ప్రారంభించిన హిందూ లిటరరీ సొసైటీ స్థాపకుల్లో ఒకరైన ఏనుగుల వీరాస్వామయ్య సామాజిక కార్యకలాపాల్లో పాల్గొంటూ ఆంగ్ల విద్యా వ్యాప్తికి, ప్రజల్లో రాజకీయ చైతన్యం తేవడానికి, తన ప్రసంగాల ద్వారా ఎంతో కృషి చేశాడు. సంఘ సంస్కరణకు ప్రాధాన్యం ఇస్తూ తోడ్పాటు నందించిన వారిలో సామినేని ముత్తు నర్సిమ్మయ్య నాయుడు ఒకరు. జిల్లా మున్సిఫ్‌గా వుంటూ 'హిత సూచిని' అనే స్వీయ గ్రంథం ద్వారా సమకాలీనుల్లో ముందుండి సమాజంలో స్త్రీ విద్య- వివాహ వ్యవస్థల్లో గల సాంఘిక అసమానత్వాన్ని ఎత్తి చూపాడు. నిజానికి ఈ గ్రంథం మహిళలకు ఉద్దేశించింది.

BRAOU

ఎందువలనంటే ''స్త్రీలు తమ సమస్యల విషయంలో ఒక ప్రత్యేక తరహా విజ్ఞానాన్ని కలిగి వుండాలని నమ్మాడు. వివాహ విషయంలో అతని ఆదర్శాలు అతనిని సమకాలీనులందరిలో ముందుంచుతాయి. ఆ గ్రంధంలో నాయుడు వివిధ శ్లోకాల (వివాహ సమయంలో పఠించే) సహాయంతో గతంలో వివాహాలు బాలికలు యుక్త వయస్కులైనప్పుడు బుద్ధి పరిణితి చెందినప్పుడు మాత్రమే నిర్వహించే వారని రుజువు చేశాడు. అంతేకాక కన్యాశుల్కపు ఆచరణకు (బాల వధువుల కొనుగోలు) బాల్య వివాహాల వ్యవస్థే కారణమని తెలుపుతూ, దాని ఫలితంగా అనైతిక అలవాట్లయిన చెడు నడతలకు, అమానుష ఆచరణలైన శిశుహత్యల వంటి వాటికి దారి తీస్తుంది.

అలాగే 1875లో జియ్యర్‌సూరి రచించిన 'స్త్రీ కలాకల్లోహిని' అనే గ్రంథం తెలుగు భాషలో స్త్రీ గ్రంధాల కొరతను తీర్చుతూ సంక్షిప్త వ్యాసాలను ప్రచురించింది. ఇదే ధోరణిలో విశాఖపట్నానికి చెందిన జి.వేదాంత సూరి 1880లో స్త్రీ సమస్యలపై అప్పటి మద్రాస్ ప్రభుత్వానికి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందించాడు. తన వాదనల సారాంశంగా అతను బాల్య వివాహాలు, భార్యాభర్తల మధ్య వయస్సుల నిష్పత్తిలో విపరీత తేడాలు, వివాహానికి పూర్వం భార్యాభర్తలు ఒకరికొకరు పరిచయం లేకపోవడం, కన్యాశుల్కం వంటివి మానవ హక్కులకు వ్యతిరేకాలనీ, ఇవి వివాహ వ్యవస్థతో ముడిపడి స్త్రీలు వితంతువులుగా మారడానికీ తద్వారా అనైతిక జీవన మార్గాలకు దారి తీస్తాయి.

19వ శతాబ్ది తొలి అర్ధభాగానికల్లా ఆంధ్ర సమాజం సంఘ సంస్కరణ కార్యకలాపాలు మొదటగా ఆచరణలోకి వచ్చి, 1870 కల్లా కందుకూరి వీరేశలింగం నాయకత్వంలో మరింత ప్రాచుర్యం పొందాయి. బెంగాల్‌లోని బ్రహ్మ సమాజ్ ఉద్యమంతో ప్రభావితుడైన కందుకూరి వీరేశలింగం, సమాజంలోని అణగారిన వర్గాల ప్రయోజనాలను, స్త్రీ సమస్యలను ప్రచారం చేస్తూ సాధారణ ప్రజానీకంలో ఉదారవాద, విశాలభావ దృక్పథాలు తెచ్చాడు. 1878లో 'రాజమండ్రి సోషల్ రిఫామ్ అసోసియేషన్' పేరుతో కందుకూరి స్థాపించిన సంస్థకు కొన్ని విశిష్ట లక్ష్యాలున్నాయి. వీటిలో ప్రధానమైనది వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించడం. 1874లో 'వివేక వర్ధిని' పేరుతో స్థాపించిన పత్రికలో వీరేశలింగం స్త్రీ విద్య, సాంఘిక దురాచారాల నిర్మూలన వంటి అంశాలపై ఎన్నో వ్యాసాలు ప్రచురించాడు. సాహిత్య రంగంలో తెలుగు గద్యానికి నూతన వరవడిని సృష్టించడం అతని ప్రత్యేకత. దీనిని వివిధ ఆంగ్ల, సంస్కృత భాషా సాహితీ ప్రక్రియలైన నవల, ప్రహసనం, నాటకం, హాస్యం మొదలైన వాటి నుంచి సంగ్రహించడం ద్వారా నిర్మించాడు. అదే సమయంలో కె.ఎస్. నటరాజన్ అప్పటి సమాజంలో రగులుతున్న సమస్యలను ప్రచారంలోకి తెచ్చాడు. 1890లో ప్రతిభావంతమైన 'ఇండియన్ సోషల్ రిఫార్మర్'తో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. 1892 కల్లా మద్రాస్‌లో 'హిందూ సోషల్ రిఫార్మ్ అసోసియేషన్' పేరుతో యంగ్ మద్రాస్ పార్టీ ఒక సామాజిక సంస్కరణ సంస్థను పత్రికతో పాటు ప్రారంభించింది.

19వ శతాబ్దంలో రామ్మోహన రాయ్, కందుకూరి వీరేశలింగం- అతని అనుచరులు చారిత్రాత్మకమైన అభ్యుదయ పాత్రను పోషించారు. ఈ భారతీయ సంస్కర్తలు పాశ్చాత్య దేశాల్లో ఆర్థిక సాంఘిక దురాచారాలకు ప్రాతినిధ్యం వహించే వున్నత భూస్వామ్య వర్గాలు- వృద్ధి నొందుతున్న మధ్య తరగతి వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆవిర్భవించిన విప్లవాత్మక భావజాలానికి కూడా ప్రభావితులయ్యారు. దీనితో వీరి ఆర్థిక భావనలు ప్రధానంగా వలసవాద రాజ్య ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలకు అనుగుణంగా వుండేవి. వలసవాద రాజ్య ఆర్థిక విధానాల ఫలితంగా ఒనగూడే బ్రిటన్ పారిశ్రామిక విప్లవానికి భారత దేశం సమిధగా మారి, ఆరాజ్య ప్రయోజనాల కోసం మాత్రమే భారత వనరులు వినియోగించే పరిస్థితి వచ్చి, అది భారత దేశంలో తిరోగమన పారిశ్రామికీకరణకు (de industrialisation)కు దారి తీస్తుందనే సత్యాన్ని గ్రహించడంలో ఈ సంస్కర్తలు విఫలమయ్యారు. ఈ పరిమితులున్నప్పటికీ, అప్పట్లో వచ్చిన మత సాంఘిక సంస్కరణోద్యమాలు ఈనాటి భారతీయ మానవ హక్కుల ఉద్యమాలకు మూలాలు కాబట్టి అవి ఎంతో ప్రాధాన్యతను కలిగి వున్నాయి.

అందువల్ల సంస్కరణ కేవలం బ్రిటీషు వారు పరిచయం చేసిన సాంస్కృతిక, భావనాపర, సంస్థాగత మార్పుల ఫలితంగా మాత్రమే రాలేదు. ఆంగ్ల విద్య ద్వారా విద్యావంతులు పాశ్చాత్య భావాలతో, హేతువాదం, శాస్త్రీయతల స్ఫూర్తితో విజ్ఞానవంతులై చైతన్యం పొందడం వల్ల కూడా జరిగింది. ఈ క్రమంలో సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను కాంక్షించే ప్రతినిధులకు, జాతి ఆశయాలను ప్రతిబింబించే నాయకులకు మధ్య ఘర్షణ బెంగాల్లో ప్రారంభమై దేశవ్యాప్తమైంది.

BRAOU

20వ శతాబ్దపు ఆరంభానికల్లా భారత రాజకీయాల్లో బ్రిటీషు సామ్రాజ్య పాలనపై విపక్ష ధోరణులు వృద్ధి నొంది భారత జాతీయవాదం ఒక నిర్దిష్ట రూపాన్ని సంతరించుకొంది.

పాశ్చాత్య జాతీయవాదం వలే భారతీయ జాతీయ వాదం హింస, ద్వేషాల ఫలితంగా ఏర్పడింది కాదు. దేశ రాజకీయ ఏకీకరణ, భారత ప్రాచీన సాంఘిక- ఆర్థిక వ్యవస్థల విధ్వంసం, ఆధునిక వాణిజ్య పారిశ్రామిక పరిస్థితుల అవతరణ, సమాజంలో నూతన సాంఘిక వర్గాల ఆవిర్భావం మొదలైన అంశాలు భారత దేశ జాతీయ వాదానికి ఆధారాలైనాయి. భారత దేశంలోని బ్రిటీషు ప్రభుత్వం సహజంగానే పెట్టుబడిదారీ అనుకూల స్వభావంతో వుండి శ్రామిక చట్టాన్ని చేసింది. 1881లో మొదటి కర్మాగార చట్టం ముఖ్యంగా బాల కార్మిక సమస్యతో పాటు అపాయ యంత్రాల ఫెన్సింగ్ మొదలైన వాటికి వీలు కల్పించింది. 20వ శతాబ్దంలో వృద్ధి నొందుతున్న కార్మిక ఉద్యమాల వత్తిడులకు అనుగుణంగా మంచి శ్రామిక చట్టాలను తయారు చేసింది. అలాగే రాజా రామ్మోహన్ రాయ్, విద్యాసాగర్, దాదాభాయ్ నౌరోజీ, రనడే, సురేంద్రనాథ్ బెనర్జీ, బాల గంగాధర్ తిలక్, కందుకూరి వీరేశలింగం, లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్ర వంటి ప్రముఖుల కృషి ఫలితంగా ప్రింటింగ్ ప్రెస్‌లు ప్రారంభమై వార్తాపత్రికల వ్యాప్తి జరగడం తద్వారా రాజకీయ శక్తులు శక్తివంతంగా సమీకృతమవడం ఒక ప్రముఖ ఘట్టంగా పేర్కొనవచ్చు. ఈ సంస్కరణోద్యమాలు జాతీయోద్యమానికి నేపథ్యాన్ని అందించడంతో దేశంలోని మేథో వాతావరణం, గణనీయంగా మారింది. మానవుడు- పౌర సమాజాల గురించిన చైతన్యపూరిత భావనలు వ్యాప్తి చేయడం సంస్కరణ ఉద్యమాలు అందించిన ఫలాలుగా భావించవచ్చు. దీనితో కుల వ్యవస్థ పూర్తిగా ధ్వంసం కాకపోయినా కుల పరిమితులు సడలాయి.

పాత సమాజాన్ని అంతర్గతంగా సంస్కరించి, బూజుపట్టిన సంప్రదాయాలను, ఆచారాలను విడనాడాల్సిన అవసరాన్ని గుర్తించేలా ఈ ఉద్యమాలు చైతన్యం తెచ్చాయి.

జాతీయ నాయకుల ప్రబల రచనలు దేశ వ్యాప్తంగా, భారత ఉప ఖండంలో భారతీయ ఆర్థిక వెనుకబాటుతనానికి ప్రకృతి ఉదాసీనత కారణం కాదని తెలిపాయి. అంటే భారతీయ సహజ వనరులు విదేశీ పాలనలో అక్రమ దోపిడీకి గురవుతున్నాయని పేర్కొంటూ వాస్తవంలో భారత దేశం లాంటి సుసంపన్న దేశంలో మానవ సమూహాలు బీదరికంలో జీవించే సందిగ్ధ పరిస్థితి వున్నదని ఆ జాతీయ వాదులు తమ రచనల్లో వెల్లడి చేశారు. అదే సమయంలో జాతీయవాదం తలెత్తడానికి అంతర్జాతీయ పరిస్థితి కూడా అనుకూలంగా వుంది. ఆసియా, ఆఫ్రికా ఖండ దేశాలన్నింటిలో జాతీయవాదం పరిఢవిల్లడానికి మొదటి ప్రపంచ యుద్ధం ఎంతో ప్రేరణనిచ్చింది.

BRAOU

1.4 స్వాతంత్ర్యానంతర దశ

1945 సంవత్సరంలో ముగిసిన రెండో ప్రపంచ యుద్ధంతో విపత్తుదశ (1914-1945) ముగిసి బ్రిటన్ తదితర బలవాద రాజ్యాలు ఇండియా వంటి దేశాలకు కాలక్రమంలో స్వాతంత్ర్యం ఇచ్చి వేయడానికి అంగీకరించాయి. మానవాళి మనుగడను విధ్వంసం చేయ ప్రయత్నించిన నాజీయిజం- ఫాసిజంలను రెండో ప్రపంచ యుద్ధం నిర్మూలించింది. 1948లో ఏర్పడ్డ ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ తన ప్రకటనలో అన్ని యుద్ధ కార్యకలాపాలను వ్యతిరేకించింది. ఐక్యరాజ్య సమితి చార్టర్ ద్వారా ఈ సభ ప్రమాణం చేస్తూ ''ఐక్యరాజ్య సమితి ప్రజలమైన మేము మా జీవిత కాలంలో రెండుసార్లు మానవాళి అనుభవించిన చెప్పనలవి కాని యుద్ధ భీతి నుంచి రాబోయే తరాలను రక్షించడానికి సంకల్పించుకొన్నాం. ఈ విషయంలో ప్రాథమిక మానవ హక్కుల పట్ల, మానవుల స్వీయ గౌరవం, విలువ పట్ల, స్త్రీ పురుషులు- చిన్న పెద్ద జాతుల మధ్య సమాన హక్కుల పట్ల, అచంచల విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తున్నాం. అంతర్జాతీయ న్యాయానికి సంబంధించిన ఒడంబడికల పట్ల న్యాయం- గౌరవం వుండేలా పరిస్థితులను కల్పించి తద్వారా సాంఘిక ప్రగతి, గొప్ప స్వేచ్ఛతో కూడిన మెరుగైన ప్రమాణాలు కొనసాగిస్తాం'' అని పేర్కొంది.

విశ్వ మానవ హక్కుల ప్రకటన (1948) ప్రపంచంలోని అన్ని జాతులు, మానవులు అమలు చేసుకునే కనీస

ప్రామాణికమై సర్వత్రా ఆమోదం పొందింది. వాస్తవానికి ఆ ప్రకటన ఒక శాసనబద్ధ పత్రం కాకపోయినా దానిలోని అంతరార్థాన్ని ఎన్నో రాజ్యాంగాలు తమలో ఇముడ్చుకొన్నాయి. 1993 జూన్ 25న వియన్నాలో సమావేశమైన ఐక్యరాజ్య సమితి ప్రపంచ మానవ హక్కుల కాన్ఫరెన్స్ విశ్వవ్యాప్తంగా పెరిగి పోతున్న స్థూల, గరిష్టస్థాయి మానవ హక్కుల ఉల్లంఘన పట్ల, అంటే ద్వేష విధ్వంసాలతో జాతులను తుడిచి పెట్టడం, మారణ హోమాలు, శరణార్థుల ప్రవాహాలు, నిర్వాసితుల వలసలు మొదలైన వాటి ఫలితంగా ఏర్పడే ఉల్లంఘనల పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. అలాగే స్త్రీలకు సమాన స్థాయి- హక్కులు కల్పించడంపై కూడా ఆ సమావేశం దృష్టి సారించింది. ఇదే క్రమంలో 24వ అధ్యాయం 21వ ఎజెండాలో అంతర్భాగమైన ''రియో ప్రకటన'' (Rio Declaration)కు అనుగుణంగా స్థిరమైన- న్యాయమైన అభివృద్ధిపై కూడా సమావేశం చర్చ జరిపింది. యాభై సంవత్సరాల పైబడిన ఐక్యరాజ్య సమితి తన రెండు మౌలిక విధులైన శాంతి స్థాపన- శాంతి నిర్వహణలతో పాటు ఎన్నో విధులతో తన పరిధిని విస్తరించుకొంది. ఈ నూతన విధులలో మూడో ప్రపంచ దేశాల్లో పెరిగి పోతున్న జనాభాను నియంత్రణ చేయడం, సైన్యాలు- ఆయుధాలపై అపరిమిత వ్యయాలను అదుపు చేయడం, శీఘ్రగతిన జరిగే పారిశ్రామికీకరణ ఫలితంగా జనాభాలోని వివిధ స్థాయిల మధ్య ఉత్పన్నమయ్యే హింసను నివారించడం మొదలైనవి వున్నాయి.

1.5 ముగింపు

మానవ హక్కుల ప్రాధాన్యతను ఈ రోజు హెచ్చుగా మదింపు చేయడం అతిశయోక్తి కాదు. భారత దేశంలో సమకాలీన మానవ హక్కుల స్వరూప స్వభావ మూలాలను 19వ శతాబ్దిలో వచ్చిన మత సాంఘిక సంస్కరణోద్యమాల్లో గుర్తించవచ్చు. మత- సాంఘిక సంస్కరణవాదులు వృద్ధి చేసిన భావనా పరంపరలు నిరంతరం దేశవ్యాప్తమయ్యాయి. ఇవి విడివిడిగా వచ్చిన ధోరణులు కావు. ప్రజా బాహుళ్యంలో, మరీ ముఖ్యంగా స్త్రీలలో విద్యావ్యాప్తికి తద్వారా మౌలిక మానవ హక్కుల పట్ల అవగాహన కల్పనకు 19వ శతాబ్దపు సంఘ సంస్కర్తలు ప్రాధాన్యమిచ్చారు. అలాగే ప్రస్తుత మానవ హక్కుల ఉద్యమం కూడా స్వభావరీత్యా గతంలోని ఉద్యమాల వలెనే తన రచనలు- ఆచరణల ద్వారా శాస్త్రీయ విజ్ఞానాన్ని వ్యాప్తి చేస్తూ మానవాళి విమోచనను ప్రధాన ఆశయంగా కలిగి వుంది. అలాగే వర్తమానంలో క్లిష్ట సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా మానవాళికి అవసరమయ్యే అంతర్జాతీయ శాంతి భద్రతల నిర్వహణకు పరిరక్షణకు ఐక్యరాజ్య సమితి ఒక్కటి మాత్రమే విశ్వసనీయమైన సంస్థ.

1.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానం రాయండి*

1. స్వాతంత్ర్యానికి పూర్వం భారత దేశంలో నెలకొన్న సాంఘిక నిర్మాణాన్ని చర్చించండి?
2. బ్రిటీషు పరిపాలన కాలంలో వచ్చిన ముఖ్యమైన సాంఘిక ఉద్యమాలను గురించి పేర్కొనండి?

BRAOU

BRAOU

భాగం 2: బ్రిటీష్ పాలనలో జీవించే హక్కు, స్వేచ్ఛాహక్కు

విషయ క్రమం

2.0 ఉద్దేశం

2.1 పరిచయం

2.1.1 బ్రిటీషు వారి ఉదార విధానాలు

2.2 క్రూర సాంఘిక అచారాలను నిషేధించిన చట్టాలు

2.2.1 శాసన క్రోడీకరణ

2.2.2 పాశ్చాత్య విద్య స్థాపన

2.2.3.కర్మాగార చట్టం

2.3 బ్రిటీషు వారి నిరంకుశ, అప్రజాస్వామిక రూపం

2.4 పత్రికా స్వాతంత్ర్యం

2,5 రౌలత్ దుశ్శాసనం

2.6 దండి యాత్ర

2.7 బెంగాల్ విప్లవకారులను ఎదుర్కొనే చర్యలు

2.8 క్విట్ ఇండియా ఉద్యమం

2.9 బ్రిటీషు వారి ద్వంద్వ వైఖరి

2.10 పౌర స్వేచ్ఛలపై వివిధ జాతీయోద్యమ నాయకుల, సిద్ధాంతాల భావనలు

2.11 ముగింపు

2.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

2.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు:

★ బ్రిటీషు ఇండియాలోని పత్రికాస్వాతంత్ర్యాన్ని వివరించగలుగుతారు.

★ పౌర హక్కులపై జాతీయోద్యమ నాయకుల భావాలు తెలుసుకుంటారు.

2.1 పరిచయం

పౌరస్వేచ్ఛలకై, ప్రజాస్వామ్య హక్కులకై బ్రిటీషు వారి కాలంలో భారతదేశం జాతీయోద్యమ రూపంలో పోరాటం సాగించింది. భారతదేశంలో బ్రిటీషు బలవంత పాలన ఉదారత, నిరంకుశత్వం రెండు లక్షణాలను కలిగి వుంది.

బ్రిటీషు పరిపాలన కాలంలో పౌర స్వేచ్ఛలకై సాగించిన పోరాట స్వరూపాన్ని చర్చించడమే ఈ అధ్యాయం లక్ష్యం. ఈ అధ్యాయంలో ఉదార ప్రజాస్వామ్య బ్రిటీషు రాజ్యం పౌర స్వేచ్ఛలను అణచి వేయడానికి సంధించిన చట్టాలను, చర్యలను వివరించే ప్రయత్నం చేయబడింది. ప్రాథమిక దశలో బ్రిటీషు పరిపాలనలో సతీసహగమనాన్ని రద్దు చేయటం, వితంతు పునర్వివాహ చట్టం, సివిల్-క్రిమినల్ చట్టాల క్రోడీకరణ, కర్మాగారాల్లో పని పరిస్థితులను మెరుగుపర్చడం వంటి కొన్ని ఉదార విధానాలు కనిపిస్తాయి.

2.1.1 బ్రిటీషు వారి ఉదార విధానాలు

ప్రారంభ దశలో బ్రిటీషు వారి పాలన ఉదార విధానాల పరంపరలతో సాగుతుంది. సమాజంలో స్త్రీలు, బాలలు, అంటరాని తరగతుల స్థితులను మెరుగుపర్చడానికి బ్రిటీషు వారు ఎన్నో చర్యలు తీసుకొన్నారు. అలాగే బ్రిటీషు పరిపాలనలో సాధారణంగా కన్పించే పైశాచికత్వం రౌలత్ చట్టం ద్వారా, దండియాత్రపై, జాతీయ విప్లవకారులపై క్విట్ ఇండియా ఉద్యమకారులపై జరిపిన జులుం ద్వారా ప్రస్ఫుటమౌతుంది.

2.2 క్రూర సాంఘిక ఆచారాలను నిషేధించిన చట్టాలు

ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనలో సతీసహగమన దురాచారాన్ని 1829వ సంవత్సరపు సతీ నిషేధ చట్టం ద్వారా రద్దు చేశారు. ఇలాంటి దురాచారాలైన బాల్య వివాహాలను, బాలిక శిశు హత్యలను, మానవ బలిదానాలను ఆచరించడాన్ని కూడా నిషేధించారు. బ్రిటీషు వారి ఈ చర్యలు వారికి ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ప్రయోజనకరం కావని తెలిసినప్పటికీ వారు ఆ ఆచారాలను చట్ట ప్రకారం శిక్షార్హం చేశారు. 1856వ సంవత్సరపు వితంతు పునర్వివాహ చట్టం ద్వారా వితంతువుల దురవస్థలను పారద్రోలే ప్రయత్నం చేశారు.

BRAOU

2.2.1 చట్ట క్రోడీకరణ

బ్రిటీషు వారు భారత దేశంలో వివిధ మతాల వ్యక్తిగత చట్టాల స్థానంలో భారతీయులందరికీ ఏకరూప చట్టాన్ని తీసుకు వచ్చారు. బ్రిటీషు వారు చట్టాన్ని క్రోడీకరించడం ఒక నిశ్చిత అంశం. 1858వ సంవత్సరంలో సివిల్ ప్రొసీజర్ కోడ్‌ను ఆమోదించారు. 1860, 1861 సంవత్సరాల్లో ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్ పిసి)లు అమల్లోకి వచ్చాయి. దాదాపు ఒక శతాబ్దం పైగా ఇంకా ఆచరణలో వున్నాయనే సత్యాన్ని బట్టే ఆ చట్టాల వైశిష్ట్యం, ఉపయోగం తెలుస్తుంది. ఇప్పటికీ భారతీయులు ఈ చట్టాలనే సమర్థవంతంగా అనుసరిస్తున్నారు.

2.2.2 పాశ్చాత్య విద్య స్థాపన

భారత దేశంలో ఆంగ్ల విద్యను ప్రవేశ పెట్టడంతో పాశ్చాత్య భావాలైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, జాతీయ వాదం మొదలైనవి వరదలా దేశంలోకి ప్రవహించాయి. 1854 నుంచి 1900 సంవత్సరం వరకు ఆంగ్ల విద్య భారతదేశంలో శీఘ్ర గమనాన్ని చవి చూచింది. 1857లో కలకత్తా, బొంబాయి, మద్రాస్‌లలో విశ్వ విద్యాలయాలను స్థాపించారు. 1828-35 మధ్య కాలంలో కలకత్తాలో తొలి భారతీయ వైద్య కళాశాలను స్థాపించారు. ఈ పాశ్చాత్య విద్యా వ్యవస్థ ఫలితంగా భారతీయ సామాజిక వ్యవస్థలో సంగ్రహాత్మకమైన మార్పులు వచ్చాయి.

2.2.3. కర్మాగార చట్టం

భారతీయ కార్మికుల పని పరిస్థితులు ఎంతో అసంతృప్తికరంగా వుండేవి. వారి పని గంటల క్రమబద్ధీకరణకు, వృద్ధాప్యానికి సామాజిక ఇన్సూరెన్స్ పథకాలు, అనారోగ్యం-ప్రమాదాలు-హఠాన్మరణాలు సంభవించినప్పుడు సరైన పరిహారాలు అవసరమయ్యే నిబంధనలు వుండేవి కావు. 1891 సంవత్సరపు కర్మాగార చట్టం కార్మికుల్లో పాక్షికంగా అంటే స్త్రీలు, పిల్లల పని గంటలను పరిమితం చేయడానికి ఉద్దేశించింది. ఈ చట్టం ఏడు సంవత్సరాలలోపు బాలలను కర్మాగారాల్లో

వినియోగించడాన్ని నిషేధిస్తూ, ఏడు సంవత్సరాల నుండి పన్నెండు సంవత్సరాల లోపు బాలల పని గంటలను రోజుకు 9 గంటలకు పరిమితం చేసింది. అలాగే 1900 సంవత్సరపు ఇండియన్ మైన్స్ బిల్లు బొగ్గు గనుల్లో స్త్రీలు, బాలల వినియోగాన్ని నిషేధించింది.

భారత దేశంలో రైల్వే వ్యవస్థను ప్రారంభించడం, నగరీకరణ పరిశ్రమల్లో కర్మాగారాల వ్యవస్థలు రావడంతో సామాజిక పరిస్థితుల్లో నాటకీయమైన మార్పులు చోటు చేసుకొన్నాయి. ఈ అంశాలు కుల వ్యవస్థ హద్దులను, అడ్డుగోడలను బలహీనపర్చాయి. దీనికితోడు ఉన్నత కులాలతో పాటుగా అంటరాని వర్గాల్లోని ప్రజలకు చాలా మందికి ఓటు హక్కును కల్పించడంతో సామాజిక క్రమానుగత నిర్మాణంలో (Social Hierarchy) వారి స్థాయి ఉన్నత స్థాయికి చేరుకుంది.

2.3 బ్రిటీషు వారి నిరంకుశ, అప్రజాస్వామిక రూపం

బ్రిటీషు బలవంత పాలనకు నిరంకుశ, అప్రజాస్వామిక స్వభావ లక్షణం కూడా వుంది. ఇంగ్లాండ్‌లో బ్రిటీషు రాజ్య వ్యవస్థ ఉదార ప్రజాస్వామ్య రాజ్య లక్షణాలైన కాలానుగత ఎన్నికలు, రాజకీయ పార్టీలు, అధికార విభజన, పౌర స్వేచ్ఛలు మొదలైన ప్రజాస్వామిక సంస్థలను కలిగి వుంది. బ్రిటన్‌లో కలిగి వున్న ప్రజాస్వామ్య సంస్థలకు విరుద్ధంగా భారతీయులకు ఈ సంస్థలన్నీ మృగ్యమైనాయి.

బ్రిటీషు పాలనకు గల ఈ నిరంకుశత్వాన్ని దాదాబాయ్ నౌరోజీ 1905 సంవత్సరంలో ఒక జాబులో జె.టి. సుందర్ లాండ్ బాగా వివరించాడు. ఆ పదాలను ఉటంకించాలంటే ''భారత ప్రజానీకం పరిస్థితి ఎంతో దయనీయం. యజమాని-బానిస సంబంధాని కంటే నీచంగా వుంది. దోపిడిదారుల చేతిలో అవిశ్రాంతంగా దోపిడీకి గురయ్యే జాతిగా మారింది. దేశ భూభాగం నుంచి ఈ దోపిడి పరిపూర్ణంగా ఎగుమతి అవుతుంది. ఆంగ్లేయులు భారత దేశానికి రాకముందు దురాక్రమణదారులు కొందరు దోపిడీ, దాడులు చేస్తుండేవారు. అయితే ఆ దాడులు దీర్ఘకాలిక విరామాల్లో జరిగేవి. ఈ విరామ కాలంలో దేశం తిరిగి సుసంపన్నంగా, సంపదలతో మారేది. అయితే బ్రిటీషు వారు ప్రస్తుతం జరిపే దోపిడి అలా లేదు. బ్రిటీషు దురాక్రమణ నిరంతరాయంగా, దోపిడి నిత్యకృత్యంగా వుండి, విరామం లేకపోవడంతో దారిద్ర్యం దేశంలో వృద్ధి నొందుతూ తిరిగి సంపదను కూడదీసుకునే అవకాశమే లేదు.''

BRAOU

2.4 పత్రికా స్వాతంత్ర్యం

పత్రికలపై సెన్సార్‌షిప్ విధానం ఆచరించడం ద్వారా బ్రిటీషు ప్రభుత్వపు అప్రజాస్వామిక స్వభావం వెల్లడి అవుతుంది. పత్రికా స్వేచ్ఛ అణచివేత లార్డ్ కానింగ్ హయాంలో 1857 సంవత్సరపు ప్రెస్ చట్టం ఆమోదించడం ద్వారా ప్రారంభమైంది. దీన్నే ప్రజానీకం మాటల్లో నోరు నొక్కే చట్టంగా ప్రాచుర్యం పొందింది. దాదాపు ఒక దశాబ్దం తర్వాత ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బుక్స్‌యాక్ట్ అనే చట్టం దేశంలో పత్రికలు, గ్రంథాల ప్రచురణ- ప్రింటింగ్ స్వేచ్ఛలను పరిమితం చేసింది.

భారత దేశంలో బ్రిటీషు సామ్రాజ్య వారసత్వాన్ని సుస్థిరంగా పరిరక్షించే ప్రధమ, అత్యున్నత కర్తవ్య నిర్వహణలో భాగంగా పత్రికా రంగాన్ని అన్ని కాలాల్లో వివిధ చట్టాల ద్వారా సంకెళ్ళలో వుంచారు. 1908 సంవత్సరపు ది న్యూస్ పేపర్ (ఇన్‌సైట్‌మెంట్ టు ఆఫెన్సెస్) చట్టం, ఆ తర్వాత రెండు సంవత్సరాలకు ఆమోదించిన ది ఇండియన్ ప్రెస్ చట్టాలు బ్రిటీషు వారి దృష్టిలో నేరపూరితమని అన్పించే అన్ని వార్తా కథనాలను ప్రచురించే పత్రికలపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి సర్వాధికారాలు ధారాదత్తం చేశాయి. ఈ చట్టాలలో నేరం నిర్దోషిత్వం నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితులపైనే వుంటుంది. ఈ చర్యలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా తలెత్తిన నిరసన ఉద్యమంతో 1922 సంవత్సరంలో ప్రెస్ లా రిపీల్ అండ్ ఎమెండ్‌మెంట్ చట్టం తయారైంది. ఈ చట్టం ద్వారా 1908 సంవత్సరపు ది న్యూస్ పేపర్

(ఇన్‌సైట్‌మెంట్ టూ ఆఫెన్సెస్) చట్టం, 1910 సంవత్సరపు ది ఇండియన్ ప్రెస్ చట్టం రద్దయ్యాయి.

అయితే 1922 సంవత్సరంలో రద్దయిన పత్రికా స్వాతంత్ర్యపై పరిమితులు తాత్కాలికమే. ఆ పరిమితులు 1931 సంవత్సరం ప్రెస్ చట్టం ద్వారా రెట్టించిన శక్తితో పునరావృతమయ్యాయి. దాని అనంతరం 1932 సంవత్సరపు విదేశీ సంబంధాల చట్టం (Foreign Relations Act), 1934 సంవత్సరంలో వచ్చిన భారత రాష్ట్రాల (రక్షణ) చట్టం బ్రిటీషు సెన్సార్ షిప్ చరిత్రలోమరో మైలురాయిగా నిరూపితమయ్యాయి. విదేశీ సంబంధాల చట్టం వార్త కథనాలు విదేశాలతో దేశ మిత్రత్వ సంబంధాలను నిర్వహించడంలో అవరోధాలతో జోక్యం చేసుకోడాన్ని దండన్నార్హంగా గుర్తించారు. అలాగే భారత రాష్ట్రాల (రక్షణ) చట్టం రాష్ట్రాల పరిపాలన యంత్రాంగాలను పరిరక్షించే విధంగా ఏర్పాటైంది. దీని ప్రకారం పరిపాలన వ్యవస్థకు వ్యతిరేకంగా విధ్వంసం చేసే కార్యకలాపాలను, గౌరవాన్ని భంగం కలిగించేలా ప్రోత్సహించడాన్నీ, అడ్డంకులు కల్పించడాన్నీ నేరంగా పరిగణిస్తుంది.

2.5 రౌలత్ దుశ్శాసనం

బ్రిటీషు నిరంకుశత్వం రౌలత్ బిల్లులతో పరాకాష్టకు చేరింది. ఆ బిల్లులకు విద్రోహ (నివారణ) కమిటీ ఛైర్మన్ జస్టిస్ రౌలత్ పేరుతో ప్రాచుర్యంలోకి వచ్చాయి. దీనిలో భాగంగా ప్రవేశపెట్టిన రెండు బిల్లులలో ఒకటి 1919 సంవత్సరపు ఆరాచక, విప్లవ నేరాల చట్టం (ది అనార్కికల్ అండ్ రివల్యూషనరీ క్రైమ్స్ యాక్ట్ 1919)గా రూపొందింది. గాంధీజీ పరిభాషలో ఇది ఒక పైశాచిక శాసనం. పై చట్టంలో పేర్కొన్న నేరాలను విచారించడానికి ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో సత్వర విచారణ లక్ష్యంతో ప్రత్యేక కోర్టును ఏర్పరుస్తారు. ఆ ప్రత్యేక న్యాయస్థానం వెలువరించిన తీర్పే అంతిమమైనది. అంటే దీనిపై తిగిగి అప్పీలు చేసుకోరాదు. ప్రొవిన్షియల్ ప్రభుత్వాలు ఏ ప్రదేశాన్నైనా సోదా చేయడానికీ, ఎలాంటి వారంట్‌లు అవసరం లేకుండా ఎవ్వరినైనా నిర్బంధించడానికీ అధికారాలు కల్పిస్తుంది. అనుమానితులను దేశంలో ఏ ప్రదేశంలోనైనా నిర్బంధించే అధికారం అధికారులకు వుంటుంది. అయితే ఆ అధికారులు తమ ఏజెన్సీలు అనుసరించే ప్రవర్తన-క్రమ శిక్షణ చట్టాలకు లోబడి ఈ అధికారాలు కలిగి వుంటారు. ఈ చట్టాన్ని అనుసరించే క్రమంలో క్రిమినల్ ప్రాసీజర్ కోడ్, ఎవిడెన్స్ చట్టాల్లోని సంబంధిత నిబంధనలను రుజువు సాక్ష్యాల విషయంలో రద్దు చేయడమనేది దీని విశిష్ట లక్షణం. అంతేకాక రుజువు స్వభావం, సాక్షుల పేర్లు కమీషన్ సంపదగా వుండి ఈ విషయంలో ప్రజా బాహుళ్యానికి సమాచారం అందించక అంధకారంలోవుంచుతుంది. ఈ ప్రమాదకరమైన చట్టం గాంధీ దృష్టిలో 'అన్యాయమై, స్వేచ్ఛా, న్యాయ మూల సూత్రాలకు విరుద్ధమై వుంటుంది. రాజ్యవ్యవస్థ, సమాజ మొత్తపు భద్రతలకు మూలమైన వ్యక్తుల ప్రాథమిక హక్కులను నాశనం చేస్తుంది.'

భారతీయ శాసనసభ్యుల మద్దతు లేకపోయినా మార్చి 18, 1918న ఈ బిల్లును ఆమోదించారు. ఎన్నో నిరసనలు, అప్పీలు లేని, దలీల్ లేని, వకీలు లేని (నో అప్పీల్, నో దలీల్, నో వకీల్) మధ్య బిల్లును ఆమోదించారు. గాంధీని ఏ ఇతర జాతీయ సమస్య కదిలించనంతగా రౌలత్ బిల్లు కదిలించింది. గాంధీజి దృష్టిలో ఈ బిల్లులు ముదిరిపోయిన దీర్ఘవ్యాధి లక్షణాలు. సివిల్ సర్వీసు అధికారులు మన గొంతులపై ఉచ్చును బిగిస్తున్నారనడానికి ఇవి ప్రబల నిదర్శనాలు' అంతేకాక ఈ పైశాచిక శాసనం సృష్టించే అధికారానికి శాంతియుతంగా విధేయత చూపడం'' ఇక వీలు కాదని స్పష్టంగా పేర్కొన్నాడు. ఈ బిల్లులకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో మొదటి చర్యగా బ్రిటీషు వారిని ఎదిరిస్తూ సత్యాగ్రహం ఎంచుకొన్నాడు. నిజానికి ఈ బిల్లులకు వ్యతిరేకంగా దేశం మొత్తం మొదటి రాజకీయ చర్యగా ఏప్రిల్ 6, 1919 తేదీని సంపూర్ణ హర్తాళ్‌గా పాటించారు. అయితే ఈ నిరసనలలో ప్రదర్శన కారులను చిత్రహింసలకు గురి చేయడం, కాల్పులు జరపడం ద్వారా నిరంకుశ అణచివేత, దమననీతి సర్వసాధారణమైంది.

రౌలత్ దుశ్శాసన పరిణామంగా పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఏప్రిల్ 13, 1919న జరిగిన మారణహోమాన్ని సేర్కొనవచ్చు. దాదాపు 1650 రౌండ్ల కాల్పులను ఎదుర్కొన్న ఈ మారణ హోమానికి 379 మంది విగత జీవులై సమిధలయ్యారనీ, 1200 మంది గాయాల పాలయ్యారనీ అధికారిక అంచనాలు తెలిపాయి. అయితే అనధికార అంచనాలు మృతుల సంఖ్య వేయి నుంచి 15 వందలుండవచ్చని తెలిపాయి.

BRAOU

2. 6 దండి యాత్ర

1930వ సంవత్సరంలో ఉప్పు చట్టాల రద్దుకై జరిగిన ఉద్యమం బ్రిటీషు వారి క్రూర స్వభావానికి గురైన మరో ప్రతీకగా చెప్పవచ్చు. ఆంగ్లేయుల ఉప్పును భారత దేశంలో అమ్మడాన్ని ప్రోత్సహించడానికి వీలుగా 1835 సంవత్సరంలో సాల్ట్ కమీషన్ భారతీయులు తయారు చేసే ఉప్పుపై పన్ను విధించాలని సిఫార్స్ చేసింది. ఉప్పు తయారీలో ప్రభుత్వం సంపూర్ణ గుత్తాధిపత్యాన్ని కలిగి వుండి, దాని ఉల్లంఘనలను శిక్షార్హం చేసింది.

గాంధీజీ దీన్ని సామ్రాజ్యవాదుల దోపిడీకి చిహ్నంగా భావించి భారతీయులంతా స్పందించే సామర్థ్యం గల ఉప్పు పన్ను సమస్యను ఎంచుకొన్నారు. నిత్య జీవితావసరమైన ఉప్పుపై పన్ను ప్రధానాంశంగా ఎంచుకొన్నారు. ఉప్పును బీద వారిలో అతి బీదవారి ఉత్పత్తిగా పేర్కొంటూ దానిపై పన్ను విధించడమనేది ''మానవుడు చాతుర్యంతో సమీకృతం చేసే అమానుషమైన పన్ను''గా అభివర్ణించాడు. ఉప్పు ద్వారా గణించిన రెవెన్యూ మొత్తం రెవెన్యూలో నాలుగు శాతం లేదా 70 మిలియన్ పౌండ్లు. ఈ పన్నుపై విచారం వ్యక్తం చేస్తూ గాంధీ ''ఈ ఉప్పు పన్ను ఇంత కాలంగా కొనసాగడానికి సాధారణ ప్రజల ఉదాసీనతే కారణం. ప్రస్తుతం తగినంత చైతన్యం వచ్చింది కాబట్టి ఆ పన్ను ఇక పోవాలి. ఈ పన్ను ఎంత త్వరగా రద్దవుతుందనేది పోరాటం జరిపే ప్రజల సామర్థ్యంపై ఆధారపడి వుంటుంది.

దీనికి అనుగుణంగా గాంధీ తన సబర్మతి ఆశ్రమం నుంచి సముద్ర ప్రాంతమైన దండికి మార్చి 30, 1930న ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించడానికై యాత్ర జరిపాడు. సముద్ర తీరంలో ఉప్పును ఏప్రిల్ 5, 1930లో తయారు చేయడం ద్వారా చట్టాన్ని ఉల్లంఘించి, దేశ వ్యాప్తంగా శాసనోల్లంఘనకు శ్రీకారం చుట్టాడు. ఈ ఉద్యమం జరిపిన ఐతిహాసిక పోరాటానికి ప్రతీకగా ధరాసనలో పెద్ద సంఖ్యలో ప్రజలు ఉప్పు డిపోను దాడి చేయడానికి సమీకృతమైన వైనాన్ని పేర్కొనవచ్చు. ఆ సందర్భంలో పోలీసులు క్రూరంగా ఏమాత్రం ప్రతిఘటించలేని ప్రజా సమూహాన్ని అంచెలు అంచెలుగా రక్తసిక్తం చేశారు. ఈ ఉద్యమం అనాగరిక దౌర్జన్యాలకు, నిష్కారణమైన కాల్పులకు దేశంలోని ప్రధాన భాగాల్లో సాక్ష్యంగా నిలిచింది.

తర్వాత జరిగిన గాంధీ-ఇర్విన్ ఒప్పందంతో అహింసాపరులైన రాజకీయ ఖైదీల విడుదలకు, ఆర్డినెన్స్‌ల ఉపసంహరణకు ఆమోదించారు. అదే విధంగా ఉప్పు తయారీ హక్కును గుర్తించి కొన్ని పరిమితులతో ప్రధానమైన శాంతియుత పికెటింగ్ హక్కును ఆమోదించారు.

BRAOU

2.7 బెంగాల్ విప్లవ కారులను ఎదుర్కొనే చర్యలు

చిట్టగాంగ్ సాయుధ తిరుగుబాటు జాతీయ విప్లవ కార్యకలాపాలకు ఆజ్యం పోసింది. ఒక్క 1930 సంవత్సరంలోనే 11 మంది బ్రిటీషు అధికారులు, 10 మంది అనధికారులు విప్లవ కారుల చేతుల్లో బలయ్యారు. ఫలితంగా 1932 జనవరి 1933 మార్చి మధ్య కాలంలో బ్రిటీషు వారు దాదాపు 1,20,000 మందిని అరెస్టు చేయడం, చిత్ర హింసలు, మానభంగాలు, అరెస్టులు, నిర్బంధాలు, ప్రజలను కాల్చి వేయడం, ఉరితీయడం లాంటి కేసులు వేల సంఖ్యలో వుండడం, 1932 జనవరి నెలలోనే 272 సంస్థలను చట్ట విరుద్ధంగా ప్రకటించడం జరిగింది.

భారత దేశంలో విప్లవానికి కేంద్రమైన బెంగాల్‌కు జాన్ అండర్‌సన్‌ను గవర్నర్‌గా నియమించారు. గతంలో అండర్‌సన్ ఐర్లాండ్‌లో బ్లాక్, టాన్ వ్యవహారాల నీచలక్షణాలను కలిగి వున్నాడు. అతని ప్రధాన కర్తవ్యం బెంగాల్‌లో విప్లవ పూరిత హింసను ''అంతకు ముందు కనీవినీ ఎరుగని దమననీతి పద్ధతులతో'' అణచివేయడం.

ఈ భయానక పరిస్థితిని నాజీ పద్ధతులతో పోల్చుతూ, ఇండియా లీగ్ బృందమనే వాస్తవ విచారణ సంఘం ఆగస్టు 17 నుంచి నవంబర్ 7, 1932 వరకు భారతదేశంలో పర్యటించి ఇలా నివేదించింది.

''జర్మనీ నాజీలు జరిపే దుశ్చర్యలను పత్రికలలో పూర్తి స్థాయిలో నివేదించడంలో అనాసక్తి ఏమీ లేదు. వాటిపై ఆగ్రహంతో నీతివంతమైన విమర్శలు చేయవచ్చు. అయితే భారత దేశంలో బ్రిటీషు రాజ్యం అంతే దుర్మార్గమైన దుశ్చర్యలకు పాల్పడుతున్నట్టు ఇంగ్లాండ్‌లోకొద్ది మందికి మాత్రమే తెలుసు!

2.8. క్విట్ ఇండియా ఉద్యమం

క్విట్ ఇండియా తీర్మానం ఆమోదించడాన్ని నివేదించిన అమెరికా పత్రికా ప్రతినిధి కథనం ఆధారంగా 1942 ఆగస్టు 8న ప్రముఖ కాంగ్రెస్ నాయకులు అంతా అరెస్టు అయ్యారు. ఆ ఉద్యమానికి నాయకుడు, సంస్థ అందుబాటులో లేకపోయినా ప్రభుత్వ ఆజ్ఞలు ధిక్కరించమని ఆ నాయకులు ఇచ్చిన పిలుపుకు ప్రజలు స్వచ్ఛందంగా స్పందించి దేశ వ్యాప్తంగా సమ్మెలు, హర్తాళ్ళు, ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహించారు.

ఈ దేశ వ్యాప్త సమ్మెలో బ్రిటీషు చిహ్నాలు, ప్రభుత్వ భవనాలైన పోస్టాఫీసులు, రైల్వేస్టేషన్లు, పోలీస్ స్టేషన్లు, టెలిగ్రాఫ్ లైన్లు దాడికి గురయ్యాయి. ప్రజలలోవుండే ఎలాంటి హింసా స్వభావాన్ని ఉపేక్షించక నిరోధించమని అణచి వేయాలనేది ఆనాటి అధికార ధోరణి. ఈ క్రమంలో వార్తలు, పత్రికలు కఠినమైన సెన్సార్‌షిప్‌కు గురయ్యాయి. అత్యంత నిరంకుశంగా లిన్‌లిథ్‌గో ఈ ఉద్యమాన్ని అణచివేసిన ఫలితంగా ఉద్యమం అంతం అయ్యే నాటికి దాదాపు పదివేల మంది పోలీసు మిలటరీ కాల్పులలోమరణించారు.

ఈ ఉద్యమాన్ని లిన్‌లిథ్‌గో ''1857 తర్వాత అంతటి విపత్కర తిరుగుబాటుగా....'' గుర్తించాడు. అయితే బిపిన్ చంద్ర మాటల్లో ఈ ఉద్యమం ''దేశంలో జాతీయతా వ్యవహారం లోతుగా చొచ్చుకుపోయి ప్రజల్లో ఘనమైన పోరాట పటిమ, త్యాగ నిరతి వృద్ధి నొంది'' ప్రదర్శితమైంది. కొన్ని సందర్భాల్లో బ్రిటీషు వారు ఈ నిరంకుశత్వాన్నీ, అప్రజాస్వామికతను గూఢంగా బొప్పించారు.

2.9 బ్రిటీషు వారి ద్వంద్వ ప్రమాణాలు

1881 సంవత్సరపు కర్మాగార చట్టం పని పరిస్థితులను, పని గంటలను మెరుగుపరిచే ఉదార చట్టమే అయినప్పటికీ ఆ చట్టాన్ని భారతీయులు యాజమాన్యం వహించే ప్రతి మిల్లులకే నిర్బంధంగా అమలు చేశారు. బ్రిటీషు వారు నిర్వహించిన టీ, కాఫీ తోటల్లో పరిశ్రమలల్లో అనారోగ్య పని పరిస్థితులతో వుండి శ్రామిక వర్గాలకు వేతనాలు చాలినంతగా వుండేవి కావు.

1878 సంవత్సరపు ఆయుధాల చట్టం బ్రిటీషు వారి అప్రజాస్వామిక స్వభావానికి మరో మచ్చుతునక. ఈ చట్టం నిర్ణయించిన మేరకు సుంకం చెల్లించి ఆయుధాలను దగ్గర వుంచుకోవడానికి ప్రజలకు వీలు కల్పిస్తుంది. అయితే యూరోపియన్లు, స్వదేశంలోని ఉన్నత వర్గాలకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపునిచ్చారు. అలాగే ప్రాంతీయ భాషా పత్రికల చట్టం (Vernacular Press Act) నిబంధనలు ప్రాంతీయ భాషల పత్రికా రంగానికే వర్తిస్తాయి. ఆంగ్ల పత్రికలకు ఇవి వర్తించవు.

2.10 పౌర హక్కులపై వివిధ జాతీయోద్యమ నాయకుల, సిద్ధాంతాల భావనలు

భారత దేశంలో బ్రిటీషు వలసవాద పాలన స్వభావంపై వివిధ సిద్ధాంతాల భావనా పరంపరలు, జాతీయ నాయకులు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

జాతీయోద్యమాన్ని మూడు భావనా సంప్రదాయాలు ప్రభావితం చేశాయి. అవి మితవాదులు, అతివాదులు, గాంధేయ వాదులు. మితవాదుల అభిప్రాయంతో బ్రిటీషు రాజ్యం ఉపకార నియంతృత్వ రాజ్యం. బ్రిటీషు పాలన

BRAOU

ప్రారంభ దశలో ఉపకార ధోరణితో వుండేదనీ, ఆ తర్వాత కాలంలో ఆ ఉదార స్వభావాన్ని నియంతృత్వ ధోరణి మార్చి వేసిందనీ మితవాదులు భావించారు. ఈ అనువంశిక ఉదార స్వభావం నుంచి దూరంగా నియంతృత్వం వైపు మరలిందనడానికి ఎన్నో ఉదాహరణలు. ప్రజలపై భౌతిక నిర్బంధాలు- బలప్రయోగం చేయడం మొదలైన వాటివల్ల ఈ నాయకులు మరిన్ని పౌర స్వేచ్ఛల కోసం డిమాండ్ చేశారు.

ఇక అతివాద భావనా సంప్రదాయ నాయకులు బ్రిటీషు విదేశీ ఆధిపత్యపాలన నుంచి సంపూర్ణ రాజకీయ స్వాతంత్ర్యాన్ని వాంఛించారు. వ్యక్తుల ప్రయోజనాలను జాతి ప్రయోజనాలతో గుర్తించారు. ఇక గాంధేయవాదుల దృష్టిలో బ్రిటీషు రాజ్యం అర్ధప్రాబల్య, అర్ధ నిరోధక రాజ్యం (Semi hegemonic, Semi Suppressive) గాంధీజీ దృష్టిలో బ్రిటీషు పాలన అధికారం సైనిక స్వభావాన్ని కలిగి వున్నప్పటికీ అప్పుడప్పుడు నైతికతతో సైనికతను అనుసంధిస్తుంది. ''దాని వైశిష్ట్యాన్ని ఇంకా వివరిస్తూ 'ప్రజాస్వామ్య బ్రిటన్ భారత దేశంలో చాతుర్యంతో ఒక వ్యవస్థను స్థాపించింది. ఆ వ్యవస్థను నగ్నంగా పరిశీలిస్తే అది ఉన్నత స్థాయిలో సమర్థవంతంగా వ్యవస్థీకృతమైన సైనిక నియంత్రణ తప్ప మరొకటి కాదు.

దాదాభాయ్ నౌరోజీ భారతీయులపై బల ప్రయోగాన్నీ, పోలీసును ప్రయోగించడానికి బదులుగా భౌతిక స్వేచ్ఛలు కావాలని తీవ్రంగా వాదిస్తాడు. బ్రిటీషు పరిపాలన మానవ జీవితాలకు, ఆస్తులకు భద్రత కోసం ప్రారంభమైందనే వాదనను నిరాకరిస్తూ ఇలా పేర్కొంటాడు.

''భారత దేశంలో జీవితాలకు, ఆస్తులకు భద్రత వుందనే కాల్పనికత వుంది. నిజానికి అలాంటిదేమీ వాస్తవంలో లేదు. ఒక అర్థంలో జీవిత భద్రత వుంది. అంటే ప్రజలకు స్వదేశీ నియంతల నుంచి, వారిలో వారి నుంచి హింస అనేది లేకుండా భద్రంగా వున్నారు. కానీ ఇంగ్లాండ్ స్వీయ అభిప్రాయంలో ఆస్తుల భద్రత అనేదే లేదు. దీని పర్యవసానంగా జీవిత భద్రత కూడా లేదు. భారతదేశపు ఆస్తి భద్రంగా లేదు. నిజానికి భద్రంగా వున్నది ఇంగ్లాండ్ మాత్రమే- అది క్షేమంగా, భద్రంగా వుండి, అంతే భద్రతతో భారత దేశం నుంచి దిగుమతి చేసుకొంటూ, భారతదేశంలో తింటూ సుసంపన్నంగా వుంది. కాబట్టి నేను సాహసంతో నివేదించేదేమంటే భారత దేశం అర్థాకలితో, పస్తులతో, కరువు-కాటకాలతో, వ్యాధులతో వుంది.

నిర్రోహ సమావేశాల (నిరోధక) బిల్లుపై తన అభిప్రాయం తెల్పుతూ గోఖలే ''ఈ చట్టం కార్యనిర్వాహక వర్గానికి ప్రమాదకరమైన విస్తృతాధికారాలను అందిస్తుంది. వాటిని ఉపయోగిస్తే వాటిని తప్పకుండా దుర్వినియోగం చేసే అవకాశం వుండి, దేశంలోని అన్ని వ్యవహారాలూ స్తంభించి పోతాయి''. 1910 సంవత్సరపు ప్రెస్ బిల్లును గోఖలే విమర్శిస్తూ ''బలప్రయోగం తాత్కాలిక ఉప శమనాన్ని అందిస్తుందేమో కాని శాశ్వత ప్రాతిపదికన ప్రస్తుతం మన దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం అందించలేదు''.

బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాటాన్ని సమర్థిస్తూ అరవింద ఘోష్ ఇలా పేర్కొన్నాడు. ''ప్రజలపై ప్రజలే విధించుకొన్న చట్టాలకు నిబద్ధత బలం వుంటుంది. కానీ బాహ్యశక్తులు విధించిన చట్టానికి నైతిక ఆమోదం వుండదు. అలాంటి చట్టం అన్యాయమైన, క్రూరమైనదైతే దానికి అవిధేయత చూపడం ప్రజల బాధ్యత కావచ్చు.''

గాంధీ దృష్టిలో ధర్మబద్ధమైన సమాజంతో కూడిన ప్రజాస్వామ్య ప్రభుత్వం అత్యంత అవసరం. 'ప్రజాస్వామ్యంలో వ్యక్తిస్వేచ్ఛా లేదా అభిప్రాయం, కార్యాచరణలకు ఉత్తేజ పూరితమైన భద్రత వుంటుంది. నేను కోరుకునేదీ, ఆశించేదీ బలప్రయోగం మీద ఆధారపడ్డ ప్రభుత్వం కాదు. గాంధీ విశ్వాసంలో ''ఏ సమాజాన్నీ వ్యక్తిగత స్వాతంత్ర్యం నిరాకరించడం ద్వారా నిర్మించలేము. ఆ భావన మౌలిక మానవ స్వభావానికి విరుద్ధం''

నెహ్రూ విశ్వాసంలో ''సేచ్ఛాపూరిత చర్చ, జిజ్ఞాసతో కూడిన సత్యాన్వేషణలకు అధికార వాదాలలో చోటే లేదు. ప్రజాస్వామ్య సిద్ధాంతానికి మాత్రమే అవి అంతర్భాగాలు.

B RAOU

భారత దేశంలో నిరంతరం కొనసాగే పౌర, ఆర్థిక హక్కుల అతిక్రమణల ద్వారా ఎదురయ్యే దుస్థితిని నౌరోజీ అమెరికా బానిసల దుస్థితితో పోల్చుతాడు. అతని అభిప్రాయంలో భారతీయుల పరిస్థితి వాస్తవంలో ''అమెరికా బానిసల కంటే దారుణం, ఆ బానిసలను కనీసం వారి యజమానులు తమ ఆస్తిగా భావించి సంరక్షిస్తారు.'' దీనికి కారణమైన బ్రిటీషు పరిపాలనను అంత మొందించాలని డిమాండ్ చేస్తూ ఆ పాలన ''అంతం లేకుండా, వృద్ధి నొందుతున్న రోజువారీ విదేశీ దురాక్రమణ'' అనీ అది 'దేశాన్ని మెల్లమెల్లగా పూర్తిగా నాశనం చేస్తుందనీ తెలుపుతాడు.

2.11 ముగింపు

బ్రిటీషు పరిపాలన ప్రారంభ దశలో ఉదార ప్రజాస్వామ్యవంతంగా వున్నా ఆ తర్వాత కాలంలో మెల్లమెల్లగా అప్రజాస్వామిక, నియంతృత్వ స్వభావాన్ని సంతరించుకొంది. ఆంగ్లేయుల స్వప్రయోజనాలు మాత్రమే అన్ని రంగాల్లో ఆర్థిక రంగం కానీ, సామాజిక రాజకీయ రంగాల్లో కానీ పరిపాలన సూత్రాలకు దిక్సూచి అయ్యాయి. దీని ఫలితంగా భారతీయుల పౌర స్వేచ్ఛల అతిక్రమణ సంఘటనలు సర్వసాధారణమైనాయి.

2.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **40** పంక్తులలో సమాధానం రాయండి!*

1. భారత దేశంలో బ్రిటీషు పాలన కాలంలో జాతీయోద్యమ చరిత్రను తెల్పండి?
2. బ్రిటీషు వారు తెచ్చిన ఉదార పరిపాలన చర్యలు తెల్పండి?

*ఈ క్రింది ప్రశ్నలకు **20** పంక్తులలో సమాధానం రాయండి!*

1. బ్రిటీషు బలవంత పాలన ఉపకార పాలనా! నియంతృత్వ పాలనా, కారణాలు తెలుపుతూ మీ అభిప్రాయాన్ని తెల్పండి?
2. పౌర హక్కులపై వివిధ జాతీయోద్యమ నాయకుల అభిప్రాయాలు పేర్కొనండి?

BRAOU

ఖండం - II

సామాజిక ఆర్థిక నేపథ్యం

భారతదేశంలోని మానవహక్కుల గూర్చిన చర్చ జరపాలంటే భారత సమాజంలోని పునాది అంశాలను అందుకు గల ఆర్థిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. మానవ హక్కులను అనుభవించడంలో ఆర్థిక అసమానతలు, సమాజంలోని అంతరాలు ఎలా అడ్డువస్తున్నాయో గమనించాలి. ఇటీవల దేశంలో అమలుజరుగుతున్న ఆర్థిక సంస్కరణలు సమాజంపై ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తున్నాయో అధ్యయనం చేయాల్సివుంది. ఇందుకు సంబంధించిన అంశాలు రెండవ ఖండంలో చర్చించాం. ఈ ఖండంలో నాలుగు భాగాలున్నాయి. అవి :

BRAOU

భాగం : 3. గ్రామీణ పేదరికం - మానవాభివృద్ధి

భాగం : 4. కనీస అవసరాలు - అభివృద్ధి

భాగం : 5. సుస్థిరమైన అభివృద్ధి - మానవ హక్కులు

భాగం : 6. సంస్థాగత సర్దుబాటు కార్యక్రమం - మానవ హక్కులు

BRAOU

భాగం 3: గ్రామీణ పేదరికం – మానవాభివృద్ధి

విషయక్రమం

3.0 ఉద్దేశం

3.1 పరిచయం

3.2 పేదరిక భావన

3.3 పేదరికం అంచనాల ఆవశ్యకత

3.4 పేదరికం - నిర్వచనం

3.5 దారిద్ర్య రేఖ

3.6 భారతదేశంలో పేదరిక దశలు

3.7 గ్రామీణ కుటుంబాలు-సామాజిక, ఆర్థిక లక్షణాలు

3.8 వ్యయపద్ధతి ఆధారంగా రూపొందించే దారిద్ర్య రేఖకు వున్న పరిమితులు

3.9 కేలరీ, గ్రహణ పద్ధతిపై ఆధారపడిన దారిద్ర్య రేఖ

3.9.1 కేలరీ గ్రహణ పద్ధతిపై రూపొందించే దారిద్ర్య రేఖకు వున్న పరిమితులు

3.10 ముగింపు

3.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

3.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

★ పేదరికం నిర్వచనాలను తెలుసుకుంటారు

★ భారతదేశంలోని పేదరిక లక్షణాలు వివరించగలుగుతారు

★ దారిద్ర్యరేఖ నిర్ధారణపై ఒక అవగాహనకు వస్తారు.

3.1 పరిచయం

''ప్రపంచంలో నేటికి 100 కోట్లకు పైగా ప్రజలు దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్నారు. ధనికప్రజలలో ప్రతీ ఐదవవ్యక్తి ఆదాయం పేదల్లోని ఐదవవ్యక్తి ఆదాయం కన్నా 150 రెట్లు అధికంగా ఉంది'' అని యుఎన్‌డిపి మానవాభివృద్ధిపై 1993లో రూపొందించిన నివేదికలో పేర్కొంది. పేదరికం, అసమానతలకు ప్రపంచంలోని ఏ వ్యవస్థ అతీతం కాదని ఈ మాటలను బట్టి అర్థమవుతుంది. ఆసియా ఖండం అందులోనూ భారతదేశంలో పేదరికం రోజురోజుకూ పెరుగుతుంది. పేదరికాన్ని అధ్యయనం చేసేందుకు, అవగాహన చేసుకునేందుకు అవసరమైన సమాచారం మొత్తం ఇక్కడ లభిస్తుంది. 'దక్షిణాసియాలో సుమారు 350 మిలియన్ల ప్రజలు (35కోట్లు) భయంకరమైన పేదరికంలో మగ్గుతున్నారు.

లో 80 శాతం మంది భారతదేశానికి చెందినవారు. తూర్పు ఆసియాలో మరో 168 మిలియన్ల ప్రజలు (16.8కోట్లు) కూడా ఇదే స్థితిలో ఉన్నారు. ప్రపంచ పేదరికంలో తూర్పు ఆసియా వాటా 60 శాతం కాగా, పశ్చిమాసియా వాటా 29 శాతం. ఈ రెండు కలిపితే ప్రపంచ పేదరికంలోని 89 శాతం వాటాను ఆసియా మోస్తున్నది.

పేదరికం అనే దృగ్విషయాన్ని అర్థం చేసుకోవడానికి, అంచనా వేయడానికి ఇక్కడ కొంత ప్రయత్నించాం. ఇందులో క్రోడికరించిన సంఖ్యాంకాలు పేదరికాన్ని సరైనరీతిలో అవగాహన చేసుకునేందుకు ఉపకరిస్తాయి. ఈ సమస్యపట్ల ఒక అర్థవంతమైన అభిప్రాయానికి వచ్చేందుకు సహాయపడతాయి.

3.2 పేదరిక భావన

పేదరికం అనే భావన గురించి చర్చించేముందు అసలు 'పేదరికం' అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలి. ముందుగా 'పేదరికం'పై నిపుణులు వెలిబుచ్చిన అభిప్రాయాలను, నిర్వచనాలను పరిశీలిద్దాం.

హెగెనార్స్ (1986) పేదరికానికి రెండు రకాలైన అర్థాలు చెప్పారు. అందులో మొదటిది- దారిద్ర్యరేఖకు ఎగువన ఉండడానికి అవసరమయ్యే వసతులు, సౌకర్యాలు లేని పరిస్థితుల్లో జీవించడం. కాగా ఆయా సమాజాలు నిర్దేశించిన సాధారణ జీవన ప్రమాణాలు కూడా అందుబాటులో లేని పరిస్థితి రెండవది. ముఖర్జీ అభిప్రాయం ప్రకారం 'ఒక వ్యక్తి మనుగడ సాగించేందుకు అవసరమైన కనీస సౌకర్యాలు కూడా పొందలేని అశక్తతే పేదరికం' పూర్తిగా లేని స్థితినే పేదరికంగా టెండూల్కర్ భావిస్తారు. వాస్తవంగా నిర్దేశించబడిన నియమావళినుసరించి వినియోగదారుల కనీస తలసరి వ్యయమునే దారిద్ర్యరేఖగా పేర్కొన్నారు.

గాడ్గిల్ (1945) ఉద్దేశం ప్రకారం మానవ పరిభాషలో పేదరికం అంటే కడుపునిండా తిండి, వంటినిండా బట్టలేకపోవడం. ఆర్థర్ అభిప్రాయంలో సాధారణ జీవన స్థాయిని కూడా పొందలేక పోవడమే. ఇలా పేదరికానికి రకరకాల నిర్వచనాలు, వ్యాఖ్యానాలు ఉన్నాయి. అయితే హారిక్, హడ్సన్‌లు పేదరికానికి వెలిబుచ్చిన అభిప్రాయం వాస్తవంగా ఉందని భావించవచ్చు. పేదరికం అనే సంక్లిష్ట అంశానికి నిర్వచనం ఇవ్వడం వల్లనో ఏదో ఒక లక్షణాన్ని ఆపాదించడం వల్లనో ప్రయోజనం లేదు అని వాళ్ళు అంటారు. మయ్యార్ (1991) కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. పేదరికం ఒక సంక్లిష్ట స్వరూపం; నిర్దిష్టకాలంలో దాని నిర్వచనం ఇది అని స్పష్టంగా చెప్పలేం' అంటారు.

పైనిర్వచనాలన్నిటినుంచీ మనం ఒక అభిప్రాయానికి రావచ్చు. ఒక వ్యక్తి కనీస అవసరాలను కూడా తీర్చుకోలేని అశక్తతతో ఉండడాన్ని పేదరికమని స్థూలంగా చెప్పుకోవచ్చు.

3.3 పేదరికం అంచనాల ఆవశ్యకత

పేదరికంపై రూపొందించిన అంచనాలు, గణాంకాలు ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు, వారిలో చైతన్యం పెంపొందించేందుకు పనికి వచ్చాయి. ఈ అంచనాలు రాజకీయనాయకులను, విద్యారంగప్రముఖులను, ప్రసార ప్రచార మాధ్యమాలను, విద్యార్థులు, కార్యకర్తలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వాళ్ళలో పేదరికం పట్ల అవగాహన పెంచి, దాన్ని రూపుమాపే దిశగా సన్నద్ధం చేశాయి. ఐదురకాలైన ప్రయోజనాలను పేదరికం అంచనాలు వెల్లడిచేస్తున్నాయి. వాటిల్లో మొదటిది ఒకసమాజంలోని ఆర్థికస్థితి సంక్షేమగుణాన్ని కలిగి వుందో లేదో చెప్పడం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఆదాయవనరుల పంపిణీలో అసమానతలను గుణాత్మకంగా వివరిస్తాయి. రెండవది అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేటప్పుడు పేదరిక అంచనాల చర్చలేకుండా సాంఘిక, ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకోవడం అసాధ్యం. అంటే అభివృద్ధిపనుల సమీక్షలో పేదరిక అంచనాలు కీలకపాత్ర పోషిస్తాయి. ఇక మూడవది దారిద్ర్య నిర్మూలనకై పథకాలు రూపొందించినపుడు ఏయే రాష్ట్రాలకు ఎంతెంత నిధులు మంజూరు చేయాలో నిర్ణయించడానికి ఈ అంచనాలు ఉపయోగపడతాయి. నాలుగవది- ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ద్వారా కేంద్రానికి సమకూరే నిధులను రాష్ట్రాలకు మంజూరు

BRAOU

చేసేటప్పుడు గాడ్గిల్‌సూత్రం (ఫార్ములా)కు పేదరిక గణంకాలే ఆధారమయ్యాయి. జాతీయ ఆదాయం, జాతీయోత్పత్తి, నమూనాలు రూపొందించే క్రమంలో ఏయే చర్యలు చేబట్టాలో, ఏయే కార్యక్రమాలు, ప్రణాళికలు తయారుచేసుకోవాలో నిర్ణయించుకునేందుకు ఈ గణాంకాలు ఉపయోగపడతాయి.

3.4 పేదరికం నిర్వచనం

ఒక మనిషి తన కనీస అవసరాలను కూడా తీర్చుకోలేని అసహాయస్థితిని పేదరికం ప్రతిబింబిస్తుంది. ఈ అశక్తతను ఆవ్యక్తి కనీస అవసరాలకోసం ఎంత మొత్తంలో ఖర్చు చేయగలడు, వాళ్ళ వినిమయ సామర్థ్యం ఆధారంగా నిర్ధారిస్తారు. ఆదాయం కొలబద్దగా, ప్రతిరోజు ఎన్ని కేలరీల ఆహారం ఒక వ్యక్తి తీసుకుంటాడు అనే దానిపై ఆధారపడి పేదరికాన్ని నిర్వచించే పద్ధతికి స్వస్తి చెప్పాలని భారత ఆధికారులు ఎంతోకాలంగా ప్రభుత్వానికి సూచనలిస్తూనే ఉన్నారు. ప్రణాళికా సంఘం నియమించిన నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తీకరించడంలో ఈ సూచనకు మరింత బలం చేకూరినట్లైంది. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పేదరికాన్ని అంచనాగట్టేందుకు అనుసరించాల్సిన పద్ధతులను అధ్యయనం చేసేందుకు ఈ నిపుణుల బృందాన్ని నియమించారు. అవసరమైతే పేదరిక నిర్వచనాన్ని కూడా పునర్ వ్యాఖ్యానించే అధికారాన్ని ఇది కలిగి ఉంది (ప్రణాళికా సంఘం 1993; పేజీ 202). దీని నివేదిక ప్రకారం (పేజీ-31) పేదరికాన్ని గణించేటప్పుడు ఒక మనిషికి ఎన్ని కేలరీల ఆహారం కావాలని, అంచనావేస్తే సరిపోదు. ఒక వ్యక్తి కనీస అవసరాలైన కూడు, గుడ్డ, విద్య ఆరోగ్యం, రవాణా సౌకర్యం తదితర లంశాలు కూడా ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. ఇవన్నీ వ్యక్తి సాధారణ జీవితం గడిపేందుకు ఉపకరిస్తాయి' అని పేర్కొంది. అంతే కాదు ఈ బృందం పేదరికాన్ని గణించేందుకు తీసుకోవాల్సిన కొలబద్దల గురించి పేర్కొంది.

1. ప్రాంతం, సామాజిక సమూహం, కుటుంబ లక్షణాలు లాంటి ప్రాముఖ్యత కలిగిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

2. పోషకాహార సూచికలో ఒక వ్యక్తి ఆంధ్ర సోమట్రిక్ వివరాలతో పాటు, వయసు, లింగబేధము, సాంఘిక, ఆర్థిక తరగతులను కూడా చేర్చాలి.

3. ఆరోగ్య ప్రమాణాలు, నీతినియమాలు, ఆరోగ్యసౌకర్యాలు వినియోగం, వినిమయసామర్థ్యం పౌర విద్యావ్యవస్థలోని నాణ్యత, విద్యావిషయక స్థితిగతులు, పాఠశాలలో నమోదుశాతం, నాణ్యతలను పరిగణనలోకి తీసుకోవాలి.

4. నివాసాలలో జనసాంద్రత, ఒకొక్క వ్యక్తికి అందుబాటులో ఉన్న స్థలం, ఇళ్ళు, సౌకర్యాల అందుబాటు, త్రాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని నిపుణుల బృందం అభిప్రాయపడింది.

ఈ మధ్యకాలంలోనే ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) పేదరికాన్ని పునర్ నిర్వచించడానికి ప్రయత్నించింది.

1996లో కేపబిలిటి పావర్టీ మేజర్ (సిపిఎం) మరియు మానవ పేదరిక సూచి (హ్యూమన్ పావర్టీ ఇండెక్స్)లు ఈ రెండు అధ్యయనాలు అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, అసమానత, సాంఘిక, అభద్రత లేకుండా చూసేందుకు ఉపకరించాయి. కాగా, ఒక సమూహం ఆదాయాన్ని కుటుంబ ఆదాయంతో పోల్చిచూడడం ద్వారా సాపేక్ష పేదరికాన్ని నిర్వచించే ప్రయత్నం సాగింది. అంటే ఒక సమూహం సరాసరి ఆదాయాన్ని ఒక కుటుంబ సరాసరి ఆదాయంతో పోల్చి చూశారు. సాపేక్షంగా చూస్తే, సమాజంలో కొద్దిపాటి ధనికులకు, జీవనస్థాయి కూడా లేని అధికులకు మధ్యనవున్న పేదరికం అని భావించవచ్చు. అంతే కాదు అశేష ప్రజానీకం దుర్భర జీవన పరిస్థితులకు కొద్దిపాటి ప్రజల వైభోగాలకు మధ్యవున్న అంతరంను పేదరికం అని నిర్వచించుకోవచ్చు. సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య ఆదాయ విభజనలో చోటుచేసుకుంటున్న అసమానతను ఎత్తి చూపడమే పేదరిక అధ్యయనాల ప్రధాన ఉద్దేశ్యం.

BRAOU

3.5 దారిద్ర్యరేఖ

పేదరికాన్ని అంచనా వేసేందుకు ఉపయోగపడే మొదటి అంశం దారిద్ర్యరేఖ. దీన్ని మూడు విధానాల ద్వారా రూపొందించవచ్చు

1. వ్యయ పద్ధతి (ఎక్స్‌పెండిచర్ మెథడ్)
2. కేలరీ గ్రహణపద్ధతి (కేలరీ ఇన్‌టేక్ మెథడ్)
3. కనీస ఆహార లభ్యత పద్ధతి (ఆప్టిమమ్ ఫుడ్ బాస్కెట్ మెథడ్)

వ్యయపద్ధతి :- ఈ పద్ధతిలో ఒక వ్యక్తికి కనీసంగా అవసరమయే ఆహారం, బట్టలు, గూడు, ఇంధనం, ఆరోగ్యభద్రత తదితర అవసరాలకయ్యే ఖర్చు ఆధారంగా దారిద్ర్యరేఖ రూపొందుతుంది. భారతదేశంలో దారిద్ర్యరేఖను రూపొందించే మొట్టమొదటి ప్రయత్నం1962లో జరిగింది. దేశంలోని కొందరు ఆర్థిక వేత్తలు, సామాజిక చింతనాపరుల బృందం ఈ ప్రయత్నాన్ని సాగించింది. ఈ అధ్యయనంలో వారు సంతులిత ఆహారంపై భారతీయ వైద్య పరిశోధనా సంస్థకు చెందిన పౌష్టికాహార సలహాసమితి సిఫార్సు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకున్నాయి. నిపుణుల బృందం చేసిన సూచనలు :

1. అయిదుగురు సభ్యులున్న ఒక కుటుంబ ఆదాయం నెలకు 100 రూపాయల కన్నా తక్కువ ఉండకూడదు.

   ఒక్కొక్క వ్యక్తికి కనీసం 20 రూపాయల ఆదాయమైనా ఉండాలి. (ఇవి 1960-61 నాటి ధరల ఆధారంగా సూచించిన పరిమితి)

2. పట్టణ ప్రాంతాల్లో ఈ ఆదాయం కుటుంబానికి 125 రూపాయలు, వ్యక్తికి 25 రూపాయలైనా ఉండాలి.
3. జాతీయాదాయంలో సగటున ఆరోగ్యం, విద్యకు అయ్యే ఖర్చును పరిగణనలోకి తీసుకోలేదు. ఎందుకంటే రాజ్యాంగం మరియు ఇతర హామీల ప్రకారం ఈ వసతులను ఆయారాష్ట్రాలు సమకూర్చవలసి ఉంటుంది.

1971లో దండేకర్, రత్‌లు రూపొందించిన రెండవ పద్ధతి ప్రకారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతిరోజు ఒక్కొక్క వ్యక్తికి 2,250 కేలరీల శక్తిగల ఆహారం ఉండాలి. దారిద్ర్యరేఖను నిర్ణయించడానికి వారు ఈ కేలరీలనే ప్రమాణంగా తీసుకున్నారు. ఒక వినియోగదారుని ఖర్చు గురించి శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ తయారు చేసిన గణాంకాల ఆధారంగా వీరు పలు సూచనలు చేశారు. ఈ గణాంకాల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో సంవత్సరానికి 170-180 రూపాయల వ్యయం చేసే ఒక్కో వ్యక్తి (నెలకు 14-20 రూపాయలు) రమారమిగా ఒక రోజు 2,250 కేలరీల ఆహారం తీసుకుంటాడు. పట్టణ ప్రాంతంలో ఈ లెక్క ఏడాదికి 271.70 రూపాయలు, నెలకు 22.60గా ఉంది. ఈ అంచనాలను 1960-61 ధరల ఆధారంగా రూపొందించారు. నిపుణుల బృందం (1962)లో చేసిన సిఫారసులతో వీటిని పోల్చి వీళ్ళు కొన్ని భేదాలను గ్రహించారు. గ్రామీణ ప్రాంత సగటు ధర తక్కువగా ఉండగా, పట్టణ ప్రాంతంలో కొంచెం ఎక్కువగా ఉండడాన్ని నిపుణుల బృందం గ్రహించింది. దీన్ని దృష్టిలో వుంచుకుని గ్రామీణ ప్రాంత సగటులో కొంచెం ఎక్కువగా చేసి ఏడాదికి 180 రూపాయలు, నెలకు 15/- రూపాయలుగా నిర్ణయించారు. అదే విధంగా పట్టణ ప్రాంతంలో ఏడాదికి 270/- రూపాయలు నెలకు 22.50 రూపాయలు ఉండాలని పేర్కొన్నారు. ఇవి రెండు 1960 ధరల సూచికనమసరించి రూపొందాయి.

కనీస అవసరాల ఆవశ్యకత, సమర్థవంతమైన వినిమయ డిమాండ్‌పై (ప్రణాళికా విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్(1979) బృందం పైన చర్చించిన వివిధ అంశాలను, గణాంకాలను క్రోడీకరించి దారిద్ర్యరేఖను కొత్తగా నిర్వచించింది. టాస్క్‌ఫోర్స్ నిర్వచనం ప్రకారం సగటు వ్యయం ప్రకారం గ్రామీణప్రాంతంలో ఒక్కో వ్యక్తి ఒక్కరోజు

BRAOU

2,435 కేలరీలు, పట్టణ ప్రాంతంలో 2,095 కేలరీల ఆహారం తీసుకోవాలి. ఈ సంఖ్యను గ్రామీణ ప్రాంతంలో 2,400 కేలరీలు పట్టణ ప్రాంతంలో 2,100 కేలరీలుగా నిర్ణయించింది. 1973-74లో వినియోగదారుని కొనుగోలు సామర్థ్యంపై ఆధారపడి మరో అంచనా కూడా రూపొందించారు. గ్రామీణ ప్రాంతంలో నెలసరి వ్యయం 49.09 రూపాయలు, కాగా, కేలరీల గ్రాహ్యత 2,400గా ఉండాలి. పట్టణ ప్రాంతంలో నెలసరి వ్యయం 56.64 రూపాయలు కాగా ఒక్కో వ్యక్తి ప్రతిరోజు కనీస 2,100 కేలరీల ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ గణాంకాలు ప్రతిరోజు అవసరమైన కేలరీలను కొనుగోలు చేసే సామర్థాన్ని కూడా తెలుపుతాయి.

ప్రణాళికా సంఘం (1993) నిపుణుల బృందం దారిద్ర్యరేఖను 1977-78, 1983, 1987-88లలో మార్చుతూ వచ్చింది. దారిద్ర్యరేఖను నిర్ణయించేందుకు ఆ ఏడాది అమలులో వున్న ధరలను పరిగణనల్లోకి తీసుకోవాలనే జాతీయ నిబంధనల ఆధారంగా వీటిలో మార్పుచేశారు. గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయకార్మికులు వినిమయ ధరల సూచి (Consumer price Index for Agricultural labour) (PIAL), పట్టణ ప్రాంతంలోని పారిశ్రామిక కార్మికుల వినిమయ ధరల సూచి (consumer price Index for Industrial Workers - (PIIW) ల సహాయంతో కూడా దారిద్ర్యరేఖలో మార్పులు చేర్పులు చేస్తారు.

Table - 1

దారిద్ర్యరేఖలు మరియు భారతదేశంలోని పేదలు

సంవత్సరం	గ్రామీణ ప్రాంత దారిద్ర్య రేఖలు	గ్రామీణ పేదలశాతం	పట్టణప్రాంత దారిద్ర్య రేఖలు	పట్టణ పేదలశాతం
1973-74	40.09	56.44	56.64	49.23
1977-78	56.84	53.07	72.50	47.40
1983	89.45	45.61	117.64	42.15
1987-88	115.43	39.06	165.58	40.12
1993-94	210.00	39.00	274.80	30.20

BRAOU

3.6 భారతదేశంలో పేదరిక దశలు

గత ఇరవైఏళ్ళ గణాంకాలు పరిశీలిస్తే గ్రామీణ పట్టణ ప్రాంత పేదరికం రానురాను తగ్గుతూ వస్తోందని అవగతమవుతోంది. 1973-74 నుంచి 1993-94 వరకు వివరాలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది. గ్రామీణప్రాంతాల్లో 1973-74లో పేదల శాతం 56.44 వుండగా, 1993-94 నాటికి అది 39 శాతానికి పడిపోయింది. కాగా పట్టణ ప్రాంతాల్లో 42.23 శాతం నుంచి 30.20 శాతానికి తగ్గింది.

3.7 గ్రామీణ కుటుంబాలు–సామాజిక, ఆర్థిక లక్షణాలు

గ్రామీణ ప్రాంత కుటుంబాల ఆర్థిక స్థితిని వర్గీకరించేందుకు అంతకుముందు ఏడాదిలోని ప్రధాన ఆదాయవనరును పరిగణనలోకి తీసుకుంటారు. అవి కింది విధంగా ఉంటాయి.

(1) వ్యవసాయంలో స్వయం ఉపాధి పొందే కుటుంబాలు

(2) వ్యవసాయేతర రంగంలో స్వయం ఉపాధి పొందే కుటుంబాలు

(3) వ్యవసాయరంగంలోని గ్రామీణ కూలీ కుటుంబాలు

(4) వ్యవసాయేతర రంగంలో గ్రామీణ కూలీ కుటుంబాలు

(6) ఇతరులు (స్వయం ఉపాధి లేని, గ్రామీణ కూలీలు కాని కుటుంబాలు).

మొదటి రెండు వర్గాల వారికి భౌతిక వనరులు, ఆస్తులు ఉంటాయి. దాని నుంచే వారు స్వయం ఉపాధి పొందుతారు. తరువాత రెండు వర్గాల ప్రజలు స్వంత ఆస్తులు లేని గ్రామీణ కూలీలు.

వీరు శారీరక శ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తారు. ఇక చివరి వర్గం వారు క్రమం తప్పకుండా జీతభత్యాలు పొందేవారు. అంటే ప్రభుత్వ అధికారులుగా వున్నవారు లేదా పరిశ్రమలలో పెద్ద పెద్ద ఉద్యోగాల్లో ఉన్నివారు.

జాతీయస్థాయిలో అధికారిక దారిద్ర్యరేఖకు దిగువన వున్న గ్రామీణ కుటుంబాల వివరాలు (శాతంలో) ఇలా వున్నాయి.

1983, 1987-88, 1993-94లలో ఉపాధి ఆధారంగా చేసిన ఐదు వర్గాల ప్రజల వివరాలు టేబుల్‌లో ఉన్నాయి.

Table - 2

దారిద్ర్యరేఖకు, దిగువనవున్న గ్రామీణ ప్రాంత కుటుంబాలశాతం

క్రమసంఖ్య	ఉపాధివర్గం	1983	1987-88	1993-94
1.	వ్యవసాయరంగంలో స్వయం ఉపాధి కుటుంబాలు	38.99	35.88	27.11
2.	వ్యవసాయేతరరంగంలో స్వయం ఉపాధి కుటుంబాలు	42.89	36.11	29.13
3.	గ్రామీణ వ్యవసాయకూలీలు	63.20	59.63	50.56
4.	గ్రామీణ వ్యవసాయేతర కూలీలు	44.13	43.66	34.62
5.	ఇతరులు	29.80	25.40	23.27
6.	అన్ని వర్గాల కుటుంబాలు	46.80	42.25	34.70

BRAOU

ఆధారం :

1. సర్వేక్షణ ఏప్రిల్ 1988 (1983 గణాంకాలకోసం)
2. సర్వేక్షణ సెప్టెంబర్ 1990 (1987-88 గణాంకాల కోసం)
3. ఎన్ఎస్ఎస్ రిపోర్టు నెం. 409
   (1993-94 గణాంకాల కోసం)

పై టేబుల్‌ను పరిశీలిస్తే ప్రతి ఉపాధివర్గంలోనూ పేదరికం తగ్గుతూ వస్తోందని తెలుస్తోంది. అయినప్పటికి గ్రామీణ కుటుంబాల్లోని మూడో వంతు ప్రజలు ఇంకా దారిద్ర్యరేఖకు దిగువన మగ్గుతున్నారని 1993-94 గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర గ్రామీణ కూలీ కుటుంబాలతో పోలిస్తే వ్యవసాయ కూలీల పేదరికం అధికంగా కనిపిస్తుంది. వ్యవసాయ కూలీల శాతం ఏ ఏడాది కూడా 50 శాతానికి తక్కువ లేదు. ఏడాది పొడుగునా ఉండని ఉపాధి, కూలీ రేట్లలోని మార్పులు, తక్కువ కూలి వారి దుస్థితికి ప్రధాన కారణం. స్వయం ఉపాధి వున్న గ్రామీణ కుటుంబాల పేదరికం

వ్యవసాయ కూలీల దారిద్ర్యానికన్నా కొంచెం తక్కువగా వుంది. వ్యవసాయ, వ్యవసాయేతర వర్గాల్లోని పేదరికానికి మధ్య ఉన్న వ్యత్యాసం అత్యల్పం. కాగా, శారీరక శ్రమపై ఆధారపడని వర్గం, స్వయం పోషక వర్గం కాని గ్రామీణ కుటుంబాల్లో పేదరికం ఛాయలు స్వల్పంగా కనిపిస్తున్నాయి.

Table - 3

జాతీయ స్థాయిలో సామాజిక బృందాలు, ఉపాధి వర్గాల ఆధారంగా గ్రామీణ ప్రాంత కుటుంబాల పేదరికం వివరాలు 1993-94 గణాంకాలు శాతంలో

క్రమ సంఖ్య	ఉపాధివర్గం	షెడ్యూల్డు తెగలు	షెడ్యూల్డు కులాలు	ఇతరులు	అన్నిరకాల ఉపాధి వర్గ కుటుంబాలు
1.	వ్యవసాయరంగంలో స్వయం ఉపాధి కుటుంబాలు	49.5	40.0	27.3	31.1
2.	వ్యవసాయేతర రంగంలో స్వయం ఉపాధికుటుంబాలు	46.6	40.4	31.1	33.6
3.	గ్రామీణ వ్యవసాయ కూలీలు	65.8	62.0	54.4	58.8
4.	గ్రామీణ వ్యవసాయేతర కూలీలు	54.4	43.8	37.4	41.7
5.	ఇతరులు	32.6	30.9	21.3	23.7
6.	అన్ని వర్గాల కుటుంబాలు	54.2	50.3	33.1	39.0

ఆధారం : నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ రిపోర్ట్ నెం. 422 (ఆగస్టు 1997)

ఈ గణాంకాలు 1993-94 సంవత్సరంలోని మూడు సామాజిక బృందాల్లోని(ఎస్సీ, ఎస్టీ, ఇతరులు) ఉపాధి వర్గాల ఆధారంగా పేదల వివరాలు అందిస్తున్నాయి. ఉపాధి వర్గాల్లో ఎస్సీ, ఎస్టీయేతరులకన్నా ఎస్సీ, ఎస్టీ బృందాలే అధికంగా పేదరికాన్ని చవిచూస్తున్నాయి. ఇంతకుముందే చెప్పినట్లు గ్రామీణ కూలీ కుటుంబాలకు స్వంత ఆస్తులుండవు. స్వల్పమైన కూలీ రేట్లు, పూచీలేని శారీరక శ్రమతో డోలన స్థితిలో బతుకుతున్నాయి. ఆర్థికంగా ఇది ప్రతికూలాంశం. ఈ లెక్కనజూస్తే ఎస్సీ, ఎస్టీలకు ఆర్థికంగా సామాజికంగా రెండుస్థాయిల్లో వుండే ప్రతికూలాంశాలు వాళ్ళని మరింత పేదరికంలోకి నెడ్తున్నాయి. స్వయం ఉపాధి వర్గంలోని (వ్యవసాయ, వ్యవసాయేతర) అన్ని కుటుంబాల పేదరిక శాతంతో పోలిస్తే ఎస్సీ ఎస్టీ కుటుంబాల్లో పేదరికం చాలా ఎక్కువ. అంతే కాదు ఎస్సీల కన్నా ఎస్టీ కుటుంబాల్లో ఈ దారిద్ర్యశాతం మరింత అధికంగా కనిపిస్తుంది. సామాజిక, ఆర్థిక వర్గాల ఆధారంగా జాతీయస్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదల్లో అంతరాలు ఎన్నో ఆసక్తికరమైన అంశాలను వెల్లడి చేస్తున్నాయి. అదే విధంగా పట్టణ ప్రాంతంలోని ప్రజల మధ్య నెలకొని వున్న అంతరాలు తెలిపే గణాంకాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతానికే చర్చను పరిమితం చేయడం జరిగింది.

3.8 వ్యయపద్ధతి ఆధారంగా రూపొందించే దారిద్ర్యరేఖకు వున్న పరిమితులు

వ్యయ పద్ధతి మీద ఆధారపడి రూపొందించే దారిద్ర్యరేఖకు పలు పరిమితులు ఉన్నాయనే వాదన ఉంది. ఆ పరిమితులు, అభ్యంతరాలు ఏమిటో పరిశీలిద్దాం.

BRAOU

1) సంపూర్ణ పేదరికం అనే భావన అసమగ్రమైనది. ఎందుకంటే దారిద్ర్యరేఖ రూపకల్పనలో సాపేక్ష పేదరికం కూడా కీలకమైన పాత్ర కలిగి ఉంటుంది. ఒక్కో జాతీయాదాయ స్థాయిలో సాపేక్ష పేదరికం సంపూర్ణ పేదరికానికి ప్రత్యామ్నాయంగా వుంటుంది. పేదరికం, అసమానత అనే భావనలను క్రమం తప్పకుండా పరిశీలించాలి. ఈ క్రమంలో అవి ఒక దానితో ఒకటి ముడిపడి వున్న భావనలనే విషయాన్ని గుర్తించాలి.

2) దారిద్ర్యరేఖ రూపొందించే క్రమంలోనేడు మనకు సౌఖ్యంగా కనిపించింది. రేపు 'అత్యవసరమైన' వస్తువుగా మారవచ్చు. ప్రజల అభిరుచి దృష్టికోణం, ఆకాంక్షల్లో వచ్చే తేడా వల్ల, సాంకేతిక మార్పుల వల్ల సంభవించవచ్చు. అపుడు పేదరికం నిర్వచనం మారిపోతుంది. దారిద్ర్యరేఖ కుంచించుకుపోతుంది.

3) పేదరికానికి చిహ్నాలైన అనారోగ్యం, అవిద్య, భౌతికవెలివేత, న్యాయం పొందలేని అశక్తత, పౌరసమాజంలో అధికార హీనత, కులం, లింగభేదం తదితర అంశాలు దారిద్ర్యరేఖ రూపొందించేటప్పుడు పరిగణనలోకి తీసుకోరు. ఇది ఒక పెద్దలోపం.

4) ఈ దారిద్ర్యరేఖ వ్యక్తిగత అంశాలను, గ్రాహ్యతను గమనంలోకి తీసుకుంటుంది తప్ప సామాజిక గ్రాహ్యతలను తీసుకోదు. అంటే ఒక వ్యక్తి తీసుకునే ఆహారం (కేలరీల) మీద దృష్టి నిలిపినట్లు ప్రాథమిక విద్య, ఆరోగ్యం, మంచినీటి సరఫరా, పారిశుద్యం, పర్యావరణ పరిస్థితుల మీద కూడా దారిద్ర్యస్థాయి ఆధారపడి వుంటుందని గుర్తించదు.

5. వ్యక్తిగత, నియమ సహిత అంశాలను దారిద్ర్యరేఖ నిర్ణయంలో పరిగణనలోకి తీసుకుంటారు. అయితే ఆహారం కాని వస్తువులపై (ఇంటిఅద్దె, ఇంధనం, బట్టలు, ఆరోగ్యం, మొ।।నవి) పెట్టే ఖర్చును లెక్కలోకి తీసుకోరు. దారిద్ర్యరేఖ తయారు చేసేటపుడు వ్యక్తిగత అవసరాలకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో వీటికి కూడా దరిదాపు అంతే ప్రాముఖ్యత వుంటుంది. పైగా, మధ్యం, సారాను అత్యవసరాల జాబితాలో చేర్చారు.

6) సువిశాలమైన భారతదేశం భిన్నత్వంలో కూడుకొని వుంటుంది. ఒక్కో రాష్ట్రంలోని పరిస్థితులు, ధరలు అవసరాలు ఒక్కో విధంగా వుంటాయి. కానీ విచిత్రంగా దారిద్ర్యరేఖ రూపకల్పనలో జాతీయ స్థాయి విలువలనే అందరికీ ఆపాదిస్తారు.

BRAOU

3.9 కేలరీ, గ్రహణ పద్ధతిపై ఆధారపడిన దారిద్ర్యరేఖ

నిర్దిష్టమైన ప్రాంతానికి చెందిన వినియోగదారుల వ్యయగణాంకాలననుసరించి వాళ్ళు తీసుకొంటున్న బలవర్ధక ఆహారాన్ని రెండవ పద్ధతి లెక్కగడుతుంది. జాతీయశాంపుల్ సర్వే సంస్థ తీసుకుంటున్న ఆహార్షపరిమాణాలకు దాని మీద పెడుతున్న వ్యయానికి సంబంధించిన లెక్కలను సేకరించింది. వీటిల్లో ధాన్యాలు, పప్పులు, పాలు, పాల ఉత్పత్తులు కూరగాయలు, పండ్లు, సుగంధద్రవ్యాలు ఉన్నాయి. వీటి మోతాదును అనుసరించి ఎన్ని కేలరీలు అనే ప్రమాణాన్ని రూపొందించారు. ఈ కేలరీ ప్రమాణాన్ని పరిపుష్టం చేసేందుకు అవసరమైన వ్యయాన్ని ఈ పద్ధతి లెక్కగడుతుంది. కేలరీ వ్యయాన్ని అంచనా వేసేందుకు సరైన సూత్రాన్ని అవలంభించాలి. ఉదాహరణకు (1) సెమి-లాగ్ 2) డబల్-లాగ్ 3) లాగ్-లాగ్ ఇన్‌వర్స్ తదితర పద్ధతులు వీటి ఆధారంగా కేలరీ గ్రహణకు అయ్యే ఖర్చు ప్రతిరోజు ఎంత అవుతుందో తెలుపుతుంది. ఉదాహరణకు 1500 కేలరీలు, 1800 కేలరీలు 2100 కేలరీలు, 2400 కేలరీలు ప్రతిరోజు అవసరమవుతాయని లెక్కగడుతుంది.

3.9.1 కేలరీ గ్రహణ పద్ధతిపై రూపొందించే దారిద్ర్యరేఖకు వున్న పరిమితులు

1) కేలరీల వినియోగంనుసరించి దారిద్ర్యరేఖను నిర్ధారిస్తారు పోష్టికాహారం, వయస్సు, సెక్స్, జనాభా మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. పోష్టికాహార సూత్రం మీద ఆధారపడి దారిద్ర్యరేఖను నిర్వచించినా వ్యక్తిగత, సామాజిక లెక్కలోకి తీసుకోరు.

2) జనాభా నిర్మాణపరంగా రాష్ట్రాల మధ్య ముఖ్యమైన తారతమ్యాలు ఉంటాయి. అంతేకాదు వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, ఆయా రాష్ట్రాల కార్యక్రమాల సరళి ఇతర అంశాలలో తేడాలుంటాయి. మనం తీసుకునే కేలరీల పరిమాణంలో ఇవి తప్పనిసరిగా ప్రతిఫలిస్తాయి. వీటిని బట్టి రాష్ట్రాల వారీగా తీసుకోవాల్సిన కేలరీల పరిమాణాన్ని లెక్కగడతారు. కేలరీల వినియోగంలో వివిధ రాష్ట్రాల మధ్య తప్పనిసరిగా భేదాలుంటాయి.

హెడ్ కౌంట్‌మెథడ్' అని ఉంది. దీనితో పాటు 'పావర్టీ గ్రూప్ మెథడ్', 'సేన్స్ పావర్టీ ఇండెక్స్'లు ఉన్నాయి. వీటి ద్వారా దారిద్ర్య లెక్కలను మరింత శాస్త్రీయంగా అంచనా గట్టడానికి అవకాశం ఉంటుంది. దారిద్ర్యలెక్కలు నిత్యావసర వస్తువుల లోటు తీవ్రతను విస్పష్టం చేస్తాయి. గౌరవంగా జీవితాన్ని గడిపే మౌలికమైన మానవహక్కును కోల్పోయేలాగ పేదరికం కోరలు చాచగలదు. దీని పరంగా మనకు దారిద్ర్య సూచికలు ఎప్పుడూ సహాయకారిగా ఉంటాయి.

3.10 ముగింపు

ప్రపంచ సామాజిక, ఆర్థిక అంశాలలో పేదరికం గూర్చిన చర్చ లేకుండా వాటిని సంపూర్ణంగా అవగాహన చేసుకునే అవకాశం లభించదు. ప్రపంచ జనాభాలో నేటికి ఆరింట ఒక వంతుప్రజలు దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్నారు. ఈ అంశాలను సృజించకుండా నేటి ఆధునిక కాలంలో మానవాభివృద్ధి గూర్చి మాట్లాడుకునే పరిస్థితికనిపించటం లేదు. ఈ భాగం మానవాభివృద్ధికి గ్రామీణ పేదరికం ఎలా అవరోధంగా మారుతుందో వివరించగలిగింది. ముఖ్యంగా భారత దేశంలో పేదరికానికున్న సామాజిక ఆర్థిక కారణాలను ఈ భాగం శాస్త్రీయంగా చర్చించింది. ఇటువంటి ప్రయత్నాలవల్లే దారిద్ర్య నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలు ఎలా వుండాలో గుర్తించే వీలుకలుగుతుంది. అప్పుడే పేదరిక నిర్మూలనా కార్యక్రమం విజయవంతమై మానవాభివృద్ధి స్థాయి మరింత పెరుగుందేందుకు మార్గం సుగమం అవుతుంది.

3.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **40** పంక్తులలో సమాధానం రాయండి!*

1. పేదరికాన్ని వివరించి, దాన్నిలెక్కించే పద్ధతులను విశ్లేషించండి?
2. గ్రామీణ భారతంలో వ్యాపించివున్న పేదరిక పరిస్థితులను చర్చించండి. మానవ హక్కుల అమలులో వాటి ప్రభావం ఎలా ఉంటుందో వివరించండి?

*ఈ క్రింది ప్రశ్నలకు **20** పంక్తుల్లో సమాధానం రాయండి!*

1. భారతదేశంలోని పేదరిక దశలు చర్చించండి?
2. దారిద్ర్యరేఖపై ఒక వ్యాసం రాయండి?

BRAOU

BRAOU

భాగం 4 : కనీస అవసరాలు – అభివృద్ధి

విషయక్రమం

4.0 ఉద్దేశం

4.1 పరిచయం

4.2 భారత రాజ్యాంగం, యుఎన్ సదస్సులు, కనీస అవసరాలు

4.3 భారత పంచవర్ష ప్రణాళికలు, కనీస అవసరాల పుట్టుక

4.3.1 కనీస అవసరాల కార్యక్రమ స్వరూపం

4.4 కనీస అవసరాల కార్యక్రమం - ప్రణాళిక

4.4.1 ప్రాథమిక విద్య

4.4.2 గ్రామీణ ఆరోగ్యం

4.4.3 గ్రామీణ నీటి సరఫరా

4.4.4 గ్రామీణ గృహ వసతి

4.4.5 గ్రామీణ విద్యుద్దీకరణ

4.4.6 గ్రామీణ రహదారులు

4.4.7 పట్టణ ప్రాంత మురికి వాడల పర్యావరణ పురోగతి

4.4.8 పౌష్టికాహారం

4.4.9 మధ్యాహ్న భోజన కార్యక్రమం

4.4.10 గ్రామీణ పారిశుద్ధ్యం

4.4.11 ప్రజాపంపిణీ వ్యవస్థ

4.5 ముగింపు

4.6 నమూనా పరీక్షా ప్రశ్నలు

BRAOU

4.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

★ కనీస అవసరాల ఆవశ్యకతను గుర్తిస్తారు

★ భారత పంచవర్ష ప్రణాళికల కనీస అవసరాలను ఎలా గుర్తించామో చర్చించగలుగుతారు

★ కనీస అవసరాల కార్యక్రమ ప్రణాళికను వివరించగలుగుతారు

4.1 పరిచయం

ఈ పాఠాన్ని నాలుగు భాగాలుగా వర్గీకరించాం. మొదటి భాగంలో భారత రాజ్యాంగాన్ని, ఐక్యరాజ్యసమితి సదస్సులను దృష్టిలో పెట్టుకుని దేశ ప్రజల కనీస అవసరాలు తీర్చాల్సిన ఆవశ్యకతను చర్చించాం. రెండవ విభాగంలో కనీస అవసరాల కార్యక్రమం (మినిమం నీడ్స్ ప్రోగ్రామ్) పుట్టు పూర్వోత్తరాలను గురించి వివరించాం. మినిమం నీడ్స్ ప్రోగ్రామ్ ప్రణాళికా, అమలు తీరు గురించి మూడవ ప్రకరణంలో ప్రస్తావించాం. ముగింపు చివరి ప్రకరణంలో వుంటుంది.

4.2 భారత రాజ్యాంగం, యుఎన్ సదస్సులు, కనీస అవసరాలు

ఐక్యరాజ్య సమితి సదస్సులోని అంశాలను ఇందులో పరిశీలించాం. ప్రజలకు హుందాకరమైన జీవన ప్రమాణాలను కల్పించడంపై భారత రాజ్యాంగం గురించిన ప్రస్తావన కూడా ఇక్కడ వుంది.

భారత రాజ్యాంగం ముందుమాట (ప్రియాంబుల్)లో పౌరులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని సమానంగా కల్పించాలని విస్పష్టంగా పేర్కొన్నారు. అంతేకాదు ప్రతివ్యక్తికి సమాన స్థాయి, అవకాశాల రూపకల్పనకూడా ఇందులో సూటిగానే చెప్పారు. ప్రాథమిక హక్కులను ప్రజలకు కల్పించడం ద్వారా ఈ లక్ష్యాలను సాధించాలని భారత రాజ్యాంగ నిర్ణేతలు ఆలోచించారు. చట్టబద్ధమైన ఈ హక్కులకు ఆటంకం ఏర్పడితే కోర్టుద్వారా న్యాయం పొందే అవకాశం వుంటుంది. ఆదేశిక సూత్రాలను కూడా ఇదే వుద్దేశంలో రూపొందించడం జరిగింది. ఆదాయంలో అసమానతలను తొలగించడం రాజ్యంపై వుంచారు. రాజ్యాంగం స్టేట్‌ని బాధ్యతాయుతంగా మసలుకునేట్లు బాధ్యతలను పెట్టింది. అవకాశాల్లో, సౌకర్యాల్లో, గౌరవం, హోదాలను కల్పించడంలో వ్యక్తుల మధ్య అసమానతలను తొలగించాలనే ప్రయత్నం చేబట్టారు. ఇది వ్యక్తులకే పరిమితం కాకుండా రకరకాల వృత్తులతో జీవనాన్ని కొనసాగిస్తున్న వివిధ ప్రాంతాలకు సంబంధించిన ప్రజా సమూహాలకు కూడా దీన్ని వర్తించారు.

BRAOU

భారత రాజ్యాంగంలోని నాలుగవ భాగంలో ఆదేశిక సూత్రాలున్న విషయం తెలిసిందే. ఆర్థిక ప్రజాస్వామ్యం, న్యాయాలను నిర్దిష్టమైన ఆర్థిక హక్కుల ద్వారా దేశ పౌరులకు అందజేయాలనేది ఆదేశిక సూత్రాల అసలు ఉద్దేశం. వీటిపై కోర్టులకు మనం వెళ్లలేకపోయినా రాజ్యం వీటిపై నైతిక బాధ్యతను వహించాల్సి వుంటుంది. ప్రభుత్వం తన విధాన నిర్ణయాల్లో, నిత్యం చేబడుతున్న పలు విధాన కార్యక్రమాల నిర్వహణలో ఆదేశిక సూత్రాల స్ఫూర్తిని చేజారనివ్వకూడదు.

జాతీయ స్థాయిలో పలు విషయాల్లో కనీసం పాటించాల్సిన నిర్దిష్ట ప్రమాణాలను ఆదేశిక సూత్రాలు విస్పష్టం చేస్తున్నాయి. రాజ్యాంగంలో పేర్కొన్నవేమిటంటే :

1. తగిన జీవనోపాధి వుండాలి. బ్రతకడానికి సరిపడే వేతనం వుండాలి.
2. ఉపాధి లేదా ఏదైనా పని
3. అందరికీ విద్యావకాశాలు అందుబాటులో వుండాలి. పిల్లలకు 14 సంవత్సరాల ద్వారా నిర్బంధవిద్యను అమలు పరచాలి.
4. అవసరాల్లో వున్నవాళ్ళకి, వృద్ధులకు, నిరుద్యోగులకు, అసహాయులకు ప్రభుత్వ సహాయం.
5. వినోదం, సామాజిక, సాంస్కృతిక సదుపాయాలతో కూడిన పూర్తిస్థాయి ఉపాధి అవకాశాలు.
6. సంపూర్ణ పోషక పదార్థాలు, మెరుగైన ఆహారం.

ప్రజల నిత్య అవసరాలకు భారత రాజ్యాంగం ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో దీన్ని బట్టి మనకు తెలుస్తుంది. ప్రజల కనీస అవసరాలను తీర్చడానికి భారత ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ఒక వరుసలో పెట్టే ప్రయత్నంకు రాజ్యాంగం

ఏనాడో పూనుకుంది.

ఆదేశిక సూత్రాల్లో సామాజిక న్యాయం, సమానత్వాలకు అధిక ప్రాధాన్యతనివ్వడాన్ని గమనించవచ్చు. విద్య హక్కును, పని హక్కును, అవసరమైన వాళ్లని ఆదుకునే హక్కును, సంపూర్ణ ఆరోగ్య హక్కును స్టేట్' నిజాయితీగా ప్రజలందరికీ సమానంగా అందజేయాలి. సమానత్వ సాధన కోసమే ఇలాంటి హక్కులను రాజ్యాంగంలో నిక్షిప్తం చేయడమైంది. ప్రభుత్వాలు చేపడుతున్న విధాన నిర్ణయాల్లోని అంతరార్థం కూడా అదే.

సామాజిక న్యాయం, సమానత్వం, సంక్షేమం విలువలకు జాతి కట్టుబడి వున్నప్పుడే సామాజికమైన లేదా ఆర్థికపరమైన గమనం సాధ్యమవుతుందనే అభిప్రాయం ఒకటి గాఢంగా వుంది. మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో వీటిని పొందుపరిచారు. విస్తృత పరిధిలో మూడు లక్ష్యాలను రాజ్యాంగంలో ప్రస్తావించారు. మౌలికమైన భౌతిక నిర్మాణానికి సంబంధించింది ఒకటి. సమానత్వం రెండవ లక్ష్యం. ఆదాయం, సామాజిక స్థాయిల్లో చోటు చేసుకుంటున్న తీవ్రస్థాయి తారతమ్యాలను తొలగించడం. ఒక్క మాటలో చెప్పాలంటే జీవన ప్రమాణాలలో సమానత్వాన్ని ప్రతిఫలింపచేయడం. కనీస జీవన ప్రమాణాలన్నది కూడా దీని పరిధికిందకే వస్తుంది. ఇబ్బందులేమీలేని, సాదాసీదాగా వుండే గౌరవనీయమైన జీవనాన్ని కొనసాగించగలగడం. మూడవ లక్ష్యం సంక్షేమం. విస్తృత పరిధితో కూడుకున్న లక్ష్యం ఇది. సంపూర్ణ మానవుడు' అనే విశాల అర్థం సంక్షేమం అనే లక్ష్యం మాటున దాగుంది. సమాజంలో ప్రతి రంగంలో ఎంతో ఉత్సాహంగా, శక్తివంతంగా తనవంతు పాత్రను నిర్వహించగలగడం ఈ 'సంపూర్ణ మానవుని'పై వుందన్నమాట.

వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడుకునేందుకు రాజ్యాంగ నిర్మాతలు ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలో చేర్చారు. రాజ్యాంగంలోని మూడవ భాగంలో పలు ప్రాథమిక హక్కులను పేర్కొన్నారు. వీటిని ఏడు విభాగాలుగా క్రోడీకరించారు.
అవి:

1. సమానత్వం హక్కు
2. స్వేచ్ఛ హక్కు
3. దోపిడీని అడ్డుకునే హక్కు
4. మతపరమైన స్వేచ్ఛను అనుభవించే హక్కు
5. సాంస్కృతిక, విద్యా హక్కులు
6. ఆస్తిహక్కు
7. రాజ్యాంగపరమైన ప్రత్యామ్నాయాల హక్కు

ప్రాథమిక హక్కుల కిందే వ్యక్తిగత స్వేచ్ఛ వుంది. రాజ్యాంగం కింద వీటిని అమలు చేస్తారు. ఆదేశిక సూత్రాల పరిధికిందకే కనీస అవసరాలు వస్తాయి. కార్యనిర్వాహక వర్గం బాధ్యత కిందకే ఇవి వస్తాయి. వ్యక్తిగతస్వేచ్ఛకు, సామాజిక క్రమానికి మధ్య సమతౌల్యం తీసుకొచ్చే ప్రయత్నం భారత రాజ్యాంగం చేసినట్లు అనిపిస్తుంది. రాజ్యం ఆదేశిక సూత్రాల విషయానికే వస్తే ప్రజా సంక్షేమాన్ని పెంపు చేయడమే వీటి అంతరార్థం. శ్రామికులకు ఆర్థిక, సామాజిక న్యాయాన్ని ఒనగూర్చడమే వీటి పరమోద్దేశం.

నిజానికి గౌరవనీయంగా బ్రతకడమనేది ప్రతి భారతీయుని ప్రాథమిక హక్కు. ప్రజల బాధ్యతలను నిర్వర్తించే క్రమంలో మనిషి పరువుగా బ్రతికేందుకు ముఖ్యమైన కనీస అవసరాలను రాజ్యం తీర్చాలి. జీవించే హక్కు అంటే ప్రతి వ్యక్తి సంఘంలో గౌరవంగా బతకడం అనే అంశం కూడా ఇందులో నిళితమై వుంది. అంటే సంపూర్ణ పోషక పదార్థాలతో కూడిన తిండి, బట్ట, గూడు, రాసుకునే, చదువుకునే సదుపాయాలు, వైవిధ్యమైన రంగాలపై మన అభిప్రాయాలను

BRAOU

ఐదవ ప్రణాళికా కాలంలో పేదరిక నిర్మూలన, కనీస ఆదాయ ప్రమాణాల పెంపు ప్రధాన లక్ష్యాలుగా నిలిచాయి. అయిదవ ప్రణాళికా ముసాయిదా ఉత్పత్తి, పంపిణీలకు మధ్య కొనసాగుతున్న వివాదం ఎక్కువకాలం చెల్లనేరదని గట్టిగా అభిప్రాయపడుతోంది. పెరుగుదల, సామాజిక న్యాయాలకు మధ్యనున్న ఘర్షణ వీవిధంగా న్యాయ సమ్మతం కాదో అదే తీరున దీనిని కూడా మనం తీసుకుంటాం.

ఒక ఇంటి జీవన ప్రమాణాలనేవి ఆదాయం మీదే కాకుండా అందుబాటులో వున్న, ప్రజాసేవలు, సౌకర్యాలమీద కూడా ఆధారపడి వున్నాయి. దీన్నిగుర్తించే, కనీస అవసరాల కార్యక్రమాన్ని 55 సంవత్సరాలకు నిర్దేశించిన దీర్ఘ ప్రణాళికలో మొదటి సంవత్సరమే ప్రవేశ పెట్టడం జరిగింది. మౌలికసేవలను, సౌకర్యాలను జాతీయ స్థాయిలో అంగీకరించిన నిబంధనల అనుసారం అన్ని ప్రాంతాలలో నిర్దిష్ట కాలపరిమితికి పూర్తి చేయడానికి ఒక నెట్‌వర్క్‌ని ఏర్పాటు చేయాలనే లక్ష్యం కూడా ఉంది. దీనికి ప్రత్యేక కార్యక్రమ రూపకల్పన కూడా జరిగింది. దీని సహాయంతో జీవన ప్రమాణాల స్థాయిని పెంచడం, అభివృద్ధిరంగంలో కనబడుతున్న ప్రాంతీయ వ్యత్యాసాలను తగ్గించడం చేబట్టాలన్న వుద్దేశం వుంది. నిత్యజీవితానికి అవసరమయే కనీస సౌకర్యాలనుద్దేశించి మౌలికంగా చేబట్టారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధిని ప్రధానంగా దృష్టిలో పెట్టుకోవడం జరిగింది.

4.3.1 కనీస అవసరాల కార్యక్రమ స్వరూపం

కనీస అవసరాల కార్యక్రమం రూపు రేఖలు కింద పేర్కొన్న విషయాలనుబట్టి మనకు విస్పష్టం కాగలదు.

1. దీని లక్ష్యం విస్తృతమైంది. అత్యవసరమైన సామాజిక సేవలు ఏకరూపును పొందితే పెద్ద ఎత్తున ప్రయోజనాలు పొందగలరు.
2. పెరుగుదల రేటు అధికంగా వున్నప్పటికినీ ఆదాయం ప్రమాణం తక్కువగానే వుంటుందనే అభిప్రాయాన్ని కనీస అవసరాల కార్యక్రమం మనలో కలిగిస్తోంది.

కనీస అవసరాలకు సంబంధించి ఏడు అంశాలను నిర్ధారించుకోవడానికి కనీస జీవన ప్రమాణం ప్రధానమౌతుంది. సామాజిక సేవారంగాల్లో ఎక్కువ పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇది సాధ్యపడుతుంది. అయిదవ పంచవర్ష ప్రణాళిక దాకా సామాజిక విధానంలో సామాజిక సేవలు చాలా నిరుత్సాహకరంగానే కొనసాగాయి. సామాజిక సేవల పరంగా సహకారం, విస్తృతుల ద్వారా పేదరికం మీద నేరుగా దాడి జరపాలన్న ఆలోచనను మొదటిసారిగా చేశారు. పేదరిక నిర్మూలనా కార్యక్రమాల పునాదిగా పేదరికంపై పూర్తిస్థాయి పోరును నూతన విధానంలో చేపట్టారు. ఆర్థిక ప్రగతి సత్ఫలితాల విస్తరణ మీద గతంలో బాగా విశ్వాసం వుండేది. సాపేక్ష పేదరికం, సాపేక్ష అసమానతల మీద కూడా ఇదేరకమైన నమ్మకం నెలకొనివుంది.

ప్రారంభంలో ఆరోగ్యం, విద్యారంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. వీటికి సాంప్రదాయక పద్ధతిలో మొదటి స్థానాన్ని ఇస్తుంటారు. తర్వాత ఆరోగ్యం, కుటుంబనియంత్రణ, పోషకాహారం సేవలను కూడా దీనికి చేర్చి విస్తారమైన రూపునిచ్చారు. ఫలితంగా కార్యక్రమ రూపురేఖలు కూడా బాగా మారాయి.

కనీస అవసరాల కార్యక్రమం అయిదవ పంచవర్ష ప్రణాళిక (1974-79) నుంచి మొదలైంది. మానవ వనరుల అభివృద్ధిలో 'పెట్టుబడి' రూపంలో ప్రారంభమైంది. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సబ్సిడీ సామాజిక సేవల వినియోగాన్ని పెంచేందుకు తీవ్రంగా కృషి మొదలైంది. ప్రభుత్వ రంగాల్లో భారీ స్థాయిలో పెట్టుబడుల పర్వం మొదలైంది. వినియోగ ప్రమాణాల్లో, తలెత్తుతున్న తారతమ్యాలను తగ్గించడానికి, పెరుగుదల స్థాయిని వృద్ధిచేయడానికి ఆర్థికాభివృద్ధితో కూడిన 'సోషల్ కంసప్షన్ ప్రోగ్రామ్స్'ని సంఘటిత పరిచే అవసరం గుర్తించారు.

గతంలో గ్రామీణ ప్రాంతాల్లో అమలైన ప్రణాళికల అనుభవాల్లోంచి పుట్టుకొచ్చిన, రూపుదిద్దుకున్న ఎంఎన్‌ఎస్ భావజాలం వల్ల మనకు ఎలాంటి సామాజిక అభివృద్ధి, పెరుగుదలలు కనబడటం లేదు. పోనీ ముందుకు పోతున్న

BRAOU

జాడ ఏమైనా కనబడుతోందా అంటే అదీ లేదు. పరస్పర మద్దతుతో ఇవి అమలైన దాఖలాలు లేవు. ఇలాంటి వాతావరణంలో సహజంగానే మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి రంగాల అభివృద్ధి పరంగా పెట్టుబడుల ఒత్తిడి చాలా తక్కువ స్థాయిలో కనబడుతుంది. ఫలితంగా సామాజిక సేవల కేటాయింపుల దగ్గరకు వచ్చేసరికి పరిస్థితి అధ్వాన్నంగానే వుంటుంది.

దీంతో కార్యక్రమాన్ని సరికొత్త నిబంధనలతో, సూచనలతో తిరిగి రూపొందించారు. ఇదే 'రివైజ్డ్ మినిమం నీడ్స్ ప్రోగ్రామ్ (ఆర్ఎంఎన్పీ), అత్యావశ్యకమైన మౌలిక అవసరాల కల్పన, సామాజిక సేవలను అందించడానికి ఉద్దేశించారు. ఇలాంటి సౌకర్యాన్ని సమాజంలోని బలహీన వర్గాలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రీకరించబడివున్న వారికి ప్రభుత్వరంగాలే సరఫరా చేయగలవు.

4.4 కనీస అవసరాల కార్యక్రమం – ప్రణాళిక

ఎంఎన్పీ కింద వున్న అంశాలన్నీ చాలా వరకు రాష్ట్ర పరిధిలోకి వచ్చేవే. అందుకే 'కాంపొనెంట్స్'కు సంబంధించిన కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వాల వార్షిక ప్రణాళికల కింద చేర్చారు. ఎంఎన్పీనిననుసరించి వివిధ రంగాల కేటాయింపులకు సంబంధించి ప్రణాళికా సంఘం పథకాల రచన చేసింది. వేటికైతే నిధులను ఉద్దేశించారో వాటికి నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు ఉపయోగించవచ్చు. ఎంఎన్పీకి చెందిన కొన్ని కార్యక్రమాలలో కేంద్రం కూడా పాలుపంచుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వీటిని నిర్వహిస్తుంది. ఎంఎన్పీ కింద ప్రస్తావించిన ప్రజల కనీస అవసరాల్లో ప్రాథమిక విద్య, వయోజన విద్య, గ్రామీణ ఆరోగ్యం, పౌష్టిక విలువలు, గ్రామీణ నీటి సరఫరా, రహదారులు, విద్యుద్దీకరణ, భూమిలేని శ్రామికులకు గృహ సదుపాయం, పట్టణ ప్రాంతాల్లోని మురికివాడల్లో పర్యావరణ పరిస్థితి మెరుగుదల వంటివి పూర్తిస్థాయిలో ఉన్నాయి. అయిదవ పంచవర్ష ప్రణాళికా కాలం నుంచి పెట్టుకున్న నిర్దిష్టమైన లక్ష్యాలు, సాధించిన విజయాలను కింద చెప్పుకుందాం.

4.4.1 ప్రాథమిక విద్య

అయిదవ పంచవర్ష ప్రణాళికలో సార్వజనీన విద్యలక్ష్యాన్ని ప్రవేశ పెట్టారు. ఆరవ ప్రణాళికలో కూడా దీన్ని కొనసాగించారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో సాధించిన ప్రగతిని దృష్టిలో పెట్టుకుని దీన్ని ఫార్మల్ సిస్టమ్' ద్వారా అమలుకు ప్రతిపాదించారు. రెండు అంచలలో ఈ లక్ష్యాన్ని సాధించాలి. 1985 నాటికి 6-11 సంవత్సరాల పిల్లలను 95 శాతం, 11-14 సంవత్సరాల పిల్లల్ని 50 శాతం బడిలో చేర్చాలి. 1990 నాటికి 6-14 సంవత్సరాల పిల్లలందరూ పాఠశాల విద్యను అభ్యసించాలి. 1984-85లో అబ్బాయిలకు సార్వజనీన ప్రాథమిక విద్యను చేబట్టాల్సిన రాష్ట్రాలు కేవలం నాలుగు వున్నాయి. 1979-80లో దీన్ని ప్రవేశ పెట్టాల్సిన రాష్ట్రాలు 13 ఉన్నాయి! ఆడపిల్లల విషయానికి వస్తే 1979-80లో పెద్ద ఎత్తున తేడాపాడాలు కనబడుతున్నాయి. ఈ లోటును పూరించడానికి ఇందులో వెనుకబడివున్న రాష్ట్రాలకు ప్రాథమిక విద్యకు సంబంధించి నాన్ ఫార్మల్ తరగతులను ప్రోత్సహించారు.

వెనుకబడిన ప్రాంతాలకు, మారుమూల ప్రదేశాలకు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాలవారికీ, ముఖ్యంగా బలహీన వర్గాలకు చెందిన బాలబాలికలకు ఈ కార్యక్రమం చేరేందుకు తీవ్ర ప్రయత్నాలు చేపట్టారు. బడినుంచి వెళ్ళిపోతున్న (డ్రాప్ అవుట్స్) పిల్లల సంఖ్యలో మటుకు ఎలాంటి మార్పూ కనబడటం లేదు. దీంతో పిల్లలు క్రమం తప్పకుండా బడికి హాజరయేందుకు కొన్ని ప్రజాకర్షక కార్యక్రమాలను రూపొందించారు. దీని ప్రకారం 1980-85 ప్రణాళికలో 9.05 కోట్ల రూపాయల బడ్జెట్టుతో ఒక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఆరవ ప్రణాళికలో వయోజన విద్యను జోడించారు. పెద్దలకు ముఖ్యంగా 15-35 సంవత్సరాల వయసు వారికి అనియత విద్యను ప్రాథమిక విద్యలో చేర్చారు. ఇది కూడా ఎంఎన్పీ కిందకు వచ్చేదే. దీనికోసం మొత్తం 128 కోట్ల రూపాయల నిధులను కేటాయించారు. ఆ విధంగా చూస్తే ప్రాథమిక విద్యకోసం 1980-85లో కూర్చిన కేటాయింపుల మొత్తం 1033 కోట్ల రూపాయలు అంటే 905 కోట్లు మరియు 128 కోట్లు కలిసి వెరసి పైన ప్రస్తావించిన మొత్తం అయింది.

BRAOU

ఏడవ ప్రణాళికలో 1990 నాటికి 6-14 సంవత్సరాలలోపు పిల్లలు నూటికి నూరుశాతం 'ఎన్‌రోల్‌మెంట్'ను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రణాళికలో 'ఓపెన్ లర్నింగ్ సిస్టమ్' అనియత విద్య, కమ్యూనిటీ వనరుల సేకరణ, విద్యాభివృద్ధిలో సమాజం మొత్తం పాల్గొనడం లాంటి కొత్త అంశాలను చేర్చారు. వీటన్నింటి ద్వారా నియత, అనియత విద్యల కింద అంటే ఫార్మల్ ఎడ్యుకేషన్‌లో 25,53 మిలియన్ల మంది పిల్లల్ని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. ఫార్మల్ ఎడ్యుకేషన్ సాధనలో పెట్టుకున్న 25.53 మిలియన్ల పిల్లల లక్ష్యంలో మొదటి రెండు సంవత్సరాల్లో 10.8 మిలియన్ల మంది పిల్లల మేర సాధించగలిగారు. 1987-88 సంవత్సరంలో 5-3 మిలియన్ల మంది పిల్లల్ని అదనంగా దీనికిందకు తీసుకురావడమైంది. వయోజన విద్యకు కూడా పెద్దపీట వేశారు. ఏడవ ప్రణాళికలో మొదటి రెండు సంవత్సరాల కాలంలో వయోజన విద్య సేవలు 14.55 మిలియన్ల మంది వయోజనులను చేరుకున్నాయి. తర్వాత తర్వాత వీరి సంఖ్య బాగా పెరిగింది. 1987-88 సంవత్సరంలో అదనంగా 8.9 మిలియన్లమంది వయోజనులను దీనికిందకు తీసుకువచ్చారు. 1990 నాటికి ప్రాథమిక విద్యా రంగంలో ఎన్‌రోల్‌మెంట్ మొత్తం సంఖ్య అనూహ్యంగా పెరగడమే కాదు అమ్మాయిల ఎన్‌రోల్‌మెంట్‌లో కూడా మంచి పురోగతి కనిపించింది. సార్వజనీన ప్రాథమిక విద్య కింద ఆడపిల్లల ఎన్‌రోల్‌మెంట్ పెంపుదలకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఇది ప్రభుత్వవైఖరిలో వచ్చిన మార్పును మనకు సూచిస్తోంది.

ఏడవ పంచవర్ష ప్రణాళికలో సార్వజనీన ప్రాథమిక విద్యను, 15-35 సంవత్సరాల వయోజనుల్లో నిరక్షరాస్యతా నిర్మూలనను, వృత్తి విద్యా కోర్సులను బలపరచడం, ఆడపిల్లలు, బడిపరిధిలోకి రాని ఇతర వర్గాల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకున్నారు. దాదాపు 47.8 శాతం మంది జనాభా నిరక్షరాస్యతా నీడల్లోనే మగ్గుతున్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల మధ్య, అలాగే వివిధ రాష్ట్రాల మధ్య అంతరాలు తీవ్రంగా పెరిగిపోతున్నాయి. అన్ని రాష్ట్రాల్లోని 15-35 సంవత్సరాల వయోజనుల్లో నూటికి నూరుశాతం అక్షరాస్యతా సాధనను 8వ ప్రణాళికలో లక్ష్యంగా పెట్టుకున్నారు. 8వ ప్రణాళికలో నిరక్షరాస్యతా నిర్మూలనను ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నారు. ఎంఎన్‌పీలో దీన్ని కూడా మరో అంశంగా చేర్చారు. దీంతో మరిన్ని నిధులు సమకూరాయి. ఈ కార్యక్రమంకున్న ప్రాధాన్యతను గుర్తించి, 1992 ఏప్రిల్‌లో ప్రణాళికా సంఘంలో అక్షరాస్యతా సాధన లక్ష్యంలో భాగంగా ఒక కమిటీని వేశారు. 15-35 సంవత్సరాల వయోజనుల సార్వజనీన అక్షరాస్యతా సాధనకోసం మే నెలలో జాతీయ సాక్షరతా కమిషన్ (నేషనల్ లిటరసీ మిషన్)ని ప్రారంభించారు. 1995 నాటికి '8 కోట్ల మందిని అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరి సంఖ్య తర్వాత పెరిగింది. 8వ ప్రణాళికాంతానికి 10 కోట్ల మందిని అక్షరాస్యులను చేయాలని ధ్యేయంగా పెట్టుకున్నారు. సమాజంలోని బలహీన వర్గాలలోని నిరక్షరాస్యులమీద ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజలమీద, మహిళలపై దృష్టిని కేంద్రీకరించాలని నిశ్చయించుకున్నారు. అయితే అనుకున్న లక్ష్యాలను అనుకున్న కాలానికి పూర్తిగా సాధించడం జరగలేదు. పాలనాయంత్రాంగంలోని లోపాలు, రక్షరకాల సమస్యలే ఇందుకు కారణం. పెట్టుకున్న లక్ష్యం 10 కోట్ల మంది వయోజనులు కాగా 1997కి కేవలం 5.8 కోట్లమందిని అక్షరాస్యులను చేయడం జరిగింది. వీళ్లల్లోకూడా 4.1 కోట్ల మంది మాత్రమే పూర్తి అక్షరాస్యులుగా చెప్పుకోవచ్చు. వయోజన విద్య పరంగా చూస్తే కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేదు.

4.4.2 గ్రామీణ ఆరోగ్యం

2000 సంవత్సరానికి అందరికీ ఆరోగ్యం లక్ష్యాన్ని పెట్టుకున్నారు. దీనికోసం కొన్ని నిబంధనలను రూపొందించారు. ప్రతి గ్రామానికీ ఒక స్వచ్ఛంద ఆరోగ్య సేవకులుంటారు. 1000 మంది జనాభాతో బేస్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు. మైదాన ప్రాంతాల్లో ప్రతి 5,000 మంది జనాభాకు ఒక ఉప కేంద్రం ఉంటుంది. కొండ ప్రాంతం, గిరిజన ప్రాంతాలలో ప్రతి 3,000 మంది ప్రజలకు ఒక ఉపకేంద్రాన్ని నెలకొల్పుతారు. మైదాన ప్రాంతాల్లో 30,000 మంది జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, గిరిజన, కొండ ప్రాంతాల్లో 20,000 మందికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంటుంది. ఒక లక్ష మంది జనాభా వున్నచోట కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం వుంటుంది. ఆరవ పంచవర్ష ప్రణాళికలో కమ్యూనిటీ ఆరోగ్య వాలెంటీర్ల సంఖ్యను పెంచాలనే ప్రతిపాదనను చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలమీద దృష్టిని నిలిపారు. ఇందుకుగాను 1980-85 సంవత్సరానికి

BRAOU

577 కోట్ల రూపాయలను కేటాయించారు. ఆరోగ్య సదుపాయాల నిబంధనలను సరళీకృతం చేయడంలో భాగంగా గ్రామీణ, గిరిజన, బలహీన వర్గాలుండే ప్రాంతాలలో సదుపాయాల ఏర్పాటుకై ఏడవ పంచవర్ష ప్రణాళికలో నిధులను కేటాయించారు. ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి పెట్టుకున్న 11,000 కేంద్రాల సంఖ్యను ఏడవ ప్రణాళికలో 23,000 కి పెంచారు. కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల లోటు కూడా కనబడుతోంది. ఏడవ ప్రణాళికాంతానికి వీటి సంఖ్యను 649 నుంచి 1553కి పెంచాలని ప్రతిపాదించారు.

ఆరోగ్యానికి సంబంధించి ఎనిమిదవ ప్రణాళికలో వున్న అంశాలను పరిశీస్తే:

1. మన్నికైన ప్రమాణాలలో సేవలను అందించేందుకుగాను ప్రాథమిక ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడానికి, పటిష్ట పరచడానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను పెట్టడం.
2. అందరికీ ఆరోగ్య సేవలు అందాలి.
3. జిల్లా స్థాయినుంచి అన్ని కేంద్రాలలో సెకండరీ స్థాయి ఆరోగ్య సంరక్షణకు అవసరమయే మౌలిక సదుపాయాలను సంఘటితపరచడం, విస్తరించడం.
4. ప్రదేశాల వారీగా ఆరోగ్య సేవలందించే లక్ష్యంలో భాగంగా వాటి పరిధిని పరిమితం చేయడం ద్వారా సేవలను సంతృప్తికర స్థాయిలో ప్రజలకు అందించడం.
5. పకడ్బందీ అయిన అనుబంధ వ్యవస్థను నిర్మించడం, ఇలా చేయడం వల్ల ప్రతి స్థాయిలోనూ వీటి వినియోగం పూర్తి స్థాయిలో జరిగే అవకాశం వుంటుంది.

ఈ నిర్దిష్ట కాలంలో సమాజంలో అత్యవసరమైన వర్గాల ఆరోగ్య అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక కృషిని చేబట్టాలని కూడా నిశ్చయించుకున్నారు. ఈ దిశగా చర్యలు చేబట్టారు. పిహెచ్‌సిల మౌలిక సదుపాయాల వ్యవస్థను పటిష్టం చేసి సంఘటితపరిచే దిశగా కూడా అడుగులు పడ్డాయి. పిఎన్‌పి కింద అనూహ్య స్థాయిలో నిధులను సమకూర్చారు. రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్న దేశంలోని వివిధ ప్రాంతాలకు సహాయం అందేలాగ సేవలను విస్తృత పరిచారు. కొన్ని నిర్దిష్ట కార్యక్రమాలకు కేంద్ర సహాయాన్ని పెంచారు. ఫలితంగా చికిత్సకయ్యే ఖర్చులను భరాయించే సావకాశం ఏర్పడుతుంది.

ఎనిమిదవ ప్రణాళికలో కేంద్రం ఆరోగ్యంపై 1800 కోట్ల రూపాయల నిధులను కేటాయించింది. రాష్ట్రంలో 5,308 కోట్ల రూపాయలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 468 కోట్ల రూపాయలు నిర్దేశించారు. గ్రామీణ ఆరోగ్యానికి సంబంధించి రాష్ట్రాలలో, కేంద్ర పాలిత ప్రాంతాలలో కేటాయించారు. కనీస అవసరాల పరిస్థితిని అనుసరించి కేటాయింపులు చేశారు. నిజానికి చాలా రాష్ట్రాల్లో కేటాయించిన నిధులను పూర్తిగా సద్వినియోగపరచుకోలేదు.

4.4.3 గ్రామీణ నీటి సరఫరా

ఆరవ పంచవర్ష ప్రణాళికా కాలంలో సురక్షిత నీటి వనరుల కేటాయింపులపై దృష్టిని కేంద్రీకరించారు. దీనివల్ల వెనుకబడిన వర్గాలవారు పూర్తిగా లబ్ధిపొందగలరు. ఏడవ ప్రణాళికా ప్రారంభంలో సమస్యాత్మక గ్రామాలుగా మొత్తం 2.31 లక్షలను గుర్తించారు. దీంతో భారీ పెట్టుబడులు పెట్టడం జరిగింది. 2.31 లక్షల గ్రామాల్లో కనీసం 1.92 లక్షల్ని అయినా దీని పరిధి కిందకు తేవాలన్నది అసలు లక్ష్యం. రానున్న ప్రణాళికలో మిగిలిన 39000 గ్రామాలకూ సురక్షిత నీటి వనరులను అందించాలని నిర్ణయించుకున్నారు.

8వ ప్రణాళిక ప్రారంభమయేనాటికి గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలందరికీ సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యాన్ని ఖరారుచేయడమైనది. పట్టణ ప్రాంతాలలో కొంత జనాభాను కూడా దీని పరిధికిందకు తీసుకువచ్చారు. వ్యవస్థాగతమైన ఫైనాన్సింగ్‌తోపాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమానంగా ఇందులో కలుగజేసుకోవాలి. అమలు, నిర్వహణలకు

BRAOU

సంబంధించి వివిధ స్థాయిల్లో స్థానిక ప్రజలను, వర్గాలను కలుపుకుపోవాలి. సెంట్రల్ ప్రణాళికలో 10,743 కోట్ల రూపాయలు వుంటే, రాష్ట్రానికి సంబంధించి 10,743 కోట్లు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో మొత్తం కేటాయింపులు చేశారు. 8వ ప్రణాళిక రూపొందించే సమయంలో తీవ్ర సమస్యల వలయంలో వున్న గ్రామాల సంఖ్య 3,000గా గుర్తించారు. ఇది 1985 మాట. అయితే ఎనిమిదవ ప్రణాళిక ముగిసేనాటికి ఇలా వుంటే, 8వ ప్రణాళికాంతానికి 1.62 లక్షలకు పెరుగుతుంది. నూటికి నూరుశాతం ప్రజలకు నీటి వనరులు అందాలన్న లక్ష్యం (100% కవరేజ్) పెట్టుకున్నా ఎనిమిదవ ప్రణాళిక కేవలం గ్రామాల్లో కాకుండా అక్కడి నివాసాల మీద కూడా తన దృష్టిని కేంద్రీకరించింది. 1994-95 8వ ప్రణాళికాంతంలో పెట్టుకున్న లక్ష్యంలో భాగంగా 3000 గ్రామాలలో పనిపూర్తి చేయాలి. జనాభారీత్యా తీసుకుంటే 82.42 శాతం గ్రామీణ ప్రజలకు నీటి సరఫరా సదుపాయాలు కలుగజేయాలి.

4.4.4 గ్రామీణ గృహవసతి

గ్రామీణ హౌస్ సైట్ కమ్ హౌస్ నిర్మాణ పథకాన్ని ఐదవ ప్రణాళిక అంతానికి భూమిలేని లక్షల కుటుంబాలకు స్థలాలను కేటాయించి 'ప్రొవిజన్' పరిధిని పెంచారు. 27.1 లక్షలమందికి నిర్మాణ పరమైన సహాయం అందించాలనేది లక్ష్యం. ప్రారంభంలో 17.11 లక్షల కుటుంబాలకు స్థలం కేటాయింపు జరిగింది. 1987-88కి 5.50 లక్షల ఇండ్ల స్థలాలను పంపిణీ చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వాలకున్న టార్గెట్. 1990 నాటికి 35 లక్షల కుటుంబాలకు ఇళ్ళ స్థలాలను కేటాయించాలని ఎంఎన్‌పి కార్యక్రమం కింద ఆరవ పంచవర్ష ప్రణాళికలో పేద గ్రామీణ ప్రజలకు గృహవసతి, ఇళ్ళ కేటాయింపులకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రభుత్వ రంగం 1839 కోట్ల రూపాయలను ఇళ్ళ నిర్మాణంపై ఖర్చుపెడితే, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ 275 కోట్ల రూపాయలు దీనిపై వెచ్చించాయి. అయితే పెరిగిన నిధుల కేటాయింపులు ఏడవ ప్రణాళికలో కొనసాగలేదు. దీనికి ప్రధాన కారణం 7వ పంచవర్ష ప్రణాళిక పోషకాహారంపై దృష్టినిలపడమే. ఈ కాలంలో కేవలం 577 కోట్ల రూపాయలు మాత్రమే గృహవసతిపై ఖర్చుపెట్టాయి. 8వ ప్రణాళికలో 159.5లక్షల కొత్త హౌసింగ్ యూనిట్ల నిర్మాణాన్ని లక్ష్యంగా ప్రకటించాయి. వీటిల్లో 78 లక్షల కొత్త యూనిట్లను పట్టణ ప్రాంతాల్లో ప్రారంభిస్తే మిగతా 81.5 లక్షల యూనిట్లను గ్రామీణ ప్రాంతాల్లో చేబట్టారు.

4.4.5 గ్రామీణ విద్యుద్దీకరణ

గ్రామీణ విద్యుద్దీకరణ కార్యక్రమం కింద ఐదవ ప్రణాళికలో 40 శాతం గ్రామీణ జనాభాకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నది లక్ష్యం. జనాభాననుసరించి కాకుండా గ్రామాల ప్రాతిపదికగా విద్యుత్ సౌకర్యాన్ని కలిగించాలనే విధానాన్ని తీసుకున్నారు. దీన్ని అనుసరించి ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతాలలో 1990 నాటికి కనీసం 60 శాతం గ్రామాలను విద్యుద్దీకరించాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. దాన్ని అనుసరించి 7వ పంచవర్ష ప్రణాళికలో గ్రామీణ విద్యుద్దీకరణ కోసం 479 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసింది.

4.4.6 గ్రామీణ రహదారులు

ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో గ్రామీణ రహదారుల అభివృద్ధి కార్యక్రమం వేగం పుంజుకుంది. గ్రామీణ రహదారుల ప్రగతినే ఆరవ పంచవర్ష ప్రణాళిక ప్రధానలక్ష్యంగా పెట్టుకుంది. 1500 జనాభా వున్న అన్ని గ్రామాలు, 1000-1500 మేర జనాభా వున్న 50% గ్రామాలను బృహత్ కార్యక్రమం క్రింద చేర్చారు. ఈ లక్ష్యాన్ని పది సంవత్సరాల కాలవ్యవధిలో అంటే 1990 సంవత్సరం అంతానికి సాధించాలని నిర్ణయించారు. ఎంఎన్‌పి కింద చేపట్టిన గ్రామీణ రహదారుల కార్యక్రమానికి మరికొన్ని కార్యక్రమాలు కూడా వచ్చి చేరాయి. వాటిని రెండుగా వర్గీకరించవచ్చు. (1) ప్రయోజనాత్మకమైన (బెనిఫిషియరీ ఓరియంటెడ్ ప్రోగ్రామ్) కార్యక్రమం అంటే ఎన్ఆర్ఇపి, ఆర్ఎల్ఇపి లాంటి కార్యక్రమాలు, (2) ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమం, అంటే కొండ ప్రాంత అభివృద్ధి కార్యక్రమం, పశ్చిమ కనుమల అభివృద్ధి కార్యక్రమం, నార్త్-ఈస్టర్న్ కౌన్సిల్, ట్రైబల్ ఏరియా సబ్ ప్లాన్స్ లాంటివన్నమాట.

4.4.7 పట్టణ ప్రాంత మురికి వాడల పర్యావరణ పురోగతి

మెరుగైన పర్యావరణ పరిస్థితులుండాలి అంటే విస్తృత స్థాయిలో నీటిసరఫరా, మురికినీరు సౌకర్యం, వీధుల

BRAOU

పరిశుభ్రత, మురికి వాడల్లో లెట్రిన్లు వంటి సౌకర్యాలన్నీ పరిగణనలోకి వస్తాయి. వెనుకబడిన కులాలు, వర్గాలు, పాకీ వాళ్ళు నివసిస్తున్న ప్రాంతాలకు ప్రాధాన్యత నివ్వాలని ప్రభుత్వం నిశ్చయించింది.

4.4.8 పౌష్టికాహారం

పౌష్టికతపై ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రణాళికేతర పరిధికింద 1970-71 సంవత్సరంలో ప్రవేశపెట్టారు. 'ఎంఎన్‌పి'లో భాగంగా ఐదవ ప్రణాళికలో కొనసాగించారు. 1-4-1980 నాటికి 0-6 సంవత్సరాల పిల్లలు, తల్లులను ఈ కార్యక్రమంలో చేర్చాలనేది లక్ష్యం. తర్వాత ఈ కార్యక్రమాన్ని ఆర్థిక కార్యక్రమాల (ఎకనామిక్ యాక్టివిటి) ప్రాజెక్టులకు అనుసంధించారు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఉపాధిని లక్ష్యంగా పెట్టుకున్నారు. పేదరికం నేపథ్యంలో వచ్చిన మహిళల అవసరాలను తీర్చాలనేది ముఖ్యమైన ఉద్దేశం.

4.4.9 మధ్యాహ్న భోజన పథకం

1962-63 సంవత్సరంలో దీన్ని ప్రవేశ పెట్టారు. దీన్ని ఐదవ పంచవర్ష ప్రణాళికలో ఎంఎన్‌పిలో భాగంగా చేర్చారు. అప్పటినుంచి ఈ కార్యక్రమం కొనసాగుతూ వచ్చింది. 6-11 సంవత్సరాల మధ్యనవున్న నాల్గవవంతు పిల్లలకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఉద్దేశించారు. 0-6 సంవత్సరాలలో వున్న పిల్లల్లో పెరుగుదల లేనివాళ్ళ కోసం 'సప్లిమెంటరీ ఫీడింగ్' కార్యక్రమాలను చేబట్టారు. గర్భవతులైన మహిళల, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల, తెగలకు సంబంధించిన వారిపై కూడా దృష్టి నిలిపారు. ఆరవ పంచవర్ష ప్రణాళికను గమనించినట్లైతే ఈ పథకం వల్ల పిల్లల సంఖ్య పెరగడం గాని, డ్రాప్-అవుట్స్ తగ్గడం నిష్పత్తిలో మనకు ఎలాంటి వ్యత్యాసము లేదా పురోగతి కనిపించదు. ఫలితంగా దీన్ని పునర్ వ్యవస్థీకరించి, ఆరోగ్య సేవలకు, సురక్షిత మంచినీటి సరఫరాకు, పర్యావరణం, ఇళ్ళల్లో పరిశుభ్రత పథకాలకు అనుసంధించారు. అంతేకాదు పాఠశాలల్లో కిచెన్, హార్టీకల్చర్ మాల పెంపకాన్ని ప్రోత్సహించడం కూడా వీటిల్లో ఉంది. పిల్లలకు ఆహారం పెట్టే కార్యక్రమంలో ఇక్కడ కాసేపండ్లు, కాయలు ఎంతగానో ఉపయోగపడతాయనేది ఉద్దేశం. ఏడవ ప్రణాళికా కాలంలో మధ్యాహ్న భోజన పథకం, సప్లిమెంటరీ న్యూట్రిషియన్ కార్యక్రమాలను మరింత పటిష్టపరచాలని భావించారు. 'న్యూట్రిషియన్ ప్యాక్స్'ని గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టుల కింద సమాజంలోని బలహీన, పేద వర్గాలకు సరఫరా చేయాలని కూడా నిర్ణయించారు. ఫలితంగా ప్రణాళికలో వీటి కేటాయింపులు 1,732 కోట్ల రూపాయలకు పెరిగింది. ఆరవ ప్రణాళికలో వీటి కేటాయింపులు కేవలం 223.19 కోట్లు వుండడాన్ని మనం గమనించగలం.

BRAOU

లక్ష్యాలు, నిబంధనలు ఆరవ ప్రణాళికలో కూడా అదే తీరులో ఉన్నాయి. కార్యక్రమాల రూపకల్పనలో ఎలాంటి మార్పు చేర్పులూ చోటు చేసుకోలేదు. ఏడవ ప్రణాళికలో అదనంగా మూడింటిని చేర్చడం జరిగింది. ఏడవ ప్రణాళిక మొట్టమొదటి సంవత్సరం (1985-86)లో గ్రామీణ ప్రాంతాల్లోనంటకు సంబంధించి 'ఎనర్జీ' ఉత్పాదకత కార్యక్రమాన్ని చేబట్టారు. 1987-88లో ప్రజా పంపిణీ వ్యవస్థ, గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రవేశ పెట్టారు. ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో భాగంగానే వీటిని చేబట్టారు. ఏడవ పంచవర్ష ప్రణాళికలో మరో ముఖ్య అంశానికి కూడా ప్రాధాన్యత నిచ్చారు. 'కనీస అవసరాల కార్యక్రమా (ఎన్‌పిపి)న్ని' ఇతర గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలతో, పేదరిక వ్యతిరేక కార్యక్రమాలతో సంఘటితపరచాల్సిన ఆవశ్యకతను ఈ ప్రణాళికలో గుర్తించారు. అంటే ఐ.ఆర్.డి.పి, ఎన్.ఆర్.ఇ.పి, ఆర్.ఎల్.ఇ 20సి లాంటి కార్యక్రమాలతో నన్నమాట!

4.4.10 గ్రామీణ పారిశుద్ధ్యం

దీన్ని కూడా 'ఎంఎన్‌పి'లో చేర్చారు. గ్రామీణ జనాభాలో కనీసం 25% మందికైనా పారిశుద్ధ్య సదుపాయాలను కల్పించాలనే విషయాన్ని 7వ పంచవర్ష ప్రణాళికలో ప్రస్తావించారు. కేంద్ర, రాష్ట్ర పరిధిలో కూడా పలు కార్యక్రమాలను చేబడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సదుపాయాల కల్పనను విస్తృత పరచాలన్నది ప్రధానలక్ష్యం. 1987-88లో ఈ కార్యక్రమానికి 30.16 కోట్ల రూపాయలను కేటాయించారు.

4.4.11 ప్రజా పంపిణీ వ్యవస్థ

'ఎంఎన్‌పి'లో ప్రజా పంపిణీ వ్యవస్థ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్)ను జతచేశారు. 'పిడిఎస్' ప్రధాన లక్ష్యం సముచిత ధరలకు నిత్యావసర వస్తువులను సమాజంలోని అట్టడుగు వర్గాలకు, బలహీన వర్గాలకు అందచేయాలన్నది. ఇది పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలిరువురికీ వర్తిస్తుంది. 1987-88లో దీనికి శ్రీకారం చుట్టారు. అప్పుడు 'పిడిఎస్'కు 15.25 కోట్ల రూపాయలను కేటాయించారు.

4.5 ముగింపు

ప్రజల కనీస అవసరాలను తీర్చడమనేది ప్రతిదేశం కనీస బాధ్యత. ఇది ప్రజల గౌరవనీయమైన బతుకులకు అద్దం పడుతుంది. మన దేశంలో ప్రణాళికా రచన, వాటి అమలులో కనీస అవసరాలు ప్రముఖ పాత్ర వహించాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలంటే, ముఖ్యంగా సమాజంలోని పేదవర్గాల బతుకులు మెరుగుపడాలంటే, కనీస సౌకర్యాలైన గృహవసతి, విద్య, ఆరోగ్యం, రుదారులు, విద్యుత్, నీటిసరఫరా, పారిశుద్ధ్యం వంటివి వారికి తప్పనిసరిగా సమకూర్చాలి. ఈ అన్ని అంశాలకు ప్రణాళికల రూపకల్పన జరిగేటప్పుడు పెద్ద పీట వేశారు. కనీస అవసరాల కార్యక్రమం' కింద ప్రతి పంచవర్ష ప్రణాళికలోనూ వీటికి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రతి కొత్త ప్రణాళికలోనూ వివిధ కార్యక్రమాల నిధుల కేటాయింపును పెంచుకుంటూ వచ్చారు. అదే సమయంలో అదనపు కార్యక్రమాలను కూడా అమలులో వున్నవాటికి అనుసంధిస్తూ వచ్చారు. ఏనిమిదవ ప్రణాళికలో నిధుల కేటాయింపులు, నినియోగంతో తగ్గుదల ప్రతి ఫలించడం గమనించవచ్చు. మెల్లమెల్లగా కేటాయింపుల మొత్తం తగ్గుతూ రాసాగింది. భారతదేశంలో పేదరికం తీవ్రస్థాయిలో ఉంది. అందుకే దారిద్ర్యం మన ప్రధాన సమస్య. కనీస సౌకర్యాలను పౌరులందరు సమానంగా అనుభవించాలన్నది న్యాయబద్ధమైన హక్కుగా ఎవరూ భావించడం లేదు. ఇది ఏంతైనా దురదృష్టకరం. భారత రాజ్యాంగం ప్రజలకందరికీ సమానత్వం, సంక్షేమం, స్థిరత్వాలను ఒకే రీతిలో ఇచ్చింది. భారత రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగంలోని మేధావులు వీటి అమలుకు కట్టుబడి వుండాలి. తదనుగుణమైన విధాన నిర్ణయాలను ప్రకటించారనీ కాదు. వాస్తవంగా అమలయేట్టు కలిసికట్టుగా వ్యవహరించాలి. సామాజిక అభివృద్ధి లక్ష్యాలలో వీటిని చొప్పించాలి. కనీస అవసరాల కార్యక్రమంపై ఎక్కువ నిధులను వెచ్చించాలి. అది దారిద్ర్య రేఖకు దిగువన బతుకులను వెళ్లదీస్తున్న ఎంతోమంది జీవితాలను మెల్లమెల్లగా ఒక క్రమ పద్ధతిలో మెరుగుపరుస్తుంది.

BRAOU

4.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **40** పంక్తులలో సమాధానం రాయండి!*

1. కనీస అవసరాలను భారత రాజ్యాంగం ఎలా ప్రతిబింబించిందో వివరించండి?
2. కనీస అవసరాల కార్యక్రమ ప్రణాళికను చర్చించండి?

*ఈ క్రింది ప్రశ్నలకు **20** పంక్తులలో సమాధానం రాయండి!*

1. భారత పంచవర్ష ప్రణాళికలు కనీస అవసరాలను ఎలా గుర్తించిందో వివరించండి?
2. మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పేర్కొనండి?

భాగం 5: సుస్థిరమైన అభివృద్ధి–మానవ హక్కులు

విషయక్రమం

5.0 ఉద్దేశం

5.1 పరిచయం

5.2 సుస్థిరమైన అభివృద్ధి భావన

5.3 ఆర్థిక అభివృద్ధి మరియు ఆర్థికవృద్ధి

5.4 పర్యావరణం-సుస్థిర అభివృద్ధి

5.5 సుస్థర అభివృద్ధి-సమానత్వం

5.6 పేదరికం, మానవ హక్కులు, సుస్థిర అభివృద్ధి

5.7 పర్యావరణం-పేదరికానికి మధ్య సంబంధం

5.8 ముగింపు

5.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

5.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

★ పర్యావరణానికి, సుస్థిరమైన అభివృద్ధికిగల సంబంధం వివరించగలుగుతారు

★ సుస్థిరమైన అభివృద్ధి భావనను అవగాహన చేసుకుంటారు

★ పర్యావరణం-పేదరికానికి మధ్య సంబంధం తెలుసుకుంటారు

5.1 పరిచయం

క్షీణించి పోతున్న పర్యావరణ ప్రభావం మానవ మనుగడపై తీవ్ర పరిణామాలను సూచిస్తోంది. ఎంతో మందిని ఆందోళనకు గురి చేస్తోంది. పేద దేశాలపై ఇది మరింత దుష్పరిణామాలను రేకెత్తిస్తోంది. సహజవనరులు, అభివృద్ధి పరస్పర ఆధారితమనే స్పృహ పెరుగుతోంది. అప్పుడు భావితరాల భవిష్యత్తు ప్రమాదంలో పడదు. సుస్థిరమైన అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలు ఈ పాఠంలో విశ్లేషించబడ్డాయి. సుస్థిరమైన వనరుల ఉపయోగం జీవన ప్రమాణాలకు అవసరమవుతోంది. ఈ పాఠాన్ని నాలుగు భాగాలుగా విభజించడం జరిగింది. దీర్ఘకాలిక అభివృద్ధి, దాని పుట్టుక, పురోగతుల మీద మొదటి భాగంలో చర్చించాము. ఆర్థికాభివృద్ధి పెరుగుదలకు మధ్యనున్న పరస్పర సంబంధాన్ని రెండవ భాగంలో విశ్లేషించడమైంది. పర్యావరణం, అభివృద్ధి పరంగా అది పోషించే నిర్ణాయక పాత్ర మూడవ భాగంలో చర్చించాం. నాల్గవ భాగం దీర్ఘకాలిక అభివృద్ధి, న్యాయానికి సంబంధించి వివరించింది.

5.2 సుస్థిరమైన అభివృద్ధి భావన

దీర్ఘకాలిక అభివృద్ధి లేదా సుస్థిర అభివృద్ధి అనే అంశం 1980ల నుంచి వాడుకలో ఉంది. 1987లో లూట్

లాండ్ కమిషన్ నివేదిక 'అవర్ కమిషన్ ఫ్యూచర్'ని ప్రచురించింది. పర్యావరణం అభివృద్ధి అంశాలు చోటు చేసుకున్న చర్చల్లో దీర్ఘకాలిక అభివృద్ధి ఆలోచనపై ప్రధానంగా ఇది దృష్టి సారించింది. దీర్ఘకాలిక అభివృద్ధిని కమిషన్ ఇలా నిర్వచించింది. 'భవిష్యత్ తరాల అవసరాలను తీర్చడంలో ఏ మాత్రం సర్దుబాటుకు తావులేని ప్రతిబంధకాలు ఎదురవని అలాగే వర్తమాన అవసరాలను, కోరికలను తీర్చేదే దీర్ఘకాలిక స్థిర అభివృద్ధి'.

ఆర్థిక అభివృద్ధి సూచనలను అలా ఉంచితే, వర్తమాన దేశాలు ప్రముఖ పాత్ర పోషిస్తూ భారీ లాభాలను ఆశించే సరికొత్త అభివృద్ధి యుగానికి మనం శ్రీకారం చుడితే తప్ప పేదరికం, వెనుకబాటు తనం పరిష్కారానికి నోచుకోవని ఇది గుర్తించింది.

రాజకీయ చర్చల్లో పర్యావరణ అంశాలు చోటు చేసుకోవడం ప్రారంభించిన నాటినుంచి దీర్ఘకాలిక సుస్థిర అభివృద్ధి అనే ఆలోచన పుట్టుకొచ్చింది. ఇది మద్దతు సమీకరించేందుకే పరిమితమైంది తప్ప పర్యావరణ మార్పులకు దోహదమైన 'ఏజెంట్'గా నిలదొక్కుకోలేదు. పర్యావరణం, ఆర్థిక అభివృద్ధి రెండూ పరస్పరం శక్తి సంపన్నులు. దీర్ఘకాలిక లేదా సుస్థిర అభివృద్ధి అనేది విధాన నిర్ణేతలను సులభంగా పక్కదారి పట్టిస్తుంది. పూర్తిగా అభివృద్ధి సాధించడమనేది ఊహాజనితం. ఉనికిలో ఉన్నదానిని బలపరుస్తూ, జాగ్రత్తగా కొత్త ప్రాజెక్టులను రూపొందించి ఆర్థిక విధానాలను సంస్కరించి ఇతరులతో పోటీపడే విధంగా విధాన నిర్ణేతలపై ఇది కనీసంగానైనా ఒత్తిడి తీసుకువస్తుంది. రాజకీయ దృక్కోణం నుంచి చూస్తే, సుస్థిర అభివృద్ధి ఉద్దేశ్యమే నీరుగారి పోతుంది. శక్తిహీనమవుతుంది. అభివృద్ధి అనే పదానికి సుస్థిరత జోడించడం జరిగింది.

5.3 ఆర్థిక అభివృద్ధి మరియు ఆర్థిక వృద్ధి

అభివృద్ధి అనే పదంలో మార్పు సమ్మిళితం అయి ఉంది. ఇదే మానవ జీవన ప్రమాణాల పురోగతికి మార్గం వేస్తుంది. నిజమైన అభివృద్ధిని పాతుకు పోయిన నియమాలనుంచి నిర్వచిస్తాయి. దీంతో ఆర్థికాభివృద్ధిలో ఏయే విషయాలు సమ్మిళితమై ఉంటాయనేది మనకు పెద్ద ఆశ్చర్యంగా తోచదు. అభివృద్ధిలో మార్పు దాగుంది. దేశ సామాజిక ఆర్థిక నిర్మాణాలలో మార్పులేకుండా ఒక్కసారిగా జాతీయ ఆదాయాన్ని పెంచేస్తే ఆర్థిక రంగాన్ని అభివృద్ధిగా పరిగణించలేము.

నిర్దిష్టమైన సామాజిక లక్ష్యాలను సాధించడాన్ని ఆర్థిక అభివృద్ధిగా నిర్వచించారు. లక్ష్యాలు కాలానుగుణంగా మారుతుంటాయి. ఆర్థిక అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. ఇందులో భాగంగా సమాజం మూడు రకాల మార్పులను ఎదుర్కొంటుంది.

1. సమాజంలో మంచి జీవన ప్రమాణాలను నిర్ణయించేది వాస్తవ జాతీయాదాయం. ఇది సంపన్న దేశాలకు కాకుండా పేద దేశాలకు మాత్రమే వర్తిస్తుందని కొందరి అభిప్రాయం. మన జీవన ప్రమాణ స్థాయిని సూచించే మరో అంశం పర్యావరణ సమతౌల్యం. అభివృద్ధి సమాజంలో సమాజం మొత్తానికి ఇచ్చే ప్రాధాన్యత కంటే అప్రయోజన రంగాలకే అధిక ప్రాధాన్యతనివ్వాలి. సమాజం పటిష్టంగా రూపు దిద్దుకొని అప్రయోజనరంగాలు అభివృద్ధికి నోచుకోనట్లయితే అలాంటి సమాజం మొత్తం అభివృద్ధికి దూరంగా ఉంటుందని చెప్పవచ్చు.
2. విద్య, ఆరోగ్యం, సాధారణ జీవితాలలో ముందడుగు వేయడం, నూతన పురోభివృద్ధి అంశాలను జొప్పించడం ద్వారా నైపుణ్యానికి, తెలివి తేటలకు, శక్తి సామర్థ్యాలకు, ఎంపికకు మరింత మెరుగులు దిద్దడం.
3. ఆత్మగౌరవం, పురోగతిలో స్వతంత్ర్యత ప్రదర్శించగలిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. ఇతరుల ఆధిపత్యం నుంచి స్వేచ్ఛను పొందుతాం. ఇంకా చెప్పాలంటే రాజ్యం నుంచి స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటాం.

సమాజంలో చోటుచేసుకున్న మార్పులను అంచనా వేయడం గాని, అభివృద్ధి క్రమాన్ని గురించి ఒక ముగింపునకు రావడంగానీ చాలా క్లిష్టమైనపని. రాజకీయ స్వేచ్ఛ లేకుండా ఆర్థికాభివృద్ధిని సమానత్వంతో జత చేయలేం కదా! ఆర్థిక

BRAOU

పెరుగుదల కన్నా ఆర్థికాభివృద్ధి పరిధి చాలా విస్తృతమైంది. పెరుగుదలకు అభివృద్ధికి మధ్య నిర్దిష్టమైన తేడా వుంది. ఇది చాలా ముఖ్యమైన అంశం.

సుస్థిర అభివృద్ధి, స్థిరమైన పెరుగుదల రెండు ఒక దానితో మరొకటి ముడిపడి ఉంటాయి. ఏ సమాజమైనా అభివృద్ధి చెందితేగానీ దాని తలసరి ఆదాయంలో పెరుగుదల కనిపించదు. ఇతర సామాజిక, రాజకీయ మౌలికాంశాలను అడ్డం పెట్టుకుని పెరుగుదలను సాధిస్తుంది.

5.4 పర్యావరణం–సుస్థిర అభివృద్ధి

గతంలోని అభివృద్ధి పథకాలు ఆర్థిక నిర్వహణలకన్నా కూడా ఆరోగ్యకరమైన పర్యావరణం సహజసిద్ధ వనరుల నుంచి పొందేవేవలే చాలా ముఖ్యం. పర్యావరణం గురించి పూర్తి అవగాహనను పెంపొందించడం ద్వారా దీర్ఘకాలిక అభివృద్ధి మనకు సహజ సిద్ధ వనరుల, నిర్మాణాత్మక వనరుల కార్యకలాపాలతీరు తెన్నులను ప్రతిఫలిస్తుంది. వాటిని ఇలా వర్గీకరించవచ్చు.

1) **ఉన్నత ప్రమాణాలకోసం ప్రత్యక్షంగా అందించే సేవలు :** పరిసరాలే సౌకర్యాలను ఒనగూరుస్తాయి. సుందరమైన పరిసరాలుగా అవి మెప్పుపొందుతాయి. వినోదోల్లాసాలకు ప్రధాన సాధనమవుతుంది. అంతే కాదు, మొత్తం మీడియా (రేడియో, టివి, సినిమా) దృష్టి వీటిపైకి పోతుంది.

2) **ఉన్నత జీవన ప్రమాణాలకోసం పరోక్షంగా అందించే సేవలు:** పరిసరాలు, పర్యావరణం ఆరోగ్యకరంగా లేనట్టయితే మన చుట్టూరా ఇదీ అని చెప్పలేని ఒక విధమైన ఒత్తిడి, అనారోగ్య పరిస్థితులు నెలకొంటాయి. వాయు, నీటి కాలుష్యాల విష పరిణామాలు మన ఆరోగ్యంపై ప్రత్యక్షంగా పడతాయి. ఫలితంగా ఆర్థిక క్రమాన్ని ముందుకు తీసుకుపోయే శ్రమ సామర్థ్యం, ఆనందకర జీవితాలను ఇవి దెబ్బతీస్తాయి.

3) **పర్యావరణ రంగానికి జాతీయాదాయం ద్వారా అందే ప్రత్యక్షసేవలు:** పరిసరాల పరిరక్షణకు వివిధ రకాలైన సౌకర్యాల కల్పనకు అవసరమైన వ్యయంను పర్యావరణ రంగం చేపడుతుంది. ఆదాయం, ఉపాధికల్పనకుదోహదపడుతుంది. ఆర్థిక పెరుగుదలతో పర్యావరణాన్ని పెద్ద అడ్డంకిగా భావిస్తూ వస్తుండటాన్ని చాలాకాలం నుంచి పట్టించుకోవడం లేదు. ఈ రకమైన ధోరణి 1970 నుంచి ప్రారంభమైందనుకోవచ్చు. పర్యావరణం మీద పెట్టే ఖర్చువల్ల వెనక్కి తిరిగివచ్చేది ఏమీలేదు. ఇంకా చెప్పాలంటే పర్యావరణమును నాశనం చేయడం వల్లే ఎక్కువ లబ్ధి పొందుతాయనే అభిప్రాయాలు చాలా మందిలో గాఢంగా నాటుకు పోయాయి. ఆర్థిక పెరుగుదలకూడా కుంటుపడుతుందనే అభిప్రాయం ఉంది. నిజానికి పర్యావరణంపై జరిగే వ్యయం చాలా తక్కువ.

4) **ఆర్థిక కార్యకలాపాలకు పర్యావరణ సాధనాలందించే ప్రత్యక్ష సేవలు:** సహజ వనరులు, చమురు, వాయువు, ఇంధనం, వెదురు, ఖనిజాల వంటి ఎన్నో ముడి సరుకులను అందిస్తున్నాయి. వీటన్నింటినీ తీసుకుని శుద్ధిచేసి, ఉపయోగించుకుని వాటినుంచి వచ్చిన వ్యర్థ పదార్థాలను సరిగా వినియోగించుకోగలిగితే అది కూడా ప్రధానమైన వనరుగా ఉపయోగపడతుంది.

5) **సుస్థిర జీవనాన్ని అందించే వ్యవస్థలసేవలు:** పర్యావరణ సేవలు కొన్నింటిని వీటికింద చెప్పుకోవచ్చు వాటర్‌షెడ్, ఉష్ణమండల అడవుల కార్యకలాపాలు, తేమ భూముల్లో నీటిని శుద్ధి చేసే పనులు, వీటన్నింటినీ మనం స్పష్టంగా నిర్వచించుకోవాలి. పర్యావరణం పైచేపట్టే ఆర్థిక అంచనాలతో ఈ అంశాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాం. పర్యావరణాన్నికి సంబంధించి విస్తృత స్థాయిలో మరింత ప్రాధాన్యతను కలిగిన అంశాలు చాలా ఉన్నాయి. వీటిని తరచూ ఆర్థిక పరిధిలోకి తీసుకురావడం ఎంతో కష్టం. పోతే ఈ అంశాలకు మౌలికంగా ఎంతో ప్రాధాన్యత

BRAOU

సంతరించుకున్నది. ఇవే లేనట్టయితే ఆర్థిక అభివృద్ధి నేడున్న స్థితిలో కూడా సాగేది కాదు. ఉదాహరణకు ఓజోన్ పొర గురించి చెప్పుకున్నట్టయితే ఓజోన్‌పొర సూర్యకిరణాల తీవ్రతను వివిధస్థాయిలో క్రమ బద్ధీకరిస్తూ వస్తోంది. భూమిపైనున్న బొగ్గు పులుసు వాయువు (కార్బన్ డయాక్సైడ్)తో పాటు మిగతా వాయువులు ఇక్కడి వాతావరణాన్ని క్రమబద్ధీకరిస్తాయి.

సంక్లిష్టమైన కార్బన్, హైడ్రోలాజికల్ పరిణామాలలో సముద్రాలు ఏర్పడతాయి. సముద్రనీటిలో నిముష నిమిషానికి పుట్టుకొచ్చే జీవులు, నీటిమీద తేలియాడే మొక్కలు ఇవన్నీ 'ఫుడ్ చైన్'లో చాలా ప్రాధాన్యతను సంతరించుకుంటాయి.

విస్తృత పరిధిలో చెప్పుకోవలసివస్తే, సహజ వనరులు ప్రధానంగా మూడు కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి.

1) వ్యక్తులకు ఉపయోగపడే వాటిని అందిస్తున్నాయి.

2) ఆర్థిక క్రమంలో ప్రాధాన్యత పొందే సాధనాలను అందిస్తాయి.

3) నిత్యజీవనానికి ఎంతగానో ఉపయోగపడే సేవలను అందిస్తాయి.

సుస్థిర అభివృద్ధికి ఈ మూడు అంశాలు చక్కగా ఉపయోగపడతాయి.

5.5 సుస్థిర అభివృద్ధి-సమానత్వం

విధాన నిర్ణయాలలో సుస్థిర అభివృద్ధి వాదం పర్యావరణ ప్రాముఖ్యతను బహిరంగ పరచదలచింది. ఫలితంగా పర్యావరణంపై పెట్టుబడులు పెరుగుతాయి. పర్యావరణ క్షీణతకు అడ్డుకట్ట పడుతుంది. గతంలో కన్నా ఎక్కువ ప్రయోజనాలను సమాజానికి అందిస్తుంది. దీనికి కావలసినన్ని సాక్ష్యాధారాలున్నాయి. పర్యావరణ పెట్టుబడులను పరిరక్షించడం లేదా భద్రపరచడం ద్వారా సమానత్వ అంశాలు కూడా ప్రాధాన్యత పొందుతాయి.

సుస్థిర అభివృద్ధిలో మూడు రకాలైన అసమానతలను చూస్తాం.

1) కాలానుగుణంగా తలెత్తే ఇంటర్ జనరేషనల్ ఇక్విటి లేదా ఈక్వాలిటి

2) ఒక నిర్దిష్ట కాలానికి దేశాల మధ్య తలెత్తే 'ఇంట్రాజనరేషనల్ ఈక్విటి లేదా ఈక్వాలిటీ'

3) నిర్దిష్ట కాలానికి ఒక దేశంలో ఉండే 'ఇంట్రా జనరేషనల్ ఈక్విటి లేదా ఈక్వాలిటి'.

భవిష్యత్ తరాల ప్రయోజనాలు, ప్రస్తుతం నడుస్తున్న అభివృద్ధి రెండింటినీ గురించి బ్రట్‌లాండ్ కమిషన్ నొక్కి చెప్పింది. వివిధ దేశాల మధ్యగానీ దేశీయంగాగానీ అసమానతల కొనసాగింపు దీర్ఘకాలిక ప్రయోజనాలను చూపుతాయి.

సగౌరవంగా జీవితాన్ని కొనసాగించే హక్కుకు పేదరికం, దీర్ఘకాలిక అభివృద్ధికి మధ్య సన్నిహిత సంబంధం ఉంది. వివిధ దేశాల మధ్య లేదా దేశీయంగా ఉండే అసమానతలు పేదరికాన్ని తీవ్రతరం చేస్తాయి. వాటి పరిణామాలు దీర్ఘకాలిక అభివృద్ధిపై కూడా తమ ప్రభావాన్ని చూపిస్తాయి. దేశాల మధ్య అసమానతలపై కూడా దీర్ఘకాలిక అభివృద్ధి దృష్టి సలుపుతుంది. ఉదాహరణకు సంపన్న దేశాలకు నిర్దిష్టమైన సహజ వనరుల అవసరం ఏర్పడుతుందనుకోండి. ఏ విధమైన తోడ్పాటు అందించని రీతిలో పేద దేశాలలోని పర్యావరణ సంపదను దోచుకుంటుంది. ఈ ధోరణులు పేదదేశాల అభివృద్ధికి ముందు ముందు ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి. దేశంలోని అసమానతలు కూడా అభివృద్ధిని కుంటుపరుస్తాయి. సంపన్న వర్గాల కన్నా ఎక్కువగా పేద ప్రజలు సహజ వనరుల మీద ఆధారపడతారు. ఇతర వనరులు వీరికి అందుబాటులో లేకపోతే కేవలం సహజ వనరుల మీదే వీళ్లు తమ జీవితాలను వెళ్లదీస్తే పర్యావరణ సంపద అంతా హరించుకుపోతుంది. పర్యావరణం అంతరించినట్టయితే పేదరికం మరింత ఊపందుకుంటుంది. ఎందుకంటే పేద దేశాలలోని ప్రజలకు సహజ వనరులే శరణ్యం. వీటిమూలంగానే వారి జీవితాలు నడుస్తాయి.

BRAOU

5.6 పేదరికం, మానవ హక్కులు, సుస్థిర అభివృద్ధి

ఆహారం, నీరు, ఆదాయం, శక్తిలాంటి అన్నింటికీ పేదవాళ్ళు సహజ వనరుల మీదే ఆధారపడుతారు. కావున పర్యావరణం హరించుకుపోతే పేదరికం వెల్లువెత్తుతోంది. గడ్డిభూములు అంతరించిపోయి పశుసంపద విలుప్తమవుతుంది. సంపాదన శూన్యం. అడవులు నరుక్కుంటూ పోతే ఇంధనం పూర్తిగా కరువు అవుతుంది. భూమి కోతకు గురైతే పంట దిగుబడులు పడిపోతాయి.

ఇక్కడ సంపన్న దేశాల అనుభవాలను పరిశీలించినట్టయితే ఆర్థిక పెరుగుదల ద్వారా పేదరికాన్ని రూపుమాపడం స్వల్ప కాలంలోనే పర్యావరణాన్ని క్షీణించేట్టు చేస్తుంది. పారిశ్రామికీకరణ పూర్తయినవెంటనే పారిశ్రామిక దేశాలు పర్యావరణాన్ని పునరుద్ధరించడంతో పాటు పర్యావరణం హరించుకుపోకుండా చర్యలకు సంసిద్ధమయ్యాయి. ఐతే ప్రస్తుతం పలు వర్తమాన దేశాలలో పర్యావరణ పరిస్థితులు దిగజారడం ప్రారంభించాయి.

ఒక స్థాయికి వచ్చిన తర్వాత అది పేదరికం వైపునకే పరుగులు పెడుతుంది. అంతర్జాతీయంగా ఆదాయం, పంపిణీలలో తీవ్ర అసమానతలు తొంగిచూస్తున్నాయి. 1990 లెక్కలను అనుసరించి ప్రపంచ దేశాలలో 61 శాతం పేద దేశాల ప్రజలు ఉంటే ప్రపంచ ఆదాయంలో 6% దేశాలు పొందుతున్నవి కేవలం ఐదుశాతం మాత్రమే! ప్రపంచ జనాభాలో 17 శాతం మంది ప్రజలు సంపన్న దేశాల్లో నివసిస్తోంటే ప్రపంచ ఆదాయంలో వాళ్ళు అనుభవిస్తున్న వాటాలో 82 శాతం!

5.7 పర్యావరణం–పేదరికానికి మధ్య సంబంధం

పేదరికం, పర్యావరణ క్షీణత మూలాలు పేదరికం వ్యాపించిన ప్రదేశాలలో ఉన్నాయి. పర్యావరణ పరంగా ఏ మాత్రం అనుకూల వాతావరణంలేని గ్రామ ప్రాంతాలలో నివసిస్తుంటారు. లేదా, నగరాల, పట్టణ శివారు ప్రాంతాలలో నివసిస్తుంటారు. నగర, పట్టణ శివార్లు పర్యావరణ కాలుష్యానికి కేంద్రాలు. అక్కడి పరిశ్రమలు, రకరకాల వ్యర్థ పదార్థాల-విడుదల చోటు చేసుకోవడం మనం గమనించవచ్చు. ఉష్ణమండల అడవులను తీసుకున్నట్టయితే వాటిని నరికి వేయడం మొదలైతే అక్కడి మట్టి కూడా కోతకు గురవుతోంది. అంతే కాదు మట్టిలో ఆమ్ల ప్రమాణాలు ఎక్కువగా ఉంటాయి. ఎక్కువ భూములున్న చోట ఎక్కువ మట్టి కోతకు లోను అవుతోంది. బీడు భూముల్లో ఇసుక తేలికగా ఉండి గాలివస్తే పైకి లేస్తుంది.

పర్యావరణం క్షీణించి పోవడానికి పేదరికం కారణం కాకపోవచ్చు. కాని, అలాంటి పరిస్థితులకు అది దారితీస్తుంది. అవకాశాలు ఇప్పుడు పరిమితంగానే ఉంటాయి. అలాంటి సమయంలో రెండు మార్గాలను వీళ్ళు ఆశ్రయిస్తారు. అందరికీ అందుబాటులో ఉండే పరిమిత వనరులపై దృష్టి సారిస్తాయి. లేదా పట్టణ ప్రాంతాలకు వలసలు పోవడం జరుగుతుంది. వనరులన్నీ వివక్షణారహితంగా ఉపయోగించడం వల్ల గ్రామీణ పర్యావరణం బాగా దెబ్బతింటుంది. పట్టణ ప్రాంతాలకు తరలి వెళ్లడమనేది ఒకరకమైన పర్యావరణ దాడినుంచి మరొక రకమైన పర్యావరణ దాడికి పాల్పడడమే అవుతుంది. అంటే గ్రామాల నుంచి పట్టణాల దాకా పర్యావరణం క్షీణించిపోవడం మొదలవుతుంది. పేదరికం ఒక్కటే పర్యావరణ క్షీణతకు కారణం కాదు. పేదరికాన్ని నిర్మూలించేందుకు అనుసరించే వ్యూహాలమీద ఇది ఎక్కువ ఆధారపడి ఉంది. పేదరిక నిర్మూలనా వ్యూహాలు అందుబాటులో ఉన్న మార్గాలు, సాంస్కృతిక లంశాలు, స్థానిక; జాతీయ పర్యావరణ విధానాల మీద ఆధారపడి ఉంటాయి. పర్యావరణ పరంగా హానికరమైన ప్రదేశాలుగా పేద దేశాలు నిలిచాయి. అనారోగ్యకరమైన పరిసరాల మధ్య పేద ప్రజలు జీవిస్తున్నారు.

BRAOU

5.8 ముగింపు

పర్యావరణ ప్రధానంగా సుస్థిర అభివృద్ధి అనే ఆలోచన నేడు అంతర్జాతీయంగా ఎంతో ప్రాముఖ్యాన్ని, సంతరించుకుంది. దీన్ని సాధించడం చాలా కష్టమైనపని. ఒక దానితో మరొకటి పొత్తుకుదరని పలు ప్రయోజనాలు ఇందులో మిళితమై ఉంటాయి. పెట్టుబడులను భారీ స్థాయిలో కురిపించడం వల్ల ఇది సాధ్యపడుతుందనుకుంటే అది తెలివి తక్కువ తనం అవుతుంది. ఆదాయంలో పెరుగుదల కనిపించినంత మాత్రాన దీన్ని సాధించామనుకున్నా పొరపాటే. వ్యయానికి తగ్గ రీతిలో ఆదాయం ఉండాలి. వర్తమానానికైనా, భవిష్యత్‌కైనా వర్తించేది ఇదే. ప్రస్తుతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కొనసాగుతున్న భారీ తారతమ్యాలు సర్దుబాటు కావాలి. లేనిపక్షంలో పర్యావరణం మరింతగా క్షీణించి పోవడానికి ఇది దారితీస్తుంది. అనారోగ్యకర పరిసరాలలో జీవిస్తున్న పేదలు చక్కటి పర్యావరణాలలో ఆనందకరమైన, హుందాతనమైన జీవితాన్ని కొనసాగించాలి. తమ పరిసరాలను తమకు మాత్రమే భక్షించే పరిస్థితులు ఉండరాదు. అప్పుడే సుస్థిర అభివృద్ధి లక్ష్యం సాధిస్తాం. అప్పుడే మన కలనిజమవుతుంది. సుస్థిర అభివృద్ధి అనే హుందాతనమైన జీవన ప్రమాణాలతో సమానత్వం ముడిపడి ఉంది. సహజవనరుల పరిరక్షణకు, ఇచ్ఛాపూర్వకమైన అభివృద్ధికి ఇది తొలి అడుగు అవుతుంది.

5.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు 40 పంక్తులలో సమాధానం రాయండి!

1. మానవ హక్కుల సాధనకు సుస్థిరమైన అభివృద్ధి ఏ విధంగా తోడ్పడుతుందో చర్చించండి?
2. పేదరికం, మానవ హక్కులు, సుస్థిర అభివృద్ధిల మధ్యగల సంబంధం పేర్కొనండి?

ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి!

1. సుస్థిరమైన అభివృద్ధి భావనను వివరించండి?
2. సుస్థిర అభివృద్ధికి పర్యావరణ అవగాహన ఎలా తోడ్పడుతుంది?

BRAOU

భాగం 6 : సంస్థాగత సర్దుబాటు కార్యక్రమం–మానవ హక్కులు

విషయ క్రమం

6.0 ఉద్దేశం

6.1 పరిచయం

6.2 సంస్థాగత సర్దుబాటు కార్యక్రమం

6.3 నిరుద్యోగం

6.4 సామాజిక వ్యయం

6.5 పేద వర్గాలకు వ్యయం

6.6 ముగింపు

6.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

6.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

★ సంస్థాగత సర్దుబాటు కార్యక్రమం అంటే ఏమిటో వివరించగలుగుతారు

★ ఆర్థిక రంగంలో వచ్చిన మార్పులు నిరుద్యోగాన్ని ఎలా పెంచుతున్నాయో విశ్లేషించగలుగుతారు

★ సర్దుబాటు కార్యక్రమం పేద వర్గాలకు ఎటువంటి సమస్యలు తీసుకు వస్తుందో తెలుసుకుంటారు

BRAOU

6.1 పరిచయం

మూడవ ప్రపంచ దేశాల్లో మానవ హక్కుల స్థితిగతులకు, సంస్థాగత సర్దుబాటు కార్యక్రమానికి మధ్యనున్న పరస్పర సంబంధాన్ని ఈ పాఠ్యాంశంలో అధ్యయనం చేస్తాం. గౌరవంగా జీవించే హక్కు సమాజంలోని ప్రతి ఒక్కరికీ వుండాలనే విషయాన్ని, మానవ హక్కులు విస్తృత పరిధిలో వ్యాఖ్యానిస్తున్నాయి. ఇందులో నిర్దిష్టమైన కొన్ని ఆర్థిక వ్యవస్థలకు సంబంధించిన మౌలిక అంశాల గురించి ప్రధానంగా చర్చించడం జరిగింది. స్వయం శక్తితో ఎవ్వరి మీదా ఆధారపడకుండా ఆత్మ గౌరవంగా జీవించే హక్కును ఈ అంశాలు కల్పిస్తున్నాయి.

సంస్థాగత సర్దుబాటు కార్యక్రమం స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంట్ ప్రోగ్రాం అంటే ఏమిటి అనే దాన్ని మొదటి భాగంలో వివరించాం. రెండవ భాగంలో దీన్ని నిత్య జీవనోపాధి కార్యకలాపాల్లోనూ, సామాజిక వినియోగానికి ముఖ్యంగా పేదలకు సంబంధించి ఎలా అన్వయిస్తాయనే దాని గురించి చర్చించాం. పరిమితాభివృద్ధి సాధించిన దేశాల్లో 'శాప్' అమలు అందించిన అనుభవాల గురించి మూడవ భాగంలో విశ్లేషించడమైంది. ఆ దేశాలలో 'శాప్' కార్యక్రమం 1990ల నుంచి మొదలైంది. దీని స్వరూప స్వభావాల గురించి, లోటుపాట్ల పైనా నాల్గవ భాగంలో పేర్కొన్నాము.

6.2 సంస్థాగత సర్దుబాటు కార్యక్రమం (ఎస్ఏపి)

సంస్థాగత సర్దుబాటు అనే పదాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరివర్తనను చర్చించే సందర్భంలో తరచూ

వాడుతుండడం గమనిస్తాం.''అంతర్జాతీయ ఉత్పత్తి వ్యవస్థ, వినియోగం, వాణిజ్యాలుగా వివిధ దేశాల ఆర్థిక రంగాలు ఏక రూపును సంతరించుకున్నాయి'' అంటూ ప్రాపంచిక పరివర్తన (గ్లోబల్ ట్రాన్స్‌ఫర్మేషన్)ను నిర్వచించారు. ప్రస్తుతం వ్యాపారం, పెట్టుబడుల సరళీకరణగా వర్థమాన దేశాల్లో ఇది ప్రాధాన్యత పొందితే దీర్ఘకాల సర్దుబాట్ల పరంగా ఇది ఆధిక్యాన్ని సంతరించుకుంది. సంస్థాగత సర్దుబాట్లు అంటే ఏమిటో ఇక్కడ మనకు కొంత బోధపడుతుంది. సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో చోటు చేసుకున్న మార్పులకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ఆర్థిక రంగాల్లో సర్దుబాట్లకు సిద్ధపడాలన్నమాట. సంస్థాగత సర్దుబాటుకు మూడు ప్రధానమైన పార్శ్వాలు వున్నాయి.

1. బహిరంగ మార్కెట్ పరంగా చూస్తే, రక్షిత వాణిజ్య వ్యవస్థ నుంచి స్వేచ్ఛ వ్యాపార, పెట్టుబడుల దిశగా సవరణలు చేపట్టడం

2. అంతర్గత ఆర్థిక వ్యవస్థ పరంగా చూస్తే ప్రభుత్వ రంగ సంస్థల ఆధిక్యంతో నడుస్తున్న ఆర్థిక నిర్మాణాన్ని, పూర్తిగా ప్రైవేటు రంగం వైపునకు మళ్ళించడం.

3. ఉత్పత్తి వ్యవస్థను భారీ స్థాయి వస్తు ఉత్పత్తుల నుంచి వినియోగదారు వస్తు ఉత్పత్తుల దిశగా నడిపించడం.

వర్థమాన దేశాల్లో భారీ స్థాయి వస్తు ఉత్పత్తి రంగంలో రక్షిత వాణిజ్యపరంగా చోటు చేసుకున్న లోపాలు, ప్రభుత్వ రంగాల అసమర్థ పనితీరు తదితర అంశాలే సంస్థాగత సర్దుబాటు కార్యక్రమం చేపట్టడానికి కారణంగా చెబుతున్నారు. సూటిగా చెప్పాలంటే ప్రైవేటీకరణ, స్వేచ్ఛా వాణిజ్యాలకు పర్యాయపదంగా సంస్థాగత సర్దుబాటును పేర్కొనాలి. పోటీ తత్వానికి మన్నికైన సేవలను, వేగవంతమైన అభివృద్ధిని ఇవి పెంచుతాయని చెబుతున్న విషయం తెలిసిందే. ఆసక్తికరమైన అంశం ఒకదాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందు సంస్థాగత సర్దుబాటులో ప్రస్తావించిన మూడు అంశాలూ అమలులో వున్నాయి. ప్రైవేటు రంగం, స్వేచ్ఛ వాణిజ్యం, పారిశ్రామిక రంగాలు ఎక్కువగా వినియోగదారీ వస్తువులనే ఉత్పత్తి చేశాయి. అప్పుడు పోటీగానీ, మన్నికగానీ, వేగవంతమైన అభివృద్ధి కానీ ఏవీ కన్పించలేదు. నూతన వలస వాదానికి ప్రతీక 'శాప్' అనే విమర్శ వైపునకు మన దృష్టి మళ్ళేట్లు మాత్రమే చేస్తోంది. మనలో పలు సందేహాలు తలెత్తేందుకు కారణం అవుతోంది.

'సంప్రదాయక సంస్థాగత సర్దుబాటు కార్యక్రమంలో ద్రవ్య పాడుపు, లావాదేవీలు, మారకం వంటి స్థూల ఆర్థిక విధానాలు తొలి దశలో కన్పిస్తాయి. రెండవ స్థాయిలో సైకోరల్, సూక్ష్మ ఆర్థిక విధానాలను చూస్తాం. రెండవ రకం విధానాలు లేబర్ మార్కెట్లు, ఆర్థిక మార్కెట్ల, వ్యవసాయ రంగ ధరలపై నియంత్రణకు ఎత్తివేస్తాయి. అంటే అన్ని వ్యాపార అడ్డంకులనూ తొలగిస్తారు. ఒక మాటలో చెప్పాలంటే స్వేచ్ఛా మార్కెట్‌కు తలుపులు తెరవడమన్నమాట. ఆర్థిక రంగంలో ప్రభుత్వ జోక్యాన్ని బాగా తగ్గించడమే దీని వెనుక వున్న ప్రధాన ఉద్దేశ్యం. రాజ్యం సమర్థవంతమైన ఉత్పత్తిదారుడిగా వ్యవహరించలేదన్నది వలసవాదులు చెబుతున్నసాకు. మారకం విలువ సవరణ, ధరలపై నియంత్రణలను తొలగించడం, ప్రైవేటీకరణ, ఎగుమతులు ఆధారిత అభివృద్ధి పథకాలు, ఆహారం, ఆరోగ్య సేవలకు సంబంధించిన సబ్సిడీలను ఎత్తివేయడం లాంటివన్నీ 'సర్దుబాటు విధానం'లోని అంతర్గత అంశాలు. ఈ కార్యక్రమాలు వర్తమాన దేశాలలోని పేదలను అతి తక్కువ కాలంలో మరింత పేదలుగా మారుస్తాయి.

నిర్మాణాత్మక సర్దుబాట్ల కార్యక్రమం ప్రభావం హక్కుల మీద ఎలా ప్రతిఫలిస్తుందో పరిశీలిద్దాం. 'శాప్'ను అమలు పర్చినట్లయితే ఆహార ధాన్యాల ధరలు, ఇతర ఆహార ఉత్పత్తుల ధరలు వెంటనే అనూహ్య రీతిలో పెరుగుతాయి. ఆహారం ధరలు పెరగడానికి నిర్దిష్టమైన కొన్ని కారణాలను క్రింద పేర్కొన్నాం.

1. వ్యవసాయ రంగ సంబంధమైన ఎరువులు ఇతర వస్తువులకిచ్చే సబ్సిడీలలో విధించే కోత మూలంగా ఆహార ధాన్యాల ధరలు నింగినంటుతాయి.

2) ఆహార ధాన్యాల దిగుబడి ధరల్లో హెచ్చుతగ్గుల ప్రజా పంపిణీ కింద పంపిణీ అయ్యే ఆహార ధాన్యాల పెరుగుదలకు కూడా దారి తీస్తుంది.

BRAOU

3. 'శాప్'లో అంతర్భాగంగా దేశీయ మారకం సిసలైన రేటును కాస్తా పరిమితం చేయడం వల్ల తీవ్రమైన పరిణామాలు సంభవిస్తాయి. ఎక్కువ ఖర్చుతో కూడిన పరిస్థితులు ఎదురవుతాయి. దేశీయ ఉత్పత్తుల ధరలు కూడా పెరుగుతాయి.

4) వ్యవసాయ రంగ ఉత్పత్తులకు విదేశీ మార్కెట్‌ను ఆహ్వానిస్తే కొంత వరకు ఆహార ధాన్యాలను విదేశాలకు ఎగుమతి చేయాల్సి వస్తోంది. ఫలితంగా ఆహార ధాన్యాల ధరలు కొండెక్కుతాయి.

5) ఇంధనం, రవాణా ఖర్చుతో పేదలకు అమలు చేస్తున్న పేదల సంక్షేమ కార్యక్రమాలని వైఫల్యాల బాటలోకి నెట్టి వేస్తాయి.

6.3 నిరుద్యోగం

ధరల పెరుగుదలకు తోడుగా 'ఎగ్జిట్ పాలసీ' కింద ముఖ్యంగా వ్యవస్థీకృత రంగంలోని సిబ్బందిపై కోతను విధించారు. ఉద్యోగం నుంచి తొలగించిన వారికి ఇస్తున్న 'కాంపన్సేషన్' అసలు సమస్య పరిష్కారానికి దోహదపడ్డ సూచనలు కనిపించలేదు. సర్దుబాట్ల కార్యక్రమం క్రింద సమీప భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్న సూచనలు కన్పించడం లేదు. ఉద్యోగాలలో ఏమైనా పెరుగుదల కన్పించినా అవి కొన్ని కార్యక్రమాలకే పరిమితమయ్యాయి. వ్యవస్థీకృత రంగంలోని కొన్ని ఉద్యోగాలను అవ్యవస్థీకృత రంగంలోని వ్యక్తులకిచ్చే ఉద్దేశ్యం వుందన్న అభిప్రాయం కూడా మనకు వినిపిస్తోంది. ఉద్యోగాలు కోల్పోవడం, భద్రత కరువవడం, కొత్త ఉపాధి అవకాశాలు లభించక పోవడం లాంటి అంశాలన్నీ కార్మికుల ప్రయోజనాలకు తీవ్రంగా విఘాతం కలిగించాయి. అభివృద్ధికి నోచుకోని పేద సమాజాలలో తగినంత సంపాదన లేక సిబ్బంది రకరకాల సమస్యలను ఎదుర్కోవడం కనిపిస్తోంది. నిరుద్యోగం, తక్కువ వేతనాలు, నింగినంటిన ధరలు ఇదీ సామాన్యుడి బ్రతుకు చిత్రం. ఉదాహరణకు మన దేశ పరిస్థితినే తీసుకుంటే సంస్థాగత సర్దుబాటు వల్ల రెండు రకాలైన పరిస్థితులు తలెత్తుతాయి. అవి సిబ్బంది కోత, ఇది బలవంతంగానో లేదా స్వచ్ఛంద పదవీ విరమణ రూపంలోనో చోటు చేసుకోవటం జరుగుతుంది. మరో వైపు సిబ్బందిని కదిలించ వీలులేని యంత్రాంగ స్వరూప స్వభావం కనిపిస్తుంది. నిబంధనల అమలు సరిగా లేకపోవడం వల్ల ఖాయిలా పడ్డవారి శ్రమల్లోని, ఇతర పరిశ్రమల్లోని కార్మికుల కష్టాలు తీవ్రరూపం దాల్చాయి.

BRAOU

6.4 సామాజిక నష్టం

ద్రవ్య సంబంధమైన పరిమితుల విధింపుతో వివిధ రంగాలలోని ప్రభుత్వ ఖర్చు తగ్గడం ప్రారంభమైంది. సామాజిక రంగం కూడా ఇదే తరహా ప్రలోభానికి లోనైంది. ఉత్పత్తి రంగ పరిధిని దాటి ప్రైవేటీకరణ విస్తృతి చెందుతోంది. విద్య, ఆరోగ్యం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, అనగా తాగునీరు వంటివి ప్రైవేటీకరణకు గురవుతున్నాయి. అలాగే పట్టణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన అనగా పారిశుద్ధ్యం, సామాజిక సేవా దృక్పథం లాంటివి లోపించి మన్నికైన ఆరోగ్య, విద్యా సేవలు తదితర సదుపాయాలు సమాజంలోని పేద వర్గాలకు అందకుండా పోతున్నాయి.

'శాప్'ను ఆఫ్రికా, లాటిన్ అమెరికా లాంటి దేశాలలో 1980ల్లోనే ప్రయోగించారు. అక్కడ పేదరికం, వెనుకబాటుతనం బాగా కనపడుతున్నాయి. ఐక్యరాజ్య సమితి సంస్థలైన యూనిసెఫ్ లాంటి సంస్థలు 'శాప్'ను అమలు జరిపిన తర్వాత ఆయా దేశాలలో స్త్రీలు, పిల్లలు దుర్భర దారిద్ర్య పరిస్థితులలో ఏ విధంగా కొట్టు మిట్టాడుతున్నారో సాక్ష్య ధారాలతో సహా ముందుంచుతున్నాయి. పేదరికంలోనే మగ్గుతున్న వారి దుస్థితి ఇక చెప్పనవసరం లేదు.

''మానవాభివృద్ధి నివేదికలు'' (Human Development Reports) కూడా 'శాప్' వల్ల తలెత్తిన తీవ్రపరిణామాలను తమ నివేదికలలో విస్పష్టంగా పేర్కొన్నాయి. మార్కెట్ ఆధారిత అభివృద్ధికి 'శాప్' కారణమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఇది మనుషులను నిరుద్యోగులుగానూ, పనికి రాని వారిగానూ, తనదైన అభిప్రాయం వ్యక్తం చేయలేని

అసమర్థులుగానూ స్వంత పునాదులు పోగొట్టుకున్న వారిగానూ, భవిష్యత్ అనేది లేకుండా మసల్తి నిలబెడుతుందని హెచ్‌డిఆర్ నివేదికలు స్పష్టం చేశాయి. పంపిణీలో సమానత్వం 'శాప్'కి పడని విషయం. దేశీయంగాను, వివిధ దేశాల మధ్య పంపిణీలోనూ అసమానత్వ ధోరణులు ప్రస్ఫుటిస్తాయి. గత 15 సంవత్సరాల నుంచి ప్రపంచ మార్కెట్ ఆర్థిక లావాదేవీలు, వర్ధమాన సంపన్న దేశాల మధ్య ఆర్థిక కేంద్రీకరణలో తారతమ్యాలు లోతుకంటూ ప్రతిఫలిస్తున్నాయి. 15 ఏళ్ళలో కేవలం 15 దేశాలు మాత్రమే మెరుగైన అభివృద్ధి రేటును నమోదు చేశాయి. దాదాపు వంద దేశాలకు పైగా ప్రతికూల ఆర్థిక పరిణామాలను, పెరుగుతున్న రేట్లను సూచిస్తున్నాయి. జాతీయ ఆదాయంలో క్షీణత కన్పిస్తోంది. వీటిలో 70 దేశాలలో 1980 నాటి కంటే కూడా సగటు ఆదాయం చాలా తక్కువగా కనబడుతోంది. 43 దేశాలలో 1970ల కన్నా, కూడా సగటు ఆదాయం చాలా తక్కువ పుండడం గమనార్హం!! 1970-93 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాలు, పారిశ్రామిక దేశాల మధ్య ఆదాయాలలో తారతమ్యాలు మూడు రెట్లు పెరిగాయి. 1996 నాటికి ప్రపంచ బ్యాంకు నివేదికలో 'శాప్'పై కొన్ని వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇందులో మొత్తం 53 దేశాలలోని స్థితిగతులను అంచనా వేసింది. వీటిలో కేవలం 60 శాతం దేశాలు మాత్రమే పేదరికం, అసమానతలను తగ్గించగలిగాయని అది పేర్కొంది.

'శాప్' ప్రభావం పేదలపై పడినట్లు మరే వర్గం మీద పడలేదు. పేదరికంలో మగ్గుతున్న స్త్రీలను మరింత దుర్భర స్థితికి దిగజార్చింది. 'శాప్' ధాటికి ఎక్కువగా దెబ్బతిన్న వాళ్ళు స్త్రీలే. జాతీయ, అంతర్జాతీయ సదస్సులో ఎలుగెత్తి ప్రకటించిన మహిళల అభివృద్ధి, హక్కులు 'శాప్' వల్ల తుంగలో తొక్కినట్టయింది. సర్దుబాటు కార్యక్రమాల పునాదులను సైతం మనం పోగొట్టుకునేలా చేసాయి. అధిక సంఖ్యాకులైన పేదల హక్కులను ఇవి నీరుగార్చాయి. వీరిలో తీవ్రంగా నష్టాల పాలైన వారు స్త్రీలే. 1989 నాటి ''కామన్ వెల్త్ ఎక్స్‌పర్ట్ నివేదిక'' ప్రకారం, స్త్రీలు పెద్ద సంక్షోభంలో పడ్డారు. సర్దుబాటు కార్యక్రమాల దుష్పరిణామాల భారం వాళ్ళమీద పడింది. ఆదాయంలో క్షీణత, అధిక ధరలతో జీవించే మార్గం లేక మహిళలు పేదరికం మాటున విలవిల లాడుతున్నారు. కుటుంబాలను పోషించేందుకు అదనపు పని కోసం స్త్రీలు దారులు వెతుక్కునే దుస్థితి ఏర్పడిందంటే పరిస్థితులు ఎంతగా విషమించాయో అర్థమవుతుంది. కుటుంబ బడ్జెట్ తిరిగి సక్రమ మార్గంలో పెట్టే బాధ్యత కూడా స్త్రీల పైనే పడింది. ఆరోగ్యం, విద్య, తదితర సదుపాయాల్లో ఏర్పడ్డ కోత ప్రభావం కూడా మొట్టమొదట పడింది స్త్రీల పైనే. మరో వైపు పసిపిల్లల మరణాలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. వర్ధమాన దేశాలలో స్త్రీలు 'శాప్' సృష్టించిన సంక్షోభంలో మొదటి సమిధలు బతకడానికి తమ జీవితాలను ఒక గాడిలో పడేట్టు చేసుకోవాల్సిన బృహత్తర బాధ్యత ఈ దేశాలలోని స్త్రీల పైనే పడింది అని వ్యాఖ్యానించింది.

చాలా దేశాలలో పొదుపు బాధ్యతను స్త్రీల మీద వేయడం పరిపాటి. పురుషులు మాత్రం తమ వ్యక్తిగత సామాజిక సంబంధాలను, ఖర్చులను నిరాటంకంగా కొనసాగిస్తారు. చేతిలో వున్న పరిమిత వనరులతోనే ఇంటి అవసరాలన్ని స్త్రీలు తీర్చుకోవాలని సమాజం భావిస్తుంది. అందుకోసం ఇంటా, బయటా ఎక్కువగా పనిచేయాలి.

క్షీణించిన ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యం ఒకచోట కేంద్రీకరించబడటం ఇళ్లలో పురుషాధిక్యతను పటిష్టపరుస్తుంది. స్త్రీ వ్యతిరేక ప్రచారం సమాజంలో అడుగడుగునా మనకు కన్పిస్తుంది. దక్షిణ ఆసియాలోని స్త్రీలు అందరూ ఇంట్లో వ్యక్తులందరూ తిన్న తర్వాతనే మిగిలిన కొద్ది ఆహారంతో కడుపు నింపుకుంటారు. మగ బిడ్డలకు ఇచ్చేంత పౌష్టికాహారం ఆడబిడ్డలకు ఇవ్వరు. ఇక్కడే వివక్ష స్పష్టమవుతుంది. పేదరికం, ఉనికి భద్రతల నేపథ్యంలో వీరు తీసుకునే ఆహారంలో పౌష్టిక విలువలు మచ్చుకైనా కాన రావడం లేదు. భర్త, పిల్లల కోసం స్త్రీలు తాము తీసుకునే ఆహారాన్ని తగ్గించుకుంటారు. 'శాప్'లో సబ్సిడీల కోత మూలంగా పేదరికం మరింత ఎక్కువైంది. ఇళ్లలో ఆహారం విషయంలో అసమానతలు పెరుగుతున్నాయి. పెరిగిన ధరలు, సబ్సిడీల కోతపై పెరిగిన ఒత్తిడి, విద్యా రంగం కేటాయింపుల్లో తొంగి చూస్తున్నాయి. పరిమితులు, ఆరోగ్య సదుపాయాలు భారతదేశంలోని పేదరికాన్ని రెట్టింపు చేస్తున్నాయి.

6.5 పేద వర్గాలకు నష్టం

'శాప్' అమలు మూడవ తరహా దేశాలలోని పేదల సంక్షేమాన్ని దెబ్బతీసింది. ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిందే ఇది. నిజానికి ఈ పరిణామాలు ఆశ్చర్యాన్ని కలిగించేవేమీ కావు. పేద

BRAOU

వర్గాలను ఇది ఘోరంగా దెబ్బ తీసిందని యూనిసెఫ్ అభిప్రాయపడింది. మానవ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగితే మంచిదన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. ఫలితంగా 'శాప్'తో పాటు కొన్ని స్టేట్ నెట్స్‌కు శ్రీకారం చుట్టారు. ధరలను, ముఖ్యంగా ఆహారోత్పత్తుల ధరలను ప్రజల అవసరాలను దృష్టిలో వుంచుకుని సబ్సిడీ ధరలకు వీటిని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందజేయాలి. 'శాప్' పేద వర్గాలకు అదనంగా ఉద్యోగావకాశాలను ఏమీ కల్పించలేదు. కాకపోగా ఉన్న ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించే పనికి పూనుకున్నది. ఈ పరిస్థితుల తీవ్రతను తగ్గించేందుకు 'స్టేట్‌నెట్స్' ద్వారా మాస్ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్స్‌ను ప్రతిపాదించారు. ద్రవ్యలోటు సామాజిక రంగాలలో ప్రజావసరాలకు సంబంధించిన ఖర్చులపై వేటు వేస్తోంది. పేద ప్రజలు లబ్ధిపొందే విధంగా దీనిలో సవరణలు చేయడం మూడవ ప్రధానాంశం. విద్యా రంగానికి సంబంధించి చూస్తే ప్రాథమిక, మాధ్యమిక, క్రింది స్థాయి విద్యకు ఎక్కువ వనరుల కేటాయింపు జరపడం నాల్గవ అంశం. ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి వనరులను ఎక్కువగా కేటాయించాలనేది మరో ప్రధానమైన అంశం. అయితే ప్రతిపాదనల అమలుకు వనరుల ఇబ్బందులు ఎక్కువ వున్నాయి. లబ్ధిదారులకు ప్రయోజనాలు అందేలా చూడడం సాధ్యమయ్యే పనికాదు. సరైన ప్రజా కార్యక్రమాలు లేవు. కృషి కూడా అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. ఇవి పేదలను మరింత పేదలుగా మారుస్తున్నాయి తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. ఆత్మ గౌరవాన్ని కాపాడుకుంటూ జీవించే హక్కును పేద ప్రజలు నానాటికీ కోల్పోతున్నారు. వారి జీవితాలు సంక్షోభంలో పడ్డాయి. మార్కెట్ ఆధారిత అభివృద్ధిలో మానవ హక్కుల అమలుపై దృష్టి అవసరం. మానవ అభివృద్ధి కోసం ఐక్యరాజ్య సమితి చేపట్టి నిర్వహిస్తున్న కృషిని తక్కువ చేసే ప్రయత్నాలు, వాతావరణం పారిశ్రామిక దేశాలలో కనబడుతుంది. ప్రధానంగా దీన్ని ఎదుర్కొవాలి. ఈ నేపథ్యంలో ప్రపంచ బ్యాంకు, ద్రవ్య నిధులు బలమైన ఆర్థిక శక్తులుగా తమ ఆధిక్యతను, శక్తిని రోజురోజుకు మరింత ప్రదర్శించుకుంటున్నాయి.

6.6 ముగింపు

మార్కెట్ అభివృద్ధిని 'శాప్' ప్రోత్సహించింది. స్త్రీలను, సమాజంలోని బలహీన వర్గాలను దుర్భర దారిద్ర్యంలోకి నెట్టింది. అభివృద్ధి ఫలాలు వారికి అందనీయలేదు. ఉద్యోగం, ఆదాయం వంటి మౌలిక హక్కులకు పేదలను దూరం చేసింది. రాజ్యం (స్టేట్)ను అభివృద్ధి రంగానికి దూరం చేసింది. పేదల కష్టాన్ని మరింత రెట్టింపు చేసింది.

6.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **40** పంక్తులలో సమాధానం రాయండి!*

1) సంస్థాగత సర్దుబాటు కార్యక్రమం యొక్క ముఖ్యాంశాలేవి!

2. మూడవ ప్రపంచ దేశాలలో శాప్ అనుభవాలను తెలుపండి?

*ఈ కింది ప్రశ్నలకు **20** పంక్తులలో సమాధానం రాయండి!*

1. మానవ హక్కులను శాప్ ఎలా ప్రభావితం చేసింది?

2. మహిళలు వారి హక్కుల పట్ల శాప్ అనుభవాన్ని తెలుపండి?

BRAOU

BRAOU

ఖండం - III

మానవ హక్కులు-ఉపేక్షిత వర్గాలు

భారతదేశంలోని మానవహక్కులు అన్ని సామాజిక వర్గాలకు అందుబాటులో లేవనేది ఎవరూ కాదనలేరు. సామాజిక, ఆర్థిక, అభివృద్ధిలో కొన్ని వర్గాలను నిర్లక్ష్యం చేయడం మూలంగా ఆ వర్గాలు మానవ హక్కులను అనుభవించడంలో వెనుకంజలో వున్నాయి. ఈ వర్గాల గూర్చి మానవ హక్కుల దృక్పథంలో సామాజిక, ఆర్థిక అంశాల పరిశీలన ద్వారా అధ్యయనం చేసినపుడే నిర్లక్ష్యపు తీవ్రతను అర్థం చేసుకోగలుగుతాము. ఇందుకు సంబంధించిన వివిధ అంశాలు మూడవ ఖండంలో చర్చించాం. ఈ ఖండంలో ఏడు భాగాలున్నాయి. అవి :

భాగం : 7. భూమి సమస్య - మానవ హక్కులు

భాగం : 8. భారతీయ వ్యవసాయ కార్మికులు - మానవ హక్కులు

భాగం : 9. పారిశ్రామిక కార్మికులు - మానవ హక్కులు

భాగం : 10. మహిళలు - మానవ హక్కులు

భాగం : 11. దళితులు-మానవ హక్కులు

భాగం : 12. గిరిజనులు - మానవ హక్కులు

భాగం : 13. బాలలు - మానవ హక్కులు

BRAOU

BRAOU

భాగం 7: భూమి సమస్య–మానవ హక్కులు

విషయక్రమం

7.0 ఉద్దేశం

7.1 పరిచయం

7.2 భారతదేశంలో భూ సంస్కరణలు : చారిత్రక నేపథ్యం

7.3 చట్టాలు

7.4 చట్టాల అమలు

7.5 భూ సంస్కరణలు-భూమిలేని కార్మికులు

7.6 ముగింపు

7.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

7.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు:

★ భారతదేశంలోని భూ సంస్కరణల చట్టాల గూర్చి తెలుసుకుంటారు

★ భూ సంస్కరణల చట్టాల అమలును

BRAOU

7.1 పరిచయం

ఆమోదయోగ్యమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణానికి భాగస్వామ్య ప్రజాస్వామ్య సంస్థలు లాంటి ఎన్నికల వ్యవస్థ, సార్వత్రిక ఎన్నికలహక్కు, సర్వ స్వతంత్ర న్యాయవ్యవస్థ లాంటివి ఒక్కటే సరిపోవు. వీటితోపాటు కనీస స్థాయిలోనైనా సాంఘిక, ఆర్థిక సమానత్వ సాధన, వ్యవస్థ బాహాటతలు కూడా అవసరమే. ప్రజాస్వామ్య క్రమంలో ఒక దేశ పౌరులు పాలుపంచుకోవడానికి, కనీస పౌరహక్కులు పొందడానికి ఈ బాహాటత అత్యవసరం. చరిత్ర పరంగా ఈ అంశాన్ని పరిశీలించినట్టయితే, ప్రజాస్వామ్య పాలనలు విజయవంతంగా అమలు పరుస్తున్న చాలా దేశాలు ఒకమేరకు ఆస్తి సంబంధాల నిర్మాణాలను మార్చడం ద్వారా మాత్రమే ఈ విజయాలు సాధించాయన్న విషయం విదితమవుతోంది. అయితే ఇలాంటి మార్పులు చేపట్టని ప్రజాస్వామ్య పాలనలు విజయవంతంగా నడవడం కూడా అరుదైన విషయమే.

చాలా మూడవ ప్రపంచ దేశాల మాదిరిగానే భారతదేశం కూడా వలస పాలన నుంచి విముక్తి పొంది, సర్వ స్వతంత్ర రాజ్యమయ్యే సరికి వ్యావసాయిక దేశంగానే వున్నది. భారతదేశం మొత్తం జాతీయ ఆదాయంలో మూడింట రెండు వంతులు కేవలం వ్యవసాయం ద్వారా మాత్రమే వస్తున్నది. ఈ ఆదాయమే గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న దాదాపు 80 శాతం ప్రజలకు ప్రత్యక్షంగా మద్దతిస్తున్నది. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో భారతీయ ఆర్థిక పరిస్థితి మొత్తంగా, వ్యవసాయ రంగం ప్రత్యేకంగా వెనుకబడి, స్తబ్ధతకు లోనైన స్థితిలో వున్నది. దీనికి తోడు రెండు శతాబ్దాల వలస పాలనలో బడా భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, రైతాంగాన్ని దోపిడీచేసి ఓ వెలుగు వెలిగారు. ఈ పరిస్థితుల్లో ఏ అభివృద్ధి క్రమమూ జరిగే అవకాశాలు కూడా లేకుండా పోయాయి. 1950ల తొలినాళ్లలో భారత

దేశంలో విస్తృతంగా పర్యటించిన సుప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్త డేనియల్ థోర్నర్ ఇక్కడి పరిస్థితులను 'అంతర్ సంక్షోభ' పరిస్థితులుగా పేర్కొన్నారు. సమాజంలోని ఒక చిన్న వర్గం ముఖ్యంగా భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, సాధారణంగా ఆయా ప్రాంతాల అగ్ర కులస్తులు గ్రామీణ భారతం మీద ఆధిపత్యం చెలాయిస్తున్నారు. అందువల్ల భూమి దున్నుకొని బతికే వారికి భూమి మీద మళ్ళీ పెట్టుబడులకు ఏమీ మిగలలేదు. ఇది భారతదేశంలో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ స్తబ్ధతకు దారితీసింది అని ఆయన అభిప్రాయ పడ్డారు. అందువల్ల ఈ సామాజిక శాస్త్రవేత్తతో పాటు పలువురు, భారతదేశంలో వ్యవసాయ సంబంధాల్లో ఇప్పుడున్న నిర్మాణాలలో వ్యవస్థీకృత, మౌలిక సంస్కరణలు చేపట్టాలని, ఈ విధంగా మాత్రమే భారతీయ వ్యవసాయం వెనుకబాటు, స్తబ్ధత అన్న విషయం నుంచి బయటపడుతుందని అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత తొలి సంవత్సరాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించి అమలు పరిచే వివిధ సంస్థలు ప్రచురించిన అధికార పత్రాలలో కూడా వ్యవసాయ రంగంలో వ్యవస్థీకృత సంస్కరణలు జరగాలని సూచించారు.

1976లో జోషి చెప్పినట్లుగా వ్యవసాయ నిర్మాణంలో మార్పులకు రెండు ప్రధాన కారణాలున్నాయి. మొదటిది ఆర్థిక రంగంలో జరుగుతున్న ఇతర మార్పుల ఫలితంగా పరోక్ష ప్రభావం వల్ల వ్యవసాయ రంగంలో మార్పులు, ఆర్థికరంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశించడం, వ్యవసాయరంగం 'మార్కెట్ నెట్‌వర్క్' ప్రకారంగా అభివృద్ధి చెందడం, గ్రామీణ జనాభా పెద్ద ఎత్తున వలసలు వెళ్ళడం, మారుతున్న పర్యావరణ పరిస్థితులు సంభవించిన ఫలితంగా మొదటి రకం పరోక్ష ప్రభావంతో మార్పులు జరిగాయి.

రెండవ రకం మార్పులు వ్యవసాయరంగంలో ప్రత్యక్ష జోక్యం ఫలితంగా సంభవించిన మార్పులు. మళ్ళీ ఈ జోక్యం కూడా రెండు రకాలు. మొదటిది చట్టపరమైన చర్యల ద్వారా ప్రభుత్వం స్వయంగా సంకల్పించిన విషయాలు. రెండవరకం జోక్యాలు అశేష జన సమూహాల కదలికవల్ల వ్యవసాయ రంగంలో మార్పుల కోసం పెరిగిన ఒత్తిడి. ఇందుకు ఉదాహరణగా ఆస్తి నిర్మాణం, వ్యవసాయ సంబంధాలపై రైతు సంస్థలు చైతన్యంతో జరిపిన పోరాటాన్ని పేర్కొనవచ్చును.

పై మార్పుల ఫలితంగా ప్రవేశపెట్టినవే భారతీయ భూ సంస్కరణలు. ఈ సంస్కరణలను స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ నిర్మాణంలో సంస్కరణలు తేవడానికి ప్రవేశపెట్టినవని చెప్పవచ్చు. ప్రస్తుతం చెలామణిలో వున్న ఆస్తి సంబంధాల నేపథ్యంలో వ్యవసాయాభివృద్ధికి ఈ మార్పులు అత్యవసరంగా గుర్తించవచ్చు. ఈ విధంగా చూసినప్పుడు భూ సంస్కరణలు ప్రభుత్వం నిర్దేశించిన మార్పుగా అర్థం చేసుకోవచ్చును. భారత ప్రభుత్వం చారిత్రిక అనివార్యతవల్ల భూ సంస్కరణలు ప్రవేశ పెట్టింది. స్వాతంత్ర్య సమరంలో, ఆ తర్వాత స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా వచ్చిన ప్రజా ఒత్తిడుల వల్ల భూ సంస్కరణలు అనివార్యమయ్యాయి. అందువల్లనే క్రిందిస్థాయినుంచి ఒత్తిడులు అధికంగావున్న ప్రాంతాల్లోనే భూ సంస్కరణలు సమర్థంగా అమలయ్యాయి.

7.2 భారతదేశంలో భూ సంస్కరణలు–చారిత్రక నేపథ్యం

బ్రిటిష్ వలస పాలననుంచి స్వాతంత్ర్యం సాధించేందుకు భారతజాతీయ కాంగ్రెస్ జరిపిన పోరాటంలో రైతాంగాన్ని పెద్ద ఎత్తున కదిలించారు. భూ సంబంధాలలో మార్పులు ప్రవేశ పెడ్తారని, తాము అధికారంలోకి వస్తే దున్నే వాడికే భూమి ప్రాతిపదికన భూమిని పునర్ పంపిణీ చేస్తామని కాంగ్రెస్ ప్రచారం చేసింది. అయితే ఇలాంటి భూమికి హక్కులు మాత్రం కాంగ్రెస్ హామీ పడలేదు. కాంగ్రెస్ సదస్సులన్నింటిలోనూ దేశంలోని రైతు సమస్యలను సదా ప్రస్తావిస్తూ, వ్యవసాయ నిర్మాణాన్ని మారుస్తామని హామీ పడేది. అయితే స్వాతంత్ర్య పోరాటం ప్రత్యేక లక్షణాల కారణంగా వ్యవసాయ రంగానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ దృక్పథం సూటిగా వుండేదికాదు. జమీందారీలను రద్దు పరుస్తామని ఆ పార్టీ ప్రకటించినప్పటికీ బడా భూ స్వాములను ప్రత్యక్షంగా లక్ష్యంగా భావించలేదు. ఎందుకంటే స్వాతంత్ర్య సమరంలో కాంగ్రెస్ జమీందారీల, బడా భూస్వాముల మద్దతు కోరింది. వాస్తవానికి 1946లో కాంగ్రెస్ ప్రణాళికలో ఈ రకం వారి హక్కులను స్పష్టపరిహారం చెల్లింపుల ద్వారా రక్షిస్తామని హామీ పడింది. స్వాతంత్ర్యం సిద్ధించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతకూడా వ్యవసాయ సంబంధాల్లో సంధిగ్ధత కొనసాగింది. స్వాతంత్ర్యానంతరం భూ సంస్కరణలు ప్రవేశ పెట్టారు.

BRAOU

7.3 చట్టాలు

సహజ సిద్ధంగానే వ్యవసాయ సంస్కరణలు రాజకీయ సంబంధమైనవే కానీ, అచ్చంగా సాంకేతిక పరమైనవి, ఆర్థిక పరమైనవి కానేకావు. అందువల్లే స్వాతంత్ర్యానంతరం అసలు భూ సంస్కరణల అమలు విషయంలో 'రాజకీయాలు' ప్రధానపాత్ర వహించాయి. ఫలితంగా భారత ప్రభుత్వం వ్యవసాయ రంగంలో మౌలిక సంస్కరణలకు పాల్పడలేదు. అందుకు బదులుగా మధ్యే మార్గంగా భూమి పునర్ పంపిణీ, వ్యవసాయ సంబంధాల్లో పునర్వ్యవస్థీకరణలాంటి చర్యలు చేపట్టారు. అందువల్ల వీటిని జోషి, పాక్షిక సంస్కరణలుగా పేర్కొన్నారు.

స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం అధికార ప్రకటనలు పరిశీలిస్తే భూ సంస్కరణలు వ్యవసాయాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో అసమానతల తొలగింపు అన్న రెండు లక్ష్యాల సాధనకు ఉద్దేశించినవని విదితమవుతుంది. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తిలో కొనసాగుతున్న అర్థభూస్వామ్య సంబంధాల్లో బడా భూస్వాములు ఉత్పత్తితో సంబంధంలేని వారైన ఫలితంగా భారత వ్యవసాయ రంగం స్తబ్ధతకు, వెనుకబాటు తనానికి హేతువవుతున్నది. అందువల్ల వ్యవసాయ ఆర్థిక స్థితిని మార్చడానికి ఎవరైతే నిజంగా సేద్యం చేస్తున్నారో వారికి ఎవరైతే భూమి అభివృద్ధికై నిజంగా శ్రద్ధకలిగి వున్నారో వారికి భూమిపై హక్కు కల్పించేందుకు భూ సంస్కరణలు ఒక మార్గమయ్యాయి.

భూ సంస్కరణల ప్రణాళికావేత్తల యోచన ప్రకారం, వ్యవసాయదారు తన మిగులును మళ్ళీ భూమి మీదనే పెట్టుబడి పెట్టేలా సంస్కరణలు ప్రోత్సహిస్తాయి. ఇది సహజంగానే వ్యవసాయరంగం ఆధునికీకరణకు ఉపయోగపడ్తుంది. ఇవి ఒక గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యం, అసమానతలను తగ్గించి సామాజిక పరివర్తనా విధానంగా ఉపయోగపడ్తాయని విధాన కర్తలు భావించారు. భూ సంస్కరణల అంతిమ లక్ష్యం దున్నే వాడికే భూమి ప్రాతిపదికన పునర్నిర్మాణ, పంపిణీ దృక్పథాలతో వున్నాయి.

రాజ్యాంగం ప్రకారంగా భూ సంస్కరణలు ఆయా రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశమే అయినప్పటికీ భారత ప్రభుత్వం ఈ క్రింది విధంగా చట్టాలు రూపొందించాలని రాష్ట్రాలను ఆదేశించింది.

1) మధ్యవర్తిత్వాల రద్దు

2) సరైన కౌలుకు హామీ పడుతూ కౌలుదారీ చట్టాల సవరణ, కౌలుదారులకు యాజమాన్య హక్కులు కల్పించడం

3) భూస్వాముల కమతాలపై సీలింగ్, మిగులు భూములు గ్రామీణ పేదలకు పంచడం.

4) కమతాల క్రమబద్ధీకరణ

ఈ అంశాలపై స్వల్ప వ్యవధిలోనే ఆయా రాష్ట్రాలు పెద్ద సంఖ్యలో చట్టాలు రూపొందించాయి. ఇంత భారీ సంఖ్యలో వున్నాయంటే థోర్నర్, 'ఏదేశ చరిత్రలోనూ ఇంత పెద్ద ఎత్తున వ్యవసాయ చట్టాలు ఇంత తక్కువ సమయంలో రూపొందలేదు' అని చెప్పేంత స్థాయిలో వున్నాయి.

7.4 చట్టాల అమలు

భూ సంస్కరణల చట్టాల అమలు, వ్యవసాయ నిర్మాణం మీద వాటి ప్రభావం వేరేకథ. కొత్త అధికార నిర్మితిలో భూ స్వాములు రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేకంగా ప్రాంతీయ రాజకీయాల్లో మంచి పట్టు, పలుకుబడి గల వర్గాలుగా అవతరించారు.

కేంద్ర ప్రభుత్వం నిర్దేశిత సూత్రాల మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు భూ సంస్కరణల చట్టాలయితే రూపొందించాయి కానీ వాటిలో కొన్ని లొసుగులుంచాయి. ఈ లొసుగులను ఉపయోగించుకుని భూస్వామ్య వర్గాలు భూమి రికార్డులను

BRAOU

తారుమారు చేసి, బంధువుల పేరిట భూమిని బదలాయించి కౌలుదార్లను ఖాళీ చేయించి భూమిపై అదుపును కొనసాగించాయి. రాజకీయంగా భూసంస్కరణల అమలు కోసం చిత్తశుద్ధిలేనిచోట ప్రాంతాలవారీ మాత్రం రైతుల ఒత్తిడులవల్ల ఉద్యమాల వల్ల మాత్రం కొన్ని చోట్ల భూ సంస్కరణలు అమలు జరిగాయి. దావణగెరెలో మొదటి దశ భూ సంస్కరణల పత్రాల ఆధారంగా ఈ క్రింది విషయాలు వెల్లడయ్యాయి.

1) భూ సంస్కరణల తొలిచట్టాలు మధ్యవర్తిత్వాలను రద్దు పరచడంలో సఫలమయ్యాయి. అయితే భూస్వాములకు బేదఖలు అయిన భూములకు భారీగా నష్టపరిహారం ముట్టింది. భూస్వాములు ఈ నష్ట పరిహారాల సొమ్ముతో ఇతర ఆర్థికరంగాలపై ఆధిపత్యం సాధించి గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ అధికారాన్ని పొందారు.

2) ఫలితంగా భూ సంస్కరణలు కౌలుదారులకు పూర్తి రక్షణ కల్పించడంలో విఫలమయ్యాయి. ఎందువల్లనంటే భూస్వాముల మిగులు భూములపై హక్కులకోసం కౌలుదారులు నష్ట పరిహారాలు చెల్లించలేక పోవడంతో వారికి హక్కు రాకుండా పోయింది. ఉదాహరణకు మహారాష్ట్రలో సగం మంది కౌలుదారులు కూడా హక్కు పొందలేక పోయారు.

3) న్యాయ, చట్ట వ్యవస్థలు తరచుగా ధనవంతులు, అధికారం కలిగిన వారికి కొమ్ముకాశాయి. ఫలితంగా భూసంస్కరణల చట్టాల అమలు కోర్టుల మధ్యంతర ఉత్తర్వులు, జోక్యాలతో తీవ్ర జాప్యమైంది. ఈ జాప్యం సహజంగానే అధికారం కల భూస్వామ్య వర్గాలు ఆయా భూముల్లో కౌలుదార్లను ఖాళీ చేయించడం, స్వతంత్రంగా వ్యవసాయం తిరిగి ప్రారంభించడం లాంటివి జరిగాయి.

అయితే, భూ సంస్కరణలు పూర్తిగా విఫలమే అయినప్పటికీ, మొదటి దశలో మాత్రం గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల పట్టు సడలడానికి, వారి స్థానంలో ధనికరైతులు, కౌలుదార్లు కొత్త వర్గంగా ఎదిగి గ్రామీణ ప్రాంతాల రాజకీయ, ఆర్థిక రంగాలపై పట్టు సాధించడానికి తోడ్పడ్డాయి. చట్టాల అమలుకు అరకొర చర్యలు కూడా ఈ మార్పులకు దోహదమయ్యాయి. భూ సంస్కరణల్లో భూములు కోల్పోతామన్న భయంతో భూస్వాములు తమ భూములు అమ్ముకోవడం, ఇతర రంగాలకు మళ్లడం వల్ల భారతీయ వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ ప్రవృత్తులు బలపడ్డాయి.

7.5 భూ సంస్కరణలు–భూమిలేని కార్మికులు

భూ సంస్కరణలు సమ సమాజ స్థాపనకోసం జరుగుతున్న ఉద్యమంగా అభివర్ణించినప్పటికీ, కనీసం మొదటి దశలో ఇందుకు ఉద్దేశించిన చట్టాలు అభివృద్ధి, ఉత్పాదకతల కోసం ఉద్దేశించినవి. మొదటి దశలో భారతీయ భూ సంస్కరణలు భూస్వాములు, కౌలుదార్లు సమస్యలను చూసిందికానీ, భూమిలేని వ్యవసాయ కార్మికుల సమస్యను పట్టించుకోలేదు.

భారత గ్రామీణ సమాజంలో సాంఘిక నిర్మితి ప్రకారం సంప్రదాయపరంగా కొన్ని కులాలు మాత్రమే వ్యవసాయానికి అర్హులు అన్న అభిప్రాయాలు వుండడంతో మొత్తంగా దళితులు, వ్యవసాయ కార్మికులు ఈ చట్టాల పరిధిలోకి రాలేదు. స్వాతంత్రం సిద్ధించిన తొలి సంవత్సరంలో ప్రధానంగా ఈ భూమిమీద మధ్యవర్తుల జోక్యాన్ని, ఆధిపత్యాన్ని రద్దు పరచి భూమిని అంటిపెట్టుకుని వున్న కౌలుదార్లకు హక్కు కల్పిస్తూ చట్టాలు రూపొందించారు. సహజంగానే మధ్య స్థాయి వ్యవసాయ కులాల సమూహాలకు ప్రయోజనం కలిగింది. ఈ సంస్కరణలవల్ల భూమిలేని దళితులు అరుదుగా ప్రయోజనం పొందారు.

భూ సంస్కరణల రెండవదశలో సీలింగ్ చట్టాలు రూపొందించిన తర్వాతే మిగులు భూమి భూమిలేని వ్యవసాయ కార్మికులకు పంచాలన్న సమస్య తలెత్తింది. సీలింగ్ చట్టాల ప్రకారం ఎంత భూమి వుండవచ్చునన్న చట్టాలు ఆయా రాష్ట్రాల్లో వేరు వేరుగా వున్నాయి. ఒకే రాష్ట్రంలో మాగాణి, మెట్ట భూముల విషయంలో కూడా భేదాలున్నాయి. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర లాంటి కొన్ని రాష్ట్రాలలో మాగాణి, మెట్ట పరిమితులను బాగా తగ్గిస్తూ సవరణలతో చట్టాలు చేశారు.

BRAOU

భూ సంస్కరణల చట్టాల కారణంగా మిగులు భూమి చాలా సేకరించవచ్చునని, ఊహించి దీన్ని భూమిలేని వ్యవసాయ కార్మికులకు పంచాలనుకున్నారు. దీని వెనక ప్రధాన ఉద్దేశ్యం కొందరి చేతుల్లో ఎక్కువ భూమి కేంద్రీకృతమై వుండకుండా చూడడమే. అయితే ఈ చట్టాలన్నీ ఉదార బూర్జువా ప్రజా స్వామ్యం పరిధిలో తయారైనవే. అందువల్ల ప్రైవేటు ఆస్తి, యాజమాన్యం హక్కులకు సంబంధించి మౌలిక ప్రశ్నలను ఈ చట్టాలు లేవనెత్తలేదు. ఉదాహరణకు భారత రాజ్యాంగంలో హామీ పడిన 'ప్రాథమిక ఆస్తి హక్కు'ను ఏ చట్టమూ ముట్టుకోలేదు.

ఫలితంగా సీలింగ్ చట్టాలు చాలా తక్కువ ఫలితాలు సాధించాయి. చాలా రాష్ట్రాలలో భూస్వాములు తమ భూములు రక్షించుకునే అవకాశం లభించింది. సీలింగ్ చట్టాలలో కావాలని లొసుగులు వుంచడం వల్ల భూస్వాములు తమ భూములు ఇచ్చుమందం పోకుండా కాపాడుకోగలిగిన పత్రాలు సమర్పించగలిగారు. భూమిని ఒకరినుంచి మరొకరికి బదిలీ చేయడానికి వీలుగా సీలింగ్ చట్టాల అమలు తేదీలను కూడా మార్చిన సంఘటనలున్నాయి. 1960; 1970వ దశకాలలో భారతీయ గ్రామీణ సమాజం ఈ కారణం చేత పెద్ద ఎత్తున మిలియన్ల కొద్దీ ఎకరాల భూమి అయితే బదిలీ లేదా బినామీ పేర్లమీద రిజిస్టర్ అయింది. బినామీ పేర్లమీద అంటే ఉనికిలో లేనివారి పేరిట భూమిని బదిలీ చేయడం. తరతమాలతో ఇది మినహాయింపు లేకుండా అన్ని రాష్ట్రాలలోనూ జరిగింది.

అయితే ప్రగతిశీల సంస్కరణల చట్టాల ద్వారా సేకరించిన భూమిని మిగులు భూమిగా ప్రకటించడం మాత్రం జరిగింది. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో మాత్రం ఈ మిగులు భూమిని భూమిలేని వ్యవసాయ కార్మికులకు పంచడం అనుకున్నదానికన్నా సంతృప్తికరంగా జరిగింది. ఈ రెండు రాష్ట్రాలలో వామపక్ష ప్రభుత్వాలు ఎక్కువకాలం అధికారంలో వుండడం వల్ల ఇది సాధ్యమయింది. 1960వ దశకం తొలినాళ్లలోనే భూ సంస్కరణల చట్టాలు రూపొందించి, అమలు పరచడం ఆరంభించినా 1980ల వరకు కూడా కొన్ని రాష్ట్రాలు మిగులు భూమిని పంచలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సీలింగ్ చట్టాల తర్వాత భూమిలేని వారికి పంచడానికి 28 మిలియన్ల హెక్టార్ల భూమి మిగులుగా వున్నదని అధికార అంచనాల ప్రకారం వెల్లడయింది. అయితే ఒక అంచనా ప్రకారం మొత్తం ప్రకటించిన మిగులు భూమి కేవలం 4.5 మిలియన్ల హెక్టార్లని తేలింది. దీనిలో కూడా ఒక మిలియన్‌కు మించకుండా మాత్రమే భూమిలేని వారికి పంచడం జరిగింది. ఇక మిగిలిన భూమి విషయంలో భూస్వాములు కోర్టులకు వెళ్ళి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకున్నందువల్లకానీ, అధికారుల నిర్లక్ష్యం వల్లకానీ భూ పంపిణీ జరగనేలేదు. హర్యానాలో 329 మంది నమూనా వ్యవసాయ కార్మికులలో కేవలం 47 మందికి మాత్రమే భూమి లభించినట్లు ఒక పరిశీలనలో తేలింది. ఇక్కడ 72.35 శాతం మందికి ఏ భూమీ దక్కలేదు. ఈ గ్రామాలలోని ఒక గ్రామంలో 13 ఎకరాల భూమిని మిగులు భూమిగా ప్రకటించినప్పటికీ ఆ భూమిలో ఒక్క ఎకరం కూడా పంపిణీ జరగలేదు. 1978లో బీహార్‌లోని పూర్లియా జిల్లాలో నిర్వహించిన మరొక స్థాల అధ్యయనంలో 1626.02 ఎకరాల మిగులు భూమి ప్రకటించినప్పటికీ ఆ భూమి 16 మంది భూస్వాముల ఆధీనంలోనే వున్నట్లు కనుగొన్నారు. ఇక్కడ కేవలం 9.8 శాతం భూమి మాత్రమే మిగులు భూమిగా ప్రకటించి మిగతా భూమిని బినామీ పేర్లమీద రిజిస్టర్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ అనుభవాన్ని దృష్టిలో వుంచుకొని జి. పార్థసారథి ఇదే తరహాలో ఈ క్రింది విధంగా వివరించారు.

'ఆంధ్రప్రదేశ్‌లో భూ సంస్కరణల వల్ల భూమిలేని వ్యవసాయ కార్మికులకు ప్రత్యక్షంగా భూమి దక్కిందేమీ లేదన్నది అందరికీ తెలిసిన విషయమే. రాష్ట్రంలో మిగులు భూమి క్రింద చాలా తక్కువ శాతం భూమి ప్రకటించారు. దానిలో కూడా మరీ తక్కువ పంచారు. ఈ పంచిన భూములు కూడా మెట్ట భూములు, భారీ పెట్టుబడులు పెడితేగానీ సేద్యం కాని భూములు. పేదలు పెట్టుబడులు పెట్టి సేద్యం చెయ్యజాలని భూములు'.

7.6 ముగింపు

భూ సంస్కరణల చట్టాలు అంత సంతృప్తికరంగా అమలు కాకపోయినప్పటికీ అని పూర్తిగా విఫలం అయ్యాయని చెప్పడం కూడా తప్పుదోవ పట్టించినట్లే అవుతుంది. వ్యవసాయ రంగం మీద భూ సంస్కరణల చట్టాల ప్రభావం

BRAOU

రాష్ట్రానికీ రాష్ట్రానికీ తేడాగా వుంది. ఈ చట్టాలలో మధ్య వర్తుల ప్రమేయం తొలగింపులాంటి చట్టాలు సమర్థంగా అమలయ్యాయి. భూ సంస్కరణలు లాంఛనంగా రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించి అమలు పరిచేవే అయినప్పటికీ, రాష్ట్ర స్థాయిలో వున్న రాజకీయ స్థితిగతులు, బలబలాలమీద ఆధారపడి అవి వాస్తవంగా అమలయ్యాయి. ఉదాహరణకు దేశంలోని అన్ని రాష్ట్రాలకన్నా పశ్చిమబెంగాల్, కేరళలో భూమిలేని నిరుపేదలను కదిలించిన రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కువ సమర్థంగా భూ సంస్కరణల చట్టాలను అమలు పరచగలిగాయి. మొత్తంగా చూసినప్పుడు డొరీన్ వారినెర్ అభిప్రాయం ప్రకారం భారతదేశంలో వ్యవసాయ సంస్కరణల అసలు సారం భారత రాజకీయ శక్తుల అధికారం, సమతుల్యతల మీద ఆధారపడి వుంది.

భారతదేశంలో భూ సంస్కరణలు మొత్తంగా పరిశీలించినప్పుడు గ్రామీణ పేదలకు పెద్దగా ప్రయోజనం కలిగించకున్న, రైతులు, కౌలుదార్లకు ప్రయోజనం కలిగించాయని చెప్పవచ్చు. ఈ సంస్కరణలు హరిత విప్లవ సాంకేతిక పరిజ్ఞానం కలిగించి భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో పెట్టుబడిదారీ నమూనా వ్యవసాయం అభివృద్ధి కావడానికి మాత్రం కొంతమేరకు తోడ్పడ్డాయి. భూ సంస్కరణల తర్వాత కూడా సంవత్సరాలు గడిచినాక చాలా రాష్ట్రాలలో భూమిలేని నిరుపేదల నిష్పత్తి పెరిగింది. వ్యవసాయ రంగంలో ఉపాధిలో భద్రతా లేమి, తక్కువ వేతనాల ఉపాధిగా తయారైంది. నగరీకరణ క్రమం వేగవంతంగా జరగక పోవడం, వ్యవసాయేతర రంగాలలో ఉపాధి లభ్యత పెరగక పోవడం లాంటి కారణాలచేత భూమిపై ఆధారపడడం పెరిగి, ఇది చిన్న రైతుల మీద తీవ్ర ఒత్తిడి తెచ్చింది.

1950లలో భూ సంస్కరణలు ప్రవేశపెట్టిన నాటికీ, ఇప్పటికీ పరిస్థితులు చాలా మారాయి. ఈ అయిదు దశాబ్దాలలో వ్యవసాయ సాంఘిక నిర్మితిలో చాలా మార్పులు సంభవించాయి. ఇప్పటికీ భూ యాజమాన్యం అసమానతలు కొనసాగుతున్నప్పటికీ, కొద్దిమంది చేతిలో భూమి కేంద్రీకృతమై వున్నప్పటికీ భూ సంస్కరణల విషయాన్ని యాభయవ దశకంలో ఆలోచించినట్లు ఇప్పుడు ఆలోచించజాలము.

7.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానం రాయండి!*

1) భారతదేశంలో భూ సంస్కరణల అవశ్యకతను చర్చించండి?

2) భారతదేశంలో భూ సంస్కరణల అమలులో సమస్యలేవి?

BRAOU

భాగం 8: వ్యవసాయ కార్మికులు–మానవ హక్కులు

విషయక్రమం

8.0 ఉద్దేశం

8.1 పరిచయం

8.2 వ్యవసాయ కార్మికులు-వ్యవసాయమార్పులు-మౌలిక సమస్యలు

8.3 స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ సాంఘిక నిర్మితిమార్పు

8.4 వ్యవసాయ పరివర్తన-వ్యవసాయ కార్మికులు

8.5 అధోగతి ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు

8.6 వేతనాల రీతులు

8.7 ముగింపు

8.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

8.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు:

★ వ్యవసాయ కార్మికుల మౌలిక సమస్యలు తెలుసుకుంటారు.

★ వ్యవసాయ కార్మికుల వేతన పద్ధతులు అవగతం చేసుకుంటారు

B R A O U

8.1 పరిచయం

ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యాలన్నీ తమ పౌరులకు ఒకమేరకు స్వాతంత్ర్యం, సమానత్వం కల్పించడానికి చట్టబద్ధత వున్నట్లు ప్రకటించుకుంటాయి. అన్ని ప్రజాస్వామ్య సమాజాలు ప్రతి పౌరునికీ సమాన ఓటుహక్కు కల్పించి, ఆ ఓటు విలువతో అధికారానికి వచ్చే ప్రాతిపదికన నిర్మితమై వున్నాయి. ఒక ప్రజాస్వామ్య సమాజంలో సూత్రాలమేరకైనా ప్రతి పౌరునికీ అభిప్రాయాలు వెల్లడించే హక్కు చట్టంముందు అందరూ సమానమనే హక్కులు అయినా కల్పించబడతాయి. అయితే ఈ లాంఛన ప్రాయమైన రాజకీయ హక్కులన్నీ ఆయా దేశాల్లోని ఆర్థిక, సామాజిక స్థితిగతులను బట్టి, పౌరుల ఆర్థిక స్థితిగతులను బట్టి, ఆయా దేశాల్లో వృత్తి ఎంపికా స్వాతంత్ర్యమేరకు మాత్రమే అమలవుతాయన్నది వాస్తవం.

ఒక సమాజంలోని ఆర్థిక, సామాజిక నిర్మాణాలు వివిధ అంశాలమీద ఆధారపడి, సుదీర్ఘకాల పరిణామక్రమంలో స్వతంత్ర నిర్మాణాలుగా తయారవుతాయి. ఈ కారణాలవల్ల ఒక సమాజంలోని మానవ హక్కుల పరిస్థితిని అంచనా వేయడానికి ఒక రాజకీయ సంస్థలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా ఇంకా నేపథ్యం గురించి లోతైన అధ్యయనం జరగవలసివుంది. అందువల్ల సమాజంలో ఉనికిలో వున్న సాంఘిక, ఆర్థిక నిర్మాణాలను అంటే కుటుంబం, కులం, మతం, ఆర్థిక సంస్థలు లాంటి వాటి పరిశీలన కూడా అవసరం. మరీ ముఖ్యంగా ఒక జనాభాకు సంబంధించిన ఆర్థిక, సాంఘిక హోదాలు, ఒకతరగతి జనాభా మరో సాంఘిక సమూహంలో లేదా మరో రకపు జనాభాలో సంబంధాలు ఏర్పరుచుకునే తీరును కూడా అధ్యయనం చేయవలసి వుంటుంది. అయితే ఇతర సమూహాలతో ఆయా సమూహాల మనుగడకోసం, ఈ సంబంధాల ప్రభావంతో ఏర్పడే వారి రాజకీయ హక్కుల కోసం అధ్యయనం జరగాలి. ఈ పాఠంలో

భారతదేశంలో వ్యవసాయ సామాజిక సంబంధాల చర్చ వుంటుంది. వ్యవసాయ రంగంలో భూమిలేని వ్యవసాయ కార్మికుల స్థితిగతులు మారుతున్న తీరు తెన్నులను ఈ పాఠంలో చర్చిస్తారు.

8.2 వ్యవసాయ కార్మికులు–వ్యవసాయ మార్పులు–మౌలిక సమస్యలు

భారతదేశంలో వ్యవసాయ కార్మికులు ప్రధానంగా ఇతరుల భూములమీద వేతనాలమీద పనిచేస్తూ వుండే కార్మికులు. ఎక్కువగా వారు ఈ రకమైన ఉత్పత్తి శక్తులుగానే వుంటారు. మన దేశంలో పారిశ్రామిక రంగం కన్నా వ్యవసాయ రంగం పూర్తిగా అసంఘటితరంగం కావడంతో పారిశ్రామిక కార్మికులలాగా వ్యవసాయ కార్మికులకు హక్కులులేవు. వ్యవసాయ కార్మికులు పూర్తి తక్కువ స్థాయి వేతనాలతో అమానవీయ పని పరిస్థితుల్లో ఎక్కువ సమయం పని చేయవలసిన దుర్భర పరిస్థితుల్లో వున్నారు.

స్థిర వ్యవసాయంతో నాగరిక సమాజాలు ఏర్పడ్డాయన్న విషయాన్ని అందరూ అంగీకరిస్తారు. అదనపు రైతాంగం 'మహా'సామ్రాజ్యాలు, మధ్యయుగాల నగర జీవనానికి మద్దతుగా వుండేది. భూస్వామ్య సమాజాలుగా పిలిచే ఈ రకపు సమాజాల్లోకూడా భూమి మీద కార్మికులుగా పనిచేసేవారు స్వేచ్ఛాజీవులు కారు. అయితే ఈ తరహా కార్మికులు బానిసలు కానప్పటికీ వారు సాగుచేసే భూమికి, ఆ భూమి యజమాని ప్రభువుకు లేదా జమీందారుకు కట్టుబడి వుండేవారు. ప్రముఖ చరిత్రకారుడు మోరిక్‌డాల్ ప్రకారంగా భూస్వామ్య సమాజంలో రైతాంగానికి 'విధి' అనే సిద్ధాంతాలలో పనిచేయించినప్పటికీ, ఈ విధిని అమలు పరచడానికి ఎప్పుడూ బలప్రయోగం చేసే బలగాలు వుండనే వున్నాయి. ఈ రైతాంగం సాగుచేసిన భూములపై వచ్చే ఆర్థిక మిగులులో భాగస్వాములుగా వుండడానికి వారిని ఆమోదింపజేసేవారు. అనివార్యంగా భూ సంపదపైన ప్రభువుల గుత్తాధిపత్యం చెలామణి అయ్యేది. రైతాంగానికి చెల్లింపులు ఏమీ చెల్లించని కార్మికుల శ్రమ (కార్మికుల కొలు) అదనపు శ్రమ ఉత్పత్తులు (భూమి కొలు), లేదా అదనపు శ్రమకు సంబంధించిన ఉత్పత్తి విలువగావుండేవి. ఎలాంటి ప్రతిఫలం లేకుండా మిగులులో భాగస్వామ్యం వహించే రైతాంగ విధి ఆచారాలు, సాంప్రదాయాల ప్రకారం సిద్ధించేది. పెట్టుబడిదారీ సంబంధాలకు ముందు పరిస్థితిగా వుండే ఈ సంబంధాలు ప్రాంతానికీ, ప్రాంతానికీ మధ్య వేరు వేరుగా వుంటాయి. ఉదాహరణకు భారతదేశంలో పెట్టుబడిదారీ ముందు వ్యవసాయ సంబంధాలన్నీ కుల వ్యవస్థ రూపం తీసుకొని జజ్‌మానీ నమూనా సంబంధాలతో పనిచేశాయి.

వ్యవసాయ రంగంలో ఆధునికీకరణ పెట్టుబడి దారీ సంబంధాలు అభివృద్ధి చెందడం వ్యవసాయ సంబంధాలలో మౌలిక మార్పులు తీసుకువస్తుందని, వ్యవసాయ ఉత్పత్తిదారులను అన్ని రకాల తప్పనిసరి, ఆధారిత సంబంధాలనుంచి విముక్తి చేస్తుందని అభిప్రాయం చెలామణిలో వుంది. అయితే చాలా పాశ్చాత్య దేశాలలో పెట్టుబడి దారీ విధానం అభివృద్ధిలో కూడా గ్రామీణ ప్రాంతాలలో ఒకరకమైన తారతమ్యాలు ఏర్పడ్డాయి. భూమితో సంబంధం వున్న వ్యవసాయ కార్మికులు రైతాంగం, భూ సంబంధాలనుంచి విముక్తి పొందినా ఆ తర్వాత వీరిలో ఎక్కువ శాతం పారిశ్రామిక ప్రాంతాలకు కార్మికులుగా వలస వెళ్ళారు.

యూరోపియన్ స్థితిగతులకు, భారతదేశపు స్థితిగతులకు చాలా తేడావుంది. ఇక్కడ కులవ్యవస్థ కారణంగా భారతీయ గ్రామీణ సమాజంలో గణనీయమైన జనాభా భూమిలేని జనాభాయే. భూమి కలిగివున్న రైతాంగం లాగా భూమి లేని వ్యవసాయ కార్మికులు భూమికి కట్టుబడి వుండనప్పటికీ, వారు ఆధునిక రీతిలో కార్మికులలాంటి వారు మాత్రం కారు. గ్రామ స్థాయిలో కుల స్థిరీకరణ మేరకు ఈ కార్మికులకు నిర్ధారిత విధులు వున్నాయి. వారి ఆర్థిక పరిస్థితి దుర్భరంగా వున్నప్పటికీ వారిలో చాలామంది భిన్నమైన ఆధారిత సంబంధాలకు కట్టిపడేసి వున్నారు. భారత వ్యవసాయ రంగ చరిత్రలో రైతాంగం, భూమిలేని వ్యవసాయ కార్మికుల రుణభారం చాలా చర్చలో వున్న అంశం. ఈ రుణభారం సర్వసాధారణంగా భూమిలేని వ్యవసాయ కార్మికులను ఒకే ప్రత్యేక వ్యవసాయ దారుకు కట్టిపడేసి వుంచుతుంది. వివిధ రూపాల్లో వున్నప్పటికీ ఈ ఆసియా ఉపఖండంలో ఇప్పటికీ వెట్టిచాకిరి కొనసాగుతున్నది.

రెండు శతాబ్దాల బ్రిటిష్ వలస పాలన భారతదేశంలో వ్యవసాయ సంబంధాలపై ఎనలేని ప్రభావం చూపింది.

BRAOU

బ్రిటిష్ పరిపాలకులు వివిధ వ్యవసాయ చట్టాలు, భూసెటిల్‌మెంట్లద్వారా ప్రాథమిక ఆస్తిహక్కు కల్పించారు. భూమి పన్ను వసూలు చేయడానికి వారు కొత్త పద్ధతులు ఏర్పరిచారు. వ్యవసాయ దారులు నిర్ణీత నగదు పన్ను చెల్లించాలని నిర్ణయించారు. బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం విజయవంతమైన దరిమిలా, వారికి డిమాండ్ వున్న పత్తిలాంటి వాణిజ్య పంటలు పండించాలని బ్రిటన్‌లు ప్రోత్సహించారు. ఫలితంగా భారతదేశంలో కూడా రైతులు వాణిజ్య పంటలవేపు మళ్ళడంతో భారతీయ వ్యవసాయం వాణిజ్య పరమైంది.

ఈ వ్యవసాయ రంగ మార్పులు భారతీయ రైతాంగంపై దుష్పరిణామాలు కలిగించాయి. రైతుల రుణభారం పెరిగిపోయింది. వారి ఆర్థిక పరిస్థితి దిగజారింది. భూమిలేని జనాభా నిష్పత్తి పెరిగింది. స్థానిక వడ్డీ వ్యాపారులు, (సహజంగానే వారు గ్రామంలోని భూస్వాములైవుంటారు) వద్ద తెచ్చిన అప్పుల భారాన్ని వదిలించుకోవడానికి చిన్న, సన్నకారు రైతులు తమ భూములు చాలావరకు తాకట్టు పెట్టుకోవలసి వచ్చింది. ఈ దుర్భర పరిస్థితులు సహజంగానే రైతాంగంలో అలజడి పుట్టించాయి. ఫలితంగా ఇరవైయవ దశకంలో రైతుల ఆందోళనలు, తిరుగుబాట్లు విపరీతమయ్యాయి. ఈ రైతాంగ ఉద్యమాలే ఆ తర్వాత స్వాతంత్ర్య పోరాటంలో మమేకమయ్యాయి.

భారతీయ వ్యవసాయరంగంపై వలస పాలన ప్రభావం పడకముందు వ్యవసాయ కార్మికులుగా అభివర్ణించినవారి శాతం ఎంత? వ్యవసాయ కార్మికుల సంఖ్యలో పెరుగుదలఎంత? ఆర్థిక చరిత్రకారులు ఈ సంఖ్య విషయమై స్పష్టమైన సమాధానం ఎక్కడా చెప్పలేదు. భారతదేశంలో బ్రిటన్ వలస పాలనకు ముందే వ్యవసాయ కార్మికులు వున్నప్పటికీ చరిత్ర కారులు మాత్రం వీరిని వ్యవసాయ కార్మికులుగా అభివర్ణించడానికి ఇష్టపడలేదు. ఒక క్రమపద్ధతిలో గణాంక వివరాలు సేకరించకపోవడం, వలస, వలస పాలనలకు ముందు వ్యవసాయ కార్మికుల నిష్పత్తులమీద చరిత్రకారులు సరైన అంచనాలు వెయ్యలేకపోయారు. వ్యవసాయ కార్మికుల నిర్వచన సమస్యల కారణంగా ఇది జరిగింది. కొన్ని అంచనాల ప్రకారంగా మొత్తం వ్యవసాయ జనాభాలో వ్యవసాయ కూలీల నిష్పత్తి 19వ శతాబ్దపు చివరి దశకంలో పదినుంచి 15 శాతం వరకు వుండేది. 1891 నుంచి వ్యవసాయ కార్మికుల నిష్పత్తి దశాబ్దం నుంచి దశాబ్దానికి తేడాలలో బాగా పెరిగిందని అంచనా. 1950-51 వ్యవసాయ కార్మికుల విచారణ ప్రకారంగా మొత్తం వ్యవసాయ ఆధారిత జనాభాలో వ్యవసాయ కార్మికుల జనాభా 38.1 శాతం. జనాభా లెక్కల ప్రకారంగా భారతదేశంలో వ్యవసాయ కార్మికులు, వ్యవసాయేతర రంగాల, పట్టణ కార్మికులను కలుపుకొని మొత్తం జనాభాలో 19.5 శాతం వుండేదని ఒక అంచనా. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం మొత్తం కార్మికుల జనాభా నిష్పత్తి పెరిగి 1981లో 25.2 శాతం వున్నది. ఆయా రాష్ట్రాలలో వ్యవసాయ కూలీల సంఖ్య పెరగడం, మొత్తం కార్మిక జనాభాలో వారి శాతం కూడా భిన్నంగా వుండేది. ఆంధ్రప్రదేశ్‌లో 1951లో వ్యవసాయ కార్మికుల శాతం 33.4 శాతం. పంజాబ్‌లో ఇదే శాతం కేవలం 11.4 శాతం. ఆంధ్రప్రదేశ్‌లో 1981 వరకు వ్యవసాయ కార్మికుల శాతం 36.7కు మాత్రమే పెరుగగా పంజాబ్‌లో మాత్రం ఎక్కువ పెరిగి 22.8 శాతం దాకా వెళ్లింది.

8.3 స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ సాంఘిక నిర్మితిమార్పు

బ్రిటిష్ వలస పాలకులు భారతీయ సంపన్న వర్గాలకు అధికారం అప్పగించిన తర్వాత భారతదేశం లోనయిన మార్పు స్వభావాన్ని రాజకీయ ఆర్థిక వేత్తలు పెద్దగా అంగీకరించక పోయినప్పటికీ, స్వాతంత్ర్యం తర్వాత భారతీయ వ్యవసాయ ఆర్థిక రంగం మాత్రం ముఖ్యమైన మార్పులకు లోనయిన విషయాన్ని, ఫలితంగా అట్టడుగు సామాజిక సమూహాలు కూడా మార్పుకు లోనయిన విషయాన్ని కాదనలేం. కడచిన అయిదు దశాబ్దాలను ప్రామాణికంగా తీసుకుంటే దేశంలోని కొన్ని ప్రాంతాలు ముఖ్యంగా వ్యవసాయ ఉత్పాదకత విషయంగా వ్యవసాయ అభివృద్ధి సాధించిన విషయాన్ని గమనించవచ్చు. ఈ మార్పులు స్వాతంత్ర్యానంతర భారత పాలకులు ప్రవేశపెట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల పాత్ర లేకుండా సాధ్యంకావు.

వలస పాలన సమయంలో స్తబ్ధతకు లోనయిన భారతీయ వ్యవసాయ రంగంలో కదలిక తేవడానికి పాలకులు భూ సంస్కరణలతో ప్రారంభించి రకరకాల కార్యక్రమాలు చేపట్టారు. భూ సంస్కరణలు రాజకీయ చిత్తశుద్ధి కొరవడిన

BRAOU

ఫలితంగా సమర్థంగా అమలు కాకపోయినప్పటికీ దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా భూస్వామ్య విధానం బలంగా లేనిచోట, రైతాంగ ఉద్యమాలు బలంగా వున్నచోట మాత్రం భూ సంస్కరణచట్టాలు కొంతమేరకు మార్పు తీసుకువచ్చాయన్నది సుస్పష్టం. అయితే భూ సంస్కరణల చట్టాలు భూమిలేని నిరుపేదలకు మాత్రం చాలా తక్కువగా ఉపయోగపడ్డాయి. భారత ప్రభుత్వాలు చేపట్టిన సాముదాయిక అభివృద్ధి పథకం, హరితవిప్లవం లాంటివి భూమికలిగివున్న వ్యవసాయ దారులను ఉద్దేశించినవే కానీ, భూమిలేని నిరుపేదలకు ఇవి ఏ విధంగానూ ఉపయోగపడలేదు.

భూ సంబంధాలను మార్చడంలో రాజకీయ దృఢచిత్తం లోపించిన కారణంగా ప్రభుత్వ పథకాలు ఇదివరకే ఒక స్థాయిలో వున్నవారికి మాత్రమే ప్రయోజనం చేకూర్చాయి. భూస్వాములు మాత్రమే ప్రభుత్వ రాయితీలు, రుణ సదుపాయాలను విరివిగా ఉపయోగించుకుని ట్రాక్టర్లు లాంటి యంత్రాలు కొనుగోలు చేసి వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోగలిగారు కానీ, దీనివల్ల అట్టడుగు రైతాంగానికి ఏమీ ఒరగలేదు. గ్రామీణ ప్రాంతాలు ధనిక ప్రాంతాలైనాయి. కానీ, ఆ మేరకు దారిద్ర్యం తగ్గలేదు. ఈ చేదు నిజాన్ని గమనించిన ప్రభుత్వం 1970 తొలిపాదంలో దారిద్ర్య నిర్మూలనా పథకాలకు గ్రామీణ సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కొత్త పథకాలు తయారు చేసింది. ఈ పథకాలన్నీ లక్ష్య సాధన, లబ్ధి దిశగా రూపొందించారు. సమీకృత గ్రామీణ అభివృద్ధి పథకం (ఐఆర్‌డిపి) లాంటి ఈ పథకాలు గ్రామీణ భారతంలో దారిద్ర్య నిర్మూలన ప్రధాన ధ్యేయంగా రూపుదిద్దుకున్నాయి.

అయితే ఐఆర్‌డిపిలో ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు వెచ్చించినప్పటికీ నిజంగా అవసరమైన లబ్ధిదారులకు ఈ నిధులు చేరకపోవడం ఒక లోపం. వివిధ కారణాలవల్ల ఈ పథకం అనుకున్నంత విజయవంతం కాలేదు. ఈ పథకం అమలు లోపాల అధ్యయనంలో పలు విషయాలు వెల్లడయ్యాయి. అమలు చేసే ఉద్యోగుల తీరు, లబ్ధిదారుల ఎంపిక పట్ల వారి వైఖరి, గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకానికి తూట్లు పొడిచిన అధికార నిర్మితి, అవినీతి ఇట్లా పలుకారణాలవల్ల పథకం నిజమైన లబ్ధిదారులకు చేరలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాల ఆర్థిక, సామాజిక జీవనంలో, గ్రామీణ అధికార చట్రంలో ఈ పథకం ద్వారా ఏ మార్పులూ జరగనప్పటికీ, పెద్ద సంఖ్యలో భూమిలేని నిరుపేదలకు మాత్రం ఐఆర్‌డిపి స్వాంతన చేకూర్చింది.

8.4 వ్యవసాయ పరివర్తన–వ్యవసాయ కార్మికులు

భారతదేశంలో ప్రభుత్వ నిర్దేశిత పథకాల వల్ల గ్రామీణ అధికార చట్రానికి సంబంధించి ఏ మౌలిక పరివర్తనా జరగలేదు కానీ, వ్యవసాయ కార్మికులు, వారి యజమానుల సాంఘిక, ఆర్థిక సంబంధాలలో మాత్రం చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. చాలా మట్టుకు ఈ మార్పులన్నీ కడచిన నాలుగైదు దశాబ్దాలలో జరిగిన పూర్తిస్థాయి వ్యవసాయ రంగ పరివర్తన గ్రామీణ ప్రాంతాలలో సాధారణ అభివృద్ధి క్రమం ఫలితంగా సంభవించినవే. ఈ మార్పులు ఆయా ప్రాంతాలను బట్టి వేర్వేరుగా వున్నప్పటికీ, మొత్తంగా స్వాతంత్ర్యానంతర కాలంలో ఈ అభివృద్ధి క్రమం పరిణామాలను చవిచూడని ఒక్క గ్రామం కూడా లేదని చెప్పవచ్చు.

స్థూలంగా పరిశీలించినట్టయితే భారతీయ గ్రామీణ సమాజంలోనూ అట్లాగే వ్యవసాయ కార్మికుల స్థితిగతులలోనూ ప్రధానంగా రెండు భిన్నమైన ప్రవృత్తిగల మార్పులను గమనించవచ్చును. మొదటి రకం మార్పుగా హరితవిప్లవం విజయవంతమైన ప్రాంతాలను చెప్పవచ్చు. ఈ ప్రాంతాలలో భూమినుంచి హెచ్చు ఉత్పాదకత, ఆధునిక పద్ధతుల వినియోగం, వ్యవసాయ ఉత్పత్తుల సాంకేతికీకరణలు లక్షణాలుగా గమనించవచ్చు. ఈ ప్రాంతాలలో పంటల సరళి మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకున్న వాణిజ్య పంటలమీద ప్రధానంగా ఆధారపడి, భూమినుంచి లాభసాటి పంటలు తీయడంగా వుంటుంది. భూమి-ఉత్పత్తులకు సంబంధించిన సామాజిక సంబంధాలు, వ్యవసాయ సంబంధాలు కూడా ఈ ప్రాంతాలలో గణనీయంగా మారాయి. పాత సమాజంలోని పోషణ, ఆధార పడడము అన్ని విధానాలు పూర్తిగా నిర్మూలన కాకున్న మారాయి. ఫలితంగా కార్మికుల యాదృచ్ఛికత, యజమాని, కార్మికుల సంబంధాలలో వ్యక్తిగత సంబంధాల ప్రాధాన్యత తగ్గడం లాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. దక్షిణ గుజరాత్‌లోని హరిత విప్లవ

BRAOU

ప్రాంతాలలో వ్యవసాయ పరివర్తనా క్రమాన్ని అధ్యయనం చేసిన జాన్ బ్రేమెన్ ఈ స్థితిని ఇట్లా వర్ణించారు. హరిత విప్లవ ప్రాంతాలలో మార్పుల కారణంగా వ్యవసాయ కార్మికులు భూస్వాములతో వున్న అనుబంధాల నుంచి స్వేచ్ఛ పొందారని, అదే సమయంలో పాత సంరక్షణను కోల్పోయారని అన్నారు. 1974లో బ్రేమెన్ అధ్యయనంలో వ్యవసాయ కార్మికులు పోషణ, ఆధారపడడం నుంచి విముక్తి పొంది కాంట్రాక్టు పద్ధతి కార్మికులుగా మారారని, ఫలితంగా వారు మారిన పరిస్థితుల్లో తక్కువ భద్రతలో పనిచేయవలసి వచ్చిందని అన్నారు. హర్యానా హరిత విప్లవ ప్రాంతాలను అధ్యయనం చేసిన షీలా భల్లా కూడా ఇవే అభిప్రాయాలు వెల్లడించారు. యేడాదిపాటు పనిచేసే వ్యవసాయ కూలీలు స్వభావంలో కాంట్రాక్టు పద్ధతులకు మారారని, ఫలితంగా యజమాని, వ్యవసాయ కార్మికులు తాత్కాలిక కాంట్రాక్టు పద్ధతుల కారణంగా భూస్వాముల అధికారం మరింత బలపడిందని భల్లా పరిశీలనలో తేలింది.

అందువల్ల అభివృద్ధి చెందిన వ్యవసాయ ప్రాంతాలలో ఉత్పత్తి సామాజిక సంబంధాలు విచ్ఛిత్తి జరిగినందువల్ల వ్యవసాయ కూలీలు నిజ పరిస్థితుల్లో విముక్తి పొందలేక పోయారు. అయితే విశ్వాసం, విధి, బాధ్యతలు, కట్టుబడి వుండడానికి సంబంధించి మాత్రం పూర్వం సంబంధాలు మారాయి. ఆర్థిక ప్రమాణాల ప్రకారంగా గ్రామీణ భూమిలేని జనాభా కడుపేదలుగానే మిగిలి పోయారు. వారి బలహీన ఆర్థిక స్థితిగతులవల్ల వారు కొత్త రకమైన పద్ధతుల్లో ఆధారపడడం పెరిగింది. వారి దయనీయ స్థితివల్ల వీరు భూస్వాములవద్ద నగదు రూపేణా కానీ, వస్తు రూపేణా కానీ అప్పులు తీసుకోవడం అనివార్యమయింది. ఈ రుణభారం వల్ల యజమానులు వారికి అవసరమైనప్పుడు వీరినుంచి పనితీసుకోవడం, వారికి ఇష్టంలేకున్న సుళువైంది. ఆర్థిక బలహీనతలు, రుణ భారాలు ఈ వ్యవసాయ కార్మికులను మరింత ఆధారిత, వెట్టి కార్మికులుగా మార్చింది.

భూమిలేని వ్యవసాయ కార్మికులు ఇప్పటికీ అట్టడుగు సామాజిక సమూహమే. హరిత విప్లవం ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలో సామాజిక అసమానతలు గణనీయంగా పెరిగాయి. అయితే పాత భూస్వామ్య ఆధిపత్యం విచ్ఛిన్నమైన కారణంగా, వ్యవసాయ కార్మికులలో పెరిగిన చైతన్యం, మౌలిక హక్కుల జాగరూకత గ్రామీణ ప్రాంతాలలో సామాజిక ఉద్రిక్తతలను సృష్టించింది. ఈ ఉద్రిక్తతలలో ఎక్కువభాగం వ్యవసాయ కార్మికులకు, వారితో తమ భూముల్లో పనిచేయించుకునే భూస్వాములకు మధ్య తలెత్తినవే. ఈ ఉద్రిక్తతల స్వభావం కూడా ప్రాంతానికీ ప్రాంతానికీ మధ్య, కొన్ని సందర్భాల్లో గ్రామానికీ, గ్రామానికీ మధ్య కూడా వేర్వేరుగా వుండేవి. కొన్ని సందర్భాలలో ఇవి వ్యవసాయ కార్మికులను ట్రేడ్ యూనియన్ మాదిరిగా సంఘటిత పరుచడంగా, మరికొన్ని సందర్భాలలో కుల పోరాటంగా పరిణామం చెందేవి. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామంలో భూమిగల కుల సమూహాల ఆధిపత్యమే చెలామణి అయి, భూమిలేని వ్యవసాయ కార్మికులు సహజంగానే బాధిత వర్గంలో మిగిలేవారు.

హరిత విప్లవ ప్రాంతాలలో జరిగిన వ్యవసాయ మార్పులకు లింగ దృక్కోణం కూడా వుంది. ఈ ప్రాంతాలలో ప్రవేశ పెట్టిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంవల్ల స్త్రీ, పురుష సంబంధాల్లో మార్పులు వచ్చాయి. సాంకేతిక కారణాలవల్ల కొన్ని పనులు ప్రత్యేకంగా పురుషులు, మరికొన్ని పనులు ప్రత్యేకంగా స్త్రీలు మాత్రమే చేయవలసి వచ్చింది. ఇది పనుల్లో విభజననే కాక శ్రమకు చెల్లించే వేతనంలో కూడా మార్పులు తెచ్చింది. ఉదాహరణకు ఎక్కువ వేతనం పొందే ట్రాక్టర్ డ్రైవర్, పురుషులపని, తక్కువ వేతనం పొందే కలుపుతీతపని మహిళల పనిగా భావించారు. భారతదేశంలో స్త్రీలు, పురుషులు ఒకేవిధమైన పనిచేసినప్పటికీ పురుషులకు ఎక్కువ, స్త్రీలకు తక్కువ వేతనం ఇవ్వడం ఆనవాయితీ. భారతదేశంలో వ్యవసాయ రంగంలో పనిచేసే స్త్రీల శాతం మొత్తంగా చూసినప్పుడు ఎక్కువే అయినప్పటికీ హరిత విప్లవం ఫలితంగా ఊర్ధ్వ చలనం గల మధ్య రకం రైతు కుటుంబాల్లో మహిళలు పొలాల్లో పని చేయడం నామోషీగా తయారై వారి శ్రమ భాగస్వామ్యం తగ్గింది. ఇట్లాంటి వారంతా కేవలం గృహిణులుగా మారారు.

8.5 అధోగతి ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు

భారతీయ వ్యవసాయ రంగంలో నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవడంలో అతితక్కువ

BRAOU

చలనం వున్న ప్రాంతాలల్లో భూ సంబంధాలు, వ్యవసాయ కార్మికుల స్థితిగతుల్లో వచ్చిన మార్పు రెండవరకం మార్పు. ఈ ప్రాంతాల్లోనే వ్యవసాయ రంగంలో ప్రాథమిక సదుపాయాల పరికల్పన అంటే నీటి పారుదల, కాలువల తవ్వకం లాంటి వాటి మీద భారత ప్రభుత్వం అతితక్కువ వ్యయం చేసింది. ఈ ప్రాంతాలలోనే దీర్ఘకాలిక వెనకబాటుతనం, స్తబ్ధతలవల్ల ఉత్పత్తి సంబంధాలు అర్ధభూస్వామ్య సంబంధాలుగా వున్నాయి.

అయితే, ఇటీవలికాలంలో ఆర్థిక స్తబ్ధత వున్నప్పటికీ, ఈ హరిత విప్లవేతర ప్రాంతాలు కూడా గ్రామీణ సామాజిక నిర్మితిలో గణనీయమైన మార్పులు సంభవించాయి. గ్రామ స్థాయిలో ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థను ప్రవేశ పెట్టడం, స్వాతంత్ర్యానంతరం నిరాదరణకు గురైన సమూహాలు వివిధ సామాజిక ఉద్యమాలు జరపడం కారణంగా ఇక్కడి రైతాంగానికి రాజకీయ హక్కుల పట్ల ఎక్కువ చైతన్యం కలిగింది. అందువల్ల హరిత విప్లవ ప్రాంతాల్లో జరిగినట్టు అభివృద్ధి జరగనప్పటికీ, సాంకేతిక ప్రగతి లేనప్పటికీ ఈ ప్రాంతాలు స్వాతంత్ర్యానంతరం సంభవించిన ఆర్థిక, సామాజిక మార్పులను తప్పించుకోలేదు. తమ ప్రయోజనాల గురించి చైతన్యం పొందిన వ్యవసాయ కార్మికులు ఈ ప్రాంతాల్లో వ్యవసాయేతర రంగాల్లో, గ్రామం బయట లభించే ఉపాధికి సంబంధించి, నగర పరిశ్రమల్లో ఉపాధి అవకాశాల గురించి పరిజ్ఞానాన్ని సంపాదించగలిగారు. అభివృద్ధి చెందని ఈ ప్రాంతాలనుంచి ఎక్కువ వేతనాలకోసం అభివృద్ధి చెందిన ప్రాంతాలకు కాలానుగుణంగా వలస వెళ్ళడం కూడా ఎక్కువైంది. మనుగడ కోసం సాగే ఈ వలసలు ఒకే రాష్ట్రంలో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు ఆంధ్రప్రదేశ్‌లో లాగా కానీ ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి అంటే ఉత్తర ప్రదేశ్, బీహార్‌లనుంచి హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకు వలస వెళ్లినట్టుగానే వుండవచ్చును.

అయితే ప్రత్యేకంగా ఈ వలసలమీద జరిపిన అధ్యయాలను అనుసరించి ఇలాంటి వలసలవల్ల వ్యవసాయ కార్మికులు కొంత ఎక్కువ వేతనం పొందడం ద్వారా అప్పటికి మనుగడ సాధించగలరుకానీ, మొత్తంగా వారి ఆర్థిక స్థితిగతుల్లో మాత్రం ఎలాంటి మార్పూ లేదని తేలింది. ఈ వలసల్లో కఠినతరమైన విషయాలు ఇమిడి ఉన్నాయి. వలసలు వెళ్లిన వ్యవసాయ కార్మికులు అణచివేత పని పరిస్థితుల్లో పనిచేయవలసి వస్తుంది. అందువల్ల యజమానుల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి వుంటారు. తమ కులానికి, గ్రామానికి దూరంగా వున్నందువల్ల తమకు అలవికాని పరిస్థితుల్లో కూడా వలస వెళ్లిన కార్మికులు అన్యాయమైన పరిస్థితులను ఎదుర్కోలేని స్థితిలో వుంటారు. ఈ వలసల్లో ఎక్కువ స్వభావంలో కాలాన్ని అనుసరించి వచ్చే వలసలు. పనులు ఎక్కువ వుండే సీజన్‌లో కార్మికులు వలస వెళ్ళి, పనులు తక్కువ వున్న సమయాల్లో తమ చిన్నపాటి స్వంత భూములను చూసుకోవడానికి గ్రామాలకు తిరిగివస్తారు.

ఈ కాలానుగుణ వలసల్లో ఎక్కువగా కుటుంబంలో పెద్దగా వుండే పురుషుడు, ఇంట్లో స్త్రీలను, పిల్లలను వదిలి ఒక్కరే ఉపాధి వెతుక్కుంటూ వెళతారు. దీనివల్ల మహిళలు ఇంటివద్ద పిల్లల సంరక్షణ; తమకు వుంటే గింటే కొద్దిపాటి భూమిని చూసుకోవడం, ఇల్లును కాపాడుకోవడం లాంటి కష్టాలు అనేకం భరించవలసి వస్తుంది. కొన్ని గిరిజన ప్రాంతాల్లో మరీ ముఖ్యంగా గుజరాత్, మహారాష్ట్రలలో పెళ్ళయిన మహిళలు వారి భర్తలతో పాటు వలస వెళ్ళడం ఆనవాయితీగా వుంది. ఇట్లాంటి వారు వ్యవసాయ క్షేత్రాల్లో పిల్లలతో సహా ఒక 'యూనిట్'గా పనిచేస్తారు. ఇట్లాంటి వలసదారుల పరిస్థితి, (గుజరాత్‌లో చెరకు కోత కార్మికులు) కుక్కల కన్నా హీనంగా వుంటుందని జాన్ బ్రెమన్ అభిప్రాయం.

ఇలాంటి వెనుకబడిన వ్యవసాయ ప్రాంతాల్లో కొన్ని సందర్భాల్లో హింసాత్మక సంఘర్షణలు కూడా జరుగుతున్నాయి. ఇట్లాంటి హింసాత్మక సంఘటనలకు నిలువుటద్దాల్లాంటి ఉదాహరణలను ఆంధ్రప్రదేశ్ తెలంగాణాలో, బీహార్‌లో చూడవచ్చు. ఈ సంఘర్షణలు చాలావరకు పెరుగుతున్న రాజకీయ చైతన్యం, వ్యవసాయ కార్మికులలో పెరుగుతున్న సంఘటిత ఐక్యతలు కారణమని చెప్పవచ్చు.

8.6 వేతనాల రీతులు

వ్యవసాయ రంగంలో ప్రాంతాలవారీగా వేతనాలు పూర్తి భిన్నంగా వుండడం అందరికీ తెలిసిందే. 1990-91లలో

BRAOU

ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సమర్పించిన నివేదికల ఆధారంగా ఒరిస్సాలో 14.50, కర్ణాటకలో 15.50, కేరళలో 34, పంజాబ్‌లో అతి ఎక్కువ 37 రూపాయల వరకు వేతనాలు అమలులో వున్నాయి. ఈ వేతనాలు కేవలం గ్రామీణ ఆర్థిక స్థితిగతులవల్ల మాత్రమే భిన్నంగా లేవు. వ్యవసాయ కార్మికులలో పెరుగుతున్న చైతన్యం, వివిధ రకాల రాజకీయ ఉద్యమాలు కూడా వేతనాలు ఒక ప్రాంతానికి, మరో ప్రాంతానికీ తేడా వుండడానికి గల ప్రధాన కారణం. దేశంలో చాలా ప్రాంతాల్లో జరిగిన దళిత ఉద్యమాలు గ్రామీణ భారతంలో ఆధిపత్యం, అణగిమణగి వుండడం అనే సామాజిక నిర్మాణాన్ని ఛిన్నాభిన్నం చేసిన విషయాన్ని కాదనలేం. కొన్ని సందర్భాల్లో ఈ నూతన చైతన్యం కూడా కొత్తరకమైన ఉద్రిక్తతలకు దారితీసిన సంఘటనలు వున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడున్న పరిస్థితుల్లో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో అణచివేతకు వ్యతిరేకంగా ప్రతిఘటన తీవ్రరూపంలో వుందని చెప్పవచ్చు.

8.7 ముగింపు

భారతదేశంలోని వ్యవసాయ రంగం పూర్తిగా అసంఘటితమైనందున పారిశ్రామిక కార్మికులవలె వ్యవసాయ కార్మికులకు హక్కులు లేవు. ఈ హక్కులు లేని పరిస్థితి వారిని దుర్భరమైన జీవనంలోకి నెట్టివేస్తుంది. వ్యవసాయ కార్మికులు తరాల నుంచి వివిధ రూపాలలో దోపిడికి గురవుతూనేవున్నారు. ఆధునికీకరణ చెందిన వ్యవసాయంలో కూడా నేడు ఇటువంటి ధోరణులు కొనసాగుతున్నాయి. భూ సంస్కరణల చట్టాలు కొంతమేరకు వ్యవసాయ సంబంధాలలో మార్పులు తెచ్చినా అవి అట్టడుగు వర్గాలవారికి పెద్దగా ప్రయోజనం కలిగించలేదు. వ్యవసాయరంగం ప్రోత్సాహానికి అమలు పర్చిన వివిధ పథకాలు వ్యవసాయ కార్మికులకు లాభం కలిగించలేక పోయాయి. హరిత విప్లవం కారణంగా వ్యవసాయ కార్మికుల్లో వచ్చిన చైతన్యం వారిని గుణాత్మకమైన మార్పుల దిశవైపు మళ్ళించింది. ఇది వ్యవసాయ కార్మికుల వేతనాలపై, పని పరిస్థితులపై, జీవన విధానంపై చెప్పుకోదగిన ప్రభావాన్ని చూపించగలిగింది.

8.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానం రాయండి!*

1. గ్రామీణ నిరుపేదల హక్కులపై వ్యవసాయ అభివృద్ధి ప్రభావాన్ని చర్చించండి?
2. వ్యవసాయ సంబంధాల్లో మార్పు స్వభావాన్ని పరిశీలించి, మానవ హక్కులపై వాటి ప్రభావాన్ని వివరించండి?

*ఈ క్రింది ప్రశ్నలకు **20** పంక్తులలో సమాధానం రాయండి!*

1. వ్యవసాయ కార్మికులలో దృక్పథాలను వివరించి వ్యవసాయ పరివర్తనలో బోడించండి?
2. గ్రామీణ నిరుపేదల హక్కుల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను వివరించండి?

BRAOU

BRAOU

భాగం 9: పారిశ్రామిక కార్మికులు–మానవ హక్కులు

విషయక్రమం

9.0 ఉద్దేశం

9.1 పరిచయం

9.2 నూతన పారిశ్రామిక విధానం (ఎన్.ఐ.పి)

9.2.1 భారతదేశంలో పారిశ్రామిక విధానాల చరిత్ర

9.2.2 నూతన పారిశ్రామిక విధానం-కార్మిక సంబంధాలు

9.3 సామాజిక భద్రతా వలయం : ఒప్పందభాగము

9.4 ఆధునికీకరణ - నూతన సాంకేతిక పరిజ్ఞానం

9.5 ఉపాధి-పారిశ్రామిక సంబంధాలు:బహుళ జాతి సంస్థల ప్రభావం

9.6 ధరలు-వేతన రక్షణ

9.7 కార్మిక సంఘాల హక్కులు

9.7.1 సరళీకృత విధానాలు - కార్మికుల హక్కులు: సమిష్టి బేరసారాలు

9.7.2 కార్మికులు-సమాచార హక్కులు

9.7.3 కార్మికులు-పరిశ్రమల స్వాధీనం

9.8 ముగింపు

9.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

9.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు:

★ నూతన పారిశ్రామిక విధానం కార్మికుల హక్కులపై కలుగజేసిన ప్రభావాన్ని పరిశీలిస్తారు.

★ బహుళజాతి సంస్థల ప్రవేశంతో భారతదేశ ఆర్థిక వ్యవస్థపై గల ప్రభావాన్ని చర్చిస్తారు.

★ కార్మికలోకం ఎటువంటి ప్రభావాలకు గురవుతుందో గమనిస్తారు.

9.1 పరిచయం

అమలులో వున్న వ్యవస్థ ఆమోదంతో వ్యక్తులు సాధించుకునే హక్కులు సామాజికంగా, రాజకీయంగా నిలిచి వుండాలి. ప్రస్తుత ప్రపంచీకరణ వ్యవస్థలో మానవ హక్కుల భావన పూర్తిగా సంక్లిష్టంగా వున్న విషయం మనకు తెలుసు. వివిధ దేశాలు వారివారి సామాజిక వ్యవస్థలు, రాజకీయ ప్రయోజనాలు, ఆర్థికాభివృద్ధి తీరుతెన్నుల మూలంగా మానవ హక్కుల అంశం సంక్లిష్టంగా తయారైంది. ఇలాంటి చర్చలన్నింటినీ ప్రక్కనబెట్టి ఇప్పుడు పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థిక,

సామాజిక, సాంస్కృతిక రంగాల్లో అమలవుతున్న హక్కులను పీడనకు గురౌతున్న కార్మికుల అనుభవాల నేపథ్యంలో చర్చించడం అవసరం. ఈ పాఠంలో మనం భారతదేశంలో పారిశ్రామిక సరళీకృత విధానాల నేపథ్యంలో పారిశ్రామిక కార్మికుల హక్కుల గురించి చర్చిస్తాం.

ఇటీవలి కాలంలో పారిశ్రామిక కార్మికుల హక్కులు విశ్వవ్యాప్తంగా మారుతున్న విషయం మనకు తెలుసు. ఇదే విధంగా భారతదేశంలో కూడా కొద్ది సంవత్సరాలుగా కార్మికుల హక్కులు వివిధ స్థాయిల్లో మారుతున్నాయి. అయితే, 1991లో ఆర్థిక సరళీ కృత విధానాల్లో భాగంగా నూతన పారిశ్రామిక విధానాన్ని (ఎన్.ఐ.పి.) ప్రవేశపెట్టారు. ఈ విధానం కార్మిక బలగాల రిక్రూట్‌మెంట్ తగ్గింపు కోసం వత్తిడిలో, ప్రభుత్వ సంస్థలు (పివిఎస్‌యు) ప్రైవేటీకరణలో, స్వచ్ఛంద పదవీ విరమణ పథకాలలో (విఆర్ఎస్/గోల్డెన్ హ్యాండ్‌షేక్‌లు) ఉత్ప్రేరకంగా పనిచేసింది. సరళీకృత విధానాలు మనకు కొత్త కానప్పటికీ, నూతన పారిశ్రామిక విధానం కార్మికలోకాన్ని పునరేకీకరణ చేసింది. ఈ విషయాలను పరిశీలిద్దాం.

9.2 నూతన పారిశ్రామిక విధానం (ఎన్.ఐ.పి.)

సంవత్సరాలుగా భారతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిరేటు నత్తనడకలో వుంది. అందువల్ల ఈ అభివృద్ధిరేటు దారిద్ర్యం, నిరక్షరాస్యత, నిరుద్యోగాల వంటి సమస్యలపై ఎలాంటి పరిష్కారానికి నోచుకోలేదు. ఈ రంగాల్లో ఏ మార్పులూ జరగలేదు. ఈ వైఫల్యాన్ని దిగుమతుల ప్రత్యామ్నాయ వ్యూహంపై, దీన్ని అమలు పరచడానికి ఏర్పరచిన నియంత్రణావ్యవస్థపైనా నెట్టారు. 2. 1980లలో ఏర్పడిన సంక్షోభం విధానపరమైన మార్పులు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్నాయనడానికి సూచన. ఫలితంగా 1991లో రూపొందించిన నిర్మాణాత్మక కార్యక్రమాల్లో భాగంగా ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడం, పరిశ్రమలు (వాణిజ్యం, ఆర్థికతలను, అనియత) వ్యవస్థగా తీర్చిదిద్దడం తద్వారా దేశంలో పోటీని పెంచడం లాంటి నిర్ణయాలు చేపట్టారు. 1991 జూలైలో విడుదలయిన పారిశ్రామిక విధాన పత్రంలో ఈ విషయాలను చర్చించారు. 1991 నూతన పారిశ్రామిక విధానాన్ని చర్చించే ముందు కడచిన సంవత్సరాల్లో పారిశ్రామిక విధానాల తీర్మానాల చరిత్రను సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

BRAOU

9.2.1 భారతదేశంలో పారిశ్రామిక విధానాల చరిత్ర

స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి 1980వ దశకం మధ్యకాలందాకా మన పారిశ్రామిక విధానాలన్నీ అభివృద్ధి, త్వరితగతి అభివృద్ధి రేటు సాధన అన్న లక్ష్యాలతో రూపొందించారు. కానీ, అభివృద్ధి కన్నా నియంత్రణకే అధిక ప్రాధాన్యత కల్పించారు.

1948లో రూపొందించిన పారిశ్రామిక విధానాల తీర్మానంలో పారిశ్రామికాభివృద్ధి, అభివృద్ధి దిశగా పయనించాలని నిర్ణయించారు. ఈ విధానంలో ఉత్పత్తిలో క్రమం తప్పని పెరుగుదల, దాని సమాన పంపిణీ ఆర్థిక వ్యవస్థకు అత్యవసరంగా పేర్కొన్నారు. 1956 పారిశ్రామిక విధాన పత్రాల్లో ఆర్థిక అభివృద్ధి రేటును పెంచి, సోషలిస్టు నమూనా వ్యవస్థ ఏర్పాటుకు పారిశ్రామికీకరణను వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఇందుకు గాను పెట్టుబడి కొరతవుందని, వాణిజ్య వునాది తగినంత బలంగా లేకపోవడం ఈ లక్ష్య సాధనకు అవరోధంగా వుందని గుర్తించారు. అయితే 1956 పత్రంలోనే పారిశ్రామికాభివృద్ధిలో ప్రభుత్వం ప్రత్యక్ష బాధ్యత వహించాలన్న విషయాన్ని గుర్తించారు. 1973, 1977 పారిశ్రామిక విధానాల్లో అధిక ప్రాధాన్యత గల పరిశ్రమలను గుర్తించి ఈ పరిశ్రమల్లో దేశంలోని బడా పారిశ్రామిక వేత్తలు, విదేశీ కంపెనీలు పెట్టుబడి పెట్టవచ్చునని తీర్మానించారు. ఈ రెండు విధానాల్లోకూడా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి చిన్న పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించి వికేంద్రీకరణకు అధిక ప్రాధాన్యత కల్పించారు.

దేశీయ పరిశ్రమలను, విదేశీ పోటీనుంచి రక్షించి, స్వావలంబన సాధించడానికి దిగుమతుల ప్రత్యామ్నాయ వ్యూహాన్ని ఖచ్చితమైన ప్రభుత్వ విధానంగా ప్రకటించారు. కానీ, దిగుమతుల ప్రత్యామ్నాయాన్ని, ఎగుమతుల ప్రోత్సాహాన్ని ఒకే నాణేనికి రెండు వేపులుగా గుర్తించలేకపోయారు. ఇందుకు బదులుగా టారిఫ్, నాన్ టారిఫ్ అడ్డంకులు

కల్పించినందువల్ల ముడిపదార్థాలు, తయారీ వస్తువుల ధరల్లో అవకతవకలు జరిగి ప్రత్యామ్నాయ మార్కెట్‌లు ఏర్పడ్డాయి. ఇది ఒక రకంగా, ప్రైవేటు రంగం ఉత్పత్తి చేసిన వస్తువుల గిరాకీ పెంచడానికి ముసుగులో చేసిన రక్షిత పద్ధతులైనాయి. వ్యవస్థీకృత రంగంలో మూడింట రెండు వంతుల ఉద్యోగ కల్పనకు ప్రభుత్వ రంగమే బాధ్యత వహిస్తున్నది. ప్రభుత్వ రంగం అతి పెద్ద ఉపాధి కల్పనాదారుగా తన ఉద్యోగుల కొనుగోలు శక్తిని పెంచి, తద్వారా ప్రైవేటు రంగం ఉత్పత్తి చేసిన వస్తువులకు వినియోగదారులుగా మార్చింది.

1980 నుంచి ప్రారంభమైన పారిశ్రామిక విధాన ప్రకటనలు కాలానుగుణంగా మార్చినప్పటికీ, దేశీయ మార్కెట్‌లో పోటీని పెంచి, ఆధునికీకరణ, సాంకేతిక స్థాయి పెంపుపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాయి. ఉన్నత సాంకేతిక రంగాల్లో విదేశీ పెట్టుబడులను కూడా ఈ విధానాలు ప్రోత్సహించాయి.

రాజీవ్‌గాంధీ నేతృత్వంలో పారిశ్రామిక విధానాల్లో అత్యధిక విధాన పరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులన్నీ ఉత్పాదకత పెంపు, ఉత్పత్తి అయిన వస్తువుల ప్రమాణాలు పెంచి ధరల తగ్గింపునకు ఉద్దేశించినవి. దేశీయ మార్కెట్‌లో పోటీని పెంచి అంతర్జాతీయ పోటీకి ధీటుగా మన పరిశ్రమను నిలపడానికి ఇది ప్రారంభంగా చెప్పవచ్చు.

సాంకేతిక సహకారంతో, విదేశీ పెట్టుబడుల ప్రవాహంతో ఉపాధి సామర్థ్యం పెంపు, వస్తూత్పత్తిలో గణనీయమార్పు సాధ్యమవుతుందని ప్రభుత్వం ప్రకటించింది. 1980-81వ సంవత్సరంలో వేతనాల్లో 23 శాతం పెరుగుదల కనిపించింది. ఇది విస్తృతమౌతున్న మార్కెట్‌పై ప్రభావాన్ని చూపింది. అయితే ఈ పెరుగుదల ఆర్థికవ్యవస్థ సమీకృతరంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు మాత్రమే పరిమితమైంది. అయితే దురదృష్టవశాత్తు ఒక దశాబ్దం పాటు పెరుగుదల రేటు హెచ్చుస్థాయిలో వున్నప్పుడు ఉపాధి పెరుగుదల మాత్రం తగ్గుస్థాయిలో వుంది. 1972-73 సంవత్సరంనుంచి 1977-78 సంవత్సరాల వరకు ఉపాధి పరికల్పన రేటు 2.82 శాతంగా వున్నది. 1977-78వ సంవత్సరం నుంచి 1983-84వ సంవత్సరం వరకు ఈ రేటు 2.22 శాతానికి 1983-84వ సంవత్సరం నుంచి 1987-88 సంవత్సరానికి మరింత దిగజారి 1.55 శాతానికి పడిపోయింది. ఆ దశాబ్దంలో పారిశ్రామిక పెరుగుదలకు ఎంతో దోహదపడిన ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు పూర్తిగా లేకుండా పోయాయి. ఈ విధాన మార్పుల ప్రధాన పరిణామంగా 1980-90వ దశకంలో ఉపాధి అవకాశాల సగటు తగ్గుదల 20.5 శాతంగా నమోదయింది. సంవత్సరాలుగా ఉపాధి అవకాశాల రేటు గణనీయంగా తగ్గడం ఆందోళనకర విషయంగా తయారయింది. ఫలితంగా పంచవర్ష ప్రణాళికల్లో ఇదే ప్రధాన విషయంగా పరిష్కరించవలసిన అంశంగా తయారయింది.

1991 పారిశ్రామిక విధాన ప్రకటన పారిశ్రామిక మార్పులు కొనసాగింపునకే ప్రభుత్వం కట్టుబడి వుంటుందని వెల్లడించింది. ఈ విధాన ప్రకటనలో ఈ క్రింది మార్పులు తీసుకువచ్చారు.

ఎ) అన్ని ప్రాజెక్టులకూ పరిశ్రమల అనుమతి విధానాన్ని పూర్తిగా రద్దుపరిచారు.

బి) విదేశీ పెట్టుబడులకు 51 శాతం వరకు అనుమతి

సి) విదేశీ సాంకేతిక పరిజ్ఞాన ఒప్పందాలకు స్వయం చాలక అనుమతులు మంజూరు.

డి) ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల పునఃపరిశీలన. వీటిలో అత్యధిక ప్రాధాన్యతగల విభాగాలను ప్రభుత్వం వుంచుకొని, నష్టాలలో కూరుకుపోయిన విభాగాలను బి.ఐ.ఎఫ్.ఆర్. (బోర్డ్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రికన్‌స్ట్రక్షన్స్)కు నివేదించడం. 'ఈ ప్రభుత్వ రంగ సంస్థల కార్మికుల పునరావాసానికి, వారి ప్రయోజనాల పరిరక్షణకు సామాజిక భద్రతా యంత్రాంగం ఏర్పాటు

ఇ) గుత్త, నియంత్రిత వాణిజ్య కార్యకలాపాలు (ఎం.ఆర్.టి.పి.) చట్టాన్ని తొలుత సవరించి, ఎం.ఆర్.టి.పి. కంపెనీలు, ఆధిపత్య భాగస్వామ్య కంపెనీల నియంత్రణలను ఎత్తివేయడానికి ఆ తర్వాత ఎం.ఆర్.టి.పి. చట్టాన్ని రద్దు పరచడం. ఫలితంగా కొత్త భాగస్వామ్యాలు నెలకొల్పుకోవడం, భాగస్వామ్యాలను విస్తృతం చేసుకోవడం, విలీనాలు,

BRAOU

టేక్ ఓవర్ల పరిస్థితుల్లో డైరెక్టర్ల నియామకాలకు ముందుగా తప్పనిసరి కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలన్న విషయాన్ని రద్దు పరచడం.

కొంతకాలంగా ఉపాధి పరికల్పనా రేటు తగ్గుతున్న విషయాన్ని మందుగానే చర్చించాము. దీన్ని భారతదేశంలో ప్రభుత్వ పరిరక్షణలో ప్రైవేటు వాణిజ్యం వికసించి మార్కెట్ దృఢపడడానికి సంబంధించిన సమస్యగా చెప్పవచ్చు. ఇప్పుడు ప్రభుత్వం బహుళజాతి సంస్థల పోటీని తట్టుకొని నిలబడడానికి మార్కెట్ శక్తులను ఢీకొనే సామర్థ్యం కలిగిన శక్తిగా భావించవచ్చు. ఆ మేరకు ప్రభుత్వ రంగం పరిమాణాన్ని తగ్గించుకున్నది. ఇది కూడా ప్రైవేటు రంగం తక్కువ రేటులో నిపుణులైన మానవ వనరులను పొందే అవకాశాన్ని కల్పించినట్టయింది. బహుశా ఈ కారణంచేతనే 1991 నూతన పారిశ్రామిక విధానంలో లక్ష్యాలుగా ప్రకటించిన సంక్షేమ రాజ్య విధానాలు, నిరుద్యోగులకు ప్రభుత్వ మద్దతులాంటి విధానాలన్నీ అదుపులేకుండా పోయాయి. స్థానిక, ప్లాంట్ స్థాయిలలో కార్మిక సంఘాలను అనుమతించారు కానీ జాతీయ స్థాయి సమాఖ్యలను అనుమతించలేదు. ప్రస్తుత పారిశ్రామిక విధానాలు కార్మికులకు పూర్తిగా అనుకూలంగా (వారు వలస వెళ్లేందుకు, చలనానికి వీలు కల్పించడంగా)నూ, వారి విసంఘటితానికి దోహదపడేవిగా వున్నాయి. కొత్త పారిశ్రామిక విధానాల్లో కార్మిక లోకాన్ని పూర్తిగా అంతరింపజేసే ప్రయత్నాలు చాలా కనపడతాయి. మొత్తం కార్మిక లోకాన్ని క్రమబద్ధీకరించడానికి బదులుగా క్యాజువల్ లేబర్ విధానాలు (అవసరమైనప్పుడు పనిలోకి తీసుకొని, అవసరం లేనప్పుడు తీసివేసే పద్ధతి) అమలులోకి వచ్చాయి. వేతనాలు గతంలో చెల్లించినట్టుగా మొత్తాలుగా కాకుండా పనిని బట్టి విడివిడిగా చెల్లించే పద్ధతి వచ్చింది.

9.2.2 నూతన పారిశ్రామిక విధానం-కార్మిక సంబంధాలు

నూతన పారిశ్రామిక విధానం పరిశ్రమలు, వాణిజ్యం, ఆర్థిక వ్యవహారాలను వివిధ స్థాయిల్లో సరళీకృతం చేయడానికి ఉద్దేశించిందన్న విషయం మనకు తెలుసు. వ్యవసాయ రంగంలో, వ్యవసాయ కార్మికుల సంబంధాల్లో పెద్దగా మార్పులు తేనప్పటికీ ఇతర రంగాల్లో మార్పులు తప్పనిసరి ఆయా రంగాల మీద ప్రభావం కలుగజేస్తాయి. దీంట్లో మొత్తం కార్మిక శక్తిలో తొమ్మిది శాతంగా వున్న సమీకృత పారిశ్రామిక, సర్వీసు రంగాలలో సరళీకృత విధానాలను ఆర్థిక వ్యవస్థలోని అనియత రంగాలకు, విస్తృతంగా వున్న ఇతరేతర రంగాలకు కూడా విస్తరించడం ప్రధానోద్దేశ్యంగా వుండింది. ముందుగా సమీకృత పరచిన పరిశ్రమలు, సర్వీసు రంగాలలో కూడా క్యాజువల్ లేబరర్స్, కాంట్రాక్ట్ కార్మికులలాంటి అసంఘటిత బలగం కూడా వుంది. అందువల్ల సరళీకృత విధానాల క్రింద కార్మికులకు సంబంధించిన సామాజిక భద్రత, ఉపాధి, స్వచ్ఛంద పదవీ విరమణ (విఆర్ఎస్), లాంటి సమస్యలు ఆందోళన కలిగించే విధంగా తయారయ్యాయి.

1980ల తర్వాత కార్మిక సంబంధాల ధోరణులు మున్నెన్నడూ లేనంత గందరగోళంగా తయారయిన మాట వాస్తవం. ఈ ధోరణులు రంగానికీ రంగానికీ మధ్య (ప్రభుత్వ/ప్రైవేటు), ఆయా రంగాలలో, ఆయా పరిశ్రమలలో, ఒకే సంస్థలో శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులకు మధ్య భిన్నంగా వున్నాయి. పారిశ్రామిక సంబంధాల్లో మూడు విభాగాల పాత్రలలో పెద్ద ఎత్తున మార్పులు వచ్చిన విషయం తెలిసిందే. కార్మిక సమస్యలపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు తప్పుకునే ధోరణి కనబరుస్తున్నది.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ అవశ్యంగా ప్రభుత్వమే కార్మిక వర్గ ప్రయోజనాలు పరిరక్షించవలసిన అవసరం ఏర్పడింది. ఫలితంగా కార్మికులకు ఉపాధి కల్పించే అతి పెద్ద యాజమాన్యం ప్రభత్వమే అయింది. అయితే ఈ మేరకు చట్టపరమైన వ్యవస్థ, నియంత్రణా వ్యవస్థ కోసం చాలా చట్టాలు చేశారు. అవి

1) కార్మిక సంఘాల చట్టం (1926)

2) పారిశ్రామిక ఉపాధి చట్టం (1946)

3) పారిశ్రామిక వివాదాల చట్టం (1947)

BRAOU

నియంత్రణా వ్యవస్థలో కార్మిక యాజమాన్య సంబంధాలను విధానపరమైన విషయాలు, అర్థవంతంగా సమష్టి సంప్రదింపులకు చోటు కల్పించారు. పారిశ్రామిక సంఘర్షణలను నివారించి సమష్టి సంప్రదింపులను అభివృద్ధి పరచడానికే ఇవి ఏర్పరిచారు.

నూతన పారిశ్రామిక విధానం యాజమాన్యం, యూనియన్లు, కార్మికులపై తప్పనిసరి ప్రభావం పడవేసింది. ప్రభుత్వం ఎన్ని మార్పులు ప్రకటించినప్పటికీ విదేశీ సంస్థలు, బహుళ జాతి కంపెనీల పెట్టుబడులు వెల్లువలా రాలేదు. భవిష్యత్తులో మాత్రం పోటీ ఏదైనా పెరిగితే మాత్రం యజమానులు ఉత్పత్తి వ్యయాన్ని మరీ ముఖ్యంగా కార్మికుల వేతనాలని తప్పనిసరియై తగ్గించుకోవలసి వస్తుంది. ఎందువల్లనంటే వారికి మానవ వనరు అవసరం లేని రాబడులు కార్మికులకన్నా తక్కువ రేటుకు దొరుకుతాయి. రానున్న రోజుల్లో కొన్ని కంపెనీలు మూత పడడం లేదా విలీనం కావడం తప్పదు. అయితే ఇవన్నీ అరుదుగా మాత్రమే అమలులో వున్న చట్టాల ప్రకారం జరుగుతాయి. ప్లాక్షకరీల లే ఆఫ్‌లు, ఉద్యోగుల ఉద్వాసనలకు సంబంధించి కూడా ఇదే విధానం వాస్తవ రూపం దాలుస్తుంది. ఉద్యోగాలలో వెసులుబాటు, కార్మికుల నియామకాలకు కొత్త షరతులు అనివార్యమౌతాయి. ఈ పరిస్థితుల్లో కార్మిక సంఘాలు న్యాయం కోసం, రాజీ, చట్టపరమైన తీర్పుల మీద ఆధారపడతాయి. ఇవి కల్పించే యంత్రాంగం ప్రభుత్వ యంత్రాంగం తప్ప మరేదీ కాబోదు.

9.3 సామాజిక భద్రతా వలయం--ఒప్పంద భాగం

నూతన పారిశ్రామిక విధానం నిబంధనలకు లోబడి ప్రభుత్వం జాతీయ పునరావాసనిధి (ఎన్‌ఆర్‌ఎఫ్)ని 1992లో ఏర్పాటు చేసింది. ఈ నిధి పరిధి సమగ్రంగానూ, సవివరంగానూ వుంది. చట్టానికి అతీతంగా ఈ నిధి పది సంవత్సరాల పరిధిలో పనిచేస్తుంది. ఈ కాల పరిమితిలో ఈ నిధికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆడిటింగ్ వుంటుంది. ఎన్.ఆర్.ఎఫ్‌కు ఆర్థిక వనరులు ప్రభుత్వం, బహుళార్థ సహాయ సంస్థలు, పారిశ్రామిక విభాగాలు, భీమా సంస్థల నుంచి సమకూరతాయి. ఈ నిధిని ఉద్యోగుల సంక్షేమం కోసం వాడతారు. అయితే పారిశ్రామిక వివాదాల చట్టం క్రింద ధృవీకరించిన భారీ పరిశ్రమలకు మాత్రం ఈ నిధిలో ప్రవేశంలేదు.

జాతీయ పునరావాస నిధి (ఎన్.ఆర్.ఎఫ్) ఉద్దేశ్యాలు లక్ష్యాలు ఇవి 1) ఉద్యోగుల పునర్ శిక్షణ, తిరిగి ఉద్యోగాలలో చేర్చుకోవడానికి సహాయపడడం 2) తొలగించిన కార్మికులకు నష్ట పరిహారం చెల్లింపు 3) ఉపాధి పరికల్పనా పథకాలకు నిధుల కేటాయింపు. ఎన్.ఆర్.ఎఫ్‌లో రెండు విభాగాలు వున్నాయి. మొదటిది జాతీయ పునరావాస మంజూరు నిధి (ఎన్.ఆర్.జి.ఎఫ్) రెండోది ఉపాధి పరికల్పనా నిధి (ఇ.జి.ఎఫ్)

మొదటి నిధి ఈ క్రింది సేవల కోసం ఏర్పరిచారు.

ఎ) కార్మికుల కౌన్సిలింగ్, పునర్ శిక్షణ, మళ్ళీ ఉపాధి కల్పించడం ఆధునికీకరణ, అండర్ టేకింగ్ కంపెనీల పునరుద్ధరణ, భాయిలా పరిశ్రమలలో పునర్నిర్మాణాలు లేదా మూసివేత, కంపెనీల పునరుద్ధరణ చర్యల్లో ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులకు ఉద్యోగాలు కల్పించడం.

బి) ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో కార్మికుల నష్ట పరిహార నమూనాలు తయారు చేయడం. పారిశ్రామిక, ఆర్థిక పునర్నిర్మాణ మండలి (బి.ఐ.ఎఫ్.ఆర్) పరిశీలన తర్వాత ఏ పారిశ్రామిక విభాగాలు మూతపడినా నిధులను కార్మికుల చట్టపరమైన బకాయిలు, విఆర్ఎస్, పి.ఎస్.ఐల ద్వారా బకాయిలున్నప్పుడు బి.ఐ.ఎఫ్.ఆర్ పరిశీలనలేకున్నా చెల్లించడానికి ఉపయోగిస్తారు.

సి) ఆర్థిక సంస్థలు బలహీనమైన పారిశ్రామిక విభాగాలకు పునరుద్ధరణ కోసం నిధులివ్వడానికి వీలుగా ఈ నిధుల నుంచి వడ్డీ రాయితీ నిధులు కేటాయిస్తారు.

ఇక రెండోది అయిన ఉపాధి పరికల్పనా నిధి నుంచి ఈ క్రింది సాయం అందుతుంది.

ఎ) నియత, అనియత రంగాలలో ఆమోదిత ఉపాధి పరికల్పనా పథకాలకు

BRAOU

బి) సంస్కరణలలో భాగంగా తలెత్తిన పారిశ్రామిక అసహనంతో ప్రభావితమైన నిర్ధారిత పరిమితరంగాలలో మాత్రమే ఈ పథకాలు రూపొందిస్తారు.

ఇవే కాకుండా జాతీయ జౌళి సంస్థలో స్వచ్ఛంద పదవీ విరమణకు అంగీకరిస్తే ఈ సంస్థ ఉద్యోగులకు పునరావాసం కల్పించడానికిగాను వాణిజ్య బ్యాంకుల రుణాలకు సరిపడా రుణాలు అందించడానికి భారత లఘు పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (ఎస్ఐడిబిఐ), జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్)లు అంగీకరించడం మరో రాయితీగా చెప్పవచ్చు. పునరావాసంలో భాగంగా కార్మికులు పాత, సెకండ్‌హ్యాండ్, లేదా కొత్త మగ్గాలను కొనుక్కోదలుచుకుంటే వారు కేవలం 25 నుంచి 30 శాతం చెల్లిస్తే మిగతా మొత్తాలను ఈ బ్యాంకులు సులభ వాయిదాలతో రుణాలుగా సమకూరుస్తాయి.

అయితే జాతీయ పునరావాస నిధి పనితీరు చూస్తే కార్మికులకు ఏర్పాటు చేసిన భద్రతా వలయం తొలగించిన కార్మికులు దీనిమీద ఆధారపడజాలనంత అభద్రతగా వుంది. ఎప్పటివరకైతే ఈ నిధికి సంబంధించి నియంత్రిత, భద్రతా ఏర్పాట్లు వుండవో అప్పటివరకు, భద్రతా యంత్రాగం ఏదీ లేకుండా కార్మికుల సామూహిక తొలగింపు, కంపెనీల మూతకు గేట్లు ఎత్తివేసినట్టయితే, నూతన పారిశ్రామిక విధానం మౌలిక సిద్ధాంతమైన పునరుద్ధరణ ఉద్దేశం నీరుగారిపోతుందని మనం హెచ్చరించవలసి వస్తున్నది.

9.4 ఆధునికీకరణ–నూతన సాంకేతిక పరిజ్ఞానం

ఆధునిక ప్రపంచంలో వేగవంతమైన సాంకేతిక మార్పులు పరస్పర వైరుధ్యాల పుట్టగా వున్న సంగతి మనకు తెలుసు. ఏవిధంగా అంటే, సాంకేతిక పరిజ్ఞానం ఒక వంక గొప్ప అవకాశాలు, కొత్త రంగాల సాధనకు ఎంతగా తోడ్పడుతుందో అదే విధంగా, తత్ఫలితంగా ఉద్యోగాలు కోల్పోయిన వారి ఫలితంగా వున్న వ్యవస్థకు గొప్ప బెడదగా కూడా తయారవుతుంది. పై రెండు అంశాలూ నూరు పాళ్ళు నిజమైనవే. అయితే వర్తమాన ఆర్థిక అవశ్యకతల మూలకంగా నిర్ణీత రంగాలలో కొత్త సాంకేతికతలను ప్రవేశపెట్టడంలో జాప్యం జరగరాదన్నది కూడా అంతే నిజం.

నూతన సాంకేతికతలలో సెమీ కండక్టర్ చిప్‌ను కనుక్కొని, ఆ చిప్‌ను కంప్యూటర్ గుండెకాయగా అతికించిన సాంకేతికత జన జీవనంలో మౌలికంగా కలిగించినంత స్థాయి ప్రభావాన్ని మరే సాంకేతికతా కలిగించలేకపోయింది. ఈ మైక్రో ఎలక్ట్రానిక్ విప్లవం ఎంతగా సమ్మతి పొందిందంటే ప్రపంచ వ్యాప్తంగా చాలామంది ఈ విప్లవాత్మక సాధనాల సామర్థ్యాన్ని ఉపయోగించుకుని, ఈ విప్లవం వల్ల ఉత్పత్తి, దాని వర్తన, దీని ప్రభావం వల్ల ఉపాధి కోల్పోయే వారి మనుగడల గురించి వ్యూహాలు తయారు చేసుకోవలసి వచ్చింది.

పారిశ్రామిక విప్లవం నుంచి సాంకేతిక అభివృద్ధి దాడి ఫలితంగా కొత్త రంగాలు, కొత్త ఆర్థిక వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. అయితే భారతదేశం ఇట్లాంటి అభివృద్ధిని కొన్ని రంగాల్లో దాటిపోయింది. మైక్రో ప్రాసెసింగ్ పరిశ్రమలు (సన్‌రైజ్ టెక్నాలజీస్) తరుగుదల రేటును సాధించి ఊహించనలవికాని ప్రభావాలతో వున్నది.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు ఎలక్ట్రానిక్ విప్లవాన్ని విడిచిపెట్టి రెండోతరం సంస్కరణల ప్రతినిధులుగా మైక్రో ప్రాసెసర్, ఇన్ ఫర్మేషన్ టెక్నాలజీ (ఇన్‌ఫర్మేషన్ ప్రాసెసింగ్) లాంటి మూడో సాంకేతిక విప్లవానికి సిద్ధమవుతుండగా, భారతదేశం మాత్రం మొత్తం దేశాన్ని ఎలక్ట్రిసిటీ సర్క్యూట్‌లోకి తేవడానికి తంటాలు పడే దశలో వుంది. భారతదేశానికి సంబంధించి మొదటి తరహా సాంకేతిక విప్లవం పరిపూర్ణం కాకుండానే కొత్త మూడవ సాంకేతిక విప్లవానికి అంగవేయడం, ఈక్విటీ, అభివృద్ధిలమీద గణనీయమైన దుష్ప్రభావాలకు కారణమవుతున్నది. ఏ సమాజంలోనైనా సాంకేతిక పరిజ్ఞానం స్థాయి ఆ దేశ ప్రజలు జీర్ణించుకునే స్థాయిలో వుండగలగాలి. ప్రపంచ పరిజ్ఞానం నిల్వలను, విజ్ఞాన శాస్త్ర, పారిశ్రామిక సాంకేతికతలను అన్వయించుకునే పరిస్థితి వుండాలి.

మైక్రో ఎలక్ట్రానిక్ విప్లవం పని సంస్థలు, ఉత్పత్తి, ఉపాధులమీద కలుగజేస్తున్న ప్రభావం పెరుగుతున్న విషయం గమనించవచ్చు. ఈ మేరకు వాస్తవ పరిస్థితుల్లో మనం ఈ విప్లవాన్ని సమర్థించడమో, విమర్శించడమో చేయకుండా

BRAOU

సమతుల్య దృక్పథంతో వ్యవహరించడం మంచిది. ఈ సాంకేతిక విప్లవం మనకు ఏదో అద్భుతాలు సృష్టిస్తుందన్న దృష్టికాకుండా ఈ సాంకేతికతలకు ఎలా అలవాటు పడాలో ఆలోచించాలి. కొత్త సాంకేతికతవల్ల ఆయా సంస్థల్లో ఎలాంటి తీవ్రమైన మార్పులు సంభవిస్తున్నాయో మనం చూస్తూనే వున్నాము.

ఇలాంటి సమయాల్లో ఆయా సంస్థలు సాంప్రదాయ పద్ధతులను వ్యతిరేకించడంలో మొండివైఖరి కన్నా, పట్టు విడుపుల వైఖరి వుండాలి. ఈ విధంగా మాత్రమే మైక్రో ఎలక్ట్రానిక్ విప్లవం ప్రయోజనాలను ఆయా సంస్థలు సాధించగలవు. భారతదేశంలోని రాజకీయ, వాణిజ్య సంపన్న వర్గాలు వర్తమాన సమీకృత పెట్టుబడిదారీ విధానం కారణంగా ఏర్పడిన నూతన అవకాశాలను అర్థం చేసుకొని సామాజిక అవసరాలను, సమర్థ డిమాండ్‌లుగా మలుచుకోవడంలో వారి నిపుణత, విశ్వసనీయత కనబరచగలగాలి. అయితే, ఏమాత్రం కొనుగోలు శక్తిలేని భారతీయ మెజారిటీ ప్రజల జీవన వ్యయాన్ని పెంచడంలో సమీకృత పెట్టుబడిదారీ విధానం ఎట్లా పనిచేస్తుందో? వేచి చూడవలసిందే.

భారతదేశంలో టెలికం పరిశ్రమను పరిశీలించి చూద్దాం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో బహుళజాతి కంపెనీలు పరిశోధనల ప్రోత్సాహాన్ని ఎలా గండికొడతాయో చూపడానికి టెలికం మంచి ఉదాహరణ. భారతదేశంలో టెలికమ్యూనికేషన్ల పరిశోధనా సంస్థ సి.డాట్ ఆధునికీకరణ ప్రయత్నాలను విదేశీ సహకారం కోసం వమ్ముచేశారు. ఈ రంగాల్లో సాంకేతిక అభివృద్ధి చేసే వారికి ప్రోద్బలం, స్వయం ప్రతిపత్తి ఇచ్చే సంస్థాగత నిర్మాణాన్ని ఎన్నడూ అనుమతించలేదు. ఏ ఆటంకం ఎదురైనా అధికారులు విదేశీ సాంకేతిక సహకారం కోసం అర్రులు చాచారు. ఫలితంగా స్వదేశీ అభివృద్ధి పథకాలు మూలన పడ్డాయి. తక్కువ వ్యయమయ్యే స్థానిక నైపుణ్యతలను ఎన్నడూ ఆహ్వానించలేదు. అందువల్ల విదేశీ సహకారం సాంకేతిక ప్రగతి కోసమా? అందే ముడుపుల కోసమా? అన్న మౌలిక సందేహాలు కలుగుతున్నాయి. టెలికంలో సాంకేతిక అభివృద్ధి తప్పనిసరి అన్న నిర్ణయం ఏ కారణంచేత తీసుకున్నా, దీని ఫలితంగా మాత్రం ఈ విభాగంలోని దిగువ స్థాయి ఉద్యోగాల పరికల్పనపై తీవ్ర ప్రభావం చూపింది. టెలికం ఆపరేటర్లు, టెక్నీషియన్లు, లైన్‌మన్ల బదులుగా కంప్యూటర్ యంత్రాలు ప్రవేశపట్టడంతో దిగువస్థాయి ఉద్యోగులు చాలామంది ఉద్యోగాలు కోల్పోయారు.

BRAOU

మైక్రో ఎలక్ట్రానిక్ సాంకేతికతను ప్రవేశ పెట్టడం వల్ల సమష్టి బేరాల కోసం కొత్త రంగాలు ఏర్పడ్డాయి. బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద బ్యాంక్ ఉద్యోగుల సంఘం ఎఐబిఇఎ తొలుత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ రంగంలో ప్రవేశ పెట్టడాన్ని వ్యతిరేకించింది. అయితే ఇప్పుడు మాత్రం ఈ సంఘం సాంకేతికత అవశ్యమని అంగీకరించడమేకాదు. ఒక మేరకు కంప్యూటరైజేషన్‌ను అంగీకరించి ఆ మేరకు వ్యూహాలు రూపొందించుకున్నది. కంప్యూటరైజేషన్ వారి పని సులభం చేస్తున్నందువల్ల బ్యాంకు ఉద్యోగులు సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశాన్ని వ్యతిరేకించకపోవచ్చు. అయితే బ్యాంకింగ్‌లో కంప్యూటరైజేషన్ కారణంగా ఈ రంగంలో దిగువ స్థాయి ఉద్యోగులైన క్లర్కులు, టైపిస్టులలాంటి వారి ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఇప్పటిదాకా ఈ ఉద్యోగులే ఎక్కువ రిక్రూట్ అయ్యేవారు. పరిస్థితులు మారక తప్పవు.

ఎలక్ట్రానిక్ పరిశ్రమను పరిశీలించినట్టయితే ఎక్కువ ఉద్యోగాలు కల్పించకుండానే ఈ పరిశ్రమ విస్తృతంగా ఎదిగింది. ఇది స్వదేశీ పరిశోధన, అభివృద్ధిలో క్షీణతవల్ల జరిగింది. ఈ పరిశ్రమ కొన్ని విడిభాగాలను ఉత్పత్తి చేయగలిగివున్నప్పటికీ ఆ పనిని పట్టించుకోకుండా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న విడిభాగాల కూర్పుమీద ఆధారపడి అభివృద్ధి చెందింది. సరళీకృత విధానాల కారణంగా చాలా సంస్థలు వారి స్థానిక సాంకేతిక అభివృద్ధి యత్నాలను కట్టిపెట్టి విదేశీ సహకారమే ప్రత్యామ్నాయంగా భావించాయి. తద్విరుద్ధంగా స్థానిక పరిశోధన, అభివృద్ధి మీద శ్రద్ధ పెట్టిన సంస్థలు మాత్రం ఎక్కువ ఉద్యోగాలు కల్పించగలిగాయి. భారతదేశంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం, మార్పుల నేపథ్యంలో కార్మికుల, యూనియన్ల ప్రతిస్పందనను పరిశీలిస్తే నూతన పరిస్థితులకు అనుగుణంగా కొత్త వ్యూహాలు రూపొందించి కార్మికుల ప్రయోజనాలు కాపాడడంలో కార్మికులు, సంఘాలు విఫలమయ్యాయని చెప్పవచ్చు. అందువల్ల ఈ సంఘాలు ఉద్యోగాలు, ఉత్పత్తిని పరిరక్షించే ప్రత్యామ్నాయాలను చూపకుండా గుడ్డిగా ఆధునిక సాంకేతికతనే వ్యతిరేకించడం ప్రారంభించాయి.

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కార్మికుల ఉత్పాదకత బాగా పెరిగింది. కానీ అతి ఎక్కువ ధరలలో యంత్రాలను దిగుమతి చేసుకోవడం వల్ల దీనివల్ల ఫలమేమీ లేకుండాపోయింది. ఫలితంగా లాభాల్లో ఏ మార్పు రాలేదు. ఈ రంగాలలో ఉద్యోగాల తొలగింపు సత్వరమే జరగదని ప్రభుత్వం కార్మిక సంఘాలకు హామీ పడినందున ఉద్యోగాలకు తక్షణమే ఢోకా ఏమీ లేదు. నూతన సాంకేతిక పరిజ్ఞానం పరిణామాల గురించి కార్మికులకు, కార్మిక సంఘాలకు తెలిసినప్పటికీ వారు దీనిపట్ల తీవ్ర వ్యతిరేకత ఏమీ చూపడంలేదు. బహుశా కంప్యూటర్ సంఖ్యాక నియంత్రిత (సి.ఎన్.సి.) యంత్రాలేవీ ఇప్పటివరకు ప్రత్యక్షంగా ఉద్యోగాల నుంచి తొలగించనందువల్ల కార్మికులలో తీవ్ర వ్యతిరేకత రాలేదు. కార్మిక సంఘాలు నూతన సాంకేతికతల సమస్యల తీవ్రతను అర్థం చేసుకోవడంలో నిస్సహాయత కనబరుస్తున్నాయి. వారి ఉద్యోగాలు, వేతనాలు భంగం కానంతవరకు వారికి పెద్ద పేచీలేదు. దీనితోపాటు నూతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల శ్రమ క్రమంపై కార్మికుల నియంత్రణను తగ్గించి వేసింది. అందువల్ల కొత్త పారిశ్రామిక సంఘర్షణలన్నీ వేతనాలపైన కాకుండా శ్రమ క్రమంపై నియంత్రణ చుట్టూ పరిభ్రమించే అవకాశం వుంది. కార్మిక సంఘాలు నూతన సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఏర్పడిన కొత్త రూపాల్లో వున్న ఈ దోపిడిని అరికట్టడానికి కొత్త వ్యూహాలు ఏర్పరచుకోవలసి వున్నది.

నూతన సాంకేతిక పరిజ్ఞానం అనివార్యంగా కార్మికుల సాధికారతకు భంగం కలిగించనుందా? అన్న కోణాన్ని పరిశీలించవలసి వున్నది. ఈ సందర్భంలో సాంకేతికతలవల్ల సంభవిస్తున్న అనుకూల పరిణామాలైన ఉత్పత్తి ప్రమాణాల పెరుగుదల, సామర్థ్యం పెరుగుదల అన్న అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. అందువల్ల కార్మికులను అసంఘటితం చేస్తున్నది పరిశ్రమలా? నూతన సాంకేతిక పరిజ్ఞానమా? అన్న సూక్ష్మాన్ని కూడా పరిశీలించాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం మరింత ప్రజాస్వామ్య సంస్థాగత నిర్మాణాలకు కారకమైంది. కానీ భారత దేశంలో మాత్రం ఇది మరింత ఆధిపత్య ధోరణులు ప్రబలడానికి తావిస్తున్నది. ఏ పరిణామమైనా కార్మిక సంఘాలు రాజకీయ వ్యవస్థపై తెచ్చే ఒత్తిడి ఫలితాలేనని గుర్తించాలి.

9.5 ఉపాధి-పారిశ్రామిక సంబంధాలు: బహుళ జాతి సంస్థల ప్రభావం

సాపేక్షికంగా విద్యావంతులైన జనాభా అధికంగా వుండీ నిరుద్యోగ సమస్య ఎక్కువగా వున్న భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు బహుళ జాతి కంపెనీల అనుబంధ సంస్థల ఏర్పాటులో లాభ పడ్డాయని చెప్పవచ్చు. ఎందుకంటే బహుళ జాతి కంపెనీలు ఎలక్ట్రానిక్స్, ఇతర ఉన్నత స్థాయి సాంకేతిక రంగాలలో విడిభాగాల తయారీని తక్కువ వ్యయంతో తయారు చేయించి ప్రపంచ వ్యాప్తంగా వున్న వ్యవస్థీకృత మార్కెట్‌లలో అమ్మడం వల్ల ఈ దేశాలు ప్రయోజనం పొందుతున్నాయి. ఇలాంటి పెట్టుబడులవల్ల భారతదేశంతో సహా చాలా దేశాలు ప్రయోజనాలు పొందడంలో మొత్తంగా ఆయా దేశాల ప్రజల ఆర్థిక స్థాయిలో కూడా పెరుగుదల కనిపిస్తున్నది. అయితే మనం బహుళజాతి కంపెనీలను అతి దగ్గరగా పరిశీలిస్తే మూడవ ప్రపంచ దేశాల్లో ఈ కంపెనీల అనుబంధ కంపెనీలు కల్పిస్తున్న ఉద్యోగాలు సాపేక్షికంగా చాలా తక్కువ వున్నట్లు గమనించవచ్చు. ఉద్యోగాల పరికల్పన కన్నా ఎం.ఎన్.సి.లలో ఇతర ప్రయోజనాలే ఎక్కువ. వీటివల్ల స్థానిక వాణిజ్య వేత్తలకు కొత్త జ్ఞానం అందుబాటులోకి వస్తుంది. అట్లాగే దేశంలో ఇప్పుడున్న వేతనాలకన్నా ఎం.ఎన్.సి.లు ఎక్కువ వేతనాలు ఇస్తున్నాయి. ఇవే కాకుండా స్థానిక సరఫరా దారులు, ఇతర అనుబంధ సర్వీసుల కారణంగా అదనపు ఉపాధి వనరులు కూడా చేకూరతాయి.

బహుళ జాతి కంపెనీల ప్రవేశానికి సంబంధించి సమర్థించే వాళ్ళు ఈ విషయాలు చెబుతారు. అయితే వీటిని ఎక్కువమంది విమర్శిస్తున్నారు. ఎం.ఎన్.సిల ప్రవేశాన్ని విమర్శించే వాళ్ళు ఈ కంపెనీలు తరచుగా సాంకేతికతలను దిగుమతి చేసుకుంటాయని, సాధారణంగా ఈ దిగుమతులు సాధారణ స్థాయి కార్మికావసరాలు, పెట్టుబడి ప్రగాఢతలకు అనుకూలంగా వుండి మొత్తం కార్మికలోకంలో కనీసం 30 శాతం ఉద్యోగాలు ఎగవేస్తాయని, ఫలితంగా అసలే అర్థ నిరుద్యోగత గల దేశాలలో నిరుద్యోగం ప్రబలుతుందని వాదిస్తున్నారు. ఇదే కాకుండా ఎం.ఎన్.సిలు ఇచ్చే హెచ్చు వేతనాలను స్థానిక సంస్థల నుంచి ఉద్యోగులు డిమాండ్ చేసే అవకాశం కూడా వుంది. ఫలితంగా సాంకేతిక నిపుణత కలిగిన ఉద్యోగుల విషయంలో తీవ్ర పోటీ ఏర్పడుతుందని, ఫలితంగా దేశీయ సంస్థలు నష్టపోతాయని వీరంటున్నారు. ఇదే సమయంలో

BRAOU

హెచ్చు వేతనాలు ద్రవ్యోల్బణ ఒత్తిడులు సృష్టించడంతో స్థానిక వాణిజ్యంలో పోటీ తగ్గిపోతుందని వీరి వాదన.

చివరగా సంఘటిత కార్మికులు ఈ పరిస్థితుల్లో ఒక పాత్ర వహిస్తారు. సాధారణంగా హెచ్చు వేతనాలు చెల్లిస్తున్న బహుళ జాతి కంపెనీలు వున్న కార్మిక సంఘాలలో ఉద్యోగులకు వేతనాలు సరిసమానం చెయ్యడానికి రాయితీలు ప్రకటిస్తాయి. అయితే ఈ వేతనాల భేదాలను ప్రభుత్వ అధినేతలు అంగీకరించని స్థితి వస్తుంది. ఇదే కాకుండా జాతీయ వాణిజ్య సంస్థలు, బహుళ జాతి కంపెనీల అధిక సామర్థ్యత మూలంగా ఇప్పటికే అననుకూల పరిస్థితుల్లో వున్నందున వేతనాల సమతుల్య స్థాయిని వ్యతిరేకించడానికి రాజకీయ శక్తులపై ఒత్తిడి పెంచుతాయి. ఈ దశలో వేతనాలు మరీ మించితే అసలు బహుళ జాతి కంపెనీల ప్రవేశమే ఆగిపోవచ్చునని ప్రభుత్వాలు భయపడ్తాయి. ఇదే కాకుండా కార్మిక సంఘాలు వారి లక్ష్యాలు సాధిస్తే తమకు ధీటుగా అధికార స్తానాలకు ఎగబాకే అవకాశముందని మన దేశంలో రాజకీయ వేత్తల భయం.

పారిశ్రామిక సంబంధాల విషయంలో బహుళజాతి కంపెనీలు ఎక్కువగా అంతర్జాతీయ స్థాయి వికేంద్రీకరణ రూపంలో పనిచేస్తాయి. వాటి అనుబంధ సంస్థలలో పూర్తి యాజమాన్య పర్యవేక్షణ అమలు చేయాలని వారు నమ్మినప్పుడు కూడా ఎం.ఎన్.సి.లు ఇట్లాగే వుంటాయి. అనుబంధ సంస్థలపైన వారు కఠినతరమైన సాంకేతిక, ఆర్థిక నియంత్రణ అమలు పరుస్తారు. కానీ, విదేశీ మేనేజర్లు కీలక పదవుల్లో వున్నప్పటికీ కార్మిక సంబంధాల స్వభావం, రూపానికి సంబంధించి పూర్తిగా స్థానిక పలుకుబడి మీదే బహుళ జాతి కంపెనీలు ఆధారపడతాయి.

బహుళజాతి అంటే పెట్టుబడి ఉత్పాదక శక్తులు అంతర్జాతీయమైనవి అన్న వాస్తవానికి ఒక కార్పొరేట్ శైలిలో వెళ్లడి తప్ప మరేమీ కాదు. ఇలాంటి సంస్థల ఉద్యోగ సంబంధాలు జాతీయ స్థాయిలో విడగొట్టి వుంటాయి. అంతర్జాతీయ కంపెనీలు వారి కార్మికులకు అంతర్జాతీయ వనరులతో సంబంధాన్ని (సమాచారం-విధాన నిర్ణయం మొదలైనవి) నిరాకరిస్తాయి. అట్లాగే ప్రమాణాలు (వ్యక్తిగత పనులు, కోడ్ వెల్లడి, భద్రత మొదలైనవి), స్థితి గతులు (పిప్పు చెల్లింపులు, పని గంటలు మొదలైనవి)లో కార్మికుల జోక్యం వుండనివ్వరు. కార్పొరేట్ యాజమాన్యం, ఆధిపత్యాన్ని, సమ్యతను, పెంచడానికి అంతర్జాతీయ కంపెనీలు ఆ పని చేస్తాయి.

బహుళజాతి కంపెనీలు ప్రాథమికంగా బేరసారాల ఏర్పాట్లను వ్యతిరేకిస్తున్నందున బహుళజాతి కార్మిక బలగాలలో ఎక్కువ అంతరాలు కనబడతాయి. బేరసారాలకు వీలు కల్పించి ప్రమాణాలు, స్థితిగతుల విషయంలో కార్మిక సంఘాల జోక్యాన్ని పెంచుకోవడం ఇష్టపడని ఎం.ఎన్.సి.లు అంతర్జాతీయ కంపెనీల మధ్య పని పరిస్థితులు, విధి విధానాలను ప్రమాణీకరిస్తాయి. ఇది అనివార్యంగా కంపెనీ ప్రధాన కార్యాలయాల నుంచి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని అమలు పరచడం ద్వారా తమ యాజమాన్యం అధిపత్యాన్ని సుస్థిరం చేసుకొనే వీలు కల్పిస్తుంది.

9.6 ధరలు-వేతనాల పరిరక్షణ

భారతదేశంలో సంఘటిత రంగాల్లో వేతనాలు మూడు అంశాలతో రూపొందిస్తారు. మూల వేతనం, కరువు భత్యం, (డి.ఎ), బోనస్, డి.ఎ., బోనస్‌లు చెల్లించడానికి నియమాలు రూపొందించి వున్నాయి. బోనస్ చెల్లింపుకూడా చట్ట బద్ధమైన చర్య. 1965 బోనస్ చెల్లింపుల చట్టం ద్వారా చట్ట బద్ధత కల్పించారు. ఈ విధంగా కార్మికులకు వార్షిక వేతనం (మూల వేతనం + డి.ఎ)లో కనీసం 8.33 శాతం బోనస్‌గా చెల్లించాలి. అయితే మూల వేతనం బోనస్‌కు నిర్ధారించిన మొత్తానికన్నా ఎక్కువయిన పరిస్థితుల్లో, మూలవేతనంకు సరిపడా బోనస్‌ను మళ్ళీ లెక్కిస్తారు. మూల వేతనాలు, వార్షిక ఇంక్రిమెంట్ల తీరు సాధారణంగా వేజ్ బోర్డులు, పే కమిషన్‌లు చూస్తాయి. కాల పరిణామం మేరకు మూడు నాలుగేళ్ళకు ఒకసారి అవి మారతాయి. వేతనాల విషయంలో సమ్మిళి బేరసారాలు అనుమతించినప్పటికీ ప్రభుత్వ జోక్యం ఈ విషయాల్లో ముఖ్యపాత్ర నిర్వహిస్తుంది. ప్రైవేటు కంపెనీలలో పెరిగిన వేతనాల స్థాయిలో ప్రభుత్వ రంగ సంస్థల వేతనాలు పెంచడంలో కూడా ఇదే వర్తిస్తుంది.

BRAOU

సంఘటిత రంగాల్లో వేతనాలు, ధరల మార్పులను ఈ పట్టికలో చూడవచ్చు

టేబుల్ – 1

పారిశ్రామిక కార్మికుల సూచి సంఖ్యలు

సంవత్సరం	వేతనాలు (1963-65+100)	నిష్పత్తి మార్పు	వినియోగ ధరలు	నిష్పత్తి మార్పు
1990	1051	-	186	-
1991	1190.1	13.2	212	13.4
1992	1343.0	12.8	232	10.4
1993	1480.9	10.3	252	6.3

1997 ఇండియన్ లేబర్ జర్నల్ ఆధారంగా

పై టేబుల్‌ను పరిశీలిస్తే వేతనాలు మార్పు నిష్పత్తికన్నా ధరల మార్పు నిష్పత్తి తక్కువగా వుండడం గమనించవచ్చు. దీని ప్రకారం సరళీకృత విధానాల వల్ల ఉద్యోగుల వేతనాలు పెరిగాయి. ఇది సరళీకృత విధానాలకు అనుకూల సూచిక. అయితే ఇదే టేబుల్ ప్రకారం సరళీకృత విధానాలు ప్రారంభమైనప్పటి నుంచీ నిజవేతనాల్లో క్రమానుగత తగ్గుదల చూడవచ్చు. వేతన నిర్ణాణాల్లో జరుగుతున్న మార్పులన్నీ ప్రస్తుత వినియోగదారుల ధరల సూచి ప్రకారమే జరుగుతున్నాయి. అయితే వేతనాల పెరుగుదల 1990 ఆదిలో వేతన సవరణల వల్ల జరిగిన విషయంగా కూడా గమనించాలి.

ఇక భారతదేశ కార్మికుల్లో 93 శాతంగా వున్న అసంఘటిత రంగ కార్మికుల విషయం పరిశీలిస్తే వారు, అతి దారుణమైన పరిస్థితుల్లో పనిచేస్తూ జీవిస్తున్నారు. ఎక్కువగా ఈ కార్మికులు నిర్మాణ, వ్యవసాయ రంగాల్లో వున్నారు. ఈ రంగాలు వారికి రెండు పూటలా తిండిదొరికే వేతనాలు కూడా చెల్లించవు. దీనిలో మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే అసంఘటిత రంగ కార్మికులలో ఎక్కువ సంఖ్య మహిళలదే. వారికి పురుషులతో సమానంగా వేతనాలు కూడాలేవు.

భారతదేశంలో వివిధ రకాల ఉద్యోగాలకు రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు నిర్ణయిస్తాయి. కనీస వేతనాల చట్టం ప్రకారంగా వీటిని నిర్ణయిస్తారు. భారతదేశంలోని ఆయా రాష్ట్రాలలో ఈ కనీస వేతనాలు వేర్వేరుగా వున్నాయి. 1996లో వ్యవసాయ కార్మికుల కనీస వేతనాలు ఆయా రాష్ట్రాలను బట్టి 21 రూపాయల నుంచి 25 రూపాయల దాకా వున్నాయి. కనీస వేతనాలు అమలయినా కార్మికులకు అది సౌకర్యమే. కానీ దురదృష్టవశాత్తు కనీస వేతనాలను ఎవరూ పట్టించుకోరు. వ్యవసాయ పనులు ఉధృతంగా వున్న కాలంలో తప్ప వ్యవసాయ కార్మికులకు కొన్ని ప్రాంతాల్లో కనీస వేతనంలో సగం, రెండింట మూడువంతులు మాత్రమే లభిస్తున్నది. గృహ సంబంధ సేవల కార్మికులకు కనీస వేతనాల్లో సగం కన్నా తక్కువ మాత్రమే దొరుకుతున్నది. కనీస వేతనాల అమలుకు చట్టాలు వున్నప్పటికీ, కార్మికులు అసంఘటితంగా, తమ వేతనాలు అడగలేని నిస్సహాయ స్థితిలో వున్నారు. ప్రభుత్వం కూడా వారికి సాయపడే ప్రయత్నం చేయదు. వర్షాధారిత గ్రామీణ భారతంలో ఉపాధి అవకాశాల కొరత ఫలితంగా అతి తక్కువ, హీనవేతనాలు అమలులో వున్నాయి.

9.7 కార్మిక సంఘాల హక్కులు

భారతదేశంలో పారిశ్రామిక సంబంధాల వ్యవస్థలో ప్రధాన పాత్ర ధారులు ఒకటి కార్మిక సంఘాలు రెండు యాజమాన్య సంఘాలు మూడు భారత ప్రభుత్వం అన్న విషయం మనకు తెలుసు.

B RAO U

కార్మిక సంఘాలను పూర్తిగా గౌరవిస్తూనే అవి పూర్తిగా విడిపోయి వున్నాయని చెప్పక తప్పదు. మనదేశంలో కార్మిక సంఘాల ఉద్యమం పూర్తి దుర్భర పరిస్థితుల్లో పెరిగింది. ప్రభుత్వం గుర్తించిన 16 జాతీయ, ప్రాంతీయ సమాఖ్యలుగా వున్న కార్మిక సంఘాలు సిద్ధాంత పరమైన ఇతర ముఠా ప్రయోజనాల కోసం చీలిపోయాయి. ప్రతి కార్మిక సంఘం తమకే ఎక్కువ సభ్యత్వం వున్నట్లు నమ్మబలుకుతాయి. ఈ కార్మిక సంఘాల ప్రాతినిధ్యంతో సహా ప్రతి విషయమూ రాజకీయం చేసి నడిపిస్తున్నారు.

యాజమాన్య సంఘాలుకూడా అనైక్యత, పరిమిత గుర్తింపు సమస్యలతో వున్నాయి. భారతదేశంలో మూడు యాజమాన్య సంఘాలు ఉనికిలో వున్నాయి. అవి ఎఫ్.ఐ.సి.సిఐ ఢిల్లీలో స్థాపించిన అఖిలభారత యాజమాన్యాల సంస్థ (ఎఐఒఇ), ముంబయ్ 'అసోచామ్' స్థాపించిన భారతీయ యాజమాన్యాల సమాఖ్య (ఇఎఫ్ఐ), ప్రభుత్వ రంగ సంస్థల భాగస్వామ్యాలు స్థాపించిన 'స్టాండింగ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (స్కోప్). ఈ మూడు కలిసి భారతీయ యాజమాన్యాల మండలి (సి.ఐ.ఇ) పేరిట మరొక సంఘాన్ని కలిగి వున్నాయి. వీటితోపాటు లఘు, మధ్య తరహా పరిశ్రమల యాజమాన్యాల సంస్థ అఖిల భారత తయారీదారుల సంస్థ (ఎఎమ్ఐఒ) కూడా వుంది.

పారిశ్రామిక సంబంధాలలో ప్రభుత్వ జోక్యం, ఇతర పారిశ్రామిక దేశాలకన్నా భారతదేశంలో నేరుగా, నిర్ణయాత్మకంగా వుంటుంది. భారతదేశంలో ప్రభుత్వం అతిపెద్ద ఉపాధి కల్పనాదారుగా నియంత్రణ, చట్టాల అమలుదారుగా వుంటుంది. ఇక్కడ ఒక పారిశ్రామిక వివాదం తలెత్తినప్పుడు మాత్రమే కాకుండా, వివాదం తలెత్తే అవకాశం వుందని ప్రభుత్వం కానీ మంత్రికానీ భావించినా కూడా ప్రభుత్వం జోక్యం చేసుకునే అధికారం వుంది. కార్మిక వివాదాల్లో ప్రభుత్వ పూర్తి జోక్యం వల్ల ఇక్కడ ప్రైవేటు యాజమాన్యాలు పూర్తిగా ప్రభుత్వం మీదనే ఆధారపడ్డున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల్లో అయితే వాణిజ్య యాజమాన్యాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వనందువల్ల పారిశ్రామిక సంబంధాల్లో పూర్తిగా ప్రభుత్వ ఆధిపత్యమే మనుగడలో వుంది.

9.7.1 సరళీకృత విధానాలు: కార్మికుల హక్కులు: సమిష్టి బేరసారాలు

సాంప్రదాయం ప్రకారంగా వేతనాలు, పని పరిస్థితులు సమిష్టి బేరసారాల పరిధిలోకి వస్తాయి. కాలం గడస్తున్న కొద్దీ పని విధానాలు, ఓవర్‌టైమ్ వేతనాలు వంటి సర్వ విషయాలూ బేర సారాల క్రిందకు చేరాయి. సాంకేతిక మార్పులు, ఉద్యోగ విరమణ తర్వాతి సౌకర్యాలు లాంటివి కూడా సమిష్టి బేరసారాలలో భాగమయ్యాయి. 1980 చివరిదాకా ప్రతి వేతన ఒప్పందానికీ మధ్య కాలపరిమితి మూడేళ్ళుగా వుండేది. 1990ల దాకా ప్రభుత్వ రంగ సంస్థల్లో వేతనాల ఉమ్మడి ఒప్పందాలు అయిదేళ్లవరకు అమలులో వుండేట్లు చట్ట బద్ధత కల్పించారు. అయితే సమిష్టి బేరసారాల కాలపరిమితి పొడిగింపు ప్రయత్నాలను కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తూనే వున్నాయి.

1991లో నూతన పారిశ్రామిక విధానం ప్రవేశ పెట్టిన దరిమిలా పబ్లిక్ రంగ సంస్థల స్థానంలో ప్రైవేటు రంగ పోటీని ప్రవేశ పెట్టి మానవ వనరుల పరిశ్రమలను డీ రెగ్యులేట్ చేశారు. చాలా పరిశ్రమలలో ఇప్పుడు అధిక విదేశీ వాటాను అనుమతించారు. విధాన సంస్కరణల్లో భాగంగా వీటిని ప్రైవేటీకరించారు. సరళీకృత విధానాలు, డీ రెగ్యులేషన్ అట్లా వుండగా, ప్రభుత్వం నడిపే ప్రభుత్వ రంగ సంస్థలలో 20 శాతం షేర్లను మళ్ళించారు. బహుళజాతి సంస్థలతో సహా ప్రైవేటు భాగస్వామ్య పరిశ్రమలకు అనుమతించారు. అయితే ఇంత జేసినా ఇప్పటివరకు విదేశీ పెట్టుబడుల ప్రతిపాదనలు అంత ప్రోత్సాహకరంగాలేవు. ప్రతిపాదిత విదేశీ పెట్టుబడుల ప్రాజెక్టులు ఎన్ని రూపుదిద్దుకుంటాయో వేచిచూడవలసిందే. విదేశీ పెట్టుబడులకు మౌలిక వసతులైన విద్యుచ్ఛక్తి, రవాణా, నీటి లభ్యత, టెలికమ్యూనికేషన్లు ప్రధాన అవరోధంగా వున్నాయి.

సమిష్టి బేరసారాల విషయంలో యాజమాన్య హక్కుల విషయంలో మాత్రం పురోగతి కనబడుతున్నది. నూతన సాంకేతికతలు, నిర్మాణాత్మక, ఇతర మార్పులు కార్మిక సంఘాలను పూర్తి నిస్సహాయ స్థితికి నెట్టి వేస్తున్నాయి. మూతకు సిద్ధమైన కంపెనీలలో వాటి రక్షణకు కార్మిక, యాజమాన్య సహకార ఒప్పందాల్లో వేతనాల్లో కోత, రాయితీలు, సౌకర్యాల

BRAOU

స్తంభన, కార్మికుల సంఘాల హక్కుల స్వచ్ఛంద నిలుపుదల, ఆధునికీకరణ, లాభాల పెంపులాంటి విషయాలపై త్యాగాలు ఎక్కువవుతున్నాయి.

కార్మికునికి సంబంధించి 1990లలో సంక్షేమం కేంద్ర బిందువుగా మారింది. ఈ విషయాన్ని ఇప్పుడున్న కుటుంబ ఫించను పథకం (ఎఫ్.పి.ఎస్.) నుంచి కార్మికులకు మరిన్ని అదనపు సౌకర్యాలు కలుగజేసే నూతన ఫించను విధానం 1995 (ఎన్.పి.ఎస్.) ప్రవేశ పెట్టడంలో చూడవచ్చు. అయితే నూతన ఫించను విధానంలో కార్మికులకు తిరిగి చెల్లించే సొమ్ము చాలా తక్కువ. కార్మిక సంఘాలు ఈ విషయమై పట్టుబట్టడంతో ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించే కంట్రిబ్యూషన్లను తొలుత నిలిపి వేసి మరలా పునరుద్ధరించారు.

1990 నుంచి ఆరంభమైన నిర్మాణాత్మక మార్పులు సంస్థ యాజమాన్య విషయాలపై యాజమాన్యం, ఉద్యోగులు ఇరువురూ తరచుగా సంప్రదింపులు జరిపే సంస్కృతిని తెచ్చాయి. సంస్కరణల నేపథ్యంలో ఇదొక రకంగా బలవంతపు బ్రాహ్మణార్థం వంటిది. పారిశ్రామిక రంగంలో ముగ్గురు పాత్రధారులైన యాజమాన్యం, ఉద్యోగులు, ప్రభుత్వం ఒకరితో ఒకరు కలిస్తే మూడోవారు ఇతరులను నిరోధించడానికి వీలుకాదన్న విషయం తెలిసినవారే. కానీ, వాణిజ్యాన్ని 'మానవీయ 'ముఖం'తో పునర్నిర్మాణం చేయడానికి ఈ పాత్రధారులు క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపుతూనే వుంటారు.

9.7.2 కార్మికులు–సమాచార హక్కు

కార్మికులలో పారిశ్రామిక రంగంలోని అన్ని రంగాల కార్యకలాపాల సమాచారాన్ని తెలుసుకునే హక్కు వుందని వెనుకబడిన ప్రాంతమైన రాజస్థాన్‌లో ఒక ప్రభుత్వేతర సేవా సంస్థ అభిప్రాయాన్ని ప్రచారం చేసింది. ఇది ఆ తర్వాత బాగా పుంజుకొని కొత్తగా పుట్టుకొచ్చిన హక్కుగా మారింది. స్థూల పరిశీలనతో ఈ హక్కు ప్రభుత్వ వ్యయాల ఆడిటింగ్ మీద కేంద్రీకరించి వుందన్న విషయం అర్థమవుతుంది. అభివృద్ధి ప్రాజెక్టులు, పథకాలకు కేటాయిస్తున్న వనరులు నిజంగానే వాటికోసం ఖర్చు చేస్తున్నారా? అన్న సమాచారం తెలుసుకునే హక్కు మీదనే ఈ ఆలోచన రూపుదిద్దుకున్నది. పారిశ్రామిక సంబంధాల విషయంలో నిర్ణీత కాలవ్యవధిలో యజమాని చూపిన వ్యయం గురించిన వివరాలన్నీ తెలుసుకునే హక్కు ఉద్యోగికి వున్నది. ఉద్యోగులకు చేకూరుతున్న ఈ హక్కువల్ల కంపెనీ వ్యవహారాల్లో గొప్ప పారదర్శకత, విశ్వాసం ఏర్పడతాయి. ఫలితంగా ఉద్యోగులు యాజమాన్య పరిస్థితులు పూర్తిగా తెలుసుకొని, భవిష్యత్తులో సమర్థత పెంపు, నూతన సాంకేతిక పరిజ్ఞానంలాంటి విషయాలపై యాజమాన్యంతో సదవగాహనతో సంప్రదింపులు పెరిగే అవకాశం వుంది. ఇలాంటి పరస్పర సంప్రదింపులు ఉభయులకూ లాభదాయకంగా వుంటాయి. వేతనాల పెంపు, లాకౌట్ల నివారణ, పారిశ్రామిక విభాగాల అమ్మకము లేదా మూతలాంటి వ్యవహారాల్లో ఉభయులూ సమర్థంగా వ్యవహరించే వీలు కలుగుతుంది. ఈ పారదర్శకత తప్పని సరిగా కార్మిక సంఘాలు అనవసర సమ్మెలకు దిగకుండా నిరోధిస్తుంది. అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయమేమంటే ఉభయులూ ముందు ఏర్పరుచుకున్న అభిప్రాయాలతో కాకుండా, స్వేచ్ఛగా, నిజాయితీగా జరిపే సంప్రదింపులతోనే సామరస్య పూర్వక ఒప్పందాలు చేసుకోగలుగుతారు.

9.7.3 కార్మికులు–పరిశ్రమల స్వాధీనం

నూతన పారిశ్రామిక విధానం, ఎన్.ఆర్.జి.ఎఫ్‌లో భాగంగా ఖాయిలా లేదా మూతపడిన పరిశ్రమలను కార్మికులు స్వాధీనం చేసుకొనే వీలు కల్పిస్తుంది. 1985 ఖాయిలా పరిశ్రమల (ప్రత్యేక నిబంధనలు) చట్టం ఈ స్వాధీనతకు చట్ట బద్ధత కల్పిస్తుంది. ఈ చట్టం ప్రకారం ఖాయిలా పడిన ఒక పరిశ్రమను పునరుద్ధరించడానికి ఒక వ్యక్తికి, లేదా ఉద్యోగులు ఏర్పరుచుకొన్న ఒక సహకార సంఘానికి కానీ లీజు ద్వారా స్వాధీన పరచవచ్చు. ఇందుకు సంబంధించిన అవసరమైన చర్యలను బి.ఐ.ఎఫ్.ఆర్ పర్యవేక్షిస్తుంది.

భారతదేశంలో కార్మికులు ఖాయిలా పరిశ్రమలను స్వాధీనం చేసుకోవడం అన్న విషయమే కొత్త. తప్పుడు యాజమాన్య పద్ధతుల కారణంగా ఖాయిలా పడ్డ పరిశ్రమలను రక్షించడానికి, ఉత్పత్తిని, ఉద్యోగులను కాపాడడానికి ఇలాంటి స్వాధీనాలు పెరిగే సూచనలు కూడా ఎక్కడా కనపడడంలేదు. అయితే ఇలాంటి కొన్ని దృష్టాంతాలైతే వున్నాయి.

BRAOU

కమానీట్యూబ్స్, కమానీ మెటల్స్ అండ్ అల్లాస్, హోస్ వాచ్ కంపెనీ, (అన్నీ ముంబయ్‌కి చెందిన కంపెనీలు) కలకత్తాలోని న్యూసెంట్రల్ జూట్ మిల్స్‌లను కార్మికులు స్వాధీనం చేసుకున్నారు. పారిశ్రామిక రంగంలో సహకార సిద్ధాంతాల మేరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో కార్మిక స్వీయ యాజమాన్యం పరిశ్రమపై కార్మికుల నియంత్రణకు సమర్థమైన పద్ధతి కాగలదన్నది నిర్వివాదాంశం.

నూతన పారిశ్రామిక విధానాన్ని ఊరికే వ్యతిరేకించడంవల్ల కార్మిక సంఘాలకు ఏమీ రాదన్న విషయం ఇక్కడ గుర్తించాలి. సహచర ఉద్యోగులకు ఉత్త స్వాంతన వచనాలు పలకడం, అడపాదడపా జాతీయ స్థాయి బంద్‌లు, ర్యాలీలు జరపడం ప్రభుత్వం మీద ఏ ప్రభావమూ పడవేయదన్న విషయం గుర్తించగలగాలి. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను సవాల్ చేస్తున్న జాతీయ కార్మిక సంఘాల సమాఖ్య అనుసరిస్తున్న సాంప్రదాయరీతులు (బంద్‌లు, ర్యాలీలు, సమ్మెలు మొదలైనవి) ప్రభుత్వంపై కలిగిస్తున్న స్వల్ప ప్రభావాన్ని గమనిస్తే, ఈ సాంప్రదాయ పద్ధతులు వర్తమానంలో సమర్థరీతులు కాదన్న విషయం ప్రస్ఫుటమౌతున్నది. ఉద్యోగాలకల్పన, ఉత్పత్తులకు ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న పద్ధతులు సరియైనవి కావన్న విషయాలను వెల్లడించడానికి కార్మిక సంఘాలు కొత్త సృజనాత్మక వ్యూహాలు రూపొందించుకోవాలి. ఈ వ్యూహాల్లో ఎన్.ఐ.పి క్రింద అనుమతిస్తున్న కార్మికుల సహకార సంఘాల స్వాధీనతలపై దృష్టి సారించాలి. కనీసం కొన్ని పరిశ్రమలలోనైనా ఉత్పత్తిని, ఉద్యోగాలను కాపాడుకోవడానికి ప్రభుత్వమే కార్మికుల సహకార సంఘాల ఏర్పాటుకు పూనుకోవాలని ఒత్తిడి తీసుకురావాలి. ఇప్పటికే కొన్ని పరిశ్రమల్లో విజయవంతంగా నడుస్తున్న కార్మికసహకార సంఘాల ఉదాహరణను, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వాన్ని ఇందుకు ఒప్పించే ప్రయత్నాలు చేయాలి.

9.8 ముగింపు

నూతన పారిశ్రామిక విధానం కార్మికులపై ప్రభావం తప్పనిసరి కలుగజేస్తుందనే విషయాన్ని ముగింపులో చెప్పుకోవాలి. పాఠ్యాంశం చర్చల్లో ఇదే అంశాన్ని చూశాం. నూతన పారిశ్రామిక విధానం ఒక దశలో మార్కెట్‌ను రెగ్యులరైజ్ చేసే బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకోవడంతో కార్మికుల ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటాయన్న విషయం గమనించాలి. బహుళ జాతి కంపెనీల ప్రవేశం జాతీయ వాణిజ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కార్మికులకు కూడా హాని కలిగించే విషయం. ఎందువల్లనంటే బహుళజాతి సంస్థలు అత్యంత ఆధునాతన యంత్రాలు, బలగాలతో, పరికరాలతో మార్కెట్‌లో ప్రవేశించి తక్కువ కార్మికులతో పని సాగిస్తాయి. ఉన్నత సామర్థ్య సాధనకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశం అవసరమే అయినప్పటికీ, తప్పనిసరి రంగాల్లో మాత్రమే ఇది ప్రవేశ పెట్టాలి. టెలికమ్యూనికేషన్లు, ఉక్కు-లాంటి రంగాల్లో మాత్రమే ఇది అవసరంగా వాడాలి. విచక్షణ లేకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానం పెంచితే కార్మికులు నిరాశ్రయులవుతారు.

కార్మిక సంఘాలు మన దేశంలో గొప్ప వైఫల్యంగా చెప్పవచ్చు. వారి వ్యతిరేకులు నిరాటంకంగా నూతన పారిశ్రామిక విధానం ప్రవేశ పెట్టారంటేనే ఈ వైఫల్యాన్ని అర్థం చేసుకోవచ్చు. ఎందువల్లనంటే కార్మిక సంఘాలు సాంప్రదాయరీతులైన బంద్‌లు, ర్యాలీలు, సమ్మెలు లాంటి కార్యకలాపాలకు మాత్రమే పరిమితమయ్యారు. తక్షణావసరంగా కార్మిక సంఘాలు నూతన పారిశ్రామిక విధానం పరిణామాలను, చెడుగులను కార్మికుల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ఈ విధానాన్ని నిరోధించడానికి ప్రత్యామ్నాయ వ్యూహాలు రూపొందించుకోవాలి. ఒక పరిశ్రమలో ఇలాంటి ప్రత్యామ్నాయ వ్యూహాలతో పనిచేస్తున్న కార్మిక సంఘంగా కమానీ మెటల్స్ అండ్ టూల్స్ కార్మిక సంఘాన్ని ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇలాంటి కార్మికసంఘాలు దేశంలోని అన్ని కార్మిక సంఘాలకు కనువిప్పు కలిగించాలి. అన్ని కార్మిక సంఘాలు నూతన పారిశ్రామిక విధానం పరిధిలో కార్మిక సహకార సంఘాల ఏర్పాటుకు ప్రయత్నాలు చెయ్యాలి.

కార్మికుల భద్రత విషయానికి వస్తే, కార్మికుల వైద్యం, కానుపు సౌకర్యాలు, ప్రమాద బీమా, ఫించను లాంటివే కాదు. ఎవరిని వారు స్వీయ యాజమాన్యంలో పరిరక్షించుకోవడమే ఇప్పటి అసలు భద్రత. అసంఘటిత రంగాలలో

BRAOU

ఎక్కడైతే కార్మికులకు భద్రత ఎక్కువ అవసరమో అక్కడ నిపుణతలు పెంచుకోవడం, సామర్థ్యాన్ని పెంచుకోవడం లాంటి చర్యల ద్వారా కాపాడుకోవాలి. చివరగా నూతన పారిశ్రామిక విధానంలో కార్మిక సంఘాల సమర్థ పాత్ర లేకుండా కార్మికుల ప్రయోజనం నెరవేరడం సాధ్యం కాదు.

9.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానం రాయండి!*

1. 1991 పారిశ్రామిక విధానం మార్పులను, అంతకు ముందరి విధానాల నేపథ్యంలో విమర్శనాత్మకంగా చర్చించండి? కార్మికులపై ఈ విధానాల ప్రభావాన్ని పేర్కొనండి?
2. సాంకేతిక పరిజ్ఞానం ఆధునికీకరణ, స్థాయీకరణలు కార్మికలోకం మీద ప్రతికూల ప్రభావాలు కలుగజేశాయా? అయితే ఎందుకు?
3. నూతన పారిశ్రామిక విధానం ధరలు, వేతనాలపై ఎట్లా ప్రభావం చూపుతున్నది?నూతన పారిశ్రామిక విధానం క్రింద తీసుకున్న వివిధ సామాజిక భద్రతా చర్యలను పేర్కొనండి?

*ఈ క్రింది ప్రశ్నలకు **20** పంక్తులలో సమాధానం రాయండి!*

1. సరళీకృత విధానాల నేపథ్యంలో కార్మికుల విలీనాల హక్కులపై మీ అభిప్రాయం? సమిష్టి బేరసారాలపై 'నోట్' రాయండి?
2. పారిశ్రామిక సంబంధాలపై బహుళజాతి సంస్థల ప్రభావాన్ని క్లుప్తంగా చర్చించండి?

BRAOU

భాగం 10: మహిళలు-మానవ హక్కులు

విషయక్రమం

10.0 ఉద్దేశం

10.1 పరిచయం

10.2 పితృస్వామ్య భావన

10.3 లింగభేద భావన

10.4 లైంగికత భావనలు

10.5 పడుపువృత్తి

10.6 అత్యాచారం

10.7 ముగింపు

10.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

10.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు:

★ మహిళలపై జరుగుతున్న వివిధ అణచివేతలు, మహిళల హీనస్థితికి కారణమవుతున్న రాజకీయ భావనల పరిధి

★ మహిళా స్వేచ్ఛ కోసం రూపొందించిన మానవ హక్కుల పరిధిని అర్థం చేసుకుంటారు.

BRAOU

10.1 పరిచయం

భారతదేశం పాలనాపరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. సమాజంలో మరిన్ని అవకాశాలు, సమదృష్టి, సమాన భాగస్వామ్యం కోసం సమీకృతమౌతున్న నిరసన సమూహాల్లో మహిళలు కూడా ఒకరు. వర్తమాన భారతంలో మహిళా ఉద్యమం, భారత ప్రభుత్వాల మధ్య సంబంధం కూడా ఉద్రిక్తతలకు ఒక కారణం అవుతున్నది. మహిళా ఉద్యమం మరిన్ని ప్రజాస్వామ్య చట్టాల కోసం అవి సరిగా అమలు చేయడం కోసం కొనసాగుతున్నది. ఇప్పటికే మహిళలు అత్యాచార, వరకట్న చట్టాలలో సవరణలు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం, మహిళలకు రిజర్వేషన్లు లాంటి వాటిని సాధించుకోగలిగారు. మహిళల నుంచి వస్తున్న తీవ్ర ఒత్తిడి ఫలితంగా భారత ప్రభుత్వం వారి డిమాండ్లకు లొంగిరాక తప్పడం లేదు. అయితే ఇది ప్రభుత్వం బాధ్యతల కోణంకానీ, మరోకోణంలో అణచివేతలు కూడా కొనసాగుతున్నవి. రాజ్యంలో భాగంగా వున్న పోలీసు యంత్రాంగం లాంటివి మహిళల పట్ల వివక్షతోనే కాకుండా, మహిళా వ్యతిరేక వ్యవస్థలుగా వున్నాయని పలు మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనివల్ల మహిళా ఉద్యమం రాజ్యానికి వ్యతిరేకమవుతున్నది. ఇప్పుడు ఆవిర్భవిస్తున్న నూతన ఆర్థిక క్రమం పూర్తిగా భిన్నమైన పరిస్థితిని కల్పిస్తున్నది. భారత ప్రభుత్వం సంక్షేమ రంగం నుంచి తిరోగమిస్తున్నది. ఈ నేపథ్యంలో మహిళా ఉద్యమం, ప్రభుత్వం మధ్య పరస్పర సంబంధాలు క్రమానుగతంగా మారుతున్నాయి. అధ్వాన్న స్థితికి చేరుకుంటున్నాయి.

మహిళా ఉద్యమం ఒకేరకమైన సమూహానికి సంబంధించింది కాదు. మహిళలు వివిధ వ్యూహాలు, కార్యకలాపాలు,

లక్ష్యాలు గల భిన్నమైన సంస్థల్లో సమీకృతమవుతున్నారు. అయితే ఇలాంటి సంఘాలలో, సంస్థలలో దేనిలో వున్నప్పటికీ లైంగిక అణచివేత మాత్రం అందరూ అనుభవిస్తున్న సాధారణాంశం. రాజకీయ సంక్షోభాలు తలెత్తినప్పుడు రాజ్యం లైంగిక హింసలకు పాల్పడుతుందని పరిశీలనల్లో వెల్లడయింది.

ఇలాంటి పరిస్థితుల్లో మానవ హక్కుల ఉద్యమం రాజ్యాధికారం, మహిళా స్వేచ్ఛలకు మధ్య వారధిగా చారిత్రిక పాత్ర పోషించాల్సి వుంది. మహిళా హక్కుల పరిరక్షణకు బలమైన మానవ హక్కుల ఉద్యమం నిర్మాణానికి మహిళలకు సంబంధించి ప్రత్యేక సమస్యలు చేపడ్తున్న మానవ హక్కుల భావనలను ప్రశంసించవచ్చు.

10.2 పితృస్వామ్య భావన

పితృస్వామ్యం లైంగిక ఆధిపత్యానికి ఒక రూపం. పడుపువృత్తి, అత్యాచారాలకు సంబంధించిన హింసాత్మక చర్యలకు చట్టబద్ధత, బలం చేకూర్చే వ్యవస్థను, భావనలను అవగాహన చేసుకోవచ్చు. అది సులభమే. కానీ పితృస్వామ్య భావనలపై మాత్రం భిన్నాభిప్రాయాలు, వాదనలు వున్నాయి. ఈ నమూనాను సరిగ్గా అవగాహన చేసుకోక పోవడానికి కారణాలు ఈ వ్యవస్థ ఉనికి, దానిపైవున్న విశ్వాసం, ఇది చారిత్రిక స్వభావం కలిగి వుండడంగా చెప్పవచ్చు. అందువల్ల పితృస్వామ్యాన్ని మహిళలు భిన్న అభిప్రాయాలు, ప్రత్యేకతలు పరిగణనలోకి తీసుకోకుండానే ఏకసూత్రంగా అవగాహన చేసుకుంటున్నారు. అందువల్ల పితృస్వామ్యం అనగానే కేవలం పురుషుల ఆధిపత్యం అన్న భావనకు మాత్రమే పరిమితమై ఆలోచించకూడదు. పితృస్వామ్యంపై వివిధ అభిప్రాయాలను, నిర్వచనాలను తప్పనిసరి పరిగణనలోకి తీసుకోవాలి.

గెర్డాలెర్నర్ ప్రకారం పితృస్వామ్యం అన్న పదంలో సంకుచిత అర్థం స్ఫురిస్తున్నది. ర్యాడికల్ స్త్రీవాది కాటెమిల్లెట్ 'పురుషాధిక్యతకు పితృస్వామ్యం బహిరంగ చిహ్నం' అన్నారు. షులామిత్ ఫైర్‌స్టోన్ ప్రకారం, పితృస్వామ్యం స్వతంత్ర్య ప్రాథమిక వ్యవస్థ. చారిత్రిక జీవ సంబంధమైన వర్గంగా ఆమె స్త్రీ, పురుష భేదాన్ని అభివర్ణించారు. ఈ భావన ప్రకారం ఎక్కడైతే చారిత్రికంగా స్త్రీలు, పురుషులకన్నా తక్కువ అన్న భావన వుందో అక్కడ పితృస్వామ్యం ఒక సార్వత్రిక అణచివేత పద్ధతిగా చూడవచ్చు.

పితృస్వామ్యం చారిత్రిక ప్రాధాన్యతగల ఒక ప్రత్యేక వ్యవస్థగా మార్క్సిస్టు స్త్రీవాదులు భావిస్తారు. మాక్‌డోనా హారిసన్‌లు పితృస్వామ్యానికి రెండు కోణాలున్నాయని అంటారు. ఒకటి. ఒక స్త్రీకి ఒకే పురుషుడు అన్న పెళ్ళి పద్ధతిలో లింగభేదానికి సంబంధించిన ఆధిపత్యం, సంతానోత్పత్తిపై నియంత్రణ. రెండవది. ఆస్తి, శ్రమను లింగభేదంతో విభజించడం ద్వారా స్త్రీలు ఆర్థికంగా ఆధారపడేట్టు చేయడమే పితృస్వామ్య లక్షణాలు అని వారు అంటారు. ఉత్పత్తి విధానమే అంతిమంగా పితృస్వామ్య సంబంధాలను నిర్ణయిస్తాయని వారి వాదన అసలు సారాంశం. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అనుగుణమైన రూపంలో పితృస్వామ్య సంబంధాలు వుంటాయి. పితృస్వామ్యంలో మహిళల స్థితిని అంతిమంగా వారి వర్గ పరిస్థితులే నిర్ణయిస్తాయన్నది మార్క్సిస్టు స్త్రీవాదుల అభిప్రాయం.

ఉదారవాద స్త్రీవాదులు మహిళల అణచివేతకు మూలకారణం ఒకటిగా భావించదు. మహిళల దురవస్థ వారి లింగ ప్రవృత్తిమీద, సమాజంలో మహిళలపై వున్న ద్వేషంమీద ఆధారపడి వుంటుందని వారు భావిస్తారు. ఉదారవాద స్త్రీవాదులు రాజ్యము, తమ లక్ష్యాలకు మధ్య సర్దుబాటు, రాజీ పద్ధతులకోసం ప్రయత్నిస్తారు. అయితే ఉదారవాద స్త్రీవాదుల రాజీ ధోరణి, పురుషుల వెనక నిలుచుని, పరిమిత సమాన హక్కులు కోరడం, వర్గ సమాజాన్ని శ్రమలో లింగ విభజనను, కుటుంబ నిర్మాణాన్ని ప్రశ్నించక పోవడం మిత ప్రయోజనాలు మాత్రమే కలిగిస్తుందని మహిళల సాధికారతకు సంబంధించి కూడా ఇది పరిమిత ప్రయోజనాలు చేకూరుస్తుందని అంటారు.

ఈ చర్చ తర్వాత పితృస్వామ్యం ఏకశిలా సదృశ్యమైంది కాదని, అట్లాగే అభేద్యమైంది కూడా కాదన్న విషయం బోధ పడ్తుంది. ఏ సమాజంలోనైనా అనేక విషయాలు పనిచేస్తాయి. ఈ విషయాలన్నీ సమాజంలో మహిళల స్థితిగతులను ప్రభావితం చేసే అవకాశం వుంది. ఉదాహరణకు భారతదేశంలో కులం, వర్గం లాంటివి కూడా స్త్రీల స్థితిగతులను

BRAOU

ప్రభావితం చేసే అంశాలు. భారతదేశంలో పితృస్వామ్యాన్ని అర్థం చేసుకోవడానికి సిల్వియా వాల్బీ నిర్వచనం సరిగ్గా సరిపోతుంది. పితృస్వామ్యం ఒక సామాజిక నిర్మాణాలలో ఒక వ్యవస్థగా మహిళలను పురుషులు దోపిడీ చేయడం, అధికారం చెలాయించడం వుంటాయి. ఆమె పేర్కొన్న సామాజిక నిర్మాణం అన్న విషయం ఇక్కడ ప్రధానమైనది. ఎందుకంటే స్త్రీల మీద కొనసాగుతున్న అణచివేత శరీర సంబంధమైన జీవ లక్షణాలకు సంబంధించింది కాదని ఆమె స్పష్టంగా చెప్పారు. పితృస్వామ్యం ఆరు నిర్మాణాలను కలిగి వుంటుందని ఆమె విశ్లేషించారు. ఒకటి పితృస్వామ్య ఉత్పత్తి విధానం, శ్రమకు తగ్గ వేతనాల చెల్లింపులో పితృస్వామ్య సంబంధాలు, పురుష హింస, సాంస్కృతిక సంబంధాలు, స్త్రీ, పురుష లింగ భేదంలో పితృస్వామ్య సంబంధాలు సామూహిక నిర్మాణాలుగా వుంటాయని ఆమె భావన.

10.3 లింగభేద-భావన

మహిళల అణచివేతపై స్త్రీ వాద దృక్పథం పలుకొత్త అవగాహనలను, నిర్వచనాలను కల్పించింది. బౌద్ధికంగా, క్రియాశీలకంగా ఈ అవగాహనలు ఏర్పడ్డాయి. స్త్రీ వాదుల ముఖ్యమైన భావన లింగభేద భావన. లింగ భేదము ఆకార నిర్మాణమన్న నిజాన్ని గుర్తించిన ఫలితంగా ఈ భావన ఉద్భవించింది. కొన్ని ప్రత్యేక చరిత్రల నేపథ్యంలో లింగభేదం జీవ సంబంధమైనదన్న దానికి ప్రతిగా స్త్రీ వాదుల భావనలు తద్విరుద్ధంగా మార్గం చూపాయి. స్త్రీ శరీరమే స్త్రీకి అంతిమం అని ప్రచారం చేసిన జీవ సంబంధ వాదనలను స్త్రీవాదుల విశ్లేషణలు పూర్తిగా తిరస్కరించాయి. కొత్త భావనల ప్రకారం స్త్రీ, పురుష సంబంధాల తీరు తెన్నులను, సామాజిక ప్రవృత్తిని ఆర్థిక సామాజిక, సాంస్కృతిక శక్తులు ప్రభావితం చేస్తాయి అన్న కొత్త దృక్కోణం ఏర్పడింది. అలాగే ఈ ప్రవృత్తి ధోరణులు సంబంధాలు అభేద్యమైనవి కావని కూడా ఈ భావనలు చాటాయి. లింగ భేద సరిహద్దులు కాలానుగుణంగా మారినప్పటికీ వీటిని వాటి ప్రత్యేక రాజకీయ నేపథ్యంలోనే పరిశీలించాలి.

పురుషుల శ్రమ విలువ మారుతుందని, స్త్రీల శ్రమ విలువ మారదన్న లింగభేద రొడ్డకొట్టుడు లింగ విభజన వాదనలను సవాల్ చేసిన స్త్రీ వాదుల అభిప్రాయాల నేపథ్యంలో లింగభేద అధ్యయానికి ప్రాధాన్యత పెరిగింది. కొన్ని పనులు పురుషులకు ప్రత్యేకమైనవి కొన్ని పనులు స్త్రీలకే ప్రత్యేకమైనవి అన్న విభజన పట్ల కొత్తవాదనలు పునరాలోచన రేకెత్తించాయి. లింగభేదం ఆకార సంబంధమైనది కాకుండా ఒక చారిత్రిక శక్తిగా గుర్తించినందువల్ల స్వేచ్ఛ, సమానత్వ భావనలకు సంబంధించి కొత్త దృక్పథాలు ఏర్పడ్డాయి. ఇదే కాకుండా పితృస్వామ్య భావనలను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే స్త్రీ, పురుష భేదాన్ని కూడా సమగ్రంగా అర్థం చేసుకోవాలి.

10.4 లైంగికత భావనలు

సామాజిక నియంత్రణా వ్యవస్థలకు సంబంధించి స్త్రీ, పురుష పాత్ర, ప్రవృత్తిల సాంస్కృతిక రూపం ఉత్పత్తే లైంగికతా భేద భావన. మరో మాటలో చెప్పాలంటే, ఆర్థిక సామాజిక, సాంస్కృతిక, మత సంస్థల సంక్లిష్ట పరస్పర చర్యలే లైంగికతా భేద భావనలను నిర్ధారిస్తాయని చెప్పవచ్చు. ఈ రూపాలన్నీ పునరుత్పత్తి, స్త్రీ, పురుష భావనలను నిర్ణయిస్తాయి. ఏ ఒక్క వ్యవస్థ కూడా ఇందుకు భిన్నంగా వుండజాలదు. చారిత్రిక అనుభవం ప్రకారం భారతదేశంలో వలస పాలన మహిళల అణచివేతకు వ్యతిరేకంగా వివిధ సంస్కరణ ఉద్యమాలకు దారితీసింది. మహిళల అణచివేత రూపాలైన సతి, బాల్య వివాహాలు, విధవల సజీవ దహనం లాంటి దురాచారాల చట్టబద్ధతను వలస పాలన సంస్కరణోద్యమాలు ప్రశ్నించాయి. ఈ ఉద్యమాలన్నీ ఇతర రాజకీయ ధోరణుల మూలంగా పుట్టినవికావని గుర్తుంచుకోవాలి. అయితే ఈ ఉద్యమాలు, వలస పాలకుల చట్టాలు మహిళలను అభివృద్ధి పరిచాయి, అదే సమయంలో వారిని దుస్థితిలోకి కూడా నెట్టాయని స్త్రీవాద చరిత్రకారుల అభిప్రాయం.

బ్రిటిష్ పాలకులు వారి వలస రాజ్యంలో వారి ఆర్థిక, రాజకీయ అధికారం కోసమే భిన్నమైన మహిళా విమోచనను బోధించారన్న విమర్శలు కూడా వున్నాయి. మహిళల సమానత్వాన్ని మొత్తంగా ఒక అంశంగా తీసుకున్నప్పుడు

BRAOU

సంస్కరణోద్యమాలు మహిళల సమానత్వంపై పరిమిత ప్రభావాన్ని మాత్రమే కలుగజేశాయి. అయితే ఈ రెండు ధోరణులు మాత్రం అవశ్యంగా భారత సమాజం ఆధునికీకరణలో ఉత్ప్రేరకాలయ్యాయని చెప్పవచ్చు. ఫలితంగా వచ్చిన ఈ కదలిక సమాజంలో మహిళల పట్ల వున్న భావనలను మార్చివేసింది. ఉన్నత కులాల మహిళలు విద్య, రాజకీయాల్లో ప్రధానంగా కార్యాచరణ సాగించారు. సమాజం కూడా పూర్వపు భావనలను వదిలి ఈ రంగాల్లో మహిళల ప్రవేశాన్ని ఆహ్వానించింది.

కానీ, ఈ ధోరణులేవీ మహిళల అణచివేతకు సాక్ష్యాలుగా నిలిచే శ్రమలో స్త్రీ, పురుష విభజన, ప్రైవేటు ఆస్తి, మత ప్రాతిపదికల మూలకారణాలను కనిపెట్టలేక పోయాయి. ఫలితంగా మహిళలపై అణచివేత మరింత దారుణమైంది. ఈ ధోరణులు మహిళలను వర్తమాన రాజకీయ వ్యవస్తకు అనుగుణంగా మాత్రమే మలిచాయి. ఉన్నత కులాల ఈ భావనల గురించి రాజకీయ పరమైన మరో విమర్శ ఏమిటంటే, ఈ మహిళలు ఉద్దేశించిన మార్పులు అన్యవర్గ మహిళలైన గిరిజన, దళిత్‌లాంటి అల్పసంఖ్యాక సమూహాలను మినహాయించాయి. ఇక్కడ ప్రత్యేకంగా మహిళల హక్కుల రంగంలో ఒక సంస్కరణల ఉద్యమ స్వభావం, ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో దాని వారసత్వాన్ని సోల్చి చూడడం అవసరం. కులీన స్త్రీల ఈ ఉద్యమం కేవలం గౌరవనీయమైన కుటుంబాలకు చెందిన మహిళలకు సంబంధించిన ఉద్యమమే. బ్రిటిష్ ఉదారవాద చట్టాలు, హిందూ సాంప్రదాయ చట్టాల మధ్య వైరుధ్యాలను అందరు హిందువుల గుత్తాధికారంగా లిఖించిన బ్రాహ్మణీయ చట్టాలతో పరిష్కరించజూశారు.

ఇందుకు సంబంధించి 1795 నుంచి 1937 మధ్యలో రూపొందించిన బ్రిటన్ చట్టాలన్నీ ఉదారవాద స్పర్శతో వున్నాయి. మహిళలకు తగిన ప్రాముఖ్యత కల్పిస్తూ ఆరు ప్రధాన సమస్యలకు సంబంధించి బ్రిటిష్ ఏలికలు చట్టాలు చేశారు. అవి ఇవి. 1829లో సతీ సహగమనం నిషేధం. 1856లో విధవా పునర్వివాహ అనుమతి 1795, 1804, 1870లలో ఆడ పిల్లల శిశుహత్యలను నిరోధిస్తూ చట్టాలు చేశారు. 1929లో బాల్య వివాహాల నిరోధ చట్టం. అలాగే మహిళల వారసత్వ హక్కులపై 1874, 1929, 1937లలో చట్టాలు రూపొందించారు. ఈ చట్టాలను, బ్రిటిష్ పరిపాలకులు తీసుకువచ్చిన ఈ మార్పులకు భారతీయ ఉదారవాదులు, సంస్కరణవాదులు మద్దతు పలికారు. అయితే ఈ చట్టాలన్నీ ప్రధాన స్రవంతి మహిళల కోసమే ఉపయోగపడ్డాయి కానీ, దిగువ, అట్టడుగు మహిళలకు నీటివల్ల ప్రయోజనం చేకూరలేదు. తక్కువ కులాల మహిళల సామాజిక అంతస్థును పరిశీలించినప్పుడు మనం ఈ విషయాన్ని గమనించవచ్చు. నివ్వు కులాల్లో ఎక్కువమంది మహిళలకు పునర్వివాహం, విడాకులు, ఆస్తి యజమాన్యాలకు సంబంధించి సాంప్రదాయాలున్నాయికానీ, అడ్డంకులేవీ లేవు. అయితే ఈ వర్గపు మహిళలకు కూడా ఉపయోగపడిన ఒకే ఒక చట్టం వివాహ వయసు చట్టం. 1860లో దీన్ని పదిగానూ 1891లో 12 గానూ మార్చారు. అయితే దీనికి కూడా పరిమితులున్నాయి.

ఈ నేపథ్యంలో భారతీయ మహిళల స్థితిగతులు, చట్టాలకు సంబంధించిన నిజస్థితిని గమనించవచ్చు. ఉదాహరణకు ఈ చట్టాలను తయారు చేయడంలో సామ్రాజ్యవాదం ఎంత పరిమితంగా వ్యవహరించినప్పటికీ వాటివల్ల ఆధిపత్య వర్గాల మహిళలకు మాత్రం కొత్త ద్వారాలు తెరుచుకున్నాయి. ఇవేకాకుండా పైన పేర్కొన్న నయా ప్రజాస్వామ్య చట్టాల స్వరూపాన్ని మార్చివేసిన కొన్ని చట్టాలు కూడా వున్నాయి. బ్రిటిష్ ప్రభుత్వం ఓ వంక వివాహ ఆమోదబిల్లులోనే మరోవంక దాంపత్య హక్కుల నష్ట పరిహార నిబంధన కూడా విధించింది. ఈ చట్టం ప్రకారం ఏ పురుషుడైనా తన లైంగిక కోర్కెలు తీర్చని భార్య మీద దావా వేయవచ్చు. భర్తతో సహకరించనందుకు ఆ భార్యకు జైలు శిక్షకూడా విధించవచ్చు. ఈ చట్టానికి ముందు పెళ్ళయిన బాలిక ఆమె భర్తను ఇష్టపడని పక్షంలో పుట్టింట్లో వుండే అవకాశం వుండేది. అయితే ఆచారాలు అందుకు అంగీకరించేవికావు. దాంపత్య హక్కుల నష్టపరిహార బిల్లు ప్రవేశపెట్టినతర్వాత చచ్చినా బతికినా భర్తతో వుండాల్సిన స్థితి లేదా జైలు శిక్ష దుస్థితి దాపురించింది. స్త్రీల లైంగికతను ఈ చట్టం పురుషులకు దాసోహం చేసింది. అందువల్ల బ్రిటిష్ ఇండియా చట్ట వారసత్వం మహిళల లైంగికత స్వభావంలో మార్పు తెచ్చేవి మాత్రమే ఇవి ఆ ప్రత్యేక సమయంలో వున్న వ్యవస్థల మేరకే రూపొందాయని భావించవచ్చు.

ఇదిపోగా, పడుపు వృత్తి వ్యవస్థ దాని నిర్మాణాత్మక మూలాలు, సైద్ధాంతిక వాదవివాదాలు వ్యవస్థ ఆధిపత్యము,

BRAOU

స్త్రీల లైంగికతల మధ్య లింకును తెలిపే అంశాలు పరిశీలిద్దాం.

10.5 పడుపువృత్తి

భారతదేశంలో పడుపువృత్తి పురాతనమైంది. బ్రిటిష్ వలస పాలకులు మనదేశంలోకి వచ్చేదాకా ఈ వృత్తికి రాజ్యం ఆమోద ముద్ర వుండేది. వలస పాలన కాలంలో ఈ వృత్తి చాలా మార్పులకు లోనయింది. పరిశుద్ధ వర్గాలు ఈ వృత్తిపట్ల చూపిన ద్వేషం కూడా మార్పులకు కారణమయింది. భారత జాతీయ వాదులు, మధ్యతరగతి సంపన్న వర్గం పలు చట్టాలు కుటుంబంపై అధికారం, గుత్తాధిపత్యం కోసం రూపొందించారు. కుటుంబ వ్యవస్థ, పడుపు వృత్తిలకు పరస్పర సంబంధం వుందన్న ఎంగెల్స్ భావన ఇక్కడ వర్తిస్తున్నది. కుటుంబ వ్యవస్థకు ప్రైవేటు ఆస్తి ప్రధాన ప్రాతిపదిక. ఈ ఆస్తికి సరైన రక్త సంబంధీకుల వారసత్వం దక్కడానికి స్త్రీలకు ఒకే వివాహం అన్న దుస్థితి ఏర్పడిందని ఎంగెల్స్ భావన. ఈ కారణం చేత కుటుంబ మహిళలకు ఒక స్త్రీకి ఒకే వివాహం అన్న సూత్రం ఏర్పడి, ఈ కుటుంబ వ్యవస్థకు బయట పురుషులను సంతృప్తి పరచడానికే పడుపువృత్తి లేదా ఇతరేతర మహిళలు అన్న పద్ధతులు రూపొందాయి. అందువల్ల పడుపువృత్తిని ప్రైవేటు ఆస్తి ఉప ఉత్పత్తిగా గుర్తించాలి.

అనంతరకాలంలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అవసరాలు, పూర్తిగా భిన్నమైన లైంగిక విభాగం అవశ్యకతను పెంచాయి. అయితే ఇలాంటి లైంగికతలు కుటుంబం బయట మహిళలు ప్రైవేటు ఆస్తి సాధించే సాధనమయ్యాయన్న బలమైన వాదనలు కూడా వున్నాయి. అందువల్లనే భారత ప్రభుత్వం నిజంగానే పడుపువృత్తిని నిర్మూలించకుండా కేవలం దేవదాసీ వ్యవస్థ వారసత్వం నిర్మూలనకు మాత్రమే ప్రయత్నిస్తున్నది. అంటే ప్రభుత్వ ఉద్దేశ్యం దేవదాసీ వ్యవస్థలో వున్న ఆర్థిక వ్యవస్థ, వారసత్వం, ఆచారాల పేరిట మహిళలకు చెందుతున్న సంపదమీదే ప్రధానంగా దృష్టి పెట్టిందని భావించాలి. అందువల్లే అగ్రకులాల వారికి సంబంధించిన దేవదాసీలను రద్దుచేయడానికి ప్రయత్నించి నిమ్నకులాలలో ఇలాంటి ఆచారాలుగా వున్న మాతంగి, బసివిలను కొనసాగించేట్టు చూశారు. దేవదాసీలలాగా, మాతంగి, బసివిలకు సంపదలులేవు.

దేవదాసీ వ్యవస్థకు వ్యతిరేకంగా మొదటి భారతీయ మహిళా శాసనసభ్యురాలు ముత్తులక్ష్మి రెడ్డి ప్రచారం చేసి అప్పటి 'ప్రెసిడెన్సీ ఆఫ్ మద్రాసు'లో ఒక బిల్లు ప్రవేశ పెట్టారు. గాంధీ జాతీయ వాదం, విక్టోరియాన్ నైతికతల మీద ఆధారపడిన పరిశుద్ధ ఆలోచనా విధానాలు మొత్తం దేశాన్ని ఒక దశలో కుదిపివేశాయి. ముత్తులక్ష్మిరెడ్డి ప్రచారంతోపాటు భారతదేశంలోని బ్రిటిష్ కంటోన్మెంట్‌లలో ప్రవేశపెట్టిన అంటురోగాల చట్టం కూడా ఇందుకు నేపథ్యంగా పనిచేసి సామాజిక పరిశుద్ధ వర్తనా సంఘం, క్రిస్టియన్ మిషనరీలు ఏర్పాటు చేసిన కమిటీలు, మద్యనిషేధ ఉద్యమం దేవదాసీ వ్యవస్థకు వ్యతిరేకంగా పనిచేశాయి. దేవదాసీలు ప్రభుత్వం మద్దతు పూర్తిగా కోల్పోయిన తర్వాత ఒక సాధారణ పడుపుకత్తె స్థాయికి దిగజారారు.

పైన పేర్కొన్న అంశాలనుబట్టి మహిళల లైంగికత, స్థితిగతులన్నీ ఆర్థిక పరిణామాలపై ఆధారపడ్డవిషయాలని చెప్పవచ్చు. ప్రస్తుతం, భారతదేశంలో వ్యభిచార గృహాలలో పదిలక్షలకు పైబడి మహిళలు, పిల్లలు వున్నారని మానవ హక్కుల సంఘాలు (ఆసియా వాచ్) అంచనా. ఈ మహిళలు ఆయా పరిసరాలను, పరిస్థితులను బట్టి బానిసలుగా, దారుణమైన లైంగిక హింసను అనుభవిస్తూ జీవనం గడుపుతున్నారు. భారతదేశంలో నేపాల్ పర్వత సానువుల ప్రాంతాల నుంచి ఎక్కువ మంది వ్యభిచార వృత్తిలో వున్నారు. ముంబాయి వ్యభిచార గృహాల్లో 20 శాతం మంది 18 సంవత్సరాల లోపు యువతులు వున్నారని, వారిలో సగం మంది కన్నా హెచ్.ఐ.వి. సోకిందని అంచనా.

ఆసియా వాచ్ నివేదిక ప్రకారం వ్యభిచార గృహాల యజమానుల నుంచి స్థానిక అధికారులు, పోలీసులు లంచాలు తీసుకుని, వారిని రక్షిస్తున్నారు. ఈ వృత్తిలో వున్న మహిళలు ధైర్యం చేసి పోలీసుల వద్దకు వెళ్ళినా, పోలీసు దాడుల్లో వారిని పట్టుకున్నా వారిని సురక్షిత అదుపులో వుంచుతారు. వ్యభిచార నిర్మూలన కోసం అమలులో వున్న చట్టాలేవీ ఈ వృత్తిని నిర్మూలించలేక పోతున్నాయి. వ్యభిచారం పూర్తిగా సామాజిక సమస్య అని త్రోసివేసి అధికారులు నిర్మూలనా

BRAOU

బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారు. భారత ప్రభుత్వం ఈ సమస్య తీవ్రతను గుర్తించినప్పటికీ అమానవీయ ఈ వృత్తిని నిలువరించడానికి మాత్రం ఎలాంటి తీవ్రమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంలేదు.

10.6 అత్యాచారం

భారతీయ అత్యాచార చట్టాల ప్రకారం అత్యాచారం అంటే ఒక మహిళ ఇష్టానికి వ్యతిరేకంగా ఆమోదం లేకుండా జరిగే లైంగిక సంభోగం. అత్యాచారానికి గురైన యువతి 16 సంవత్సరాలకు లోపు వుంటే ఆమె ఆమోదం వున్నా అత్యాచారంగానే పరిగణిస్తారు. ఒక వ్యక్తి తన భార్య 16 సంవత్సరాల లోపు వున్నప్పుడు సంభోగిస్తే అదికూడా అత్యాచారంగానే పరిగణిస్తారు. ప్రఖ్యాతిగాంచిన మధుర కేసు అప్పటి అత్యాచార చట్టాలను మార్చాలని పలు మహిళా సంఘాలు ఆందోళనలు చెయ్యడానికి కారణభూతమైంది. 1979లో 'మధుర అనే గిరిజన యువతిపై పోలీసు స్టేషన్‌లో పోలీసులు అత్యాచారం జరిపారు. సుప్రీంకోర్టు ఈ కేసులో రెండంశాల ఆధారంగా పోలీసులను శిక్షించలేదు. ఒకటి మధుర అంతకు ముందే తన ప్రియునితో సంభోగంలో పాల్గొనివున్నది. రెండు మధుర తనపై అత్యాచారం జరిగినప్పుడు పోలీసులను ప్రతిఘటించిన సాక్ష్యాలేవీ నిందితులైన పోలీసుల శరీరాలపై లేవు. అత్యాచారం ఇప్పటిదాకా విధి నిషేధాంశంగా వుండేది కానీ ప్రస్తుతం మహిళా ఉద్యమాలకు అది రాజకీయ అంశంగా తయారైంది. అత్యాచార చట్టాలకు సంబంధించి మహిళా ఉద్యమం రెండు ప్రధాన డిమాండ్లు చేస్తున్నది. ఒకటి అత్యాచారం కేసుల్లో నిందితులే తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేలా సవరణ, రెండు అత్యాచారానికి గురైన బాధితురాలి పూర్వ లైంగిక చరిత్ర పరిగణనలోకి తీసుకోరాదన్న సవరణ. అయితే పార్లమెంటులో ఇందుకు సంబంధించి ప్రవేశపెట్టిన బిల్లు వీగిపోయింది. లేదంటే లింగ ప్రాతిపదిక అధికార సంబంధాల్లో ఈ రెండంశాలు విశేష ప్రభావాన్ని చూపి వుండేవి.

ఏది ఏమైనప్పటికీ 1983 అత్యాచార నిరోధ చట్టంలో కస్టడీలో జరిగిన అత్యాచారాన్ని నేర శిక్షాస్మృతి పరిధిలోకి తేవడం, కస్టడీలో అత్యాచార నేరానికి పది సంవత్సరాల శిక్షను పెంచడం, 12 సంవత్సరాల లోపు బాలికలు, గర్భిణీ స్త్రీలపై అత్యాచార నేరానికి కూడా శిక్షాకాలాన్ని 10 సంవత్సరాలు చేయడం లాంటి ముఖ్యమైన సవరణలు చేసారు. మిగతా అన్ని కేసులలో కనీసం శిక్ష ఏడు సంవత్సరాలు చేశారు. అలాగే అత్యాచార కేసు విచారణను ప్రచురించడాన్ని కూడా నేరంగా పరిగణిస్తూ ఇది నాన్ బెయిలబుల్ నేరంగా సవరించారు. ఒక మహిళ మతి స్థిమితం లేనప్పుడు, మత్తులో వున్నప్పుడు, ఈ చర్యవల్ల జరిగే పరిణామాల పర్యవసానాన్ని గమనించే స్థితిలో లేనప్పుడు ఆ మహిళ ఆమోదం పొందినా చెల్లదని సవరణ తెచ్చారు. ఈ సవరణను అత్యాచార నిరోధ ప్రచార విజయంగా భావించవచ్చు. అయితే అత్యాచార కేసుల్లో అసలు సమస్య ఏమిటంటే న్యాయవ్యవస్థ నిర్మాణమే. 1983లో ఈ చట్ట సవరణలు వచ్చినప్పటి నుంచీ అత్యాచార కేసుల్లో శిక్షలు పడడం గణనీయంగా తగ్గిందని స్త్రీ వాద న్యాయవాదులు అభిప్రాయపడుతున్నారు.

అత్యాచారాన్ని లైంగిక దాడిగా పేరుమార్చి చూసినప్పుడు అత్యాచారంలో కోర్కెకన్నా లైంగిక హింసపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించి విచారణ జరపాలి. అప్పుడు స్వజాతి సంపర్కం అత్యాచారం కూడా ఈ పరిధిలోకి వస్తుంది. ఇది ఆమోదం అన్న అంశంపై వున్న సంప్రదాయ వాదనలను త్రోసిపుచ్చుతుంది. అత్యాచారానికి సంబంధించి మహిళల్లో పాతుకుపోయి వున్న నిధి నిషేధాలను చెదరగొట్టే సైద్ధాంతిక పరికరంగా ఇది పనిచేస్తుంది. ఈ పద్ధతిలో విచారణ జరిపితే కేవలం అంగ ప్రవేశం అన్న అంశానికి ప్రాధాన్యత లేకుండా లైంగిక హింసపైనే దృష్టి సారించాల్సి వస్తుంది. అలాగే ఒక మహిళ లైంగిక చరిత్ర, ఆమోదం అన్న అంశాలుకూడా అప్రస్తుతమవుతాయి. మహిళా ఉద్యమకారులు అందుకే ఒక మహిళా జననావయవంలో ఇనుప ఊచలు, సీసాలు దూర్చడం, బలవంతపు అంగప్రవేశం కన్నా దారుణమైన హింసగా వుంటుందని వాదిస్తున్నారు. అయినప్పటికీ లైంగిక చర్య అంటే ఏమిటి? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలు చెలామణిలో వున్నాయి. ఎందువల్లనంటే అత్యాచార భావనలను కూడదోయడానికి, లైంగిక చర్యలకూ, ఇతర చర్యలకూ మధ్యన గల వ్యత్యాసాన్ని చూడడంలో పొరపాటు' పడకుండా వుండడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవలసి వుంది.

ఇందుకు సంబంధించి ఫ్లేవియా ఆగ్నెస్ 'లైంగికదాడి'ని ఈ విధంగా నిర్వచించారు. లైంగిక ఉద్దేశ్యంతో ఒక

BRAOU

మహిళపై జరిపిన దాడిని, ఆ సందర్భంగా జరిగిన హింస మోతాదును బట్టి శిక్ష పడేలా 'లైంగికదాడి'గా భావించాలి. దీని ప్రకారం కన్ను గీటడం నుంచి నగ్నంగా పరేడ్ చేయించడందాకా ఈ చర్యలన్నింటినీ లైంగిక దాడిగా భావించవచ్చు.

10.7 ముగింపు

ఈ పాఠంలో మహిళల విముక్తికి సంబంధించిన రకరకాల లింగభేద సమస్యలను చర్చించాము. మనదేశంతోపాటు ప్రపంచ మంతటా స్త్రీవాద చైతన్యం పరివ్యాప్తి చెందిందన్నదానికి ఈ చర్చ నిదర్శనం. స్త్రీవాద సమస్యలకు సంబంధించి భారతదేశం కూడా మార్పులు చవిచూసింది. తరచుగా సాగే సామూహిక ప్రచారం, ప్రజల నిరసన, ప్రసార సాధనాల ప్రచారం వల్ల విధాన నిర్ణాయక కర్తలుగా మహిళల పాత్ర పెరిగింది. స్త్రీల సమస్యలకు సంబంధించిన సంస్కరణల చట్టాలు వచ్చాయి. అయితే, ప్రభుత్వ విభాగాలు మరింత ప్రజాస్వామ్యంగా వుండడమంటే చరిత్ర తర్కానికి విరుద్ధంగా ఆలోచించడమే. ప్రత్యేకంగా భారతదేశంలో ప్రజాస్వామ్య సంస్థలకు ప్రజలకు అవగాహన కల్పించి, మరింత మెరుగైన పరిస్థితుల కోసం నిర్మాణం చేసే సాంప్రదాయం వుంది. ఈ సంస్థలు చట్టపరమైన సంస్కరణలు, పౌర నిబద్ధత పునరావాస పద్ధతులు, ఆర్థిక సాంఘిక చర్యలను ప్రోత్సహిస్తున్నాయి. భారతదేశంలో ఆకస్మికంగా అయిన బలంగా వేళ్లూనుకుంటున్న మానవ హక్కుల ఉద్యమంలో మహిళా సమస్య కూడా అవశ్యంగా ఒక భాగమవుతుంది. ఇప్పటికీ మహిళా సమస్యలపై కార్యాచరణ పుస్తకాలకే పరిమితమైనప్పటికీ, మహిళా విమోచన సిద్ధాంతాలను, స్త్రీవాద దృక్పథం నుంచి నేర్చుకొని బలోపేతం చేయవలసి వుంది. ఈ పాఠం మానవ హక్కుల కార్యాచరణను, స్త్రీవాద కార్యాచరణను ప్రోత్సహిస్తుంది.

10.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి!

1. పితృస్వామ్యం, లింగభేదము, లైంగికత భావనలను వివరించండి?
2. హింసలో ప్రధాన రూపాలు వివరించి, ఈ హింసా రూపాలకు సంబంధించిన సిద్ధాంతాలను వివరించండి?

ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానం రాయండి!

1. మహిళల గౌరవాన్ని కాపాడడానికి కొన్ని చర్యలు సూచించండి?
2. మానవ హక్కుల ఉద్యమం, స్త్రీవాదాల మధ్య సంబంధం ఏర్పరిచే భావనలేవి?

BRAOU

BRAOU

భాగం 11: దళితులు – మానవ హక్కులు

విషయ క్రమం

11.0 ఉద్దేశం

11.1 పరిచయం

11.2 దళితులు అంటే ఎవరు?

11.3 దళిత మానవ హక్కుల ఉద్యమాలు

11.4 దళిత హక్కులు - భారత రాజ్యాంగం

11.5 దళిత మానవ హక్కులు - చట్టాలు

11.6 ముగింపు

11.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

11.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు :

★ దళితులు అంటే ఎవరు? దళిత మానవ హక్కుల ఉల్లంఘనకు కారణాలు తెలుసుకుంటారు.

★ దళిత మానవ హక్కుల కోసం పోరాడిన వివిధ దళిత ఉద్యమాల చరిత్రను, వాటి తాత్త్విక భూమికను గురించి వివరించగలుగుతారు.

★ భారత రాజ్యాంగంలో దళితుల కోసం పొందుపర్చిన వివిధ చట్టాల గూర్చి అవగతం చేసుకుంటారు.

BRAOU

11.1 పరిచయం

భారత దేశంలోని తాడిత పీడిత ప్రజలను గురించి ముఖ్యంగా వారి మానవ హక్కుల ఉల్లంఘన స్థితిని గురించి విశ్లేషించేటప్పుడు ఇక్కడ నెలకొని వున్న సామాజిక, ఆర్థిక మౌలిక పరిస్థితులను దృష్టిలో వుంచుకొనవలసిన అవసరం వుంది. భారతీయ సమాజానికి కులం, కుల వ్యవస్థ ఒక ప్రత్యేక సమస్య. ఈ దేశ ప్రజలకి కలిసి జీవించే స్వభావం లేకుండా ఈ వ్యవస్థ సమాజాన్ని ముక్కలు ముక్కలుగా విభజించింది. ఇది భారతీయ మనస్తత్వాన్ని సంకుచిత పరిధుల్లోకి నెట్టివేసి, మానవతా తత్త్వాన్ని కలుషితం చేసి, సమాజంలో వున్న అట్టడుగు వర్గాన్ని పశువుల కంటే హీనంగా సామాజిక బహిష్కరణ చేసింది. అంతే కాదు, భారత సమాజంలోని రాజకీయ, ఆర్థిక వైరుధ్యాలకు వాటిలో జరగాల్సిన మార్పుల జాప్యానికి, సాంఘిక పునాది అయిన కులం అత్యంత ప్రభావాన్ని చూపిస్తున్నది.

ఈ దేశంలోని సమాజ వాస్తవికతను జాగ్రత్తగా తరచి చూస్తే ఇది కులం-వర్గం కలయిక వల్ల ఏర్పడిన భూస్వామ్య వ్యవస్థ. ఈ భూస్వామ్య వ్యవస్థ తన ఆధిపత్యానికి, అధికారానికి ప్రజలు ఎదురు తిరగకుండా, వారి మీద నిరంతరం దోపిడీ, హత్యలు, అత్యాచారాలు జరుపుతూ వారిని విభజించి పాలించడానికి ఈ కుల వ్యవస్థ ఒక సాధనమైంది. కుల వ్యవస్థ దానిలో భాగమైన అంటరానితనం చాలా విచిత్రమైనది. వేల సంవత్సరాల నుంచి ఈ వ్యవస్థ అసమానత్వాన్ని, అస్పృశ్యతను రూపొందించుకొని ఉన్నత, మధ్య, అదమ దొంతరలతో కూడిన ఒక సమాజాన్ని నెలకొల్పింది. ఈ

వ్యవస్థ భారతదేశ సమాజాన్ని విభజించినట్లుగా ప్రపంచంలోని ఏ దేశ సమాజం కూడా ఇంత స్పష్టంగా విభజించలేదు. ప్రతి దేశంలోను, ఉన్నవారు, లేని వారు అనే రెండు వర్గాలు వున్నాయి. భారత దేశంలో మాత్రం స్పృశ్యులు, అస్పృశ్యులు అను కులాలుగా విభజింపబడినారు. ఈ అస్పృశ్యత, అంటరానితనం భారత జనాభాలో నాలుగోవంతు అయిన దళితులను కట్టుబానిసలుగా చేసి కఠినమైన నిబంధనలను ఏర్పర్చి, మానవ సమాజ అభివృద్ధికి మూలమైన అన్ని సంపదలకు, సంస్కృతికి, నాగరికతకు, ఉత్పత్తికి భాగంగా కాకుండా, వేల సంవత్సరాలు మానవ సమాజ వ్యవస్థకు దూరంగా నెట్టి వేసింది.

చాతుర్‌వర్ణ వ్యవస్థ ప్రాతిపదికపై నిర్మించబడిన ఈ కుల వ్యవస్థ బ్రాహ్మణులను ప్రథమ స్థానంలోను, క్షత్రియ, వైశ్యులను మధ్య స్థానంలోను, శూద్రులను అధమ స్థానంలోను నిలిపింది. కాలక్రమంలో శూద్రులలోని అట్టడుగు తెగల వారిని పంచములుగా అంటరాని అస్పృశ్యులుగా చిత్రీకరించింది. వీరే కాలం గడుస్తున్న కొద్దీ, అనేక ఉపకులాలుగా విభజింపబడి ఒకరి కంటే మరొకరు తక్కువ కులంగా భావించి తీవ్రమైన అసమానతలకు లోనైనారు. ఈ అంటరానితనాన్ని స్థిరీకృతం చేయడంలో వేదాలు, ఉపనిషత్తులు, పురాణ ప్రబంధాలు, ధర్మ శాస్త్రాలు, కుల వ్యవస్థను కాపాడే మత విశ్వాసాలను, మూఢనమ్మకాలను, కర్మ సిద్ధాంతాలను, పునర్జన్మ భావనను, ప్రజల పైన రుద్ది కఠినమైన నిబంధనలను ఏర్పర్చడంలో ప్రముఖ పాత్ర వహించాయి. అంతే కాదు, ఈ శాస్త్రాలన్నీ ప్రతి కులానికి ఒక నిర్దిష్ట స్థాయిని కల్పించి, ఆ స్థాయిని బట్టి విధులను, వృత్తులను నిర్వచించాయి. ఒక కులం నుండి మరొక కులంలోకి మారడానికి వీలులేదు. కులం పుట్టుక నుండి చావు వరకు మనిషి జీవితంపై ప్రభావాన్ని చూపుతుంది. మానవ జీవితంలోని అన్ని అంశాలను కులం శాసిస్తుంది, నిర్దేశిస్తుంది. తిండి, బట్ట, నివాసం, జీవన విధానం అన్నీ కులాన్ని బట్టి నిర్దేశించబడ్డాయి. కులం కొందరిని అందలం ఎక్కిస్తే మరి కొందరిని అదఃపాతాళానికి తొక్కి వేసింది. కుల వ్యవస్థలో మనిషికిచ్చే విలువ, యోగ్యతను బట్టికాక, పుట్టిన కులాన్ని బట్టి ఇవ్వడం జరుగుతుంది.

ప్రతి మనిషి అభివృద్ధికి, వికాసానికి, హక్కులు, స్వేచ్ఛ అనే రెండు చాలా ముఖ్యమైన సాధనాలు. కాని కులం వీటికి వ్యతిరేకం. భారత సమాజంలోని అట్టడుగు ప్రజలకు, కొన్ని యుగాలు మొదలు విద్య హక్కు, చినే హక్కు, చూసే హక్కు, ఆస్థి హక్కు, వివాహపు హక్కు ఏమీ లేకుండా చేసింది కులం. అంటరాని వారిని పశువుల మాదిరి అమ్మడం, కొనడం, పశువుల శాలలో కట్టివేయడం లాంటివి చరిత్రలో కోకొల్లలు. వేదాలు చదివితే వీరి నాలుకలు తెగ నరికేవారు. వాటిని విన్నా వేడివేడి సీసం చెవిలో పోయాలని ఆజ్ఞాపించింది. సమాజంలోని అట్టడుగు వారు ఉన్నత కులస్థుల ఊరిలోనికి ప్రవేశించే హక్కు లేదు. నిర్ణీత సమయాల్లో మాత్రమే అది కూడా గంట మోగించు కుంటూనో, శబ్దం చేసుకుంటూనో, డప్పు కొట్టడం ద్వారానో ఊరిలోనికి ప్రవేశించాలి. అంటరాని వారి పాదాల ముద్రలు భూమి మీద కన్పించకూడదు. అలా జరిగితే అగ్రకులస్తులు మైలపడిపోతారు. అందుకే అస్పృశ్యులు మొలకు తాటాకు చీపురు కట్టుకొని నడవాలి, ఉమ్మి భూమి మీద వేయకూడదు. అందుకే మెడకు ఒక మట్టి ముంత తగిలించు కోవాలి. అంటరాని వారు హిందువుల దేవుళ్ళను చూడరాదు. ఆలయ ప్రవేశం చేయరాదు. పొరపాటున చూచిన, వెళ్ళినా వారి కనుగ్రుడ్లు పీకివేసే వారు. కాళ్లు విరగొట్టేవారు. అంటరాని వారు చనిపోయిన జంతు కళేబరాలు, కుళ్ళిన వ్యర్థ పదార్థాలు మాత్రమే తినాలి. ఒంటి నిండా బట్టలు వేసుకోకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ అగ్రకులాల వారిని తాకకూడదు. ఒకవేళ తాకితే అగ్రకులపు వారు మైలపడిపోతారు. ఆ మైలను ఆవు పెంటతోనో, ఆవు మూత్రంతోనో శుద్ధి చేసుకోవాలి.

ఈ విధంగా కరడుగట్టిన సాంఘిక అసమానత్వాన్ని వారసత్వంగా అమలు జరుపుతున్న కులం భారత సమాజంలో వేళ్ళూనుకొని ప్రాచీన కాలం నుండి నేటికి కొనసాగుతున్నది. కోట్లాది శ్రామిక ప్రజలు, అందులో భాగమైన అంటరాని వారిని అంతులేనటు వంటి దోపిడికి, దౌర్జన్యాలకు, అణచివేతకు ఈ కులం కారణమైంది.

సమాజంలోని ప్రతి మనిషి తన స్వంత జీవితాన్ని తన ఇష్టప్రకారం జీవించడానికి, తనలోని సృజనాత్మక శక్తిని పెంచడానికి, ప్రతి మనిషి ఇతరులను సమానంగా గౌరవించడానికి, ఇతరుల స్వేచ్ఛను, హక్కులను గుర్తించడమే ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క ముఖ్యలక్షణం. కుల వ్యవస్థ ఈ లక్షణాలను వ్యతిరేకిస్తుంది. కుల వ్యవస్థ సమానత్వాన్ని గుర్తించదు. సమాన అవకాశాలను పొంది జీవితంలో ఎదగడాన్ని కులం నిరోధిస్తుంది. అణచివేత ద్వారా, దోపిడి ద్వారా, ఆధిపత్యం

BRAOU

ద్వారా, సామాజిక వివక్షతను కులం కొనసాగిస్తుంది. కులం అసమానత్వాన్ని ప్రబోధిస్తుంది. కొంత మందిని నిరంతరం బానిసలుగా మార్చి మనిషికున్న మానవతా విలువల్ని, మనిషిగా బ్రతకాలన్న స్పృహని, ఆత్మగౌరవ చైతన్యాన్ని కులం సహించదు. అంటరాని వారి మానవ హక్కులకు, స్వేచ్ఛకు కులం ఒక ప్రతీఘాతక శక్తి

11.2 దళితులు అంటే ఎవరు?

భారత సమాజంలో ప్రస్తుతం ''దళితులు'' అని పిలువబడుతున్న వారు వివిధ కాలాలలో వివిధ పేర్లతో పిలవబడేవారు. పూర్వకాలం వీరిని అసురులుగా లేదా రాక్షసులుగా, అనార్యులుగా, దస్యులుగా, మ్లేచ్ఛులుగా, చండాలురుగా పిలువబడేవారు. కొంత కాలం వీరిని అంత్యజులుగా, నిమ్నజాతీయులుగా, అస్పృశ్యులుగా, బహిష్కృతులుగా, అంటరాని వారుగా పిలువబడినారు. మరి కొంత కాలం తర్వాత వీరిని అతి శూద్రులుగా పంచములుగా స్వాతంత్ర్య సమర కాలంలో ఎం.కె. గాంధీగారు వీరిని ''హరిజనులు'' అని ప్రచారం చేశారు. స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం వీరిని షెడ్యూల్డు కులాలుగా గుర్తించింది. వివిధ కాలాల్లో వివిధ పేర్లతో పిలువబడిన వీరిని ప్రస్తుతానికి 'దళితులుగా' పిలువబడుతున్నారు.

పాళీ భాషలో 'దళిద' అనగా ''పీడితులు' లేదా పేదలు అని అర్థం. 'దళ్' అనే పదానికి ఇంగ్లీషులో బ్రోకెన్ (విరిగిపోయిన) మరియు క్రష్డ్ (అణచివేయబడిన) అనే అర్థాలు వున్నాయి. తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన తెలుగు నిఘంటువులో 'దళితము' అనగా ఖండింపబడినది, వికసించినది అనే అర్థాలున్నాయి. ''దళిత జాతులు'' అనగా భారత దేశంలో సామాజికంగా పీడింపబడే జాతులు అనే అర్థమున్నది. దళితులు అంటె భారత సమాజానికి అయువుపట్టు అయిన కుల వ్యవస్థ కారణంగా సభ్య సమాజానికి దూరంగా వెలివేయబడి, అస్పృశ్యులుగా జీవిస్తున్న వారు. నీచ, మలిన వృత్తులు చేసుకుంటూ, శారీరక శ్రమపై ఆధారపడి బ్రతుకుతున్న వారు. తరతరాలుగా ఆర్థికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా ఖండింపబడి, నిరంతరం మానసిక వ్యధకు గురై, అగ్రకులాలు చేసే దోపిడికీ, దౌర్జన్యాలకు, హత్యలకు, అత్యాచారాలకు, గురి కాబడిన ప్రజలే దళితులు. దళితులంటే ఒక కులానికిగాని, మతానికిగాని సంబంధించిన వారు కాదు. బానిస వ్యవస్థలో యజమానుల ఉక్కు పాదాలకు గురైన బానిసలు భూస్వామ్య వ్యవస్థలో భూస్వాముల దోపిడికిగురైన వ్యవసాయ కూలీలు, పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడి దారుల దోపిడికి గురైన కార్మికులు, ప్రత్యేకించి సాంఘిక రుగ్మతకు గురైన అంటరాని వారందరూ దళితులే.

B.R.A.O.U

11.3 దళిత మానవ హక్కుల ఉద్యమాలు

దోపిడీ, అణచివేత ఎక్కడ వున్నా వాటిపైన ప్రతిఘటనా చర్య వుంటుంది అనేది మానవ చరిత్ర చెబుతున్న సత్యం. కుల వ్యవస్థ దోపిడీకి అణచివేతకు ఎంత చరిత్ర వుందో, ఆ వ్యవస్థ నిర్మూలన పోరాటాలకు అంతే చరిత్ర వుంది. వేదకాలం నుండి ఈనాటి వరకు రకరకాల రూపాల్లో, రకరకాల పద్ధతుల్లో ఆయా పరిమితులతో సామాజిక సాంస్కృతిక, ఆర్థిక అసమానత నిర్మూలనోద్యమాలు నడుస్తూనే వున్నాయి. మానవ స్వేచ్ఛకోసం గౌరవ ప్రదమైన జీవనం కోసం, ఆత్మగౌరవం కోసం, స్వేచ్ఛా జీవులుగా మనుగడ సాగించడం కోసం, రక్తాలు చిందిస్తూ, ఆత్మతర్పణం చేస్తూ, విముక్తి పోరాటాలను నిరంతరం అలుపెరుగక సాగిస్తూనే వున్నారు.

కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, సమ సమాజం లక్ష్యంగా సాగిన ఉద్యమాల్లో లోకాయుతులు మొట్టమొదట చెప్పుకోదగ్గ వారు. వీరినే కొందరు చార్వాకులని, నాస్తికులని కూడా అంటారు. వీరు దేవుళ్ళకి, కర్మకి, పునర్జన్మకి, కులాన్ని, జన్మను బట్టి మానవులను వర్గీకరించడం ఎదురించి గొప్ప ప్రజా చైతన్య ఉద్యమాలను లేపారు. మనిషిలో మౌలికంగా వున్న స్వేచ్ఛను మానవతా భావాలను మనిషి మనుగడకు అవసరమైన విజ్ఞాన పూర్వకమైన భౌతిక వాద తత్వానికి ఊపిరి నిచ్చారు. వీరి తర్వాత జైనం ప్రబోధించిన మహావీరుడు కూడా స్వేచ్ఛా జీవనానికి మానవతా విలువలకు పాటుపడినాడు. తాత్వికంగా లోకాయుతులు పోరాటం చేస్తే, సాంఘికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా, బౌద్ధులు

పోరాటం చేశారు. మానవులందరూ ఒక్కటేనని బుద్ధుడు ఎలుగెత్తి చాటాడు. సాంఘిక అసమానత్వాన్ని, కుల వివక్షతను, రాజకీయ అధిపత్యాన్ని బౌద్ధులు వ్యతిరేకించారు. మానవతా సుగంధాన్ని పంచే ప్రజా చైతన్యాన్ని ప్రజ్వలింప చేసిన ప్రజా ఉద్యమం బౌద్ధం. అందుకే డాక్టరు అంబేద్కర్ ''బౌద్ధం ప్రించి విప్లవమంత భావగర్భితమైందని'' అన్నారు. స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మానవతా విలువలను ప్రబోధించింది బౌద్ధం. అదే విధంగా మధ్య యుగాల్లో ఉత్తరాన కబీర్, పశ్చిమాన చోకమేళుడు, తూర్పున చైతన్యుడు, దక్షిణాదిన బసవేశ్వరుడు, సాంప్రదాయ ఇస్లాంకు వ్యతిరేకంగా సుఫీ ప్రవక్తలు, వారి వారి పరిధులలో అంటరానితనాన్ని, అస్పృశ్యతను విమర్శించారు. మానవులంతా ఒక్కటేననే భావనను ప్రజల్లో పెంపొందించారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ సహపంక్తి భోజనాలు చేసారు. కులాన్ని నిరసించి, కుల ధర్మాన్ని దుయ్యబట్టి, కులం పునాదుల్ని కొంత మేరకు కదిలించి, పీడిత ప్రజల మానవ హక్కుల కోసం పోరాడిన వారిలో వేమన ఒకరు. వేమనది మానవతా మతము, ఆయన ధర్మం, ప్రేమ వ్యాపకము, సర్వమానవ సౌహార్దము, సార్వజనీన సౌభ్రాతృత్వమును స్థాపించుట ఆయన పరమ లక్ష్యం. బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, ప్రార్థనా సమాజం, క్రైస్తవ మిషనరీలు, పేద ప్రజల ఉన్నతి కోసం కొంత మేరకు కృషి చేశారు. అంటరానితనం, అస్పృశ్యత నిర్మూలనకు, దళితులలో సాంఘిక స్పృహ కోసం వీలైనంత సేవ చేశారు. వీరితో పాటు కొందరు మహారాజులు, సంస్థానాధీశులు, ఉదారస్వభావంతో అంటరాని దళితుల కోసం, పాఠశాలలు నెలకొల్పి వారికి విద్యా, ఉద్యోగ వసతులు కల్పించి, వారి సాంఘిక, ఆర్థిక స్థితిని మెరుగుపర్చి, కొన్ని సంక్షేమ పథకాలను చేపట్టారు. వీరిలో చెప్పుకోదగ్గ వారు బ్రహ్మనాయుడు, షాహుమహారాజ్, పిఠాపురం మహారాజు.

భారతదేశ స్వాతంత్ర్య పోరాట కాలంలో, మహాత్మ జోతిరావు ఫూలే అంటరాని దళితుల మానవ హక్కుల పరిష్కారానికి చేసిన నిర్మాణాత్మకమైన కృషి తర్వాత తరాల వారికి మార్గదర్శకమైంది. పోతులూరి వీరబ్రహ్మం, నారాయణగురు, అయ్యంకళి, పెరియార్ రామస్వామి నాయిక్కర్, గొప్ప సాంఘిక సంస్కరణ విప్లవవీరులు. దళిత మానవహక్కుల కోసం, వారి ఆత్మ గౌరవం కోసం, అస్పృశ్యతకు వ్యతిరేకంగా, మానసిక వికాసాన్ని కోరుతూ, సమసమాజ నిర్మాణాన్ని కాంక్షిస్తూ, నవ జీవనాన్ని చోటిస్తూ వీరు ఉద్యమాలు చేపట్టారు. బుద్ధున్ని, మహాత్మఫూలేను మార్గదర్శకంగా చేసుకొని, స్వాతంత్ర్య పోరాట కాలంలో నిజాయితీగా దళితుల కోసం నిలబడి నిరంతర పోరాటం చేసిన వారు డా. బి.ఆర్. అంబేద్కర్. సభ్య సమాజానికి, చరిత్రకు దూరమైన దళితులను గురించి, భారత దేశ చరిత్ర లోతుల్లోకి పోయి, దళితులకు ఒక సామాజిక చరిత్రను రూపొందించి, దళిత సామాజిక, రాజకీయ, ఉద్యమానికి నాంది పలికారు. కులం పునాదులను పెకలించడానికి కుల నిర్మూలనోద్యమ తాత్త్విక భూమికను నిర్మించారు. అంబేద్కర్ రచించిన అస్పృశ్యులెవరు? శూద్రులెవరు? కులం ఎలా పుట్టింది? కుల నిర్మూలన వంటి గొప్ప గ్రంధాలు భారత దేశ సాంఘిక రాజకీయ, ఆర్థిక వ్యవస్థలో వున్న అసమానత్వాన్ని బయటకు తీసి, సమసమాజానికి ఆయువు పోశారు. ఆయన పరిశోధనలు, దళిత ఉద్యమానికి శాస్త్రీయ క్రమాన్ని నిర్దేశించాయి.

దళిత మానవహక్కుల కోసం 1919లో South borough committee (London) ముందు మొట్టమొదటిసారిగా ఆయన ఒక సాక్షిగా నిలబడి, దళితుల దుర్భర జీవితాన్ని, వారికి కావలసిన కనీస ప్రాథమిక హక్కుల కోసం పోరాడారు. అదే విధంగా 1928లో Indian statutory commission లేదా Simon Commissionముందు దళితుల తరపున గొప్ప సాక్షిగా నిలబడి వారికి కావాల్సిన, రావాల్సిన సాంఘిక ఆర్థిక, రాజకీయ హక్కులను సాధించారు. అంబేద్కర్ చేసిన పోరాట చరిత్రమొత్తం దళిత ఉద్యమానికి ఊపిరై నిలిచింది. భారత రాజ్యాంగ నిర్మాతగా, అంబేద్కర్ చట్టసభల్లో దళిత మానవ హక్కుల కోసం అనర్గళంగా వాదించి, వారి కోసం ఎన్నో చట్టాలు, అధికరణలను తయారు చేసి వాటన్నింటినీ భారత రాజ్యాంగంలో పొందుపర్చడానికి ఆయన విశేషమైన కృషి చేశారు.

11.4 దళిత హక్కులు–భారత రాజ్యాంగం

దళిత ఉద్యమాల ఫలితంగా ముఖ్యంగా డా. అంబేద్కర్ కృషి ఫలితంగా భారత రాజ్యాంగంలో కులాల

BRAOU

వివక్షతను రూపుమాపుటకు, దళిత మానవ హక్కులకు బద్ధశత్రువైన అస్పృశ్యతను నేరంగా పరిగణించటం కోసం, దళితుల రక్షణ కోసం కొన్ని ప్రత్యేక చట్టాలు చేయబడినాయి. అయితే, చట్టాలు అనేవి వివిధ స్థాయిలలో అనగా పంచాయితీ జిల్లా పరిషత్, రాష్ట్ర శాసనసభ, పార్లమెంటులలో వాటికనుగుణంగా ఆయా కాల పరిమితులను బట్టి తయారు చేసుకుంటారు. అయితే వీటన్నింటిలోను, పార్లమెంటులో చేయబడ్డ చట్టాలు, చాలా శక్తిమంతమైనవి. మరి దీని కంటే అత్యంత శక్తిమంతమైనది భారత రాజ్యాంగం. ఈ రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు తొలగించే అధికారం ఎవరికి లేదు, కాకపోతే కొన్ని మార్పులు చేసుకోవచ్చు. దీన్నిబట్టి దళితులకు రాజ్యాంగ పరంగా కల్పించిన హక్కులు చాలా శక్తిమంతమైనవి.

భారత రాజ్యాంగం దళితులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక, విద్యా పరమైన హక్కులను కల్పించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకీ, రాజకీయ ప్రాతినిధ్యానికి, ఆర్థిక అభివృద్ధికి హామీ ఇచ్చింది. భారత రాజ్యాంగం అధికరణ (ఆర్టికల్) 17 ద్వారా అంటరానితనం, అస్పృశ్యత నిర్మూలించబడింది. వీటిని ఏ రూపంలో పాటించినా చట్ట ప్రకారం నేరం, శిక్షార్హమైనది. ఆర్టికల్ 19 ప్రకారం ప్రతి మనిషికి కుల, వర్గ, లింగ భేదం పాటించకుండా సమానంగా భావ ప్రకటనా స్వేచ్ఛను ఇస్తుంది. ఆర్టికల్ 21: ప్రాణరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛా పాలన హక్కులను కల్పిస్తుంది.

ఆర్టికల్ 23 వెట్టిచాకిరిని బలవంతపు చాకిరి చేయించడం, బలవంతంగా వ్యభిచారం చేయించడం ఈ ఆర్టికల్ ద్వారా శిక్షార్హమైనది. మన దేశంలో వెట్టిచాకిరి చేసే వారిలో ఎక్కువ శాతం దళితులే.

ఆర్టికల్ 29 (2) ప్రకారం, ప్రజా ప్రయోజనం, సంక్షేమం కోసం ఏర్పర్చిన రోడ్లను, చెరువులను, బావులను, హోటళ్ళను, వివిద స్థలాలను, దుకాణాలను, షాపులను మొదలైన వాటిలో ఏ విధమైన కుల,వర్గ, లింగ వ్యత్యాసం చూపించరాదు.

వ్యవసాయ కూలీలు, రోజు వారి కార్మికులు, చాలా భాగం దళితులే, వారి శ్రమకు తగిన వేతనం ఇవ్వాలి. అలా ఇవ్వక పోవడం ఆర్టికల్ 43 ప్రకారం నేరం. గౌరవ ప్రదంగా జీవించడానికి అవసరమైన వేతనం పొందే హక్కు ఈ ఆర్టికల్ ఇస్తుంది. ఆర్టికల్ 46 ప్రకారం షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు ఇతర వెనుకబడిన తరగతుల విద్యాపరమైన ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతుంది.

ఆర్టికల్ 16 మరియు 335 ప్రభుత్వ సంస్థలలో దళితుల యొక్క ప్రాతినిధ్యం సమానంగా లేని యెడల వాటిని పంచడానికి హక్కు కల్పిస్తుంది. ఇంకా ఆర్టికల్ 330, 332 మరియు 334 దళితుల కోసం, పార్లమెంట్ లోక్‌సభలోనూ, రాష్ట్ర విధాన సభల్లోను ప్రత్యేకంగా రాజకీయంగా సీట్లు కల్పించబడినవి. ఇవి ప్రతి పది సంవత్సరాలకొకసారి పొడిగించడం జరుగుతుంది.

వీటన్నిటికి మించి జాతీయ స్థాయిలో దళితుల హక్కులను కాపాడే నిమిత్తం భారత రాజ్యాంగం ఒక షెడ్యూల్డు కులాల షెడ్యూల్డు తెగల కమీషన్ (National commission for scheduled casts and scheduled tribes) నియమించబడింది. ఇందులో 11 మందికి మించకుండా సభ్యులు వుంటారు. పై స్థాయిలో ఒక ఛైర్మన్ వుంటారు. ఈ ఛైర్మన్ కేంద్ర కేబినెట్ మంత్రి హోదా కలిగి వుంటారు. మిగతా సభ్యులు రాష్ట్ర కేబినెట్ మంత్రి హోదా కలిగి వుంటారు. ఈ కమీషన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం దళిత మానవ హక్కులను కాపాడడం, ఏ కారణాలను బట్టి దళితులపై అత్యాచారాలు జరుగుతున్నాయో తెలుసుకొని దానికి నివారణోపాయాలను సూచించడం, సమాజంలోని వివిధ రంగాలలో సంభవిస్తున్న మార్పుల దృష్ట్యా, ఆయా అంశాలలో దళితులు కూడా సమానంగా పాలు పంచుకోగలుగుతున్నారో లేదో పరిశీలించి, వారికి సరైన స్థానం ఏర్పడేటట్లు చేయుట ఈ కమీషన్ యొక్క ముఖ్య ఉద్దేశం.

ఈ దేశపు అత్యంత ఉన్నతమైన చట్టం రాజ్యాంగం. ఈ చట్టం ముందు అందరూ సమానులేనని రాజ్యాంగం చెపుతుంది. దళితుల కోసం ఎన్నో ఆదేశాలను పొందుపర్చినప్పటికి, అంటరానితనం అస్పృశ్యత నేరంగా పరిగణించబడినప్పటికీ, వెట్టిచాకిరి నిషేధించబడినప్పటికి దళితులపై అత్యాచారాలు, నిరాటంకంగా జరగటం గమనార్హం.

BRAOU

జాతీయ షెడ్యూల్డు కులాల, తెగల కమీషన్ రిపోర్టు ప్రకారం, 1955 సంవత్సరంలో దేశం మొత్తం మీద 180 అస్పృశ్యతా కేసులు రిజిస్ట్రర్ కాగా, 1976 నాటికి అవి 5108కి పెరిగాయి. 1997 సంవత్సరంలో మొత్తం 1157 కుల వివక్షత కేసులు నమోదయినట్లు తేలింది. ఈ కమీషన్ ప్రకారం 1981 సంవత్సరంలో చంపబడటం, బలవంతంగా దళిత స్త్రీలను మానభంగాలు చేయబడటం, గాయపర్చటం, దాడులు చేయబడటం, అన్నీ కలిపి మొత్తం 28,636 నేరాలు దళితుల మీద చేయబడినవని చెప్పింది. అంతే కాదు, ఇవి 1995 నాటికి 31,433కు పెరిగాయి. దీన్నిబట్టి ఇంకా అంటరానితనం, దళితుల మీద అత్యాచారాలు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని రుజువవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లోని చాలా గ్రామాల్లో అంటరానితనం ఇంకా సజీవంగా కన్పిస్తోంది. ఉన్నత కులస్తుల వీధుల్లో దళితులు సైకిల్ తొక్కకూడదు, చెప్పులు వేసుకుని ఊర్లో తిరగకూడదు, మంచి బట్టలు వేసుకోకూడదు, దేవాలయాలలో ప్రవేశించరాదు. హోటళ్ళలో రెండు గ్లాసుల పద్ధతి ఇంకా అమలులో వుంది. మంగలివారు, రజకులు దళితులకు సేవలను తిరస్కరించడం వంటివి గ్రామాల్లోనేకాక మండల కేంద్రాల్లో సైతం జరుగుతున్నాయి. కులం పేరుతో దూషించడం, అవమానించడం, దౌర్జన్యాలు చేయటం, దళిత ఉద్యోగులకు ఇళ్ళు అద్దెకివ్వక పోవడం, దళిత ప్రజా ప్రతినిధులను విధి నిర్వహణ చేయనీయక పోవడం ఇంకా అమలవుతున్నట్లు వివిధ పరిశీలనలలో తేలింది. దళిత స్త్రీల పరిస్థితి ఇంకా దారుణంగా వుంటున్నది. స్త్రీలు పూలు పెట్టుకోకూడదు, మంచి బట్టలు వేసుకోకూడదు. దళిత స్త్రీ రెండు విధాల దోపిడికి గురవుతున్నది. ఒకటి, సాంప్రదాయాలతో కట్టుబాట్లతో అణచివేయబడిన భారతీయ స్త్రీగా, రెండు దళిత స్త్రీగా సాటి సమాజంలో కనీస మానవ హక్కులకు నోచుకొని అణచివేయబడిన స్త్రీగా దోపిడికి గురవుతుంది.

11.5 దళిత మానవ హక్కులు–చట్టాలు

భారత దేశాన్ని బ్రిటీష్ వారు పాలిస్తున్న రోజుల్లో దళితులపై జరుగుతున్న అత్యాచారాలకు, వివక్షతకు వ్యతిరేకంగా అనేక సాంఘిక ఉద్యమాలు వచ్చినట్లు తెలుసుకున్నాం. ఈ ఉద్యమాల ఫలితంగా అస్పృశ్యత అంటరానితనం పాటించడం నేరం అని అప్పటి ప్రభుత్వం 1850లోనే ఒక చట్టం చేసింది. కానీ ఆ చట్టం అమల్లోకి రాకుండానే అంతమయింది. అయితే స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం, రాజ్యాంగంలో ఎన్నో అధికరణలను (ఆర్టికల్స్) పొందుపర్చింది. వీటిని ఆధారం చేసుకుని దళితుల కోసం ప్రత్యేకంగా కొన్ని చట్టాలు తయారు చేయబడినాయి. అస్పృశ్యత ఏ రూపంలో పాటించినా నేరమని, అస్పృశ్యత పాటించే వారే కాకుండా దానిని ప్రోత్సహించే వారు కూడా నేరస్తులని ఈ చట్టాలు వెళ్ళడించాయి.

దీనిలో భాగంగానే 1955లో అస్పృశ్యత అపరాధాల చట్టం (The Untouchability (offences) Act, 1955) ఏర్పడింది. దీనికి తర్వాత పేరు మార్చి పౌర హక్కుల పరిరక్షణ చట్టం(Protection of Civil Rights Act, 1955) అన్నారు. ఈ చట్టం ద్వారా పౌరహక్కులు అంటే ఏమిటో నిర్వచించడం జరిగింది. అంతేకాక, అంటరాని వాళ్లు అన్న కారణంగా దుకాణాలలోనికి, విశ్రాంతి స్థలాలైన రెస్టారెంట్‌లోనికి, ఫలహారశాలల్లోకి, హోటళ్ళలోకి, ప్రజా వినోద స్థలాలైన సినిమా హాళ్ళకి, జూపార్కులకి, దళితులను కుల వివక్షత కారణంగా రానివ్వక పోవడం చట్టరీత్యానేరం. అలాగే అందరూ ఉపయోగించే బావులు, చెరువులు, కాల్వలు, రహదారులు, స్నానపు ఘట్టాలు, శ్మశానాలు, తదితర వాటిని దళితులకు నిరాకరించడం ఈ చట్టరీత్యా నేరం. ప్రభుత్వ నిధులచే పాక్షికంగా గాని, పూర్తిగా గాని నడుపబడుతున్న ప్రజా సంస్థలను, లేదా ప్రజల ఉపయోగార్థమే అంకితం చేయబడిన హాస్పిటల్స్, విద్యా సంస్థలు, ఎలాంటి వివక్షతను పాటించరాదని ఈ చట్టం పేర్కొన్నది. దళితులు అంటరాని వారు అనే కారణం చేత వారిని ప్రార్థనా స్థలాల్లోకి, గుడుల్లోకి రానివ్వక పోవడం కూడా నేరం.

రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించినందున, దళితులు తమ హక్కులను అనుభవిస్తున్నారన్న కక్షతో ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా గాయపర్చినా, కక్షతో వారి ఆస్తిని ధ్వంసం చేసినా రెండు సంవత్సరాల పైన జైలుశిక్ష విధించబడటమే

BRAO U

కాక జరిమానా కూడా విధించాలని ఈ చట్టం పేర్కొంది. అంటరానివారన్న కారణంగా దళితులను, ప్రజా సంక్షేమం కోసం ఏర్పర్చిన నీటి పంపుల నద్ద నీళ్ళు పట్టుకోనివ్వక పోవడం, అంటరాని వారన్న కారణంగా దళితులచేత బలవంతంగా పాకీ పని చేయమనడం గాని, చనిపోయిన జంతు కళేబరాలను తొలగించమనడం గాని ఈ చట్ట ప్రకారం నేరం.

పౌరహక్కుల పరిరక్షణ చట్టం అమలులో వున్నప్పటికి, దళితుల పట్ల అస్పృశ్యతను పాటించడం, వారిపైన కుల పరమైన దాడులు, అత్యాచారాలు చేయడం అనేవి యదావిధిగా జరుగుతూనే వున్నాయి. ఉదాహరణకు కంచికచర్ల, కారంచేడు, పదిరి కుప్పం, నీరుకొండ లాంటి దారుణమైన సంఘటనలు జరిగాయి. ఒక విధంగా చెప్పాలంటే 1955లో వచ్చిన పౌరహక్కుల పరిరక్షణ చట్టం ద్వారా కొంత వరకు దళితుల స్వేచ్ఛను, వారి మానవ హక్కులను కాపాడి, రక్షించిన మాట నిజమైనా, ఆశించినంత మార్పు జరగలేదన్నది కూడా అంతే నిజం.

అయితే 1989లో భారత ప్రభుత్వం, 1955 చట్టం కంటే ఇంకా కట్టుదిట్టమైన చట్టాన్ని ఒకటి తయారు చేసింది. ఈ చట్టం 1955 చట్టంలోని లొసుగులను సవరించడమేకాక, దళితులకు విస్తృతమైన హక్కులను కల్పించింది. దీనినే షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల (అత్యాచారాల నిరోధక) చట్టం, 1989 (The Scheduled castes and scheduled Tribes (prevention of Atrocities) Act, 1989) అని పిలువబడుతున్నది. ఈ చట్టం జమ్మూకాశ్మీర్ రాష్ట్రానికి మినహా మొత్తం భారత దేశం అంతటికి వర్తిస్తుంది. 1989 సెప్టెంబర్ 11లో ఈ చట్టానికి భారత రాష్ట్రపతి ఆమోదపు ముద్ర లభించింది. 1990 జనవరి 30 నుండి ఈ చట్టం అమలులోనికి వచ్చింది.

ఈ చట్టంలో మొత్తం 23 సెక్షన్లు వున్నాయి. భారత రాష్ట్రపతి ఏఏ కులాల్ని, తెగల్ని షెడ్యూల్డు కులాలు, తెగలుగా ప్రకటించారో ఆయా కులాలు, తెగల వారిని ఈ చట్టం గుర్తించింది. ఈ చట్టం 'అత్యాచారం' అంటే ఏమిటో విపులంగా నిర్వచించింది. అంతేకాక కొన్ని నేరాలను అత్యాచారాలుగా పరిగణించడమేకాక, నిర్వచనంలో భాగంగా కూడా గుర్తించింది. కాబట్టి ఈ చట్టంలో గుర్తించిన నేరాలు, అత్యాచారాలు, వివరంగా తెలుసుకోవడం అవసరం. దళితులకు బలవంతంగా మూత్రం తాగించడం, అశుద్ధం తినిపించడం వంటి హీనమైన పనులను ఈ చట్టం అత్యాచారంగా పరిగణించింది. అంతేకాక, తినకూడనివి, తాగకూడనివి బలవంతంగా తినిపించినా, తాగించినా ఈ చట్టం ప్రకారం అత్యాచారమే. దళితులను బలవంతంగా బట్టలూడదీయటం, బొట్టుపెట్టి గాడిద మీద ఊరేగించడం వంటివి అగ్రకులాల వారు చేసినట్లయితే ఈ చట్టం నేరంగా గుర్తిస్తుంది. దళితుల భూములను కబ్జా చేయడం, భూ సంస్కరణ ద్వారా దళితులకు కేటాయించిన భూమిని వారికి దక్కనివ్వక పోవడం, ఈ చట్టం అత్యాచారంగా భావిస్తుంది. దళితుల కనీస అవసరాలకి సంబంధించిన హక్కులను అనుభవించనీయక పోవడం, ఓటింగ్ హక్కు వంటి వాటిలో జోక్యం చేసుకోవటం వంటి వాటిని అత్యాచారంగా ఈ చట్టం పేర్కొంది.

దళితుల పైన తప్పుడు కేసులు బనాయించడం, ప్రభుత్వ అధికారులకు వారి మీద తప్పుడు సమాచారం ఇవ్వడం వంటివి కూడా ఈ చట్టం ప్రకారం నేరం. దళిత స్త్రీలను అవమానించడం, వారిని లైంగికంగా బలవంతంగా లొంగ తీసుకోవడం, వారిపైన బలాత్కారం చేయడం, వారిని కొట్టడం వంటివి కూడా ఈ చట్ట ప్రకారం అత్యాచారమే. పైన పేర్కొన్న అత్యాచారాలన్ని శిక్షార్హమైన నేరాలుగా పరిగణించడమేకాక, ఈ నేరాలకి పాల్పడిన వారికి ఆరు నెలల పైన అయిదు సంవత్సరాలకి మించకుండా కఠినమైన జైలుశిక్ష విధించడమేకాక, జరిమానా కూడా ఈ చట్టం నిర్దేశించింది. ప్రజలకుపయోగకరమైన చట్టాలను, ప్రభుత్వాలు ఎన్నో తయారు చేసినా కఠినమైన చట్టాలను ప్రభుత్వాలు తీసుకొచ్చినా వాటిని అమలు చేయడంలో వున్న లోపం వల్ల దళితుల పైన దాడులు, వారి యొక్క మానవ హక్కులు నేటికీ ఉల్లంఘింపబడుతూనే వున్నాయి.

11.6 ముగింపు

భారత సమాజం కులం ఆధారంగా విభజింపబడిన సమాజం. ఈ కులం భారతీయులను కలిసి జీవించే స్వభావం లేకుండా సమాజాన్ని ముక్కలుముక్కలుగా విభజించింది. ఈ వికృతమైన కులం దొంతరలలో ఊరికి దూరంగా

BRAOU

అంటరాని అస్పృశ్యులుగా జీవనం సాగిస్తున్న వారు దళితులు. దళితుల మానవ హక్కుల వికాసానికి, వారి స్వేచ్ఛకు కులం ఒక ప్రతీఘాతుక శక్తి. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం అంటరానితనాన్ని నిషేధించింది. దళితుల కోసం కొన్ని ప్రత్యేక చట్టాలు చేయబడినవి. దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను, స్వేచ్ఛలను ప్రసాదించింది. అయినప్పటికి దళితుల మీద హత్యాకాండలు, అవమానాలు, దాడులు జరుగుతూనే వున్నాయి. డాక్టర్ అంబేద్కర్ అన్నట్టు హక్కులను కాపాడగలిగేవి చట్టాలు కావు. సామాజిక నైతిక చైతన్యం మాత్రమే దళితుల హక్కుల్ని కాపాడగలుగుతుంది. ఈ సామాజిక చైతన్యం కోసం సిద్ధపడితేనే దళిత హక్కులు సురక్షితంగా వుంటాయి అని ఆయన అంటారు. కాబట్టి సామాజిక చైతన్యాన్ని పెంచకుండా ఎంత కఠినమైన చట్టాలు తయారు చేసినప్పటికి కోరుకున్న నవ సమసమాజంను సాధించడం కష్టం. మనిషికి, మనిషికి మధ్యనున్న కులం అనే అమానుషాన్ని అధిగమించి విస్తృత మానవతా దృక్పథాన్ని అవలంబించాలి. అన్ని రకాల అసమానతలను నిర్మూలించుకొని మానవత, సమానత అనే విలువలను ప్రాతిపదికగా చేసుకొని ఒక నూతన సమాజ ఆవిర్భావం కోసం మనమంతా కృషి చేయాలి. దళితుల పట్ల ఒక నూతన మానవతా దృక్పథాన్ని ప్రదర్శించడం నేటి అవశ్యకత.

11.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానం రాయండి!*

1. దళిత మానవ హక్కుల ఉద్యమాల గూర్చి చర్చించండి?
2. భారత రాజ్యాంగంలో పేర్కొన్న దళిత హక్కులను వివరించండి?

BRAOU

భాగం 12: గిరిజనులు–మానవ హక్కులు

విషయక్రమం

12.0 ఉద్దేశం

12.1 పరిచయం

12.2 గిరిజన జనాభా

12.3 గిరిజన భూముల పరాయీకరణ : జాతీయ ధోరణులు

12.4 గిరిజన భూముల పరాధీనత సాధారణ అంశాలు

12.5 నూతన ప్రభుత్వ విధానాలు : ప్రాథమిక హక్కుల నిరాకరణ

12.6 పలచనవుతున్న చట్టాలు: అభివృద్ధి ఏజెండా మళ్ళింపు

12.7 తరలింపు-కుదింపు-రాజ్యాంగ హామీల నిరాకరణ

12.8 ముగింపు

12.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

12.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు:

★ గిరిజన భూముల పరాయీకరణను తెలుసుకుంటారు.

★ గిరిజనుల హక్కులపై ప్రభుత్వ విధానాలు పరిశీలిస్తారు.

BRAOU

12.1 పరిచయం

భారతదేశం భిన్న సంస్కృతుల దేశంగా ప్రసిద్ధి పొందింది. బహుశా వివిధ తెగల గిరిజనుల సంస్కృతి ఈ విభిన్నత్వానికి గణనీయంగా తోడ్పడి వుంటుంది. ఈ గిరిజన జాతులు దేశ సంస్కృతిని సుసంపన్నం చేస్తున్నాయి. అయితే దినదిన ప్రవర్ధమానమవుతున్న ఆధునికీకరణ గిరిజనులకు వారి ప్రాథమిక హక్కులను నిరాకరిస్తున్నది. ఈ విషయాలన్నీ వివరించడానికి ఈ పాఠం ప్రయత్నిస్తున్నది.

12.2 గిరిజన జనాభా

కేవలం 33 మంది మాత్రమే మిగిలివున్న అండమాన్ తెగల నుంచి 50 లక్షల జనాభా వున్న గోండులు, 40 లక్షలున్న సంతాల్‌లు, 35 లక్షలున్న భిల్లులతో కలుపుకుని దేశంలో మొత్తం 527 గిరిజన తెగలున్నాయి. వీరిలో సగానికన్నా ఎక్కువ అంటే 54.7 శాతం ఆదివాసులు మధ్య భారతంలో వున్నారు. మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లను మధ్య భారతంగా పరిగణించాలి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలో కేవలం 0.75 శాతం ఆదివాసీలు నివసిస్తున్నారు. అండమాన్, నికోబార్, లక్ష దీవులలో 0.11 శాతం గిరిజనులు వున్నారు. ఆదివాసీలను,

ఆదివాసేతరులతో పోల్చి చూసినప్పుడు ఈశాన్య ప్రాంతంలో అధికంగానూ, కర్ణాటక, కేరళ, తమిళనాడులతో కూడిన దక్షిణాది ప్రాంతంలో తక్కువగానూ వున్నారు. దాదాపు 87 నుంచి 97 శాతం దాకా గిరిజనులు గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. మొత్తం 183 జిల్లాలలో గిరిజన జనాభా గణనీయంగా వుంది. మధ్య ప్రదేశ్‌లో అత్యధికంగా 153 లక్షల ఆదివాసీలున్నారు. సిక్కింలో అన్ని రాష్ట్రాలకన్నా తక్కువగా 90,000 మంది గిరిజనులు వున్నారు.

ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అతిపెద్ద తెగలుగా వున్న గోండుల జనాభా 50 లక్షలు. ఆ తర్వాతి స్థానం సంతాల్‌లది. వీరు బీహార్, పశ్చిమబెంగాల్, ఒరిస్సాలలో విస్తరించి వున్నారు. గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో నివసించే బిల్లులు మూడవ పెద్దతెగ. ఈశాన్య రాష్ట్రాలలో అధిక సంఖ్యలో 116 తెగలు జీవిస్తున్నాయి. మధ్య భారత ప్రాంతాన్ని కూడా మళ్ళీ దక్షిణ మధ్య ప్రాంతం, ఉత్తర మధ్య ప్రాంతంగా విభజించవచ్చు.

ఆదివాసీలలో 90 శాతం ప్రధాన ఆర్థిక కార్యకలాపం వ్యవసాయమే అయినప్పటికీ, ఇప్పటికీ వేట, అటవీ ఉత్పత్తుల సేకరణ అనే సాంప్రదాయ ఆర్థిక వ్యవస్థను కూడా కొనసాగిస్తున్నారు. ఓంగె, జార్వా, అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించే సెంటి నలైజ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యానాది, చెంచు, ఎరుకల గిరిజన తెగలవారు ఇప్పటికీ ప్రధానంగా, వేట, సేకరణ సాంప్రదాయ పద్ధతులమీదనే పూర్తిగా ఆధారపడి జీవిస్తున్నారు. ఆదివాసీల మాతృభూమిని, ఆక్రమించుకుని అడవులను సహనివేశన ప్రాంతాలుగా మార్చడంతో వారి ప్రాంతాల్లో వారు నిచ్చెన మెట్లమీద దిగువ స్థాయిలో తక్కువ స్థాయిలో జీవించవలసి వస్తున్నది. ఇట్లాంటి స్థితిని అంతర్గత సహనివేశనం అని అనవచ్చు. ఆదివాసీ భూముల్లో 80 శాతం ఖనిజాలు, 72 శాతం అటవీ సంపద, ఇతర సహజవనరుల లభ్యత వుంది. ఈ ప్రాంతాలలోనే 90 శాతం బొగ్గు గనులున్నాయి. మరో మాటలో చెప్పాలంటే దేశం పారిశ్రామికాభివృద్ధి, నగరీకరణకు కావలసిన ప్రాథమిక వనరులన్నీ ఆదివాసీ ప్రాంతాలలోనే వున్నాయి. జాతి సంపదలో అధిక మొత్తం ఆదివాసీ మాతృభూమి నుంచే వస్తున్నప్పటికీ, వారే ఈ సంపద అసలు యజమానులు అయినప్పటికీ, వారిని బానిసలుగా చేసుకుని సంపదలో గిరిజనుల వాటా నిరాకరిస్తున్నారు. అభివృద్ధి పేరిచేసిన చెత్తగా గిరిజనుల పరిస్థితి మారుతున్నది. అడవులు, నదులు, భూమిపై వారి సహజహక్కులు రాజ్యం, ఏలిక వర్గాలైన సంపన్నులు లాక్కుంటున్నారు. గిరిజనులలో 85 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తూ నిరుపేదలయ్యారు. వీరి దారిద్ర్య శాతం అతి అంచనా అనిపించినా అదే కఠిన వాస్తవం.

BRAOU

12.3 గిరిజన భూముల పరాయీకరణ–జాతీయధోరణులు

గిరిజన భూముల సమస్య తీవ్రతకూ గిరిజనుల ఆర్థిక వ్యవస్థ, సమాజంలోని వివిధ రంగాలలో వచ్చిన చారిత్రిక మార్పులకూ సంబంధం వుంది. స్వాతంత్ర్యానంతరం ఈ పరిస్థితుల్లో వచ్చిన వేగవంతమైన మార్పులు భూమి సమస్యలో ప్రధాన పాత్ర వహించాయి. గిరిజన భూ సమస్యపై రాయ్ బర్మన్ సరైన రీతిలో మూడంచెలుగా చెప్పారు. ఆయన మాటల్లో మొదటి క్రమంలో వచ్చే ప్రాంతాల్లో వలస పూర్వపు కాలంలో వున్న భూస్వామ్య ఉత్పత్తి విధానాన్ని భూస్వామ్య లేదా భూస్వామ్య తరహా పెట్టుబడిదారుల కూటమిచే చేజిక్కించుకున్నది. వలస రాజ్యానంతరకాలంలో తొలి ఉత్పత్తి విధానం అమలవుతుండగానే పెట్టుబడి దారీ విధానం త్వరితగతిన దాని స్థానాన్ని ఆక్రమించుకున్నది.

రెండవ క్రమంలో వచ్చే ప్రాంతాల్లో వివిధ రూపాల్లో భూస్వామ్య ఉత్పత్తి విధానం అమలయింది. దీనితో పాటుగా పితృస్వామ్య ఉత్పత్తి విధానం సాదృశ్యమై, అసంపూర్ణంగా అయినా కుల వ్యవస్థ ప్రవేశించింది. ఇక మూడో క్రమంలో వచ్చే ప్రాంతాల్లో వలస పూర్వ, అనంతర కాలాల్లో కూడా పితృస్వామ్య నమూనా ఉత్పత్తి విధానం అమలులో వుంది. ఆర్థిక వ్యవస్థ కొంత భాగం ధనరూపం తీసుకున్నది, మరి కొంత భాగం ధన రహితమైంది. కులవ్యవస్థ ఈ వ్యవస్థతో అప్రస్తుతమైంది.

పైన పేర్కొన్న భిన్నమైన సామాజిక వ్యవసాయక్రమం దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉనికిలో వున్నాయి. అందువల్ల

గిరిజన సమాజంలో సామాజిక సంబంధాలు, ఆర్థిక వ్యవస్థ, సామాజిక సంస్థలలో సంభవించిన మార్పులకు ప్రధాన కారణం రాజ్య ఆర్థిక వ్యవస్థ ప్రవేశమే. ప్రభుత్వం క్రమబద్ధంగా న్యాయేతర ఆస్తి నిర్మాణాన్ని సూత్రబద్ధంగా చట్టబద్ధం చేసింది. ఈ చట్టబద్ధత భూసంబంధమైన ఇతర విధ్వంసాలకు కారణమైంది. ముఖ్యంగా ఇది మొత్తం రెవెన్యూ యంత్రాంగాన్ని ఒకచోట చేర్చి, భూ యాజమాన్యంలో నూతన నిబంధనలను తేవడంతో గిరిజన భూములపై ఒత్తిడి అధికమై ఈ ప్రాంతాలకు గిరజనేతర సమూహాల వలస ఒక క్రమ పద్ధతిలో కొనసాగింది. సహజంగానే దీనికి రాజ్యం అండవుంది. 'సాగుదారు'లుగా ప్రారంభమైన ఈ వలసదారుల సమూహాలు ఒక దశాబ్దం కాలంలోనే రైతాంగవర్గంగా కాని, ప్రభువులు (దొరలు)గానూ అవతరించారు. గిరిజన ప్రాంతాల్లో తరతమ భేదాలలో ఈ తంతు కొనసాగింది. వ్యవస్థీకృతమైన, రాజ్యం, పెట్టుబడుల వల్ల జనాభా ఈణస్థితి ఒక క్రమంలా సాగడంతో గిరిజనుల ప్రాంతీయ పట్టు, మరీ ముఖ్యంగా ఏళ్ళ తరబడి వారి సాగులో వున్న భూములపై వారి పట్టు జారింది. గిరిజనుల భూ యాజమాన్యం తగ్గడం, భూమిలేని గిరిజనుల సంఖ్య పెరగడం క్రింద ఇచ్చిన సమాచారం ద్వారా గమనించవచ్చు.

స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశాబ్ది 1951లో, 1961లో గిరిజనుల బేదఖలు, భూమినుంచి పరాయీకరణ తక్కువగా వుండేది. యు.ఎన్. దేబర్ కమిషన్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పింది.

'సవివరమైన ఆర్థిక సర్వేలు దేశవ్యాప్తంగా జరగనందువల్ల ప్రతి ప్రాంతంలోనూ గిరిజనుల స్వాధీనంలో వున్న భూములను సరిగ్గా అంచనా వేయడం వీలుకాదు'

గిరిజన భూమి బేదఖలు అంచనా వేయడానికి 50వ, 60వ దశకాలలో జాతీయ స్థాయిలో సరైన గణాంక వివరాలు లేవు. అయితే, దేబర్ కమిషన్ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో సర్వేలు జరిపి భూమి కోల్పోయిన, లేని గిరజనుల గణాంక వివరాలు రూపొందించింది. దాని ప్రకారం, 'గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పశ్చిమబెంగాల్, హిమాచల్ ప్రదేశ్, అస్సాం, మహారాష్ట్రలలో క్రమబద్ధంగా, నిలకడగా గిరిజన భూములు పరాధీనం కావడం ప్రారంభమయింది.

1960తో పోల్చినప్పుడు గిరిజనులలో భూమిలేని వారి సంఖ్య తక్కువయింది. కానీ భూమి పరాధీనమయ్యే ధోరణులు మాత్రం ఎక్కువయ్యాయి. దేబర్ మాటల్లో చెప్పాలంటే 'ఇట్లా జరగడానికి కారణాలువున్నాయి. వీటిలో ప్రధాన కారణం గిరిజన ప్రాంతాలలో వాస్తవ పరిస్థితులపైన అవసరమైన జ్ఞానం అధికారులలో లేకపోవడం. రెండవ కారణం సంక్లిష్ట చట్టాలు. మొదట్లో గిరిజన భూముల వివాదాలన్నింటినీ గిరిజన పంచాయితీలు పరిష్కరించేవి. కానీ ఆ తర్వాత గిరిజనులు భరించ జాలని ఖర్చుతో కూడిన కోర్టు వ్యవహారాలు ఈ గందరగోళానికి కారణ మయ్యాయి. భూమిలేని గిరిజనుల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరుగుతూ పోతున్నది. ఈ విషయంలో 1970, 80వ దశకాలలో గిరిజనుల స్తరీకరణ లక్షణాలు రేబర్మన్ ప్రత్యేకంగా వివరించారు. ఆయన మాటల్లో... '1971లో గిరిజన శ్రామికులలో 58 శాతం వ్యవసాయదారులు. 3 శాతం వ్యవసాయ కూలీలు. 9 శాతం ఇతర శ్రామికులు. 1981లో 54,43 శాతం వ్యవసాయదారులు. 32.67 శాతం వ్యవసాయకూలీలు. 1.42 శాతం కుటీర పరిశ్రమలో, రిపేరు, సర్వీసురంగాల్లో శ్రామికులు. 11.48 శాతం ఇతర శ్రామికులు. ఈ విధంగా గిరిజన వ్యవసాయదారుల శాతం బాగా తగ్గింది'.

1981లో జాతీయ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కమిటీ అంచనాల ప్రకారం, 52 శాతం గిరిజనుల భూమి గిరిజనేతరులైన భూస్వాముల, సాగుదారుల వశమై, పరాధీనమైంది. ఆతర్వాత ఇది పెరుగుతూ వచ్చింది. భూమి బదిలీ నియంత్రణ చట్టాలు చాలా రాష్ట్రాల్లో మరీ ముఖ్యంగా 'ఫిఫ్త్ షెడ్యూల్' రాష్ట్రాలలో సమర్థంగా అమలు పరచలేదు. ఈ నియంత్రణ చట్టాల అమలులో అసమర్థత మరోవేపు గిరిజనుల భూమి పరాధీనం కావడానికి బాగా తోడ్పడింది. ఈ విషయమై కమిటీ ఇట్లా వ్యాఖ్యానించింది' భూ బదలాయింపు అనే ప్రక్రియ ప్రతిచోట ఒకే రకంగా లేదు. పట్టణ ప్రాంతాలు అభివృద్ధి అవుతున్న చోట, ప్రధాన రహదారులున్న చోట, ఖనిజాల సముదాయాలున్న చోట ఇది మరీ ఎక్కువగా వుంది. 1981లో స్థితి ఇట్లా వుండగా, 1990లో ఈ స్థితి మరింత క్షీణించింది.

BRAOU

12.4గిరిజన భూముల పరాధీనత–సాధారణ అంశాలు

ఈ సమస్య వివిధ స్థాయిలో వేర్వేరుగా తలెత్తినప్పటికీ గిరిజన భూముల పరాధీనతలో సాధారణ కారణాలు కొన్ని వున్నాయి. అవి ఇవి....

1. సర్వే ఆపరేషన్లు అందుకు తగిన చట్టపరమైన యత్నాల్లో గిరిజనుల భూమి హక్కును నిరాకరించడం.
2. భూ యాజమాన్యం వ్యవహారంలో రాజ్య ఆమోదంలో భూస్వామ్యీకరణ, ఆదివాసీల కుదింపు. భూ వివాదాలను పదే పదే రేపడం గిరజనుల భూమి బేదఖలుకు సంబంధించిన చట్టాలను అమలు పరచక పోవడం ద్వారా ఇది సాధ్యమయింది.
3. 1980 కన్నాముందు గిరిజనుల స్వాధీనంలో, సాగులో వున్న భూములు రిజర్వ్‌డ్ ఫార్ట్స్ క్రిందకు వచ్చినప్పటికీ భూ యాజమాన్య పట్టాలు లాంఛనంగా పెంచాలని 1986లో పార్లమెంటు పేర్కొన్నప్పటికీ, అటవీశాఖ గిరిజన భూమి యాజమాన్యాన్ని తిరస్కరించడం.
4. ఈ ప్రాంతాలకు కొత్త పెట్టుబడిదారీ శక్తుల వలసలను ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రోత్సహించడం, వారికి ప్రైవేటు లేదా ప్రభుత్వ అవసరాల కోసం ఈ ప్రాంతాల్లో భూములు కేటాయించడం, వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ గిరిజనులకు వీటిలో ప్రాతినిధ్యం కల్పించకపోవడం. ఈ కేసులన్నింటిలోనూ 1984 భూసేకరణ చట్టం, 1984 సవరణ చట్ట కవచంగా ఉపయోగపడ్డాయి.
5. చివరగా 'షిప్త్ షెడ్యూల్' ప్రాంతాలలో గవర్నర్ లాంటి రాజ్యాంగ రక్షిత వ్యవస్థలు భూమి పునర్ స్వాధీనం గురించి ఏ మాత్రం పట్టించుకోక పోవడం గిరిజన సలహా మండలులు వారి కార్యకలాపాల్లో పూర్తి అసమర్థతకు లోనుకావడం ఇందుకు కారణాలు.

గిరిజనేతర వ్యక్తులు గిరిజనులను వారి భూమినుంచి బేదఖలు చేసిన వ్యక్తిగత కేసులను జాతీయ స్థాయిలో అంచనా వేశారు. ప్రభుత్వం పనితీరువల్ల, అభివృద్ధి క్రమంలో బేదఖలయిన గిరజనుల గణాంక వివరాలు ఇంకా అంచనా వేయవలసి వుంది.

ఈ తరిమివేత పద్ధతులవల్ల చాలా గిరజన తెగలు వారి ఆవాసాల నుంచి, భూమినుంచి పరాధీనం అయ్యారు. అందువల్ల ప్రగతిశీల రాజ్యాంగ రక్షణకవచాలున్నప్పటికీ దేశవ్యాప్తంగా గిరజనులు పూర్వం వారి స్వంతమైన భూ వనరులమీద వారి హక్కును కాపాడలేకపోయాయి. గిరిజన ప్రాంతాలలో స్వాతంత్ర్యానంతరం భూమి సమస్యలను పరిష్కరించవలసిన న్యాయ యంత్రాంగం తరచుగా ఈ వివాదాల తీర్పులో జాప్యం, నిరోధం, అమలు చెయ్యకపోవడం జరిగాయి.

12.5నూతన ప్రభుత్వ విధానాలు: ప్రాథమిక హక్కుల నిరాకరణ

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకృత విధానాలు ఇప్పటికే గిరిజనులకు వ్యతిరేకంగా అణచివేత పెంపు ఫలితాన్నిచ్చాయి. సహజంగానే ఈ పరిణామం ఈ విధానాల ఫలితంగా ఏర్పడిన ఆర్థిక, సామాజిక పరిణామాలు తగ్గాల్సంటే తీవ్ర ప్రతిఘటన అవసరమని గిరిజనులు గుర్తిస్తున్నారు.

సరళీకృత విధానాల నూతన వాతావరణంలో సామాజిక పరిస్థితులు క్షీణిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో వివిధ విభాగాల చురుకైన పాత్ర ద్వారా ప్రభుత్వం ఆదివాసీలను ప్రపంచీకరణ పరిష్వంగంలోకి లాగుతున్నది. ఇటీవలి కాలంలో ప్రజా కార్యాచరణ, ప్రభుత్వ ప్రాధాన్యతలు మారిన తీరు ఇందుకు సాక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఇప్పుడు సంక్షేమ కార్యకలాపాలు ఎంత మాత్రం ప్రాధాన్యతలో లేకుండా పోయాయి. అదే సమయంలో కొత్త ఉత్పత్తి

BRAOU

పెంపు దృక్పథం వల్ల రాష్ట్రాల సుసంపన్నమైన వనరులు బహుళజాతి కంపెనీలకు సులువుగా ధారాదత్తం అయ్యేక్రమం ప్రారంభమయింది.

ప్రైవేటీకరణ ఆదివాసీల ప్రయోజనాలకు పూర్తిగా హానికరం. ఇటీవలికాలందాకా ఆదివాసీల పోరాటాలన్నీ వారి చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణ కేంద్రంగా జరిగినవే. కేంద్ర సరళీకృత ఆర్థికవిధానాలు ప్రవేశపెట్టిన అనంతరం గిరిజనులు మౌలిక వనరుల అదృశ్యాన్ని అరికట్టడానికి తమ జాతులు పూర్తిగా అంతరించి పోకుండా కాపాడుకోవడానికి కూడా పోరాటాలు చెయ్యవలసిన పరిస్థితికి చేరుకున్నారు. మార్కెట్ శక్తులు సహజవనరులను నిపుణత్వంతో కొల్లగొట్టడం, ప్రజాబాహుళ్యం ప్రయోజనాలను ఫణంబెట్టిన ప్రభుత్వం అంతర్జాతీయ పెట్టుబడి ప్రయోజనాలను కాపాడడం వల్ల గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకమవుతున్నది. ఈశాన్య రాష్ట్రాలను కొన్నింటిని మినహాయిస్తే ఆదివాసీలందరూ దాదాపు ప్రపంచీకరణ వల్ల ప్రభావితమవుతున్నారు. ప్రపంచీకరణ దిశగా ప్రభుత్వం రూపొందించిన విధానాల సారాంశాన్ని ఈ దిగువ ఇస్తున్నాము.

వాణిజ్యం లేదా పారిశ్రామిక కార్యకలాపాల ద్వారా ఆదివాసీ ప్రాంతాలలో మార్కెట్‌కు అనుకూల సంబంధాలు ఏర్పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ క్రమంలో ప్రపంచీకరణ వల్ల కలిగే దుష్పరిణామాలనుంచి ఆదివాసీలకు రక్షణ కల్పించడానికి అవసరమైన చట్ట పరమైన రక్షణను ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఇందుకు సంబంధించి గిరిజన సంక్షేమం, వనరుల రంగంలో ప్రతికూల లక్షణాలను నిరోధించడానికి ఇప్పుడున్న రాజ్యాంగ హామీలు సరిపోవు. ఈ పరిస్థితుల్లో అధికారిక లేదా, రాజ్యాంగ హామీలేకుండా జరిగే పరిణామాలు అంతిమంగా దారుణ ఫలితాలిస్తాయి. వీటి ఫలితంగా ఆదివాసీలు ఈ రకంగా బాధలు పడవలసి వుంది.

1. ప్రతిపాదనలో వున్న ప్రైవేటు వ్యాపారాలు లక్ష్యంగా కొత్త అనుమతుల కోసం తీవ్ర పోటీ.
2. కొరతగావుండే ఆదివాసీల వనరులను కొల్లగొట్టడానికి వేగిరపాటు ప్రయత్నాలు
3. రాజ్యం పాత్ర పూర్తిగా ప్రేక్షకపాత్ర అవుతుంది. ఆదివాసీ రాజకీయార్థిక వ్యవస్థ పరిపాలనాక్రమంలో జాతీయ లక్షణం తరిగిపోవడంతో ఈ వ్యవస్థ క్రమేపీ ఆదివాసీయేతరులకు గులామవుతుంది.
4. పౌర సమాజం బాధ్యత కుచించుకుపోతుంది. రాజకీయ బలగాలు విచ్ఛిన్నమవుతాయి.
5. ఆదివాసీల రక్షణ కోసం పనిచేసే రాజకీయ బలగాల పునస్సమీకరణ జరుగుతుంది.
6. దోపిడీదారుకు వ్యతిరేకంగా కనీస రక్షణ కార్యక్రమం చేపట్టడంలో రాజకీయ, సామాజిక శక్తుల నిస్సహాయత.
7. ఆదివాసీ ప్రాంతాలలో వ్యవస్థీకృతమైన హింసతో ప్రాణానికి విలువలేకుండా, ఆదివాసీల ప్రాణం అక్కరకురానిదిగా తయారవుతుంది.

నిర్మాణాత్మక కూర్పు పథకానికి ఒక ప్రత్యేక సామాజిక, ఆర్థిక విలువ వుంది. ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా విడవక కొనసాగిస్తున్నారు. ఈ ఎజెండాలో మూడు అంశాలున్నాయి. ఎ) స్థానిక తెగల వనరుల అంచనా బి) జనాభా ఆధారితంగా ఆదివాసీల వర్ధన సి) ఎల్లకాలం కొనసాగే ఆదివాసీల కుదింపు క్రమం ఆదివాసీలను మరింత దారుణ పరిస్థితుల్లోకి నెట్టడం. ఈ ఏజెండా కోసం పలుచర్యలు తీసుకున్నారు. అవి ఇవి

1. భూమి, మైనింగ్, ఇతర విలువైన వనరులకు సంబంధించి అమలులో వున్న చట్టాలను పలుచన చేయడం.
2. గిరిజన జీవితాల్లో క్షీణత, స్థాన భ్రంశం.
3. ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు వ్యవస్థీకృతమైన గులాంగిరీ.
4. అభివృద్ధికి సంబంధించిన ప్రత్యేక రంగాల్లో ప్రాధాన్యతా పెట్టుబడులు
5. సామాజిక న్యాయాన్ని నిర్లక్ష్యం చెయ్యడం.

BRAOU

ఈ నేపథ్యంలో గిరిజన భారతంలో పరిస్థితులను ఇంకా వివరంగా తెలుసుకుందాం.

12.6 పలచనవుతున్న చట్టాలు: అభివృద్ధి ఏజెండా మళ్ళింపు

భారతదేశంలో నిర్మాణాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టిన ఫలితంగా జాతీయ చట్టాలు ఒక పద్ధతి ప్రకారం పలచన చేశారు. దీని ఫలితంగా ప్రైవేటు, బహుళజాతి సంస్థలు గిరిజన ప్రాంతాల్లోకి ప్రవేశించే యంత్రాంగం ఏర్పడింది. 1894 భూసేకరణ చట్టానికి 1984లో చేసిన సవరణ ఇందుకు మంచి ఉదాహరణ. 1984 చట్టంలో ప్రభుత్వం అవసరాలకోసం, కంపెనీల కోసం భూమిసేకరణకు అనుమతిస్తూ, సవరణ చేశారు.

ఈ సవరణలో 'కంపెనీ' అన్నపదం 1956 కంపెనీల చట్టం పరిధిలోకి వచ్చే అన్ని కంపెనీలకూ వర్తిస్తుంది. 1860 రిజిస్ట్రేషన్ చట్టం క్రింద రిజిస్ట్రేషన్ చేయించిన 'సంస్థ', సహకార సంస్థలు కూడా ఈ పరిధికి వస్తాయి. దీనితో 'సంస్థ', పరిశ్రమ, సాముదాయిక ప్రయోజనాల పేరిట నాగరికులైన సంపన్నులు గిరిజన ప్రాంతాలకు ఈ సవరణ ప్రవేశ ద్వారమైంది. కంపెనీల పేరిట సంపన్న ప్రైవేటు వ్యక్తులు గిరిజన ప్రాంతాల్లోకి చొచ్చుకుని వచ్చి, గిరిజనులకు వారి భూమి వారికి దక్కకుండా చేశారు. సిమెంటు, పేపర్, కలప, గుజ్జు, మ్యాంగనీసు, అల్యూమినియం, రాగి తదితర పరిశ్రమలు వాటికి సంబంధించిన పారిశ్రామిక వేత్తలు వారి తొలి ఒప్పందాలను తిరిగి రాయించుకోవడం నూతన పరిశ్రమలు స్థాపించడం ద్వారా గిరజన ప్రాంతాల్లోకి చొచ్చుకు వెళ్ళారు. గిరిజన భూముల దురాక్రమణకు మంచి ఉదాహరణ ఒరిస్సా. టాటా, ఇండాల్కో, నార్వేజియన్ బహుళజాతి కంపెనీలకు బాక్సైమహల్ హిల్స్‌ను ప్రైవేటు లీజుకు ఇవ్వడమే ఇందుకు స్పష్టమైన ఉదాహరణ.

ఈ పర్వతాల్లో బాక్సైట్ నిల్వలు అపారంగా వున్నాయి. దీని వల్ల సామాజిక వాతావరణరీత్యా, పర్యావరణం రీత్యా టిక్రి, రాయ్‌గడ్, కాసీపూర్‌లు దారుణంగా దెబ్బతింటున్నాయి. ఈ లీజువల్ల 60,000 మంది గిరజనులను వారి భూములనుంచి ఖాళీ చేయిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద చట్టపరమైన మద్దతు అందిస్తున్నది. ఇతర రాష్ట్రాల్లో ఇట్లాంటి చాలా ఉదాహరణలున్నాయి.

గిరిజన జనాభాను మినహాయించి ప్రతి వ్యవస్థీకృతమైన సామాజిక సంస్థ, సమూహాన్నికైనా సరే! భూమి, అటవీ, మైనింగ్ చట్టాలను పలుచన చేసి అవకాశం ఏర్పరుస్తున్నారు. ఫలితంగా ఇప్పుడున్న పరిస్థితులు మరింత దుర్భరమై వారి వనరులనుంచి, ఆవాసాలనుంచి గిరిజనులను స్థాన భ్రంశం చెందిస్తున్నవి.

12.7తరలింపు, కుదింపు : రాజ్యాంగ హామీల నిరాకరణ

గిరిజనులలో స్థాన భ్రంశం చెందుతున్న వారి సంఖ్య పెరిగి ఆందోళన కరమైన స్థాయికి చేరుకుంటున్నది. ఉనికిలో వున్న పారిశ్రామిక సంస్థలను మరింత క్రీయాశీలం చెయ్యడం, వాణిజ్య, రక్షణ సంస్థలను ఏర్పాటు చేయడం తరలింపు సమస్యను తీవ్రతరం చేశాయి. ప్రభుత్వ సంస్థలు, కొత్త మార్కెట్ సూత్రాలు ఈ క్రమాన్ని పెంచాయి. ఇందుకు సంబంధించిన గణాంక వివరాలు అంతగా అందుబాటులో లేనప్పటికీ గిరిజనులకు సంబంధించి కొన్ని అధ్యయనాలు జరిగాయి. 135 లక్షల మంది గిరిజనులలో 20 శాతం మంది 'అభివృద్ధి' బాధితులయ్యారు. పది లక్షల మంది ఆదివాసీలలో కనీసం ఒకసారి అయినా స్థాన భ్రంశం చెందిన వారు 9శాతం. ఇతర అంచనాల ప్రకారం గిరిజనుల తరలింపు 75 నుంచి 110 లక్షల దాకా వుంటుంది. 17 లక్షలమంది గిరిజనులలో కేవలం 119 కేంద్ర, రాష్ట్ర ప్రాజెక్టుల కారణంగా స్థాన భ్రంశం పొందినవారు ఎనిమిది లక్షలు. 90 శాతం బొగ్గుగనులు ఆదివాసీ ప్రాంతాలలోనే వున్నాయి. గనులవల్ల గడచిన 40 సంవత్సరాలలో కనీసం 21లక్షల మంది నిర్వాసితులయ్యారు. (మరో అధ్యయం ప్రకారం ఈ సంఖ్య 140 లక్షలు) వీరిలో 40 శాతం అంటే 84 లక్షల మంది ఆదివాసీలే. 1987 ప్రభుత్వ నివేదిక ప్రకారం 85 లక్షల మంది ఆదివాసీలు కనీసం ఒకసారైనా నిర్వాసితులయ్యారు. 1991 లెక్కల ప్రకారం అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల

BRAOU

ఇప్పటివరకు మొత్తం భారతదేశ జనాభాలో రెండు శాతం అంటే 185 లక్షల మంది నిర్వాసితులయ్యారు. వీరిలో 75 లక్షల మంది ఆదివాసీలు. మొత్తంగా చూసినప్పుడు జనాభాలో కేవలం 8 శాతంగా వున్న ఆదివాసీలలో అభివృద్ధి ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులైనవారు మాత్రం 50 శాతంగా వున్నారు. 1994లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, జల వనరుల శాఖ ద్వారా రూపొందించిన ముసాయిదా చట్టాల ప్రకారమైనా నిర్వాసితులకు నష్ట పరిహారంకానీ, వారి పునరావాస పథకం కానీ లేవు. పునరావాసం పొందిన ఆదివాసీలు కేవలం 10 నుంచి 15 శాతం వుంటే అదే నిర్వాసితులై పునరావాసం పొందిన గిరిజనేతరులు 30 శాతం దాకా వుంటారు. 1998-2000 సంవత్సరంలో ఏర్పాటు చేయబోయే జాతీయ పార్కులు, వన్య మృగ సంరక్షణ కేంద్రాల ద్వారా మరో పది లక్షల మంది గిరిజనులు నిర్వాసితులవుతారని ఒక అంచనా. వివిధ రాష్ట్రాలలో నిర్వాసితులయిన వారి వివరాలు.

కారణం	ఆదివాసీ నిర్వాసితులు
1. గనులు	14,00,000
2. ఆనకట్టలు	53,00,000
3. పరిశ్రమలు	2,60,000
4. వన్యమృగ సంరక్షణ కేంద్రాలు జాతీయ పార్కులు	5,00,000
5. ఇతరులు	1,50,000
	76,10,000

వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల మూలంగా నిర్వాసితులయిన ఆదివాసీల సంఖ్య 1998 వరకు బాగా పెరుగుతూ వచ్చింది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ బ్యాంకు సాయంతో రూపొందించిన అటవీ అభివృద్ధి పథకం కారణంగా 800 మంది చెంచులు నిర్వాసితులయ్యారు. ఇదే రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం 1,20,000 మంది కోయ, కొండరెడ్డిలను నిర్వాసితులను చేశారు. వీరిలో చాలామంది దట్టమైన అటవీ ప్రాంతాల్లో నివసించేవారే. అప్పర్‌కలాబ్, అప్పర్ ఇంద్రావతి డ్యామ్‌ల నిర్మాణం కోసం ఒరిస్సాలోని కలహండి, కోరాపుట్ జిల్లాలకు చెందిన 8000 మంది ఆదివాసీలను తరలించారు. కోరాపుట్ జిల్లాలోని ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ అల్యూమినియం కంపెనీకోసం 1981లో 300 మంది గిరిజనులను నిర్వాసితులను చేశారు.

మధ్యప్రదేశ్‌లో మారుమూల అటవీ ప్రాంతంలో హోన్‌డేబాంగో రిజర్వాయర్ నిర్మాణం కోసం గిరిజనులను తరలిస్తున్నప్పుడు ముకుళిత హస్తాలతో వారొక ప్రశ్న అడిగారు 'మేము ఎక్కడికి వెళ్ళాలి' అని ఈ ప్రశ్నకు బదులిచ్చే వారెవరూ లేరు. సమీప అటవీ ప్రాంతంలో చివరకు వీరికి ఒక ప్రాంతాన్ని చూపి ప్రభుత్వం బలవంతంగా వారిని ఖాళీ చేయించింది. సత్పూరా నేషనల్ పార్క్‌వద్ద రెండు గ్రామాలను బలవంతంగా ఖాళీ చేయించారు. ఇంద్రావతి నేషనల్ పార్కు సమీప గిరిజనుల హక్కులను కాలరాశారు.

ఉత్తర మధ్య భారతంలో గనులు, పరిశ్రమల కారణంగా లక్షలాది మంది గిరిజనులను నిర్వాసితులను చేశారు. సువర్ణ లేఖ, కోయెల్, కారోలాంటి డ్యామ్‌ల కారణంగా దరిదాపు లక్షమంది నిర్వాసితులయ్యే ప్రమాదం ఏర్పడింది. బీహార్‌లోని గుమలా, పాలము అటవీ ప్రాంతాల్లో రక్షణ శాఖ నేత్రహత్ ఫైరింగ్ రేంజ్ ఆ ప్రాంతాలనుంచి వేలాది మంది గిరిజనులను తరలించే అవకాశం వుంది. ఈ ప్రయత్నాలను అక్కడి గిరిజనులు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. నర్మదా నదిపై ప్రపంచ బ్యాంకు సాయంతో అమలవుతున్న అపఖ్యాతి పాలైన అతిగొప్ప అభివృద్ధి కార్యక్రమంలో 30 మేజర్, 135 మీడియం, 3000 మైనర్ డ్యామ్‌ల వల్ల అటవీ ప్రాంతాలు పెద్ద ఎత్తున మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో గ్రామాలు, భూములు దాదాపు నాలుగు లక్షలమంది ఆదివాసీలు నిర్వాసితులవుతున్నారు.

BRAOU

ఉకాయ్ డ్యామ్ గుజరాత్‌కు కీర్తి తెచ్చిన ఈ డ్యామ్ వల్ల నిర్వాసితులయిన వారు సూరత్‌లో ఒళ్ళమ్ముకొని బతకడం తప్ప వారికి ఎవరిచ్చిందిగానీ, వారు పుచ్చుకున్నదిగానీ ఏమీ మిగలలేదు. రాజస్థాన్‌లోని కదన ప్రాంతంలో నిర్వాసితులయిన గిరిజనులు ప్రతాప్‌గుర్ అటవీ ప్రాంతంలో ఆశ్రయం పొందారు. ప్రభుత్వం దీనికి కూడా అంగీకరించడం లేదు. అటవీ హక్కు, భూమి హక్కు, స్థాన భ్రంశాలకు వ్యతిరేకంగా పోరాటాలు దేశ వ్యాప్తమయ్యాయి. హిమాలయన్ నేషనల్ పార్కు, హిమాచల్ ప్రదేశ్‌లోని రాజాజీ నేషనల్ పార్కు ప్రాంతాలలో ఈ పార్కులు, వాటితోపాటు పారిశ్రామికీకరణ, నగరీకరణల వల్ల అక్కడ పశు సంరక్షకులుగా వుండే ఆదిమ జాతులయిన గద్దీ, గుల్జారీలు తీవ్రంగా ప్రభావితమయ్యారు. ఈ విశాల ప్రాంతాలలోకి వారి ప్రవేశాన్ని నిషేధించారు. దక్షిణాదిలో కర్ణాటకలోని నాగర్‌హోల్ పార్కు, బి. ఆర్ హిల్స్ ప్రాంతాల్లో దరిదాపు పదివేలమంది నిర్వాసితులవుతున్నారు. ప్రపంచ బ్యాంకు సాయంతో చేపడ్తున్న ఈ పార్కుల వద్దకూడా అదే పరిస్థితి. ఇదంతా ప్రభుత్వ ప్రాజెక్టుల వల్ల జరుగుతున్నదే అయినా ప్రైవేటు కంపెనీలది అదనంగా వుండనే వుంది.

12.8 ముగింపు

ప్రస్తుతం అమలవుతున్న లేదా రూపుదిద్దుకుంటున్న వివిధ పథకాల, ప్రాజెక్టుల క్రింద గిరిజనులకు సరైన పునరావాసం, పునరాశ్రయం పట్ల శ్రద్ధ వహించకుండా పరిపాలకులు రాజ్యాంగ బాధ్యత పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా ఆదివాసీల మానవ హక్కుల ఉల్లంఘన పరిపాటిగా మారింది. వారి సహజ వనరులనుంచి వారిని వేరు చేసి బయటి ప్రపంచానికి తరలిస్తున్నారు. సరైన ప్రపంచ జ్ఞానం లేకపోవడం, బతుకు పట్ల సరైన దృక్పథం లేకపోవడం, నిపుణతలలేమి, సరైన నిర్ణయాలు తీసుకోగలిగినంత చాతుర్యం లేమి వల్ల గిరిజనులు బయటి ప్రపంచంలో పూర్తిస్థాయి అనాధలుగా మిగులుతున్నారు.

12.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానం రాయండి!*

1. భారతదేశంలో గిరిజనుల భూమి పరాయీకరణను చర్చించండి?
2. గిరిజనుల కోసం ఏర్పరచిన ప్రభుత్వ విధానాలను చర్చించి, వారి ప్రాథమిక హక్కుల నిరాకరణను పరిశీలించండి?
3. గిరిజన నిర్వాసిత సమస్య, వారికుదింపును చర్చించండి?

BRAOU

భాగం 13: బాలలు – మానవ హక్కులు

విషయక్రమం

13.0 ఉద్దేశం

13.1 పరిచయం

13.2 విధానాల ఆవిర్భావం

13.3 బాలల హక్కుల ఒడంబడిక

13.4 బాలల హక్కుల సదస్సు - భారత దేశం - రాజ్యాంగ, చట్ట నిబంధనలు

13.5 భారతదేశంలో బాలల హక్కుల ఉల్లంఘన

13.6 భారత దేశంలో బాల కార్మికులు

- 13.6.1 బాల కార్మికులు ఎవరు?
- 13.6.2 సమస్యలో కోణాలు
- 13.6.3. బాల కార్మిక వ్యవస్థ కారణాలు
- 13.6.4. రాజ్యాంగ, విధాన చట్రం
- 13.6.5 బాలల శ్రమ - చట్ట రక్షణ

13.7 రాష్ట్రాల్లో బాల కార్మిక వ్యవస్థ

13.8 భారత దేశంలో బాల కార్మికుల పరిశ్రమలు

13.9 బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన - ప్రభుత్వ కార్యక్రమాలు

13.10 బాల కార్మికులపై సుప్రీంకోర్టు తీర్పు (1996)

13.11 బాల కార్మికుల వ్యవస్థ కాల్పనిక వాదనలు

13.12 బాల కార్మికుల సమస్య - వ్యూహాలు

13.13 ముగింపు

13.14 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

13.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు:

★ భారతదేశంలో బాలల హక్కుల కమిషన్ ఏర్పాటును గూర్చి తెలుసుకుంటారు.

★ బాలల హక్కుల పరిస్థితి, వాటి ఉల్లంఘనలు పరిశీలిస్తారు.

★ భారతదేశంలో బాల కార్మికుల సమస్యను విశ్లేషిస్తారు.

13.1 పరిచయం

మానవ జీవితానికి బాల్యం పునాది వంటిది. బాలల హక్కులు హామీ పడినట్టయితే మానవ హక్కుల మొదటి అడుగు వేసినట్టే. ఇదే కాకుండా బాలలు వారి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే సాంఘిక రాజకీయ వ్యవస్థల లాంటి ఏ వ్యవస్థనూ కలిగి వుండనందున బాలల హక్కుల' ఉల్లంఘనకే ఎక్కువ అవకాశం వుంది. బాలల హక్కులను ఉల్లంఘించడం మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుంది.

భారత దేశంలో 0 నుంచి 14 ఏళ్ళ వయసు దాకా గల బాలలే భారత దేశం మొత్తం జనాభాలో మూడోవంతు వుంటారు. ఈ లెక్కన భారతావనిలో మూడు కోట్ల ఏడు లక్షల పై చిలుకు జనాభా బాలలే. బాలలు వారి హక్కుల పరిరక్షణకు రాజ్యాంగం హామీ పడడం, చట్టాలు అనేకం వున్నప్పటికీ, బాల్య మరణాల రేటు ఎక్కువగా వుండడం, నిరక్షరాస్యతా శాతం అధికంగా వుండడం, బాల కార్మిక వ్యవస్థ, పోషకాహార లోపం తదితర విషయాలన్నీ బాలల హక్కుల రక్షణకు సరైన జాగ్రత్తలు తీసుకోవటం లేదన్న విషయం వెల్లడవుతున్నది. బాలల హక్కులకు సంబంధించి ప్రపంచ దేశాలు ఏం చేస్తున్నాయి. భారత దేశంలో జరుగుతున్న ప్రయత్నాల గురించి ఈ క్రమంలో తెలుసుకోవాలి. ఏ రంగాల్లో అంశాల్లో బాలల హక్కుల ఉల్లంఘన జరుగుతున్నదన్న విషయాన్ని కూడా తెలుసుకోవాలి. అయితే ఈ పాఠం బాలల హక్కులకు సంబంధించిన పాఠమే అయినప్పటికీ, భారత దేశంలో బాల కార్మికుల విషయంలోనే ఎక్కువ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నందున ఈ అంశాన్ని ప్రత్యేకంగా చర్చించడమైనది.

13.2 విధానాల ఆవిర్భావం

1924లోనే జెనీవా బాలల హక్కుల ప్రకటన ఈ హక్కులపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని చాటింది. 1948లో సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన కూడా బాల్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, తగిన సాయం అందించాలని వెల్లడించింది. ఈ విషయాలనే పౌర, రాజకీయ హక్కుల అంతర్జాతీయ సదస్సు, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కులపై అంతర్జాతీయ ఒడంబడికలోనూ బాలల సంక్షేమంపై కృషి జరిపే అంతర్జాతీయ సంస్థలు, ఇందుకు ఉద్దేశించిన పలు సంస్థలు ఆమోదించాయి. 1959లో ఐక్యరాజ్య సమితి సాధారణ సభ బాలల హక్కుల ప్రకటనను వెలువరించింది. ఇది కాకుండా 1989 నవంబర్‌లో ఐక్యరాజ్య సమితి సాధారణ సభ బాలల హక్కుల ఒడంబడిక (సిఆర్‌సి)ని రూపొందించింది. ఈ ఒడంబడికలో ప్రపంచ స్థాయిలో బాలల హక్కులపై సమగ్ర ప్రణాళిక రూపొందించారు.

BRAOU

13.3 బాలల హక్కుల ఒడంబడిక

సమాజంలోని బాలల బాగు కోసం, బాలల రక్షణ కోసం అంతర్జాతీయ ప్రమాణాల మేరకు రూపొందించిన చర్యల సమాహారమే ఈ ఒడంబడిక. రెండు దేశాలు తప్ప ఈ ఒడంబడికను ఇప్పటి వరకు అన్ని దేశాలూ ఆమోదించాయి.

ఈ ఒడంబడిక బాలలకు సంబంధించి నాలుగు రకాల మౌలిక హక్కులను ప్రతిపాదించింది.

1. మనుగడ హక్కు: ఈ హక్కులో జీవించే హక్కు కూడా ఇమిడి వుంది. అత్యున్నత స్థాయి వైద్య రక్షణ, పోషకాహారం, సరైన జీవన ప్రమాణాలతో జీవనం.

2. రక్షణ హక్కు: అన్ని రకాల దోపిడి నుంచి, వేధింపుల నుంచి అమానవీయ లేదా కించపర్చే ప్రవర్తనల నుంచి సాయుధ సంఘర్షణలు, అత్యవసర పరిస్థితులలో ప్రత్యేక రక్షణ కల్పించే వరకు ఈ హక్కు క్రిందకు వస్తాయి.

3. అభివృద్ధి హక్కు: విద్యా హక్కు, శైశవ దశలో ప్రత్యేక శ్రద్ధ, మద్దతు, సామాజిక భద్రత, విశ్రాంతి హక్కు, సాంస్కృతిక, వినోద కార్యకలాపాల హక్కులు.

4. భాగస్వామ్య హక్కు: బాలల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం, భావ ప్రకటనా స్వేచ్ఛ, సమాచార హక్కు, మతం, చైతన్యం పొందే హక్కుతో పాటు ఈ విభాగంలో సమాజంలో బాలల హక్కుల ఉల్లంఘన జరగకుండా చట్టపరమైన రక్షణ కల్పించడం.

ఈ ఒడంబడికలో మూడు భాగాల్లో 54 అధికరణలు వున్నాయి. మొదటి భాగంలోని 41 అధికరణలు బాలల హక్కులు, రెండవ భాగంలో 42 నుంచి 45 అధికరణలు, మూడవ అధికరణలో 46 నుంచి 54 దాకా వీటి అమలుకు సంబంధించిన అంశాలు వుంటాయి.

13.4 బాలల హక్కుల సదస్సు – భారత దేశం – రాజ్యాంగ చట్ట నిబంధనలు

1992లో భారత ప్రభుత్వం బాలల హక్కుల సదస్సు ప్రతిపాదనలను ఆమోదించింది. దీని ద్వారా మరోసారి బాలల పట్ల నిబద్ధత ప్రకటించుకున్నది. దీనివల్ల భారత ప్రభుత్వం:

★ బాలల హక్కుల సదస్సు నిబంధనల ప్రకారంగా జాతీయ స్థాయిలో రాష్ట్ర స్థాయిలో ఇందుకు ఉద్దేశించిన చట్టాలను సమీక్ష చేసుకోవాలి.

★ ఈ సదస్సు తీర్మానాల అమలు ప్రగతిని అంచనా వేయడానికి తగిన పద్ధతులను అభివృద్ధి చేసుకోవాలి.

★ బాలల హక్కుల సదస్సు అమలు క్రమంలో న్యాయ వృత్తిలో వున్న వారిని, తత్సంబంధిత మంత్రిత్వ శాఖలను, ప్రభుత్వ విభాగాలను, ప్రభుత్వేతర సేవా సంస్థల (ఎన్జీవోలు)ను పాల్గొనేట్టు చర్యలు తీసుకోవాలి.

★ ఈ సదస్సు తీర్మానాలను ప్రచారం చేసి, ప్రజాభిప్రాయాలను నమోదు చేయాలి

★ ఈ సమాచారం నమోదు పారదర్శకమైనది. నిజాయితీతో కూడినదన్న విషయమై హామీ పడాలి.

BRAOU

13.5 భారత దేశంలో బాలల హక్కుల ఉల్లంఘన

బాలల హక్కుల సదస్సు నిర్వచనం ప్రకారం, బాలలు అన్న నిర్వచనం ప్రకారం బాలలు అంటే 18 సంవత్సరాలలోపు వయసు గలవారు. కానీ, భారత దేశంలో బాలల నిర్వచనం వేరువేరుగా వుంది. కార్మిక చట్టాల ప్రకారం బాలలంటే 14 సంవత్సరాలలోపు వారు నేర స్మృతి ప్రకారం ఏడు నుంచి 18 సంవత్సరాల లోపు వారు బాలలు. ఆస్తి, తత్సంబంధిత ఇతర చట్టాల ప్రకారం 18 సంవత్సరాలు. జనాభా లెక్కలు మాత్రం బాలలంటే 14 సంవత్సరాల గడువు నిర్ధారించింది. బాలల వయస్సు నిర్ధారణలో ఒకే నిర్వచనం లేని కారణంగా, విభిన్నంగా వున్న కారణంగా బాలల హక్కుల అమలులో కూడా గందరగోళం వెలకొన్నది. రాజ్యాంగంలోని 15వ అధికరణం ఆచరణలో వివక్ష రాహిత్యాన్ని, కుల, మతాల క్రింద బాలలను విడగొట్టడం, పోషకాహారం, విద్య, మంచి ఆరోగ్యం, నిమ్న వర్గాల పిల్లలకు సంతోషదాయకమైన బాల్యం గురించి పేర్కొన్నప్పటికీ ఎస్.టి., ఎస్.సి. కులాల పిల్లలు, బాలికలు, వీధి బాలలు, వ్యభిచారుల పిల్లలకు ఇవేవీ అందని దుస్థితి నెలకొని వున్నది. గ్రామీణ పేద పిల్లలు, పట్టణ మధ్య తరగతి పిల్లలకు మధ్య విద్యా విధానంలోనే వున్న వివక్ష, భారతీయ అధికార క్రమంతో బాలల మధ్య మరింత వివక్ష పెరుగుతున్నది. ఇదిట్లా వుండగా హిందూ మైనర్ బాలలు, సంరక్షకుల చట్టం 1956, సంరక్షకుల పిల్లలు చట్టం 1890, బాలల న్యాయం చట్టం 1986, తల్లిదండ్రులు, సంరక్షకుల బాధ్యతలను పేర్కొన్న చట్టాలు, జీవించే హక్కు, మనుగడ హక్కుల అభివృద్ధి హక్కులు రాజ్యాంగంలోని అధికరణం 21లో, భారతీయ శిక్షాస్మృతి 317లో, 1994 క్రమబద్ధీకరణ, నివారణ తల్లిదండ్రుల సమస్యా గుర్తింపు పద్ధతుల్లో హామీపడి వున్నాయి. కానీ వాస్తవానికి 1994 సమాచారం ప్రకారమే జీవన హక్కుకు సంబంధించి గ్రామాల్లో వెయ్యి జననాలలో 68 మంది శిశువులు ఏడాదిలోపే చనిపోవడం ఇదే పట్టణ

ప్రాంతాలలో 48 శాతంగా వుండడం తేడాను తెలియపరుస్తున్న అంశం. ఈ మరణాలు సహజంగానే పేదలు, నిర్భాగ్యుల కుటుంబాలలో జరుగుతున్నాయనడం నిర్వివాదాంశం. స్త్రీ, పురుష నిష్పత్తిలో అసమానతలు ఇందుకు సంబంధించిన ఆరోగ్యం, విద్య, పోషకాహారం, బాలికలకు ఏకాంతం అన్న సమస్యలకు దారి తీస్తున్నది. బాలల మరణాలకన్నా బాలికల మరణాలు ఎక్కువగా వున్నాయి. బాలికలు ఇంకా పిల్లలుగా వున్నప్పుడే వివాహాలు కావడం, గర్భధారణ మరణాలు ఎక్కువగా వుండడం, ఇలాంటి కేసుల్లో 15, 19 ఏళ్ళ మధ్య వయసు గల బాలికలు చనిపోవడం సర్వసాధారణమైంది. ఒక బాలుడు లేదా బాలిక పేరు, జాతీయతలకు రాజ్యాంగంలోని ఒకటవ అధికరణ, 1955 పౌరసత్వ చట్టం (సెక్షన్ 3,4) జనన మరణాల నమోదు (సెక్షన్ 8) హామీపడ్తున్నాయి. ఇవే ఒక బాలుడు లేదా బాలిక తన అస్థిత్వాన్ని కాపాడుకునే, తల్లిదండ్రుల నుంచి విడిపోకుండా వుండే హక్కును కల్పిస్తున్నాయి. కాని దారిద్ర్యం, బాల్య వివాహాలు ఈ హక్కులను కాలరాస్తున్నాయి. కుటుంబం పునరేకీకరణ, విదేశాల్లో వున్న పిల్లల సంక్షేమం, వెనక్కి రప్పించడం లాంటి వాటికి సంబంధించి ఇప్పటి వరకు చట్టాలయితే లేవు. దేశంలో, దేశాల మధ్య జరుగుతున్న పిల్లల దత్తతలో అక్రమాల విషయంలో గగ్గోలయితే వుంది. 1984లో దత్తతకు సంబంధించి సుప్రీంకోర్టు ఒక తీర్పులో సమగ్ర మార్గదర్శకాలు రూపొందించినా దత్తతలో అక్రమాలు ఆగడం లేదు. ముఖ్యంగా విదేశాల వారి దత్తతలో అక్రమాలు జరుగుతున్నాయి. న్యాయపరమైన, పాలనాపరమైన వ్యవహారాలలో బాలలకు కూడా మాట్లాడే స్వేచ్ఛ, వినే అవకాశం కల్పించే హక్కు వుంది. కానీ, భారత దేశంలో బాలలకు ఈ అవకాశం కలుగుతుందను కోవటం అసాధ్యమే. బాలల భావ ప్రకటనా స్వేచ్ఛ, మతం, సంఘం ఏర్పాటు చేసుకొనే స్వేచ్ఛ, శాంతియుతంగా గుమికూడే స్వాతంత్ర్యాలకు సంబంధించి భారత రాజ్యాంగం 19, 25 అధికరణలో హక్కులు పొందుపర్చారు. కానీ, భారతీయ బాలల్లో అధిక సంఖ్యాకులు ప్రసార సాధనాలకు అందుబాటులో లేక నిరక్షరాస్యులయినందు వల్ల భావ ప్రకటనా స్వేచ్ఛ అప్రస్తుతమే. ప్రసార సాధనాలు, పుస్తకాలు, ఇతర సామగ్రి ద్వారా బాలలు సమాచారాన్ని తెలుసుకునే స్వాతంత్ర్యాన్ని ఎన్‌సిఇఆర్‌టి, ఎన్‌బిటి, సిబిటి, ప్రచురణల ద్వారా తెలియపర్చారు. కానీ ప్రాంతీయ భాషల్లో ఇందుకు సంబంధించిన ప్రచురణలు తక్కువ కావటం, గ్రామీణ ప్రాంతాల్లో టీవీ కూడా లేకపోవడం, పట్టణ ప్రాంతాల బాలలు టీవీకి అందుబాటులో వున్నప్పటికీ, అవసరమైన విద్య లేకపోవడం ఈ రకమైన హక్కులకు ప్రధాన ప్రతిబంధకాలు అవుతున్నాయి. బాలల అభివృద్ధి పెంపకాలకు సంబంధించి తల్లిదండ్రులది ఇద్దరిదీ సమాన బాధ్యత అని వున్నప్పటికీ భారతీయ చట్టాలు స్పష్టంగా తల్లి పట్ల వివక్షతో కూడి వున్నాయి. ఉదాహరణకు పుట్టుక నమోదు, పాస్‌పోర్టు, రేషన్ కార్డు, అన్ని రకాల పత్రాలపై కేవలం తండ్రి పేరు మాత్రమే పేర్కొంటారు. పిల్లల పెంపకంలో తండ్రుల బాధ్యత పెంచడానికి భారతీయ సమాజం కానీ, ప్రభుత్వం కానీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. అన్ని రకాల హింస, దోపిడీల నుంచి బాలలకు పరిరక్షణ విషయానికి సంబంధించి అంతస్థీకరణ గల భారతీయ సమాజంలో పిల్లలపై అన్ని రకాల వేధింపులు తీవ్రంగానే వుంటాయి. ఇలాంటి సమాజంలో పిల్లలపై లైంగిక వేధింపులూ ఎక్కువే. చట్టానికీ, ఆచరణకూ మధ్య ఈ విషయంలో పెద్ద గండి వుంది.

శరణార్థుల పిల్లలకు సంబంధించి కూడా భారత దేశంలో ఎలాంటి చట్టమూ, ఎలాంటి నిబంధనా లేదు. ప్రభుత్వం కేవలం శరణార్థి శిబిరాలను మాత్రం ఏర్పాటు చేస్తుంది. వికలాంగులైన బాలల హక్కులకు సంబంధించి కూడా సంక్షేమానికి బహు దూరంగా ఆచరణ వుంది. వారి సమస్యలను సాంఘిక సమస్యగా గుర్తించకుండా కేవలం ఆరోగ్య సమస్యగా మాత్రమే గుర్తిస్తున్నారు. వికలాంగులైన గ్రామీణ బాలలకు పోలియో నిరోధక టీకాలు, విటమిన్ ఎ లోపం, అయోడిన్ లోపం లాంటి వాటికి మౌలిక వసతులు కూడా లేవు. వికలాంగుల బతుకులు బాగు చేయడానికి ప్రోత్సాహక చర్యగా కనీసం విద్యా వసతి కూడా లేదు. ప్రామాణిక వైద్య సేవలకు సబంధించిన బాలల హక్కుల సంగతి పరిశీలించినప్పుడు వీటి క్రిందకు వచ్చే పుట్టుకతో అల్ప బరువు, శిశు మరణాల సంఖ్య హెచ్చు శాతం, రక్షిత మంచి నీటి వసతి లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సౌకర్యాల లేమి, ప్రసూతి మరణాల శాతం, జనాభా, డాక్టర్‌ల నిష్పత్తికి దారి తీసే ప్రభుత్వ ఆస్పత్రుల రద్దీ ఇవన్నీ దయనీయ ఆరోగ్య సేవలకు నిదర్శనాలు. పిల్లల సామాజిక భద్రత అంటే సామాజిక భీమాతో పాటు ఇతరాల కోసం ఏ ఏర్పాటూ లేదు. జీవన ప్రమాణాలకు సంబంధించి మాత్రం భారత రాజ్యాంగం 47వ అధికరణలో ఆయా రాష్ట్రాలు బాలల జీవన ప్రమాణాలు పెంచడానికి పోషకాహారం పరికల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పౌర సరఫరాల చౌక బియ్యం, గృహ నిర్మాణ సబ్సిడీలు, ఇందిరా ఆవాస్‌యోజన

BRAOU

లాంటి పథకాలు ఈ దిశగా ప్రభుత్వ కృషికి ఉదాహరణలు. కానీ ప్రభుత్వ కార్యక్రమాల్లో పారదర్శకత లేకపోవడం, అవినీతి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకిగా తయారైనాయి. ప్రాథమిక ఉన్నత విద్యావకాశాల హక్కుకు సంబంధించి భారత రాజ్యాంగం 47వ అధికరణలో బాలలకు 14 సంవత్సరాల వరకు ఉచిత, తప్పనిసరి విద్య అందించాలని రాష్ట్రాలను ఆదేశించారు. కానీ స్వల్ప అక్షర జ్ఞానం, పాఠశాలలో తక్కువ శాతం నమోదు, బడిని పీడివెళ్ళే పిల్లల సంఖ్య అధికంగా వుండడం, బడిలో అద్వాన్న పరిస్థితులు, పాఠశాలలు అందుబాటులో లేకపోవడం, ఉపాధ్యాయుల గైర్హాజరీ లాంటి వాటివల్ల బాలలు తమ విద్యా హక్కులను ఉపయోగించుకోలేక పోతున్నారు. బాలల సర్వతోముఖాభివృద్ధికి ఉద్దేశించిన ఉన్నత ప్రమాణాలు గల విద్య కూడా ప్రభుత్వ పాఠశాల్లో ప్రామాణిక విద్య కొరవడడం, ప్రైవేటు, పబ్లిక్ పాఠశాలల్లో వుండడం వల్ల సామాజిక అంతస్తులు ఏర్పడి అవి బాలల వ్యక్తిత్వం మీద కూడా ప్రభావాన్ని చూపుతున్నాయి. అల్ప సంఖ్యాక వర్గాల బాలల హక్కులకు సంబంధించి వారి సంస్కృతి, భాష, సంప్రదాయాలు, ఇతర దేశీయ వ్యవసాయ జనాభా సంస్కృతి, వారి భాష, సంగీతం, నృత్యం, దేవతలు, ఆచారాలు వినిమయ సంస్కృతి, నగర సంస్కృతిల మధ్య నలిగి పోతున్నది. గిరిజన బాల బాలికల కోసం ఏర్పర్చిన పాఠశాలల్లో వారి సంస్కృతి, కళల నుంచి వారిని వేరు చేస్తున్నారు. ఇంగ్లీషు మీడియా పాఠశాలల పట్ల మోజు, రాజ్యం తన రాజకీయ ప్రయోజనాల కోసం ప్రోత్సహిస్తున్న మతతత్వం బాలలకు లౌకిక విద్య అందకుండా చేస్తున్నది. ఇక విశ్రాంతి విరామాలకు సంబంధించిన బాలల హక్కులలో చట్టం పని చేసే బాలలకు విశ్రాంతిని కల్పిస్తున్నది. కానీ ఆ చట్టం అమలు మాత్రం దయనీయంగా వుంది. ప్రైవేటు పాఠశాలల పద్ధతి, పని ఒత్తిడి విశ్రాంతి, విరామం లేకుండా చేస్తున్నవి. మాదక ద్రవ్యాల అక్రమ వినియోగం నుంచి బాలలకు కల్పించే హక్కులో బాలల చట్టాలు వాటి నుంచి రక్షణ కల్పిస్తున్నాయి. అన్ని రకాల లైంగిక దోపిడీల నుంచి రక్షణ కల్పించే హక్కును పరిశీలిస్తే, బాల్య వ్యభిచారం, అత్యాచారాల కేసులు ఈ హక్కుల ఉల్లంఘన పరిస్థితిని తెలుపుతున్నాయి. అమ్మకం, వ్యభిచార గృహాలకు అమ్మడం, ఎత్తుకు పోవడాల నుంచి బాలలకు రక్షణ కల్పించే హక్కు, కట్టు చాకిరీ నుంచి విముక్తి చట్టాలు కల్పిస్తున్నాయి. కానీ ఈ చట్టాల అమలు సమర్థంగా లేక ఇవన్నీ జరుగుతూనే వున్నాయి: రక్షణ, చిత్రహింసలు, చట్ట వ్యతిరేక నిర్బంధాల నుంచి 1986లో రూపొందించిన బాలల చట్టం రక్షణ ఇస్తుంది. కానీ ఈ చట్టం బాలలకు అనుకూలంగా మాత్రం లేదు. సాంఘిక న్యాయ వ్యవస్థలు పిల్లలకి వాళ్ళ బాల్యాన్ని నిరాకరించినప్పుడు 'ఈ బాలలే' సంఘ వ్యతిరేక శక్తులుగా తయారవుతారు. సైనిక సంఘర్షణల్లో పిల్లల హక్కులకు సంబంధించి కూడా రాజ్యాంగంలో, చట్టాల్లో ఎలాంటి ఏర్పాటూ లేదు.

బాల కార్మికులకు సంబంధించి బాలల హక్కులకు సంబంధించి రాజ్యాంగంలోని అధికరణ 24, అధికరణ 39 'ఇ'లు రక్షణ కల్పించే ప్రయత్నం చేశాయి. ఈ క్రింది చట్టాలు పిల్లలు పెలవుల్లో పని చేసే విధానాన్ని నిరోధిస్తాయి. 1. 1948 పరిశ్రమల చట్టం, 1952 గనుల చట్టం, 1961 మోటారు రవాణాదారుల చట్టం, 1966 బీడీ, సిగరెట్‌ల తయారీ పరిశ్రమల చట్టం, 1961 అప్రెంటిస్ చట్టం, 1951 ప్లాంటేషన్ కార్మికుల చట్టం, 1958 నౌకాయాన వాణిజ్య చట్టం, 1986 బాల కార్మికుల శ్రమ నిరోధక చట్టం, 1988 దుకాణాలు, సముదాయాల చట్టం, ఈ విధంగా రూపొందినవే. కానీ ఈ చట్టాల అమలులో లోపాల వల్ల బాలల దోపిడీ బాల కార్మిక వ్యవస్థ ఇంకా కొనసాగుతూనే వున్నాయి. అందువల్ల అన్ని రకాల బాలల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగ విహిత బాధ్యత చట్టరక్షణ అన్నీ వున్నాయి. కానీ అమలు సక్రమంగా లేదు. బాల కార్మికుల విషయంలో ఇది మరీ ఎక్కువ. అందుకే బాల కార్మిక వ్యవస్థను వివరంగా తెలుసుకుందాం.

13.6 భారత దేశంలో బాల కార్మికులు

13.6.1 బాల కార్మికులంటే ఎవరు? ఏమిటి

18 సంవత్సరాలలోపు వయసు గల బాల బాలికలు పాఠశాలకు వెళ్ళకుండా పనితప్ప మరో విషయమేదీ లేకుండా వున్న వారినే బాల కార్మికులు అంటారు. అయితే బాలలు చేసే ప్రతి పనినీ బాల కార్మికులు అనడానికి వీలు కాదు.

BRAOU

కుటుంబానికి సాయపడే పనిని రక్షిత, ఆరోగ్యకరమైన పరిస్థితుల్లో పని చేసే బాలలను, అభివృద్ధికి, వినోదానికి వీలు కల్పించే పరిస్థితుల్లో చేసే పనితో కూడా బాల కార్మికులు అనలేము.

13.6.2 సమస్యలో కోణాలు

భారత దేశంలో బాలల ఆర్థిక దోపిడి విస్తృతంగా వుంది. సంవత్సరాల తరబడి అది పెరుగుతూనే వున్నది. బాల కార్మికులకు సంబంధించి వివిధ అంచనాలు వున్నాయి. 1981 భారత జనాభా లెక్కల ప్రకారం దేశంలో 13.7 మిలియన్ల బాల కార్మికులు వున్నారు. 1983లో ఎన్ఎస్ఎస్ సర్వే అంచనాల మేరకు 17.36 మిలియన్లు ఆపరేషన్ రీసెర్చి గ్రూప్ (ఓఆర్జి) 1983లో వేసిన అంచనా ప్రకారం 44 మిలియన్లు, ప్రణాళికా మండలి 2000 సంవత్సరం నాటికి వేసిన అంచనాల ప్రకారం 20 మిలియన్లు, 1991 జనాభా లెక్కల ప్రకారం 16.5 మిలియన్లు అంటే మొత్తం జనాభాలో 5.5 శాతం బాల కార్మికులు వున్నారు. ఈ అన్ని అంచనాలు ఒకదానికి మరొక దానికి మధ్య గండి వుండడానికి కారణం బాల కార్మికుల నిర్వచనం వేర్వేరుగా స్వీకరించడమే. అధికారిక లెక్కల్లో ఇళ్ళల్లో పని చేసే పిల్లలను, వేతనాలు లేని పని చేసే పిల్లలను మినహాయించడంతో వారి అంచనాల్లో బాల కార్మికులు తక్కువగా వున్నారు.

13.6.3 బాల కార్మిక వ్యవస్థ కారణాలు

బాల కార్మికులు ఇంత స్థాయిలో వుండడానికి అనేక కారణాలు చెప్పవచ్చు. తప్పనిసరి విద్యను అమలుపర్చక పోవడం, కేవలం ప్రమాదకర పరిశ్రమల్లో మాత్రమే బాల కార్మిక వ్యవస్థను నిషేధించడం, ఆర్థిక, సామాజిక వ్యవస్థలో మార్పులు తెచ్చే సమగ్ర అభివృద్ధి పథకాలు లేకపోవడం, సమస్యపై సామాజిక ప్రసార, ప్రచారాలు కొరవడడం, ఈ సమస్యపై సామాజిక అవగాహన కొరవడడం, బాల కార్మికుల చట్టాలు, అమలుకు మధ్య వున్న గండిని పూడ్చడానికి తగిన రాజకీయ మద్దతు కొరవడడం కారణాలుగా చెప్పవచ్చు.

13.6.4 రాజ్యాంగ విధాన చట్రం

బాల కార్మికుల సమస్యను ఎదుర్కోవడంలో భారత దేశం చురుకైన విధానాలు అవలంబిస్తున్నది. బాల కార్మికుల సమస్యను నిర్మూలించడానికి భారత దేశం రాజ్యాంగ, చట్టపరమైన అభివృద్ధి కార్యకలాపాలను అమలు పరుస్తున్నది. ఈ మేరకు భారత దేశం అంతర్జాతీయ కార్మిక సంస్థ ఒడంబడికలను ఆరింటిని ఆమోదించింది. వీటిలో మూడు 20వ శతాబ్దపు మొదటి పాదంలోనే ఆమోదించారు. భారత రాజ్యాంగ నిర్మాతలు ఉద్దేశ్య పూర్వకంగానే తప్పనిసరి సార్వత్రిక ప్రాథమిక విద్య, బాలలకు కార్మిక రక్షణ అన్న అధికరణలను రాజ్యాంగంలో పొందుపర్చారు. కార్మిక కమిషన్లు, కమిటీలు బాల కార్మికుల సమస్యను భిన్న కోణాల నుంచి పరిశీలించి విస్తృతంగా సిఫార్సులు చేశారు. బాల కార్మికులకు సంబంధించిన విషయాల్లో క్రింది కోర్టుల నుంచి సుప్రీం కోర్టు దాకా స్పందించి వున్నవి. ఈ నేపథ్యంలోనే భారతీయ బాల కార్మిక విధానాలు రూపుదిద్దుకున్నాయి. బాల కార్మికులకు సంబంధించి ఇప్పటి చట్టాలు 1979 అంతర్జాతీయ కార్మిక సదస్సు తీర్మానాలను అనుసరించి రూపొందాయి. ఈ తీర్మానాలు బాల కార్మికుల వ్యవస్థను ఇంత తక్కువ కాలంలో నిర్మూలించలేక పోయినా, మరింత మానవీయత సాధనకు నిషేధ చర్యలు తీసుకోవాలని సూచించింది.

13.6.5 బాలల శ్రమ – చట్ట రక్షణ

బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం పరిశ్రమల్లో, గనుల్లో, ఇతర ప్రమాదకర పనుల్లో 14 సంవత్సరాలలోపు గల బాలల శ్రమను నిషేధించడం ఒక విధానంగా రూపొందించింది. ఇతర ఉద్యోగాల్లో బాలల పనిని క్రమబద్ధం చెయ్యడానికి విధాన నిర్ణయం తీసుకొన్నది. 1986 బాల కార్మికుల (నిషేధం, క్రమబద్ధీకరణ) చట్టం ఈ ప్రాథమిక లక్ష్య సాధనకు ఏర్పరిచారు. ఈ మేరకు ప్రధానంగా ఆరు వృత్తులలో ప్రభుత్వం బాల కార్మికుల నియామకాన్ని నిషేధించింది.

1. కసాయి దుకాణాలు
2. 1948 పరిశ్రమల చట్టంలో పేర్కొన్న, ప్రమాద భరిత కార్యకలాపాలు గల పరిశ్రమల్లో

BRAOU

3. ముద్రణా రంగంలో, 1948 పరిశ్రమల చట్టం నిర్వచనం క్రిందకు వచ్చే పనుల్లో

4. కాజు, జీడిపప్పు పరిశ్రమలో

5. కాజు, జీడిపప్పు తయారీలో

6. ఎలక్ట్రానిక్ పరిశ్రమలో మాట్లు వేసే పనిలో

13.7 రాష్ట్రాల్లో బాల కార్మిక వ్యవస్థ

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, దాని అనుబంధ పనుల్లో బాల కార్మికులు ఎక్కువగా పని చేస్తున్నారు. సేద్యం, వ్యవసాయ కూలీ, పశువుల పెంపకం, అటవీ సంరక్షణ, చేపల పెంపకం తదితర పనుల్లో 84.98 శాతం బాల కార్మికులున్నారు. పట్టణ ప్రాంతాల్లో సర్వీసింగ్, రిపేర్ పనులలో బాల కార్మికులు వున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రాష్ట్రాల కన్నా ఎక్కువ బాల కార్మికులు వున్నారు. అందుబాటులోని గణాంక వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 14.30 శాతం, మధ్యప్రదేశ్‌లో 12.45 శాతం, మహారాష్ట్రలో 11.42 శాతం, ఉత్తర ప్రదేశ్‌లో 10.52 శాతం, కర్నాటకలో 8.30 శాతం, బీహార్‌లో 8.08 శాతం, తమిళనాడులో 7.15 శాతం, రాజస్థాన్‌లో 6.01 శాతం, ఒరిస్సాలో 5.15 శాతం, గుజరాత్‌లో 4.52 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 4.4 శాతం, బాల కార్మికులు వున్నారు. దేశంలో 90 శాతం బాల కార్మికులు ఈ 11 రాష్ట్రాల్లోనే వుండడం విచిత్రం. మిగతా రాష్ట్రాలన్నింటిలోనూ కలిపి 7.67 శాతం బాల కార్మికులున్నారు. 1987-88లో ఎన్ఎస్ఎస్ 43వ విడత సర్వే ప్రకారంగా బాల కార్మికుల్లో బాలురు 8.816 మిలియన్లు, బాలికలు 6.9 మిలియన్లు వున్నారని అంచనా వేశారు. మొత్తం బాల కార్మికులు 15.08 మిలియన్లు కాగా, నగర పట్టణ ప్రాంతాల బాలురు 1.155 మిలియన్లు, బాలికలు 0.799 మిలియన్లు వున్నారు. మొత్తంగా పట్టణ ప్రాంతాల బాల కార్మికులు 1.934 మిలియన్లు వున్నారు. ప్రాథమిక, మాధ్యమిక విద్య మానివేసే బాలలు ఎక్కువగా వున్న ప్రాంతాల్లోనే బాల కార్మికులు కూడా ఎక్కువగా వున్నారన్న విషయం పరిగణనలోకి తీసుకోవాలి. బాల కార్మికులు ఎక్కువగా వున్న 11 రాష్ట్రాల్లో ఇందుకు దృష్టాంతాలు కనబడతాయి.

BRAOU

13.8 భారత దేశంలో బాల కార్మికుల పరిశ్రమలు

బాల కార్మికుల రూపంలో బాలల హక్కులను పూర్తిగా ఉల్లంఘించే పరిశ్రమల్లో ఉత్తర ప్రదేశ్ ఫిరోజాబాద్‌లో గ్లాస్ పరిశ్రమలు, ఉత్తర ప్రదేశ్‌లోనే మురాదాబాద్‌లో ఇత్తడి పాత్రల తయారీ పరిశ్రమలు, అలీఘర్‌లో తాళాల తయారీ పరిశ్రమ, ఇదే ఉత్తర ప్రదేశ్‌లోని కార్పెట్ పరిశ్రమలు, ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపూర్ పలకల తయారీ పరిశ్రమ, జగ్గంపేట టైల్స్ తయారీ పరిశ్రమ, తమిళనాడులోని అగ్గిపెట్టె, టపాసుల తయారీ పరిశ్రమలు, ఒరిస్సాలో బీడీ తయారీ, హర్యానాలో గనులు బాలల హక్కులను పూర్తిగా హరించి వేస్తున్న పరిశ్రమలు.

13.9 బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన–ప్రభుత్వ కార్యక్రమాలు

1974 ఆగస్టులో, 1992లో ప్రభుత్వం బాల కార్మికులపై జాతీయ విధానాన్ని ప్రకటించింది. జాతీయ బాల కార్మిక విధానం (ఎన్‌సిఎల్‌పి) వాస్తవ ప్రణాళికలో ఈ విషయాలు పొందుపర్చి వున్నాయి.

1. శాసన పరమైన కార్యాచరణ ప్రణాళిక 2) సాధ్యమైన చోటల్లా బాలల ప్రయోజనాల పరిరక్షణకు సాధారణ అభివృద్ధి పథకాల రూపకల్పన. 3) బాల కార్మికులు వున్న వేతన/ ఉప వేతన ఉద్యోగాలలో ప్రణాళికబద్ధమైన కార్యాచరణ దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 12 జాతీయ బాల కార్మిక ప్రాజెక్టులు అమలులో వున్నాయి. వీటిలో ఉత్తర ప్రదేశ్‌లో 4, ఆంధ్రప్రదేశ్‌లో 2, మధ్యప్రదేశ్, తమిళనాడు, బీహార్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఒరిస్సాలలో ఒక్కొక్క-

ప్రాజెక్టు అమలవుతున్నవి. ఈ ప్రాజెక్టులకు ఎనిమిదవ ప్రణాళిక కేటాయింపులు 15 కోట్లు. జాతీయ బాల కార్మిక విధానం క్రింద ప్రధానంగా ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పడం, అనియత విద్య లాంటి వాటికి ప్రాథమిక సౌకర్యాల పరికల్పన, వృత్తి, విద్యా కోర్సులు. ఉపాధి నుంచి వేరుపరచిన బాల కార్మికులకు సహాయం తదితర అంశాలతో పాటు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం జాతీయ స్థాయి అధికార యంత్రాంగం ఏర్పాటు, జర్మనీ సహకారంతో బాల కార్మికుల కార్యాచరణ, సహాయ కార్యక్రమాలు (సిఎల్ఎఎస్పి) 1990 ప్రపంచ కార్మిక సంస్థ మద్దతులో అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమం (ఐపిఇసి) తదితరాలు వున్నాయి.

13.10 బాల కార్మికులపై సుప్రీం కోర్టు తీర్పు (1996)

ప్రతి రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ బాల కార్మికుల పునరావాస, సంక్షేమ నిధిగా పేర్కొన్న ఒక నిధిని బాల కార్మికుల కోసం ఏర్పాటు చేయాలని 1976 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు ఒక తీర్పు వెలువరించింది.

ప్రమాద భరితమైన పరిశ్రమల యజమానులు ప్రతి బాల కార్మికునికి 20 వేల వంతున ఈ నిధిలో జమ చెయ్యాలని, ప్రమాద భరితం కాని పరిశ్రమల్లో బాలలకు కేవలం నాలుగు నుంచి ఆరు గంటల పని దినం మాత్రమే వుండాలని ఈ తీర్పు నిర్దేశించింది. చివరగా బాల కార్మికుల రెండు గంటల చదువు సౌకర్యం కోసం యజమాని ఖర్చు భరించాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆరు నెలల్లోగా ప్రతి రాష్ట్రం బాల కార్మికుల జనాభా లెక్కలు పూర్తి చెయ్యాలని కూడా కోర్టు తీర్పులో పేర్కొన్నది.

13.11 బాల కార్మిక వ్యవస్థ – కాల్పనిక వాదనలు

1. బాల కార్మిక వ్యవస్థకు ఏకైక కారణం దారిద్ర్యమే అన్న భావన నెలకొని వున్నది. బాల కార్మికులందరూ దుర్భర దారిద్ర్యంతో మగ్గే కుటుంబాల నుంచి వచ్చిన వారేనన్నది నిజమే. కానీ అదే సమయంలో బాల కార్మిక వ్యవస్థ దారిద్ర్యాన్ని మరింతగా పెంచుతుంది. బాల కార్మికులు దుర్భర పని పరిస్థితుల్లో నైపుణ్యం లేని, అశక్తుడైన వ్యక్తిగా తయారవుతాడు. ఫలితంగా అప్పటి దాకా అతన్ని కానీ, ఆమెను కానీ దోపిడి చేసిన పరిశ్రమలు చివరకు ఉద్యోగం కూడా నిరాకరిస్తాయి. దీనికి తోడు బాల కార్మికులు స్వల్ప, అత్యల్ప, కొన్ని సందర్భాల్లో అసలు వేతనమే లేకుండా పని చేస్తారు. బాల కార్మికుల పని వల్ల పెద్దలకు కూడా పని దొరకని పరిస్థితులు ఏర్పడతాయి.

2. జనాభా పెరుగుదలకు బాల కార్మికులకు సాధారణంగా ముడిపెట్టి చూపుతారు. పేదలు పెద్ద కుటుంబాలను, ఎక్కువ మంది పిల్లలను కలిగి వుంటారు. అందువల్ల జనాభా పెరిగి, ఉపాధి కొరవడి, దారిద్ర్యం పెరిగి బాల కార్మికులు తయారవుతారన్నది ఈ వాదన సారాంశం. ఇది కేవలం జనాభాను దాని సామర్థ్యంతో చూడకుండా అంకెలుగా మాత్రమే చూసినందు వల్ల కలిగే అభిప్రాయం. ఇదిట్లా వుండగా దారిద్ర్యాన్ని సోషకాహార స్వీకరణలతో అంచనా వేస్తారు తప్ప విద్య, ఆరోగ్యం, ఇతర ప్రాథమిక అవసరాలు తీరని ప్రజలతో అంచనా వేయరు.

3. బాలలు పని చేయకపోతే వారు, వారి కుటుంబాలు ఆకలి చావుల పాలిటపడ్తారన్న అభిప్రాయాలూ వున్నాయి. కానీ, పిల్లలు, వారి కుటుంబాలు పని చేసినా ఆకలి చావులు సంభవిస్తూనే వుంటాయి. ఆకలి చావులు ధరల విధానం, అల్పాదాయం, కొనుగోలు శక్తి లేమి, ఆదాయ అసమానతలు, ఆహార అసమ భాగస్వామ్యం, ఆహారం లభించని స్థితి, ఆహారోత్పత్తులకు దూరంగా వుండడం, భూ యాజమాన్య అసమానతలు తదితర అంశాల మీద ఆధారపడి జరుగుతాయి.

4. తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపడం కన్నా పనికి పంపడం మీదనే శ్రద్ధతో వుంటారన్న అభిప్రాయం కూడా వుంది. కానీ ఎన్జీవోలు పెద్ద ఎత్తున బాల కార్మికులను విముక్తి చేసిన సందర్భాల్లో దారిద్ర్యం ఒక్కటే కారణం కాదన్న విషయం రుజువైంది.

BRAOU

5. బాలలే పని చేయాలని అనుకుంటారు అన్న అభిప్రాయం కూడా వుంది. కానీ మరో గత్యంతరం లేకనే బాలలు పని చేయాలని అనుకుంటారు. పాఠశాలలకు దూరమై లేదా పాఠశాలలు లేకనే వారు కార్మికులుగా మారతారు. అంతిమంగా బాల కార్మిక వ్యవస్థ ఒక సామాజిక ఉదాసీనత, వారి పట్ల పట్టనితనం వల్లనే మనుగడలో వుందన్నది వాస్తవం.

6. ప్రమాద భరితం కాని వృత్తుల్లో బాలలతో పని చేయించడంలో తప్పేమీ లేదన్న అభిప్రాయమూ చెలామణిలో వుంది. ప్రమాదకరమైన అనే పదంపైనే చర్చ జరగవలసి వుంది. బాలలకు ఏది ప్రమాదకరం అన్నది చర్చనీయాంశం. ఒక పరిశ్రమ అనగానే స్వాభివికంగా ప్రమాదకరమై వుంటుంది. ఇది కాకుండా ప్రమాద భరితం కాని సర్వీసు సెక్టర్లు, టీ కొట్లు, రెస్టారెంట్లు, ఇంటి పని లాంటి వాటిలోనే భౌతిక, మానసిక, లైంగిక వేదనలుంటాయి.

7. కొన్ని రకాల పనులు, అంటే కార్పెట్లు కుట్టడం లాంటి ప్రత్యేక పనులు బాలలే వేగంగా, సమర్థంగా చెయ్యగలరన్న వాదనలూ లేకపోలేదు. అయితే ఎంఐడిఎస్ లాంటి సర్వేలలో ఈ విషయంలో ఎంత మాత్రం వాస్తవం లేదని తేలింది. ఇదే కాకుండా తయారీలోని వివిధ దశల్లో బాలల శ్రమకన్నా, పెద్దల శ్రమ ఎన్నో రెట్లు ఎక్కువ అని తేలింది.

8. బాల కార్మికులు దొరక్కపోతే పరిశ్రమలు మూతపడ్తాయి అన్న వాదనలూ వున్నాయి. అయితే అంతర్జాతీయ కార్మిక సంస్థ ఈ విషయమై కార్పెట్, ఇత్తడి తదితర పరిశ్రమల్లో బాల కార్మికులకు బదులుగా పెద్దలను తీసుకున్నట్లయితే ఆర్థిక భారం కేవలం నాలుగు నుంచి ఏడు శాతం పెరుగుతుందని తేలింది. ఈ విధంగా తయారీ ధర ఉత్పత్తి వ్యయం బాల కార్మికులు లేనట్లయితే నామమాత్రంగా పెరుగుతుందని తేలింది.

9. బాల కార్మిక వ్యవస్థను సమర్థించే వారు బాల కార్మికులకు ఉపాధి కల్పించడం ద్వారా వారికి మేలుకూరుస్తున్నారన్న వాదనలూ చేస్తారు. కానీ యజమానులు కేవలం వారి లాభాల కోసం మాత్రమే చూసుకుంటారని, వారి స్వార్థ ప్రయోజనాల కోసమే, ఆర్థిక ప్రయోజనాలు పొందడానికి మాత్రమే వారు దీన్ని సమర్థిస్తారన్నది వాస్తవం.

10. బాల కార్మికుల ఉత్పత్తులను ప్రపంచ వ్యాప్తంగా నిషేధిస్తే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన జరుగుతుందన్న వాదనలు కూడా వున్నాయి. కానీ అభివృద్ధి చెందిన దేశాల నుంచి, ఎగుమతుల దృష్టిలో మాత్రమే ఈ ప్రతిపాదనలు వచ్చాయి. బాల కార్మిక వ్యవస్థ దేశీయ సమస్య. ఎగుమతుల ఉత్పత్తుల రంగంలో బాల కార్మికుల్లో కేవలం 8 శాతం మాత్రమే వున్నారు. మానవ హక్కులను వ్యాపారంతో ముడిపెట్టడం కేవలం అభివృద్ధి చెందిన దేశాల ప్రయోజనాలను మాత్రమే పరిరక్షించే అంశం అవుతుంది.

13.12 బాల కార్మికుల సమస్య – వ్యూహాలు

నిరుపయోగమైన, సమస్యకు ఏమాత్రం సంబంధం లేని వాదనలను విడనాడి బాల కార్మికుల సమస్యను తల్లిదండ్రులు, పిల్లలు అన్న దృక్కోణం నుంచి పరిశీలించినప్పుడే సమగ్ర వ్యూహం రూపొందే అవకాశం వుంది. బాల కార్మికుల సమస్యను పరిశీలించే వ్యూహానికి కేవలం ప్రమాద భరితమైన పరిశ్రమల్లో పని చేసే బాల కార్మికులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే సరిపోదు. అసలు బాల కార్మికులు ఎక్కువగా పల్లె ప్రాంతాల్లోనే వున్నారు. వ్యవసాయ పనులు గల కుటుంబాల్లోనే 80 శాతం బాల కార్మికులు, నిరక్షరాస్యత వుంది. పట్టణ ప్రాంతాల్లో ప్రమాదకరమైన పరిశ్రమల్లో పని చేసే బాల కార్మికుల్లో కూడా, పల్లె ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారి పిల్లలే ఎక్కువ మంది వుండడం ఎన్నదగిన అంశం. అందువల్ల గ్రామీణ ప్రాంతాలు, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో పాఠశాలకు వెళ్ళని ప్రతి వారూ దోపిడికి గురవుతున్న బాలలుగా గుర్తించాలి. బాల కార్మికుల సమస్యను పట్టించుకునే ఏ ప్రణాళిక అయినా ఈ కారణం వల్ల 90 మిలియన్లుగా వున్న పాఠశాలలకు వెళ్ళని బాలల సమస్యగానే గుర్తించాలి.. ఇందుకు అనియత విద్య ఒక్కటే దీనికి దీర్ఘకాలిక ప్రత్యామ్నాయంగా భావించరాదు. తప్పనిసరిగా ఈ విషయంలో పెద్దల జోక్యాన్ని పెంచగలగాలి. బాల

B.RAO.U

కార్మికుల సమస్యపై కార్యక్రమంలో మౌలిక మార్పులు అట్లా వున్నా ఇప్పుడున్న విధానాల అమలులో మాత్రం వైఖరి గణనీయంగా మారాల్సిన అవసరం వుంది. ఇందుకు కార్మిక విధానాలు, విద్యా విధానాల మధ్య సమర్థమైన సమన్వయం అవసరం వుంది. ఇప్పుడున్న విద్యా విధానంలో అందరికీ విద్య అన్నది బాల కార్మికుల స్థితిని మార్చేందుకు దోహద పడుతుంది. నిజానికి బాల కార్మికులకు నియత విద్య అవసరం కూడా వుంది. రాజ్యం ఇందుకోసం నిర్భంధ విద్యను ప్రవేశపెట్టాలి. అయితే కార్మిక శక్తి నుంచి బాలలను తప్పించి వారికి ప్రాథమిక నిర్భంధ విద్యను అమలుపర్చడంలో భారత దేశం మినహాయింపుగా వుందని మైరన్‌వీరన్ అంటారు. భారతదేశం, కన్నా ఆదాయ స్థాయి తక్కువగా వున్న ఆఫ్రికా, జాంబియా, ఘన, హవాయి, లిబియా, జింబాబ్వే లాంటి దేశాలు ఈ విషయంలో ముందంజలో వున్నాయి. అందువల్ల ఉచిత, నిర్భంధ విద్య రాజ్యాంగ విధిగా రూపొందించాల్సిన అవసరం వుంది. ప్రాంతాల వారీ ఆర్థికాభివృద్ధి పథకాల ద్వారా తల్లిదండ్రులకు, బాల కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనా విధానాలను ఈ పథకాలతో అనుసంధానపర్చాలి. బాల కార్మికులు దారిద్ర్యం ప్రభావం వల్లనే తయారవుతున్నారు కానీ, దారిద్ర్యానికి కారణం కాదన్న సత్యాన్ని సమాజం చేత ఆమోదింప జేయడానికి దేశ వ్యాప్తంగా చర్చ జరగాలి. 1986లో రూపొందించిన బాల కార్మిక వ్యవస్థ నిషేధం, క్రమబద్ధీకరణ చట్టంలోని లొసుగులను నివారించడానికి ఈ చట్టాన్ని సమీక్షించి, సవరించ వలసిన అవసరం కూడా వుంది. బాల కార్మికుల సమస్యకు సంబంధించి ప్రభుత్వాధికారులు, పాఠశాల అధికారులు ''ఎన్జీవో''ల ప్రవృత్తిలో మార్పు తెచ్చే ప్రయత్నాలు చెయ్యాలి. అసంఘటిత రంగంలో పెద్దలకు కనీస ఉపాధి, కనీస వేతనాలు అమలు చేసేందుకు ఒత్తిడి తెచ్చే ప్రజా సంఘాలను బలోపేతం చెయ్యాలి. సంఘటిత రంగంలో కూడా బాల కార్మికులకు మద్దతుగా కూడగట్టడానికి ట్రేడ్ యూనియన్లు, యాజమాన్యాలతో కలిసి పని చెయ్యాలి. పాఠశాల విద్య అంతిమంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తోడ్పడుతుంది. కావున విద్యా సంస్థల ఏర్పాటులో స్థానిక సంస్థలు చొరవ చూపాలి. విద్యా సంస్థలను పటిష్టం చెయ్యాలి.

13.13 ముగింపు

బాలల హక్కులను కాపాడే వ్యూహాలను అభివృద్ధి పర్చడంలో భారత దేశం నిజమైన సవాళ్ళను ఎదుర్కొంటున్నది. ఈ దిశగా బాలల అనుకూల అభివృద్ధి వ్యూహాలను రూపొందించి నిర్భంధ ప్రాథమిక విద్య, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల ఆరోగ్య పరిరక్షణ లాంటి చర్యలు తీసుకోవాలి. విటమిన్ ఎ', అయోడైజ్డ్ ఉప్పు, టీకాలు లాంటి వాటిని అందుబాటులో వుంచాలి. బాలల అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి వనరులు సమకూర్చాలి. బాలల హక్కుల పరిరక్షణ కోసం, ఇప్పుడున్న చట్టాల అమలుకు, కొత్త చట్టాల రూపకల్పనకు శాసనాలను అభివృద్ధిపర్చాలి. బాలికల పట్ల వివక్షను రూపు మాపేందుకు కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రోత్సాహం అందివ్వాలి. బాలల హక్కుల మీద చైతన్యం కలిగించడానికి అధ్యయనం, విధానాల రూపకల్పన జరగాలి.

13.14 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానం రాయండి!*

1. బాలల హక్కుల ఒడంబడిక (1989)లో నాలుగు హక్కులను సంక్షిప్తంగా పేర్కొనండి?
2. భారత దేశంలో బాలల హక్కుల ఉల్లంఘన జరుగుతున్న తీరు వివరించండి?

*ఈ క్రింది ప్రశ్నలకు **20** పంక్తులలో సమాధానం రాయండి!*

1. బాల కార్మికులు అంటే ఎవరు?
2. బాల కార్మిక వ్యవస్థను ఎదుర్కొవడానికి రాజ్యాంగ నిబంధనలు, చట్టాలు ఏవి?
3. బాల కార్మిక వ్యవస్థను సమర్థించే కాల్పనిక వాదనలను సమర్థిసారా? చర్చించండి

BRAOU

ఖండం - IV

రాజ్యం-మానవ హక్కులు

మానవ హక్కులను అర్థవంతం చేయడంలో రాజ్యం మౌళికమైన పాత్ర పోషిస్తుంది. ఈ రాజ్యం తన యంత్రాంగం ద్వారా హక్కులను పరిరక్షించే లక్ష్యంతో ముందుకు సాగుతుంది. ఇందులో ఉద్యోగులు, పోలీసులు కీలక పాత్ర పోషిస్తారు. భారతదేశంతోపాటు ఆర్థిక సంస్కరణలలో ముందడుగేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో మానవ హక్కుల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించినపుడే సమగ్రమైన అవగాహన ఏర్పడుతుంది. ఇందుకు సంబంధించిన చర్చ చివరి ఖండంలో చేయడం జరిగింది. ఈ ఖండంలో ఐదు భాగాలున్నాయి. అవి :

BRAOU

భాగం : 14. భారత రాజ్యం - మానవ హక్కులు

భాగం : 15. ఉద్యోగ బృందం - మానవ హక్కులు

భాగం : 16. పోలీసులు - మానవ హక్కులు

భాగం : 17. ఆంధ్రప్రదేశంలో మానవ హక్కుల పరిస్థితి

భాగం : 18. పౌర సమాజం - మానవ హక్కులు

BRAOU

భాగం 14: భారత రాజ్యం–మానవ హక్కులు

విషయక్రమం

14.0 ఉద్దేశం

14.1 పరిచయం

14.2 రాజ్యాంగం కల్పించిన హామీ

14.3 హక్కులపై నిబద్ధత ఎంత?

14.4 అప్రజాస్వామిక పోకడలు

14.5 1947-67 దశ

14.6 1967-77 దశ

14.7 1977-1997 దశ

14.8 పౌర మరియు ప్రజాస్వామిక హక్కుల ఉద్యమం

14.9 ముగింపు

14.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

14.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

★ పౌర హక్కులకు సంబంధించి రాజ్యాంగం కల్పించిన హామీని తెలుసుకుంటారు.

★ భారత రాజ్యాంగంలో నెలకొన్న అప్రజాస్వామిక పోకడలు అధ్యయనం చేస్తారు.

★ పౌర మరియు ప్రజాస్వామిక హక్కుల ఉద్యమం గురించి తెలుసుకుంటారు.

14.1 పరిచయం

భారత దేశం వలె అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలో వలస వ్యతిరేక ఉద్యమాలు పౌరహక్కుల తాత్విక పునాదులను వాటి ఆవశ్యకతను నొక్కి చెప్పాయి. వలస విధానంతో ప్రజలు అనేక ఒత్తిడులకు లోనయ్యారు. రాజకీయ స్వేచ్ఛతో పాటు మానవ హక్కులు హరించబడ్డాయి. భారత దేశంపై ఈస్ట్ ఇండియా కంపెనీ మరియు ఆ తర్వాత ఏర్పడిన బ్రిటీష్ సామ్రాజ్యం అనేక చట్టాలను నూతనంగా రూపొందించింది. 1860లో ఐపిసి మరియు 1862లో సిఆర్‌పిసి చట్టాలను ప్రవేశపెట్టారు. దీంతో న్యాయ వ్యవస్థలోనూ, ఆంగ్ల విద్యా విధానం మూలంగా ప్రజలు స్వేచ్ఛ కోసం హక్కుల కోసం ఉద్యమించే అవకాశం ఏర్పడింది. రాజ్య యంత్రాంగానికి విశేష అధికారాలు కట్టబెట్టే రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించారు. ఈ చట్టం వ్యక్తుల నిర్బంధాన్ని సులభతరం చేస్తూ వారిపై ఎటువంటి నేరారోపణ లేకపోయినా ప్రభుత్వం తన అధీనంలో వుంచుకునే అధికారం పొందింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా పౌరహక్కులపై నాయకత్వం ఒక దృక్పథాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

హక్కులకు సంబంధించి మొట్ట మొదటిసారిగా దాదాభాయ్ నౌరోజీ ప్రశ్నించారు. బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశ పెట్టే అణచివేత చట్టాలపై నిరంతరం ప్రజల వ్యతిరేకత కూడగట్టబడింది. ఈ వ్యతిరేకత ప్రజలలో కొంత వరకు చైతన్యాన్ని తీసుకు రాగలిగింది. ఈ పౌరహక్కుల భావన వేళ్ళూనుకోవడానికి నిరంకుశమైన బ్రిటిష్ పాలకవర్గాల విధానాలు కొంత మేరకు దోహదం చేశాయని చెప్పవచ్చు.

14.2 రాజ్యాంగం కల్పించిన హామీ

రాజ్యాంగం రాజ్య విధానంగా మౌలిక దృక్పథాన్ని ఆదేశిక సూత్రాల్లో పొందుపర్చింది. భారత స్వాతంత్ర్య పోరాటం మొత్తం అణగద్రొక్కబడిన ప్రజల హక్కుల సాధన కోసం ఉద్దేశించినదైనందున ఆప్రజల హక్కులకు సంబంధించిన అంశాలు రాజ్యాంగం మూడవ భాగంలో పొందు పర్చబడ్డాయి. ప్రాథమిక హక్కులకు సంబంధించిన ఈ భాగాన్ని పొందుపర్చేందుకు రాజ్యాంగ నిర్మాణ సభకు ప్రాథమిక హక్కుల కమిటీ నిర్దిష్ట సలహాను ఇచ్చింది. ఈ కమిటీ 3వ భాగంలోని ప్రాథమికహక్కులతో పాటు రాజ్యాంగంలో రాజ్యం అనుసరించవలసిన ఆదేశిక సూత్రాలను పొందుపర్చాలని సూచించింది: ఈ సూత్రాల అమలుకు సంబంధించి న్యాయ స్థానాల్లో ప్రశ్నించని విధంగా ఏర్పాటు చేయాలి. రాజకీయ, సామాజిక మార్పు కోసం ఆలోచించే మేధావులు ఈ దేశంలోని సమస్యల పరిష్కారానికి మార్క్సిస్టు దృక్పథాన్ని అంగీకరించని వారు కూడా రాజ్య కార్యకలాపాలకు మార్గదర్శకంగా ఆదేశిక సూత్రాలుండడానికి అంగీకరిస్తారని ఎం.వి.పైలీ అంటారు.

విశాల భారత దేశంలోని అశేష ప్రజల ఆకాంక్షలకు ఆదేశిక సూత్రాలు అద్దం పడతాయి. బలవాద వ్యతిరేక ఉద్యమం నుండి ప్రజలు ఇటువంటి వాటిని ఆశిస్తారు. అయితే ఆదేశిక సూత్రాలను ప్రాథమిక హక్కుల జాబితాలో పొందుపర్చే విధంగా ప్రజలు సంఘటితమై ఒత్తిడి తీసుకు రాలేదు. వీటిని రాజ్యాంగంలో పొందుపర్చడానికి ప్రధాన కారణం రాజ్యానికి ప్రజల మద్దతును కూడగట్టడానికేనని గుర్తించాలి. అధికార నిర్వహణలోనూ ఈ హక్కులను ప్రజలందరితో అంగీకరింప చేయటంలోనూ, ఉన్నత వర్గాల మధ్య సాధారణ ప్రజల మధ్య వ్యత్యాసాలున్నాయి. రాజకీయ వ్యవస్థ నిర్మాణంలోనూ ఈ అంశాలు ప్రతిబింబిస్తున్నాయి.

BRAOU

14.3 హక్కులపై నిబద్ధత ఎంత?

స్వాతంత్ర్యానంతరం జరిగిన అభివృద్ధిలో ప్రాథమిక హక్కులు మరియు ఆదేశిక సూత్రాల పాత్ర ఎంతో వుంది. విస్తృత స్వేచ్ఛ, న్యాయ పరిరక్షణ సాధనలోనూ వాటిని రూపొందించటంలోనూ భారత రాజ్యం వాస్తవిక దృక్పథాన్ని కల్పించింది. మానవ హక్కుల స్థానం అత్యున్నతమైంది. అయితే అభివృద్ధి పయనంలో గుణాత్మకమైన రాజ్యాంగ అభివృద్ధి జరగలేదు.'ఇది రాజకీయ రంగంలో హింసాత్మకంగాను విధ్వంసానికి సంబంధించినదిగాను మార్పు చెందింది. ఇందుకు విస్తృతంగా సమాజంలో పెరిగిన అసహనంతో పాటు వివిధ సమయాల్లో రాజ్యాంగానికి చేసిన వివిధ రకాల సవరణలు దోహదం చేసాయి. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం జరిగిన పోరాటాలను రాజ్యాంగం పూర్తిగా ప్రతిబింబించక పోవడంతో అవి అమలు కాకుండా పోయాయి. ఈ స్వేచ్ఛలను చిత్తశుద్ధిగా అమలుపర్చే పరిస్థితులు లేకపోయాయి. వీటిని అమలుపర్చే అధికారం బదిలీ కావడంతో రాజీపడే ధోరణులు మొదలయ్యాయి. పాలకవర్గాలు ప్రాథమిక హక్కులపై పరిమితులను విధించడం ఆరంభించాయి. ప్రజలు ఒకచేత్తో హక్కులు పొందినట్లుగాను, మరో చేత్తో వాటిని వెనక్కి తీసుకున్నట్లుగా ఈ పరిమితులు కనిపించసాగినాయి.

14.4 అప్రజాస్వామిక పోకడలు

కొన్ని చట్టాలతో సంబంధం వున్న అప్రజాస్వామిక నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమైనవని గాని లేదా సరైనవి కావనిగాని ఏ కోర్టులోనూ ఛాలెంజ్ చేయబడలేదు. మొదటిగా ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం గూర్చి పరిశీలిద్దాం. ఇది

బ్రిటీష్ ప్రభుత్వంలో రూపొందింది. ఈ చట్టంలో ఏ వ్యక్తినైనా అతని కార్యకలాపాలను రాజ్యానికి మరియు సంఘానికి వ్యతిరేకమైనవిగా పేర్కొని నిర్బంధించే అధికారం ప్రభుత్వానికి వుంది. ఈ నిబంధనను బ్రిటన్, అమెరికాలలో యుద్ధ సమయంలో ఉపయోగిస్తే భారత దేశంలో శాంతియుత పరిస్థితులలో సైతం ఉపయోగించే అవకాశం వుంది.

వలసవాదానంతర పరిస్థితిలో ఈ నిబంధన కొనసాగించడంలో ప్రధాన ఉద్దేశం రాజకీయ అస్థిరతను ఎదుర్కొనే ఉద్దేశంతోనేనని వేరుగా చెప్పాల్సిన పని లేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహాజన్ మాటల్లో ''ప్రజాస్వామ్య రాజ్యాంగాలకు'' ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం ప్రతికూలమైనదేగాక ప్రపంచంలోని ఏ ప్రజాస్వామిక రాజ్యాంగాలలోను దానిని చేర్చడం సరికాదు'' అని అన్నారు.

రాజ్యం పౌరహక్కులపై ఏ విధమైన మార్పులను మరియు చేర్పులను చేసిందో గడచిన భారత రాజకీయాలను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఈ మార్పులు రాజ్యం యొక్క స్వభావం. దాని లక్షణంపై విపరీతమైన ప్రభావాన్ని చూపాయి. పౌరహక్కుల విషయంలోనూ మరియు ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమంపై రాజ్యం యొక్క స్వభావాన్ని, ప్రభావాన్ని పరిశీలించాల్సిన అవసరం వుంది. ఈ ముఖ్య మార్పులను స్థూలంగా మూడు భాగాల క్రింద చర్చించవచ్చు.

1. 1947-1967 దశ
2. 1967-1977 దశ
3. 1977-1997 దశ

14.5 1947–1967 దశ

భారత రాజ్యానికి అధికారం బదిలీ అయిన తర్వాత ప్రాథమిక హక్కులను గ్యారంటీ చేయడంతో పాటు వాటికి అవసరమైన సామాజిక ఆర్థిక పరిమితులు విధింపబడ్డాయి. స్వాతంత్ర్యానంతరం తొలి దశలో (1947-67) స్వాతంత్ర్యానికి సంబంధించి అంతగా ప్రాముఖ్యత లేదు. అయితే భారత-చైనా యుద్ధ సమయంలో అత్యవసర నిబంధనలు విధించబడ్డాయి. ఇటువంటి సమయంలో రాజ్యం మార్పుల దిశవైపు దృష్టి సారించింది. భారత రాజ్యానికి ప్రజల మద్దతును సాధించడంలో ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. జమిందారీ వ్యవస్థను రద్దుపర్చటం, భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం మరియు ప్రభుత్వ రంగ పరిశ్రమలలో పెట్టుబడులు మొదలైనవి సైద్ధాంతికపరమైన మద్దతును కూడగట్టే ప్రయత్నాలు జరిగినాయి. దీంతో సామాజిక, ఆర్థిక క్రమాన్ని పునర్నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేద వర్గాలు భావించాయి.

ఈ మధ్య కాలంలో రాజ్యాంగ సవరణలు పరిశీలిస్తే రాజ్యాంగానికి చేర్చిన 9వ షెడ్యూల్ స్వేచ్ఛకు సంబంధించినంత వరకు ప్రశ్నార్థకంగా మారింది. ఆరంభంలో 9వ షెడ్యూల్‌లో చేర్చిన జాగీర్దారీ మరియు జమిందారీ చట్టాలు ఇటువంటి అభిప్రాయాన్ని కలిగించవు. 1954లో చేయబడిన రాజ్యాంగం 4వ సవరణ నష్ట పరిహారాన్ని చెల్లించే విషయంలో న్యాయ స్థానాలకున్న అధికారాన్ని తొలగించింది. ఈ చట్టాలన్నిటి వల్ల ప్రభుత్వం ప్రజల మద్దతును పొందగలిగింది. జాతికున్న సార్వభౌమాధికారాన్ని పరిరక్షించే నెపంతో 1963లో 16వ రాజ్యాంగ సవరణ వాక్ స్వాతంత్ర్యంపై పరిమితులు విధించింది. ఈ సవరణ వల్ల ప్రభుత్వం ప్రజల పౌరహక్కులపై నియంత్రణ విధించడం ఆరంభించింది. 1960 మధ్య కాలంలో ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య పెద్ద ఎత్తున వైరుధ్యాలు వ్యక్తమయ్యాయి. సామాజిక న్యాయం స్వాతంత్ర్యాల కోసం చేస్తున్న డిమాండ్లకు ఈ సవరణలు ప్రమాదం కలిగిస్తాయని భావింప బడింది. వ్యవస్థాపరమైన మార్పు జోలికి పోకుండా ప్రాథమిక హక్కుల జాబితా నుండి ఆస్తి హక్కును తొలగించాలన్న వివాదం మొదలైంది. మొత్తానికి ఈ దశలో ప్రాథమిక హక్కుల జాబితా వివాదాలకు కారణమైంది.

14.6 1967–1977 దశ

ఆర్థిక సంక్షోభం విషయంలోనూ మరియు రాజ్య విధానాలలోనూ భారత రాజకీయాలు ఈ దశకంలో అతి

BRAOU

ముఖ్యమైన మార్పులకు లోనయ్యాయి. రాజకీయ, ఆర్థిక రంగంలో వచ్చిన కుదింపులే ఇందుకు నిదర్శనం. ఈ కుదింపులకు ప్రధాన కారణం అభివృద్ధి వ్యూహాలు అసమగ్రంగా వుండటమే.

ఈ వ్యూహాలు విభిన్నతలను మరియు పేదరికాన్ని పెంచేవిగానే వున్నాయి. ఒకవైపు నెహ్రూ మహలనోబిస్ నమూనా మరోవైపు హరిత విప్లవం అత్యధిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాయి. వీటికి దూరంగా వుంచబడిన ప్రజలు తమ అసంతృప్తి వ్యక్తపర్చారు. ఒకవైపు నక్సలైట్లు ఉద్యమం ద్వారానూ మరోవైపు జయప్రకాష్ నారాయణ ఉద్యమం ద్వారా ప్రజలు తమ సామాజిక అసంతృప్తిని వ్యక్తపర్చారు. ఇదే కాలంలో అనేకమైన ఉప ప్రాంతీయ ఉద్యమాలు వచ్చాయి. వీటితో పాటు పారిశ్రామిక ప్రగతి తగ్గటం, కరువు పరిస్థితులు మరియు ఆహార ధాన్యాల ధరలు 40 శాతం పెరగడం జరిగినాయి. రూపాయి విలువ తగ్గించబడింది. ఈ సంఘటనలన్నీ సంక్షోభ తీవ్రతను తెలియపరుస్తున్నాయి.

వ్యవసాయ రంగంలో వచ్చిన సాంకేతిక మార్పులు మరియు పెద్ద ఎత్తున మిగులు శ్రామికుల కారణంగా భూస్వామిక వర్గాలు కొత్త ఆర్థిక శక్తిగా రూపొందాయి. రాజకీయ అధికారాన్ని పొందడంలో వీరు ముందున్నారు. రాజకీయ అధికారాన్ని విస్తృతం చేసుకోవడంలో వ్యవస్థాపరంగా వున్న పరిమితులు వీరి రాజకీయ అధికారాన్ని అంతగా పెరగనీయలేదు. ఇది రాజకీయ సమతుల్యాన్ని మరియు మొత్తంగా పాలకవర్గ శక్తులలో సంక్షోభాన్ని సృష్టించింది.

మరో ముఖ్యమైన అభివృద్ధి ఏమిటంటే మొదటి దశలో పెద్ద మొత్తంలో ఖర్చు చేయబడిన ప్రజాధనం మూలంగా సమాజంలో అధికారాన్ని, ఏ విధంగా ఉపయోగించు కోవాలో తెలుసుకుని ఒక కొత్త ధనిక వర్గం రూపుదిద్దుకుంది. ఈ వర్గంలో కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మద్యం వ్యాపారులు, సినిమా నిర్మాతలు, నటులు మొదలైన వారున్నారు. వీరు రాజకీయ శక్తిగా ఎదగడం ప్రత్యేకంగా గుర్తించదగింది. దీంతో వీరు రాజకీయ అధికారాన్ని అనుభవించడంతో పాటు విపరీతమైన ఆస్తులను పెంపొందించుకున్నాను. ఇదే సమయంలో పేద వర్గాలలో పెరిగిన చైతన్యం సమాజంలో వివిధ రకాలైన ఉద్యమాలకు కారణభూతమైంది. దీంతో వ్యవస్థల నిర్మాణంలోనూ, సంస్థలలోనూ మరియు విధానాలలోనూ సంక్షోభం ఏర్పడింది. ఫలితంగా రాజ్యం అణచివేత ధోరణిని అలవర్చు కోవాల్సి వచ్చింది. ఇది భారత రాజ్యాంగంలో సవరణలు తీసుకు రావడానికి దోహదం చేసింది.

ఈ కాలంలో రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో అనేక అంశాలు చేర్చబడ్డాయి. ఈ మార్పులు అణచివేత దిశ నుండి క్రమంగా ఎమర్జెన్సీ వైపు దారి తీసినట్లు కన్పిస్తుంది. 1975-77 మధ్య కాలంలో సుమారు రెండేళ్ళు దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించబడింది. ఇటువంటి పరిస్థితుల్లోనే స్వాతంత్ర్యానంతరం పౌరహక్కుల ఉద్యమాలు ఆవిర్భవించాయి. చట్టం ముందు అందరూ సమానులే అనే విధానం ఒకవైపు సంక్షోభంలో వుండగా, పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, అసమానమైన అభివృద్ధి మరియు బలహీన వర్గాలకు న్యాయం జరగక పోవడం మొదలైనవి మరోవైపు సంక్షోభాన్ని తీవ్రతరం చేశాయి. దీంతో సమాజంలో పేద వర్గాలు తమ హక్కుల పరిరక్షణకు మరియు జీవనోపాధికి పౌరహక్కుల ఉద్యమాల వైపు మరియు ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమాల వైపు పయనించారు.

14.7 1977–1997 దశ

పౌరహక్కులు మరియు ప్రజాస్వామ్య హక్కులకు ఈ మధ్య కాలంలో తీవ్ర విఘాతం కలిగింది. 1977 లోక్ సభ ఎన్నికల్లో శ్రీమతి ఇందిరా గాంధీ ఓటమి పాలయ్యారు. 1977లో ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత జరిగిన ఎన్నికల్లో శ్రీమతి ఇందిరా గాంధీకి మెజార్టీ రాకపోవడంతో ఓ కొత్త ఆశ చిగురించింది. జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమ ప్రభావంతో జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. ఎమర్జెన్సీ కాలంలో చేయబడిన చట్టాల మూలంగా కష్టాల పాలైన ప్రజల ఆగ్రహం కారణంగా జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో 44వ రాజ్యాంగ సవరణ చేయబడింది. ఎమర్జెన్సీ విధింపుకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలను దుర్వినియోగం చేయకుండా వుండేలా ఈ సవరణ చేయబడింది. ఎమర్జెన్సీ విధింపుకు సంబంధించిన ''అంతర్గత కల్లోలం'' అనే పదం స్థానంలో ''సాయుధ తిరుగుబాటు'' అనే పదాన్ని ఉపయోగించారు. ఈ నేషనల్ ఎమర్జెన్సీ విధింపుకు గతంలో కాల పరిమితి అనేది లేదు. 44వ రాజ్యాంగ

BRAOU

సవరణ ఇటువంటి ఎమర్జెన్సీ విధింపును 6 నెలల కాలానికి పరిమితం చేసింది. అవసరమైతే మరో 6 నెలల కాలానికి పొడిగించే అవకాశం కల్పించబడింది. అయితే జనతా ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైన చట్టాలను రద్దు చేసినప్పటికీ మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ డిటెన్షన్ చట్టంతో సహా వేటిని రద్దుపర్చలేదు. ఇందుకు కారణం జనతా ప్రభుత్వం తక్కువ వ్యవధి మాత్రమే అధికారంలో వుండటం.

శ్రీమతి ఇందిరా గాంధీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల నుంచి మరియు ఉన్నత వర్గాల నుంచి వ్యతిరేకత నేపథ్యంలో తన విధానాలను ఆమె పునఃపరిశీలన చేసుకుంది. రైతాంగ ఉద్యమాలు, తెగల ఉద్యమాలు నక్సలైట్ ఉద్యమం ఈ నిరసనలకు ఊతం ఇచ్చాయి. కాశ్మీర్, పంజాబ్, అస్సాం ఈశాన్య రాష్ట్రాల పరిస్థితి భయంకరంగా తయారైంది. ఈ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించాయి. ఇలా నూతనంగా వస్తున్న సవాళ్ళకు క్రియాశీలక్ష రీతిలో భారత రాజ్యం స్పందించలేక పోయింది. ప్రతి సమస్యకు అణచివేతే సమాధానమని సరిపెట్టుకొంది. ఈ దశలోనే అనేకమైన ప్రజావ్యతిరేక చట్టాలు చేయబడ్డాయి. జూలై 27, 1981లో భారత ప్రభుత్వం సమ్మెలను నిషేధిస్తూ ఒక ఆర్డినెన్సు జారీ చేసింది. దీనిని మిలియన్ల కొలది ప్రజలు వ్యతిరేకించారు. కార్మికుల మనుగడకే ప్రశ్నార్థకమైన వాటిని వారు ఖండించారు. దీనికి ముందు 1980 డిసెంబర్‌లో జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) ద్వారా జిల్లా మెజిస్ట్రేట్స్‌కు మరియు పోలీసు కమిషనర్లకు విస్తృతమైన అధికారాలు కట్టబెట్టబడ్డాయి. ఏ వ్యక్తినైనా ఎటువంటి విచారణ లేకుండానే నిర్బంధించే విధానాన్ని ఆ చట్టంలో పొందుపర్చారు. 1981 సెప్టెంబర్‌లో అత్యవసర సరుకుల నిర్వహణ చట్టం ప్రకటించబడింది. 1983 మే 3న కేంద్రీయ పారిశ్రామిక భద్రతా దళం బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఈ చట్టం ద్వారా భద్రతా దళానికి చెందిన వారెవరైనా మెజిస్ట్రేట్ ఉత్తర్వులు లేకుండానే ఎవరినైనా నిర్బంధంలోకి తీసుకునే అధికారం పొందుతారు. 1984లో జాతీయ భద్రతా చట్టానికి చేసిన సవరణ ద్వారా డిస్టర్బ్డ్ బాధిత ప్రాంతాలలో పోలీసులకు ఎక్కువ అధికారాలు ఇవ్వబడ్డాయి. స్వాతంత్ర్యానంతరం అత్యంత పాశవికమైన అణచివేత స్వభావం గల 59వ రాజ్యాంగ సవరణ ఆమోదించబడింది. ఇది జీవించే హక్కును కాల రాసే విధంగా తయారైంది. పోలీసుల అమానుష చర్యలు, ఎన్‌కౌంటర్ మరణాలు, అణచివేత మొదలైన వాటికి అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌లో మరియు ఎ.ఆర్.దేశాయ్ పుస్తకంలోను ఈ సమస్య యొక్క తీవ్రత వివరించబడింది.

8 పౌర మరియు ప్రజాస్వామిక హక్కుల ఉద్యమం

మరియు ప్రజాస్వామిక హక్కుల ఉద్యమం 1960 తర్వాతనే ప్రారంభమైందని చెప్పుకుంటున్నాం. ఈ మేధావి వర్గం ఆధిపత్యానికి మరియు చైతన్యవంతమవుతున్న ప్రజలకు మధ్య వైరుధ్యాలు కన్పించసాగాయి. భారత రాజ్యం సమన్వయపర్చ లేకపోయింది. దీంతో ప్రజాస్వామిక, హక్కులకు సంబంధించిన కు వచ్చాయి. ప్రధానంగా దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటన చేయబడటం భారత భాగంలో గ్యారంటీ చేయబడిన ప్రాథమిక హక్కులను సస్పెండ్ చేయడంతో పౌరహక్కుల యి. రాజ్యాంగం మీద రాజ్యాంగ విలువల మీద విశ్వాసం వున్న ఉదారవాదులకు విశ్వాసం కోల్పోయిన నాయకులు పౌరహక్కుల ఉద్యమాలకు పునాదులు వేసారు.

"నక్సలైట్లపై తీవ్ర వామపక్ష వాదులపై జరిగిన దాడులతోనే భారత దేశంలో పౌరహక్కులపై వించాలి. నేరపూరితమైన రాజకీయాల నేపథ్యంలో నక్సలైట్ ఉద్యమంపై నిర్భంధం లు, రాజకీయ శ్రేష్టుల ఆలోచనా సరళి నిర్వీర్యమై పోయింది. ఇటువంటి నక్సలైట్ జ్య స్వభావం గూర్చి దాని ప్రత్యామ్నాయాల గూర్చిన ప్రశ్నలు లేకెత్తించడానికి భాగంగా ప్రాథమికహక్కుల అవసరం ప్రశ్నించబడింది. అది వివిధ రూపాల్లో ఒకటి ప్రజాస్వామ్య హక్కుల కొరకు సాగే పోరుకు ప్రాథమిక హక్కులు మాజిక న్యాయం కోసం పోరాడే వారికి ప్రజాస్వామ్య హక్కులు ఎంత థమిక హక్కులు అంతే అవసరం అని మోహన్‌రాం భావిస్తారు".

BRAOU

సాగే పోరాటం వాస్తవంగా ఉనికిలో వున్న హక్కులను పరిరక్షించుకోవటమే అవుతుంది. కరణ అనేది ప్రస్తుతమున్న హక్కులపై దాడిగానే భావించాలి.

స్వామ్య వ్యవస్థ నిర్మాణంలో వలస వ్యతిరేక ఉద్యమం చారిత్రాత్మకంగా తన లక్ష్యాన్ని చేరుకోలేదు. ప్రభుత్వ స్వరూపమే కాదు. అదొక జీవన విధానం. అప్రజాస్వామికంగా వున్న సామాజిక, ఆర్థిక లంలో 'ప్రజాస్వామ్యం' అనే దాన్ని రాజకీయాలలో ప్రవేశ పెట్టడం జరిగింది. వాస్తవమైన ప్రజాస్వామ్య మవడానికి అంతర్గతంగా ఆ వ్యవస్థలోనే లోపాలున్నాయి. భారత దేశంలో రాజ్యం మరియు సమాజంపై ప్రజాస్వామికమైన విలువలు ఆధిపత్యం వహిస్తూనే వున్నాయి. ఈ పరిస్థితుల్లో మానవ హక్కుల ఉద్యమం ఒక స్వరూపాన్ని సంతరించుకుంది. భారత రాజ్యాంగంలోని మూడవ, నాల్గవ భాగాలలో పేర్కొనబడిన ం విడిచి పెట్టి వ్యవస్థాపరమైన మార్పులను చేయటం ప్రారంభించింది. రాజ్యం తన సంక్షేమ మరియు ాల నుంచి తప్పుకోవటాన్ని బట్టి రాజ్యం ప్రజల పట్ల అవలంభించే సంబంధాన్ని తెలియజేస్తుంది. రాజ్యానికి జరుగుతున్న సవరణలు ప్రభుత్వ అధికారాన్ని పెంపొందించేందుకు మరియు ఉదార ఆర్థిక ుగ్గు చూపించాయి. దీంతో అణచివేతకు గురైన ప్రజలకు వేరొక మార్గం లేకుండా పోయింది. ఫలితంగా ఉ పునర్నిర్మాణం కోసం పోరాటాలు మొదలైనాయి. ఈ పోరాటాలను అణచివేయడానికి రాజ్యం సర్వాధికారాలను ఉపయోగించింది. ఈ పరిస్థితుల్లో రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించబడ్డాయి. చట్టం ముందు అందరూ సమానమనే విధానం పాలకవర్గాల చెప్పుచేతుల్లోకి మారినట్లయింది. ప్రజాస్వామ్యంలోని స్వేచ్ఛ, హక్కులు హరించబడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా మారింది. ఈ స్థితిలోనే భారత దేశంలో పౌరహక్కుల ఉద్యమాలు చోటు చేసుకున్నాయి. భారత దేశంలోని పౌరహక్కుల సంఘాల ప్రధాన డిమాండ్ ''రాజ్యాంగంలో పొందుపర్చబడిన హక్కులకు రక్షణ కల్పించాలని మరియు అట్టడుగు వర్గాల వారికి సైతం అవి అందుబాటులో వుండే విధంగా వాటిని అమలు పర్చాలని కోరుతున్నారు.

పౌర హక్కుల ఉద్యమం కొన్ని క్లిష్టమైన ప్రశ్నలను ఎదుర్కొంటుంది. రాజ్యం పౌరహక్కులపై అణచివేత చర్యలు చేపడుతున్నప్పుడు ప్రజలు దాన్ని ఎదుర్కొనే హక్కును కలిగి వున్నారా? వుంటే ఎటువంటి పద్ధతుల ద్వారా ఎదుర్కోవాలి? ఈ ఉద్యమం చట్టబద్ధం కాకుండా హింసాయుత పద్ధతుల వైపు దారి తీస్తే ఎలా పరిగణిస్తారు? అనే ప్రశ్నలు ఆలోచించతగినవి. చట్టాన్ని అనుసరించే వారికీ న్యాయపరమైన మరియు రాజ్యాంగ పరమైన నిబంధనలు వర్తిస్తాయి కాని చట్టాన్ని ఉల్లంఘించే వారికి కాదు. ఈ కారణాల చేతనే అణచివేత చట్టాలను ఆమోదించే అవకాశం ఏర్పడుతుంది. అయితే ఏ చట్టమైనా దాన్ని అమలుపర్చే విధానం సరిగా లేకపోతే నిష్ఫలమవుతుంది. అరాచక పరిస్థితిని ఎదుర్కొనేందుకు సాయుధ శక్తి ఉపయోగం ద్వారానే సాధ్యమవుతుందని భావిస్తున్నారు. ప్రైవేటు మరియు రాజకీయ హింసకు రాజ్యహింస సమాధానంగా భావింపబడుతుంది. ఈ వాదనను ఒకసారి అంగీకరిస్తే శాంతి భద్రతల పేరుతో థర్డ్ డిగ్రీ పద్ధతుల ద్వారా, ఎన్‌కౌంటర్‌ల ద్వారా, లాకప్‌డెత్‌ల ద్వారా మరియు గ్రామాల మీద దాడుల ద్వారా రాజ్యహింస వికృత రూపం వైపు తీసుకెళ్ళే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది సామాజికక్రమాన్ని దెబ్బతీస్తుంది. సృజనాత్మకమైన సామా ఆలోచనా వర్గాలను అణచి వుంచి సామాజిక అసహనాన్ని పెంపొందిస్తుంది. చట్టం ద్వారా శాంతి భద్ర కాపాడుతానననుకునే కంటే సామాజిక సమతుల్యం ద్వారా మరియు సంస్కరణ పద్ధతుల ద్వారా సులభతరమవుతుంది. ఇది ఆచరణలో లేనప్పుడు అణచివేత వర్గాలు ప్రత్యామ్నాయ మార్గాల వైపు పయనిం వెనుకాడవు.

పైన పేర్కొన్న పరిస్థితుల్లో పౌరహక్కుల సంఘాలకు, సామాజిక వర్గాలకు విస్తృత మద్దతు స్థానం ఈ అవకాశంతో పాటు ఈ సంఘాలకు ఇంకేమైనా స్వయం ప్రతిపత్తి స్థానం లభించిందా? లభించిన ఈ పౌర సమాజంలో నిలద్రొక్కుకోగలిగాయా? మొదలైన ప్రశ్నలకు పౌర హక్కుల సంఘాలు తమకు తాము చెప్పుకోవాలి. కొంత మేరకు పౌర హక్కుల సంఘాలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. ఇందుకు అంశాలు దోహదం చేస్తున్నాయి. ఒకటి- సామాజిక పరిణామంలో అనేక సందర్భాలలో, అనేక దశల్లో

BRAOU

ఉద్యమానికి అవకాశాలు ఏర్పడుతున్నాయి. రెండు- రాజ్యం సమాజంపై అనుసరిస్తున్న పాశవికమైన, అణచివేత స్వభావం గల అధికారాన్ని ప్రశ్నించడం ద్వారా సమాజంలో పౌరహక్కుల ఉద్యమానికి స్థానం లభిస్తుంది. సామాజిక వ్యవస్థపై అన్యాయమైన బహుముఖమైన ఆధిపత్యం ప్రదర్శించబడుతుంది. అణచివేత స్వభావం గల రాజ్యం ఆధిపత్య వ్యవస్థా నిర్మాణ పునాదులపై ఏర్పడింది. ఈ అణచివేత స్వభావాన్ని కేవలం పౌరహక్కుల ఉద్యమాలు మాత్రమే నిరోధించగలుగుతాయి.

ఈ మానవ హక్కుల ఉద్యమం సమాజంలో వస్తున్న అనేకమైన సామాజిక ఉద్యమాల పట్ల తప్పనిసరిగా స్పందించాల్సి వుంటుంది. పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, కులానికి వ్యతిరేకంగా లేదా రిజర్వేషన్ విధానానికి అనుకూలమైన ఉద్యమాలతో సహా అన్ని ఉద్యమాల పట్ల మానవ హక్కుల ఉద్యమం స్పందించాలి. ఆర్థిక అభివృద్ధి పేరుతో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వారికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సి వుంది. ఇవన్నీ మానవ హక్కులతో పెన వేసుకున్న అంశాలే. అభివృద్ధి ప్రక్రియలో పేద వర్గాలకు చెందిన వారు కష్టాలకు, ప్రమాదానికి లోనవడం అంటే మానవ హక్కులను కోల్పోవటమే అవుతుంది. ఏదైనా ప్రగతిశీల ఉద్యమం ప్రజాస్వామ్యయుత హక్కుల కోసం పోరాడటం కూడా విస్తృతమైన మానవ హక్కుల ఉద్యమంలో భాగంగానే పరిగణించాలి. ఈ దిశలో భారత దేశంలో వున్న పౌరహక్కుల సంఘాలు పయనిస్తున్నామని చెప్పవచ్చు. ఇంకా వివరంగా చెప్పుకోవాలంటే నీటి పారుదల సౌకర్యాలు అభివృద్ధి చెందిన ప్రాంతం లేదా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలలో స్థాన భ్రంశానికి లోనైన ప్రజలకు పునరావాసం కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. కొన్ని ప్రాజెక్టుల విషయంలో పర్యావరణ పరిరక్షణ, అడవుల వినాశనం చేసే విధానాల పట్ల సాగే ఉద్యమాలను సంఘటితపర్చి మానవ హక్కుల ప్రశ్నలను రేకెత్తించాలి. ఇవేకాక పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు లేదా కనీస వేతన చట్టాలు, బాల కార్మిక వ్యవస్థ మరియు దోపిడికి గురవుతున్న వలస కార్మికుల హక్కుల ఉద్యమాలన్ని మానవ హక్కుల ఉద్యమాల్లో భాగమే. ఇటువంటి మానవ హక్కుల పోరాటాలు ప్రజల కనీస సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చేందుకు దోహదం చేయటమేగాక ఆయా సమస్యలను ఎదుర్కొంటున్న వారి పోరాటాలకు మద్దతును తెలియజేసేందుకు ఉపయోగపడతాయి.

14.9 ముగింపు

భారత దేశంలో మానవ హక్కులకు సంబంధించి విభిన్నమైన లక్షణాలున్నాయి. ప్రజల సామాజిక చైతన్య స్థాయిలు వారి రాజకీయ స్వరూపాలను బట్టి మరియు భారత రాజకీయాలలో వస్తున్న మార్పులపై ప్రజల ఆలోచనా సరళిని బట్టి మానవ హక్కుల భవిష్యత్తు ఆధారపడి వుంటుంది. ఈ వ్యవస్థ ఆధిపత్యం నుంచి స్వాతంత్ర్యాన్ని న్యాయాన్ని పొందేందుకు ప్రజలు ఉద్యమ నిర్మాణం ద్వారా మార్పును తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. చారిత్రక క్రమంలోనే మానవ హక్కులు తమ పునాదిని స్థానాన్ని పదిలపరుస్తున్నాయి. మానవ హక్కుల ఉద్యమం అనివార్యమైనది. సర్వస్వతంత్రమైనది. ఇటువంటి స్థానం పొందిన మానవ హక్కుల ఉద్యమం కేవలం తమ భవిష్యత్తునేకాక, హక్కులు, స్వేచ్ఛల భవితవ్యాన్ని నిర్దేశించగలుగుతుంది.

14.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నకు **30** పంక్తులలో సమాధానం రాయండి!*

1. పౌరహక్కులపై భారత రాజ్యంలో నెలకొన్న అప్రజాస్వామిక పోకడలను చర్చించండి?

*ఈ క్రింది ప్రశ్నలకు **20** పంక్తులలో సమాధానం రాయండి!*

1. మానవ హక్కులకు రాజ్యాంగం కల్పించిన హామీని గూర్చి వివరించండి?
2. పౌర, మరియు ప్రజాస్వామిక హక్కుల ఉద్యమం గూర్చి చర్చించండి?

BRAOU

BRAOU

భాగం 15 : ఉద్యోగ బృందం–మానవ హక్కులు

విషయక్రమం

15.0 ఉద్దేశం

15.1 పరిచయం

15.2 ఉద్యోగబృందం మరియు మానవ హక్కులు

15.3. విశాల దృక్పథంలో హేతుబద్ధ శాసనాధికారం

15.4 మానవ హక్కుల పరిరక్షణ

15.5. భారత ఉద్యోగ బృందపు స్వభావం

15.6 భారత ఉద్యోగ బృంద అధికారపు మూలాలు

15.6.1 ప్రాచీన కాలం

15.6.2 మధ్యయుగపు కాలం

15.6.3 స్వాతంత్ర్యోద్యపు పూర్వకాలం : స్వాతంత్ర్యోద్యమము

15.7 స్వతంత్ర భారతదేశంలో పరిపాలనా సంస్కృతి మరియు సంక్షేమ లక్ష్యాలు

15.7.1 ప్రత్యేక ఏజెన్సీలు

15.8 సమన్యాయం మరియు మానవ హక్కుల పట్ల గౌరవభావం

15.9 ముగింపు

15.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

15.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

★ ఉద్యోగ బృందానికి మానవ హక్కులకు గల సంబంధాన్ని తెలుసుకోగలుగుతారు

★ భారత ఉద్యోగ బృంద అధికారపు మూలాలు తెలుసుకుంటారు

★ స్వతంత్ర భారతదేశంలో పరిపాలనా సంస్కృతి మరియు సంక్షేమ లక్ష్యాలు వివరించగలుగుతారు.

15.1 పరిచయం

ఉద్యోగ బృందం, సమన్యాయ పాలన మరియు మానవ హక్కులు అంతసంబంధం గలవి. సమన్యాయ పాలనపై ఆధారపడిన ఉద్యోగ బృందం ఉన్నత ప్రమాణాలు గల మార్గదర్శక సూత్రాలతో పనిచేసే వీలు కల్పిస్తుంది. ఒకసారి చట్టబద్ధ పాలనను అంగీకరిస్తే పౌరుల హక్కులు స్వేచ్ఛలు కొంతమేరకు పరిరక్షించబడతాయి. ఇదే పాశ్చాత్య ఉదారవాద ప్రజాస్వామ్య సిద్ధాంతపు భావన. ఇండియా వంటి మూడవ ప్రపంచ సమాజాలలో ఉద్యోగబృందం, ముఖ్యంగా అణచివేసే

శాఖ సమన్యాయ పాలనను పాటించకపోవడంతో పాటు దాన్ని చర్యగా తీసుకోకపోవడానికి లేక మితిమీరిన చర్యకు కారకంగా భావిస్తుంది. కొంతమంది పోలీసు అధికారులు సామాజిక రాజకీయ సమతౌల్యాన్ని సరిగ్గా దృఢంగా నమ్ముతున్నారు. ఇట్లాంటి దృక్పథం వల్ల పరిపాలనా వ్యవస్థ పక్షపాతం అవడమే కాకుండా రాజ్యాంగాభివృద్ధిని కుంటుపరిచి తద్వారా మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తుంది.

15.2 ఉద్యోగ బృందం మరియు మానవ హక్కులు

హేతుబద్ధ శాసన ఉద్యోగ బృందం

ఆధునిక ఉద్యోగ బృంద రూపాలు హేతుబద్ధ శాసనాధికారం పై ఆధారపడినందువల్ల వాటిని మాక్స్ వెబర్ ప్రశంసించారు. మాక్స్ వెబర్ ఉద్దేశంలో సాంప్రదాయ మరియు సమ్మోహన అధికారాలకంటే హేతుబద్ధ శాసనాధికారమే ఉన్నతమైనది. ఆధునిక కాలంలోని వ్యవస్థ రూపాన్ని, అంశాన్ని ఏక మొత్తంగా నిర్ణయించేది హేతుబద్ధ శాసనాధికారమే. నియమ నిబంధనలు, పద్ధతులు, లిఖిత పత్రాలు, తటస్థత, గోప్యత, రాజకీయాలకు అతీతంగా ఎంపిక, శిక్షణ మొదలయినవన్నీ హేతుబద్ధ శాసన నిర్మాణ వ్యవస్థను బలోపేతం చేస్తాయి. మొత్తం మీద ఈ ప్రయత్నమంతా ఎందుకంటే వీలైనంతవరకు పనిచేసే వాళ్ళు, వాళ్ళ ప్రవర్తనా సంబంధాలను క్రమబద్ధీకరించి ప్రమాణాలను మెరుగుపరిచే శిక్షణ వ్యవస్థను ఏర్పరచాలి. క్రమానుగత శ్రేణుల్లోని అన్ని స్థాయిలలో ఉన్న విషయ సంబంధమైన కారకాలను తొలగించడానికి కూడా ఈ ప్రయత్నం దోహదపడుతుంది. ఒకవేళ ఎక్కడయినా విషయ సంబంధమైన కారకం ఉన్నట్లయితే దాన్ని ఉద్యోగులకు వదిలిపెట్టడానికి బదులు వీలైనంతవరకు సంస్థ పరం చేయడం మంచిది. ఉద్యోగులందరూ సంస్థ హేతుబద్ధంగా నిర్ణయించుకున్న లక్ష్య సాధనకే ఉద్దేశించబడతారు. ఇలాంటి ఏర్పాట్లుగల దాన్నే ఆదర్శ నమూనా అంటారు. ప్రపంచంలోని ఉద్యోగ బృందాలన్ని దీన్నే అనుసరిస్తున్నాయి.

15.3 విశాల దృక్పథంలో హేతుబద్ధ శాసనాధికారం

ఉద్యోగ బృందమంతా 'మిగులు' ద్వారా తయారయిందని మాక్స్‌వెబర్ అభిప్రాయం. ఏ సమాజం మిగులు అనేది లేకుండా ఉద్యోగులను పెంచి పోషించలేదు. అందువల్ల ఉద్యోగ బృంద వ్యవస్థల స్థిరత్వం అదనపు ఉత్పత్తి పైన మరియు రాజ్యం వనరులను సమీకరించుకునే శక్తి సామర్థ్యాలపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఉత్పత్తి పెరిగిన కొద్ది సామాజిక సంబంధాలు ఉదారమైనాయి. ఉత్పత్తి ద్వారా మార్కెట్ శక్తులు వచ్చాయి. అవి రాజ్య నియంత్రణలో ఉన్న స్వేచ్ఛకోసం పోరాడాయి. మార్కెట్‌కు రాజ్యానికి ఒక స్థాయిలో ప్రజలకు ఆధిపత్య నిర్మాణాలకు మరొక స్థాయిలో ఉన్న ఘర్షణ ఫలితంగా ఎన్నో కొత్త విలువలు సంస్థలు ఆవిర్భవించాయి. ఈ ప్రక్రియ రాజకీయ రంగంలో ముఖ్యమైన మార్పులకు దారితీసింది. రాజ్య నిర్మాణంలో ముఖ్యమైన రాజకీయ నాయకులు అధికారాన్ని వినియోగించుకోవడం కోసం సమాజపు సమ్మతి ప్రస్తుతం అవసరం అవుతుంది. ఎన్నికల ప్రక్రియ ద్వారా వచ్చే ఈ కాలానుగుణమైన సమ్మతి ప్రజాస్వామ్య సారంగా భావించవచ్చు.

సామాజిక రంగంలో చాలా పాశ్చాత్య సమాజాలలో క్రమంగా కుటుంబంపై ఆధారపడడం తగ్గుతూ దాని స్థానంలో వ్యక్తిగత లక్ష్యాల కోసం పనిచేయడం ప్రారంభమైంది. చట్టాలు కుటుంబాలకు బదులు వ్యక్తులను పరిగణనలోకి తీసుకొంటున్నాయి. హెన్‌మెయిన్రీ ఉద్దేశ్యంలో మనిషికి మనిషికి మధ్య బంధం వాళ్ళు ఇచ్చి పుచ్చుకునే పద్ధతుల స్థాయిపై ఆధారపడుతుంది. ఇది ఒక ఒప్పందం-చరిత్రలో ఏదో ఒక పాయింట్ దగ్గర మొదలు పెడితే సమాజంలోని వ్యక్తుల సంబంధాల స్థితిని కుటుంబ సభ్యుల సంబంధంగా చెప్పవచ్చు. ఈ సంబంధాలన్ని క్రమంగా వ్యక్తుల స్వేచ్ఛా ఒప్పందం ఫలితంగా సామాజిక క్రమాన్ని నిలబెట్టే దశను చేరుకున్నాయి. ఉదారతత్వ విచారంలో హక్కులు కలిగిన వ్యక్తి రాజకీయంగా ఆధిపత్యం చెలాయించే స్థితికి చేరుకున్నాడు. అలాగే మార్కెట్ స్వేచ్ఛ, పౌర సమాజ ఆవిర్భావం, సమన్యాయ పాలన, మరియు వ్యక్తిగత లక్షణాలకు సంబంధించి పాశ్చాత్య ఉదార ప్రజాస్వామ్య పద్ధతులపై ఆసక్తి, దాని మానవ హక్కుల దృక్పథం మొదలయినవి ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

BRAOU

15.4 మానవ హక్కుల పరిరక్షణ

నేటి కాలంలో వ్యక్తుల హక్కులను న్యాయ మరియు రాజ్యాంగ బద్ధమైన రక్షణలతో పరిరక్షించాలి. రాజ్య అధికారాలను వ్యక్తుల హక్కులను వేరు పరిచారు. కార్ల్ ఫ్రెడరిక్ భావంలో 'రాజ్యాంగం యొక్క మొట్ట మొదటి లక్ష్యం ఏమిటంటే-రాజకీయ సమాజంలోని వ్యక్తియొక్క స్వంత విషయాల్లో ఎవరి జోక్యం లేకుండా కాపాడటం' నిజానికి, రాజ్యాధికారానికి వ్యక్తుల హక్కులకు మధ్యగల సంబంధం ఆధారంగానే ఉదార ప్రజాస్వామ్యపు నాణ్యతను నిర్ణయిస్తున్నారు. అధునిక రాజనీతి సిద్ధాంతం రాజ్యాధికారాన్ని సక్రమంగా ఉపయోగించుకోవడాన్ని మరియు మానవ హక్కుల సాధనను రాజకీయ అభివృద్ధిగా పరిగణిస్తుంది. ఈ సమతౌల్యం ఎల్లప్పుడు రాజకీయ వ్యవస్థలోని వ్యక్తుల మరియు వర్గాల నిరోధన స్థాయిల మరియు రాజకీయ అధికారపు సాంఘిక స్థాయిల ఫలితంగా ఏర్పడుతుంది. ఇలాంటి అభివృద్ధి వలన ఉద్యోగ బృందం వెబర్ మెచ్చుకున్న స్థాయికి ఎదిగింది. పోటీ తత్వం ఉన్న పరిస్థితులలో ఉద్యోగ బృందం 'తటస్థవైఖరి'ని అవలంబించినందువల్లనే దీన్ని మెచ్చుకోవడం జరుగుతుంది. దీని అధికారం వ్యక్తుల హోదా, వ్యక్తిగత సమ్మోహన శక్తివల్ల కాకుండా చట్టబద్ధ హేతుబద్ధ పద్ధతుల వల్ల వస్తుంది. ఉద్యోగ బృందం ఎలాంటి అంశాన్ని ఉల్లంఘించినా సూత్ర ప్రకారం చట్ట వ్యతిరేకమే కాకుండా శిక్షింపదగ్గ నేరం కూడా. ఈ ఏర్పాటులో పౌరుడు సార్వభౌమాధికార హోదాను అనుభవిస్తాడు. ఉద్యోగ బృందానికి అణచివేసే అధికారం లేకపోవడంతో ఈ పద్ధతిలో మానవ హక్కుల పరిరక్షణకు చక్కని వాతావరణం ఏర్పడుతుంది. ఇండియా వంటి సంధియుగంలో ఉన్నదేశాలలో ఉద్యోగ బృందం ఉన్నత ప్రమాణాలను పాటిస్తున్నట్లు కనపడటం లేదు. ఈ కోణం నుండి ఉద్యోగ బృందం మానవ హక్కులపై ఇంకా ఎక్కువ శ్రద్ధతో చర్చ జరగాల్సి ఉంది. అంటే భారత ఉద్యోగ బృంద ఆవిర్భావాన్ని, స్వభావాన్ని విశ్లేషించవలసిన అవసరం ఉంది.

BRAOU

15.5 భారత ఉద్యోగ బృందపు స్వభావం

రాజ్యాంగ బద్ధ పాలనను అందించడంలో పాశ్చాత్య సమాజాలకు ఉన్న అనుభవం ఇంకా భారత దేశానికి లేదనే చెప్పవచ్చు. ఈ ప్రాచీన భారత సమాజం ప్రధానంగా కులపెద్దల చేత పరిపాలించబడింది. కేంద్రీకృత పాలనాధికారాలను చెలాయించడం చేత వారు అధికారాలను హోదాను పొందారు. ఇలాంటి నమూనాను 'Oriental Despotisms'గా వర్ణించారు. ఈగనే కామెంకా అభిప్రాయంలో 'అవి పరస్పరం విభేదించేవి, నిర్దేశించడంలో రాజ్యం పాత్ర తక్కువ, భిన్న సమాజాలు, ఉద్యోగ బృందం ఇంకా పూర్తిగా ఏర్పడని మధ్య వర్తిత్వపు పాలన, నియంతృత్వం లేదా సుల్తానిజం-అక్కడ చట్టాలనేవి ఉండవు. అంతా మామూలుగా ఊహించిన విధంగా ఉంటుంది.'

15.6 భారత ఉద్యోగ బృందం అధికారపు మూలాలు

15.6.1 ప్రాచీనకాలం

ప్రాచీన భారత సమాజాన్ని కొశాంబి అద్భుతంగా విశ్లేషణ చేస్తూ భారతదేశంలో వర్గాలు రాజ్యాన్ని ఏర్పాటు చేయలేదని రాజ్యమే వర్గాలను ఏర్పాటు చేసిందంటాడు. దానర్థం రాజ్యమే మొత్తం వర్గాలను ఏర్పాటు చేసిందని కాదు. కాని రాజ్యానికి వర్గానికంటే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. రాజ్యం కొన్ని అభివృద్ధిపరమైన మరియు అవస్థాపనా కార్యక్రమాలు చేపడుతూనే అదనపు ఉత్పత్తిని సమీకరించడంలో ప్రాధాన పాత్ర పోషిస్తుంది. ఒక విధంగా వర్గాలు రాజ్యాన్ని పోషించడం కాకుండా రాజ్యమే వర్గాలను పోషించింది. భూమి రాజ్య అధీనంలో ఉండటం వల్ల అదనపు ఉత్పత్తిని సమీకరించుకొని వర్గాలను పోషించి పెద్ద శక్తిగా తయారయింది. ఇలా పాలనతో సంబంధమున్న రాజకీయ, పాలనా సంబంధమైన వ్యక్తులు కేవలం కులపరమైన పెద్దతో కాకుండా అధికార వర్గాల్లో ముఖ్యమైన పాత్రను పోషించారు.

15.6.2 మధ్యయుగపు కాలం

ఆదాయాన్ని రాబట్టి సమాజంలో శాంతి భద్రతలను నెలకొల్పే పాలనా వ్యవస్థను దాదాపు ఇస్లాం పాలకులు ఆ తర్వాత కాలంలోని వలస పాలకులు అంగీకరించారు. పేర్షా, అక్బర్ లాంటి పాలకుల సంస్కరణలు కూడా ఆదాయాన్ని పెంచుకోవడానికి, గ్రామాల రైతులపై పట్టు సాధించుకోవడానికి ఉద్దేశించినవే కాని వారి సంక్షేమం కోసం కాదు. ప్రభుత్వ పాలనలో ఇదంతా ఒక సర్వసాధారణమైన విషయంగా మారింది. ఇస్లాం పాలకుల ఆనందం కోసం ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను దోపిడి చేయడంలో పాలకులతో సహకరించింది. బ్రిటిష్ పాలకులు భారతదేశ వనరులను దోచుకోవడంలో ఉత్పత్తి శక్తులను ధ్వంసం చేయడంతో కూడా ఇలాగే జరిగింది. నిజానికి బ్రిటిష్ వారు ఒక కొత్త అధికార యంత్రాంగాన్ని మన మీద అధికారాన్ని చెలాయించడానికి వాడుకున్నారు.

బ్రిటిష్ వారు వారి వలస వాద, సామ్రాజ్యవాద ఆసక్తుల కోసం కనీసం పైకి కనిపించేటట్లయినా ఒక చట్టబద్ధంగా హేతుబద్ధ పాలనా వ్యవస్థను రూపొందించడానికి తీవ్ర కృషి జరిపారు. ఇది వాళ్ళకు 1857 మొదటి స్వాతంత్ర్య పోరాటం తర్వాత సాధ్యమైంది. పాలనాధికారం నేరుగా బ్రిటిష్ రాణి చేతుల్లోకి వెళ్లిపోయిన తర్వాత బ్రిటన్‌లోని చట్టాలను ఇక్కడ ప్రవేశ పెట్టడం ప్రారంభించారు. ఇది పీనల్‌కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లాంటి చట్టాలను ప్రవేశ పెట్టడానికి దారితీసింది. వీటితో పాటు భారతీయులకు, బ్రిటిష్ పాలనకు అవసరమైన విద్యనందించడం ప్రారంభమైంది. బ్రిటిష్ పాలకులతో పాటు ICSకు చెందిన సివిల్ సర్వెంట్ల అధికారంలో భాగం పంచుకున్నారు. చాలామంది భారతీయ అధికారులు బ్రిటిష్ అధికార నిర్మాణంలో భాగస్తులైనారు. మొదట్లో ఇలా ప్రారంభమైన ఈ అధికార యంత్రాంగమంతా ముఖ్యమైన స్థాయిల్లో పనిచేస్తూ ఆ తర్వాత వారి స్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు.

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత వలస పాలకులు క్రమంగా సమన్యాయ పాలనను వ్యవస్థాపరమైన ఏర్పాట్లను ప్రవేశపెట్టి వాటిని అభివృద్ధి పరిచారు. వలస పాలనకు చెందిన కొత్త చట్టాలు సంస్థలు సమాజంపైన రుద్ది న్యాయాన్ని విభజించి, పాలనను ప్రైవేటీకరించి, సామాజిక సంబంధాలను శ్రేణులుగా విభజించారు. స్థానిక భూస్వాములను, జమీందారులను, సంస్థానాధీశులను అనుమతి కొంతమేరకు తీసుకున్నా చాలా వరకు బలవంతంగా వారి అధికారాలను తీసుకున్నారు. 20వ శతాబ్దం ప్రజానీకంలో కొత్త సందేహాల్ని రేకెత్తించింది. సమన్యాయ పాలన, హేతుబద్ధ శాసనాధికారం గల సంస్థలు ఆవిర్భవించినప్పటికి అక్కడక్కడా సాంప్రదాయక అధికారం, వ్యక్తిపాలన, మరియు హేతుబద్ధ అధికారం లేని సంస్థలు కూడా ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం కూడా ఇట్లాంటి సంస్థలు కొనసాగడం వల్ల కొన్ని సమస్యలేర్పడతాయి. కాబట్టి వీటన్నింటిని హేతుబద్ధీకరించాల్సిన అవసరం వుంది. సమాజ పరిపాలన కోసం రాజ్యాంగ పరమైన కట్టుబాట్లను ఏర్పరచారు. మానవ హక్కుల స్థితిగతులు ఏ పరిస్థితుల్లో ఉన్నాయో తెల్సుకోవడానికి దైనందిన పాలనా వ్యవహారాల్లో, సంస్కృతిలో వాటి అమలులో సమన్యాయ పాలనను రాజ్యాంగ చట్టాలను ఎంత మేరకు పాటిస్తున్నారనే దానిపై ఆధారపడి ఉంటుంది.

15.6.3 స్వాతంత్ర్యానికి పూర్వకాలం : స్వాతంత్ర్యోద్యమకాలం

స్వాతంత్ర్యోద్యమకాలంలో గాంధీజీ ప్రవచించిన 'గాంధీ సమానా'ను సమన్యాయ పాలన గాని హేతుబద్ధ శాసనాధికారం గాని అంతగా పట్టించుకోలేదు. నైతికత మీద ఆధారపడిన సామాజిక రాజకీయ క్రమాన్ని గాంధీజి కలలు గన్నారు. పాశ్చాత్య దేశాలలో బూర్జువాలకు వ్యతిరేకంగా వచ్చిన పోరాటాలు సమన్యాయ పాలనను, హేతుబద్ధ శాసనాధికారాలను కోరితే, వలస పాలనకు వ్యతిరేకంగా జరిపిన గాంధీజి పోరాటం సాంప్రదాయక నైతిక అధికారాన్ని కోరడంతో పాటు దాన్ని ఆకాశానికెత్తడం జరిగింది. కాని అది సంస్థల్లోను ఉద్యోగ బృందానికి గల అధికారాలకు ఆధారాలను ప్రశ్నించలేక పోయింది. నిజానికి గాంధీగారే స్వయంగా సాంప్రదాయ సమ్మోహనా శక్తికి ప్రతిబింబంగా నిలిచారు. దీని ఫలితంగా స్వాతంత్ర్య పోరాటం సమన్యాయ పాలనపై ఆధారపడిన పరిపాలనావ్యవస్థను నడపగలిగే వర్గాలను గాని ప్రజలను గాని సన్నద్ధం చేయలేక పోయింది.

BRAOU

స్వాతంత్ర్యానంతరం ఏర్పడబోయే స్వేచ్ఛాయుత సామాజిక ఆర్థిక క్రమానికి అవసరమయ్యే కొత్త పాలనా వ్యవస్థకు సంబంధించిన చర్యను రాజ్యాంగ సభ చెయ్యలేదు. నిజానికి ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటూనే బ్రిటిష్ వారితో సహకరించిన వారే ఆ తర్వాత కూడా అధికారంలో కొనసాగడం! వలస పాలకులు వర్గ దృక్పథంలో ఏర్పరచి స్వాతంత్ర్య ఉద్యమ కారులను చంపిన, అణచివేసిన, అర్ట్స్ట్ చేసే పద్ధతులు ఏ మాత్రం మార్పులు లేకుండా స్వతంత్ర దేశంలో కూడా కొనసాగుతున్నాయి. స్వతంత్ర భారత దేశంలో పాలనా వ్యవస్థను సక్రమంగా నిర్వహించడానికి ఇవన్నీ అవసరమంటూ వాటిని 'ఉక్కు చట్రంగా' సర్దార్ పటేల్ వర్ణించారు. ఎంతో అనుభవం ఉన్నా ఆ పాలనా వ్యవస్థను తోసి పుచ్చలేమన్నది నిజమే అయినా, మనం వేసుకోవాల్సిన తీవ్రమైన ప్రశ్న ఏమిటంటే స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఎంతో అనర్థదాయకమైన పాత్రను పోషించిన పాలనావ్యవస్థ సాధారణ ప్రజల మానవ హక్కులను గౌరవిస్తుందా అని ప్రశ్నించుకోవాలి.

15.7 స్వతంత్ర భారతదేశంలో పాలనా సంస్కృతి మరియు సంక్షేమ లక్ష్యాలు

అధికారయుతమైన శ్రేణుల సంస్కృతి రెవెన్యూ రాబట్టడాన్ని శాంతి భద్రతలను కాపాడటాన్నే తెలియజేస్తోంది. వలస పాలనలో ఈ శాఖలే అత్యంత ముఖ్యమైన పాత్రను పోషించాయి. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగం స్వేచ్ఛను, న్యాయాన్ని ప్రసాదించింది. రాజ్యాంగంలోని మూడవ భాగంలో ప్రాథమిక హక్కులను, నాల్గవ భాగంలో సామాజిక న్యాయాన్ని పొందుపరిచారు. ఈ లక్ష్యాల సాధన కోసం ఎన్నో కొత్త సంక్షేమాభివృద్ధి శాఖలను ప్రారంభించారు. ఈ శాఖలు మానవ హక్కుల సంస్కృతిని ప్రోత్సహించడానికి బదులు అధికారయుత శ్రేణుల సంస్కృతిని ప్రారంభించాయి. పోలీసులు అధికారి, పంచాయితి కార్యనిర్వాహణ అధికారి, సంక్షేమశాఖాధికారి, షెడ్యూల్డు కులాల, తెగల మరియు వికలాంగుల కార్యక్రమాలను నిర్వహించే అధికారులు ప్రవర్తించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. సంక్షేమశాఖాధికారులు ఎవరి కోసమైతే నియమింపబడ్డారో వారి పట్ల ఎంతమాత్రం దయచూపరు.

ఉత్పత్తి ఆధారిత ప్రభుత్వ రంగ సంస్థల్లోని అధికారుల ప్రమాణాలలో కూడా ఏ మాత్రం మార్పులేదు. చాలా ప్రభుత్వ రంగ సంస్థల పరిస్థితి అధ్వాన్నంగా ఉండటానికి గల కారణం వాటిని భూస్వామ్య పద్ధతిలో నడపటమే. ప్రభుత్వ రంగ సంస్థలు పని సంస్కృతిని అభివృద్ధి పరచడం లేదు. కార్మిక సంఘాలను ఎప్పుడూ ఉత్పత్తి క్రమంలో భాగంగా పరిగణించడం లేదు. నిజానికి కార్మికులకు యాజమాన్యానికి మధ్యగల సంబంధాలు ప్రైవేటు పరిశ్రమలో వలె వ్యతిరేకంగా ప్రభుత్వ రంగ సంస్థలో ఉండకూడదు. కాని అధికారయుత పాలనా సంస్కృతి కార్మికునికి సంస్థకు మధ్యన అగాధాన్ని అలాగే ఉంచుతుంది. ఫలితంగా కార్మికులు సంస్థలో తామొక భాగమని భావించడానికి బదులు ఎప్పుడూ సంస్థ తమ హక్కులను కాలరాస్తున్నదని భావిస్తారు. ఇది కొన్ని సందర్భాలలో నిజం. ఫలితంగా ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు బాగుండదని, తగినంత ఉత్పత్తి జరగదని, జవాబు దారితనం ఉండదనే నిర్ణయానికి వస్తారు. ఉత్పత్తి సంస్థల్లోనే కాకుండా మానవ హక్కుల విషయంలో కూడా ఇదే వైఫల్యానికి కారణం. ఈ వైఫల్యమే ప్రైవేటీకరించడానికో, ప్రపంచీకరించడానికో సాకుగా ఉపయోగపడుతుంది. ఈ కొత్త ఆర్థిక నమూనాలు కార్మికుల హక్కులకు సంబంధించి ఎన్నో సమస్యలను సృష్టిస్తాయి.

15.7.1 ప్రత్యేక ఏజెన్సీలు

డెబ్భయ్యవ దశకం ఆరంభంలో పేదరిక నిర్మూలనా కార్యక్రమాల కోసం ప్రత్యేక ఏజెన్సీల రూపంలో పాలనా వ్యవస్థను రూపొందించారు. చిన్న రైతులకు, షెడ్యూల్డు కులాల పేదలకు, షెడ్యూల్డు తెగలకు స్త్రీలకు మొదలయిన వాళ్ళకోసం ఈ ప్రత్యేక ఏజెన్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఏజెన్సీలు ఎంతో బాధ్యతాయుతంగా, ఉదారంగా స్నేహపూర్వకంగా అన్నింటికి మించి పేదలకు మద్దతుగా పనిచేయాలని ఆశించాయి. కాని ఈ సంస్థల పనితీరుపై జరిపిన అధ్యయనాల వల్ల ఈ సంస్థలు లెక్కలేనన్ని సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తున్నది. ప్రాథమికంగా పేదరిక వ్యతిరేక ఉద్యోగ బృంద సంస్కృతికి ఈ సంస్థలు బలైపోయినాయి. ఇలా పేదలకు సహాయపడే ముఖ్యమైన ప్రయత్నం విఫలమైంది.

BRAOU

ఉద్యోగ బృందం తమకు లభించిన ఈ అవకాశాన్ని వినియోగించలేకపోయింది. కనీసం ఉద్యోగ బృందంలోని ఒక వర్గమైనా తమ దృక్పథాన్ని మార్చుకుని గ్రామీణ పేదల ప్రాథమిక అవసరాలు తీర్చడానికి ఉపయోగపడితే మానవ హక్కుల పరిరక్షణ చేసినట్లయ్యేది. మానవ హక్కుల సంస్కృతికి కేంద్రమని భావించే వ్యక్తి గౌరవము హోదా అనేవి అంతర్గత నిర్మాణ రూపంలో ఉన్న అంతర్గత వ్యక్తిగత సంబంధాల వల్లనో ప్రవర్తన వల్లనో సాధ్యం కావు. ఉన్నత స్థాయి మరియు మధ్యస్థాయి ఉద్యోగ బృందంలో అధికారవాదం, పొగరు, మనుషుల పట్ల చిన్నచూపు మొదలయిన లక్షణాలు ఉంటే క్రింది స్థాయి ఉద్యోగులలో పక్షపాత వైఖరి ఉంటుంది. ఈ అంతర్గత సంస్కృతి వల్ల పేద ప్రజల పట్ల, వారి న్యాయమైన అవకాశాల పట్ల అగౌరవ భావం ఏర్పడుతుంది.

పాలనా సంస్కృతి, దృక్పథాలు, సంక్షేమ అభివృద్ధికి సమాజ మార్పుకు సహకరించనందువల్ల ఉద్యోగులు ఒక వర్గంగా బహుశా కావాలనే తరచూ విఫలమయ్యారు. అయితే పాలనా పనితీరుపైనా సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్నది. ప్రజల జీవన ప్రమాణాల్లో అభివృద్ధి ఆశించినప్పటికి అది అలాగే ఉండిపోయింది. ఇది సమాజంలో ఉద్రిక్తతలకు దారితీసింది. సమాజంలో ఉద్రిక్తతలు చెలరేగగానే పాలక వర్గాలు వెంటనే అణచివేత చర్యలు ప్రారంభిస్తాయి. ఈ పరిస్థితి మానవ హక్కుల సంస్కృతిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. సమాజంలోని సమస్యలన్నింటికి అణచివేత కాకుండా ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలున్నాయని మానవ హక్కుల దృక్పథం నమ్ముతుంది. ఇది ఒక సంశయానికి దారితీస్తుంది. మరి పాలకవర్గం ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలను ఎందుకు చేపట్టదు? ఇది వాళ్ళు చట్టబద్ధమైన విధుల్లో ఒకటి. అయితే భారతదేశంలోని పాలక వర్గాలకు చాలా వరకు మానవ హక్కుల పట్ల అవగాహన లేదు. ఈ విషయం పరిపాలనా వ్యవస్థలో మరీ ముఖ్యంగా శాంతిభద్రతల యంత్రాంగంలో స్పష్టంగా కన్పిస్తుంది.

15.8 సమన్యాయం, మానవ హక్కుల పట్ల అగౌరవభావం

శాంతి భద్రతల వర్గాలు వారు అణచివేత మార్గాలను అనుసరిస్తుండటంతో మానవ హక్కులు లేకుండా పోతున్నాయి. ఏ చిన్న సంఘటన జరిగినా సరే ఉన్నత రాజకీయ స్థాయిలనుండి అనుమతి ఉన్నా లేకపోయినా క్రూరమైన హింసాత్మక పద్ధతుల ద్వారా అణచివేత చర్యలు చేపడతారు. స్వతంత్ర భారతావనిలో శాంతి భద్రతల విభాగం వారు కనుక్కొన్న హింసాత్మక పద్ధతులు చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. పాలక వర్గాలు ముఖ్యంగా పోలీసులు రాజ్యాంగ బద్ధమైన పాలనను ఇంకా పూర్తిగా అలవర్చుకోలేదని తెలుస్తున్నది.

రాజకీయ నాయకులు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా తరచుగా ఈ హింసాత్మక పద్ధతులను సమర్థిస్తూనే ఉంటారు. ఇదంతా సమాజంలోని పేద అణగారిన వర్గాలపై ప్రభుత్వపు అణచివేతను తెలియచేస్తున్నది. పేదలను అణచివేస్తున్నారనే విషయంలో భారత ప్రజా జీవితంలో మరే విషయంలో లేనంత ఏకాభిప్రాయం ఉంది.

ఇందులో భాగంగానే పోలీసులు సమన్యాయ పాలననుండి రాజ్యాంగ పద్ధతులనుండి క్రమంగా స్వయం ప్రతిపత్తిని పొందుతారు. నిజానికి మధ్య వర్తిత్వాన్ని తగ్గించి దాని స్థానంలో లక్ష్యాన్ని సాధించే అనధికార పద్ధతులను ప్రవేశ పెట్టి తద్వారా పాలక వర్గాల ప్రవర్తనను నిర్దేశించడమే దీనిలోని అసలు ఉద్దేశం. చట్ట బద్ధ పద్ధతుల పట్ల పోలీసులకు, ఉద్యోగులకు ఇంకా ఇట్లాంటి శక్తులకు ఏ మాత్రం గౌరవాభిమానం లేకపోవడం ఎక్కువగా కనిపిస్తుంది. శాంతి భద్రతల పరిరక్షణకు చట్టాలు ఆటంకంగా వుంటున్నాయంటూ చాలా మంది అధికారులు బహిరంగంగానే వాదిస్తూ ఉంటారు. వారీపరిస్థితికి చేరుకున్నారంటే చట్టాలనే కాకుండా ఎలాంటి ప్రజ్ఞా వ్యతిరేకతను భరించలేక పోతున్నారు. వాళ్ళు పౌరహక్కులపై, ఉద్యమ కారులపై న్యాయవాదులపైన న్యాయమూర్తులపై పాత్రికేయులపై, రాజకీయ వాదులపై దాడిచేస్తారు. అణచివేత వర్గాల ఇట్లాంటి ప్రవర్తనల వల్ల శాంతికి భద్రతకు సంబంధంలేని పరిస్థితి ఏర్పడుతుంది.

15.9 ముగింపు

ఈ భాగం ఉద్యోగ స్వామ్యం యొక్క ఏర్పాటు, భావజాల నిర్మాణం మరియు వర్గపు స్థితిలోనూ దాదాపు

BRAOU

మార్పేమి లేదని వాదిస్తున్నది. రూపానికి సంబంధించిన మార్పులు అక్కడక్కడ ఉన్నప్పటికి విషయానికి సంబంధించిన మార్పులేమి లేవు. సమన్యాయాన్ని మానవ హక్కులను గుర్తించి, గౌరవించి వాటికి కట్టుబడి ఉండే స్థితిని ఇంకా చేరుకోవాలి. ఆధిపత్య వర్గాలకు ఉద్యోగ వర్గాలకు మధ్య ఉన్న సంబంధం కారణంగా కూడా సమన్యాయ పాలన సక్రమంగా అమలు జరగడం లేదు. జాతి రాజ్యాభివృద్ధిలో భాగంగా ఏర్పడిన మధ్య తరగతి వర్గం కూడా అనుకున్నంత పాత్రను నిర్వహించలేక పోయింది. వీళ్ళు దేశాభివృద్ధిలో సమభావ దృక్పథంతో భాగం పంచుకోలేక పోయారు. కొన్ని మినహాయింపులుంటే ఉండవచ్చు. అక్కడ కూడా కొందరు అధికారులు ఒక వర్గపు ఉద్యోగులు సంక్షేమ లక్ష్యానికి అనుగుణంగా పనిచేశారు. కాని ఈ వర్గపు ఉద్యోగులు స్వార్థపరుల అధికారులవలన సక్రమంగా పనిచేయలేక పోయారు. ఫలితంగా పౌరుల్లో మరీ ముఖ్యంగా పేద అణగారిన వర్గాల్లోనూ ఉద్యోగ స్వామ్యం పట్ల, పోలీసులపట్ల గౌరవ భావం లేదు. సమన్యాయ పాలనపట్ల గౌరవం మానవ హక్కులు ఎంతో అవసరమైన ఈ పరిస్థితిలో అసలవి కనపడటమే లేదు. అందువల్ల మానవ హక్కులకు సంబంధించి ఉద్యోగస్వామ్యం యొక్క పాత్ర రోజు రోజుకు సమస్యాత్మకంగా తయారవుతున్నది.

15.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానం రాయండి!*

1. భారత ఉద్యోగ స్వామ్యపు ఆవిర్భావాన్ని, సంస్కృతిని మరియు మానవ హక్కుల పట్ల దాని ప్రవర్తనను విశదపర్చండి?

2. భారత పాలనా వ్యవస్థలోని అధికారం, అభివృద్ధి, సంక్షేమాలనుండి అణచివేతకు మారుతున్నది. మానవ హక్కుల కోణం నుండి ఈ వ్యాఖ్యను విమర్శనాత్మకంగా పరిశీలించండి?

*ఈ క్రింది ప్రశ్నలకు **20** పంక్తులలో సమాధానం రాయండి!*

1. హేతుబద్ధాధికారం యొక్క ప్రాముఖ్యత ఏమిటి? మానవ హక్కుల పరిరక్షణకు అది ఎట్లా అవసరం?

2. స్వాతంత్ర్యానంతరపు భారతదేశ ఉద్యోగస్వామ్యపు పనితీరులోని ముఖ్యమైన సమస్యలను చర్చించండి?

BRAOU

BRAOU

భాగం 16: పోలీసులు – మానవ హక్కులు

విషయ క్రమం

16.0 ఉద్దేశం

16.1 పరిచయం

16.2 పోలీసులు, సిపిసి చేత మానవ హక్కుల ఉల్లంఘన

16.3 సైనిక దళాలు వాటి ప్రత్యేక అధికారాల చట్టం చేత మానవ హక్కుల ఉల్లంఘన

16.4 ముగింపు

16.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

16.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

★ సైనిక దళాలచే మానవ హక్కుల ఉల్లంఘనను తెలుసుకుంటారు

★ భారత దేశంలో మానవ హక్కుల నిరంతర ఉల్లంఘనకు దారి తీస్తున్న రాజకీయ, శాసన సంబంధమైన కోణాలను పరిశోధిస్తారు

BRAOU

16.1 పరిచయం

భారత దేశంలో పోలీసులు, సైనికులు మొదలగు దళాల చేత భారీ ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నది. దేశంలోని చాలా ప్రాంతాలలో 'కూంబింగ్ ఆపరేషన్స్' అనే మిషపై పౌరులను భయభ్రాంతులకు లోను చేయటం, ఉద్యమ సానుభూతి పరుల గ్రామాలను తగుల బెట్టడం, స్త్రీలను అవమాన పర్చడం, వారిపై అత్యాచారానికి పాల్పడటం, పౌరులను అక్రమ నిర్బంధంలో వుంచడం, అరెస్టు చేసిన వారిని హింసించడం, థర్డ్ డిగ్రీని ఉపయోగించడం, లేదా వారిని ఉద్దేశ పూర్వకంగా చంపటం వంటి రూపాలలో దర్శనమిస్తూనే వున్నాయి. మానవ హక్కుల పట్ల స్పృహ వున్న ప్రజలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పని చేస్తున్న పౌర హక్కుల, మానవ హక్కుల సంఘాలు ఇలాంటి ఉల్లంఘనలను నిరసించి, వాటిని నిరోధించడానికి భారత ప్రభుత్వంపై విపరీతమైన ఒత్తిడి చేస్తున్నాయి. ఈ ప్రయత్నంలో భాగంగా మానవ హక్కుల సంఘాలతో పాటు ఆమ్నెస్టీ ఇంటర్ నేషనల్, ఏసియా వాచ్ వంటి సంస్థలు ఈ ఉల్లంఘనలను పరిశోధన చేసి, దోషులపై సరైన చర్య తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశాయి.

చట్టబద్ధంగా మాట్లాడాలంటే రెండు అత్యవసరమైన సందర్భాలను ఎదుర్కొనుటకు సైన్యాన్ని పిలిపించాల్సి వుంటుంది. మత ఘర్షణల వంటి వాటిని నియంత్రించడానికి సైనిక దళాలను మోహరించే అవకాశం సిపిసి 129, 130 సెక్షన్‌లు కల్పిస్తున్నవి. ఇలాంటి ప్రజాందోళన తాత్కాలికమైనది. అయితే దాదాపుగా శాశ్వత ప్రాతిపదికన సైనిక దళాలను మోహరించడానికి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (అస్సాం, మణిపూర్) స్పెషల్ పవర్స్ ఆక్ట్ (అమెండ్‌మెంట్) 1972 అనే చట్టం వీలు కల్పిస్తున్నది.

16.2 పోలీసులు, సిపిసి చేత మానవ హక్కుల ఉల్లంఘన

శాంతికి విఘాతం కలిగించే అవకాశం గల ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ వ్యక్తుల గుంపును లేదా శాంతికి విఘాతం కలిగించే ప్రవర్తన గల ఎలాంటి సమూహాన్నైనా చెల్లాచెదురు చేసే అధికారం ఆర్టికల్ 129లోని రెండవ సబ్ సెక్షన్ ఎక్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌కు లేదా పోలీసు స్టేషన్ అధికారికి వీలు కల్పిస్తుంది. సదరు గుంపును చెల్లాచెదురు చేయడానికి అధికారి ఇచ్చిన ఆదేశాల్ని ఉల్లంఘించినట్లయితే చెల్లాచెదురు కావడానికి అవసరమైన కనిష్ట బలాన్ని ఉపయోగించడానికి ఈ సెక్షన్ అనుమతిస్తుంది. ఆర్టికల్ 130 మాత్రం అల్లర్లను నియంత్రించడానికి సైనిక దళాలను పిలిచే అధికారం ఎక్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌కు ఇస్తుంది. అల్లర్లకు బాధ్యులుగా భావించే వారిని హద్దుల్లో వుంచడానికి అరెస్టు చేయడానికి సైనిక దళాలను ఉపయోగించవచ్చు. అలాంటి వ్యక్తులను చెదర గొట్టడానికి, అరెస్టు చేయడానికి అదుపులోకి తీసుకోవడానికి అవసరమైన అంటే వ్యక్తులను కొద్దిగా గాయపర్చటం, ఆస్తుల్ని ధ్వంసం చేసే బలాన్ని ఉపయోగించవచ్చు. ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ లేని పక్షంలో సైనిక దళాలకు చెందిన గెజిటెడ్ ఆఫీసర్ ఎవరైనా స్వయం నిర్ణయం తీసుకొని శాంతికి విఘాతం కలిగించే గుంపును చెల్లాచెదురు చేసి వీలైనంత తొందరలో ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌కు తెలియజేసే అధికారాన్ని ఆర్టికల్ 131 వీలు కల్పిస్తున్నది.

129, 130 మరియు 131 సెక్షన్‌ల కింద సైనిక దళాలు చేసిన చర్యలను విచారణకు వీలు లేకుండా 132వ సెక్షన్ సైనిక దళాలను రక్షిస్తుంది. సైనిక దళాలను అంతు చిక్కని క్రిమినల్ ప్రాసిడింగ్స్ బారిన పడకుండా రక్షించడమే ఈ సెక్షన్ యొక్క ఉద్దేశ్యం. ఈ సెక్షన్ ప్రకారం ప్రభుత్వ అనుమతి లేకుండా సైనికులపై విచారణ జరపకూడదు.

ఇప్పుడు ఈ సెక్షన్‌ల అమలు వలన ఏం జరుగుతుందో చూద్దాం.

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వస్తున్న అన్ని ప్రజాందోళనలకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని ప్రభుత్వాలు పోలీసు బలగాలను ఉపయోగిస్తున్నాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో తక్కువగా వున్న ప్రత్తి, పొగాకు ధరలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు కాల్పులు జరపగా కొంత మంది రైతులు మరణించారు. చాలా సందర్భాల్లో బలగాలను ఉపయోగించడం ప్రభుత్వపు ఆదేశాల వలననే జరుగుతోంది. ఆందోళనకారులను చెదరగొట్టడం, తీవ్రమైన గాయాలకు గురి చేయడం లేదా చంపడానికి గరిష్ఠస్థాయిలో బలాన్నుపయోగించడం మామూలై పోయింది. ఇలా మానవ హక్కులు మరీ ముఖ్యంగా ఆందోళన చేసే హక్కు మరియు సమావేశ హక్కులు ఉల్లంఘించబడుతున్నాయి.

నిందుతున్ని ఇంటరాగేట్ చేసేటప్పుడు కూడా పోలీసులు మితిమీరిన బలాన్ని ఉపయోగిస్తారు. నిందితుడి నుంచి సమాచారాన్ని రాబట్టడానికి థర్డ్‌డిగ్రీ పద్ధతులను వాడతారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి సంవత్సరం సగటున ఇరవై అయిదు మంది పోలీసు కస్టడీలో చంపబడ్డారు. (1994 జాతీయ మానవ హక్కుల సంఘానికి ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం నివేదిక) ఎంతో మంది నిందితులను అక్రమ నిర్భందంలో వుంచి వారిని హింసించడం అందరికీ తెలిసిన విషయమే. పోలీసుల మితిమీరిన బలాన్ని ఆపే ప్రయత్నాలేవీ జరగలేదు. మానవ హక్కుల కోణం నుంచి ఎన్నో ప్రశ్నలు అడగాల్సి వుంటుంది. కస్టడీలో వున్న వ్యక్తుల హక్కులను కాలరాచిన పోలీసులపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని ఎన్నోసార్లు డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వాలు స్పందించడం లేదు. ఒకవేళ ఒత్తిడి ఎక్కువ చేస్తే సాధారణంగా ప్రభుత్వాలు, పోలీసులు విధి నిర్వహణలో మితి మీరిన తనం కన్పించినా పోలీసు అధికారుల నిర్లక్ష్యం మాత్రం కాదని వాదిస్తూ వుంటాయి. ఇలా ఉల్లంఘనకు పాల్పడుతున్న వాళ్ళ విచారణ నుంచి తప్పించు కోవడానికి సెక్షన్ 132 మరియు 197లు రక్షణ కవచాలుగా ఉపయోగపడుతున్నాయి. అధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించడానికి ఆధారం వుంటే తప్ప వారిపై విచారణ జరగకుండా ప్రభుత్వాధికారులను రక్షించడమే క్రిమినల్ ప్రాసీజర్ కోడ్‌లోని సెక్షన్ 197, 132ల లక్ష్యం. ప్రజల హక్కులను ఉల్లంఘించే అన్ని చర్యలు అధికారుల బాధ్యతను నెరవేర్చడంగా పరిగణిస్తున్నారు. ప్రభుత్వాలు నిందితులపై విచారణ ప్రారంభించినప్పుడు కూడా తీర్పుల్లో వారు చేసిన హింస కంటే వారి ''కర్తవ్యం''పై చేయి అవుతుంది. ఈ

BRAOU

''కర్తవ్యం''లో అధికారులు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించడం, కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేయటం రెండూ వుంటాయని తెలుసుకోవాలి. చర్యకు మరియు అధికార బాధ్యతను నిర్వర్తించడానికి మధ్య హేతుబద్ధమైన సంబంధం వుండాలి. చర్య లనేది ప్రభుత్వాధికారుల అధికార బాధ్యతల పరిధిలో వుండాలి. (బి.పి. శ్రీ వాత్సవ VS.ఎం.పి. మిశ్రా-ఎఐఆర్ 1970 ఎస్.సి.220) లాకప్‌లలో పోలీసుల హింస వారి అధికార బాధ్యతలలో భాగం కాదని. అది శిక్షించదగ్గ నేరమని అందరికీ తెలిసినదే. సుప్రీంకోర్టు ఎన్నో కేసులలో సెక్షన్ 132 మరియు 192లు ప్రభుత్వాధికారులకు (పోలీసులు, ఆర్మీ అని చదవండి) ప్రత్యేకంగా ప్రాణ రక్షణ హక్కు, స్వేచ్ఛ హక్కుల విషయాల్లో వర్తించమని తీర్పును ఇచ్చింది. అందువలన పోలీసుల లేదా సైనికులపై విచారణ జరపడానికి ప్రభుత్వం అనుమతి అవసరం లేదు.

సాధారణంగా కేసుల సత్వర విచారణకు పోలీసులు బలం ఉపయోగించడం తప్పనిసరి అని వాదిస్తారు. ప్రజలు ఇలాంటి చర్యలకు అనుకూలంగా స్పందిస్తారని వాళ్లు నమ్ముతారు. ఒకవేళ ఈ వాదనకు కట్టుబడితే నేరస్తుడని రుజువుపర్చే వరకు ప్రతి వ్యక్తీ అమాయకుడే అనే న్యాయసూత్రం ఏమంత మంచిది కాదు. అధికారంలో వున్న వాళ్లు ప్రజలలో ఈ సూత్రానికి సంబంధించిన చైతన్యాన్ని తీసుకు రావడానికి బదులు హింసను పెంచి పోషిస్తున్నారు.

పోలీసులకు, సైనికులకు రక్షణ కవచంగా వున్న 132, 197 సెక్షన్‌ల బలాన్ని సుప్రీంకోర్టు తగ్గించినప్పటికిని పరిస్థితిలో మార్పేమీ లేదు. ఇక్కడ ఉత్పన్నమయ్యే ఒక ప్రశ్న ఏమిటంటే, కేసులను ఎవరి మీద పెట్టాలి? ఆ కేసులను ఎవరు స్వీకరించాలి? చట్టాలను ఉల్లంఘించే పోలీసులు; వారిపై వచ్చే కేసులను స్వీకరించి వాటిని విచారించారు. ఇలాంటి సందర్భాలలో సిపిసి 190 సెక్షన్ ప్రకారం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ చట్టాల్ని ఉల్లంఘించినట్లు ప్రాథమిక ఆధారం వున్న పక్షంలో కేసులను నేరుగా స్వీకరించి, విచారణకు ఆదేశించవచ్చు. మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన కేసులను కోర్టుకు వచ్చినప్పుడు సాధారణంగా వాటిని మరో పోలీసు శాఖ అయిన సిబిసిఐడికి అప్పగిస్తారు. ఇలాంటి స్థితిలో పోలీసులు ఫిర్యాదులను గానీ, సాక్ష్యాలనుగానీ తెక్క చేయరు. ఇన్ని సమస్యలు వుండటం వలననే మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన బాధితులు ఫిర్యాదు చేయరు. అందువలన ఈ మానవ హక్కుల ఉల్లంఘన నిరాటంకంగా కొనసాగుతూనే వుంది.

పోలీసులు, రాజకీయ నాయకులు కుమ్మక్కు అవడం కూడా ఈ పరిస్థితులు ఇలా వుండటానికి ఒక కారణం. ఒకవేళ మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి వున్నట్లయితే, మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న పోలీసు అధికారుల వ్యవహారాలు చూసేందుకు మంత్రి మండలి ఒక స్వతంత్ర్య ప్రతిపత్తి గల విచారణ సంస్థను ఏర్పాటు చేయాలి. ఈ సంస్థలో మానవ హక్కులకు కట్టుబడి వుండి, సర్వోన్నత న్యాయ స్థానానికి బాధ్యత వహించే అధికారులను ప్రత్యేకంగా నియమించాలి. అప్రజాస్వామిక దృక్పథం కల నేరమయమైన పాలనా వ్యవస్థకు అద్దం పడుతున్న పోలీసు అధికారుల బాధ్యతా రాహిత్యమైన విధి నిర్వహణను అరికట్టేందుకు ఇలాంటి చర్యలు అవసరం. రాజకీయ వ్యవస్థ ఇలాంటి ఉల్లంఘనలను చూసీ చూడనట్లుగా వుంటూ అప్రజాస్వామిక మరియు ఆధిపత్య సామాజిక సంబంధాలను పునరుత్పత్తి చేయడంలో భూమికగా పని చేస్తుంది.

16.3 సైనిక దళాలు, వాటి ప్రత్యేక అధికారాల చట్టం చేత మానవ హక్కుల ఉల్లంఘన

మానవ హక్కుల కోణం నుంచి సైనిక బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం అమలు తీరును ఇప్పుడు చర్చిద్దాం. ఇది మొదటి 1958లో రూపొందించబడి ఆ తర్వాత 1972లో సవరించబడింది.

భారత దేశంలో తిరుగుబాటు ఉద్యమాలను ఎదుర్కొనేందుకు జమ్మూ-కాశ్మీర్‌తో పాటు ఈశాన్య ప్రాంతమంతా సైన్యాన్ని మోహరించారు. దేశంలోని చాలా ప్రాంతాలలో మత ఘర్షణలు ఎదుర్కొనడానికి కూడా సైన్యాన్ని పిలిపించారు. కల్లోల పరిస్థితిని అదుపులోనికి తీసుకు రావడానికి సైన్యం 'సమర్థవంతం'గా పని చేస్తుందని భావిస్తున్నారు. పంజాబ్‌లో ఖలిస్తాన్ ఉద్యమాన్ని అణచి వేయడంలో సైన్యం 'విజయవంతమైంది''. సైనిక బలగాలు తిరుగుబాటు ఉద్యమాలకు దీటుగా దయాదాక్షిణ్యాలు లేకుండా ఉద్యమాన్ని అణచివేసి భారీ ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి.

BRAOU

సైనిక దళాలు ప్రత్యేక అధికారాల చట్టం 1972, ''కల్లోలిత ప్రాంతాలలో సైన్యాన్ని మోహరించే వీలు కల్పిస్తున్నది. సెక్షన్ 4,6లలో ఇలా వున్నది.

కల్లోలిత ప్రాంతంలో నియమింపబడిన ఏ అధికారి అయినా, వారంటు ఆఫీసర్, నాన్ కమీషన్డ్ ఆఫీసర్ లేదా సైనిక దళాలలోని తత్సమాన హోదా కలిగిన ఏ వ్యక్తి అయినా-

(ఎ) అతని దృష్టిలో శాంతిని కాపాడడానికి అవసరమయ్యే హెచ్చరికలు జారీ చేయడానికి, కాల్పులు జరపడానికి లేక అలాంటి బలాన్ని ఉపయోగించడానికి, చట్టాన్ని అతిక్రమిస్తున్న వ్యక్తిని చంపడానికి, ఐదుగురు అంత కంటే ఎక్కువ వ్యక్తులు సమావేశం కాకుండా నిషేధించడానికి, కల్లోలిత ప్రాంతంలోని వ్యక్తులు ఆయుధాలు, ఆయుధ సామగ్రి లేక పేలుడు పదార్థాలు చేపట్టకుండా వుండడానికి-

(బి) అతని దృష్టిలో అవసరమని భావించినట్లయితే సైనిక దాడిలో లభ్యమైన ఆయుధాలను, విధ్వంసక దళాలకు శిక్షణ ఇచ్చే లేదా దాక్కోడానికి ఉపయోగపడే లేదా నేరాలు చేసి పారిపోయిన వారు తలదాచుకుంటున్న శిబిరాలను ధ్వంసం చేయడానికి-

(సి) వారంటు లేకుండా ఏ ప్రాంగణంలోకైనా ప్రవేశించి సోదా చేయడానికి చట్ట విరుద్ధమైన వ్యక్తులను అరెస్టు చేయడానికి, అక్రమ వస్తువుల్ని లేక ఆస్తిని లేక ఆయుధాలను, ఆయుధ సామగ్రిని లేక పేలుడు పదార్థాలను చట్ట విరుద్ధంగా ఆ ప్రదేశంలో వుంచుకున్నట్లయితే బలాన్ని ఉపయోగించైనా సరే జప్తు చేసుకోవడానికి అధికారం వుంది. 6వ సెక్షన్ ప్రకారం కేంద్ర ప్రభుత్వపు అనుమతి వుంటే తప్ప ఎలాంటి విచారణ, దావా లేక ఇతర చట్టబద్ధమైన కేసులు పెట్టడానికి వీలు లేదు.

ఎలాంటి జవాబుదారితనం లేకుండానే సైనిక బలగాలకు ఎక్కువ అధికారాలు వున్నట్లు పై సెక్షనులు స్పష్టం చేస్తున్నాయి. కమీషన్డ్ ఆఫీసర్ హోదా గల ఏ వ్యక్తి అయినా తాను కాల్చి వేయాలని భావించినట్లయితే అది పూర్తిగా చట్టబద్ధమే అవుతుంది. అతని అభిప్రాయాలు రుజువులకు గానీ, న్యాయ సమీక్షాధికారపు పరిధిలోకి గాని రానవసరం లేదు. సెక్షన్ 4 (ఎ)(బి)(సి)లు ఎన్నో మానవ హక్కుల ఉల్లంఘనలకు కారణమయ్యాయి. ఎన్నో బూటకపు ఎన్‌కౌంటర్‌లకు, ఉద్దేశ పూర్వక హత్యలకు సబ్-సెక్షన్ 4(ఎ) కారణమయింది. ఉద్యమ సానుభూతి పరుల గ్రామాలను తగుల బెట్టడానికి సబ్-సెక్షన్ 4(బి) కారణమయ్యంది. కూంబింగ్ పేరుతో సోదా చేయడానికి, జప్తు చేయడానికి, వారంట్ లేకుండా అరెస్టు చేయడానికి గల అధికారాలతో ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడానికి దారి తీసింది. లాకప్‌లో హింసించడం, స్త్రీలను అవమానపర్చి, అత్యాచారం వంటి ఉల్లంఘనలకు సైనిక దళాలు పాల్పడ్డాయి. జమ్మూ-కాశ్మీర్‌లోనూ ఈశాన్య రాష్ట్రాలలోను భారీ ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘన జరగడానికి సైనికులకు గల విచారణకు అవకాశం లేని విపరీతమైన అధికారాలు వుండటమే కారణం.

సైనిక బలగాలపై మానవ హక్కుల ఉద్యమకారులు చేసిన విమర్శలను కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించు కోవటం లేదు. సైనిక దళాల మనోధైర్యం దెబ్బతింటుందన్న కారణంగా మానవ హక్కుల ఉల్లంఘనలపై విచారణ జరపడం లేదు. ఈ దేశ పాలకులు సాధారణ ప్రజలు మానవ హక్కుల కంటే సైనిక బలగాల మనో ధైర్యానికీ ఎక్కువ ప్రాముఖ్యతను ఇస్తున్నారు.

మానవ హక్కుల కోణం నుంచి చూసినప్పుడు కల్లోలిత ప్రాంతలలో సైనిక బలగాలను మోహరించడంలో ఉద్దేశాలేమిటి? కల్లోలిత ప్రాంతాలలో పోలీసుల కంటే సైనిక బలగాలే సమర్థవంతంగా పని చేస్తాయని వాదిస్తున్నారు. ఈ ప్రతిభ ఎక్కడ నుంచి వస్తుంది. మొదటగా విచారణకు వీలు లేని సైనిక అధికారాలు ఈ సైన్యపు ప్రతిభకు ఆధారమవుతున్నాయి. రెండవది సైనిక బలగాలకు విదేశీ సైనికులను ఎదుర్కొనడానికిగాను శిక్షణనిస్తారు. ప్రజలతో పని చేసేటప్పుడు కనిష్ఠ బలాన్ని మాత్రమే ఉపయోగించాలి. విదేశీ సైనికులతో పోరాడేటప్పుడు గరిష్ఠ బలాన్ని ఉపయోగించవచ్చు. ఎందుకంటే వారి పట్ల భారత ప్రభుత్వం బాధ్యత వహించదు. విదేశీ సైనికుల పట్ల ప్రభుత్వానికిగానీ,

DRAO U

సైన్యానికిగానీ ఎలాంటి చట్టబద్ధ బాధ్యత వుండదు. అందువలన గరిష్ట బలాన్ని ఉపయోగించవచ్చు. కల్లోలిత ప్రాంతాలలోని భారత పౌరులైన మిలిటెంట్లతో పోరాడేటప్పుడు కూడా సైన్యం ఇదే దృక్పథాన్ని కొలమానాలను పాటిస్తుంది. ఈ ప్రతిభ కారణంగానే సైనిక బలగాలను గౌరవిస్తున్నారు. అయితే ఇది కూడా చట్టబద్ధ బాధ్యతా రాహిత్యాన్ని తత్ఫలితమైన కనికరం లేని తనాన్నుండి నిరోధించాలి.

ఇతర రాష్ట్రాలలోని తిరుగుబాటు ఉద్యమాలను ఎదుర్కొనడానికి ప్రభుత్వం సాధారణంగా వేర్వేరు రాష్ట్రాలకు చెందిన సైనికుల సమూహాన్ని మోహరిస్తుంది. వారి భాష, సంస్కృతి స్థానిక ప్రజలకు, మిలిటెంట్ ఉద్యమాలకు భిన్నంగా వుండటం వలన కూడా ఘర్షణలు తలెత్తుతాయి. సిక్కు రిజిమెంటుకు చెందిన సైనికుడు ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తున్నప్పుడు స్థానిక ప్రజలతో కలిసి పోవడం కష్టమవుతుంది. ఈ కలిసి పోవడం అనేది లేక పోవడం వల్ల కూడా సైనికుల 'ప్రతిభ' (కనికరం లేని తనం అని చదువుకోండి) పెరగడానికి మరో కారణం అవుతుంది.

స్థానిక పోలీసులు అదే ప్రదేశంలో వుంటూ సమాజ సహాయ, సహకారాలు ఆశిస్తారు కాబట్టి వీరి కంటే సైన్యమే చాలా సమర్థవంతంగా పని చేస్తుంది. సైనికులు ఎక్కడో దూరాన ఒంటరిగా నివసిస్తారు. కాబట్టి వారికి ఎలాంటి సంబంధాలు వుండవు. సైన్యము కొట్టి పరుగెత్తి (హిట్ అండ్ రన్) పద్ధతులను అనుసరిస్తుంది. అయితే స్థానిక పోలీసులు కొంత మేరకు సామాజిక బాధ్యత వహిస్తారు. కాబట్టి సైన్యానికంటే తక్కువ స్థాయిలో వ్యవహరిస్తారు.

దురదృష్టవశాత్తు ఇదే వాదనను తల క్రిందులు చేసి సైన్యాన్ని మోహరించడాన్ని సమర్థిస్తున్నారు. స్థానిక పోలీసులు లంచగొండితనంతో, మత విద్వేషాలతో వుంటారు కాబట్టి మిలిటెంట్లను అణచివేయడం కష్టం అని భావిస్తున్నారు. పరిస్థితిని చక్కదిద్దడానికి సైన్యాన్నే మోహరించాలని అల్ప సంఖ్యాక వర్గాల వారు స్వయంగా కోరిన సందర్భాలున్నాయి. పక్షపాతం లేని సైన్యం, 'పక్షపాతం' లేని హింసకు పాల్పడుతుంది. భయపెట్టడం, బెదిరించడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని రక్షించలేము. స్థానిక పోలీసుల మత సంబంధమైన భావాలను మార్చడానికి బదులు సైన్యాన్ని మోహరించడం వలన మానవ హక్కులకు మరింత విఘాతం కలుగుతున్నది. సైనిక బలగాల చర్యల ఫలితంగా నేరపూరిత కల్లోల స్థితిని అణచి వేయడమే కాకుండా మిలిటెంట్ ఉద్యమాలకు ఊతం ఇస్తున్న సామాజిక శక్తులు కూడా బలహీనం అవుతున్నాయి. ఎదురు దాడి పేరు మీద జమ్మూ-కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో మిలిటెంట్లు ఉద్యమాలకున్న సామాజిక పట్టును సైన్యం కొల్లగొట్టింది. ఇలా ఎందుకు జరిగిందంటే ఏ మిలిటెంట్ ఉద్యమమైనా ఎంతో కొంత మేరకు సామాజిక మద్దతు వుంటే తప్ప కొనసాగదన్న సంగతి సైన్యానికి, ప్రభుత్వానికి బాగా తెలుసు. మిలిటెంట్ ఉద్యమాలు లేవనెత్తుతున్న సమస్యలు ప్రధానంగా రాజకీయమైనవి. ప్రభుత్వం రాజకీయంగా స్పందించక, ఉద్యమాన్ని శాంతి భద్రతల సమస్యగా పరిగణిస్తుంది. సమస్య స్వభావం దానికి ప్రభుత్వం స్పందన రెండూ కలిసి భారీ ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘనకు దారి తీస్తున్నాయి.

సైనిక బలగాల మితిమీరిన చర్యలను ఎదుర్కొనడంతో కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సైనిక బలగాల ప్రత్యేకాధికారాల చట్టం 1972లోని సెక్షన్ 6 ప్రకారం ప్రజా హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన సైనిక ఉద్యోగులను విచారణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి అవుతుంది. ప్రాణ రక్షణ, స్వేచ్ఛా హక్కులను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాధికారుల విషయంలో ఈ సెక్షన్‌ను వర్తింప చేయడం సహేతుకం కాదని సి.పి.సి.లోని 197వ సెక్షన్‌పై సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఈ ఆదేశాన్ననుసరించి కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే హక్కులను ఉల్లంఘిస్తున్న వారిని నేర విచారణ చేయవచ్చు. సెక్షన్ 190 ప్రకారం స్థానిక పోలీసు లేదా మెజిస్ట్రేట్ సైన్యంపై వచ్చిన కేసును స్వీకరించి విచారణ జరపవచ్చు. విచారణ క్రమంలో సైన్యానికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పే వారికి భద్రత కల్పించడం సమస్యాత్మకంగా తయారయ్యింది. మరో పక్క నిందితుడిపై వ్యక్తిగత విచారణ జరపడానికి సైన్యం సహకరించదు. విచారణలో ఇన్ని ఆటంకాలు వుండటం వలన మానవ హక్కుల పరిస్థితి మరింత తీవ్రతరం అవుతుంది. నిందితుడిపై విచారణ జరుపడానికి, పరిశోధన పూర్తి చేయడానికి అనుగుణంగా ప్రభుత్వం కూడా స్పందించదు.

సి.పి.సి.లోని 197 సెక్షన్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ప్రభుత్వమే సైనిక నిందితుడిపై విచారణ

BRAOU

జరపడానికి తనంతట తానుగా ఆదేశాలను ఇవ్వాలి. నిందితున్ని అరెస్టు చేయడానికి ఇదొక పద్ధతి. మరో పద్ధతి ఏమిటంటే సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టం 1972లోని 6వ సెక్షన్‌ను ప్రభుత్వం తొలగించడమే. సైనికుల అధికార దుర్వినియోగం, మానవ హక్కుల ఉల్లంఘన అనేవి అంతర్గత క్రమశిక్షణా చర్యలోకి వస్తాయని సైన్యం వాదిస్తున్నది. కాని పౌరుల హక్కులను ఉల్లంఘించడం సైన్యపు అంతర్గత విషయంగా పరిగణించలేము. సైన్యానికున్న ఈ చట్టాన్ని తొలగించాలని భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేసి ఒత్తిడి తీసుకు వచ్చినప్పటికిని నవంబర్ 1997లో సుప్రీంకోర్టు సైనిక దళాల ప్రత్యేకాధికారుల చట్టాన్ని 1958 సమర్థించింది. సైనిక దళాలకున్న ఈ అధికారాలు అకారణమైనవి కావని భావించింది. అయితే రాష్ట్రంలోని పౌర వ్యవహారాలు చూడటానికి కేంద్రంలోని సైనిక బలగాలు సరైన ప్రత్యామ్నాయం కాదని సుప్రీం కోర్టు భావించింది. ఏ రాష్ట్రంలోనైతే సైన్యాన్ని మోహరించారో ఆ రాష్ట్రంలోని పాలనా వ్యవస్థతో సహకరించి పరిస్థితిని చక్కదిద్దినప్పుడు మాత్రమే సైన్యాన్ని మోహరించే ఉద్దేశ్యం నెరవేరుతుంది. సైన్యపు చట్టాలు కూడా పాలనా వ్యవస్థతో సహకరించడానికి ఉద్దేశించబడినప్పటికీ సైన్యానికున్న విచారణకు వీలులేని ప్రత్యేకాధికారాల కారణంగా మానవ హక్కులకు రక్షణ లేకుండా పోతున్నది. ప్రజాస్వామిక సంస్థలన్నీ బలహీనంగా వుండి సైన్యమే ఏకైక శక్తిగా వున్న సందర్భాలలో మానవ హక్కుల ఉల్లంఘన మరీ ఎక్కువగా వుంటుంది.

16.4 ముగింపు

పై చర్చ ద్వారా సైనిక బలగాలు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడకుండా నిరోధించడం ప్రధాన సమస్య అని స్పష్టమయ్యింది. ''పరిష్కారం హక్కులను నిజం చేస్తుందని పరిష్కారమే లేకుంటే హక్కులే వుండవని'' డా. అంబేద్కర్ అన్నారు. ప్రస్తుత పరిస్థితిని ఈ కోణం నుంచి చూసినప్పుడు ఎంతో మార్పు రావాల్సి వున్నది.

ప్రజా ఉద్యమాల పట్ల రాజకీయ పార్టీల దృక్పథంతో భయంకరమైన చట్టాల రూపకల్పన, రాజకీయ సమస్యల పరిష్కారానికి సైన్యాన్ని వినియోగించటం మరియు మానవ హక్కుల ఉల్లంఘనలు మొదలయినవన్నీ ఒకదానికొకటి ముడిపడి వున్నాయి. ఇవన్నీ ప్రజాస్వామ్యపు విలువను, మానవ హక్కుల స్థితిని ప్రతిబింబిస్తాయి. పౌర హక్కుల, మానవ హక్కుల సంఘాలు తీవ్రమైన ప్రయత్నం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చి 'టాడా' లాంటి భయంకరమైన చట్టాలను తొలగించడంలో విజయం సాధించాయి. అలాగే ప్రజాస్వామ్యపు పౌరహక్కుల కోసం ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రభుత్వం, సైన్యం పాల్పడుతున్న మానవ హక్కుల ఉల్లంఘనకు చరమ గీతం పాడవచ్చు. ఈ నేపధ్యంలో మానవ హక్కుల పట్ల చైతన్యం తీసుకు వచ్చే ప్రయత్నాలలో ఒకటిగా మానవ హక్కుల విద్య ఉపయోగపడుతుంది.

BRAOU

16.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తులలో సమాధానం రాయండి!*

1. సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టం మానవ హక్కులకు ప్రతిబంధకంగా మారుతున్న పరిస్థితులను చర్చించండి?

*ఈ క్రింద ప్రశ్నలకు **20** పంక్తులలో సమాధానం రాయండి!*

1. పోలీసుల చేత జరుగుచున్న మానవ హక్కుల ఉల్లంఘనను చర్చించండి?
2. మనవ హక్కులను ఉల్లంఘిస్తున్న వారిని విచారించడానికి గల సమస్యలేవి? అందుకు మీరిచ్చే సలహాలేమి?

భాగం 17 : ఆంధ్రప్రదేశ్‌లో మానవ హక్కుల పరిస్థితి

విషయ క్రమం

17.0 ఉద్దేశం

17.1 పరిచయం

17.2 కుల పరమైన ఉల్లంఘనలు: ప్రతినిత్యం దళితులను అవమానపర్చటం- వారిపై దాడులు

17.2.1 సామాజిక, ఆర్థిక నేపధ్యం

17.2.2 దళితులపై దాడులు

17.2.3 ప్రజాస్వామ్యం మరియు రిజర్వేషన్లు

17.3 స్త్రీల హక్కులు

17.3.1 సామాజిక, ఆర్థిక నేపధ్యం

17.3.2 ఉల్లంఘన రూపాలు

17.3.3 పోలీసు మరియు న్యాయ వ్యవస్థలో వివక్ష

17.3.4 కుటుంబ సంబంధమైన హింస

17.3.5 ప్రజలు, పోలీసులు మరియు హింస

17.3.6 జనాభా విధానాలు మరియు స్త్రీల హక్కులు

17.4 వ్యవసాయ కూలీల, రైతుల, కార్మికుల హక్కులు

17.4.1 భూమి లేని కూలీలు, రైతులు

17.4.2 గని, భవన నిర్మాణ, బీడి మరియు ఇతర కార్మికులు

17.5 ముఠా సంబంధమైన హింస

17.6 ప్రభుత్వంచే మానవ హక్కుల ఉల్లంఘన

17.6.1 గ్రామీణ పేదల, రాజకీయ స్వాతంత్ర్యాల అణచివేత

17.6.2 నల్లచట్టాలు

17.6.3 లాకప్ హింస

17.6.4 ఎక్సైజ్ విధానం- గిరిజనులపై హింస

17.6.5 ఖైదీల హక్కులు

17.7 అభివృద్ధి-మానవ హక్కులు

17.7.1 ప్రాంతీయ వివక్ష

17.7.2 పారిశ్రామిక కాలుష్యం-పర్యావరణ విధ్వంసం

BRAOU

17.7.3 అభివృద్ధి ప్రాజెక్టులు - వసతి కోల్పోయిన ప్రజలు

17.8 ఉదార ఆర్థిక విధానం - మానవ హక్కులు

17.9 ముగింపు

17.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

17.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు:

★ దళితులపై జరుగుతున్న దాడులను, వాటికి గల కారణాలను తెలుసుకుంటారు

★ ప్రజాస్వామ్యంలో స్త్రీల హక్కులు, ఉల్లంఘనలను వివరించగలుగుతారు.

★ అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల జీవనోపాధి కోల్పోయిన ప్రజల గురించి చర్చించగలుగుతారు.

17.1 పరిచయం

సమాజంలో చారిత్రకంగా పాతుకుపోయిన ఆధిపత్య సంబంధాల కారణంగా జరిగిన ఉల్లంఘనల స్వభావాన్ని వివరించడానికి ఈ పాఠం ఉద్దేశించబడింది. సాధారణంగా మానవ హక్కులు ప్రభుత్వ కోణం నుంచి నిర్వచింపబడినప్పటికీ ఈ పాఠం ఒక వినూత్న దృక్పథాన్ని అనుసరించింది. ఇది మానవ హక్కులను ప్రజాస్వామ్య భాషగా చూస్తుంది. ప్రభుత్వం, సమాజంలోని సంస్థలలో విస్మరింపబడ్డవారు, వారి బాధలని చెప్పుకోవడానికి, ఎందుకు అణుకువగా వుండాలో ప్రశ్నించడానికి సమాజంలో వారి వాటాను అడగటానికి ప్రస్తుతం ఈ పద్ధతినే అనుసరిస్తున్నారు. ఇలా మానవ హక్కుల అర్థం/ అంశం నిరంతరం పునర్వచించబడుతూనే వుంది. దీనితో పాటు మానవ హక్కులు జాతి రాజ్యాల రాజ్యాంగాలలో ప్రాశస్తి కాబట్టి ఆయా రాజ్యాల సమాజాలలోని రాజ్యాంగాల దృక్పథం నుంచి మానవ హక్కులు, అసమానత్వాలను పరిశీలించారో అంత మేరకే మనం అర్థం చేసుకోవలసి వస్తున్నది. వలస పాలనానంతరపు భారత ప్రభుత్వం దీనికి మంచి ఉదాహరణ. ఇది కుల, మత, ప్రాంత, వర్గ, లింగ వివక్ష లేకుండా అందరికీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను ప్రసాదించింది. రాజ్యాంగ లక్ష్యాలు సాధించేందుకు ప్రభుత్వాలకు కొన్ని మార్గదర్శక సూత్రాలను కూడా రూపొందించింది. మనం ఇప్పుడు ఈ కోణం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో మానవ హక్కుల స్థితిని చర్చిద్దాం.

మద్రాస్ ప్రెసిడెన్సీలో ఇప్పుడున్న కోస్తా ఆంధ్ర ఒక భాగంగా వుండేది. తెలుగు మాట్లాడే ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమించిన దరిమిలా 1953లో ఆంధ్ర రాష్ట్రం అవతరించింది. ఆ తర్వాత ఏర్పాటు చేసిన భాషా ప్రయుక్త రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ మొదటిది. సహజ సంపదలోనూ, వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులలో దేశంలోని రాష్ట్రాలన్నింటిలో సుసంపన్నమైనదిగా అవతరించింది. కాని మానవ హక్కుల విషయంలో అనగా జీవించే హక్కు, ప్రాణరక్షణ పరిస్థితులు, తగినంత ఆహారం, వైద్యం, అక్షరాస్యతా విషయాలలో దేశంలోని రాష్ట్రాలన్నింటిలో ఘోరమైన స్థితిలో వున్నది. దక్షిణాది రాష్ట్రాలన్నింటిలోనూ ఇదే దిగువన వున్నది. ఈ రాష్ట్రాలలోనే స్త్రీలు, పిల్లల మరియు వృద్ధ జనాభా శాతం ఎక్కువగా వుంది. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు భాగాలైన తెలంగాణ, కోస్తా ఆంధ్ర, మరియు రాయలసీమలలో మరింత ప్రాంతీయ వ్యత్యాసాలున్నాయి. వలసపాలనలోను స్వాతంత్ర్యానంతరం కూడా నూటయాభై సంవత్సరాల పాటు నీటి పారుదల విధానాల వలన కోస్తా ప్రాంతం లబ్ధి పొంది సుసంపన్నం అయినప్పటికీ తెలంగాణ, రాయలసీమలు చారిత్రకంగా వలస పాలనలోనూ, స్వాతంత్ర్యానంతర కాలంలోనూ అశ్రద్ధ చేయటం వలనవెనుకబడ్డాయి. వలస వాదానంతరం అనుసరించిన 'అభివృద్ధి' పథం ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా, ఆర్థికంగా, గణనీయమైన

BRAOU

మార్పులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని మానవ హక్కుల స్థితిగతులను అర్థం చేసుకోవాలంటే రాజకీయ, ఆర్థిక మార్పుల నిర్మాణ సంబంధాలను అభివృద్ధి పథాలను, వర్గాలను, కులాలను, స్త్రీ, పురుష అసమానత్వాలను మరియు రాష్ట్రంలోని మూడు భౌగోళిక ప్రాంతాల రాజకీయ చరిత్రను అర్థం చేసుకోవాల్సి వుంటుంది.

రాష్ట్రంలో ప్రస్తుతం వున్న మానవ హక్కుల పరిస్థితిని వలసవాదానంతర కాలంలోని సామాజిక, ఆర్థిక విధానాల కోణం నుంచి అర్థం చేసుకోవాలి. అన్నిటికంటే ముందు పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల వలే ఆంధ్రప్రదేశ్ భూ సంస్కరణలను అమలుపర్చలేక పోయింది. ఈ కారణంగా గ్రామీణ పేదలకు ఆస్తిపాస్తులేవీ లేక పేదరికాన్ని అధిగమించలేక పోతున్నారు. రెండవది వనరుల పంపిణీ విషయంలో రాష్ట్రం ప్రజల ఆరోగ్యం, పౌష్టికాహారం విద్యా సంబంధమైన విషయాల కంటే భారీ సీటి పారుదల ప్రాజెక్టులకు, మెగా విద్యుచ్ఛక్తి, ప్రాజెక్టులకు ఖర్చు చేసింది. ఆరోగ్యం, పౌష్టికాహారం లాంటి విషయాలలో ఖర్చు చేసిన ఆ చిన్న మొత్తం కూడా ధనికులకు ఎక్కువ, పేదలకు తక్కువ స్థాయిలో ఉపయోగపడింది. అదీగాక ఈ రంగాలపై పెట్టుబడి రానురాను తగ్గుతూ వస్తున్నది. ఈ కారణంగా మెజార్టీ ప్రజానీకం విద్యా, వైద్య అవకాశాలకు దూరంగా వుంటున్నారు. మూడోది రాష్ట్రంలోని పారిశ్రామికీకరణలో ప్రధానంగా 1980లలో చాలా పరిశ్రమలు ఎగుమతిని దృష్టిలో వుంచుకుని కార్మికుల కంటే పెట్టుబడికి ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చేవిగా మారాయి. ఈ పరిశ్రమలు ఎలాంటి ఉపాధిని కల్పించక పోవడంతో రాష్ట్రంలోని నిరుద్యోగ పరిస్థితి చెప్పుకోదగినంతగా మారలేదు. నాల్గవది పేదరికం, విద్యా, వైద్యం పట్ల నిరుద్యోగం మొదలగు కారణాలన్నింటి చేత సమాజంలో అప్పటికే దిగువ స్థాయిలో వుంటూ, హింసకు గురవుతూ రోగాలతో పేదరికంతో మెజార్టీ స్త్రీలు మరణిస్తున్నారు. ఐదవది హరిత విప్లవం. తర్వాత వెనుకబడిన కులాల్లో కొత్త ఆధిపత్య శక్తులు ఆవిర్భవించాయి. ఈ శక్తులు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో నుంచి ప్రాతినిధ్యం వహించాయి. ఆ తర్వాత రాష్ట్రంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయి. ఆరవది ఎమర్జెన్సీ తర్వాత ప్రభుత్వం మరీ అణచివేత చర్యలకు పూనుకొంది. గ్రామీణ, పేదల, స్త్రీల, దళితుల, గిరిజనుల, రైతుల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో నెరవేర్చవలసింది పోయి పోలీసులు, సైన్యం వంటి యంత్రాంగాలతో ఎన్నో ఉద్యమాలను అణచివేసింది. ఏడవది నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేయడానికి పోలీసులకిచ్చిన అధికారాలతో పోలీసు యంత్రాంగం అక్రమంగా కనీసం ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు బాధ్యత వహించనంత బలంగా తయారయ్యింది. ఎనిమిదవది రాష్ట్రం 1990లలో సంక్షేమ పథకాలను ఉపసంహరించుకుని ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థల సహాయంతో ప్రపంచీకరణను ఆహ్వానిస్తూ ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టింది. దీనివలన కార్మికుల జీవిత ప్రమాణాలు తగ్గడంతో పాటు వ్యవసాయదారులకు వ్యవసాయంలో నష్టాలు పెరిగాయి.

రాష్ట్రంలో వచ్చిన దళిత, స్త్రీల, నక్సలైట్, పర్యావరణ గిరిజన ఉద్యమాలను 1970ల, 80లలోని సామాజిక, ఆర్థిక, పరిస్థితుల నుంచి అలాగే పౌరహక్కుల ఉద్యమాలను 70లలోని నక్సలైట్ ఉద్యమాన్ని అణచి వేయడానికి రాష్ట్ర ప్రభుత్వపు అణచివేత చర్యల నుండి చూడాలి. నక్సలైట్ ఉద్యమం తెలంగాణాలోని భూస్వామ్యాన్ని ఎదిరించి, గ్రామీణ పేదల్ని సమీకరించి, వారి పని హక్కుల కోసం, భూమి హక్కుల కోసం డిమాండ్ చేసింది. అది కనీస వేతనాలు భూ సంస్కరణలు, వెట్టి చాకిరీ నిర్మూలనను, గ్రామాలలో భూస్వామ్య పద్ధతుల నిర్మూలన వంటి ప్రశ్నలను లేవెత్తించింది. 1980లలో వచ్చిన స్త్రీ ఉద్యమాలు కుటుంబంలోనూ మరియు బయట కూడా వుండే హింసకు అణిగిమణిగి వుండే తనానికి వ్యతిరేకంగా గొంతెత్తాయి. కుటుంబాలలోని వరకట్న హత్యల్ని, లాకప్‌లలో స్త్రీల మరణాలను మరియు శాసన, వైద్య, పోలీసు యంత్రాంగాలలో పితృస్వామిక ఆధిపత్యాన్ని ప్రశ్నించారు. 1980లలో వచ్చిన దళిత ఉద్యమాలు ఆంధ్ర సమాజంలోని శ్రేణీయుత అప్రజాస్వామిక కుల వ్యవస్థ భయానక స్వభావాన్ని మరియు దాని భావజాల ఆధిపత్యాన్ని ప్రశ్నించింది. వివిధ రకాలైన ఉద్యమాలలో ప్రజలు ఇచ్చింది పుచ్చుకొనే పద్ధతిలో కాకుండా సమాజం నుండి, ప్రభుత్వం నుండి తమకు రావలసిన హక్కుల కోసం (సంఘ సంస్కరణల ఉద్యమాలలో వలె కాకుండా) డిమాండ్ చేయడం ప్రారంభించారు. స్వేచ్ఛా సమానత్వాలను ఇంకా గుర్తించలేక పోవడం వలననే మానవ హక్కుల ఉల్లంఘనలు కొనసాగుతూనే వున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో మానవ హక్కుల ఉద్యమం ఒక రూపుదిద్దుకోవడానికి ప్రస్తుతం వున్న పౌరహక్కుల ఉద్యమం

BRAOU

(ముఖ్యంగా ఎపిసిఎల్‌ఆర్) మానవ హక్కుల ఉల్లంఘనలను చాలా వరకు నమోదు చేసి ఉపయోగపడింది. దేశంలో మన రాష్ట్రం మరీ ఘోరంగా మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడినట్లు, పరిస్థితి మరీ విషమిస్తున్నట్లు రికార్డులు తెలియజేస్తున్నాయి. అయితే ఇక్కడ గుర్తుంచు కోవాల్సిన విషయం ఏమిటంటే స్త్రీల, దళితుల, గిరిజన హక్కుల ఉల్లంఘనల కంటే గ్రామీణ పేదలపై, భూమి లేని వారిపై ఆధిపత్య వర్గాలు మరియు ప్రభుత్వం చేస్తున్న ఉల్లంఘనలే ఎక్కువగా నమోదు అవుతున్నాయి. బహుశా నక్సలైట్ ఉద్యమం బలంగా వుండడం ఇందుకు కారణం కావచ్చు. అందువలన ఈ లెక్కలు కూడా అసంపూర్ణమే. కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లో మానవ హక్కులను గురించి చర్చించేటప్పుడు సరిగా నమోదు కాని లేక అసలే నమోదు కాని - బాలికలపై, స్త్రీలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు గ్రామాలలో అంటరానితనం, గిరిజన భూముల ఆక్రమణ, ఖైదీల హక్కులు మొదలయినవి ఎన్నో వుంటాయని గుర్తుంచుకోవాలి. ఈ పాఠం ఐదు రకాలుగా వర్గీకరించబడింది. అనగా అసమానత్వాల వలన ఏర్పడే ఉల్లంఘనలు, ప్రభుత్వం చేత మానవ హక్కుల ఉల్లంఘనలు మరియు అభివృద్ధి 'క్రమంలో' జరుగుతున్న ఉల్లంఘనలు' ప్రభుత్వంచే మానవ హక్కుల ఉల్లంఘన, అభివృద్ధిలో మానవ హక్కులు. ఈ పాఠం సంఘటనలను వివరించడాని కంటే ఉల్లంఘనల భావనలను వర్ణించడానికి ఎక్కువ ప్రాముఖ్యమిస్తుంది.

17.2 కులపరమైన ఉల్లంఘనలు: ప్రతినిత్యం దళితులను అవమానపర్చడం– వారిపై దాడులు

17.2.1 సామాజిక – ఆర్థిక నేపథ్యం

అధికారికంగా షెడ్యూల్డు కులాలని పిలవబడుతున్న దళితులు ఆంధ్రప్రదేశ్‌లో 15.93 శాతం వున్నారు. చారిత్రకంగా హిందూ సమాజంలో వారు అగ్రకులాల క్రింద బలవంతంగా అణగిమణిగి జీవిస్తున్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల వలెనే ఆంధ్రప్రదేశ్‌లో కూడా దళితులు అంటరానివారిగా శారీరకంగా, లైంగికంగా దోపిడీకి గురవుతూ అన్నిటికీ బలవంతంగా అగ్రకులాలపై ఆధారపడుతూ జీవిస్తున్నారు. బలహీనులు అవడం వలన, ఇతరత్రా సంబంధాలేవీ లేకపోవడం కారణంగా జైళ్ళలో కూడా వారి సంఖ్యే ఎక్కువగా వుంది. వారి అక్షరాస్యతా శాతం కూడా (31.59 శాతం) చాలా తక్కువ. స్త్రీల అక్షరాస్యతా శాతం మరీ తక్కువ. అందరి కంటే గిరిజనులలో అక్షరాస్యత శాతం అత్యంత తక్కువగా 17.16 శాతం వుంది. మధ్యలో బడి మానివేసిన దళిత విద్యార్థుల సంఖ్య కూడా ఎక్కువే. అంటరానితనాన్ని రాజ్యాంగంలోని 17వ ఆర్టికల్ ద్వారా నిషేధించినప్పటికీ అది ఇంకా చాలా గ్రామాలలో కొనసాగుతూనే వుంది. నిజానికి వీరి ఇళ్ళు కూడా ఊరికి అవతల వుంటాయి. ప్రభుత్వ, ప్రయివేటు స్థాలాలలో కుల పరమైన వివక్ష, గ్రామాలలో హౌసింగ్ కాలనీలలో దళిత స్త్రీలపై అగ్రకులాల లైంగిక, శారీరక వేధింపులు, విద్యా సౌకర్యాలు లేకపోవడం, దళితుల ఇళ్లపై కాలనీలపై దాడులు జరపడం, అత్యాచారాలకు పాలుపడటం, దళిత స్త్రీ, పురుషులను హింసించటం, చంపటం మొదలైన రూపాలలో ఆంధ్రప్రదేశ్‌లో దళితులపై వివక్ష కొనసాగుతూనే వుంది. ఇవన్నీ రాజ్యాంగంలోని 15, 16 నిబంధనలను ఉల్లంఘించటం క్రిందకే వస్తాయి. రిజర్వేషన్లు ప్రభుత్వ పాలనా వ్యవస్థలో దళితుల సంఖ్యను పెంచడంలో విజయవంతమైనప్పటికీ, ప్రయివేటు రంగంలో వివక్ష ఇంకా కొనసాగుతున్నది. ప్రభుత్వ రంగంలో కూడా అగ్రకులాల ఆధిపత్యం కారణంగా చాలా సందర్భాలలో రిజర్వేషన్లు అమలు జరగడం లేదు.

17.2.2 దళితులపై దాడులు

ఆంధ్రప్రదేశ్‌లో అగ్రకులాల వారు దళితులపై దాడులు జరపడం ప్రధానంగా 1980లలో సంపన్న కోస్తా ఆంధ్ర జిల్లాలలో మొదలయ్యాక వెలుగులోకి వచ్చాయి. ఇక్కడ చైతన్య వంతులైన కొంత మంది చదువుకున్న దళితులు అగ్రకులాల ఆధిపత్యాన్ని ప్రశ్నించి తమని సమానులుగా గుర్తించమని డిమాండ్ చేశారు. దీనికి అగ్రకులాలు భయానక పద్ధతిలో స్పందించి వరుసగా దళితులపై దాడులు జరిపి, కొంత మందిని చంపి, స్త్రీలపై అత్యాచారం చేసి, నగ్నంగా

BRAOU

ఊరేగించి దళిత బస్తీలను లూటి చేసి వాటిని తగులబెట్టారు. మూడు దశాబ్దాల క్రితం కృష్ణా జిల్లాలోని కంచికచర్లలో జరిగిన కోటేశు హత్యను దీనికి ప్రారంభంగా చెప్పవచ్చును. 1985లో కారంచేడు, 1991లో చుండూరు దురాగతాలు అగ్రకులాల క్రూరత్వానికి మంచి ఉదాహరణలు. కారంచేడులో జులై 11, 1985న ఆరుగురు దళిత యువకులను చంపి, ముగ్గురు అమ్మాయిలపై ఆధిపత్య రైతు కులానికి చెందిన యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. కారంచేడు సంఘటన తర్వాత ఇలాంటి సంఘటనలు నీరుకొండ, పదిరికుప్పం, దొంతిలి, గుడివాడ, చీరాల, తిమ్మ సముద్రం, పిప్పేరి, నడిపల్లికోట్ల, జీరుపాలెం, పులివెందుల వంటి చోట్లలో ఆంధ్రప్రదేశ్ అంతటా భారీ ఎత్తున దాడులు జరిగాయి. మారుమూల ప్రాంతాలలో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగినప్పటికీ వెలుగులోనికి రాలేదు. కొన్ని తెలంగాణ జిల్లాలలో దళితులను మంత్రగాడనే ముద్రవేసి చంపడం పరిపాటి. చుండూరులో ఆగస్టు 6, 1991న ఆరు గ్రామాలకు చెందిన అగ్రకులాల వారు ఇరవై మందిని సామూహికంగా చంపి వేసిన సంఘటనలో దాడులు పరాకాష్టకు చేరుకున్నాయి. ఈ సంఘటన తర్వాత ఉద్యోగులు, పోలీస్ యంత్రాంగం, పాలక వర్గం అగ్రకులాలతో మరింత కుమ్మక్కయ్యారు. దాదాపు అన్ని కేసులలోని నిందితులకు అధికారంలో వున్న రాజకీయ నాయకులకు దగ్గర సంబంధాలున్నాయి. పోలీసులు దళితుల పట్ల దయ చూపించాల్సింది పోయి అగ్రకుల భూస్వాములకు ఎన్నో రకాలుగా సహాయపడ్డారు. దాడులకు గురయిన బాధితులకు పోలీసులు రక్షణ కల్పించక పోగా (అగ్రకులాలకు, దళితులకు మధ్య వున్న ఉద్రిక్తతలు తెలిసి కూడా) వారిని వేధించారు. చాలా కేసులలో పోలీసులు దళితులను అరెస్టు చేయడానికి చూపిన చొరవ, అగ్రకులాల వారిని అరెస్టు చేయడానికి చూపించలేదు. దాడులకు పాల్పడిన నిందితులను అరెస్టు చేయాలని బాధితుల బంధువులు ఎంత వేడుకున్నా అది జరగలేదు. ఉద్యోగులు కూడా బాధితుల అవసరాలు తీర్చడంలో నిదానంగా వ్యవహరించారు. ప్రభుత్వం కూడా 1989లో రూపొందించిన షెడ్యూల్డ్ కులాల, తెగల (దాడుల నివారణ) చట్టాన్ని సక్రమంగా అమలుజరపలేక పోయింది. ఉదాహరణకు నిందితులు చాలా కాలం క్రితమే లొంగిపోయినప్పటికీ వారిపై విచారణ ప్రారంభించటానికి ప్రభుత్వానికి ఆరు సంవత్సరాల కాలం పైనే పట్టింది. పులివెందుల, జీరుపాలెం లాంటి విషయాలలోనైతే పోలీసులు అసలు కేసులే నమోదు చేయలేదు. ఈ దాడుల నేపధ్యంలో అగ్రకులాల ఆధిపత్యాన్ని నిలదీస్తూ దళిత ఉద్యమం ఆవిర్భవించింది.

17.2.3 ప్రజాస్వామ్యం మరియు రిజర్వేషన్లు

పై సంఘటనలు అగ్రకుల క్రూరత్వాన్ని తెలియజేస్తే తెలుగుదేశం ప్రభుత్వం 1987లో వెనుకబడిన కులాలకు, దళితులకు రిజర్వేషన్లను పెంచేందుకు ఉద్దేశించిన మురళీధర రావు కమిషన్ నివేదికను అమలు పర్చే సంఘటన కులానికి ప్రజాస్వామ్యానికి మధ్య సంబంధాన్ని తెలియజేస్తుంది. రిజర్వేషన్లు "ప్రతిభ" గల విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తాయని, ప్రతిభ లేని రిజర్వేషన్ విద్యార్థులు అసమర్థులు కాబట్టి దేశాభివృద్ధికి వినాశనమని వాదిస్తూ అగ్రకుల విద్యార్థులు ఆందోళన చేశారు. దళితులను కించపరుస్తూ బ్రాహ్మణ పద్ధతుల మీద ఆధారపడిన నిరసన రూపాలు బూట్లను పాలిష్ చేయడం, రోడ్లు ఊడ్చడం వంటివి ప్రదర్శించారు. ఈ వాదనలన్నీ వలస వాదానంతర భారత దేశ చరిత్రను విస్మరించడమే కాకుండా దేశంలోని చాలా జనాభాను నిరక్షరాస్యులుగా, పేదలుగా వుంచింది. అగ్రకుల ఆధిపత్యం కారణంగా పత్రికల్లో, పాలనలో, పోలీసుల్లో వారి వాదనకు, నిరసనలకు మద్దతు లభించింది. వివక్ష కారణంగా అవకాశాలు లేక విద్యలోనూ, ఉద్యోగాలలోనూ ప్రాతినిధ్యం లేని జనాభా గురించి, ప్రజాస్వామ్య సమాజంలో కుల వ్యవస్థ ఫలితాలను గురించి అర్థం చేసుకోవడానికి చర్చ జరిపే ప్రయత్నం చేయలేదు. అగ్ర కుల విద్యార్థులకు వున్న అవకాశాలు దళితులకు అందుబాటులో లేవు. 1990లలో మండల్ అనుకూల ఆందోళన ఆంధ్రప్రదేశ్‌లోని కుల వ్యవస్థ కోణాన్ని మరియు దళిత హక్కులే మానవ హక్కులుగా గుర్తించే విషయాలను ముందుకు తీసుకు వచ్చింది. కాబట్టి రిజర్వేషన్లను ప్రభుత్వం వెనుకబడిన కులాలకు, దళితులకు ఇస్తున్న రాయితీగా కాకుండా అది వారి హక్కుగా అర్థం చేసుకోవాలి. 1990ల తర్వాత దళితులలోని ముఖ్య కులమైన మాదిగలు ఇలాంటి సమస్యలనే లేవనెత్తుతూ విద్యా, ఉద్యోగ, పాలనా రంగాలలో వారి వాటాను ప్రశ్నించడం ప్రారంభించారు. ఇప్పుడున్న రిజర్వేషన్లు చాలా వరకు విద్య, ఇతర రంగాలలో కొంచెం ముందే ప్రవేశించిన మాలలకు ఉపయోగపడ్డాయి. మాదిగ హక్కులే మానవ హక్కులని మాదిగల వాదన. హక్కుల భాషా స్థానాన్ని దళిత ఉద్యమంలోని భాషా సంశ్లేషం పూర్తి చేసిందని తెలియజేస్తున్నది.

BRAOU

17.3 స్త్రీల హక్కులు

17.3.1 సామాజిక ఆర్థిక వేపథ్యం

స్త్రీలపై హింస, దాడులు వివక్షలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ అధ్వాన్నమైన స్థితిలో వున్నది. జీవన భృతి కోసం పని చేసే స్త్రీలు, బాలికలు ఎక్కువగా ఈ రాష్ట్రంలోనే వున్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నింటిలోనూ ఇక్కడే స్త్రీ-పురుష నిష్పత్తి (1000 మంది పురుషులకు 972 స్త్రీలు) అక్షరాస్యతా శాతం (32.72 శాతం) అధ్వాన్నంగా వున్నాయి. స్త్రీ, పురుష నిష్పత్తి 1951లో 986 నుండి 1991లో 972కు పడిపోయింది. 1951లో 155.44 లక్షల స్త్రీలు, 156.71 లక్షల పురుషులు వుంటే 1991లో 327.83 లక్షల స్త్రీలు, 337.25 లక్షల పురుషులు వున్నారు. అంటే ఆంధ్రప్రదేశ్‌లో వుండాల్సిన 10 లక్షల మంది స్త్రీలు లేకుండా పోయారు. ప్రభుత్వపు సంక్షేమ కార్యక్రమాలతో పాటు పేదరిక నిర్మూలన విధానాల ప్రభావం పురుషులకంటే స్త్రీలపై ఎక్కువగా వుండటంతో 1981-91 కాలంలో పని చేసే ఆడవారి సంఖ్య పెరిగితే (33.54 శాతం నుండి 34.32 శాతం) అదే సమయంలో పని చేసే పురుషుల జనాభా కొంచెం తగ్గింది (57.68 శాతం నుండి 55.48 శాతం) కేవలం 19.3 శాతం స్త్రీలు మాత్రమే వ్యవస్థీకృత రంగంలో పని చేస్తుండగా మిగతా స్త్రీలంతా కార్మిక చట్టాలను పాటించని అవ్యవస్థీకృత రంగంలో పని చేస్తున్నారు. ఎక్కువ శాతం పేద ఇళ్ళు స్త్రీల పైనే ఆధారపడ్డాయి. వారికి విద్య, వైద్యం ఇతరత్రా సౌకర్యాలు అంతంత మాత్రమే. క్లుప్తంగా చెప్పాలంటే కుటుంబంలో, పాలనా యంత్రాంగంలో వారి పాత్ర తక్కువే. స్త్రీలలో మళ్ళీ పేద, దళిత, గిరిజన వెనుకబడిన కులాల స్త్రీలకు ఇంకా తక్కువ అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీల, మానవ హక్కుల ఉల్లంఘనలను చర్చించేటప్పుడు ఇవన్నీ దృష్టిలో వుంచుకోవాలి. బాలికలు కుటుంబంలోను, బయట ఎక్కువ వివక్షకు, హింసకు గురవడంతో పాటు, పురుషుల కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారు. పేద దళిత మహిళలైతే పోలీసులు, ప్రభుత్వం చేత ఎక్కువ హింసకు గురవుతున్నారు. పని చేసే చోట లైంగిక వేధింపులు పోలీసులు, ఆధిపత్యం వర్గాలచే హింసించబడటం, కుటుంబంలోపల, బయట హింస, బాలికల పట్ల వివక్ష మొదలగునవన్నీ స్త్రీల హక్కులను కాలరాయటంలో కొన్ని అంశాలు.

17.3.2 ఉల్లంఘన రూపాలు

వలసపాలనా కాలంలో వచ్చిన సతీ సంస్కరణల ఉద్యమం బాల్య వివాహాన్ని, వితంతు పునర్వివాహాన్ని, దేవదాసీ పద్ధతి మొదలగు సమస్యలను లేవనెత్తి స్త్రీల పరిస్థితిని మెరుగుపర్చినప్పటికీ అది వున్న వ్యవస్థను సంస్కరించడాన్ని గురించే మాట్లాడింది. కానీ స్త్రీల హక్కులను గురించి కాదు. అదీకాక ఆ ఉద్యమంలో స్త్రీ లెవరూ ముందుకు రాలేదు. 1980ల ప్రాంతంలోనే స్త్రీల హక్కుల ఉల్లంఘనలను గురించి, స్త్రీలపై జరుగుతున్న హింస, వివక్షలను నిరశిస్తూ స్త్రీ శక్తి సంఘటన ప్రగతి శీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) వంటి సంస్థలు ఆవిర్భవించాయి. అవి వరకట్న పద్ధతిని, అత్యాచారాలను, కుటుంబంలో స్త్రీలపై జరుగుతున్న హింసను, స్త్రీలపై పోలీసుల దాడులను, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్‌లో ఉద్యోగినీ స్త్రీల పట్ల వివక్షను నిరసించాయి. ఈ ఉద్యమం స్త్రీల పట్ల జరుగుతున్న హింసను ఒక ప్రజా/ రాజకీయ సమస్యగా చేశాయి.

17.3.3 పోలీసు మరియు న్యాయ వ్యవస్థలో వివక్ష

స్త్రీలపై జరుగుతున్న హింసకు సంబంధించి పోలీసుల, న్యాయ వ్యవస్థల స్పందన తక్కువగా వుంది. నిజానికి న్యాయ, వైద్య, పోలీసు వ్యవస్థలలో వున్న వివక్షను 1980లలోని మహిళా సంఘాలు ప్రశ్నించిన తర్వాతే కొంత మార్పు కనబడుతున్నది.

అత్యాచారాలకు పాల్పడుతున్న వారిపై, భర్తలపై కేసులు పెట్టేటప్పుడు పోలీసులు వారిని నిరుత్సాహ పరుస్తారు. కేసులు పెట్టిన సందర్భాలలో విచారణ జరపడానికి, సాక్ష్యాలను సేకరించడానికి ఎక్కువ సమయం తీసుకుంటారు.

BRAOU

చాలా కేసులు వాదనకు బాధితులకు లేక వారి బంధువులకో వదిలేస్తారు. న్యాయ వ్యవస్థ కూడా అత్యాచారం చేసిన వారికి, భార్యను చంపిన భర్తల పట్లనే పక్షపాతం చూపిస్తుంది. అత్యాచారానికి సంబంధించిన చట్టాలలో సవరణలు తీసుకు వచ్చినప్పటి పరిస్థితిలో పెద్ద మార్పేమీ లేదు. నిందితుడు చేసిన నేరానికంటే అతని ప్రవర్తననే ఆధారం చేసుకుని న్యాయమూర్తులు తీర్పులిస్తున్నారు. స్త్రీల నడవడిని నిర్ణయించడంలో కూడా న్యాయమూర్తులు మళ్ళీ పితృస్వామిక పద్ధతులనే పాటిస్తున్నారు. 1986 నుండి 1996 మధ్య కాలంలో హైదరాబాద్ మహిళా కోర్టులో నమోదయిన అత్యాచారాల కేసులపై జరిపిన అధ్యయనంలో కేవలం 10 శాతం కేసుల్లోనే శిక్ష పడిందని, అదీ 2 నెలల నుండి 2 సంవత్సరాల వరకు గల స్వల్ప శిక్షలేనని చివరికి వాటిని కూడా ఉన్నత న్యాయస్థానాలు కొట్టి వేశాయని తెలుపుతున్నది.

వరకట్న సంబంధపు హత్యలు, వేధింపుల విషయాలలో కూడా ఇట్లాంటి పరిస్థితి వుంది. వీటిలో దాదాపు 11 శాతం కేసుల్లో శిక్ష పడుతున్నది. 1989-96 మధ్య కాలంలో వచ్చిన ఇలాంటి కేసుల్లో కేవలం 29 కేసుల్లో మాత్రమే శిక్షపడింది. న్యాయమూర్తులు కట్నాన్ని సంకుచిత దృష్టితో చూస్తూ, స్త్రీల తరపున వారి తల్లిదండ్రులు చూపిస్తున్న సాక్ష్యాలను (హింస నాలుగు గోడల మధ్యే జరుగుతుంది కాబట్టి వేరే ఆధారాలుండవు) తోసిపుచ్చుతున్నారు. ఇంకా కొన్ని కేసుల్లోనైతే బాధితులు ఇచ్చిన మరణ వాంగ్మూలాన్ని కూడా తిరస్కరించారు. ఇంకా భయంకరమైన విషయం ఏమంటే- భారతీయ/హిందూ/ కుటుంబంలో ఈ హింసంతా మామూలేనని పెళ్ళయిన (ముఖ్యంగా కొత్తగా పెళ్లయిన) స్త్రీలు ఈ మాత్రం హింసను భరించలేక పోతే వారి ప్రవర్తనలోనే ఏదో లోపం వుందని న్యాయమూర్తులు భావిస్తున్నారు.

17.3.4 కుటుంబ సంబంధమైన హింస

నిరసనలు వ్యక్తమవుతున్నప్పటికి స్త్రీలపై హింస పెరుగుతూనే వుంది. ఇలాంటి హింస జరుగుతున్న పది ముఖ్యమైన రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ 70 శాతం నమోదైన కేసులలో వుంది. 1996 గణాంకాల ప్రకారం 2706 కుటుంబ హింస, వరకట్న వేధింపు కేసులు, 388 వరకట్న హత్యలు, 645 అత్యాచారపు కేసులు, 2196 లైంగిక వేధింపుల కేసులు నమోదయినాయి. ఇవన్నీ నమోదయిన కేసులేనని, నిజానికి నమోదు కాని చిన్న చిన్న సంఘటనలు ఎక్కువ వుంటాయని గుర్తుంచు కోవాలి. వీటితో పాటు మరికొన్ని హింసాత్మక సంఘటనలు కూడా నమోదు కావు. ఉదాహరణకు పని చేసే చోట స్త్రీలపై ఎన్నో లైంగిక వేధింపులు జరుగుతున్నా ఇంకా వాటిని ఒక సమస్యగా గుర్తించి నమోదు చేయడం లేదు. అలాగే భార్యలను వదిలి వేయటం, మనోవర్తి చెల్లించకుండా విడాకులు ఇవ్వటం మొదలగునవి ఎక్కువగానే జరుగుతున్నప్పటికీ నమోదు కావడం లేదు.

BRAOU

కుటుంబాలు: స్త్రీలపై హింస పరిధి

కుటుంబంలోని హింసపై న్యాయమూర్తుల దృక్పథం, సమాజంలో నెలకొన్న కట్టుబాట్లకు అద్దం పడుతుంది. స్త్రీలను హింసించే విధంగా కుటుంబ సంబంధాలను పకడ్బందీగా రూపొందించారు. బాలికల, స్త్రీల ప్రవర్తనపై తీవ్రమైన ఆంక్షలుంటాయి. అంతేకాక వారిని కుటుంబ పద జాలంతోనే అంటే చెల్లెలు, భార్య, తల్లి మొదలైన పదాలతోనే గుర్తిస్తారు. ఇది పాక్షికంగా వారి హక్కులను తృణీకరించినట్టే అవుతుంది. కుటుంబంలో ఎంతో పని చేస్తూ పిల్లల సంరక్షణా బాధ్యత నిర్వహిస్తున్నప్పటికీ వ్యక్తిగతంగా వారి కోసం వారేమీ కోరడానికి అనుమతించరు. సమాజ కట్టుబాట్లు కుటుంబానికి ఎంతటి అధికారాన్నిచ్చాయంటే స్త్రీలు శీలంతో వుండాలని కొట్టడం, చంపడం కూడా జరుగుతుంది. వారు ఇంట్లో చేసే పనిని కుటుంబం, బయటి ప్రపంచం కూడా గుర్తించడం లేదు. అన్నింటికీ మించి స్త్రీలను ప్రాథమికంగా వంటింటి కుందేళ్ళుగా భావించడం వలన వారి పనికి తక్కువ వేతనాలివ్వడం, వారిని సులభంగా తగులబెట్టగలగడం వంటివి జరుగుతున్నాయి.

17.3.5 ప్రజలు, పోలీసులు మరియు హింస

వీటితో పాటు పట్టణ ప్రాంతాలలో వలస వచ్చిన పేదలపై ప్రధానంగా దళిత స్త్రీలపై స్థానిక రాజకీయ నాయకులు, రేషన్ షాపు ఓనర్లు, రౌడీల హింస పెరుగుతూనే వుంది. స్త్రీల జీవితంలో హింస ఎంతో పెరిగిందని, చాలా సందర్భాలలో

నిందితులు స్థానిక రాజకీయ నాయకులు గూండాలేనని, అందువలన పాలనా యంత్రాంగం పోలీసులు పట్టించు కోవటం లేదని 1990లో హైదరాబాద్‌లో స్త్రీలపై వరుసగా జరిగిన అత్యాచారాలు, హత్యల వలన తెలుస్తున్నది. పోలీసులు స్త్రీలను చిన్న చిన్న నేరాలలో ఇరికించి వారిపై కస్టడీలో శారీరక, లైంగిక వేధింపులకు పాల్పడతారు. 1981లో పోలీసుల చేతిలో అత్యాచారానికి గురయిన రమీజాబీతో మొదలుకొని ఈ మధ్యే 1998లో అత్యాచారానికి గురయిన మాజీ నక్సలైటు హుస్సేన్ బీ వరకు ఎన్నో రకాలు, అయినా ఎపిఎస్‌పి, ఎక్సైజ్ పోలీసు, యాంటీ నక్సల్ స్క్వాడ్ సిఐఎస్‌ఎఫ్ మొదలగు రకాల బలగాలన్నీ స్త్రీలపై లైంగిక హింసకు పాల్పడ్డాయి. తెలంగాణ ప్రాంతంలో నక్సలైట్ల సానుభూతి పరుల భార్యలపై బంధువులపై పోలీసులు వేధింపు చర్యలకు పాల్పడితే, రాయలసీమలో స్త్రీలపై ముఠా నాయకులు, వారి అనుచరులు లైంగిక దోపిడికి పాల్పడతారు.

17.3.6 జనాభా విధానాలు మరియు స్త్రీల హక్కులు

ఒకవైపు స్త్రీలపై ఈ హింస కొనసాగుతుండగా మరోవైపు ప్రభుత్వ జనాభా విధానాలు కూడా పేద, దళిత స్త్రీల ఆరోగ్యానికి తక్కువ ప్రాధాన్యతనిస్తున్నాయి. 1984లో హైదరాబాద్‌లోని పారిశ్రామిక ప్రాంతంలో పేద స్త్రీలు దుష్పరిణామాలు గల Net-enమరియు Depo provera వంటి గర్భనిరోధక సాధనాలను వాడకుండా చేయడంలో మహిళా ఉద్యమకారులు విజయం సాధించారు. అయినప్పటికీ ఇంకా జనాభా విధానాలు స్త్రీలనే లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఉదాహరణకు ప్రభుత్వం ఈ మధ్య ప్రవేశపెట్టిన కొన్ని విధానాల వలన ఇద్దరి కంటే ఎక్కువ పిల్లల్ని కంటే ఉద్యోగానికి ఇతర ప్రభుత్వ సేవలకు అనర్హులని స్త్రీలను శిక్షిస్తూ వివక్ష చూపుతున్నది. అయితే చాలా కుటుంబాలలో ఎంత మంది పిల్లల్ని కనాలనే నిర్ణయం స్త్రీలకు ఇవ్వరు.

అయితే స్త్రీలు ఈ పరిస్థితికి ఉదాసీనంగా బాధితులు అవడం లేదని గుర్తుంచుకోవాలి. 1990లలో సారాకు వ్యతిరేకంగా వచ్చిన గ్రామీణ పేద మహిళల ఉద్యమం వారి చైతన్యాన్ని హక్కుల కోసం పోరాడే వారి ఆసక్తిని తెలియజేస్తున్నది.

17.4 వ్యవసాయ కూలీల, రైతుల, కార్మికుల హక్కులు

కూలీల స్వభావాన్ని వారి హక్కులను గురించి తెలుసుకోవడానికి మనం 1987-88 కాలానికి సంబంధించిన ఎన్‌ఎస్‌ఎస్ గణాంకాలను చూడాల్సి వుంటుంది. మొత్తం శ్రామిక శక్తిలో 64.6 శాతం అంటే 273 లక్షల మంది తమ జీవనాధారానికి వ్యవసాయం పైనే ఆధారపడుతున్నారు. కేవలం 6 శాతం అంటే 16.5 లక్షల మంది మాత్రమే వ్యవస్థీకృత రంగంలో పని చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ శాతం బాల కార్మికులు వున్నారు. 10 నుండి 14 సంవత్సరాల వారిలో 32.8 శాతం బాలురు 34.9 శాతం బాలికలున్నారు. దీన్నిబట్టి కార్మికుల/ కూలీలలో కేవలం కొంత మంది మాత్రమే వారి హక్కులు పొందుతారని స్పష్టమవుతున్నది. వ్యవసాయ కూలీలకు, అవ్యవస్థీకృత పారిశ్రామిక కూలీలకు, బీడి కార్మికులకు గని కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులకు బాల కార్మికులకు, ఇంటి పని మనుషులకు మొదలైన వారందరికి కనీస వేతనాలు కూడా లభించడం లేదు. ప్రభుత్వం కార్మిక చట్టాలను సరిగా అమలు చేయడం లేదు కనుక వారి హక్కుల సాధన కార్మిక/ కూలీల సంఘాల శక్తి సామర్థ్యాల పైనే ఆధారపడుతుంది.

17.4.1 భూమి లేని కూలీలు, రైతులు

భూమి లేని కూలీలు, రైతులు కూడా చాలానే వున్నారు. పరిచయంలోనే ప్రస్తావించినట్లు ఆంధ్రప్రదేశ్‌లో భూ సంస్కరణలు అమలు జరగలేదు. ఆంధ్రప్రదేశ్ భూ కమతాల పరిమితి చట్టం (1961)లో కొన్ని రాయితీలు, మినహాయింపులు వున్నందున అది ఘోరంగా విఫలమైంది. 1975లో అమలులోకి వచ్చిన The Ceiling Act of 1973 అంతకు ముందు చట్టంలోని లోపాలను పూరించడానికి ఉద్దేశించినవి. ముస్సోరీలోని లాల్‌బహదూర్ శాస్త్రి, నేషనల్ అకాడమి ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన భూ సంస్కరణల విభాగం వారు జరిపిన అధ్యయనంలో ఈ చట్టం

BRAOU

కూడా విఫలమైందని తెలిపింది. ఈ చట్టం ప్రకారం మొత్తం 10,39,842 ఎకరాలను మిగులు భూమిగా ప్రకటించినప్పటికి 5,30,32604 ఎకరాలను మాత్రమే స్వాధీనపర్చుకొన్నారు. ఇందులో మళ్ళీ 3,42,035 ఎకరాలను మాత్రమే పంచారు. పంచిన భూమిలో 11.23 శాతం వ్యవసాయ యోగ్యం కాదని తెలిసింది. ఒక అధ్యయనం ప్రకారం ఇంకా 1992 వరకు కూడా పెద్ద భూక మతాలు, భూస్వామ్య విధానాలు అధికారం గల భూస్వాములు, ప్రభుత్వ, ప్రైవేటు భూములను అక్రమంగా ఆక్రమించు కోవటం, షెడ్యూల్డు కులాలకు తెగలకు, వెనుకబడిన కులాల కోసం ఉద్దేశించిన భూములను ఉన్నత కులాల వారు ఆక్రమించు కోవటం మొదలగునవన్నీ జరుగుతూనే ఉన్నాయి. పాలనా యంత్రాంగం, న్యాయ వ్యవస్థ జంటగా విఫలమైనందున 'భూ పరిమితి చట్టం' అమలులోకి వచ్చి ఒక తరం గడచిపోయినా ఇంకా భూమి కొద్ది మంది చేతుల్లోనే వుంది. అంటే ఒక తరమంతా భూమి లేక్కుండానే పేదరికంలోనే పెరిగి, అదే పేదరిక పరిస్థితిలో వారి తండ్రులు, తాతలు చనిపోయారన్నమాట. కౌలుదారుల పరిస్థితి కూడా అభద్రతా భావంలోనే వుంది. వీళ్ల కోసం ఉద్దేశించిన కౌలు సంస్కరణల చట్టం 1950, ఆంధ్రప్రదేశ్ కౌలు చట్టం 1956 అనే రెండు చట్టాలలోను లెక్కలేనన్ని లోపాలున్నాయి.

భూ పరిమితి చట్టాన్ని అమలుపర్చక పోవడంతో వ్యవసాయ కూలీలు తమ పేదరికాన్ని అధిగమించ లేకపోయారు. ప్రభుత్వ భూములు తగ్గుతూ వుండడంతో నీళ్ళు, పశుగ్రాసం తెచ్చు కోవడానికి స్త్రీలపై మరింత భారం పడుతున్నది. దీనితో పాటు 1980ల వరకు కూడా ముఖ్యంగా తెలంగాణాలో వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు చెల్లించలేదు. కనీస వేతనాల కోసం చేసిన పోరాటం భూమిలేని వాళ్ళకు భూస్వాములకు మధ్య భూస్వామ్య సంబంధాలను అంతం చేయడానికి కూడా ఉద్దేశించింది. తెలంగాణాలో భూస్వాములు వందలాది ఎకరాలను అక్రమంగా వుంచుకుని కూలీలచేత వెట్టి చాకిరీ చేయించుకుంటూ, స్త్రీలను లైంగికంగా దోపిడి చేస్తూ వారికి రాజ్యాంగం కల్పించిన కనీస వేతనాల్ని ఇవ్వడానికి నిరాకరించారు. ఎపిసిఎల్‌సి నివేదిక ప్రకారం తెలంగాణాలో 1983 వరకు కూలీ రేట్లు పురుషులకు రూ.5 నుండి 10 వరకు స్త్రీలకు రూ.2 నుండి 5 వరకు చెల్లించారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి వేయి నుండి 1500 రూపాయలు కొన్ని సంపన్న ప్రాంతాలలో 1800 రూపాయల వరకు ఇచ్చారు. రోజుకు తక్కువలో తక్కువ 7.50 రూపాయలు ఇవ్వాలని చెబుతున్నా కనీస వేతనాల చట్టానికి ఇది విరుద్ధం. ఇలా రెండు రకాలైన కూలీలు దయనీయమైన పరిస్థితిలోనే వున్నారు. తెలంగాణాలోని గ్రామీణ కులవృత్తుల వాళ్ళను, పేద రైతులను, గొర్రెల కాపర్లను, కల్లుగీత కార్మికులను భూస్వాములు తమ అదుపాజ్ఞలలో వుంచుకుంటూ గ్రామ పంచాయతీలను నియంత్రిస్తూ ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారు. (ప్రభుత్వ విధానాల ప్రకారం ఆ భూములు భూమిలేని వాళ్లకు చెందాలి).

చాలా ప్రాంతాల్లో భూస్వాములు కూలీలచే తమ భూముల్లో పాలాల్లో బలవంతంగా ఉచితంగా పని చేయించు కోవడం, కల్లుగీతకు గాను మామూళ్లు తీసుకుంటూ, పంచాయతీ గొడవల్లో డిపాజిట్లు తీసుకుంటూ గ్రామస్తులు ఏది కొన్నా అమ్మినా దానికి డబ్బు వసూలు చేస్తూ ఎక్కువ వడ్డీ రేట్లకు అప్పులిస్తూ గ్రామస్తుల జీవితాలను నియంత్రిస్తారు. కమ్యూనిస్టు పార్టీల మరియు మార్క్సిస్టు లెనినిస్టు పార్టీల ఉద్యమాల వల్ల తెలంగాణాలోని పరిస్థితి చాలా వరకు మెరుగుపడి దొరతనం పోయినప్పటికి భూ సంస్కరణలు మాత్రం తీరని కోరికగానే మిగిలిపోయింది.

17.4.2 గని, భవన నిర్మాణ, బీడీ మరియు ఇతర కార్మికులు

ఎమర్జెన్సీ తర్వాత వ్యవసాయ కూలీలతో పాటు, బీడీ కార్మికులు గని కార్మికులు, ఇంకా ఇతరత్రా కార్మికులంతా తమ హక్కుల కోసం సంఘటితం అయ్యారు. ఇంతకు ముందు కూలీలపై భూస్వాములు, పారిశ్రామికవేత్తలు పెత్తనం చలాయించేవారు. ఉద్యమాల వలన ఈ పరిస్థితిలో ఎంతో మార్పు వచ్చింది. మార్పు స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి 1970లలోని వారి స్థితిగతులని పరిశీలించాల్సి వుంటుంది.

వ్యవసాయేతర రంగాలలో అంటే గనులు, భవన నిర్మాణాలు బీడీ పరిశ్రమలోని కార్మికులను యాజమాన్యం భూస్వామ్య పద్ధతిలో నియంత్రించేవారు. అత్యంత పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి గనులలో యాజమాన్యాన్ని కార్మికులు దొర అని పిలవడం, వాడు కార్మికుల్ని బానిసలుగా చూడడం వంటి భూస్వామ్య పద్ధతి ఈ మధ్య కాలం

BRAOU

వరకూ కొనసాగింది. ఎక్కువగా దళితులే అయిన ఈ కార్మికులు గ్రామాలలో వున్నత కులస్థుల నియంత్రత్వాన్నించి తప్పించు కోవడానికి గనులలో పని చేయడం మంచి అవకాశంగా భావించారు. చాలా పరిశ్రమలలో వలెనే ఇక్కడ కూడా కార్మికులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించు కుంటారు. ఇక్కడ వారికి భద్రత గానీ, సరైన నివాస సౌకర్యం గానీ ఏమీ వుండవు. వారి వేతనాలు సరిగ్గా చెల్లించరు. యాజమాన్యం అనుమతి లేకుండా సంఘాలు ఏర్పర్చడం చేస్తే తీవ్రంగా శిక్షించబడతారు. నక్సలైటు పార్టీల నీడలో కార్మికులు చేపట్టిన మిలిటెంట్ ఉద్యమాల వలన పరిస్థితి చాలా వరకు మారింది.

బీడీ పరిశ్రమలలో కూడా ఇదే పరిస్థితి నెలకొని వుంది. ఈ పరిశ్రమలలో పనిచేసే వారిలో స్త్రీలే (దాదాపు ఆరు లక్షలు) ఎక్కువ. ఇది ఉత్తర తెలంగాణ జిల్లాలలో ప్రధానంగా నిజామాబాద్‌లో ఈ పరిశ్రమ కేంద్రీకృతమై వుంది. 1972 వరకు ఏ కార్మిక చట్టాలను బీడీ కార్మికులకు అమలుపర్చలేదు. వీరి వేతనాలు చాలా తక్కువ. ఉద్యోగ భద్రత కూడా వుండదు. ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను యజమానులు అమలుపర్చరు. గ్రాట్యుటీ, బోనస్, ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యాలు కూడా ఏమీ వుండవు. ఎన్నో పోరాటాల తర్వాత 1974 నుంచి వేతనాలను పెంచుకొనగలిగారు. వెయ్యి బీడీలకు ఇచ్చే వేతనం 1982లో రూ.5.85 పై.లు/ 5.60 పై.లు నుంచి 1997లో రూ.32.10పై/31.80 పై వరకు పెరిగింది.

భవన నిర్మాణ రంగంలో ఈ దోపిడి ఇంకా ఎక్కువ. పాలమూరు కూలీల సంగతి అందరికీ తెల్సిందే. ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్ జిల్లాలో కరవు కారణంగా అక్కడి ప్రజానీకం చాలా వరకు భవన నిర్మాణం కోసం, ఆనకట్టల నిర్మాణం కోసం ఫ్యాక్టరీలలో పని చేయడం కోసం కూలీలుగా వలస వెడతారు. ఎలాంటి కనీస వేతనాలు ప్రస్తావన లేకుండానే కార్మికులను వారి కుటుంబాలతో సహా తీసుకు వెడతారు. వారిని తాత్కాలికంగా వేసిన షెడ్లలో వుంచి కొంచెం ఆహారం పెడుతూ ఎన్నో గంటలు పని చేయించుకుంటారు. వారి పిల్లలకు ఎలాంటి విద్యా సదుపాయాలు కూడా వుండవు. వెలుగులోకి రాకపోయినప్పటికి ఈ రంగంలో స్త్రీలు లైంగిక దోపిడీకి గురవడం కూడా ఎక్కువే. మన రాష్ట్రంలోనూ, ఇరుగు పొరుగు రాష్ట్రాలలో ఉప్పు క్షేత్రాలలోపని చేస్తున్న శ్రీకాకుళం కూలీల పరిస్థితి కూడా ఈ విధంగానే వుంది.

ఇంకా బాల కార్మికులకు (వీరు ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువే) ఇళ్ళలో పని చేసే పని మనుషులకు ఇంకా ఇతర కార్మికులకు ఎలాంటి హక్కులు లేవు. 1980-90 సంవత్సరాల తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలలో మరియు అనేక సంక్షేమ రంగాలలో నుండి ప్రభుత్వం తప్పుకోవడంతో వ్యవస్థీకృత రంగాలలో పని చేస్తున్న కార్మికుల పరిస్థితి కూడా దయనీయంగా తయారైంది.

17.5 ముఠా సంబంధమైన హింస

సాధారణంగా ఇలాంటి హింస మానవ హక్కులకు భంగం అని భావించరు. కాని ఈ మధ్య ఎపిసిఎల్‌సి జరిపిన అధ్యయనాలు ఈ హింస వల్ల ప్రజాస్వామ్య వాతావరణాన్ని నాశనం చేస్తుందని తెలుపుతున్నాయి. ఇలాంటి హింస రాయలసీమలోని మూడు జిల్లాల్లో వుంది. చారిత్రకంగా రాయలసీమ ప్రాంతం పాలెగాళ్ళ క్రింద వుండేది. వీళ్ళు సైన్యాన్ని నిర్వహిస్తూ రాజుకు సహాయపడేవాళ్ళు. ప్రతిఫలంగా గ్రామాదాయంలో వీళ్ళకు కొంత ఇచ్చేవారు, తర్వాత ఈ పద్ధతి మారింది.

వలసవాదానంతర కాలం తర్వాత ఆధిపత్య రెడ్డి కుల భూస్వాములు ప్రైవేటు సైన్యాన్ని నిర్వహిస్తూ ప్రభుత్వంలో, ప్రైవేటు కాంట్రాక్టర్లలో భాగస్వామ్యాన్ని డిమాండ్ చేశారు. వ్యతిరేక నాయకులు వేర్వేరు రాజకీయ పార్టీలలో చేరుతూ ఎన్నికల సమయంలో వారికి అనుకూలంగా పని చేయడం ప్రారంభించారు. ఈ నాయకులు గ్రామ స్థాయిలో కూడా ముఠాలను నిర్వహిస్తూ సమాజ జీవితాన్ని తమ ఆధిపత్యం కింద వుంచుకుంటారు. అన్ని రకాలైన గొడవలలో తీర్పులిస్తారు. వారి తీర్పే అంతిమ తీర్పు. ముఠాలలో పని చేసే వాళ్ళలో చాలా మందిలో వెనుకబడిన షెడ్యూల్డు కులాల వారే ఎక్కువ.

BRAOU

వ్యతిరేక వర్గాల మధ్య ఘర్షణ చెలరేగినప్పుడు కూడా చనిపోయేది వీళ్ళే. ముఠాలు ఎలాంటి వ్యతిరేకతను భరించవు. ఇలా రాయలసీమలోని అనంతపూర్, కర్నూలు, కడప జిల్లాల్లో ముఠాలుండడం వల్ల ఎలాంటి స్వతంత్ర పౌర కార్యకలాపాలకు అస్కారం లేకుండా పోయింది.

17.6 ప్రభుత్వంచే మానవ హక్కుల ఉల్లంఘన

గ్రామీణ పేదలు, గిరిజనులు నిర్వహిస్తున్న నిరశన ఉద్యమాల పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాలు ఎమర్జెన్సీ తర్వాత కాలంలో చాలా మారాయి, ఈ కాలంలో ప్రభుత్వం సమాజంలోని ఆధిపత్య వర్గాలైన భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, సారా కాంట్రాక్టర్లతో కుమ్మక్కవడం స్పష్టంగా కన్పిస్తుంది. లాకప్ సూత్రాలు/మరణాలు, అత్యాచారాలు రాజకీయ పార్టీల నిషేధం, వివిధ రకాలైన నల్లచట్టాల అమలు, ఎన్‌కౌంటర్ హత్యలు/ మరణాలు, ఖైదీలు, ఖైదీల హక్కుల ఉల్లంఘన, పోలీసు కాల్పులు, దేవాలి సారా తయారీ చేస్తున్న గిరిజనుల అణచివేత మొదలగు రూపాలలో ప్రభుత్వం హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నది.

17.6.1 గ్రామీణ పేదల, రాజకీయ స్వాతంత్ర్యాల అణచివేత

ఎమర్జెన్సీ తర్వాత కాలంలో గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలు కనీస వేతనాల కోసం చేసిన ఉద్యమాలను ప్రభుత్వం కఠినంగా అణచివేసింది. గ్రామీణ పేదలను సమీకరించిన మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలను నిషేధించడంతో పాటు పేదలను అక్రమంగా అరెస్టు చేయడం, అక్రమ నిర్భంధం హింస, తప్పుడు కేసుల్లో ఇరికించడం, ఇళ్ళపై దాడి, ఆస్తుల ధ్వంసం భారీ ఎత్తున చేపడానికి పాల్పడటం, అమాయకులను ఎన్‌కౌంటర్లలో చంపేయడం వంటి చర్యలతో ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నది. ఎన్‌కౌంటర్లను ఎమర్జెన్సీ కాలంలో ప్రవేశపెట్టి (ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపిడిఆర్) అంచనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జెన్సీ కాలంలో దాదాపు నాల్గువందల మందిని ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చేశారు) నక్సలైట్ల ఉద్యమాల్ని అణచివేయడానికి ఆ తర్వాత వచ్చిన ప్రతి ప్రభుత్వం కొనసాగిస్తూనే వుంది. ప్రభుత్వం ప్రోత్సహకాలు ఇస్తూ ఎన్‌కౌంటర్లను కొనసాగిస్తుంది. పోలీసులకు నక్సలైట్లకు మధ్య జరుగుతున్న ఎదురు కాల్పుల్లో ఎక్కువ భాగం బూటకపు ఎన్‌కౌంటర్లేనని పౌర హక్కుల సంఘాలు తెలుపుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లలో చనిపోతున్న వాళ్ళలో కూడా అతికొద్ది మంది మాత్రమే మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీల కార్యకర్తలు, సానుభూతి పరులు కాగా మిగతా వాళ్ళంతా దళిత- వెనుకబడిన కులాల పేదలు. ప్రభుత్వం వద్దని నిర్ణయిస్తే ఎన్‌కౌంటర్లు జరగడం లేదు. కాబట్టి ఎన్‌కౌంటర్లనేవి ప్రభుత్వ విధానం అని తెలిసి పోతున్నది. లాటిన్ అమెరికా దేశాలలో వలె ఇక్కడా వ్యక్తుల తప్పిపోవడం అంటే వారిజాడ కూడా తెలియకుండా చంపేయటాలు జరుగుతుంటాయి. స్త్రీలతో సహా దాదాపు 42 మంది శాశ్వతంగా తప్పిపోయారు. కార్మికుల, దళితుల స్త్రీల/గిరిజనుల నిరశనలను, పోరాటాలను అణచివేయడానికి ప్రభుత్వం మితిమీరిన బలాన్ని ఉపయోగించడం ప్రారంభించింది.

17.6.2 నల్లచట్టాలు

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ పేదల నిరసనలతో వ్యవహరించే మిషతో ప్రభుత్వం నిర్భంధ చట్టం, జాతీయ భద్రతా చట్టం, కల్లోల ప్రాంతాల చట్టం మొదలయిన చట్టాలను ప్రవేశపెట్టింది. 1985లో అమలులోకి వచ్చిన టాడా చట్టం ఆంధ్రప్రదేశ్‌లో ఇతర ప్రాంతాల్లోను బాగా విమర్శలకు గురైంది.

17.6.3 లాకప్ హింస

ఆంధ్రప్రదేశ్‌లోని శాంతి భద్రతల విభాగపు అణచివేత స్వభావమే మారిపోయింది. అదనపు బలగాల మొహరింపు సానుభూతి పరులపై హింస మొదలయినవన్నీ ఇన్వెస్టిగేషన్ క్రమాన్నే మార్చేసాయి. రాజ్య యంత్రాంగపు చట్టంలేని తనం ఒక మినహాయింపు కాకుండా, ఒనమాలు పద్ధతిగా తయారైతే రోకల్లు ఎక్కించడం, దెబ్బలు పైకి కనబడకుండా

BRAOU

కొట్టడం మలం ద్వారంలోకి సీసాలు గుచ్చడం, ఇతరుల మూత్రాన్ని తాగించడం వంటి థర్డ్ డిగ్రీ పద్ధతులు ఉపయోగిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇవన్నీ మానవ హక్కుల సూత్రాలకు విరుద్ధం. ఇలాంటి పద్ధతులను సాధారణ ఖైదీల పట్లకూడా అనుసరిస్తున్నారు. లాకప్ మరణాలతో పాటు పోలీసు కాల్పుల్లో మరణిస్తున్న వాళ్ళ సంఖ్య కూడా బాగా పెరిగింది. థర్డ్ డిగ్రీ పద్ధతులతో పాటు, హింస, వేధింపులు, చిన్న నేరస్థులకు, అనుమానిత నేరస్థులకు వారి కుటుంబ సభ్యులకు కూడా తప్పడం లేదు. ఫలితంగా ఎన్నో లాకప్ మర్డర్లు జరిగాయి. అనుమానిత మహిళా నేరస్థులపై/ అనుమానిత నేరస్థుల భార్యలపై లాకప్‌లో అత్యాచారానికి పాల్పడుతున్నారు. లాకప్ హింసకు గురవుతున్న వాళ్లలో ఏద్య, దళిత, గిరిజనులే ఎక్కువ.

17.6.4 ఎక్సైజ్ దాడులు – గిరిజనులపై హింస

1980ల కాలంలో రూపొందించిన ఎక్సైజ్ విధానం వలన పోలీసులు మరింత అదనపు బలాన్ని ఉపయోగించటానికి అవకాశం ఏర్పడింది. సారాను ఆదాయ మార్గంగా మలచి ప్రైవేటు సారాను నిషేధించారు. ఇలాంటి సారాయిని సాంప్రదాయ సమాజాలైన లంబాడీల వంటి వారు తయారు చేస్తారు. కనుక వీరిపై సారా కాంట్రాక్టర్ల కిరాయి గూండాలు స్వైర విహారం చేస్తారు. అక్రమ సారాయిని నిరోధించేందుకు 1980లలో కాంట్రాక్టర్ల గూండాలు, పోలీసుల సహాయంతో ఎన్నో లంబాడీ కాలనీలపై దాడి చేసి పాత్రలను ధ్వంసం చేసి స్త్రీలను పురుషులను అవహరించారు. వాళ్ళు సాధారణంగా 5 నుండి 8 మందిని స్త్రీలతో సహా తీసికెళ్ళి సారా డిపోలో రెండు మూడు రోజులుంచుకుంటారు, తలా రూ.250లు 'జరిమానా' చెల్లిస్తే వదిలి పెడ్తారు. 1990లలో సారా వ్యతిరేక ఉద్యమం వచ్చినప్పుడు ఇలాంటి పద్ధతులను ప్రభుత్వం ఇంకా కఠినంగా అమలుపర్చి పోలీస్ స్టేషన్లలలో బలవంతంగా సారాను అమ్మడం స్పష్టంగా ఆదేశిక సూత్రాలను ఉల్లంఘించడమే.

17.6.5 ఖైదీల హక్కులు

ప్రజా హక్కుల ఉల్లంఘన (ప్రభుత్వ దృష్టిలో అనుమానితులు) పోలీస్ కస్టడీ నుంచి జ్యుడిషియల్ కస్టడీకి, ఆ తర్వాత జైలుకు వెళ్ళాక కూడా కొనసాగుతుంది ఖైదీల నిరశన ఉద్యమాలు, ప్రభుత్వాలు నియమించే కమీషన్లు జైళ్ళలోని భయంకరమైన పరిస్థితులను వెలుగులోకి తెచ్చాయి. మెజార్టీ ఖైదీలు విచారణకు నోచుకోని రిమాండ్ ఖైదీలే. ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 36,730 ఖైదీలలో 87.07 శాతం రిమాండ్ ఖైదీలున్నారు. ఇది దేశంలోనే ఎక్కువ. సత్వర విచారణ, జైలులో మానవత దృష్టితో చూడటం, న్యాయ సహాయం లాంటి హక్కులను సరిగా పాటించడం లేదు. చివరికి జైలు లోపల కూడా సెలవులు, పెరోల్ లాంటివి కూడా అధికారం ఆస్తి, హోదా, లింగ వివక్షల ఆధారంగానే లభిస్తాయి. ఖైదీలకున్న అన్ని హక్కులను సుప్రీంకోర్టు రూలింగ్‌లకు, అంతర్జాతీయ మానవ హక్కుల సూత్రాలకు విరుద్ధంగా నిరాకరిస్తున్నారు. సుప్రీంకోర్టు ఎన్నో సందర్భాలలో ఖైదీల హక్కులను భంగపర్చకూడదని చెప్పినప్పటికి జైలు అధికారులు ఖైదీలను సంస్కరించడానికి పునరావాసం కల్పించడానికంటే వారిని క్రమశిక్షణతో నియంత్రించడానికే ఎక్కువ ప్రాముఖ్యనిస్తున్నారు. జైలు అధికారులు వారికున్న అపరిమితమైన అధికారాలతో ఖైదీల ప్రవర్తనను నియంత్రించడానికి వారిని బలవంతంగా ప్రతి దానికి తమపై ఆధారపడేలా చేస్తారు. ఏ రకమైన నిరసన వ్యక్తమయ్యే అవకాశం వున్నా దాన్ని 'ఇన్‌ఫార్మర్ల' వ్యవస్థ ద్వారా మొగ్గలోనే తుంచేస్తారు. కొందరు ఖైదీలను మిగతా ఖైదీలపై గూడచారులుగా నియమించి సమాచారం రాబట్టుకుని ప్రతిఫలంగా వారికి సౌకర్యాలు కల్పుగజేస్తారు. నిరసనను ఎదురు తిరగడంగా భావించి వారిని మరింత కఠినంగా శిక్షిస్తారు.

రాజ్యహింసపై నిరసనే లేకుండా పోలేదని గుర్తుంచుకోవాలి. గ్రామీణ పేదలపై రాజ్యహింసను వ్యతిరేకించడంలో ఆంధ్రప్రదేశ్‌లోని పౌరహక్కుల ఉద్యమం ముందున్నది. గ్రామీణ పేదలపై అణచివేత నేపథ్యంలో 1970లలో ఇది ఆవిర్భవించినప్పటి నుండి రైతు ఉద్యమాన్ని శాంతి భద్రతల సమస్యగా గుర్తించకూడదని వాదిస్తున్నది. మార్క్సిస్టు లెనినిస్టు పార్టీలను నిషేధించడాన్ని, వారి రాజకీయ స్వాతంత్ర్యాలను అణచివేయడాన్ని కూడా నిరసించింది. పోలీసుల

BRAOU

చట్టంలేని తన్నాన్ని, నక్సల్ చట్టాలను, లాకప్ హింసను, పోలీసు కాల్పులను, గ్రామీణ పేదలను అణచివేయడాన్ని నిరసించడమే కాకుండా ఈ ఉద్యమం హక్కుల ఉల్లంఘనలన్నింటిని నమోదు చేసింది. ఎన్‌కౌంటర్ హత్యలను, లాకప్ మరణాలను నమోదు చేసి రాజ్యహింసా స్వభావాన్ని బట్టబయలు చేసింది. సామాజిక నిబద్ధతలేని వాళ్ళే ఎక్కువగా లాకప్ హింసకు గురవుతున్నారు. వీరిని సమాజం హింసాపూరిత నేరానికి పాల్పడే అవకాశమున్న వాళ్ళుగా గుర్తించడంతో వారిపై మితిమీరిన హింసకు దిగే వీలుంది.

17.7 అభివృద్ధి మరియు మానవ హక్కులు

ప్రభుత్వపు అభివృద్ధి విధానాల ఫలితంగా ప్రాంతీయ అసమానతలు పర్యావరణ సమస్యలు, వాతావరణం కాలుష్యం, సంభవించాయి. భారీ ఎత్తున ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించి వారి వైద్యం, జీవించే హక్కులను కాలరాయడంలో వారి జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి.

17.7.1 ప్రాంతీయ వివక్ష

పరిచయంలోనే విచారించినట్లుగా మూడు ప్రత్యేక ప్రాంతాలైన రాయలసీమ, కోస్తాంధ్ర, తెలంగాణలతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం చల్ల జరుగుతున్నప్పుడు తమ భవిష్యత్తు పట్ల ఆందోళన చెందిన రాయలసీమ నాయకులు వారి ప్రాంతానికి ప్రాధాన్యతను ఇవ్వడానికి శ్రీబాగ్ ఒప్పందం (1937) కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో రాయలసీమకు నెల్లూరులో ప్రధానంగా నదీ జలాల పంపిణీ విషయంలో ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయంలో తగాదా వచ్చినప్పుడు ముందుగా రాయలసీమ అవసరాలే తీర్చాలని నిర్ణయించారు. ఒప్పందంలో తెలంగాణకు చెందిన వనరులన్నింటిని రాష్ట్రం మొత్తానికి కాకుండా ఎక్కువగా తెలంగాణకే ఖర్చు చేయాలని తీర్మానించారు. దీని కోసం రాజ్యాంగంలోని 371 ఆర్టికల్ ప్రకారం 1958లో ఒక ప్రాంతీయ కమిటీని కూడా వేశారు. కాని ఆ తర్వాత వచ్చిన అన్ని ప్రభుత్వాలు ఈ ఒప్పందాలను ఖాతరు చేయలేదు. చాలా వనరులను అప్పటికే సంపన్నమైన కోస్తాంధ్ర ప్రాంతానికి తరలించారు. చివరికి 1969లో, ఈ ఒప్పందాలన్నింటిని రద్దు చేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలేవీ తెలంగాణలో భారీ నీటి పారుదల ప్రాజెక్టులు చేపట్టక పోవడంతో పాటు చిన్న, నీటిపారుదల పథకాలైన సరస్సులు, కాలువలు వంటి వాటిని కూడా పట్టించుకోలేదు. తెలంగాణలో నిర్మించిన ప్రాజెక్టులు (నాగార్జున సాగర్ శ్రీశైలం) చాలా వరకు కోస్తాంధ్ర ప్రాంతానికే నీటిని అందిస్తున్నాయి. తెలంగాణ ప్రాంతానికి 46.28 శాతం నీరు రావాల్సి వున్నప్పటికీ కేవలం 26.42 శాతం నీటిని మాత్రమే పొందుతున్నది. నిజాం ప్రభుత్వ ప్రణాళికలో వున్న దేవునూరు, ఇచ్చంపల్లి, భీమ, తుంగభద్ర మొదలైన పథకాలన్నింటిని ప్రస్తుత ప్రభుత్వాలు రద్దు చేసినాయి. చాలా కాలం తర్వాత ఇచ్చంపల్లి పథకాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా భూగర్భ నీటి మట్టం తగ్గి కరువు లేర్పడడంతో ప్రజలు భారీ ఎత్తున వలస పోతున్నారు. రాయలసీమలో కూడా పరిస్థితి ఇదే విధంగా వుంది. వాగ్దానం చేసిన 23.68 శాతం నీటికి బదులు 12.94 శాతం నీటిని మాత్రమే రాయలసీమ పొందుతున్నది. వనరులను కేటాయించక పోవడంతో రాయలసీమలో ఏ ప్రాజెక్టులు చేపట్టలేదు.

17.7.2 పారిశ్రామిక కాలుష్యం–పర్యావరణ విధ్వంసం

ప్రాంతాల వారిగా పారిశ్రామిక అభివృద్ధి గా లేకపోవడం, లోపభూయిష్ట వనరుల పంపిణీ వలన పరిశ్రమలన్నీ ఒకే చోట కేంద్రీకృతమవడంతో వాతావరణ నీరు, గాలి కాలుష్యమవుతున్నాయి. 1987 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని 606 పెద్ద, మధ్య తరహా పరిశ్రమలలో సగం పరిశ్రమలు హైదరాబాద్, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లోనే వున్నాయి. ఇందులో చాలా వరకు రసాయనిక్ పరిశ్రమలే కావడం చేత చెరువులు సరస్సులు రసాయనాలతో మలినమై ప్రజలకు కరువవుతున్నది. బాధ్యతా రాహిత్యంతో పరిశ్రమలు, సరస్సులు, పొలాలు, నదులలో మలినమైన రసాయనాలు వదలడం వల్ల మనుషులకు చెట్లు చేమలకు ఎలాంటి హాని జరుగుతుందో

BRAOU

1980లలో కొన్ని (సిటిజన్స్ ఎగెన్స్ట్ ఎన్విరాన్మెంట్ పొల్యూషన్) పర్యావరణ సంఘాలు నిరసన ఉద్యమాలు చేపట్టి తెలియజేసాయి. ఈ ప్రాంతాలలో చాలా మంది శ్వాసకోశ సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నట్లు తెల్సింది. పది సంవత్సరాల తర్వాత కూడా పరిస్థితిలో మార్పేమిలేదని ఈ మధ్యే జరిపిన అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి. ఇలాంటి సమస్యలు పరిశ్రమలు ఎక్కువగా కేంద్రీకృతమైన విశాఖపట్నం, కరీంనగర్, రాజమండ్రి వంటి పట్టణాలలో కూడా వున్నాయి. పరిశ్రమల అభివృద్ధికి ఎన్నో సంస్థలున్నప్పటికి కాలుష్య నివారణకు ఎపిపిసిబి (ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) ఒకే ఒక సంస్థ వుంది. ఇది కూడా పారిశ్రామిక వేత్తలకు అనుగుణంగా వుంది. ఫలితంగా ప్రజల ఆరోగ్య, వాతావరణ, నీటి, గాలి ప్రాణరక్షణ హక్కుల ఉల్లంఘన జరుగుతుంది.

17.7.3 అభివృద్ధి ప్రాజెక్టులు-వసతి కోల్పోయిన ప్రజలు

అభివృద్ధి పథకాలైన డ్యాములు, గనులు, విద్యుత్ ప్రాజెక్టులు, వన్యమృగసంరక్షణ కేంద్రాలు, ఫ్యాక్టరీల కారణంగా కుటుంబాలతో సహా కొన్ని నివాస ప్రాంతాలను సరైన పునరావాసం కల్పించకుండా ఖాళీ చేయించారు. ఆంధ్రప్రదేశ్‌లో నివాసం కోల్పోయిన వాళ్ళకు ఆయకట్టు ప్రాంతాలలో భూమినిచ్చే పద్ధతిని 1980లో ఆపేశారు. దీని స్థానంలో డబ్బులిచ్చే పద్ధతిని ప్రవేశ పెట్టడంతో వీరి జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి. స్థిరాస్తులు లేక ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న వారికి, వ్యవసాయ కూలీలకు, పాలాల్లో పని చేసే స్త్రీలకు, కుల వృత్తులు చేసుకునే వారికి పునరావాసం కల్పించమంటే, వాళ్ళ జీవనాధారమైన పనిని పోగొట్టినట్లే. గతంలో పునరావాసమంటే దాన్నో పథకంగా భావించేవారు. ఇప్పుడు దాన్ని ఓ కంటితుడుపు చర్యగా భావిస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు లాంటి కొన్ని సందర్భాలలోనైతే గిరిజనులు తమ గ్రామాలను ఖాళీ చేయకపోతే పోలీసులు బలవంతంగా ఖాళీ చేయించి ఇళ్ళను ధ్వంసం చేశారు. గిరిజనులను వెళ్ళగొట్టిన తర్వాత కూడా వారి జీవన విధానానికి అనుగుణంగా పునరావాసాన్ని కల్పించలేదు. ఉదాహరణకు శ్రీహరి కోట అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పుడు అక్కడ నివసిస్తున్న యానాది ప్రజలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో జీవించక, బయటికి రావడం జరిగింది. అలాగే శ్రీశైలం పులి సంరక్షణ ప్రాజెక్టు, వరద రాజ స్వామి ప్రాజెక్టుల ఏర్పాటు కోసం కర్నూలు జిల్లాలోని పెద్ద చెరువుకు చెందిన చెంచులకు బీడు భూముల్లో పునరావాసాన్ని కల్పించలేదు. అప్పటికే వాళ్ళ గుడిసెలను అధికారులు ధ్వంసం చేశారు. స్వాతంత్ర్యానంతరం కాలంలో వచ్చి చెట్ల కింద నివసించారు. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా నివాసం కోల్పోయిన ప్రజలకు సరైన పునరావాసం కల్పించలేక పోయారు. 1980లలో పరిస్థితి మరీ అధ్వాన్నమైంది. గత మూడు దశాబ్దాలలో నివాసం కోల్పోవడానికి కారణమైన భారీ ప్రాజెక్టులు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు (57 గ్రామాలలోని 5098 కుటుంబాలలో 25 వేల ప్రజలు) శ్రీశైలం ప్రాజెక్టు (117 గ్రామాలలోని 27,871 కుటుంబాల - ప్రజలు), సింగూర్ ప్రాజెక్టు (69 గ్రామాలలోని 10,291 కుటుంబాల 57,722 ప్రజలు), శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (117 గ్రామాల 47,599 కుటుంబాలు), పోలవరం (250 గ్రామాల లక్షన్నర ప్రజలు), విశాఖ స్టీల్ ప్లాంట్ (61 గ్రామాల 1/ వేల కుటుంబాలు), రామగుండం థర్మల్ ప్లాంట్ (1979-89 గ్రామాలకు చెందిన 782 కుటుంబాలు), శ్రీహరి కోట అంతరిక్ష కేంద్రం (1969-71,79 యానాది కుటుంబాలకు చెందిన 10వేల ప్రజలు), మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ (నాల్గు గ్రామాలకు చెందిన 382 కుటుంబాలు), శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు (2 వేల మంది చెంచులమళ్ళగొట్టారు) ఈ ప్రాజెక్టుల వలన ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారు.

17.8 ఉదార ఆర్థిక విధానం- మానవ హక్కులు

ప్రభుత్వం సంక్షేమ చర్యలను ఉపసంహరించుకుని ఉదార్థిక విధానాలను అనుసరించిన ఫలితంగా కూడా హక్కుల ఉల్లంఘన జరిగింది. ప్రభుత్వ రంగ సంస్థల మూసివేత, వ్యవసాయ రంగానికి సబ్సిడీల తగ్గింపు, విద్య, వైద్య రంగాలకు వనరుల కేటాయింపులో కోత మొదలగునవి ఈ కోవ వస్తాయి.

1990ల కాలంలో ప్రభుత్వం ఉదార విధానాలను చేపట్టించ బ్యాంకు ఆదేశాలను అమలుపర్చడంలో ఆంధ్రప్రదేశ్ ముందున్నది. ప్రపంచ బ్యాంకు ఆదేశాలు ప్రభుత్వాలను అధిగమించేందుకు ఉద్దేశించిన వైద్య,

BRAOU

విద్య, విద్యుచ్ఛక్తి, నీటి పారుదల, పరిశ్రమల వంటి రంగాలలో దాని జోక్యం కారణంగా ప్రజల జీవితాలపై దాని ప్రభావం ఎక్కువగా వుంటుంది. శాంతి భద్రతా రంగం మినహాయించి ప్రభుత్వం అన్ని రకాలైన లాభం లేని పరిశ్రమల నుండి తప్పుకోవాలని లేదా లాభాల బాటలో నడిపించాలని ప్రపంచ బ్యాంకు ఆదేశిస్తున్నది. క్లుప్తంగా చెప్పాలంటే ప్రభుత్వం రాజ్యాంగం సూత్రాలైన సామాజిక న్యాయం, సమానత్వం ప్రజాస్వామ్యయుతమైన ఆర్థిక, విద్యా విధానాల నుండి తప్పుకొని 'బలం కలవాడే జీవించే' మార్కెట్ పద్ధతిని అనుసరించమని ప్రపంచ బ్యాంకు ఉద్దేశ్యం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశిక సూత్రాలకు బదులు ఈ సూత్రాలనే అనుసరిస్తున్నది. ఫలితంగా ప్రభుత్వం విద్య, వైద్య, నీటి పారుదల రంగాల నుండి తప్పుకుంటున్నది. 1980లలో ప్రభుత్వాధికారుల అవినీతి, బాధ్యతా రాహిత్యమైన నిర్వహణ కారణంగా నష్టాలకు గురై, ఖాయిలాపడిన ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో తక్కువ ధరలకు ప్రయివేటు రంగాలకు అమ్మడం ప్రారంభించింది.

కార్మికుల విజ్ఞప్తిని వినకుండా ప్రభుత్వం ఎ.పి. స్కూటర్స్ లిమిటెడ్, రిపబ్లిక్ ఫోర్జ్ లిమిటెడ్, ఆల్విన్ లిమిటెడ్ మొదలైన ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రయివేటు వ్యక్తులకు అప్పగించారు. నిజానికి వీటిని ప్రయివేటు పరం చేసే ఉద్దేశ్యం వీటి పనితీరును సంకుచిత కోణం నుండి అర్థం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో భారీ ఎత్తున ఉద్యోగులను తొలగిస్తూ, వాళ్ళ హక్కులను కాలరాస్తున్నారు. ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులు కొంత మంది ఇప్పటికే తమ సాంప్రదాయ కుల వృత్తులకు వెళ్ళిపోయారు. పరిశ్రమలన్నీ కార్మిక చట్టాలు అమలుపర్చని ప్రయివేటు రంగంలోనే వున్నాయన్న విషయాన్ని విస్మరిస్తూ, కార్మికుల హక్కులు పారిశ్రామికాభివృద్ధికి ఆటంకంగా వున్నాయంటూ వాదిస్తున్నారు. ఫలితంగా 1990లలో ప్రభుత్వం సంక్షేమం రంగం నుండి వైదొలగిన తర్వాత పరిశ్రమలలో ఫ్యాక్టరీలలో పని చేసే కార్మికుల జీవన ప్రమాణాలు గణనీయంగా తగ్గిపోయినాయి.

17.9 ముగింపు

ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కుల ఉద్యమం బలంగా వుండడం వల్ల మానవ హక్కులు అనే అంశం ప్రధాన భూమికను నిర్వర్తిస్తుంది. ఈ భాగంలో రాజ్యహింసను ప్రధానంగా మాపిస్తూ క్రమంగా, అసంపూర్తిగానే అయినా దళిత హక్కులను, స్త్రీల హక్కులను, పర్యావరణ విధ్వంసాన్ని, యుద్ధ విధ్వంసాన్ని చర్చించడం జరిగింది. అయితే పట్టణాలను అందంగా తీర్చిదిద్దే పేరు మీద మురికివాడల్లో నివసించే వారిని ఖాళీ చేయించినందుకు, మహబూబ్‌నగర్ జిల్లాలో తాగు నీటి కోసం, సాగునీటికోసం ఈ మధ్య మళ్ళీ వచ్చిన తెలంగాణ ఉద్యమం లాంటి వేర్వేరు ఉద్యమాల/నిరసనల/ విమర్శల నేపథ్యంలో మరింత బలమైన మానవ హక్కుల ఉద్యమం యొక్క అవసరం వుంది.

17.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో సమాధానం రాయండి!

1. స్త్రీల హక్కుల ఉల్లంఘనల స్వభావాన్ని చర్చించండి?
2. దళిత హక్కుల ఉల్లంఘనల స్వభావాన్ని చర్చించండి?
3. ప్రభుత్వంచే జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను విశ్లేషించండి?

ఈ క్రింది ప్రశ్నలకు 20 పంక్తుల్లో సమాధానం రాయండి!

1. కార్మికుల/కూలీల హక్కుల స్థితిగతులు పేర్కొనండి?
2. మానవ హక్కులను పెంపొందించడంలో అభివృద్ధి ఎలా ప్రతిబంధకం అవుతుందో వివరించండి?
3. ఉదార ఆర్థిక విధానాల నేపథ్యంలో మానవ హక్కుల పరిస్థితిని అంచనా వేయండి?

BRAOU

1. ಕಾಲಾವಧಿ ಮುಗಿದ ನಂತರ ಪ್ರಾಜೆಕ್ಟ್ ಅನ್ನು ಪ್ರಾರಂಭಿಸಿದ ಸಂಸ್ಥೆಯು ಮುಂದುವರಿಸಬಹುದು.
2. ಪ್ರಾಜೆಕ್ಟ್ ಅನ್ನು ಪ್ರಾರಂಭಿಸಿದ ಸಂಸ್ಥೆಯು ಅದನ್ನು ಮುಂದುವರಿಸಲು ಅಸಮರ್ಥವಾಗಿದ್ದಲ್ಲಿ ಅಥವಾ ಅದನ್ನು ಮುಂದುವರಿಸಲು ಇಚ್ಛಿಸದಿದ್ದಲ್ಲಿ.
3. ಸಂಸ್ಥೆಯು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಅನ್ನು ಮುಂದುವರಿಸಲು ಅಸಮರ್ಥವಾಗಿದ್ದಲ್ಲಿ ಅಥವಾ ಇಚ್ಛಿಸದಿದ್ದಲ್ಲಿ.
4. ಕೆಲಸವು ಪೂರ್ಣಗೊಂಡ ನಂತರ ಪ್ರಾಜೆಕ್ಟ್ ಅನ್ನು ಮುಂದುವರಿಸಲು ಸಾಧ್ಯವಾಗದಿದ್ದಲ್ಲಿ.
5. ಪ್ರಾಜೆಕ್ಟ್ ಅನ್ನು ಮುಂದುವರಿಸಲು ಸಾಧ್ಯವಾಗದಿದ್ದಲ್ಲಿ.

ಈ ಕೆಳಗಿನ ಯಾವುದೇ ಸಂದರ್ಭಗಳಲ್ಲಿ ಪ್ರಾಜೆಕ್ಟ್ ಅನ್ನು ಮುಂದುವರಿಸಲಾಗುವುದಿಲ್ಲ.

12.10 ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಪ್ರಗತಿಯ ಮೌಲ್ಯಮಾಪನ

ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಪ್ರಗತಿಯ ಮೌಲ್ಯಮಾಪನವನ್ನು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಮಾರ್ಗದರ್ಶಕರು ಮತ್ತು ಸಂಯೋಜಕರು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಅವಧಿಯಲ್ಲಿ ಕಾಲಕಾಲಕ್ಕೆ ಮಾಡಬೇಕು. ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಪ್ರಗತಿಯ ಮೌಲ್ಯಮಾಪನವನ್ನು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಮಾರ್ಗದರ್ಶಕರು ಮತ್ತು ಸಂಯೋಜಕರು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಅವಧಿಯಲ್ಲಿ ಕಾಲಕಾಲಕ್ಕೆ ಮಾಡಬೇಕು. ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಪ್ರಗತಿಯ ಮೌಲ್ಯಮಾಪನವನ್ನು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಮಾರ್ಗದರ್ಶಕರು ಮತ್ತು ಸಂಯೋಜಕರು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಅವಧಿಯಲ್ಲಿ ಕಾಲಕಾಲಕ್ಕೆ ಮಾಡಬೇಕು.

12.11 ಪ್ರಾಜೆಕ್ಟ್ ವರದಿ

ಪ್ರಾಜೆಕ್ಟ್ ವರದಿಯನ್ನು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಮಾರ್ಗದರ್ಶಕರು ಮತ್ತು ಸಂಯೋಜಕರು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಅವಧಿಯಲ್ಲಿ ಕಾಲಕಾಲಕ್ಕೆ ಮಾಡಬೇಕು. ಪ್ರಾಜೆಕ್ಟ್ ವರದಿಯನ್ನು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಮಾರ್ಗದರ್ಶಕರು ಮತ್ತು ಸಂಯೋಜಕರು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಅವಧಿಯಲ್ಲಿ ಕಾಲಕಾಲಕ್ಕೆ ಮಾಡಬೇಕು. ಪ್ರಾಜೆಕ್ಟ್ ವರದಿಯನ್ನು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಮಾರ್ಗದರ್ಶಕರು ಮತ್ತು ಸಂಯೋಜಕರು ಪ್ರಾಜೆಕ್ಟ್ ಕೆಲಸದ ಅವಧಿಯಲ್ಲಿ ಕಾಲಕಾಲಕ್ಕೆ ಮಾಡಬೇಕು.

BRAOU

భాగం 18: పౌర సమాజం – మానవ హక్కులు

విషయ క్రమం

18.0 ఉద్దేశం

18.1 పరిచయం

18.2 పాశ్చాత్య రాజ్యాలలో పౌర సమాజం

18.3 పౌర సమాజంలో మానవ సంబంధాలు

18.4 రాజ్యం నియంత్రణలో పౌర సమాజం

18.5 పౌర సమాజం లోపల మానవ హక్కులు

18.6 కమ్యూనిస్టు పార్టీల పాలనలో పౌర సమాజం

18.7 భారత దేశంలో పౌర సమాజం - మానవ హక్కులు

18.8 పౌర సమాజం స్వేచ్ఛ-పౌర సమాజం లోపల స్వేచ్ఛ

18.9 ముగింపు

18.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

18.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

★ పాశ్చాత్య రాజ్యాలలో పౌర సమాజ పరిణామం, మానవ సంబంధాలను తెలుసుకుంటారు

★ రాజ్యం నియంత్రణలో పౌర సమాజం, మానవ హక్కుల- గురించి తెలుస్తుంది

★ కమ్యూనిస్టు పార్టీల పాలనలో పౌర సమాజం మరియు భారత దేశంలో పౌర సమాజం గురించి తెలుసుకుంటారు.

★ పౌర సమాజ స్వేచ్ఛ మరియు పౌర సమాజంలోపల స్వేచ్ఛ గురించి అవగాహన కలుగుతుంది.

18.1 పరిచయం

ఆధునిక యుగ ప్రారంభంలో 'పౌర సమాజం' అనే మాట ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆర్థిక వ్యవస్థపై రాజ్యం జోక్యాన్ని నిరసిస్తూ జరిగిన తిరుగుబాటు ఆధునిక వ్యవస్థ రూపొందడానికి దోహదం చేసింది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఆవిర్భావంతో పౌర వ్యవస్థలు వేళ్ళూనుకుని కాల క్రమంలో స్వతంత్ర్యంగా రూపొందగలిగినాయి. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన మానవ సంబంధాలు పౌర సమాజంలో భాగమైనాయ. రాజ్యం అధికార పరిధికి లోబడి పౌర సమాజం మనుగడ సాగించే అనివార్య పరిస్థితి ఏర్పడింది. పౌర సమాజంలోని మానవ హక్కులను రాజ్య చట్టాలు క్రమబద్ధం చేస్తాయి. ఈ క్రమంలో పౌర సమాజం వునికి, మానవ హక్కుల విషయంలో అనేక దృక్పథాలు పరిశీలించాల్సిన అవసరం వుంది.

BRAOU

నుండి, సృష్టించ

ఆహ్వానించదగ్గ విషయమేగాని ఆ స్వేచ్ఛనే ప్రజాస్వామ్యానికీ హక్కులకూ ప్రమాణంగా నిలబెట్టడం తగదు. ఎందుకంటే రాజ్యంలో వున్నట్టే పౌర సమాజంలోనూ అసమానతలుంటాయి. అణచివేత వుంటుంది. మనుషులు రాజ్యంలో భాగంగా కాకుండా పౌరులుగా తమ మధ్య తాము ఏర్పర్చుకునే సంబంధాలన్నీ సమానతా ప్రాతిపదికన వుంటాయన్న భరోసా లేదు. ఉదాహరణకు స్వేచ్ఛా విపణిలో పౌరులుగా వ్యవహరించే వారిలో బాగా ఆస్తులున్న వారుంటారు, కొంచెం మాత్రమే ఆస్తి వున్న వారుంటారు. అసలే ఆస్తి లేక శ్రమశక్తిని అమ్ముకొని బతికే వారుంటారు. వీరి మధ్య స్వేచ్ఛా విపణిలో నెలకొనే సంబంధాలలో దోపిడీ, అణచివేత, ఆధిపత్యాలు వుంటాయి.

రాజ్యం అదుపు లేకుండా పౌరులు పౌరులుగా రూపొందించుకునే విద్యా వ్యవస్థ, సాంస్కృతిక సాహిత్య రంగాలు కూడా అంతే. అవి సమానతా విలువనూ మానవతా సంస్కృతినీ పెంపొందించి తీరుతాయన్న భరోసా ఏమీ లేదు. రాజ్యం నుండి పూర్తి స్వేచ్ఛగా వుండే విద్యా వ్యవస్థ, సాంస్కృతిక రంగం, జాత్యహంకార విలువలను ప్రచారం చేయవచ్చును, పాశ్చాత్య దేశాలలో చేసాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే రాజ్యం లాగే పౌర సమాజం అనేది కూడ అసమానతలకు నెలవు. మానవ సామాజిక ఆచరణను ఊపిరాడనీయకుండా చేసి అదుపులో పెట్టుకొన్న మధ్యయుగాల రాజ్య ఆధిపత్యం నుండి పౌర జీవితానికి స్వేచ్ఛ కావాలని కోరుకోవటం, దానిని సాధించు కోవటం ప్రగతిశీలమైన చారిత్రక పరిణామమే. కానీ హక్కుల సాధనలో అదే చివరి ఘట్టం కాదు. హక్కులకు పౌర సమాజం స్వేచ్ఛే తుది నిర్వచనం కాదు.

ఈ విమర్శ ఎప్పుడయితే పాశ్చాత్య దేశాలలో వివిధ సామాజిక వర్గాల నుండి, ఉద్యమాల నుండి వచ్చిందో అప్పుడు పౌర సమాజంలోని మానవ హక్కుల లేమి గురించి చర్చ మొదలైంది. కార్మికులు, స్త్రీలు, నల్ల జాతీయులు పౌర సమాజంలో తమ స్థితిగతుల గురించి చర్చ పెట్టారు. హక్కులు అంటే కేవలం రాజ్యం నుండి స్వేచ్ఛేకాదు, రాజ్యేతర ఆధిపత్యాల నుండి కూడా స్వేచ్ఛ వున్నప్పుడే హక్కులు సంపూర్ణంగా వున్నట్టని ఈ సంవాదం నిర్ధారించింది. ''పౌర సమాజానికి స్వేచ్ఛ'' అనే భావనకు కొనసాగింపుగా ''పౌర సమాజం లోపల స్వేచ్ఛ'' అనేది ముందుకొచ్చింది. ఆవేశంగా జరిపే చర్చలో రెండవ భావన. మొదటి దానికి శత్రువుగా కన్పించినా నిజానికది కొనసాగింపే.

మనుషులు ప్రకృతితోనూ, ఇతర మనుషులతోనూ ఏర్పర్చుకునే సంబంధాల ద్వారా తమను తాము వ్యక్తీకరించుకుంటారు. ఈ సంబంధాలకొక వ్యవస్థిత రూపం ఇచ్చే సంఘ జీవిత నిర్మాణాలు మానవ స్వయం వ్యక్తీకరణకు వేదికలు కల్పిస్తాయి. ఒక సామాజిక రూపం కల్పిస్తాయి.

ఈ క్రియ మీద మధ్య యుగాలలో రాజ్యం, మతం పెట్టిన ఆంక్షలు, నియంత్రణ, మనుషుల సృజనాత్మక వ్యక్తీకరణను కుదించి వేసింది. చాలా సందర్భాలలో దానిని వికృతంగా తయారు చేసింది. ఈ స్థితి నుండి పాశ్చాత్య దేశాలలో మానవ సామాజిక జీవితానికి విముక్తి కల్పించిన చారిత్రక పరిణామానికి సంకేతం పౌర సమాజం అనే భావన.

18.5 పౌర సమాజం లోపల మానవ హక్కులు

అయితే ఆ విధంగా విముక్తమైన మానవ సృజనాత్మకత అన్ని వేళలలోనూ సమానత్వం వైపు, మానవీయత వైపు యాణం చేయలేదు. అది నిర్బంధ పూరితమైన సామాజిక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఒకరి శ్రమనొకరు దోచుకునే వ్యవస్థకు 'రూపకల్పన చేసింది. అత్యంత స్వేచ్ఛాయుతమైన పౌర సమాజం గల 19వ శతాబ్దపు అమెరికాలో నెలకొన్న వ్యవస్థ ఇందులో మొదటిదానికొక ఉదాహరణ.

వాస్తవాన్ని బయటకు లాగి పౌర సమాజంలోని మానవ హక్కుల లేమి గురించి చర్చ పెట్టిన క్రమంలో అప్పటి దాకా అమలులో వున్న దృక్పథంలో కొంత మార్పు వచ్చింది. పౌర సమాజంలోని అసమానతలు

BRAOU

ఎదుర్కోవడానికి బలహీనులకు ఆసరా ఎక్కడి నుండి వస్తుంది? ఎవరయితే బలవంతుల మీద కూడా నిర్బంధంగా నియమాలు పెట్టి అమలు చేయగలరో వారి నుండే రాగలదు. అంటే రాజ్యం నుండే రాగలదు.

పౌర సమాజాన్ని ఊపిరాడనీయకుండా అదుపు చేసిన అహేతుకమైన రాజ్యాధికారాన్ని వ్యతిరేకించినవైఖరి స్థానంలో, పౌర సమాజంలోని అసమానతలనూ దోపిడీని అదుపు చేయగల సహేతుకమైన రాజ్యాధికారాన్ని ఆదరించేవైఖరి వచ్చింది. పైన చెప్పినట్టు సంవాదపు వేడిలో ఇవి పరస్పరం శత్రు వైఖరులుగా కన్పించినా వాటి మధ్య శత్రుత్వమేమీ వుండనవసరం లేదు. మొదటిది ఒక చారిత్రక దశలో ముందుకొచ్చిన ప్రజాస్వామిక భావన కాగా రెండవది తర్వాత కాలంలో దానిపైన కొత్త కోణం నుండి పెట్టిన విమర్శ తీసుకొచ్చిన సవరణ. ''రాజ్యం ఎంత తక్కువ పరిపాలిస్తే అంత మంచిది'' అనేది ప్రామాణికమైన ప్రజాస్వామిక అవగాహనగా మొదటి దశలో ముందుకొచ్చింది. రాజ్యం ఎంతగా పరిపాలన చేస్తుందనేది ప్రమాణం కాదనీ, అహేతుకమైన అధికారాలు రాజ్యం చేతిలో నుండి తీసేసి పౌర సమాజానికి స్వేచ్ఛ కల్పిస్తూ, అదే సమయంలో పౌర సమాజంలోని అసమానతలనూ అణచివేతనూ అదుపు చేసే సహేతుకమైన అధికారాన్ని రాజ్యం చేతిలో పెట్టడమేకాక పెంచడం కూడా అవసరం అని రెండవ దశలో భావించడం జరిగింది.

ఈ దశలను ఈ విధంగా వివరిస్తున్నామంటే అర్థం ఈ సంవాదం ఇంత ప్రశాంతంగా జరిగిందని కాదు. విపరీతమైన ఘర్షణ రూపంలో జరిగింది. రెండు వైపులా అవాంఛనీయమైన అతివాదం చోటు చేసుకుంది. ఇప్పటికీ ఈ సంవాదం ముగియలేదు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న సరళీకరణ, ప్రపంచీకరణలు ఈ చర్యకు మళ్ళీ ఊపిరి పోసాయి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన సదుపాయాలు కల్పించడం వరకే రాజ్యం కర్తవ్యం తప్ప అందులోని అసమానతల జోలికి రాజ్యం పోకూడదనేది నేడొక బలమైన వాదన.

పాశ్చాత్య దేశాలలోని పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో తమ హక్కుల కోసం, మనుగడ కోసం కార్మికులు చేసిన పోరాటాలు, ఓటు హక్కుతో మొదలుపెట్టి అన్ని రంగాలలో సమానత్వం కోసం స్త్రీలు చేపట్టిన పోరాటాలు, పౌరసత్వంతో మొదలుకొని సంపూర్ణ సామాజిక సమానత్వం కోసం అమెరికా వంటి దేశాలలో నల్ల జాతీయులు (ఈ మధ్య కాలంలో అమెరికాలోనేకాక ఆస్ట్రేలియాలో కూడా ఆదివాసీలు) చేసిన, చేస్తున్న పోరాటాలు ఆ దేశాలలో పౌర సమాజంలో మానవ హక్కుల కోసం జరిగిన, జరుగుతున్న పోరాటాలు.

ఈ పోరాటాలన్నీ కూడా సామాజిక సంబంధాలలో మార్పును కోరుకున్నాయి. ఈ మార్పు సాంఘిక సంస్కృతితోనూ, జీవన విధానంతోనూ ముడిపడి వుంది. కాబట్టి దీనిని రాజ్యం సాధించి పెట్టలేదు. అయినప్పటికీ మార్పుల సాధనలో రాజ్య శాసనాలకొక పాత్ర వుండగలదు. ఈ ఉద్యమాలన్నీ ఆ రకమైన శాసన సహాయాన్ని కోరాయి, పొందాయి.

కార్మికులకు పని గంటల పరిమితిని కల్పించిన చట్టాలు, కనీస వేతన చట్టాలు, లాభాలలో బోనస్ రూపంలో వాటా కల్పించే చట్టాలు, ఉద్యోగ భద్రతను పరిమితంగానయినా సరే కల్పించే చట్టాలు, పని స్థలంలో జరిగే ప్రమాదాలకు నష్టపరిహారం కల్పించే చట్టాలు మొదలైనవన్నీ పౌర సమాజంలోని ఒక అసమానతను అదుపు చేసే ప్రయత్నంలో భాగంగా రూపొందిన శాసనాలే. స్త్రీలకు ఓటుహక్కు కల్పించిన చట్టాలు, విడాకుల హక్కు కల్పించిన చట్టాలు, లైంగిక హింసను నిరోధించడానికీ శిక్షించడానికీ రూపొందించిన చట్టాలూ, పని స్థలంలో సమాన వేతనాలు, ప్రసూతి సెలవు మొదలైన హక్కులు కల్పించిన చట్టాలు మరొక అసమాన పౌర సమాజ వ్యవస్థను అదుపు చేయడానికి ముందుకొచ్చిన శాసనాలు- పౌరసత్వమే లేని నల్ల జాతీయులకు పౌరసత్వం కల్పించి బానిస వ్యవస్థను రద్దు చేసిన చట్టాలు, ఆ తర్వాతి కాలంలో వివిధ సామాజిక రంగాలలో నల్ల జాతీయులకు సమాన అవకాశాలు కల్పించడం కోసం చేసిన చట్టాలు ఇంకొక అసమాన పౌర సమాజ వ్యవస్థ పైన చేసిన పోరాటం ఫలితంగా అమెరికా రాజ్యం చేపట్టిన శాసన సంస్కరణలు.

18.6 కమ్యూనిస్టు పార్టీల పాలనలో పౌర సమాజం

మధ్యయుగాల యూరప్‌లో రాజ్యం పౌర సమాజంపైన పెట్టిన నియంత్రణ సంగతి ఎట్లాగున్నా, ఆధునిక కాలంలో

BRAOU

కమ్యూనిస్టు పార్టీలు నెలకొల్పిన నియంతృత్వాలు పౌర సమాజంపైన రాజ్యం అదుపు సంపూర్ణంగా వుంటే ఎట్లా గుంటుందో రుచి చూపించాయి. కమ్యూనిస్టు పాలనలో రాజ్యం జోక్యం లేని జీవితమే లేకుండా పోయింది. రాజ్యం జోక్యం లేకుండా, పౌరులు పౌరులుగా తమ మధ్య తాము సంబంధాలు నెలకొల్పడం గానీ, తమ కోసం తాము వ్యవస్థలు రూపొందించుకోవటం గానీ సాధ్యం కాకుండా వుండింది. రాజ్యం పర్యవేక్షణలోనే కార్మిక సంఘాలైనా, కళా సాహిత్య సంస్థలైనా, వైద్య వైజ్ఞానిక రంగమైనా నడుచుకునేవి.

కమ్యూనిస్టు పార్టీల పాలనలో ప్రజలకు పని, చదువు, వైద్యం మొదలైన అనేక విషయాలలో హక్కులు, భద్రత దొరికినప్పటికీ పౌర సమాజాన్ని ఊపిరాడనంతగా అదుపులో పెట్టుకొన్న రాజకీయ సమాజం పట్ల కాలక్రమంలో ఆ దేశాలలో తీవ్రమైన అసంతృప్తి నెలకొని వుంది. ఆ రాజకీయ వ్యవస్థ పతనంలో ఈ అసంతృప్తి ముఖ్యమైన 'పాత్ర నిర్వహించింది.

పౌర సమాజానికి తగు మాత్రం స్వేచ్ఛ, స్వతంత్రత అవసరమనీ లేకపోతే మానవ మనుగడలో సంతృప్తి వుండదనీ దీనిని బట్టి అర్థం అవుతుంది.

కానీ అదే పరమావధిగా పెట్టుకున్న హక్కుల స్పృహ అసమగ్రమని కూడా పాశ్చాత్య దేశాల చరిత్రే చెబుతుంది. పౌర సమాజం లోపలి అసమానతల నుండి ఉత్పన్నమయ్యే మానవ హక్కుల సమస్యలు అనేకం వుంటాయనీ వాటిని గుర్తించకుండా రాజ్యం అదుపు నుండి విముక్తమైన పౌర సమాజమే మానవ హక్కులకూ, ప్రజాస్వామ్యానికీ అంతిమ ప్రమాణం అనుకోవటం తప్పనీ పైన చూసాం. కమ్యూనిస్టు పార్టీల ఏకచ్ఛత్రాధిపత్యాన్ని తొలగించుకుని పౌర సమాజ స్వేచ్ఛను పునరుద్ధరించుకున్న యూరోపియన్ దేశాలు ఈ సత్యాన్ని గుర్తిస్తున్నాయి. దీనికి అంతిమ పరిష్కారం ఏమైనా, ప్రస్తుత దశలో పౌర సమాజంలోని అసమానతలనూ దోపిడీని అదుపు చేయడంలో రాజ్యానికొక పాత్ర వుందని ఆ దేశాల ప్రజలు గుర్తిస్తున్నారు.

అందువల్ల పౌర సమాజానికి స్వేచ్ఛ, పౌర సమాజంలోపల స్వేచ్ఛ అనేవి రెండూ మానవ హక్కులకు రెండు పార్శ్వాలే. మనుషులు రాజ్యం అదుపు లేకుండా స్వేచ్ఛగా ప్రకృతిలోనూ ఇతర మనుషులతోనూ సంబంధాలను రూపకల్పన చేసుకునే పరిస్థితి వుండాలి. అదే సమయంలో ఆ సంబంధాలు ఒకరి స్వేచ్ఛనూ జీవితాన్నీ మరొకరు హరించే సంబంధాలుగా వుండకూడదు. ఈ రెండు ఏక సమయంలో ఒనగూడే పరిస్థితి ఏ విధంగా ఏర్పడుతుంది, ఏ మేరకు సాధ్యమవుతుంది అనేది మానవ హక్కుల కృషి తుది గమ్యాన్ని నిర్దేశిస్తుంది.

BRAOU

18.7 భారత దేశంలో పౌర సమాజం– మానవ హక్కులు

మానవ హక్కుల అంతిమ లక్ష్యాన్ని గురించి మాట్లాడుకునేటప్పుడు ఏ దేశమైనా ఒకటే కావచ్చును గానీ, చారిత్రకంగా హక్కుల గమనాన్ని పరిశీలించేటప్పుడు ఒక దేశానికీ మరొక దేశానికీ చాలా తేడా వుంటుంది.

పౌర సమాజం అనే భావన పౌర సమాజం- రాజ్యం అనే వర్గీకరణతో ముడిపడి వున్న భావన. రాజ్యం అదుపు నుండి పౌరసమాజం బయటపడి తనను తాను ఒక స్వతంత్ర జీవిత రంగంగా రూపొందించుకునే ప్రయత్నం ఆధునికత'ను నిర్వచించిన యూరప్ దేశాల చరిత్రతో పౌర సమాజం అనే భావన చారిత్రకంగా ముడిపడి వుంది. అయినప్పటికీ 'రాజ్యం' కాని సామాజిక జీవితాన్ని 'పౌర సమాజం'గా నిర్వచిస్తే, ఆ భావనను భారత దేశానికి కూడా అన్వయించలేమా అంటే అన్వయించవచ్చునుగానీ అది యాంత్రికమైన అవగాహనకు దారి తీసే ప్రమాదం వుంది. మన చరిత్రకు అది సంపూర్ణంగా అతకదు కాబట్టి మన చరిత్రకు అది పూర్తిగా న్యాయం చేకూర్చదు.

ఆ భావన మనకు అసలే పనికి రాదని కాదు. ఒక పరిధిలో పని కొస్తుంది. రాజ్యం (రాజకీయ సమాజం) - పౌర సమాజం అనే భావనతో బాటు ధార్మిక సమాజం (మతం) - లౌకిక సమాజం అనే భావననూ కూడా కలిపి తీసుకొన్నప్పుడే భారత దేశ చరిత్రలో హక్కులు, ప్రజాస్వామ్యం, ఆధునికత అనే భావనలను సమగ్రంగా

నిర్వచించగలుగుతాము. పాశ్చాత్య దేశాలలో కూడా స్త్రీల కోణం నుండి చూసినప్పుడిది సత్యమే. ఆ విషయం పైన చూసాం. స్త్రీల కోణం నుండే కాక సాధారణంగా కూడా మతం - లౌకిక సమాజం అనే వర్గీకరణకు కొంత ప్రాముఖ్యం వుంది. 'ఆధునికత'ను నిర్వచించడంలో ఒక పాత్ర వుంది. అయితే భారత చరిత్రలో ఇదే ప్రధానం. దాని నుండి విడదీసి రాజ్యం - పౌర సమాజం అనే చర్చ పెట్టడం ఇక్కడ సాధ్యం కాదు.

ఈ విషయాన్ని కొంచెం వివరంగా చూస్తేనే పౌర సమాజంలో మానవ హక్కులు అనే విషయాన్ని అర్థం చేసుకోగలము. అసలు భారత దేశంలోని హైందవ సమాజంలో ఒక పౌర సమాజమే లేదనీ అటువంటి చోట ఒక ఆధునిక జాతిని నిర్మించటం ఎట్లా సాధ్యమవుతుందనీ ప్రశ్నించిన వారిలో అంబేద్కర్ ముఖ్యుడు. ఇక్కడ పౌర సమాజం (సివిల్ సొసైటీ) ఏర్పడకుండా అడ్డుకున్నది రాజ్యం కాదు, కులం. 'పౌరులు పౌరులుగా' తమ మధ్య తాము స్వేచ్ఛగా సంబంధాలు, సాంఘిక నిర్మాణాలు ఏర్పర్చుకోలేక పోవడం కంటే మనుషులు మనుషులుగా పరస్పర సంబంధాలు, సంపర్కం ఏర్పర్చుకోలేక పోవడం హైందవ సమాజం ఎదుర్కొన్న సమస్య. దీనికి అడ్డమొచ్చింది రాజ్యం కాదు. రాజ్య నియంత్రణ కాదు. కులం, వర్ణ ధర్మం, అవి కట్టిన అడ్డగోడలు అడ్డమొచ్చాయి.

పాశ్చాత్య దేశాలలో మధ్య యుగాలలో ఒక భూస్వామికి చెందిన భూమిలో పని చేసే రైతులకు ఆ భూమిని వదిలిపెట్టి పోయే స్వేచ్ఛ లేదు. ఒక వృత్తి శ్రేణికి చెందిన శ్రామికులకు ఆ శ్రేణిని వదిలి పెట్టిపోయే స్వేచ్ఛ మీద పరిమితి వుండేది. ఇవి చట్టం 'అంటే రాజ్యం' పెట్టిన పరిమితులు. ఇటువంటి పరిమితులనూ నిర్బంధాన్నీ ఛేదించినాకనే స్వేచ్ఛా విపణి ఏర్పడగలిగింది. అదే క్రమంలోనే ఒక్క ఆర్థిక రంగంలోనే కాక అన్ని రంగాలలోనూ పౌరులు రాజ్యంతో 'నిమిత్తం లేకుండా ఒక పౌర జీవితాన్ని పౌర జీవిత నిర్మాణాలనూ రూపొందించుకోగలిగారు.

కానీ భారతీయ (అంటే హైందవ) సమాజంలో ఒక పౌర జీవితం ఏర్పడాలంటే కులం కట్టిన అడ్డుగోడలు పోవాలి. పౌర జీవితం, అంటే పౌర సమాజం ఏర్పడనిదే ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొల్పడం సాధ్యం కాదని అంబేద్కర్ వాదించాడు. పౌరులు ఈ కులానికో ఆ కులానికో చెందిన వారిగా కాక పౌరులుగా తమ సామాన్య అవసరాలనూ సమస్యలనూ చర్చించుకొని ఒక 'ప్రజాభిప్రాయం' అనేదాన్ని రూపొందించుకుంటారనే ప్రాతిపదిక మీద ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ ఆధారపడింది. దానికి కావలసిన పరస్పర సంపర్కం, సహానుభూతి కుల వ్యవస్థలో సాధ్యం అవుతాయా అన్నది అంబేద్కర్ ప్రశ్న. మనుషులు తమ కులానికి చెందిన వారితో మాత్రమే సంభాషిస్తారు, సమస్యలూ కోరికలూ పంచుకుంటారు, సహానుభూతి ప్రదర్శిస్తారు. ఆ ప్రాతిపదిక మీద మాత్రమే పౌర సమాజ సంస్థలు ఏర్పాటు చేసుకుంటారు. అటువంటి చోట పౌర సమాజం నిలువునా చీలి వుంటుంది. అదసలు పౌర సమాజమే కాదు.

పాశ్చాత్య దేశాలలో మానవ సాంఘిక జీవితం రాజ్యం అదుపు నుండి బయటపడి తనను తాను ఒక పౌర సమాజంగా రూపొందించుకోవాల్సి వచ్చింది. అక్కడ కూడా సంఘ జీవితం పైన మతం ప్రభావం చాలా బలంగా వున్నప్పటికీ ప్రొటెస్టంట్ తిరుగుబాటు తర్వాత ఆ ప్రభావం తగ్గింది. పౌర సమాజం అన్న భావన రాజ్యానికున్న సార్వత్రిక అధికారాన్ని అభావం చేసే భావనగానే ముందుకొచ్చింది, రాగలిగింది.

మరొక విషయం ఏమిటంటే యూరప్‌లో పౌర సమాజం అన్న భావన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను కేంద్రం చేసుకున్న భావన. ఆర్థిక సంబంధాల పైన యూరప్‌లో మతం ప్రభావం తక్కువే. రాజ్యం పెట్టిన (స్వేచ్ఛా విపణి దృష్టిలో అహేతుకంగా కన్పించే) నియంత్రణే ఆర్థిక వ్యవస్థలో మార్పుకు ప్రధాన అవరోధం. ఇతర విషయాలలో (ఉదాహరణకు విద్య, కుటుంబ సంబంధాలు) మతం పెట్టిన నియంత్రణే ప్రధానమైనా, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ యూరప్‌లో విప్లవాత్మకం అనదగిన ఒక వెల్లువగా ముందుకు రావడం వల్ల ఆధునికతకూ పౌర సమాజానికీ అదే ప్రామాణికం కాగలిగింది.

హైందవ సమాజంలో 'ధర్మం' అనేది వృత్తులను కులాలకు పంపిణీ చేయడం ద్వారా ఆర్థిక జీవితాన్ని కూడా శాసించింది. యూరప్‌లో వృత్తులు శ్రేణులుగా సంఘటితమై వుండేవి. వాటి సభ్యులకు మార్కెట్ ఆర్థిక వ్యవస్థ కోరుకునే స్వేచ్ఛ లేకపోవడానికి శ్రేణి నియమాలు కారణం. ఈ నియమాలకు శాసనాల ప్రతిపత్తి వుండేది. అంటే అవి రాజ్యం ద్వారా అమలయ్యేవి.

BRAOU

హైందవ సమాజంలో వృత్తులు కులాలుగా వుండడం వల్ల వృత్తి పని వారి స్వేచ్ఛకు కులధర్మం ఆటంకంగా వుండింది. అందువల్ల ఇక్కడ ఒకవేళ మార్కెట్ ఆర్థిక వ్యవస్థ (పెట్టుబడిదారీ వ్యవస్థ) విప్లవాత్మకమైన వేగంతో రూపం తీసుకొని వుంటే అది కుల వ్యవస్థతోనూ, కుల ధర్మంతోనూ గట్టిగా తలపడి వుండేది. రాజ్యం కంటే ఎక్కువగా కులంతో ఘర్షణపడి వుండేది. పౌర సమాజం రాజ్యానికుండే నియంత్రణాధికారాల కంటే ప్రాథమికంగా కులానికుండే నియంత్రణాధికారాన్ని అభావం చేయవలసి వుండేది. పౌర సమాజం నిర్వచనమే ఇక్కడ భిన్నంగా వుండాలి. నిజానికి దానికి 'పౌర సమాజం' కంటే 'మానవ సమాజం' అనేది సరైన మాట అవుతుంది.

అయితే భారత సమాజంలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ విప్లవాత్మకంగా ముందుకు రాలేదు. అందువల్ల ఇక్కడ ఆధునికతకు ఆర్థికమే కేంద్రం కాదు. దానితో బాటు స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ముందుకొచ్చిన రాజకీయ ఆధునికత కూడా అంతే కేంద్ర స్థానంలో వుంది. అంబేద్కర్ పెట్టిన విమర్శకు ఇక్కడే ప్రాముఖ్యం వుంది. కులానికి బయట మనుషుల మధ్య ఏ రకమైన సంపర్కాన్నయినా నిరుత్సాహపర్చే కుల వ్యవస్థ చెక్కు చెదరకుండా ఉన్నంత కాలం రాజకీయ ఆధునికత అంటే ప్రజాస్వామ్యం - ఏ విధంగా సాధ్యం అవుతుంది? ఈ ఆధునికతను ఆవిష్కరించే పౌర సమాజం లేక మానవ సమాజం కులం పోనిదే ఎట్లా సాధ్యం అవుతుంది?

నిజానికి స్వాతంత్రోద్యమానికి సమాంతరంగా ఒక పౌర సమాజాన్ని రూపొందించడం ద్వారా ఆధునికతను ఆవిష్కరించే ప్రయత్నం మన దేశంలో జరిగింది. ఇది వివిధ సంఘ సంస్కరణ ఉద్యమాల రూపంలో జరిగింది. ఈ ఉద్యమాలు కుల వ్యవస్థనూ స్త్రీల పరిస్థితినీ సంస్కరించడం తమ లక్ష్యంగా పెట్టుకున్నాయి. రెండూ కూడా బ్రాహ్మణీయ ధర్మంతోనే తలపడ్డాయి. ఏ మేరకయితే విజయవంతంగా తలపడగలిగాయో ఆ మేరకు ఒక పౌర సమాజాన్ని (భారతీయ సమాజానికి నిర్దిష్టమైన అర్థంలో) రూపొందించగలిగాయి.

18.8 పౌర సమాజ స్వేచ్ఛ–పౌర సమాజంలోపల స్వేచ్ఛ

పాశ్చాత్య దేశాల చరిత్రలో పౌర సమాజం అనే భావనకు పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థను కేంద్రం చేసుకోవటం వల్ల పౌర సమాజానికి స్వేచ్ఛ (రాజ్యం నుండి), పౌర సమాజంలోపల స్వేచ్ఛ (దోపిడి, అసమానతల నుండి) అనేవి రెండు విడివిడి భావనలుగా కన్పిస్తాయి. మొదటి దాని పరిమితులను విమర్శిస్తూ రెండవది - కార్మికులు, స్త్రీలు, నల్ల జాతీయుల ఉద్యమాల ద్వారా ముందుకొచ్చింది.

భారత దేశంలో పౌర సమాజం అనే భావనకు వర్ణ ధర్మానికీ కుల వ్యవస్థకూ వ్యతిరేకంగా జరిగిన సామాజిక రాజకీయ కృషి కేంద్రమని పైన వివరించాము. అందువల్ల పౌర సమాజానికి స్వేచ్ఛ, పౌర సమాజంలోపల స్వేచ్ఛ అనే తేడా మరీ అంత స్పష్టంగా వుండదు. కులం కట్టిన అడ్డుగోడలు కూలిన మేరకే పౌర సమాజానికి స్వేచ్ఛ లభిస్తుంది. అదే సమయంలో పౌర సమాజంలోపల కుల పరమైన తేడాలు కూడా తగ్గుతాయి.

అయితే ఇది సాపేక్షంగా మాత్రమే సత్యం. పౌర సమాజం అనేది రూపొందడానికి వర్ణధర్మం, కుల వ్యవస్థ అడ్డంగా వున్నాయని మనం అంటున్నామంటే మనుషుల పరస్పర సంపర్కానికీ సహానుభూతికీ కుల వ్యవస్థ కల్పించే అవరోధాన్ని మాత్రం చూస్తున్నాం. కులాన్ని సమాజంలో నిలువున లేచిన గోడలుగా చూస్తున్నాం. ఇక్కడ కులానికుండే చీల్చే గుణమే ప్రధానం తప్ప కులానికుండే అసమాన స్వభావం, హెచ్చుతగ్గుల స్వభావం ముఖ్యం కాదు. కానీ పౌర సమాజం లోపలి అసమానతల గురించి మాట్లాడేటప్పుడు ఈ అసమానతలు ముఖ్యమవుతాయి. కులం అనేది సమాజంలో నిలువున మొలిచిన అడ్డుగోడల వ్యవస్థగా కాక, సమాజాన్ని అడ్డంగా చీల్చిన నిచ్చెన మెట్ల వ్యవస్థగా కన్పిస్తుంది.

స్త్రీల విషయం కూడా అంతే. స్త్రీలు పౌర సమాజంలో, పౌర జీవితంలో భాగం కావడానికి అడ్డంగా వున్న కుటుంబ వ్యవస్థ గురించి, దానికి ఆలంబనగా వున్న మత ధర్మాన్ని గురించి మాట్లాడేటప్పుడు స్త్రీల స్థితిగతులకు సంబంధించిన ఒక అంశాన్ని మాత్రమే సృశిస్తున్నాం. స్వేచ్ఛగా స్త్రీలు పౌర జీవితంలో కూడా భాగమయిన తర్వాత కూడా, అంటే స్త్రీ

BRAOU

పురుషులు కలిసిన సమగ్రమైన పౌర సమాజం ఏర్పడిన తర్వాత కూడా, స్త్రీలు అడుగడుగునా అసమానతలు ఎదుర్కొవచ్చు. ఇంటి నుండి బయటికొచ్చి పౌర జీవితంలో భాగమైన స్త్రీలు ఆ పౌర జీవితంలో ఆర్థిక అసమానతనూ అవకాశాలలో, హోదాలో అసమానతనూ ఎదుర్కొంటూ వుండటం మనం చూస్తూనే వున్నాం. ఇది పౌర సమాజం ఉనికికీ ఆవిర్భావానికీ సంబంధించిన సమస్య కాదు. పౌర సమాజం లోపలి అసమానతల సమస్య.

18.9 ముగింపు

మనుషులు ప్రకృతితోనూ ఇతర మనుషులతోనూ ఏర్పర్చుకునే సంబంధాల మొత్తమే సమాజం. ఈ సామాజిక జీవితం స్వేచ్ఛాయుతంగా లేకపోవడం ఒక ముఖ్యమైన హక్కుల సమస్య. రాజ్యం, మతం, ధర్మం, మూఢత్వం దీనిపైన పెట్టిన అహేతుకమైన ఆంక్షలనెదిరించి స్వేచ్ఛాయుతమైన మానవ సామాజిక ఆచరణ నిర్వచించే పౌర జీవితాన్ని, పౌర సమాజాన్ని రూపొందించుకోవటం హక్కుల చరిత్రలో ఒక ముఖ్య ఘట్టం. ఈ పౌర జీవితం అనేక నిర్మాణాల రూపంలో వుంటుంది. ఆర్థిక సంస్థలు, కళా సాంస్కృతిక వేదికలు, భావ సారూప్యత గల వ్యక్తుల సంఘాలు, వైజ్ఞానిక సంస్థలు ఇందులో ముఖ్యమైనవి. ఇవి మానవ సృజనాత్మకతకూ క్రియాశీలమైన ఆచరణకూ ఆలోచనకూ వేదికలు. ఈ సృజనాత్మకతనూ క్రియాశీలాన్ని అంతకు ముందున్న అహేతుకమైన నియమాలూ నిర్బంధాలూ (అవి రాజ్యం నుండి వచ్చినవి గానీ మతం నుండి వచ్చినవిగానీ) వికసించకుండా చేసాయి.

అయితే విముక్తమైన పౌర సమాజం హక్కుల అన్వేషణలో చివరి ఘట్టం కాదు. ఆ పౌర సమాజం లోపల వుండే అసమానతల గురించి చర్చ, ఫిర్యాదులు వెంటనే ముందుకొస్తాయి, వచ్చాయి. ఆర్థిక దోపిడీ, స్త్రీ పురుష అసమానతలు, శ్వేతజాతి ఆధిక్యత, కులపెత్తనం మొదలైన అసమానతలు పౌర సమాజంలో వున్నాయని గుర్తించిన తర్వాత వీటికి వ్యతిరేకంగా హక్కుల ఆరాటం మొదలైంది. ఇది పౌర సమాజం మీద విమర్శగానే మొదలైంది. అమెరికా పౌరులమైన మేము.....'' అంటూ మొదలయ్యే అమెరికా రాజ్యాంగంలో 'పౌరుల'కు ఇచ్చిన నిర్వచనంలో స్త్రీలకు, నల్ల జాతీయులకు, ఆస్తులు లేని కార్మికులకు చోటు లేదనీ అది కేవలం మోతుబరులైన తెల్లజాతి మగవాళ్లకు వర్తిస్తుందనీ గుర్తించిన అసమ్మతి ఉద్యమాలు తమ హక్కుల ప్రకటనను 'అమెరికాకు చెందిన ఇతర పౌరులైన మేము'' అంటూ మొదలుపెట్టారు.

రాజ్యం, మతం పెట్టే అహేతుకమైన అదుపు నుండి మొత్తంగా సమాజానికి స్వేచ్ఛ, సమాజం లోపల మనుషులు ఒకరిపైన ఒకరు చేసే పెత్తనం నుండి, దోపిడి నుండీ స్వేచ్ఛ అనే రెండు ఆదర్శాలు కలిసినప్పుడే పౌర సమాజం పట్ల మానవ హక్కుల దృక్పథం పరిపూర్ణ రూపం తీసుకుంటుంది. దీని అర్థం పౌర సమాజంలో అమలయ్యే అణచివేత నుండీ దోపిడీ నుండి రాజ్యాన్ని మతాన్నీ పూర్తిగా వేరు చేయగలమని కాదు. వివరణలో స్పష్టత కోసం వాటిని వేరుగా చర్చించడం జరిగింది. ఒక్కొక్క సందర్భంలో అవి ఏ విధంగా కలగలిసి వుంటాయనేది నిర్దిష్టంగా విశ్లేషించవలసిన విషయమే.

18.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

*ఈ క్రింది ప్రశ్నలకు **30** పంక్తుల్లో సమాధానం రాయండి!*

1. పాశ్చాత్య రాజ్యాలలో పౌర సమాజం గురించి వివరించుము?
2. భారతదేశ పౌర సమాజంలోని మానవ హక్కులపై ఒక వ్యాసం రాయండి?

*ఈ క్రింది ప్రశ్నలకు **20** పంక్తుల్లో సమాధానం రాయండి!*

1. కమ్యూనిస్టు పార్టీల పాలనలో పౌర సమాజాన్ని చర్చించండి?
2. పౌర సమాజ స్వేచ్ఛ - పౌర సమాజం లోపల స్వేచ్ఛలను చర్చించండి?

BRAOU

BRAOU

BRAOU

BRAOU